

# అమృత వాహిని

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# అమృత వాహిని

(సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనముల నుండి సేకరించినది)

సేకరణ

**సాగిరాజు రామకృష్ణంరాజు**

srinannagaru.com

ప్రథమ ముద్రణ 2005

ప్రతులు - 1000

సర్వ హక్కులు :

సాగిరాజు రామకృష్ణంరాజు

శ్రీ రమణ నిలయం

అర్ధవరం - 534 197

ప్రతులకు :

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265, ప॥గో॥ జిల్లా

సలహా సంప్రదింపులకు :

సాగిరాజు రామకృష్ణంరాజు

మహర్షి టవర్సు (S1)

2-13-13, శివరావు పేట

భీమవరం - 534 202, ప॥గో॥ జిల్లా

☎ 08816 - 229085

srinannagaru.com

# అంకితం



పశ్చిమ గోదావరి జిల్లా దర్భరేవు గ్రామ కాపురస్తులు

**కీ॥శే॥ శ్రీ కలిదిండి చిన సత్యనారాయణరాజుగారు**

వృత్తి వ్యవసాయమైనా ప్రవృత్తి సంఘ సేవ. ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ సేవ ఉంటుంది. సేవాతత్పరులు, నిష్కపటి, నిరాడంబరులు అయిన శ్రీ చిన సత్యనారాయణరాజుగార్కి అంకితం

srinannagaru.com

# విషయ సూచిక

ముందుమాట ........ V

పరిచయం ........ VI

గ్రంథ పరిచయం ........ IX

ఆముఖము ........ X

శ్రీ రమణ మహర్షి స్తుతిమాల ........ XIV

శ్రీ లక్ష్మీ నృశింహ స్తుతిమాల ........ XVII

1. ప్రేమ, భక్తి ........ 1

2. జ్ఞానము, జ్ఞాని ........ 11

3. మనస్సు, అహంకారం ........ 28

4. సమాజం, మతం ........ 63

5. సంపద ........ 65

6. ఈశ్వరుడు ........ 67

7. సత్సంగము ........ 71

8. నిష్కామ కర్మ ........ 74

9. భగవాన్ ........ 77

10. బంధ స్వరూపము, సామరస్యము ........ 81

11. సాధనా రహస్యాలు ........ 194

12. గురు వైభవము ........ 303

13. మోక్షము ........ 340

srinannagaru.com

# ముందుమాట



నాకు పన్నెండు సంవత్సరాల ప్రాయంలో ఆకాశం వైపు దృష్టి సారించి నప్పడు ఈ దేహేంద్రియాలు, మనో బుద్ధులు ఏమిటి? ఈ సృష్టిని నేను దేని సహాయంతో చూస్తున్నాను నాలో ఏదో అస్తిత్వం లేకపోతే ఈ సృష్టిని చూడగలనా? ఆ మూలం ఏమిటి? అసలు నేను ఎవఁడను? నేను ఎవఁడను? అనే తలంపులు తీవ్ర స్థాయిలో కలిగేవి. ఎంత తల బద్దలు కొట్టుకొన్నా సమాధానాలు దొరికేవి కావు. నాకు ఉన్న తాత్త్విక చింతన వెనుక మా అమ్మమ్మ గారైన సీతమ్మగారి ప్రభావం ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా ఉంది. భగవాన్ సాహిత్యం వారితో ఉన్న ప్రత్యక్ష అనుబంధం, జ్ఞాన స్వరూపులైన శ్రీరామ శాస్త్రిగారితో మా ఇంటిలో రోజూ సద్గోష్ఠి, ఇవి అన్నీ ఏమాత్రం గ్రహించే వయస్సు నాది కాదు. ఎదిగిన తరువాత సమత, మమతలతో సంఘ సేవలోనే జీవితం గడపాలని అదే నిజమైన పూజ అని, అలా కొంతకాలం పనిచేసాను. లాఘవంగా ఉన్న ఒక లోహాన్ని సుందరహారంగా తీర్చిదిద్దాలి అంటే మరో లోహంతో కరిగించి, సుత్తి దెబ్బలతో సాగదీసి, రంపపు కోతలు కోసి వంకర్లను సరిచేసి, తుది మెరుగులతో వజ్రాలను పొదిగితే దాని అందం విలువ తెలుస్తుంది. అలాగే నా జీవితంలో ఆధి భౌతికం. ఆధి దైవికాలను అనుభవించి 1983వ సంవత్సరంలో నా నలభై సంవత్సరాల వయస్సులో సుందరమైన, సుమధురమైన ఈ ఆధ్యాత్మిక జీవితంలో అడుగు పెట్టాను. అమోఘమైన భగవాన్ సాహిత్యం రుచి చూసాను. "నేను ఎవఁడను?" అనే గ్రంథరాజం నన్ను సమ్మోహితున్ని చేసింది. చిన్ననాటి నా చిక్కు ప్రశ్నలకు సమాధానం దొరికింది. భగవాన్ ఫోటోను చూచాను. "ఏ సంబంధం లేకపోతే ఈ జన్మలో కలిసామా? ఇది మరు జన్మకు కలపదా" అన్న వారి వాణి నిజమని పించింది. అరుణాచల శివుడిని దర్శించాను, విరూపాక్ష గుహ, స్కందాశ్రమాలలో గత అనుబంధం ఉన్న తీపి గుర్తులు నాలో మెదిలాయి. గిరి ప్రదక్షిణతో సొంత ఇంటికి చేరామని మురిసిపోయాను. 1987 సం॥ సద్గురువు శ్రీ నాన్నగారిని దర్శించాను. వారి పవిత్ర పాద స్పర్శతో నా నాడీ మండలం యావత్తు శుద్ధి అయినది. వారి హృదయాలింగనంతో నది వెళ్ళి సముద్రాన్ని చేరినట్లు అనిపించింది. "ఈ కలయిక ఈశ్వర నిర్ణయం" అన్నారు నాన్నగారు. నాటి నుండి నా జీవిత విధానము - గమ్యాన్ని చేరే దిశగా పయనించింది. గురువే సాధన, గురువే సాధ్యమని వారి చరణాలను నమ్మి జీవిస్తూ వారి ప్రవచనాలను వింటూ మననం చేసుకోవటానికై వ్రాసుకొన్నది - ఇలా గ్రంథ రూపమౌతుందని కలలో కూడా భావించలేదు. ఈ అమృతవాహినిని ఎవరైనా స్వీకరించి, సమాధాన పడి శాంతి చిత్తులైతే అది శ్రీ నాన్నగారి ఆశీర్వాదమని అదే నాకు మహా భాగ్యమని భావిస్తాను.

**- సాగిరాజు రామ కృష్ణంరాజు**

srinannagaru.com

# పరిచయం

మనం సత్య స్వరూపులమే కాని దానిని అనుభవంలోకి తెచ్చుకొంటే స్వేచ్ఛను పొందుతాము. దానికి సద్గురువును ఆశ్రయించి వారు చూపిన బాటలో నడవాలని మన శాస్త్రాలు చెబుతున్నాయి. ఎంత చదివినా అవగాహన అణు మాత్రమే. సత్యాన్ని కనిపెట్టనక్కరలేదు అడ్డుగా ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటమే. అజ్ఞానం ప్రధానంగా ఈ రూపాలలో ఉంటుంది 1. శరీరమే ఆత్మ అనుకోవటం, 2. తాను సర్వ స్వతంత్రుడనని భ్రమించటం, 3. తనను తాను రక్షించుకోగలనని భావించటం, 4. సంసార భోగానుభవాలే జన్మ సాఫల్యమని భ్రమించటం, 5. బంధువులు, స్నేహితులే సర్వస్వం అని తలపటం. ఇవి అన్నీ జీవ లక్షణాలు అని మార్పు చెందేవి, నశించే వాటిపై దృష్టిని పెట్టక శాశ్వత సుఖ స్వరూపమైన ఆత్మ నీవని దాని మీద నీ దృష్టిని పెట్టమని శ్రీ నాన్నగారి ఉవాచ. మూడు కాలాలకు, మూడు అవస్థలకు అతీతంగా మనం ఉన్నామని శాస్త్రీయంగా విశ్లేషణ చేసి నిగ్గుతేల్చుతారు. మూఢ నమ్మకాలను వారు ఎన్నడూ అంగీకరించరు. “నేను ఎవఁడను?” అనే విచారణా మార్గాన్ని విస్తృత రూపకల్పన చేసి, వినూత్న శైలిలో తేనెలొలికే తేట మాటలతో సమాజాన్ని మేలుకొల్పటానికి భగవాన్ శ్రీ నాన్నగారిని ఎన్నుకొన్నారు. శ్రీ నాన్నగారి మాటలు స్పష్టంగా, నిర్దుష్టంగా, సంశయాలకు, ఊహలకు అతీతంగా, అద్భుతమైన ప్రేమను కురిపిస్తూ ఉండటం వలన సాధకుల హృదయాలను అవి తాకుతాయి. ఆయన ఏనాడు, ఎవరి నుంచి, దేని నుంచి ఎటువంటి ప్రాముఖ్యత కోసం ఎదురు చూడలేదు. బుద్ధుని దయ, సమత్వం, శంకరుల వివేకం, సూక్ష్మ దృష్టి తాత్త్విక దృక్పథం, గాంధీజీలోని సేవా నిరతి స్పష్టంగా కనిపిస్తాయి. ఆశ్రితుల కష్టాలను, కలతలతో నిండిన కన్నీటిగాథలను వింటూ, ఓదారుస్తూ, శాంతి సమాధానాలు అందిస్తూ పిలుపు కాదనక ఊరూరు తిరుగుతూనే ఉంటారు. వారి దర్శనమే దుఃఖితులకు పెద్ద ఊరట. వారి బోధలో మర్మం లేదు, పెడమార్గం లేదు. సంకుచితత్త్వం కానరాదు. ఎవరి ఇష్ట దైవాన్ని వారు ఆరాధించటాన్ని ప్రోత్సాహిస్తారు. వారి మాటలు స్వచ్ఛం, సరళం, సులభం, అంతేకాదు అరువు తెచ్చుకొన్న వాక్యాలు ఉండవు. విజ్ఞాన గని. ప్రతీవారు వారి వారి శక్తి సామర్థ్యాన్ని బట్టి వారి మాటలను గ్రహిస్తారు. ఒక్కొక్కసారి సాధకుడు ఎంత అల్ప స్థాయిలో ఉన్నా వారి స్థాయికి దిగి వచ్చి చెబుతారు. అక్కడ అల్పులు అధికులు అనే భేదం లేదు. ఆ మాటలలో నిర్మలత్వం, సహజత్వం పవిత్రత కనిపిస్తాయి. తల్లి బిడ్డ చెడిపోతూ ఉంటే ప్రేమతో హితబోధ చేస్తుంది. వినకపోతే దండిస్తుంది. చివరిగా ఏడుస్తూ (ఘోష)తో చెబుతుంది. అలాగే గురువులు, వేదం ఘోషిస్తూ చెబుతారు. దానినే వేద ఘోష అంటారు. గురువు హితబోధను వినకపోతే వాని ప్రారబ్ధంలోని దుఃఖ కరమైన దానిని సాధకునిలో ప్రవేశపెట్టి సరి చేస్తాడు. దాని వలన ఫలితం లేకపోతే

srinannagaru.com

శిష్యుని స్థాయికి దిగి వచ్చి "మనం" అనే పదంతో హితవు చెబుతారు. శ్రీ నాన్నగారి ప్రవచనంలో "మనం" అనేది తరచుగా చూడవచ్చును. వారి సాధారణ జీవితాన్ని, సునిశితమైన విషయ విశ్లేషణ ఉన్నతమైన భావాలు ప్రస్ఫుటంగా చూడవచ్చును. కలి కల్మషాలైన వికార స్వభావా లు, అత్యాశలను, అహంకారాన్ని సమూలంగా పెరికించే నేర్పు వారి ప్రవచనంలో ఉంటుంది. "మీరు తప్పచేసినా నాకు ఇష్టమే కాని స్వంత ఆలోచన విడిచి పెట్టకండి" అంటారు. సాధకుడు ఎంత పాపిని అనుకొన్నా వారు వానిని ఉన్నత శిఖరాలకు చేర్చుతారు. నీవు ఆత్మవని బరోసా ఇస్తారు. అహం మూలాన్వేషణలో గట్టి కృషి చేస్తే అది అదృశ్యమౌతుందని సత్యం నీకు ఎరుక పడుతుంది అంటారు. పైకి వారిది జ్ఞాన బోధగా కనిపించినా హృదయం నిండా భక్తి తొణికిసలాడుతుంది. అజ్ఞానమనే అంధకారాన్ని మాటలతో తొలగించే మానవ రూపిగా ఉన్న పరమాత్మగా శ్రీ నాన్నగారు గోచరిస్తారు. వారిలో పరోపకారం, త్యాగం, వైరాగ్యం మూర్తీభవించా యని అసూయ లేని సహజమైన కళ్ళతో ప్రత్యక్షంగా చూచినవారు ఎవరైనా వాటిని గుర్తించగలరు. మనం దుఃఖ మిశ్రితమైన సుఖాలనే నిజమని, శాశ్వతమని భ్రమించి, శాశ్వతానందాన్ని గుర్తించలేకపోతున్నాము. దానికి గురువు కావాలి, సమకాలీన జ్ఞానిని, పూర్వ జన్మ పుణ్య సంస్కారం పండిన వారు మాత్రమే గుర్తించగలరు. తత్త్వజ్ఞాన శోభితులైన శ్రీ నాన్నగారు అంతఃకరణమును శుద్ధి చేయు విద్యను తన వద్దనే ఉంచుకొనక జ్ఞానయజ్ఞాల ద్వారా, జిజ్ఞాసువులకు అందచేస్తున్నారు. భక్తుల అజ్ఞానాన్ని రాసి రంపాన్ని పెడుతున్నారు. "మీ స్వంత సమస్య అయిన మీ అహంకారాన్ని పరిష్కరించుకొని శాంతి స్వరూపులు కండి" అంటారు. ఆ బోధ మోడువారిన జీవితాలను కూడా చిగురింపచేస్తుంది. వారి మనస్సును ఆత్మ వైపుకు మరలించే ఆ ప్రక్రియ అపూర్వం. చిల్లర విషయాలను చింతిస్తూ చితికిపోక, సత్యంపై దృష్టి సాగిస్తే సుందర రూపాన్ని పొందుతారు. అసత్యం, అనిత్యమైన సంసార మాయా రూపాలకోసం, గౌరవాల కోసం జీవిత కాలాన్ని అంతా బుగ్గిపాలు చేసుకొంటున్నావు. దీనిలో కొంత కాలాన్ని అయినా నీ స్వంత విషయమైన అహంకార నిర్మూలన కోసం ఖర్చు చెయ్యి. గమ్యాన్ని మర్చిపోకు. కాలాన్ని సద్వినియోగం చేసుకోకపోతే మీరే కష్టాలను కొని తెచ్చు కొంటారు" అంటారు. శ్రీ నాన్నగారి హృదయం నుండి జాలు వారిన ఈ పలుకులు వినండి. 'ప్రియమైన ఆత్మ బంధువుల్లారా! మీ బుద్ధికి విషయం అందేటట్లు చెప్పకపోతే ఆ దోషం నాది కాని మీది కాదు. నాలో శాంతి, పవిత్రత ఉంటే మీరు మర్చిపోవాలన్నా నా మాటలు మిమ్ముల్లను వెన్నంటి తరుముతాయి. ప్యూరిటీ ఉన్నచోట, క్లారిటీ ఉంటుంది. అరచేతిలోని వస్తువును ఎలా చూడగలమో అలాగే నేను విషయాన్ని మీకు తెలపకపోతే మీ మనస్సుకు అందించలేకపోతే నాలో పవిత్రత లేనట్లే. నా మీద మీకు ప్రేమ లేనప్పుడు మీకు ప్రేమ కలిగేటట్లు చేయవలసిన బాధ్యత నాదే. గురు అనుగ్రహమంటే ధ్యానం చెయ్యమని చెప్పటం కాదు. వస్తువును మీకు

srinannagaru.com

అందియ్యటమే. నేను చూస్తున్నాను అంటే నా హృదయం నుంచి చూడాలి. నేను మిమ్మలను తాకుతున్నాను అంటే నా హృదయంతో తాకాలి నేను మాట్లాడుతున్నాను అంటే హృదయంతో మాట్లాడాలి అప్పడే మీకు ప్రయోజనం. సత్ఫలితాలు వర్షిస్తాయి. గురువు ప్రేమ స్వరూపుడు శాంతి స్వరూపుడు. అది తప్పించి ఇంకోటి ఇయ్యలేడు. నిరంతరం మీ క్షేమాన్ని కోరే వాడే గురువు. ఇలా పోల్చి చెప్పటం కూడా సరిపోదు. ఏదో ఒక పద్ధతిలో ఇలా చెబుతున్నాను అంతే "అన్నారు". "అంతే" అన్న పదంలోనే ఉంది అంతులేని అర్థం. మన బుద్ధికి అది అందదు. శ్రీ నాన్నగారు రమణుడై మాట్లాడుతారు. రమణ వాణి ఆ బాణీని శ్రీ నాన్నగారి తేటతెల్లమైన వారి వైఖరీ వాణిలో వినాలి. రమణ మార్గాన్ని తెలుసు కోవాలంటే ఈ గ్రంథం చిన్న ప్రయత్నమే. అహంకారంలో ఇరుక్కుపోయి దుఃఖితులై వేదనను అనుభవించే వారిని అందుండి విడుదల చెయ్యటంలో శ్రీ నాన్నగారి ఎత్తుగడలు, ఆవేదనా రమణీయాన్ని వర్ణించలేను. దానిని కొలిచే పాత్రలు నా దగ్గర లేవు. కొలవలేను, అనుభవిస్తూ, పరవశిస్తూ దానిని కొంచెం మీకు వినయ పూర్వకంగా సమర్పిస్తున్నాను. ఏమైనా పొరపాట్లు దొర్లితే అవి నావి మాత్రమే. వారి మౌన సన్నిధిలో మనస్సు ద్రవింపచేసే భాషకందని భావనను, భావించలేను మీకు తెలుపలేను. వారి ఆ బోధలోని అంశాలు చెప్పినవే చెప్పినట్లు అనిపించినా అవి భిన్న భిన్న కోణాలలో తత్త్వాన్ని దర్శింపచెయ్యటానికి మాత్రమే అని ఇందలి విషయాలు ఆయా అంశాల మీద మాట్లాడినవి. భక్తుల మానసిక స్థితి, స్థాయి అవగాహనా శక్తిని దృష్టిలో పెట్టుకొని వారి వారి సాధనలో వారి స్థాయిని, నిరుత్సాహ పరచకుండా తృప్తి పరచటానికి మాత్రమే అలా చెప్పటం జరిగింది. ఆ మాటలు పరస్పరం విరుద్ధంగా ఉండవచ్చును. ఉదాహరణకు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి అన్నవి మరో సందర్భంలో, జపి ఎవరు? ధ్యానించే వాడు ఎవరు అనేవి, విరుద్ధంగా అనుకోవచ్చును. ఆపై మాటలు సాధకుని ఒక్కొక్క మెట్టుపైకి ఎక్కించటానికి అని అర్థం చేసుకోవాలి. ఆ మాటల ప్రయోజనం పరిమితులను తెలుపుతూ నిజతత్త్వాన్ని పొందే తుది మార్గాన్ని చూపుతారు. అన్ని మార్గాలను సమన్వయం చేసుకోమని ఏ మార్గాన్ని కించ పర్చవలసిన పని లేదని చెబుతూ భగవాన్ చెప్పిన అత్యున్నతమైన ఉపదేశం "ధ్యానించకు ఊరికే ఉండు - నేను ఉన్నానని భావించకు" దాన్ని శ్రీ నాన్నగారు విశ్లేషణాత్మకంగా చెబుతారు. అనుభవాన్ని, దృష్టాంతాలను, యుక్తిని కలబోసి, సత్య ప్రయోజనం ఆత్మానుభవానికి ఎలా సంబంధం పెట్టుకోవాలో, ఎలా కృతార్థులు అవుతారో సమగ్రంగా చెబుతూ త్రివిధ దీక్షల ద్వారా అనుగ్రహిస్తారు. పై మాటలలో నిజాన్ని ఈ గ్రంథ పరిశీలనలో తెలుసుకోవచ్చును.

సాగిరాజు రామకృష్ణంరాజు
అర్థవరం

srinannagaru.com

# గ్రంథ పరిచయం

ఏ గ్రంథానికైనా ప్రాముఖ్యత వచ్చేది మూడు ప్రధాన అంశాల వలన. 1. చెప్పిన విషయం ఉన్నతమైన అంశమై (సత్యాన్వేషణమై) ఉండాలి. 2. చెప్పిన వ్యక్తి సత్యానుభవం పొంది చెప్పేవారు అయి ఉండాలి. 3. చెప్పిన తీరు అంటే అరటి పండు వలిచి నోట్లో పెట్టేలా, నిగూఢమైన విషయాన్ని తేలిక శైలిలో మంద బుద్ధులకు కూడా అర్థమయ్యే రీతిలో తెల్పటం జరిగితే ఆ గ్రంథానికి అధిక విలువ ఉంటుంది. ఈ మూడు కలబోసిన రూపమే ఈ గ్రంథము. గాంధీజీ "గీత నాకు తల్లిలాంటిది. ఏ దుఃఖం వచ్చినా, నివారణకు అందులో సమాధానం దొరుకుతుంది" అని అన్నారు. అలాగే "అమృత వాహిని"ని సేవిస్తే ఎంత దుఃఖంలో ఉన్న వారైనా తేరుకొని కుదుట పడతారు. మోక్షం మాట అటు ఉంచండి, జీవిత సంగ్రామంలో ఎదురు దెబ్బలతో కుమిలిపోయి, కుళ్ళిపోయి, కూలబడ్డ అభాగ్య జీవులకు శాంతి సుఖాలను ఇది ప్రసాదిస్తుంది అనటంలో ఎటువంటి సందేహం లేదు. అధికారం, ధనం ఉన్నా అహంకారమనే పిశాచం పెట్టే అశాంతి మనస్కులకు ఇది శాంతిని, కాంతిని కలుగజేస్తుంది. అనిర్వచనీయమైన శ్రీ నాన్నగారి ఈ హిత బోధ విన్న వారు అజ్ఞానం నుండి మేల్కొనగలుగుతారు. మనం పరతంత్రుల మన్న విషయాన్ని మాటి మాటికీ నూరిపోస్తూ అప్పడే స్వతంత్రులము కాగల విషయాలను వివరిస్తూ వినయాన్ని, వైరాగ్యాన్ని కృతజ్ఞతను అలవరచుకోండని చెబుతూ, విచారణా మార్గం కష్టమని తోస్తే శరణాగతి మార్గంలో సుఖాలను తెలుపుతూ ఉంటారు. ఈ మాటలకు ఈ గ్రంథం అద్దం పట్టిందని విజ్ఞులు గ్రహిస్తారు. సుఖాన్వేషణే జీవిత లక్ష్యం. ప్రకృతిలో పొందే సుఖం పరిణామంలో దుఃఖ హేతువు అవుతుంది. తరగని సుఖం, ఎడబాటు లేని సుఖం శాశ్వత సుఖం మన హృదయంలోనే ఉంది. దానిని పొందాలంటే ఈ "అమృతవాహిని" లోని అమృతాన్ని ఏ కొంచెం సేవించినా ఆనంద కేళిలో ఊగిసలాడుతాము. ఇందలి అంశాలను, సునిశిత బుద్ధితో, నిర్మల హృదయంతో, విశాల మనస్సుతో పరిశీలించి నమ్మితే ఇప్పడే, ఇక్కడే తత్త్వం ఎరుకపడుతుంది.

**గొట్టుముక్కల రామకృష్ణంరాజు**

రిటైర్డ్ ఇంజనీరు

శ్రీరామపురం, భీమవరం

srinannagaru.com

# ఆముఖము



దైవాంశ సంభూతులైన కారణ జన్ములు ఆత్మ సంస్కారమును బట్టి దైవ కార్యములను నిర్వహించి చరితార్థులౌతారు. వీరు ఋషితుల్యులు. కర్మ, భక్తి, జ్ఞాన మార్గములను అమృత వాక్కులతో ఉపదేశించి, సామాన్యులను తరింపజేసి, తాము తరించిన అసామాన్య జ్ఞాన సంపన్నులైన గురువరేణ్యులు వీరు. వైదిక, లౌకిక వాఙ్మయాలను మథించి, ఆధ్యాత్మిక సారాన్ని అందించి, తమ జన్మలను ధన్యములు గావించుకొనిన మహర్షులు వీరు. అమృత తుల్యములైన వీరి మాటలలో, ఉపదేశాలలోను వేద, వేదాంగ, పురాణ, శాస్త్ర విశేషాలు తొణికిసలాడుతూ ఉంటాయి. దైవ శక్తి సంపన్నులు వీరు.

భారతీయ వేదాంత చరిత్రలో, అద్వైత సిద్ధాంత ప్రవచనాలలో, ఆధ్మాత్మిక ప్రబోధాలలోను విశ్వ విఖ్యాతిగాంచిన మహర్షులు రామకృష్ణ పరమహంస. వివేకానంద స్వామి, రమణ మహర్షి మొదలగు మహితాత్ములు పేర్కొనదగిన వారు. మానవ హృదయాలను భగవంతుని వైపునకు మరల్చిన పుణ్యాత్ములు వీరు. తమ దివ్య ప్రబోధాలతో మానవులను తరింపచేయుటకు అవతరించిన దైవ ప్రతినిధులు వీరు.

నిరాడంబరత్వం, నిర్మలత్వం, శాంతి సౌమనస్యాలు, దైవ భక్తి విశ్వాసాలు, తపశ్శక్తి, దివ్య తేజస్సు తనలో తాండవించే అవతార పురుషుడు రమణ మహర్షి. ఆ రమణ మహర్షి యొక్క శిష్య ప్రముఖులలో అగ్రగణ్యులు శ్రీ భూపతిరాజు లక్ష్మీ నరసింహరాజుగారు (జిన్నూరు నాన్నగారు). ఆ గురువర్యుని పరోక్ష ప్రతిబింబమే ఈ జిన్నూరు నాన్నగారు. ఆ మహర్షి గురువరేణ్యుని శక్తి యుక్తులు, గుణ గణాలు నిరాడంబర నిర్మలత్వాలు, శాంతి సౌమనస్యాలు, దైవ భక్తి విశ్వాసాలు, దివ్య తేజోవిశేషాలు ఆ మహితాత్ముని శిష్య రత్నమైన శ్రీ నాన్నగారికి సంక్రమించాయి. "పుత్రాదిచ్ఛేత్ పరాజయం" తనకుమారుని సర్వ సమర్థుని గావించి అతని చేత పరాజితుడు కావాలని తండ్రి కోరుకుంటాడట. ఆ విధంగానే "శిష్యాదిచ్ఛేత్ పరాజయం" అను సముదాత్త సూక్తి ఏర్పడింది. అనగా తన శిష్యుని సర్వ సమర్థునిగా తీర్చి దిద్ది, అతని చేత పరాజితుడు కావాలని ఉత్తమ గురు పుంగవుడు

srinannagaru.com

కోరుకొంటాడట. ఈ గురు శిష్యుల విషయంలో ఈ దివ్య సూక్తి సార్థకమైనది. ఈ ఇద్దరి అవినాభావ సంబంధం దైవ ప్రేరణాత్మకమైనదిగా భావింపదగినది.

నాన్నగారి మాటలలో, చేతలలో, నియమ నిబంధనలలో, ఉపదేశాలలో, సందేశాలలో, ప్రవచనాలలోను భావ గంభీరంగా పరవళ్ళు త్రొక్కే పదజాలంలో వాక్య స్పందనలో, ప్రత్యక్షరంలోను ఆ మహర్షి గారి ప్రతిబింబం నిరంతరం కానవస్తుంది. ఇది శ్రీ నాన్నగారి జన్మ సార్థకత. ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేస్తూ ఉంటే మన దృష్టిలో, హృదయ సదనాలలోను కానవచ్చే సుందర దృశ్యాలు, నినదించే మనోహర నాద భంగిమలును ఇలా ఉంటాయి.

సీ॥ అది గాంగజల ధారయా, తరంగ మృదంగ
నాదమాయని చెప్పనలవికాదు;
శివ సముద్ర లలిత శీతల జలపాత
విభవమాయన లేము విను తినేయ;
నయగార జలపాత నవ్య భంగిమ యిది
యని సూటిగా చెప్పనలవిగాదు;
సరయూ నదీ జల సరళ ధారయిది యే
యని సద్గతిన్ జెప్ప నమరదిపుడు;
తే॥గీ॥ ఇట్టివన్నియున్ కలిసియే పట్టు జూప
రమణ ఋషివర్య సద్భక్త రాజితుండు
నమిత శిష్యుండు జిన్నూరు నాన్న వర్యు
నమల ప్రవచన ధారయే యనఁగ నొప్పు
అరుణగిరి నాథు నాశీస్సులాదరింప॥

శ్రీ నాన్నగారి ఉపన్యాస భంగిమలో చోటు చేసికొనిన పదజాలం అప్రయత్న పతితమై రసరమణీయంగా వినవస్తూ చక్కటి సాహితీ స్థాయినందు కుంటాయి. ఇట్టి శక్తినే ప్రతిభగా శాస్త్రజ్ఞులు గుర్తించారు. కవులు, పండితులును వాడిన పద సముదాయంలో స్పందించే శక్తిని ఆలంకారికులు ప్రతిభ, వ్యుత్పన్నత అను రెండు పదాలతో వర్గీకరించారు. కేవలము దైవదత్తమైన శక్తి ప్రతిభ. అభ్యాస బలం వలన, స్వయం కృషి వలన లభించునది వ్యుత్పన్నత. వ్యుత్పన్నత అనగా పాండిత్యము. నాన్నగారి ఉపన్యాస వాహిని అంతా ప్రతిభా సమన్వితమైనది. ఈ

srinannagaru.com

శక్తి యంతయు సద్గురు దత్తమైనది. అప్రయత్నంగా ఈయన నోటి నుండి వెలువడిన పదములను, వాక్యాలను సముచిత భావాలు అహమహమికతో, శరవేగంగా అనుసరిస్తాయి.

శ్లో॥ లౌకికానాంహి సాధూనాం అర్థం వాగనువర్తతే
ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽను ధావతి॥

అని జ్ఞాన సంపన్నులైన ప్రాచీనులు చెప్పినట్లు సామాన్యుల వాక్కులు అర్థాన్ని అనుసరిస్తాయి. కాని ఋషివర్యుల వాక్కులను అమూల్యములైన అర్థాలు ముందుకు త్రోసుకొంటూ వస్తాయి. "The words must come out from the mouth of an orator, Just like the bullets from an arranged gun" అని ఒక ఆంగ్ల విమర్శకుని మహో వాక్యం కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తోంది. సిద్ధముగా ఉంచిన ఒక తుపాకీని పేల్చిన వెంటనే గుండ్లు ఒకదాని వెంట మరొకటి అప్రయత్నంగా వచ్చునట్లే మహో వక్త యొక్క నోటి నుండి పదజాలము ఒకదాని వెంట మరొకటి గెంటు కుంటూ వస్తాయి అని దాని అభిప్రాయము. నాన్నగారి ఉపన్యాసాలలో ఆయన నోటి నుండి వెలువడే భావ గంభీర సమన్విత పదాలు ఆయన మహో వక్తృత్వ శక్తిని నిరూపిస్తాయి.

శ్రీ నాన్నగారి ప్రవచనాలలో ఒక త్రివేణీ సంగమం పరిశీలనాత్మక దృష్టి కలవారికి కానవస్తుంది. ఆయన ఆత్మ జ్ఞానం గంగా స్రవంతి; తాత్త్విక దృక్పథం యమునా స్రవంతి; గురు భక్తి అంతర్లీనమైన సరస్వతీ స్రవంతి. ఈ మూడు శక్తుల నిరుపమ సమ్మేళనమే వీరి ప్రవచన త్రివేణీ సంగమం. వీరి ఆధ్యాత్మికోపన్యా సాలలో అనేక వేద వేదాంగ, పురాణ, భగవద్గీతా సూక్తుల మౌలిక రూపాలు, వాటి భావ సారాలు లౌకికాలౌకిక దృష్టాంతాలతో కానవస్తాయి. సందర్భ శుద్ధితో ఆయన చేసిన వ్యాఖ్యలు, సముచిత వివరణలు ఆత్మ భావ ప్రదీపికలై పరుల హృదయ సదనాలలోని అజ్ఞాన అంధకారాన్ని తొలగిస్తూ ఉంటాయి.

శ్రీ నాన్నగారు వివిధ ప్రాంతాలలో, వివిధ రాష్ట్రాలలో వివిధ దేశాలలోను ప్రవచించిన ఆధ్యాత్మికోపన్యాసాలను క్రోడీకరించి వీరి శిష్యులు శ్రీ సాగిరాజు రామకృష్ణంరాజుగారు "అమృత వాహిని" అను అమర నామంతో గురుభక్తి శ్రద్ధా సూచకంగా ఒక చక్కటి గ్రంథ రూపంలో ప్రకటించి, లోకానికి అందించుట మిక్కిలి ముదావహమైన విషయము. గ్రథనకౌశలముతో అనగా కూర్పు నేర్పుతో

srinannagaru.com

కూడుకొనినది గ్రంథము. ఏ గ్రంథమైనా ముఖ్యంగా ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని దివ్య సందేశాన్ని అందిచేదిగా ఉండాలి. ఈ చక్కటి లక్షణాలు కలిగి ఉన్నది గనుక ఈ "అమృత వాహిని" కూడ మంచి గ్రంథము అనదగియున్నది. "వాహిని" అనగా నది లేక జీవ ప్రవాహము అని అర్థము. అమృత ప్రవాహము గలదియని ఈ దివ్య గ్రంథ నామము యొక్క అర్థము. నాన్నగారి ఉపన్యాసములన్ని అమృత ధార వలె సాగినవి. ఒక దివ్య ప్రవాహ రూపంలో ఈ గ్రంథంలో చోటు చేసికొన్నాయి. ఈ గురువర్యుని ఉపన్యాసాలు అన్నీ అమృతాన్ని నిష్యందిస్తు ఉన్నట్లు నిరర్గళ ధారా శుద్ధితో నిండియుండి సజీవ స్రవంతిలా మన హృదయాలను సంస్కరించి, ఆత్మ శక్తి సంపన్నములుగావిస్తాయి. ఈ సముదాత్త గ్రంథరాజము, ఈ గురువర్యులైన శ్రీ నాన్నగారును ఆ గురువరేణ్యుడైన రమణ మహర్షి యొక్క అనుగ్రహ ప్రభావం వలన అజరామరులు కాగలరని నా పరిపూర్ణ విశ్వాసము. శ్రీ నాన్నగారి వ్యక్తిత్వానికి, ఉపన్యాస ప్రవిమల వాహినికి, ఆత్మ జ్ఞాన ప్రతిబింబమైన ఈ గ్రంథ రాజానికీ శాశ్వత ప్రతిపత్తి లభించగలదని నా ఆత్మీయ భావన. తాత్త్విక జ్ఞాన మార్గాలను అద్భుత ప్రవచనాల రూపంతో లోకానికి ఉపదేశించుటకై ఆ పరమాత్మ పంపిన మహనీయ మూర్తియే శ్రీ జిన్నూరు నాన్నగారు.

ఈ ఆముఖ (మున్నుడి) రూపంలో ఈ వాక్యాలు వ్రాయుటకు అవకాశం కల్పించిన రామకృష్ణంరాజు గారికి నా అభినందనలు. గురువర్యులకు నా అభివందన మందారములు.

"తేజస్వినా వధీతమస్తు"

కలిదిండి వెంకటరామరాజు

**భీమవరం**

దిII 23-12-2004

srinannagaru.com

# శ్రీ రమణ మహర్షి స్తుతి మాల

(సంస్కృత శ్లోకములు)

**మాలినీ వృత్తములు :**

1 శ్లో॥ సరసిజదళ నేత్రం, చారుభాస్వత్ సుగాత్రమ్;
వినయ వినుత కీర్తిం, శాంతి సౌజన్య మూర్తిమ్,
సకల నిగమ గమ్యం, రమ్య వాచోవిలాసమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమినాదాంతరస్థమ్॥

2 శ్లో॥ ప్రణవనియల మూర్తిం, భక్తియోగాంతవర్తిమ్,
విబుధవినుతమౌ నిం, సచ్చిదానందరూపమ్,
ప్రకటదురితరాగద్వేష నిర్ణాశయోగిమ్,
రమణ ఋషివరేణ్యం నౌమి మోదాంతరంగమ్॥

3 శ్లో॥ ప్రకృతి పురుషరూపం, బ్రహ్మతేజోమయాంగమ్,
భవభయ హరమౌనిం, వేదవేదాంగ మూర్తిమ్,
నిఖిల నియమయుక్తం, సర్వసంసార ముక్తమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమినాదాంత రస్థమ్॥

4 శ్లో॥ సకల సుకృత యుక్తం, సత్య వాక్యార్థ సక్తమ్,
ప్రణవనిలయయోగిం, ముక్తి లక్ష్మీనియోగిమ్,
శమదమగుణలోలం, శాశ్వతానంద హేలమ్,
రమణ ఋషివరేణ్యం, నౌమి దైవాంశ గణ్యమ్॥

5 శ్లో॥ సరస హృదయ వర్తిం, వేద శాస్త్రార్థమూర్తిమ్,
సకల భువన వంద్యం, నిర్మలానంద హృద్యమ్,
నిఖిల సుకృతరాశిం, ద్వేష రాహిత్య వేషమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమి జ్ఞానాంతరంగమ్॥

6 శ్లో॥ నిరుపమ గుణరాశిం, వేష భాషా విదూరమ్,
విమల సుకృత రమ్యం, విస్ఫురజ్జ్యోతిగమ్యమ్,
దురిత తిమిరహారం, జన్మ సాఫల్య వర్యమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమి నాదాంతరస్థమ్॥

7 శ్లో॥ నిగమ మధురసజ్ఞం, స్మేరవక్త్రారవిందమ్,
అధరమణి సమీపే, వేదవేదాంగ నాదమ్,
స్ఫురితలలితదైవ ప్రాభవామోదలోలమ్,
రమణ ఋషివరేణ్యం, నౌమినాదాంతరస్థమ్॥

8 శ్లో॥ సకల భువనవంద్యం, సచ్చిదానంద హృద్యమ్,
విమల హృదయవర్తిం, సూర్య సంకాశమూర్తిమ్,

srinannagaru.com

తరళ విరళ శక్తిం, వేదవేదాంగ సక్తమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమినాదాంతరస్థమ్॥

9 శ్లో॥ నిరుపమ గుణయుక్తం, నాద బీజాంతరస్థమ్,
సురవర వచనోద్య న్నిర్మలానంద సిక్తమ్,
హృదయ సదనరమ్యం, వేద విజ్ఞాన గమ్యమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమినాదాంత రస్థమ్॥

10 శ్లో॥ విమలలలిత నేత్రం, విస్ఫురద్వర్ణగాత్రమ్,
శశిధర వరపుత్రం, భక్తనీరేజమిత్రమ్,
బుధవినుత చరిత్రం, భూమి జామోదపాత్రమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమినాదాంతగణ్యమ్॥

11 శ్లో॥ సరసమధురవాణీ ప్రోల్లసద్భావరమ్యమ్,
నిగమ మధుర సజ్ఞం, స్మేర వక్త్రార విందమ్,
శ్రితసురవర మూలం, సన్మనః పద్మలోలమ్,
రమణ ఋషి వరేణ్యం, నౌమినాందాంత గణ్యమ్॥

## ఆంధ్ర పద్యస్తుతి మాల :

1 సీ॥ అరుణగిరీంద్రుని అమలాంక సీమలో
ముదముతో నెదిగిన ముని వరుండు;
జపతపంబులు లేక చైతన్య శక్తిని
సాధించి మించిన సద్గురుండు;
ఆడంబరములేని ఆదర్శ మూర్తిగా
తేజరిల్లిన యట్టి ధీవరుండు;
పశు పక్షులను గూడ పరమకారుణ్యాన
మమతతో సాకిన మధుర మూర్తి;

తే॥గీ॥ ప్రకృతియే తానుగా, తానె ప్రకృతి యగుచు
అవతరించిన ముని వరుండమరమూర్తి,
భవ్యతేజో విరాజిత భానుమూర్తి,
రమణ ఋషి వరేణ్యుఁడిచట రంజిలంగ
ఆశ్రయించిచ్చెడిది రమణాశ్రమంబు॥

2 శా॥ సత్యాహింసల ప్రాభవం బెఱిగి సత్సంస్కార భావంబుతో
నిత్యాచార పవిత్ర జీవితలతా నిర్మోహవేదాంతివై
మత్యాధిక్యల సన్మనోవిభవ సన్మైత్రేయ నాదంబుతో,
నిత్యానందుఁడ వైతివే రమణ మౌనీంద్రార్య తేజోమతీ।

srinannagaru.com

3 చ॥ సరసవివేక సంపదయు, సారమతిన్ సమతానుబంధముల్,
పరుషములాడ కుండుటయు, వాక్పటిమల్ దిగజారకుండుటన్
కరుణయు ధర్మమున్ పెరిగి గౌరవ భావముతోడ నీ కిటన్
వరలును భవ్య భూషణన - వాంఛిత రీతుల మాననీయమై॥

4 ఉ॥ నీయమల ప్రబోధమహనీయ రసాల మరందధారలన్
నీయమిత ప్రభావయుత నిర్మల భావతరంగ మాలికల్,
పాయక భక్తమండలికి పావన మార్గముఁజూపిదైవభ
ద్రాయత నామ ధేయమది రాజిలఁజేసెనుగా! దెమమ్మిటన్॥

5 చ॥ చదువుల సారమంతయును సాధనలన్ జవిఁజూచి, నేర్పుపై
సదమలభావ వీచికల సారమెఱింగి, విశిష్టవర్తన
న్నెదపదిలంబుగానునిచి, నేమముతోడు! తలక్ష్య నిర్ణయం
బదనునఁజేయునట్టు మహిమాన్విత సత్త్వుడు రామణార్యుడున్
సదయతఁబ్రోచుఁగాక! నవశక్తుల మమ్మిట దైవ ప్రేరణన్॥

6 తు॥ సరసాంతఃకరణంబు, మానితవచ స్సారంగలీలాగతుల్,
వరభావాంచిత తత్త్వరీతులు, మహో వైరాగ్య భావంబులున్
కరుణాపూరిత చిత్తవృత్తియు, పరాకాష్ఠంబులై యొప్పె
వరకార్యాచరణాత్మకోత్తమ కళావైదగ్ధ్య జాలంబులో॥

7 సీ॥ హృదయ కేదారముల్ సరసగతుల మీటి
సద్భావసస్యముల్ సవదరింప;
కమనీయ వాక్తతిన్‌రమణీయ భంగిమన్
శాంతి సందేశముల్ సంతరింప;
కీర్త నీయంబగు వర్తనంబు! నమించి
సౌశీల్య గరిమంబు సంఘటింప;
స్మరణీయ గుణగణ నీరేజమాలతో
జీవిత లక్ష్యంబు చెంగలింప;

తే॥గీ॥ భవ్యభాసుర సంస్కార భద్రగతులు
సొగఁజేయుము మాకిట సరసగతుల
రమణఋషి వర్య! యోమౌనిరాజధుర్య!
పరమకృపతోడ మమ్ముకాపాడుమయ్య!

8 క॥ నీవే తల్లివి తండ్రివి
నీవే దైవము, గురుఁడవు నిత్యము మాకిట,
నీవే సర్వము జగతిని
నీవే దయతోడ జూడు నిర్మల హృదయా॥

srinannagaru.com

# శ్రీ లక్ష్మీనృసింహ స్తుతి మాల

## (శ్రీ జిన్నూరు నాన్నగారిని స్తుతించుచు కూర్చిన సంస్కృత శ్లోకములు)

**భుజంగయాత వృత్తములు :**

1 శ్లో॥ మనస్తత్త్వ గమ్యం, నృసింహాఖ్యరమ్యమ్,
సలక్ష్మీ వసంతం, లసద్భావ విష్ణుమ్,
గళచ్చంద్రపీయూషధారాప్లుతాంగమ్
భజేనాన్నవర్యం, సదానంద ధుర్యమ్॥

2 శ్లో॥ మహానందయుక్తం, పరంధామసక్తమ్,
గురుబ్రహ్మ నిష్ఠం, మనోభావ పుష్టమ్,
పరాత్మ స్వరూపాబ్జమధ్యే నిషణ్ణమ్
భజేనాన్నవర్యం, నృసింహాఖ్యధుర్యమ్॥

3 శ్లో॥ సుధాసార విష్యంద వక్తృత్వ లోలమ్,
సువర్ణావళి సంస్తుత్య తేజోమయాంగమ్,
చతుర్వేదసారోల్ల, సద్భాషణార్యమ్,
భజే నాన్న వర్యం నృసింహాఖ్యధుర్యమ్॥

4 శ్లో॥ లసన్నేత్ర కాంతిం, ప్రసన్నాం తరంగమ్,
స్ఫురత్పద్మసంకాశ భాస్వచ్ఛరీరమ్,
ధరాతత్త్వయుక్తం, ప్రఫుల్లాత్మతత్త్వమ్,
భజే నాన్నవర్యం, నృసింహాఖ్యధుర్యమ్॥

5 శ్లో॥ సదాజ్ఞాన యోగీంద్ర సంస్తుత్య మూర్తిమ్,
తుషారాద్రి సంకాశ భాసైకవర్తిమ్,
లసత్పూర్ణ చంద్రాభసంయుక్తఫాలమ్,
భజేనాన్నవర్యం, మహాభక్తధుర్యమ్॥

6 శ్లో॥ చిదానందరూపం, భవాతీతగమ్యమ్,
కనద్గాంగధారా పునీతాంగ తేజమ్,
గురూత్తంసలోలం, సదాపూజితార్యమ్,
భజేనాన్నవర్యం, నృసింహాఖ్యధుర్యమ్॥

7 శ్లో॥ రసానందధామైక నామం స్మరంతమ్,
పరంధామ రూపేలసద్భావయోగిమ్,
చరద్వాయుతత్త్వేరమంతం - విరాగిమ్,

srinannagaru.com

భజేనాన్నవర్యం, నృసింహోఖ్యధుర్యమ్॥

8 శ్లో॥ పరబ్రహ్మనిష్ఠం, పరంధామసక్తమ్,
మహానందయుక్తం, భవావేశముక్తమ్,
చతుర్వేదసారోల్ల, సద్భావయుక్తమ్,
సదానాన్నవర్యం, నృసింహోఖ్యధుర్యమ్॥

**శ్రీనాన్నగారిని స్తుతించుచు కూర్చిన ఆంధ్రపద్యములు :**

1 సీ॥ కమనీయ సద్భావకల్హారమాలల
నందించి మించిన యమలహృదయ!
రమణీయ సౌశీల్య రాజితరీతులన్
మమతలన్ పెంచిన మాన్య వర్య!
గణనీయ విశ్వాసగరిమలో
గురువర్యసేవించిమించిన స్మేరవదన!
స్మరణీయ సుస్నిగ్ధ సదమల జ్ఞానాన
సమతలన్ పెంచిన సారచరిత!

తే॥గీ॥ రమణఋషివర్యుఁబూజించిరాణకెక్కి
ఆర్ద్ర హృదయాన శిష్యులనాదరించి
పరమ తాత్త్వికమధువులన్ పంచినావు
నవ్యగురువర్య! జిన్నూరు నాన్నయార్య!

2 సీ॥ దానధర్మ సహిత ధన్యమార్గంబున
వేదాంత వేత్తవైవినుతిగాంచి,
భక్తిభావముతోడ ముక్తిమార్గముఁజూపి
రక్తినొందితివయ్య రమ్యచరిత!
కర్మ సిద్ధాంతాఢ్యమర్మముల్ గుర్తించి
తాత్త్విక బోధలన్ తనిపినావు,
జ్ఞానమార్గంబున చతురిమల్ చూపుచు
ప్రవచన స్రష్టవై ప్రగతినొంది,

తే॥గీ॥ ఆత్మ వాదిగ జీవితయాత్ర చేసి,
మండితముఖాన చిరునవ్వు తాండవింప,
విశ్వనాథుని కృపచేత వినుతినొంది
నమిత మూర్ధాన తరలితి నాన్నవర్య!

srinannagaru.com

3 సీ॥ ఎవ్వాని హృదయమే యిందిరామందిర
ప్రాభవగరిమతో పరిఢవిల్లు,
ఎవ్వాని వాగ్ఝరి యవ్వారిగా సాగు
గౌతమీ నది వలె కానవచ్చు,
ఎవ్వాని భాషణలింపు సొంపుల(జూపు
శారదామంజీర సారగతుల
ఎవ్వాని గమకంబు నివ్వటిల్ల(గ(జూపు
నటరాజశేఖరు నాట్యరీతి,

తే॥గీ॥ అత(డె తత్త్వ ప్రవక్తయై యలరినట్టి
నాన్నగురువర్యు(డను పమనాథు(డగుచు
విశ్వ విఖ్యాతి నొందిన విమల మూర్తి
రమణ ఋషి వర్యు కృపతోడ రాణకెక్కె॥

4 ఉ॥ భాసుర భావ భంగిమలు, భవ్య పదాంకిత కీర్తనీయసే
వాసర సాంతరంగమును, వైదిక మార్గ విశుద్ధ రక్తియున్,
మాసరమైయిలన్ వరలు మాన్యతమంబగు పుణ్యమూర్తియై
దాసులనేలునట్టి నవతారాణ మూర్తియు నాన్నయార్యు(డున్॥

స్వస్తిరస్తు

**కలిదిండి వెంకట రామరాజు**
**ది॥ 15-12-2004**



srinannagaru.com



# 1. ప్రేమ, భక్తి

భగవంతుడు ప్రేమ స్వరూపుడు అనటం కన్న ప్రేమే భగవంతుడు అనటం ఉత్తమం. భక్తి కూడా ఆస్థితో సమానం. భక్తిని రహస్యంగా ఉంచుట మంచిది. భగవంతునితో సంబంధాన్ని బలపర్చేదే భక్తి. నిరంతరం మనస్సును ఆత్మలో ఉంచటమే భక్తి. భాషకు వ్యాకరణానికి ఉన్న సంబంధం ఏలాంటిదో భక్తికి, శ్రద్ధకు ఉన్న సంబంధం అటువంటిదే. అంటించుకొన్న భక్తి అంటించు కొన్నట్లే, కారణ భక్తి నిలువదు. అకారణ భక్తి నిలుస్తుంది. నిజ భక్తుడు భగవంతుణ్ణి ఏమీ అడుగడు, ఏ జన్మలో ఎప్పుడు ఏది ఇస్తాడో ఆ పరమాత్మకే తెలుసునని అనుకొంటాడు. ఆత్మను తెలుసుకోవటానికే భక్తి కావాలి. భక్తిలేకుండా జ్ఞానం రాదు. మనస్సులో ఆరాటం ఉన్నంతకాలం అది భక్తికాదు. భక్తి, ఆప్యాయత ఎవరిపట్ల చూపాలని అనే ఆలోచన ఎంత మందికి ఉంది. భక్తులలో రకరకాల వారు ఉన్నారు. మర్యాద కోసం ధనం కోసం, అధికారంకోసం, కాని జ్ఞానం కోసం భక్తి ఎంత మందికి ఉంది? భగవంతుని మీద ప్రేమ కలగటం మనమను కొన్నంత చిన్న విషయం కాదు. మన భక్తి కొద్దిపాటిది మజ్జిగ అన్నములో పచ్చడి నంచుకొన్నట్లు ఉంటుంది. వ్యాపార భక్తికి మోక్షం రాదు.

2. ఈశ్వరుని పట్ల ఇష్టం వల్ల మన జీవితం, మనకు తెలియకుండానే గమ్యము చేరుతుంది. పరిపూర్ణమైన జ్ఞానానికి, పరిపూర్ణమైన భక్తికి తేడాలేదు. భక్తి పులిలాంటిది, పులి దగ్గర మేకలు, గొఱ్ఱెలు ఉండవు. అలాగే నిజభక్తి మీకు ఉంటే రాగ-ద్వేషాలు రావు. ఆత్మ పదార్థము అర్థం కానంతకాలం, రాముడు, కృష్ణుడు, శివుడు అని ఏదో ఒక రూపం మీద మీ దృష్టి పడుతుంది. అందుచేత మీ ఇష్టదైవాన్ని మీరు ఆరాధించటంలో మీ దృష్టిని నిలపటం మంచిది. ఆచరించే వాడే భక్తుడని, భగవంతుడు చెప్పాడు. దేహప్రారబ్ధాన్ని సహజంగా, సరళంగా ఎవరైతే అనుభవిస్తూ ఉంటారో వారే సూరులు, యోగులు. వారే నిజమైన భక్తులు. పరమేశ్వరుని మీద మనం భక్తిగా ఉంటే "మాయ" మనలను ఏమీ చెయ్యదు. "మనం భక్తులం కాము, భక్తులమని పిలువబడే భక్తులం" అన్నారు స్వామి వివేకానంద. మనకు భక్తి ఉంది కాని కోరికకు మాత్రమే పరిమితమైనది. ఎవరైతే తన మనస్సును భగవంతునిపై సర్వకాల సర్వ అవస్థలలోనూ నిలబెడతారో వారే నిజ భక్తులు.

3. ఇంట్లో ఉన్న ఆహారాన్ని, ధనాన్ని మీరు దుర్వినియోగం చెయ్యరు. పిల్లలు, అన్నాన్ని కెలికి అవతల పారేస్తే మనం మందలిస్తాము. అలాగే దైవనామాన్ని

srinannagaru.com

జపించేటప్పుడు, మెకానికల్‌గా జపించకూడదు. మనస్సు ఆ నామంపై భక్తిగా చేయాలి. దేవుని నమ్మేవారికి కూడా దేవుని సంకల్పము మీద నమ్మకం లేదు. సాధకులు ముందు, కుదురుగా ఉండాలి. గీతలో కృష్ణుడు "మీరు సాధన చెయ్యగా, చెయ్యగా, మీకు ఎటువంటి బుద్ధి అయితే ఆత్మను తెలుసుకొనుటకు సహాయపడుతుందో అటువంటి బుద్ధిని ప్రసాదిస్తాను" అన్నారు. అంటే ఆయన పాదాల మీద భక్తి కలిగితే అవగాహనను, కలుగచేస్తారని అర్థము. శరణాగతికి మించిన ప్రార్థన మరియొకటి లేదు. భగవాన్ అరుణాచలాన్ని స్మరిస్తే మోక్షం వచ్చింది. మనకు "రమణా" అంటే జ్ఞానం వస్తుంది. రాముణ్ణి ఒక భక్తుడు ఇలా అన్నాడు. "రామా! నీవు గొప్పవాడివి అని నీవు అనుకొంటున్నావు కానీ నీ కన్న గొప్పది ఒకటి ఉంది అది "నీ నామం" అన్నాడు. నామ మహత్మ్యాన్ని గొప్పదనటానికి చేసే ప్రయత్నం అది. భగవంతుడికి మనకూ ఉండే అనుబంధమే భక్తి.

4. భక్తి వలన ఏమి లాభమని కొందరు అనుకోవచ్చు. పూర్వ జన్మలోను, ఈ జన్మలోనూ ఉన్న దోషాలు రాలిపోతాయి. మనకు కురుపు మానినప్పుడు పై పెంకులాగకపోయినా అది రాలిపోతుంది. భక్తి వలన బుద్ధిలోని దోషాలు మీకు తెలియకుండానే రాలిపోతాయి. మీకు అజీర్తిగా ఉన్నప్పుడు వేసుకునే బిళ్ళ ఎలా పనిచేస్తుందో మీరు ఆలోచించనక్కరలేదు. దాని పని అది చేస్తుంది. భక్తి మీ మనస్సును శుద్ధి చేస్తుంది. వాడు ప్రకృతిని దాటిపోతాడు. జ్ఞానం కలుగుతుంది. తల్లి బిడ్డను ఎలా కాపాడుతుందో భక్తి మిమ్మలను గమ్యానికి చేరుస్తుంది. ప్రేమతో చేసిన పని మనో వికాసమును కలుగజేస్తుంది. ప్రేమతో పని చెయ్యలేకపోతే, ప్రేమతో పని చేసేవారికి సహాయపడుట మంచిది. అక్షరమణమాలలో ఎక్కడ ముట్టుకొన్నా భక్తే. భక్తిలేని జ్ఞానం ఉప్పులేని పప్పులాంటిది. భక్తిలో నుంచే జ్ఞానం వచ్చింది. భక్తి తల్లి, జ్ఞానం బిడ్డ. మీకు కోటి తలంపులు రానియ్యండి దాని మూలం దేహాత్మ భావన, అనే నేనులోంచి వచ్చినదే. నీ భావనాబలంచేత (బ్రహ్మభావన చేత) దేహగతమైన "నేను"ను నీవు గెంటివేస్తే "నీవు మిగులుతావు" ఆత్మగా ఉంటావు. అదే ఉత్తమ భక్తి. భక్తి మార్గంలో ఉన్నవారు విష్ణువును, జ్ఞాన మార్గంలో ఉన్నవారు శివుని పూజిస్తారు. భక్తి, జ్ఞానాలు తల్లి-తండ్రి వంటివి. భక్తి అంటే చిడతల సహాయంతో నామం చెయ్యటం కాదు. నీ అహంకారాన్ని నీ హృదయంలో ఉన్న సద్వస్తువుకు ఇచ్చేయటమే భక్తి. భక్తి, శ్రవణం ఎందుకంటే పరిశుద్ధులం అవ్వటానికి, శ్రవణం చేసేకొలది ఈశ్వరానుగ్రహంతో అవిద్య నుండి విడుదల పొందుతాము. మీలో ఎన్ని బలహీనతలు ఉన్నా ఈశ్వరుని మీద, మీకు పూర్ణ శరణాగతి ఉంటే ఉద్ధరించబడతారు. నీ విశ్వాసం దైవానుగ్రహానికి

srinannagaru.com

అనుకూలంగా ప్రవహించాలి. గురువు మీద విశ్వాసం అవసరం. భక్తిగల జన్మ హృదయ గ్రంథులను తెంచేస్తుంది.

5. భక్తి అంటే ఏమీ లేదు "ప్రేమ". మీకంటే తక్కువ స్థాయిలో ఉన్న వారిని ప్రేమిస్తూ ఉంటే దాన్ని "దయ" అని అంటారు. "భయం" వల్ల "భక్తి" కలుగదు. భగవంతుని అనుగ్రహం లేనిదే భక్తి కలుగదు. ప్రేమభావన, స్నేహ భావన లేనివానికి భక్తి కలుగదు. ఒకటిలోంచి (ఆత్మలోంచి) ఏమీరాదు. రెండులోంచి (అహంకారంలోంచీ) కోరిక, కోపం వస్తుంది. మాయ, భేద బుద్ధిలోంచి వస్తుంది. భగవదనుభవం కలగటానికి భక్తి అవసరం. ఆయన అనుగ్రహం వల్లనే భక్తి కలుగుతుంది. మానవ శరీరంలో ఉండి భక్తి లేకుండా ఉండటం కన్న, జంతు జన్మలో ఉండి భక్తి కలిగి ఉండటం ఉత్తమం. మనం లోకానికి, శరీరానికీ బంధించబడి యున్నాము. రాముని పాదాలకు బంధించబడిలేము. మనకు స్వార్థం పెరిగే కొలది మన స్వార్థమే మన దేహానికి అంటిపెట్టుకొని పోతుంది. లోకానికి అంటిపెట్టుకొని పోతున్నాము. దేవుడు ఉన్నాడన్న నమ్మకమే పోతున్నది మన స్వార్థం రాముని పాదాల చెంతకు వెళ్ళనివ్వదు. ప్రతీ చిన్న విషయానికీ భగవంతుణ్ణి ఆశ్రయిస్తే అది వ్యాపార భక్తి అవుతుంది. భగవాన్ వద్దకు ఎవరైనా రామ, కృష్ణ విగ్రహాలు తెచ్చి చేతిలో పెడితే ఇలా అనేవారు "జ్ఞానం గురించి ఎంతైనా చెప్పగలం, భక్తి గురించి ఏమి చెప్పగలం" అని కన్నీరు పెట్టుకొన్నారు. జగత్తు-జీవుడు-ఈశ్వరుడు-మనః కల్పితం అని చెప్పిన రమణ మహర్షి నోటి నుంచి వచ్చిన పలుకులు అవి. భక్తుని లక్షణం ఏమిటి? అంటే ఏ సమయంలో ఏది ప్రాప్తమౌతుందో దానితో సంతృప్తి పడేవాడని అర్థం. జ్ఞాన మార్గం కంటే ప్రేమ మార్గం ఇష్టమయ్యే వారికి అది వారికి తియ్యగా ఉంటుంది. సద్ వస్తువును నిరంతరం జ్ఞాపకం పెట్టుకోవటం కూడా యోగమే. అదీ భక్తే.

6. భక్తుడిని బట్టి భగవంతుని వైభవం. భక్తి ఎలా కుదురుతుంది అంటే నీకు అనేక జన్మల నుంచి వస్తున్న బరువులు-బాధలు ఒక ప్రక్కన పెట్టి వర్తమానంలో ఉన్న వానికి ఈశ్వరుని మీద భక్తి కుదురుతుంది. భూత కాలాన్ని స్మరిస్తే వర్తమాన కాలం మన చెయ్యి దాటిపోతుంది. ఎవరి ప్రేమ విశ్వ వ్యాప్తమౌతుందో వారే భక్తులు. భక్తులు రజోగుణం, తమోగుణాలను అదుపులో ఉంచుకోవాలి. సోమరిపోతులకు అసూయ ఉంటుంది. కాని నిరంతరం భక్తి భావనలో ఉన్నవానికి అసూయ పడటానికి సమయమేది? భగవంతుడు భక్తుని దేహంతో తాదాత్మ్యం పొందుతాడు. భక్తుడికి నమస్కారం పెడితే భగవంతుడికి

srinannagaru.com

నమస్కారం పెట్టినట్లే. నామంలో ఉన్న రుచి భక్తుడికి తెలుస్తుంది. అర్హతలేని వానికి నామంలో ఉన్న రుచి తెలియదు. ఎడ్లకు బూర్లు పెడితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. అంటే ఎంత రుచిగా ఉన్నాయని భావించవు, చిట్టు తిన్నట్లు తింటాయి. భక్తివలన మూఢ నమ్మకాలు వస్తాయి అంటారు కొందరు అది సరికాదు. భయం వల్లనే, మూఢ నమ్మకాలు వస్తూ ఉంటాయి. చదువు-డబ్బు-సిద్ధాంతాలు అద్వైత అనుభవానికి అక్కరలేదు. నీకు తపన ఉంటే, నీ హృదయంలోకి వెళతావు. నీకు అవగాహన ఉంటే నిజాయితీగా ప్రయత్నం చేస్తే తప్పనిసరిగా నీవు తరిస్తావు. మీ కోరికలు అన్నీ మర్చిపోతే ఆయన (ఈశ్వరుడు) మిమ్ములను గుర్తుపెట్టుకొంటాడు. అది అంతా నావలనే జరుగుతోంది అనుకొంటే "అలాగే చేసుకో" అని నిన్ను ఆయన వదిలేస్తాడు. నీకు వాంఛలు లేనప్పుడు, నీ హృదయంలో మాలిన్యం లేనప్పుడు నీకు దొరికేది శివుడే, ఆయన వారికి దొరకకపోతే ఇంకెవరికి దొరుకుతాడు. అందరిలోనూ భగవంతుణ్ణి చూడటం నేర్చుకొంటే నీకు భక్తి కూడా పెరుగుతుంది. నీకు కడసారి జన్మ ఏది అంటే కొండగుర్తుగా చెబుతున్నాను "ప్రపంచంలో ఉండి, నిష్ప్రపంచ స్థితిలో ఉండగల్గితే అదే కడసారి జన్మ." దానికి భక్తిని ఆశ్రయిస్తే పొందగలము. కొందరు ఇంట్లో వారిని బ్రతికి ఉండగా చూడరు. చనిపోయిన తరువాత బ్యాండ్‌మేళాలతో ఊరేగిస్తారు. అంటే అది లోకవాసన. అదేకాదు దేహ వాసన, లోక వాసన, శాస్త్రవాసన ఉంటుంది. ఈ మూడు కలిపితేనే గ్రంథి, అది తెగేదాకా బ్రహ్మానుభవం కలుగదు. కొందరు భగవత్‌గీతను కంఠస్థం చేస్తారు. అందులోని నిజాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలనే తలంపే వారికి ఉండదు కారణం పుణ్య సంస్కారం లేకపోవటం వలన. నిజ భక్తుడు నిజమైన దాన్ని తెలుసుకోవాలని అనుకొంటాడు. ఆ నిజభక్తిలేని వానికి ఈ మూడు వాసనల చుట్టూ తిరుగుతూ ఉంటాడు. దేవతామూర్తికి రోజూ అర్చన చెయ్యటం వలన ఆ దేవతామూర్తికి శక్తి వస్తుంది. అనుగ్రహిస్తుంది.

7. కొందరు భక్తులు శ్రీరామ, శ్రీకృష్ణ అని అంటారు. కాని వారి మనస్సు ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటుంది. పోలేరమ్మ పట్టుకొన్నట్లు అలా యాంత్రికంగా చేస్తారు. వారికి ఏ ప్రయోజనం ఉండదు. నామాన్ని ప్రీతిగా చెయ్యాలి. మనస్సు నామం మీద పూర్తిగా లగ్నమై ఉండాలి. జరిగేది అంతా ఈశ్వర సంకల్పం. అలాగే ఈశ్వర సంకల్పమే మన సంకల్పము అనుకోండి, మహిమలు కావాలని నిజభక్తుడు కోరుకోడు, అంతా ఈశ్వర సంకల్పమే అని అనుకొంటాడు. సత్యాన్ని ఒక గురువుకే పరిమితం చెయ్యకండి వారి వారి ప్రణాళిక ననుసరించి వారి వారి గురువులపై

srinannagaru.com

భక్తి కలిగేలా మనం ప్రోత్సహించాలి. ఈశ్వరుడు భక్తులను ఉద్ధరించటానికి ఎంతో మంది గురువులను ఈ భూమి మీదకు పంపిస్తాడు. భగవంతుని ఛాయా చిత్రాలుగాని, ప్రతిమలుగాని ప్రతీఇంట్లోని పెట్టుకోవాలి, అలాగే సద్ గ్రంథాలను పెట్టుకోవాలి వాటిని యథాలాపంగా చూచినా నీకు ఆరెంటి వలన అనుగ్రహానికి పాత్రుడవౌతావు. ప్రకృతి సంపదను చూచి గర్వం పెంచుకొన్నవానికి భక్తి కుదరదు. అవి అన్ని స్వప్న సమానమని గ్రహించిన వానికి గర్వం కలుగదు. అహంకారం నిజమనుకొన్నంత కాలం ఈశ్వరుని మీద నమ్మకం కుదరదు. అహంకారంలో ఉన్నది అంతా పెంటేనని గ్రహించినప్పుడే ఈశ్వరుని మీద ప్రేమ కలుగుతుంది. ప్రేమ అంటే వ్యాపారం కాదు. ప్రేమలేని ఏ సాధన ప్రయోజనం లేదు. కొందరు భక్తులు గుడిలోకి వెళ్లి ప్రక్కకు నిలబడతారు భగవంతుని ఎదురుగా ఉండే అంతస్తు మనకు ఎక్కడ ఉందని అనుకొంటారు ఎందుకంటే తండ్రికి తనయుడు అణకువ కదా! అలాగే కొందరు భక్తులు భగవంతుని నామాన్ని కూడా ఉ చ్చరించరు కారణం భగవంతుని నామాన్ని ఎంగిలి నోటితో జపించి ఎంగిలి చెయ్యటం ఎందుకు అని అలా అంటారు.

లోపల ఉన్న సద్ వస్తువుతో అనుసంధానం చెయ్యటమే భక్తి బయట ఏమీ లేదు. అంతా నీ ఆత్మలోనే ఉంది. మతాల వల్ల కులాలవల్ల మనం బంధం నుంచి బయట పడలేము. సత్య దర్శనం వల్లనే బంధం నుండి బయట పడగలము. భక్తి వల్ల మనిషి పవిత్రుడు అవుతాడు, వాడికే సత్యదర్శనం. కృష్ణుడిది లీలావతారం, రాముడిది ధర్మావతారం. జడాన్ని ఆరాధించే వాడికి జీవ లక్షణాలు పెరుగుతాయి. పై అవతార పురుషులను ఆరాధించేవారు అమృత స్థితిని పొందుతారు. ఎవరికైతే భగవంతుని మీద, ఆయన మాటలమీద విశ్వాసం ఉంటుందో వారు మాత్రమే భగవంతుని పాదాలను ఆశ్రయిస్తారు. భక్తుడు కానివాడు కోరుకొనేది ప్రకృతి రూపాలనే. సున్నిపిండి శరీరంలోని మలినాలను తీసివేసినట్లే మనలోని భక్తి మన మనస్సులోని మాలిన్యాలను తీసివేస్తుంది. దానికి ఉన్న శక్తి యోగానికి కూడా అంతగా లేదు. ఈ విషయం తెలుసుకొని ఆచరించిన వారు ధన్యులు. భక్తి శాంతంగా ఉండాలి. ప్రేమ ఉంటే లోపాలు కనబడవు. అది కొరతగా ఉండటం వలననే లోపాలు కనబడతాయి. ఈశ్వరుని పాదాలయందు పరిపూర్ణ భక్తి లేకపోతే మీరు ఎన్ని యోగాలు చేసినా పునర్జన్మ నుంచి తప్పించుకోలేరు. భక్తి మంచిదే. నిజ భక్తునికి ప్రాణాయామం అక్కరలేదు.

8. భక్తి మంచిదే దాని దగ్గరే ఆగిపోకూడదు. ఎల్‌కెజిలో చదువుకొనే వాడు అందులోనే ఉండాలని అనుకోడు అలాగే మన గమ్యం మోక్షం అనే

విషయం మర్చిపోకూడదు. భక్తి అద్వైత పరిణామాన్ని తీసుకొని రావాలి. భక్తి వలన సోమరితనం రాకూడదు. కీర్తి కాంక్ష ఉన్న వానికి పనిపట్ల గౌరవం ఉండదు. ముసలితనంలోను, మధ్య వయస్సులోను భక్తి కలగటం కన్న చిన్నతనం నుంచి వచ్చిన భక్తి నిలబడుతుంది. చివరి నిమిషంలో భక్తి కలిగినా అసలు భక్తి లేని వాని కన్న ఉత్తమం. భక్తుని త్యాగబుద్ధిని గురించి ఠాగూర్ ఇలా అంటాడు "ఒక భక్తునితో ఒకరు ఎవరైనా వస్తే ఏదైనా ఇస్తావా అంటే ఇస్తాను" అంటాడు. అలాగే ఒకరు రాగా సంచి దులపగా రెండు వడ్ల గింజలు రాలినాయి. వాటిని భక్తితో సమర్పించుకొన్నాడు ఆ పేదవాడు. దానికి ఆ స్వామి నిర్మలంగా వెళ్ళిపోయాడు. తరువాత మరల సంచి దులపగా రెండు బంగారు నాణాలు పడ్డాయి. అప్పడు ఆ భక్తుడు ఏడుస్తూ ఇలా అనుకొంటాడు "అయ్యో మొదటే పడితే ఈ బంగారాన్ని ఇచ్చేవాడిని". స్వామికి వడ్లగింజ అక్కరలేదు. ఈ ప్రపంచం అంతా ఆయన సొత్తే. భక్తుని యొక్క త్యాగ గుణాన్ని గీతాంజలిలో ఠాగూర్ పొంగిపోయి చెప్పారు. మనకు శక్తిలేకపోతే ప్రపంచ ఆకర్షణల నుండి బయట పడలేము. భక్తివలనే ఆ శక్తి వస్తుంది. అగ్నిలో వేసిన బంగారం ఎలా పవిత్రమౌతుందో రామనామం చెయ్యటం వలన బుద్ధిలోని దోషాలు పోతాయి. నామం చేస్తున్నప్పడు ఎంతో కొంత సంతోషం వస్తుంది. అది నామం చెయ్యటంపై ఆధారపడిందే కాని స్వతంత్రమైనది కాదు. స్వతంత్ర సుఖం వచ్చే వరకూ వీటి మీద ఆధారపడక తప్పదు.

9. కారు ముందుకు నడపటం తేలికే, వెనుకకు నడపటం కష్టం. అలాగే మనస్సు బయటకి విజృంభించటంలో కష్టంలేదు తేలికే, కానీ మనోమూలానికి పంపటం చాలా కష్టం. దానికి భక్తి కావాలి, వివేకం కావాలి, వైరాగ్యం కావాలి. రాధ, కృష్ణుని ఎలా ప్రేమించిందో అలా మనం ఈశ్వరుణ్ణి ప్రేమించాలి. అప్పడు శుద్ధ భక్తులు అవుతారు. నిజ భక్తుడు దేనికోసం ఎదురుచూడడు. సమాధిని కూడా కోరుకోడు ఈశ్వర సంకల్పమే తన సంకల్పమని అనుకొంటాడు. పరాభక్తికి మరోపేరే సమాధి. భగవంతుని స్మరించటం నిజ భక్తునికి పాయసం త్రాగటం లాంటిది. శ్రీ కృష్ణ చైతన్య భక్తులు ఇలా అంటారు "జ్ఞాన మిశ్రితమైన భక్తి మాకు అక్కరలేదు, ముక్తిని కోరుకోము, వస్తే కాదనము, మాకు భక్తి చాలు. స్మరణ వలన వచ్చే ఆనందం చాలు. దాని వలన మేముకాని మనోబుద్ధుల నుంచి బయట పడుతున్నాము" అంటారు. నిజ భక్తుడు దేనికోసం ఎదురుచూడడు. ఎదురుచూపుల వలననే బి.పి. ఆశ ఉన్నవాడికి ఆశాభాగం. బిడ్డ తల్లిని స్నానం చేయించమని కోరదు, తల్లే చేయిస్తుంది. భక్తి మనకు ఉంటే భక్తుని మాయను

srinannagaru.com

భగవంతుడు నాకి పవిత్రుణ్ణి చేస్తాడు. భక్తులలో దేవాలయాన్ని నిర్మించి ఆరాధించే భక్తుడు మారుతి మాత్రమే. ప్రహ్లాదుడు, ధ్రువుడు, భీష్ముడులాంటి వారికి దేవాలయాలు లేవు. సమయస్ఫూర్తి, సూక్ష్మదృష్టి అలవడటానికి ఆంజనేయస్వామిని పూజించమని మారుతి భక్తులు అంటారు. పరాభక్తి ఉన్నవాడికి పరతత్వం తెలుస్తుంది. పరాభక్తి అంటే భగవంతుడు ఒక్కడే కావాలనే భక్తి. మనం నిజ భక్తులమైతే భగవంతుని మీద తప్ప ఇతర విషయాలు రావు. ఏ లౌకిక విషయంతో నైనా మీకు సంతోషం రాకూడదు. వస్తే మీరు భక్తులు కారు. మీకు వేరుగా, ఏదైనా ఉంది అంటే కోరిక వస్తుంది. నిజ భక్తునికి కోరిక మీద ధ్యాసే రాదు.

10. సాధారణంగా భక్తి కోరికతోనే ప్రారంభమౌతుంది. అలా ప్రారంభిస్తే మనస్సు బాహ్య ముఖానికి వెళుతుంది. జిజ్ఞాస పూర్వ జన్మ సుకృతం వలన వస్తుంది. జ్ఞానం సంపాదించటానికి పెట్టుబడి జిజ్ఞాసే, జ్ఞాని కూడా ఈశ్వర సంకల్పానికి అనుగుణంగానే ఉంటాడు. స్వంత సంకల్పం ఉండదు. దాని రీత్యా జ్ఞాని కూడా ఈశ్వర భక్తుడే. జిజ్ఞాసువుకు లోకం ముఖ్యం కాదు, అతనికి ద్వంద్వాలు తగ్గిపోతాయి. సుఖ దుఃఖాలలో అతనికి ఆసక్తి ఉండదు. ఈ జన్మలోనైనా ముందు జన్మలోనైనా మీరు ధన్యులు, మీకు జ్ఞానం ఇయ్యటానికి ఈశ్వరుడు నిరీక్షిస్తున్నాడు తట్టుకోగలవా? లేవా? అని కాలం కోసం ఆయన ఎదురు చూస్తున్నాడు. బక్తిలోనే ఇంత ఆనందం వచ్చేస్తూ ఉంటే ముక్తిలో ఇంకా ఎంత ఆనందమో భరించగలమా? భక్తుల హృదయాలను చూస్తే తనువు పులకరిస్తుంది. తుకారాం వ్యాపారం చేస్తున్నప్పుడు సత్తు బేడకాసులు మోసంతో ఇస్తున్నా విషయం గ్రహించినా మాట్లాడకుండా లోపల ఇలా అనుకొనేవారు. ఆ మోసం ఏదో మనమే అనుభవిద్దాము మరియొకరు ఎందుకు అని స్వీకరించేవారు. కాని మోసగాడికి అది తెలిసేది కాదు అది ఆయన వైభవం. రామనామం తిన్నగా చేసుకొన్నవారికి తిక్క ఉంటే తగ్గుతుంది. ఈమధ్య ఒక పెద్దాయన మరణిస్తూ ఒకే ఒక్క కొడుకును పిలిచి "మీ అమ్మ అమాయకురాలు, జాగ్రత్తగా చూచుకో" అనగా కొడుకు "చూస్తాను" అని అనలేదు. "అమ్మ తిన్న తరువాతే నేను తింటాను" అన్నాడు. అది ప్రేమ వైభవం. ప్రేమలోంచే సహనం జ్ఞానం వస్తుంది. ప్రేమ ఉన్నచోట, భక్తి ఉన్న చోట ఏకత్వ స్థితి ఉంటుంది, భక్తి లేకుండా మన మనస్సు బాగుపడదు. భక్తిలేని వాళ్ళతో, వివేకం లేని వాళ్ళతో అనుబంధం తొలగించుకోవాలి. అలా చెయ్యకపోతే శాంతిని పొందలేము, చివరకు వాళ్ళలో మనలను కలిపేసుకొంటారు. ఎక్కడ కోపం ఉంటుందో అక్కడ ప్రమాదం ఉంటుంది. ప్రేమ కంటే అసూయ తొందరగా పనిచేస్తుంది. కోపం

srinannagaru.com

ఉన్నవాడు తొందరగా ముసలివాడు అవుతాడు. నీళ్ళు మన శరీరాన్ని ఎలా శుభ్రం చేస్తుందో అలాగే భక్తి మన బుద్ధిని శుభ్రం చేస్తుంది. ఎంతబాగా శుద్ధి చేస్తుంది అంటే, కోపం రానియ్యదు, కోరిక రానియ్యదు, వాడు మొద్దు అబ్బాయిలా ఉండడు. మీకు ఆకలి వేస్తే ఆహారం కోసం ఎలా ఆతృత చెందుతారో అలాగే పరమాత్మ మీకు ఎరుకపడినప్పుడు ఆనందంతో తాండవం చేస్తారు.

11. లోకం ఉంది భగవంతుడు లేడు అని అనుకొంటున్నాము. విషయాన్ని తలక్రిందులు చేస్తున్నాము. మహా సముద్రంలో చిన్న బుడగ ఎటువంటిదో నీ మిధ్యానేను అటువంటిది. పరమాత్మ మహా సముద్రము. భక్తి పెరిగే కొలది ప్రకృతి వేదన తగ్గుతూ ఉంటుంది. రాముడు అంటే రాముని కళ్యాణ గుణాలు గుర్తుకు రావాలి, అలాగే కృష్ణుడు, బుద్ధుడు, ప్రహ్లాదుల పేర్లు గుర్తుకు వస్తే, వారి కళ్యాణ గుణాలు గుర్తుకురావాలి అది భక్తి. మన ఇంట్లో వారిని ప్రేమిస్తున్నాము అని అనుకొంటున్నాము అది ప్రేమ కాదు భ్రాంతి. బుద్ధుడిది ప్రేమ. డబ్బుపోతే కంగారు పడతారు, ఆ విషయంలో జాగ్రత్తగానే ఉంటారు. మరి ఉపయోగం లేని తలంపులు వస్తున్నాయి అవి శరీరానికి మనస్సుకు హాని చేస్తున్నాయి అందుండి విడుదల పొందాలని అనుకొంటున్నామా? సాధకులే ఇలా ఉంటున్నారు. సాధనా బలం నీకు లేకపోతే, స్మరణ భక్తి నీకు లేకపోతే, గురువు మీద నీకు భక్తిలేకపోతే ఎలా తరిస్తారు. మహాత్ములు భగవంతుని ప్రతినిధులు వారి మాటల మీద గౌరవం లేకపోతే ఎలా? అనవసర విషయాలలోంచి మనస్సును ఉపసంహరించు అలా చేస్తే నీవు జ్ఞానివి అవుతావు.

12. నారద భక్తి సూత్రాలు ఇలా అంటున్నాయి "ఏశ్వాస కాశ్వాస దైవ నామాన్ని స్మరించుకోవాలి. సంకీర్తన భజనలో ఒక భాగం, భక్తితో చెయ్యాలి. లాంఛనంగా చేస్తే ప్రయోజనం సున్నా! భక్తిలో నెమ్మదిగా మునిగితే జ్ఞానం తీసుకోవటానికి సన్నాహమౌతుంది. భక్తిగల హృదయంలో జ్ఞానం ఉదయిస్తుంది. భక్తి-భుక్తిని, ముక్తిని తీసుకొని వస్తుంది. ఈశ్వరునిపై పరిపూర్ణ విశ్వాసం గలవాడు దుఃఖ రహితుడౌతాడు. భక్తుడు రోజూ ఏడుస్తూ కూర్చోడు. సూర్యుడు ఉదయించిన తరువాత మంచు కరిగిపోతుంది. అలాగే మీకు భక్తి కుదిరితే "మాయ" కరిగిపోతుంది. "మాయ" తప్పకొని తీరాలి. అది ఈశ్వరుని ఆజ్ఞ. గురవు పట్ల, అవతార పురుషుని పట్ల మీ "ప్రేమ" ప్రవాహం తైలధారలా సాగాలి. "కైంకర్యం" అంటే సేవ. రామాయణంలో అంతా కైంకర్యం, ప్రేమ నిండి ఉంది. రా+శి= రాశి. అంటే రాముడు+సీత అని అర్థం. రామనామ స్మరణ ఆనంద పరిచేది, దోష బుద్ధి పోతుంది. భక్తి అంటే, ప్రేమ, జ్ఞానం అంటే వివేకం ఇవి

srinannagaru.com

రెండూ ఒకదానికి ఒకటి సహకరించుకొంటాయి.

13. మీరాకు ఏడు సంవత్సరాల వయస్సులో వివాహం చేసి అత్తవారి ఇంటికి దాస దాసీలతో, నగలతో పల్లకీలో ప్రయాణమైతే "మీరా" తల్లితో అంటుంది "అమ్మా నా సంతోషానికి, ఆనందానికీ కారణమైన నా కృష్ణుని విగ్రహం నాకు ఇయ్యి. అది జన్మాంతరంలో చేసుకొన్న సాధన. భగవంతుడి మీద ప్రేమ ఉండాలి దానికి కారణం ఉండకూడదు. నిరాకార భక్తులు ఎటువంటి వారు అంటే నదిని ఈదుకొంటూ వెళతారు సాకార భక్తులు బోటు మీద వెడతారు. నిరాకార ఉపాసకులకు నిరాకార భక్తి తేలిక, అహంకారులకు సాకార భక్తి మంచిది. చెరుకు రసం, జిన్నూ తిన్నప్పుడు నీకు ఎంత మధురంగా ఉంటుందో అలాగే నీవు మధురంగా నామం చెయ్యకపోతే అనుగ్రహం ఇయ్యటానికి ఈశ్వరుడు వెర్రివాడా? నామాన్ని పట్టుకోవటం వలన ఉపయోగం లేని తలంపులు, ఆలోచనలు అంటుకోవు. భక్తి వలన నీకు శక్తి వస్తున్నదంటే నీ భక్తి నిజమని భావించు. కొందరు ప్రతీచిన్న విషయానికీ రియాక్ట్ అవుతారు. వారి భక్తి నిజం కాదని అర్థం. భగవంతుణ్ణి మనం ఎలా ప్రేమించాలి అంటే మన మిథ్యా నేను గుర్తుకురాకుండా ప్రేమించాలి. ఒక భక్తుడు అన్నాడు "రామ నామం చెయ్యటం వలన ప్రపంచంలో మలమే పోతూ ఉంటే నీ మలం పోవటంలో ఆశ్చర్యము ఏముంది" అన్నాడు. దిలీప్ కుమార్ రాయ్ కృష్ణ భక్తుడు, గాయకుడు, కవి. ఆయనకు ఒక భక్తురాలు ఉన్నారు. ఆమె భక్తికి మెచ్చి కృష్ణుడు దర్శనమిచ్చాడు. ఈ విషయం రాయ్‌కి తెలిసి కృష్ణ విగ్రహం ముందు సంవత్సరాల తరపున ఏడ్చినాడు. చివరకు దర్శనమైనది ఇక్కడ విశేషం ఏమిటంటే "రామ్" కంటే ఆమె పవిత్రమైనది. భగవంతుడు సర్వ సాక్షి. ఆయనకు అంతా తెలుసు. మనకు భక్తి లేదు. యుక్తిగా మాట్లాడటం నేర్చుకొన్నాము. ఇది ఇహానికి, పరానికి పనికిరాదు.

14. నోటితో హరినామం జపించకుండా చేతితో హరి భజన చెయ్యకుండా ఉంటే ఈ శరీరం ఒక తోలు తిత్తుతో సమానం అని ప్రహ్లాదుడు తండ్రితో అన్నాడు. త్యాగరాజు తొంబైఆరుకోట్లు రామ నామ జపం చేసి తరించారు. మనస్సు అనేది పెద్ద మంట. ఆ మంటను ఆర్పటానికి జప, తపాలు కావాలి అంటే మనం ఒక్కొక్క సారి బాధగాను, కోపంగాను ఉంటాము. భక్తులకు భగవంతుడు హృదయంలోనే ఉంటాడు. తెలివి తక్కువ వారికి గుడిలో ఉంటాడని ఉత్తర గీతలో తెలిపాడు. సమదృష్టి ఉన్నవానికి భగవంతుడు అంతటా ఉంటాడు. అరటి పండు తొక్కను బయట వదలి గుంజును తింటాము. భగవంతుని బాహ్య రూపాన్ని

srinannagaru.com

వదలి అంతర్యామిగా ఉన్న పరమాత్మను అనుభవించు అని ఒక ఉపనిషత్తులో ఉంది. దేహానికి ఒక్కొక్క సమయంలో అదృష్టం, దురదృష్టాలు వస్తాయి. మనం సమానంగా ఉండాలి. ఇతరులకు అదృష్టం వస్తే ఈర్ష్య రాకూడదు. అట్టివాడు భక్తుడు. మనస్సుకు ఎలా తర్ఫీదు ఇయ్యాలో భక్తి నేర్పుతుంది. పోరాట పటిమ ఉన్న రాజకీయనాయకుడు రాణిస్తాడు, న్యాయాధిపతికి న్యాయం మీద పక్షపాతం ఉంటే ఆయన న్యాయస్థానంలో రాణిస్తాడు. భక్తులకు సాధనా పఠిమ ఉంటే భక్తిలో రాణిస్తాడు. భగవంతుని యొక్క వైభవం భక్తుడికి తెలుస్తుంది. జిజ్ఞాసుకు జ్ఞానం గురించి తెలుస్తుంది. కామ, క్రోదాలు ఏనుగులు లాంటివి. అవి పీనుగులు అవ్వాలి అంటే భక్తి మార్గంలో ప్రయాణం చెయ్యాలి. నార బట్టలతో రాముణ్ణి చూచిన గుహుడు ఇలా అంటాడు. "మిమ్ములను ఇలా చూడవలసి వస్తున్నది అనుకోలేదు. ఈ కళ్లు లేకపోయినా బాగుండును" అంటాడు. అది భక్తి. అటువంటి భక్తికి రాగ, ద్వేషాలు పోతాయి.

15. తీగ పందిరిని ఎలా అల్లుకుపోతుందో అలాగే భగవంతుని స్మరణతో మీ మనస్సు, ఇంద్రియాలు అల్లుకుపోవాలి. మన కర్మేంద్రియాలు జ్ఞానేంద్రియాలు అల్లుకుపోవాలి. రోజూ ఎలాగైనా ఇంద్రియాలతో అల్లుకుపోతున్నారు మహా శివరాత్రి రోజు ఒక్కరోజైనా శివుని అంటిపెట్టుకొని ఉండండి. జన్మలో ఒక్క రోజైనా ఇలా చెయ్యండి. దీనినే "జన్మకో శివరాత్రి" అంటారు. దేశభక్తి పరిణామం లో భక్తిగా మారుతుంది. కొందరు భక్తులు భగవంతుని దయా గుణాన్ని చూచి కళ్ళ నీరు పెట్టుకొంటారు. నీ దయ నాకు చాలు ఏమీ అక్కరలేదు అని అంటూ సిరి లేకపోయినా శాంతిగా ఉంటారు. సుఖంగా ఉంటారు. పెళ్ళిళ్ళలో భగవంతుడు సంకల్పించింది మనకు నచ్చుతుంది, ఇష్టపడతాము. మీలో ఏదైనా మంచితనం ఉంటే అది భగవంతుడు ఇచ్చాడు. ఆ సంగతి మీకు తెలియాలి. కొంతమంది భక్తులు ఈశ్వరునిపై ప్రేమ, వేసవి కాలంలో నదిలో ప్రవహించే నీరులా ఊసురోమంటూ వెళ్లినట్లు ఉంటుంది. నిజభక్తుని ప్రేమ వర్షాకాలంలో నదిలో నీరు మహా ప్రవాహంలా వెళ్లినట్లు ఉంటుంది. ఈశ్వరుని మీద మీకు ప్రేమ వస్తూ ఉంటే మీ భక్తి మహా ప్రవాహంలా సాగుతుంది సాగరానికి. అప్పుడు మీరు తరిస్తారు.

srinannagaru.com

# 2. జ్ఞానము, జ్ఞాని

అహంకారం ఉన్నంత కాలం మోక్షం లేదు. జ్ఞానం లేకపోతే మోక్షం కలుగదు. జ్ఞాని మనస్సు ఆత్మాకారం చెందుతుంది. జ్ఞాని తన్ను ఆశ్రయించిన వాడిని జ్ఞానవంతున్ని చేసి తీరుతాడు. జ్ఞానికి మీ దండాలు, మీ జేజేలు, మీ పాదాభిషేకాలు అక్కరలేదు. జ్ఞానంతో సమానమైన విలువ వైరాగ్యానికి ఇయ్య వచ్చును. క్రూరత్వం, కుటిలత్వం, వంకర బుద్ధి గల వాళ్ళకు జ్ఞానం రాదు. ఈశ్వరార్పితంగా పనిచేస్తే వైరాగ్యం పుడుతుంది. వైరాగ్యం లేనివాడికి ఎన్ని శాస్త్రాలు చదివినా ప్రయోజనం లేదు, పుస్తకాలలో లేదు జ్ఞానం, మీరు నిర్మలంగా ఉంటే అదే జ్ఞానం. ప్రేమ, జ్ఞానం బొమ్మ బొరుసులాంటివి. నాకు పని ఉంది అని అనుకొంటే జ్ఞాని కాదు. బోధించే వారిలో కొన్ని మంచి లక్షణాలు ఉంటే దాని ప్రభావం శ్రోతలపై ఉంటుంది. అతడు పవిత్రుడైయుండాలి. మీకు జ్ఞానము లేకపోవచ్చు, జ్ఞానిని గౌరవించాలని ఎరగలేరా? మహాత్ములను చూచి పులకరించకపోతే మీలో వాసన ఉన్నట్లే. జ్ఞానం కోరేవాడు ముందు వినయం నేర్చుకోవాలి, జ్ఞానికి పేరు ప్రఖ్యాతులతో సంబంధం లేదు. దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఒకరికి పేరు వస్తుంది. ఆత్మను తెలుసుకొనటానికి తపస్సు కావాలి. ఆత్మను తెలుసుకొన్నవాడే "ముని". మనస్సును అంతర్ముఖం చెయ్యటానికి మాత్రమే జ్ఞాని మాట్లాడుతాడు. జ్ఞాని దర్శనం చాలు మనలోని బలహీనతలు తీయగలుగుతాయి. శాస్త్రవేత్త సామాజిక స్పృహతో చెప్పబడినది కాని ఋషి చెప్పినది ఎంతకాలానికైనా నిజంగానే ఉంటుంది. ప్రీతిలేని జ్ఞానం పంచదార లేని కాఫీ, టీ లాంటిది. "మీ దేహం మీద పాము పాకితే మీకు భయం కలుగలేదా?" అని భగవాన్‌ని ప్రశ్నించినప్పుడు "చెట్టుమీద, నేలమీద పాకితే నాటికి భయమేస్తుందా!" అన్నారు. అంటే జ్ఞానికి దేహభావన కూడా ఉండదని తెలుసు కోవచ్చును. అజ్ఞానులు కామిస్తారు. జ్ఞానులు ప్రేమిస్తారు. అజ్ఞానులు కూలి వారితో సమానం. కూలివాడు, యజమాని చెప్పినట్లు పనిచెయ్యాలి, స్వతంత్రుడు కాడు. అజ్ఞాని అహంకారం చేతిలో కీలు బొమ్మగా ఉంటాడు.

2. జడ వస్తువుల మీద అనగా శరీర సంబంధమైన బంధువుల మీద అభిమానం ఉన్నంతకాలం జ్ఞానం కలుగదు. బుద్ధుణ్ణి ఒకరు ఇలా ప్రశ్నించారు "మీరు ఎవరు?". దానికి ఆయన నేను రాకుమారుణ్ణి అనలేదు, "నేను మీలాగే ప్రయాణీకుడను, అయితే మీ గమ్యం వేరు, నా గమ్యం వేరు" అన్నారు. సంపదను, భార్యను, బిడ్డను, సింహాసనాన్ని వదలి జ్ఞానంకోసం వెళుతున్న సమయంలో

srinannagaru.com

అన్నారు సత్యం మీ బుద్ధికి తెలిసే వరకూ ఈ ప్రకృతి నుంచి బయట పడలేరు. అజ్ఞాని ప్రయత్నం చెయ్యకుండా ఉండలేడు. జ్ఞానికి ప్రయత్నం లేనేలేదు. ఆత్మ వంచన వలననే దేవుడు తెలియబడడు.

"యోగం" అంటే ఉపాయం. వాచిక, మానసిక, కర్మలు. ఈ మూడు జ్ఞానికి మాత్రమే సమానంగా ఉంటాయి. సజ్జనుడు అంటే రాగ-ద్వేషాలను వదిలించుకొన్నవాడు. కవిత్వం చెప్పేవాడు అందంగా చెబుతాడు కాని జ్ఞాని అందంగా చెప్పవలసిన పనిలేదు. ఉన్న దాన్ని సహజంగా చెబుతాడు. ఋషి భగవంతుణ్ణి తెలుసుకోగలడు కాని కవి తెలుసుకోలేడు. ఇంత వరకూ ఏ జ్ఞాని "నేను జ్ఞానిని" అని చెప్పకోలేదు కారణం ఆ మాట మనస్సుతో అనాలి. జ్ఞానికి మనస్సు లేదు అందుచే ఎలా అనగలడు. జ్ఞాని సమక్షంలో ప్రాణాయామం చెయ్యనక్కరలేదు. జ్ఞాని ఉనికే లోకకళ్యాణం. జ్ఞానికి దేహాన్ని నిలబెట్టే తలంపు (భోజనం, స్నానం వంటి) మాత్రమే ఉంటుంది. అవి బంధ హేతువులు కావు, బాహ్యంగా చూస్తే జ్ఞాని, అజ్ఞాని ఒకేరకంగా కనబడతారు. కాని అంతరంగం చూస్తే ఎంతో తేడా ఉంటుంది.

3. మురుగునార్ తన జీవితంలో ఎదురయ్యే కష్టాలు చెప్పకుందామని భగవాన్ వద్దకు రాగా భగవాన్ అతని కష్టాలు అతను తెలుపకుండానే గ్రహించి కూరలు కోసే టైములో, కొండ మీదకు వెడదామని సైగ చెయ్యగా మురుగునార్ గ్రహించి కొండపైకి వెళ్ళగా భగవాన్ కొంతసేపటికి అతని సమక్షానికి రాగా మురుగునార్ తన నాలుగు సంవత్సరాల కష్టాలు వారిని చూడగా గుర్తుకు రాలేదు. కారణం చూడగానే వారు అన్నీ మర్చిపోయారు. కారణం తను కూడా ఆత్మాకారం చెందినారు. మనస్సు లేనప్పుడు మాటలు రావు. చెప్పటానికి ఏమీ ఉండవు. భగవాన్‌తో గంటల తరబడి కూర్చున్నా ఏమీ మాట్లాడలేదు. మీకు ఎవరి సమక్షంలో మీ జీవిత సమస్యలు అన్నీ మరచిపోయి కాలం గడుపుతారో వారే జ్ఞాని అని కొండ గుర్తుగా చెబుతున్నాను. ప్రతీ జ్ఞానీ ఈశ్వరుని నియమంలో ఉంటాడు. భగవాన్ అన్నారు ఒకరితో "ఏ జన్మలో అనుబంధం లేకపోతే ఈ జన్మలో కలిసామా? ఈ అనుబంధం మరుసటి జన్మలో కలపదా!" అన్నారు. అంటే భగవాన్ తిరిగి జన్మిస్తారని కాదు, రమణ భగవాన్ మీద మీకు ఉన్న ప్రేమ అదే ప్రేమగల మరియొక ఉపాధితో ఈశ్వరుడు తన భక్తులను ఉద్ధరించబడేటట్లు చేస్తాడు.

4. మానవ జన్మ ఉన్నతమైనదే కాని శాశ్వతమైనది కాదు. మనస్సు నశించిన వాడు, సమాధి స్థితి పొందినవాడే యోగి. జ్ఞాని హృదయం నుంచి

srinannagaru.com

అమృతం చిందుతుంది కారణం జ్ఞాని అమృత స్థితి పొందటం వలన అజ్ఞానికి రాత్రి, పగలు ఉంటుంది. జ్ఞానికి రాత్రి లేదు, పగలూ లేదు. జ్ఞాని పనిచెయ్యటం లేదని అనుకోకండి, బాధ్యత లేకుండా ఉన్నాడని అనుకోకండి, జ్ఞాని లోకానికి కళ్యాణ కారకుడు. శాస్త్రం, జ్ఞానికే అర్థమౌతుంది. అజ్ఞానికి, శాస్త్రంలోని భావాలు విపరీత అర్థాలుగా గోచరిస్తాయి. బయట వాళ్ళ ఇంట్లో కన్న, ఎవరింటి వద్ద వారు ఎంత సహజంగా, సుఖంగా కూర్చుంటారో అంత సహజంగా జ్ఞాని హృదయంలో ఉంటాడు. తన కన్న భిన్నంగా చూడని వానికి గౌరవం లేదు, అగౌరవం లేదు. జ్ఞాని అంతా ఆత్మగా చూస్తాడు. ద్వైత బుద్ధి దాటి వెళ్ళిపోతాడు. గణపతి శాస్త్రిగారు అన్నారు "మహా సముద్రంలో ఒక నీటి బుడగకు ఎంత విలువ కడతారో జ్ఞాని ఈ సృష్టిని కూడా అలాగే లెక్క కడతాడు. సినీ తెరపై ఉన్న బొమ్మలను పిల్లలు పట్టుకొందామనుకొంటే బొమ్మలు చేతికి తగలవు, తెరే తగులుతుంది. అలాగే జ్ఞాని ఉపాధులను చూడడు, దానికి ఆధారమైన ఆత్మను మాత్రమే చూస్తాడు.

5. అజ్ఞానికి శరీరం "నేను" అనే స్ఫురణ వస్తుంది. కాని జ్ఞానికి "చైతన్యమే నేను" అనే స్ఫురిస్తూ ఉంటుంది. అటువంటివారు "మరణాన్ని" మజ్జిగ అన్నంలో పచ్చడి నంజుకుని తిన్నట్లు భావించి ఆనందంగా భుజిస్తారు, అలాగే జ్ఞాని కూడా మరణం విషయంలో ఉంటారు. జ్ఞాని యొక్క తలంపు, చూపు, ప్రతీ చేష్ట మనలను పవిత్రత చేస్తుంది. మానవ జాతిలో చైతన్య స్థాయి పెంచుతుంది. సముద్రానికి హద్దులు ఉన్నాయి, జ్ఞాని అనుగ్రహానికి హద్దులు లేవు. ఎక్కడ ఉన్నా అందుతాయి. జ్ఞానితో మానసిక అనుబంధాన్ని ఏర్పాటు చేసుకోండి. మిమ్ములను ఒడ్డుకు చేరుస్తాడు. ఆపని ఆయన చేస్తాడు. జ్ఞాని ఎంత వరకు ఆలోచిస్తే అంతవరకూ మాట్లాడుతాడు. మనం తక్కువగా ఆలోచించి ఎక్కువగా మాట్లాడుతాము. జ్ఞాని సహజంగా మాట్లాడుతాడు. మెప్పులుకోసం మాట్లాడడు. మన "నేను" తలంపులకు సంబంధించినది. జ్ఞాని తలంపు అనుభవానికి సంబంధించినది. ఏ జ్ఞాని దేవుని గొడవలకు, అవతార విశేషాలకు, ప్రకృతి గొడవలకు లొంగడు. అవి అన్నీ తనకు భిన్నమైనవి అని అనుకోడు. ఆ గాలి మాటలకు లొంగిపోడు. వాటిని నిజమని ఎన్నడూ నమ్మడు. సాధకుడు హిమాలయాలలో ఉన్నా, స్వగృహంలో ఉన్నా, భూగోళానికి ఆవల ఉన్నా జ్ఞాని మౌన సంకల్పము వారిని అనుగ్రహిస్తుంది. వారి శక్తి తరంగాలు, లోకానికంతటకు ప్రసరిస్తాయి. ఎవడైతే జ్ఞానం పొందుతాడో వాడు కృతార్థుడైనట్లు లెక్క.

6. అజ్ఞానంలో నూరు సంవత్సరాలు బ్రతకటం కన్న జ్ఞానంతో ఒక్క రోజు

srinannagaru.com

బ్రతుకు. నీ జీవితం సాఫల్యమైనట్లే. నది ఆవతల ఒడ్డుకు చేరినవాడు ఇవతల దిగబడ్డ వాళ్లను తీసుకొని వెళ్ళవలసిన పనిలేదు, కేవలం కరుణ వలననే దాటిస్తాడు. అలాగే జ్ఞాని కరుణ వలన మాత్రమే మాట్లాడుతాడు. కొందరి కళ్ళు చూస్తూ ఉంటే విషం కక్కుతున్నట్లు ఉంటాయి. కాని బుద్ధుని ముఖం చూడటంతోనే, కొందరికి జ్ఞానం కలిగింది. సూర్యునిలో చీకటిలేదు, ఆత్మలో అజ్ఞానం లేదు. జ్ఞాని మాటలో అజ్ఞాన జనితమైన మాటరాదు. పరిణామ క్రమంలో తెలివిగల వాడిని మొద్దు అబ్బాయి అర్థం చేసుకోలేడు, మంచి వాడిని మామూలు మనిషి అర్థం చేసుకోలేడు. అలాగే జ్ఞానిని, జ్ఞానే గుర్తించాలి. శ్రీ కృష్ణ చైతన్యుల గురించి ఒకరు ఇలా అన్నారు "పైకి భక్తుడిలా కనిపించినా లోపల భగవంతుడే భక్తుడిలా కనిపించకపోతే ఆచరించలేరని అలా నటించారు". ప్రపంచ రహితుడు జ్ఞాని కావటం వలన, ప్రపంచం నుంచి జ్ఞాని ఏమీ కోరుకోడు. ఈ సృష్టిని అంతా జ్ఞాని ప్రేమిస్తాడు. కేవలం అనుగ్రహం వల్లనే మాట్లాడుతాడు. బాడీకి సెక్స్ ఉంటుంది. ఆత్మకు సెక్స్ లేదు. పదిహేను వందల సంవత్సరములకు ఒకరు చొప్పున బుద్ధుడు, శంకరుడు, రమణుడు ఉద్భవించారు. వారు దేహాతీతులు, లోకాతీతులు అఖండ జ్ఞాన స్వరూపులు. ప్రతీ ఆకారం, ప్రతీ వికారం కాల ప్రవాహంలో కొట్టుకుపోతుంది, నశించిపోతుంది. నిరాకారానికి మట్టుకు నాశనం లేదు. "భోగాలు" దేహాన్ని ఆలంబనంగా చేసుకొని భోగిస్తాయి. భోగ వాంఛలేని జ్ఞానికి దేహం మీద ఆసక్తి ఉండదు. దేహం ఉండాలనే వాంఛ ఉండదు. వస్తు జ్ఞానం అజ్ఞానంలోంచి వస్తుంది. ఆత్మజ్ఞానమే నిజమైనది. జ్ఞాని మౌనం మనం ఊహించలేము. సర్వకాల సర్వ అవస్థల్లోనూ ఆనందంగా ఉంటాడు. జ్ఞాని ఆనందానికి వ్యక్తుల సపోర్టులతో గాని, అనుకూల పరిస్థితులతో గాని ఆధారపడడు, జ్ఞాని మానసిక పరిధిలో ఉండడు. జ్ఞాని వ్యక్తికి శత్రువు కాదు, అహంకారానికి శత్రువు.

7. సూర్యుడు ఉదయించగానే "చీకటీ, నీవు తొలగిపో" అని చెప్పకుండానే తొలగిపోతుంది. అలాగే జ్ఞాని సమక్షంలో అజ్ఞానం తొలగిపోతుంది. అజ్ఞానికి స్వప్నావస్థ అసత్యమని, జాగ్రదవస్థ నిజమని అనుకొంటాడు కాని, జ్ఞాని పై రెండు అవస్థలు అసత్యమే అని భావిస్తాడు. పూజ వలన మనస్సు అణుగుతుంది. విచారణ వలన మనస్సు నశిస్తుంది. "నేను ఇక్కడే ఉన్నాను ప్రయత్నం చెయ్యి" అన్నారు భగవాన్. అంటే జ్ఞాని శరీరం లేకపోయినా అనుగ్రహం వస్తూనే ఉంటుంది. జ్ఞాని అనుగ్రహం శరీరం లేకపోయినా వస్తుంది. జ్ఞాని మనస్సు ఆత్మ. అజ్ఞాని మనస్సు అహంకారం. మీ అంతట మీరు నూలు కొనుక్కొని గుడ్డనేసుకోవటం

srinannagaru.com

కష్టం, నేసిన గుడ్డ దొరికితే మీకు చాలా సుఖం. అలాగే జ్ఞాని సన్నిధిలో మీ సాధన అంత తేలికగా ఉంటుంది. జ్ఞాని, నిరంతరం ఆత్మ దృష్టితో ఉంటాడు కాబట్టి వారి సన్నిధిలో మీరూ ఆత్మ దృష్టిలో ఉంటారు. భగవాన్‌ని ఒక లాయరు ఇలా ప్రశ్నించాడు "ఇక్కడ మేము శరణాగతిని పొందితేగాని రక్షించరా ఏమిటి ఈ కండిషన్?" అనగా భగవాన్ అన్నారు "ఈశ్వరానుగ్రహం ఎప్పుడూ ఉంది. ఆయన అనుగ్రహం నీకు అర్థమవ్వటం కోసం నీ మనస్సు యొక్క గుణాలను విడిచి పెట్టమన్నారు. నీవు కళ్ళు మూసుకొన్నా, తెరిచినా సూర్యుని వెలుగు ఉంది. నీకు అర్థమవ్వటం కోసం కళ్ళు తెరువు అన్నారు. అది కండిషన్ కాదు" అన్నారు. ప్రాపంచిక సంబంధమైన ఆసక్తి కించిత్తు ఉన్నా మీ మనస్సు పరమాత్మ వైపుకు తిరుగదు. భగవాన్ ఒక పండితుణ్ణి "భోజనం చేసారా!" అని అడిగారు. దానికి ఆయన ఇలా అన్నాడు "భోజనం చేసానో లేదో మీకు తెలియదా!" అని అంటే భోజనం చేసింది లేనిది తెలుసుకొంటే జ్ఞానమని వారి ఉద్దేశ్యం. మనకు భవిష్యత్తును చెబితే అది జ్ఞానం అనుకొంటాము. అదే పొరపాటు అసలు ఏది జ్ఞానమో తెలుసుకోలేని చిన్న స్థితిలో ఉన్నాము. ఈ చిన్న మనస్సుతో పెద్ద ఆత్మ ఎలా తెలియబడుతుందో చెప్పండి. గుళ్ళలో ఎన్ని కొబ్బరి కాయలు కొట్టేస్తున్నారో చూడండి. ఆత్మ కోసం కొడుతున్నారా? నాకు ప్రీతితో ఉదకమైనా ఇచ్చినా సంతోషమన్నాడే పరమాత్మ! భావనలో కూడా శక్తి ఉంది. సత్ భావనలో ఆత్మ భాగ్యాన్ని పొందవచ్చును.

8. తెలివి గొప్పదని చాలా మంది అనుకొంటారు. అది అబద్ధమే, తెలివి కూడా మనస్సు కల్పించినదే ఇది అంతా అర్థం చేసుకోకపోతే ప్రకృతి అర్థం కాదు. ఈశ్వరుడు, చావు, పుట్టుక అర్థంకాదు. ఎంత తెలివిగల వాడైనా ప్రకృతికి బానిసగా ఉన్నాడు. కడవ అంత గుమ్మడి కాయ కూడా కత్తి పీటకు లోకువే. తెలివి ప్రకృతిలో భాగం, ప్రకృతి ఈడ్చేస్తుంది. హృదయంలో సత్యం తెలియనప్పుడు దానికి మీ మనస్సు లొంగనప్పుడు ఎన్ని చదివినా ప్రయోజనం లేదు. మీ దగ్గర ఉన్న రూపాయి కంటే నా దగ్గర ఉన్న రూపాయి ఎక్కువ అనటం ఎటువంటిదో బుద్ధుడి కంటే రమణుడు గొప్పవాడనటం అటువంటిదే. ఇద్దరి అజ్ఞానులలో తేడా ఉంటుంది. ఇద్దరి జ్ఞానులలో తేడా ఉండదు. తేడా ఉంటే జ్ఞానమే కాదు అబద్ధాలు అనేక రకాలుగా ఉండవచ్చును. నిజం ఎప్పుడూ ఒక రకంగానే ఉంటుంది. జ్ఞానికి ఎవరైనా అపకారం చేసినా, ద్వేషించినా తిరిగి చెయ్యలేడు ఎందుచేతనంటే అతనిలో అది లేదు, లేనిది ఎక్కడ నుంచి ఇవ్వగలడు. అక్కడ ఉన్నది జ్ఞానం మాత్రమే. అదే వస్తుంది మనకు. దేవుడు ఉన్నాడా? లేడా?

srinannagaru.com

అనేది ముఖ్యం కాదు. కావలసింది ధర్మాన్ని ఆచరించమని, ధర్మం మీద మీకు గౌరవం ఉంటే మీరు ఆస్తికులే, అదే సిద్ధాంతం. ఈశ్వరుడు సాక్షిగా లోపల ఉండి మీ పనులను చూస్తున్నాడు. మీరు సద్‌బుద్ధితో పవిత్రమైన మనస్సుతో గనుక పని చేస్తే నూటికి నూరు మార్కులు ఇస్తాడు. ఆయన మిమ్ములను ప్రేమించినప్పుడే ఈ కర్మ సముద్రం నుంచి బయటపడతారు. అంత వరకూ మిమ్ములను ఎవరూ రక్షించలేరు. మీకు కుదురులేకపోతే తెలివితేటలు తగ్గిపోతాయి. ఏది మంచిది, ఏది చెడు అని విడదీసుకొనే శక్తి లేకపోతే జ్ఞానం కలుగదు. మీరు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టండి అక్కడ జ్ఞాని లేకపోతే క్షేత్రాలు అవ్వవు. నిద్రకాని నిద్ర ఎవరికి వస్తుందో వారికి జ్ఞానం కలుగుతుంది. మీరు నిద్రలో ఎలా ఉన్నారో మెలకువలో కూడా అలా ఉండాలి. నిష్ప్రపంచ స్థితిలో ఉండాలి. అదే నిజ స్థితి.

9. దీనుల పట్ల దయచూపండి, అజ్ఞానం పోతుంది. ఆరిపోయిన దీపంతో మరో దీపం వెలిగించలేము. దీపం వెలిగి ఉంటేనే మరో దీపం వెలిగించుకోవచ్చును. అలాగే జ్ఞాని ద్వారా మాత్రమే అందరికీ వెలుగు వస్తుంది. ఒక్కొక్కసారి జ్ఞాని మొఖం చూడలేము, వారి పాదాలను చూచి సంతోషించాలి, ఆ వైభవం అటువంటిది. శరీరానికి జబ్బు చేస్తే ఆ రోగం పోవాలని అంతా అనుకొంటారు. అలాగే జ్ఞాని కూడా శరీరాన్నే రోగంగా చూస్తాడు శరీరం పోతే జబ్బు వదులుతుంది అనుకొంటాడు. జ్ఞాని వైభవం అటువంటిది. మనం ఎవరింటికైనా వెళ్ళి భోజనం చేస్తూ ఉంటే ఆ పదార్థాలు ఉడకకుండా బాగాలేకపోతే కచ్చాబిచ్చాగా కెలికి వదిలేస్తాము. బాగా ఉడికి రుచిగా ఉంటే తినేస్తాము. మనం త్రికరణ శుద్ధిగా ఉండి శాంతంగా ఉంటే భగవాన్ మన అహంకారగతమైన "నేను"ను తినేసి మనకు మోక్షం ఇస్తారు. భగవాన్ వద్ద ఒక సాధకుడు "మా మనస్సు కదిలి పోతున్నది" అంటే ఆయన అన్నారు "వెళ్ళిపోతే వెళ్ళిపోనియ్యండి, వెళ్ళినచోట కూడా బ్రహ్మాన్నే చూడనియ్యండి. చివరికి ఎక్కడికి వెళ్ళినా బ్రహ్మమే ఉంటోందని తిరిగి వచ్చేస్తుంది" అన్నారు. జ్ఞాని దేహం పడిపోయే సమయంలో కూడా భయపడడు కారణం, దేహం పోయినా తాను ఉంటానని తనకు తెలుసు, దేహం బరువు వదిలిందని సంతోషిస్తాడు. శరీర శుభ్రత, ఆహార పానీయాల బాధ తప్పుతుంది. కరెంటు ఒకటే, దాని వల్ల లైట్లు వెలుగుతాయి, పంకా తిరుగుతుంది, అలాగే బ్రహ్మం ఒక్కటే, వేరు వేరు ఉపాధుల ద్వారా వేరువేరు పనులు జరుగుతాయి. రాముడు చేసి చూపించాడు, కృష్ణుడు ఉపదేశించాడు ఈశ్వర ప్రణాళికలో ఎలా ఉంటే అలా జరుగుతుంది. భగవంతుని మాట హృదయ సారం, ఆయన

srinannagaru.com

వేరు, ఆయన మాట వేరు కాదు. జ్ఞానికి ఇతరులు లేరు, భేదబుద్ధి వ్యక్తం అవ్వటానికి వీల్లేదు, ఎవరికి ఏది చేసినా, ఏదీ చెయ్యలేదు అనుకొంటాడు.

10. ఆచార్యులవారు, పురుష తంత్ర జ్ఞానము, వస్తు తంత్ర జ్ఞానము అని రెండు చెప్పారు. మొదటిది మతం, ప్రాంతం, కట్టుబాట్లు ప్రకారం భగవంతుణ్ణి ఆరాధించటం. రెండవది ఎప్పుడు ఒక రకంగా ఉండే ఆత్మతత్త్వం, పురుష తంత్రం వేరుగా ఉండవచ్చు కాని, వస్తు తంత్రం ఒక రకంగానే ఉంటుంది. పురుష తంత్ర జ్ఞానంలో మహమద్ చెప్పినది, ఏసు చెప్పినది, ఆచార్యులవారు చెప్పింది వారి వారి పంథాలు వేరుగా ఉండవచ్చును, వస్తు తంత్ర జ్ఞానంలో వారు చెప్పింది ఒక్కటే. చావు వలన మన దేహం నుంచి విడిపోతాము, కాని జ్ఞానం వలన దేహ గతమైన "నేను" నుండి విడుదల పొందుతాము. ఉచ్ఛ్వాస-నిశ్వాసాలు మన ప్రయత్నం లేకుండా ఎంత సహజంగా జరుగుతాయో అలాగే జ్ఞానికి అంత సహజంగాను ఏకాగ్రత కుదురుతుంది. నీవు దుఃఖం లేని స్థితికి ఎదిగినప్పుడు ఇతరులు నిన్ను చూచి వారు దుఃఖ రహితులు అవుతారు. జ్ఞాని మౌన సన్నిధిలో ఆయన సంకల్పించుకోకుండానే మేలు జరుగుతుంది. నేర్పు-ఓర్పు లోంచి వస్తుంది. పవిత్రత-మౌనం ఎవరి హృదయంలో ఉంటుందో వారి మాటలు ప్రపంచానికి ఉపయోగపడతాయి. ఏడుస్తూ ఉన్నంతకాలం, నరుడు, ఏడుపు లేనప్పుడు నారాయణుడు. నీకు బ్రహ్మానుభవం కలిగిన తరువాత నీ గత జీవితం అంతా చెరుకు పిప్పిలా కనిపిస్తుంది. బ్రహ్మానుభవం కలిగిన తరువాత, అందరి హృదయంలోనూ తానే ఉన్నానని తెలుస్తుంది. అటువంటప్పుడు ఎవరికీ అపకారం చెయ్యలేరు. శ్రవణం-స్మరణం-దర్శనం అన్నారు. దర్శనమిచ్చిన తరువాత శరీర, స్ఫురణ పోతుంది. తలంపు పోతుంది.

రేడియోలోను, టి.వి.లోను పాటలు పాడేవారు మాటలు పలికేవారు అందులో ఉండరు, ఎక్కడో ఉంటారు. అలాగే జ్ఞాని దేహాన్ని ఈశ్వరుడు ఉపయోగించుకొంటాడు. బ్రహ్మానుభవం పొందినవానికి మంగళం ఏమిటి? అమంగళం ఏమిటి? ఇవి అన్నీ అహంకారానికే. ఆత్మానుభవం పొందిన వ్యక్తిని చూడగానే నమస్కారం చెయ్యాలనే బుద్ధి పుడుతుంది. అక్షరమణ మాలలో అజ్ఞానానికి సంబంధించిన ఆరాటం అంతా ఈ ఒక్క మాటలో మాయమౌతుంది. "ఒకడవౌ నిను మాయమొనరించు వచ్చువారు ఎవరిది నీఖాల మరుణాచలా!"

11. జ్ఞాని పూర్ణకాముడు, అన్ని కోరికలు నెరవేరినవాడు. శివుడు, బుద్ధుడు ధ్యాన ప్రియులు అంటే లయకారకులు. శివుడు భయరహిత స్థితికి గుర్తుగా పాములను చూపుతారు. ద్వైతభావన ఉంటే ఏదో ప్రక్కకు వాలిపోతాము.

srinannagaru.com

స్వతంత్రంగా ఆలోచించే శక్తిరాదు. వారికి పక్షపాతం వస్తుంది. సద్వస్తువులను చూస్తే అద్వైత భావన ఏర్పడుతుంది. చైతన్య అనుభవం వచ్చే వరకూ నీ ఇంద్రియాలను నిగ్రహించటానికి నీవు ప్రయత్నం చెయ్యి. అలా చెయ్యకపోతే బాహ్య ప్రవృత్తులతో నీవు తిరుగుతూ ఉంటావు. ఒక్క జ్ఞానికి మాత్రమే అహంకార వ్యాపారం ఉండదు. గాలికి చెట్లు కదులుతాయి, కొండ కదలదు. అలాగే ఆత్మ విశ్వాసం గల మనిషి కొండలా అచలంగా ఉంటాడు. అజ్ఞానే ప్రకృతి తాకిడికి ఆకులులాగా, చెట్లులాగా ఊగుతాడు. అంతా నిర్ణయమైపోయింది అనేది నీ దేహానికి మాత్రమే, ఆత్మకు ఎట్టి సంబంధం లేదు. నిగ్రహించుకోవటం అంటే మనస్సు వచ్చేస్తుంది. జ్ఞాని ఇతరులను ఆత్మగానే చూస్తాడు. నామ రూపాలు ఉన్నప్పుడు రాగ ద్వేషాలు ఉన్నప్పుడు తలంపుల యొక్క వేగం హెచ్చుగా ఉంటుంది. వివేక జ్ఞానమంటే తాను ఆత్మననే విషయంలో సందేహం లేని, నిశ్చయ జ్ఞానం, పరిశుద్ధమైన జ్ఞానమే సన్యాసం. జ్ఞానం ఎప్పుడు కలిగిందో అప్పుడు బాధ ఆగిపోతుంది. మహాకాశం శివుడు, ఘటాకాశం జీవుడు. "నేను" వేరు, నేను అనే తలంపు వేరు. నిజమైన నేనుకు హద్దులు లేవు. అది సర్వసాక్షి, కృత్రిమమైన నేనుకు పరిమితులు ఉన్నాయి, తలంపులు ఉన్నాయి, భయాలు ఉన్నాయి. జ్ఞానికి సుఖం ఉంటుంది. అది అమృత రూపంలో ఉంటుంది. మిధ్యా నేనుకు మిధ్యా వస్తువులు అంటే ఇష్టం. వాస్తవ జ్ఞానం ఉన్నవానికి లోకంలో ఏ వస్తువును చూచినా మోహం కలుగదు. ఒక్క సత్యం మాత్రమే మనలను అజ్ఞానం నుంచి విడుదల చేస్తుంది. భగవంతుడు ఎంత గొప్పగా చెప్పినా మనలోని అజ్ఞానం ఆ మాటలను నమ్మనివ్వదు. సోక్రటీస్ ఆఖరి గడియల్లో ఇలా అన్నారు "అతి మంచితనం, లోకం భరించలేదు" అందుకే వారిని చంపేస్తారు గాంధీ మరణంపై ఒకరు ఇలా అన్నారు "సైలెంటు యొక్క ఔన్నత్యం మనం గుర్తించలేకపోవచ్చు, ఆ స్థాయికి ఎదగలేకపోయినా, కనీసం గౌరవంగా చూడలేకపోవటం వలననే ఆయన మరణం సంభవించింది."

12. జ్ఞాని ద్రుక్కుగానే ఉంటాడు, దృశ్యంగా ఉండడు. లోకం కనిపించినా, కనబడక పోయినా తన అస్థిత్వానికి ఏ లోటు రాదు. కొరత ఉన్న మనిషికి కోరిక ఉంటుంది. జ్ఞానికి కోరిక ఉండదు. సత్యం ఒక్కటే నిజమనే కృత నిశ్చయం గల బుద్ధి నిన్ను ఆత్మ దగ్గరకు తీసుకొని వెళుతుంది. మనం గుడి చుట్టూ తిరుగుతూ ఉన్నప్పడే దేవుని చుట్టూ తిరుగుతున్నామని అనుకొంటాము. కాని జ్ఞాని నిరంతరం దేవుని చుట్టూ తిరుగుతున్నాము అనుకొంటాడు. మనం ధనం సంపాదిస్తే దాన్ని కాపాడుకోవటానికి జీవితం పొడుగునా శ్రమ పడతాము. అలాగే

srinannagaru.com

పండితుడు తన పుస్తక జ్ఞానాన్ని పదిలపర్చుకోవటానికి, అలాగే కీర్తి సంపాదించిన వాడు వాటిని వదిల పర్చకోవటానికి శ్రమపడతారు కాని సహజ జ్ఞానాన్ని సంపాదించినవాడు ఏవిధమైన శ్రమ పడనక్కరలేదు. ఏ వెలుతురు వలన ఈ ప్రపంచం కనబడుతున్నదో ఆ వెలుగును తెలుసుకోవటమే సహజ జ్ఞానం. అదే జీవిత గమ్యం. బాహ్యంగా జరిగే రాగ-ద్వేషాలు సున్నలు. ఈ సున్నాల గురించే నీవు బాహ్య ముఖానికి వెళ్లేది. చూచేవాడు, చూడబడేది, సున్నాయే. ఈశ్వర ప్రేమలో ఊగిసలాడుతూ ఉంటే విరోధులు-మిత్రులు ఎక్కడ కనబడతారు. నేను ఇలా ఉన్నాను, అలా ఉన్నాను అనేది ఫీలింగ్, అలా ఉన్నాను అనేది అజ్ఞానం. ఉండటమే జ్ఞానం. ఒక దుర్మార్గుణ్ణి చూచిన వెంటనే ఎందుకు ఉద్రేకం వస్తుంది అంటే ద్వేషం మన మనస్సులో ఉంది కాబట్టి మనస్సు నశిస్తేగాని ఇవి ఏమీ ఆగవు. దేహం నేను అనే తలంపు ఉన్నంత కాలం ఎక్కడ నుంచో వచ్చాము ఎక్కడికో వెళ్లిపోతాము అని అనుకొంటాము. ఆత్మ తెలిస్తే ఎక్కడ నుంచో రాలేదు ఎక్కడికీ వెళ్లటం లేదు. ఎప్పుడూ ఉన్నాము అంతటా ఉన్నాము అనుకొంటాము. ఒక కాలంలో ఉండి మరో కాలంలో లేనిది ఒక ప్రదేశంలో ఉండి మరో ప్రదేశంలో లేనిది నిజం కాదు. పాలునూ, తెలుపునూ వేరు చెయ్యలేము, చైతన్యాన్ని, సుఖాన్నీ వేరు చెయ్యలేము. దీపం అందరికీ వెలుగు నియ్యాలని అనుకోదు వెలుగు అందుతుంది జ్ఞాని కూడా అంతే, అతని ద్వారా శాంతి సమాజానికి అందుతుంది. ఆయన అనుకోడు.

13. బాగా పండిన పండు చెట్టునుండి రాలిపడితే ముచ్చిక నుంచి వసరాదు. పచ్చికాయ కోస్తే అందుండి "వస" వస్తుంది. అలాగే మీ శరీర పతనంలో దుఃఖం రాలేదంటే మీరు పండిన పండు. శరీర పతనంలో దుఃఖం వస్తే అజ్ఞానిగా ఉన్నట్లే లెక్క. మీలోని రాగద్వేషాలను మీరు తొలగించుకొంటే మీలోని దేవుణ్ణి మీరు చూడటమే కాదు, ఎదుటివారిలోని దేవుణ్ణి కూడా చూడగలరు. అంతేకాదు అందరూ దేవుళ్ళే అని మీకు తెలుస్తుంది. మీకు మోకాళ్లనెప్పులు ఉంటే నూనె రాసుకొంటారు. దాన్ని సేవ అని అనుకోరు. కారణం ఆ కాళ్ళు మీవే. అలాగే జ్ఞాని ద్వారా సమాజానికి ఉపకారం చేసినా సేవ చేస్తున్నాను అనుకోడు. మనుషుల పుణ్యం వలన తరించటానికి, పాపం వలన శిక్షించటానికీ అవతార పురుషులు వస్తారు. మన దేశానికి రాజధాని ఢిల్లీ అలాగే మన సుఖానికీ, ఆనందానికీ, జ్ఞానానికీ రాజధాని మనలో ఉన్న ఆత్మే. అది నిర్మలమైన బుద్ధికి, నిశ్చలమైన బుద్ధికి తెలియబడుతుంది. జ్ఞాన మార్గమంటే ఏమీ లేదు. నీవు లేవని తెలుసుకోవటమే. "మానసంతు కిం? మార్గణేకృతేః నైవ మానసం మార్గ

srinannagaru.com

ఆర్జవాత్" అని అంటే నేను లేనని తెలుసుకొంటే వెలుగు అది ఉంది అని తెలుసుకొంటే చీకటి. దేహము, మనస్సు భగవంతుని స్వాధీనంలో ఉన్నాయి. మిమ్ములను ఎవరైనా ఏదైనా అంటే ఈశ్వరుడే అనిపిస్తున్నాడు. మనం అసలు లేము భగవాన్ ఎక్కడికి వెళ్ళాలి అని సందేహం వస్తే 'అరుణాచలం, అరుణాచలం' అనే స్ఫురణ వచ్చింది. అంటే ఆడించేవాడు ఒకడు ఉన్నాడని అర్థం. అందరికీ సత్యాన్ని తెలుసుకోవాలని ఉంది ఎలా అంటే అహంకారంతో తెలుసుకోవాలని ఉంది, ఇదే అజ్ఞానం నీకు తాడులో పాము ఎలా కనిపిస్తున్నదో బ్రహ్మంలోనే అహంకారం కనిపిస్తున్నది. ప్రపంచంలో అన్నింటికంటే గొప్పది శాంతి. లౌకిక ప్రేమలో లోతు ఉండదు, అరికాళ్ళు కూడా తడవవు. అది సముద్రంలా ఉండదు. జ్ఞాని ప్రేమ సముద్రం.

14. అసత్యం లోపలే సత్యం ఉంది. అసత్యం అంటే "నేను" వెనుకే నిజమైన సత్యం ఉంది. మిధ్యా జ్ఞానం తొలగిస్తే గాని జ్ఞానం రాదు. అజ్ఞానం ఉన్నవానికి ఆవరణ ఉంటుంది. ఆవరణ జ్ఞానం లేకుండా నశించదు. నీ తెలివి, నీ ఇంద్రియాలు, నీ మనస్సు నీ నైపుణ్యం అన్ని హృదయాభి ముఖంగా ప్రయాణమయితే నీ లోపల ఉన్న సత్య పదార్థం లభ్యమౌతుంది. జ్ఞానము, జ్ఞానము గలవాడు ఒక్కడే, వేరు కాదు. మనలో అధిష్ఠానమైన ఒక సద్వస్తువు ఉంది దాని వలననే లోకాన్ని చూడగల్గుతున్నాము. మాటలకు ఆటుపోట్లు ఉంటాయి. కాని మౌనం, సైలెంటుగా, నిదానంగా ప్రవహించే జ్ఞాన స్రవంతి. ప్రేమ-దయ-కరుణ వల్లనే జ్ఞానికి మాటలు వస్తాయి. మనం ఆత్మకు దూరంగా ఉంటున్నాము లోకానికి దగ్గరగా ఉంటున్నాము. ఆత్మ అంటే యధార్థము. మనస్సును, ఇంద్రియాలను నియమించుకొంటే ఆత్మ వ్యక్తమౌతుంది. ఆత్మ దర్శనం జరిగే వరకూ కోరికలు ఆగవు. వేద పారాయణం చేస్తే మటుకు కుక్క బుద్ధిపోతుందా! నిజాన్ని గౌరవించండి, ఆత్మను గౌరవించండి. తాత్కాలికంగా మాట్లాడడానికీ శరీరాన్ని ఉపయోగించుకొంటుంది ఆత్మ. అవతార పురుషులు, గురువుల ద్వారా, ఆత్మ శాస్త్రాలలో దొరకదు కాని దారి చూపిస్తుంది. ఆత్మ నీలోనే ఉంది. సత్య నిగ్రహం అంటే సత్యాన్ని అంటిపెట్టుకొని ఉండటం, మనకు ఆగ్రహం ఉంది కాని సత్య నిగ్రహం లేదు. పుస్తకాలు చదివి ఆత్మను తెలుసుకోవటం అనేది వెర్రితనము మీలో వాసనలతో కూడిన విషపూరితమైన మూకిడి ఉంది. దాన్ని తియ్యండి లోపల అమృతం ఉంది అందులో దేవతలు లేరు, లోకాలు లేవు. అంతా ఆత్మే అద్వైత అనుభవాన్ని భగవాన్ అక్షరమణ మాలలో చెప్పారు అది స్తోత్రంకాదు. పుస్తక పాండిత్యం వలన ఆత్మానుభవము కలుగుతుంది అనుకోవటం ఎలాంటిది

srinannagaru.com

అంటే ఫోటోలో ఉన్న చంద్రుని వల్ల వెలుగు, చల్లదనం రాదు. నిజ చంద్రుని చూస్తేనే వెలుగు, చల్లదనం వస్తాయి. నిజమైన జ్ఞానం పొందినప్పుడే శాంతి, సుఖం కలుగుతాయి.

15. గెడపదాటలేని వారు కొండను దాటగలరా! మతాలలోను, కులాల లోను కూరుకుపోయిన మనం ఆత్మను తెలుసుకోగలమా! యోగ్యత కావాలి. భౌతిక వస్తువుల మీద మనకు వ్యామోహం పోకుండా మనం ఆత్మను తెలుసుకోలేము. గాదిలో ధాన్యం తీసి అవసరం వచ్చినప్పుడు ఆడించుకొంటాము. అంతా ఒక్కసారే ఆడించేయము. అలాగే భగవంతుడు మన కర్మలను అన్నీ ఒక్క జన్మలోనే పెట్టడు. కొంత కొంత సమకూర్చి పంపుతాడు భూమి మీదకు. ఆత్మ తెలిసాక ప్రారబ్ధం నిలవదు. ఈ ప్రపంచం ఒట్టి గడ్డి అందులో సారం లేదు. ఆత్మలోనే సారం ఉంది. నీ శరీరం కాలానికి లొంగి ఉంటుంది. ఆత్మ కాలానికి లొంగదు. గొప్ప లోభి అయినా ఎప్పుడైనా ఒక పైసా వదిలిపెట్టవచ్చు, పోగొట్టు కోవచ్చు కాని ఆత్మ మనలో ఉన్న చిన్న చిన్న వాసనలను కూడా రికార్డు చేసి తదుపరి జన్మలలో ఫలింప చేస్తుంది. ఉపాధిని సున్నా చేస్తే ఉన్నది ఆత్మే. ఆత్మభోగం వంటి భోగం ఈ సృష్టిలో ఎక్కడా లేదు. మనస్సు ఒక్కసారి హృదయంలో ప్రవేశించిందంటే తిరిగి ప్రకృతి ప్రవాహంలో పడిపోవటం జరుగదు.

స్వరూపం ఎప్పుడూ "అరూపమే". ఈ జన్మకైనా, గతజన్మకైనా, రాబోయే జన్మకైనా పారమార్థిక సత్యం ఒక్కటే అదే ఆత్మ. బ్రహ్మమే "మాయ"కు కనబడి నప్పుడు దేవుడంటాము. చనిపోయిన తరువాత దేహం లేకపోవటం కాదు ఇప్పుడూ నీకు దేహం లేదు. నీవు ఆత్మవు, నీ అహంకారానికే దేహం. ఇది పంచ భూతాలతో తయారైనది. ఆత్మకు శరీరానికి ఇసుమంత సంబంధం లేదు. సంబంధం ఉంటే స్మశానంలో అది కూడా కాలిపోవాలి. దేవుడికి మొదటి పేరు. "నేను ఉన్నాను" అనేదే. తరువాత రాముడు, కృష్ణుడు మొదలైనవారు ఉండటమే దేవుడు. పూరీజగన్నాథుడికి కళ్ళు మాత్రమే ఉంటాయి, చేతులు ఉండవు. కారణం ఏమిటి అంటే ఆయన సాక్షి గోపాలుడు వారు తాకరు, తాకితే చేతులు కావాలి. భగవంతుడు సాక్షిగా ఉంటాడు. సాక్షిగోపాలుడు అంటే ఆత్మే.

16. "ఆత్మ" అమృతం. కాని మనం అంత వరకూ వెళ్లలేకపోవచ్చు కనీసం ఆలోచించండి. ఆత్మను గురించి ఆలోచించటం కూడా అమృతమే దానినే "ఆలోచనామృతం" అంటారు. ఎక్కడ నుంచి తలంపు, మాట వస్తున్నది అని ఆలోచించటమే మౌనం. నిరంతరం ఆత్మ చింతన చేస్తు ఉంటే మౌనం

srinannagaru.com

కుదురుతుంది. మేఘం అడ్డు రావటం వలననే సూర్యుడు కనిపించక పోవచ్చును కాని ఆ సూర్యుని వెలుగు వల్లనే ఆ మేఘం కనబడుతున్నది. అలాగే మన హృదయంలో ఉన్న పరమాత్మ "మాయ" వలన అనుభవంలోకి రాలేక పోయినా బ్రహ్మం వలనే ఇంద్రియాలు మనస్సు పనిచేసి ప్రకృతి తెలియబడుతున్నది. కుండలో కనిపించే ఆకాశం, మహాకాశంలో భాగమే కాని నీవు ఏమను కొంటున్నావు బ్రహ్మంనే జీవుడు అనుకొంటున్నావు. కృష్ణుడే దేవుడు అల్లాయే దేవుడు. ఏసే దేవుడు అనే వారికి జ్ఞానంరాదు. బ్రహ్మ ఒక రూపానికి పరిమితం కాదు. అటు వంటి ఆలోచన గల వాళ్లను, రంపం పెట్టి కోసినా బ్రహ్మతత్వం వారికి తెలియదు. దేవుడు గుడిలో ఉన్నాడు అనే భక్తి ఒకటవ తరగతి భక్తికి చెందినది. అలాగే ఆత్మానుభవం వచ్చిన తరువాత నాలో ఉన్నదే ప్రకృతిలో ఉన్నది అనే అనుభవం వస్తుంది అది ఉన్నత తరగతికి చెందినది. ప్రతీ సంయోగంలోనూ వియోగం ఉంది. ప్రతీ అనుబంధంలోనూ వియోగం ఉంది. ఒక్క ఆత్మలో వియోగం లేదు. స్వరూపం అంటే స్వంతరూపం దాన్ని గుర్తించేవరకూ శోకం తప్పదు. అలవాట్ల యొక్క వేగం, వాసనల యొక్క వేగం వలననే ఆత్మ తెలియటం లేదు. పండితుడు పాండిత్యం మీద, రీజన్ మీద ఆధారపడతాడు, పామరునకు ఏమీ తెలియదు, కాబట్టి ఆత్మ ఇద్దరికీ తెలియదు. లోకంలో అన్నింటికన్న చౌకైనది కోరిక. ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా వచ్చే కోరికలు ఇవి. ఇవే మనలను కాల్చివేసేవి. ఈ ప్రపంచంలో కోరదగ్గ వస్తువు ఏముందో చెప్పండి? ఆత్మ తప్ప మన జీవితాన్ని పరిమితం చేసేది మన మనస్సే. ఈ ప్రపంచంలో పవిత్ర మైనది, పొందదగినది ఏమీ లేదు. ఆత్మ కంటే గొప్పది ఏదీ లేదు.

17. ఒక వెర్రిబాగుల బ్రాహ్మణుని యజ్ఞం కోసం సంతకు వెళ్లి మేకను కొనుక్కొని రమ్మనమని పంపించారు. మేకను కొని తోలుకొని వస్తుండగా కొంటెవారు కొందరు కాచి, నాలుగు కూడళ్లలోనూ ఒక్కొక్కరు ఉండి పథకం ప్రకారం ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నారు. "అయ్యా! కుక్కను తోలుకొని వస్తున్నారు ఏమిటి?" అనగా బ్రాహ్మణుడు "ఇది కుక్క కాదు, మేక" అని వాదించసాగాడు. చివరి వాడి వద్ద కూడా కుక్కయే, మేకకాదు అనగా నలుగురు అబద్ధమాడతారా అని అనుమానించి మేకను వదలగా వారు దాన్ని తోలుకు పోయారు. అలాగే మనం ఆత్మలమే కాని అనేక జన్మలనుంచి, ఈ దేహం నీవు, ఈ పేరు నీవు, ఈ కులం నీవు అని అందరూ అనేస్తున్నారు. మనం అలాగే అనుకొంటున్నాము. నిజంగా మేకను కుక్క క్రింద తయారుచేసారు. అలాగే ఆత్మను శరీరంగా భావిస్తున్నాము. ఆత్మలో ఉన్న శాంతిని చూచిన తరువాత ప్రకృతి శాంతి కోసం

srinannagaru.com

వెదకరు. కొంతమంది జీవితాలు గౌరవాల కోసం తగలేసుకొంటారు. చివరకు ఆ గౌరవం అబద్ధమని చచ్చిన తరువాత తెలుస్తుంది. ఆత్మకు గౌరవం ఏమిటి? అహంకారానికి గాని ప్రతీవారు వారికి గొప్ప గౌరవం ఉంది అంటారు. అంటే మీ ఆత్మ కంటే మీకు ఆ గౌరవం ఎక్కువగా కనిపిస్తున్నదా? మీరు సంపాదించుకొన్న గౌరవం ఇదే పెద్ద "మాయ". మన స్వంత ఇల్లు ఆత్మ. ఆ స్వంత ఇంటికి వెళ్ళే వరకూ శరీరాలు మారాలి, కొంపలు మారాలి, మనిషి యొక్క స్వరూపం, ప్రపంచం యొక్క స్వరూపం ఆత్మ. ఎవరైనా ఇత్తడి వస్తువులను చూచుకొని బంగారం అనుకొని, నిజమైన బంగారు వస్తువులను ఇత్తడి అనుకొని బయట పడేస్తే తెలివి తక్కువ వాళ్ళు అనుకొంటాము. అలాగే మనం భోగ కోరికలను దాచుకొని ఆత్మను వదిలేస్తున్నాము. నిప్పులోంచి వేడిని ఎలా వేరు చెయ్యలేమో అలాగే దేవునిలో శాంతి ఉంది, సుఖం ఉంది దాన్ని వేరు చెయ్యలేము. అది నీవై యున్నావు. బ్రహ్మానుభవం పొందిన వారికి మాత్రమే శాశ్వత శాంతి కలుగుతుంది.

18. శరీర సౌందర్యం మన కళ్ళతో చూస్తున్నాము. అలాగే మన మనస్సు యొక్క సౌందర్యం చూడలేనప్పుడు దానికి ఆధారంగా ఉన్న ఆత్మ ఎలా తెలుస్తుంది. సత్యమే సౌందర్యం మనస్సుకు, మాటకు అందని కొండే శివుడు అదే తిరువన్నామలై సంసారంలోని, సాధక బాధలు ఎన్నో మీరు పడుతున్నారు కాని అవి అన్నీ ఆత్మానుభవంలో అన్నీ వట్టివి అయిపోతాయి. కాల ప్రవాహంలో అడ్డు నిలిచేది ఈ సృష్టిలో ఏదీ లేదు ఒక్క బ్రహ్మం తప్ప. బ్రహ్మం వ్యక్తమయ్యే వరకూ కోరికలు, వ్యసనాలు వెంటాడుతాయి. అద్వైతమే సత్యం, "ప్రాణి-ప్రాణం" ప్రాణి అంటే జీవుడు, ప్రాణం అంటే ఆత్మ. జీవుడికి స్వతంత్ర సత్తాలేదు, ఆత్మకు ఉంది. అనుభవం అనేది మనస్సుకు సంబంధించినది కాదు, ఆత్మకు సంబంధించినది. ఎనర్జీకి కూడా మూలం ఆత్మే. ఆత్మగా ఉండటం అంటే నీవు ఆత్మవైతేనే అలా ఉండగలరు లేకపోతే ఉండలేరు. జన్మలు పారమార్థిక సత్యం కావు వ్యవహారిక సత్యం మాత్రమే ఆత్మే పరామార్థిక సత్యం. అజ్ఞానం వాసన రూపంలో ఉంది. వాసననశిస్తేగాని అజ్ఞానం నశించదు. తలంపు వాసనలోంచి వస్తుంది. అజ్ఞానం నశించిన వెంటనే మీ స్వరూపం మీకు వ్యక్తమౌతుంది. అప్పుడు మీకు అభయస్థితి కలుగుతుంది. అప్పుడు మీకు శరీరం లేదు, ఇతరులు లేరు. మనస్సు-దేశం, కాలం అని పరిమితులు తీసుకొని వస్తుంది. ఆత్మలో పరిమితులు లేవు. అది కేవలం వెలుగే, ఆనందమే దానికి దుఃఖం లేదు. మనం పరిణామంలో దుఃఖాన్ని కలుగజేసే సుఖాలను కోరుకొంటున్నాము. ఆత్మలో పరిణామం లేదు. ఆత్మ వస్తువు మీకు లభ్యమైనప్పుడు ఏమిటి ఈ శాంతి ఎక్కడి నుంచి వస్తున్నది అని

srinannagaru.com

మీకు ఆశ్చర్యము కలుగుతుంది. నిన్ను నీవు తెలుసుకొన్నాక తెలుస్తుంది. అంతటా ఉన్నదే నాలో ఉంది. నాలో ఉన్నదే అంతటా ఉంది. అదే సద్వస్తువు. మన కంట్రోలరు మనలోనే ఉన్నదనే గుర్తింపే రావటం లేదు. కారణం దేహాత్మ బుద్ధి వల్ల సత్యం-శివం-సుందరం అనేది ఒక్కటే నీకు అర్థమవ్వటం కోసం అలా అన్నారు.

19. ఆత్మ విద్య నేరుగా మోక్షాన్ని కలుగజేస్తుంది. దేవుని దయ కలిగితే ఆయన అనుగ్రహం కూడా కలుగుతుంది. ఆత్మే దేవుడయ్యాడు, ఆ దేవుడే గురువయ్యాడు, ఆ గురువే ఆత్మ రూపం ధరించాడు. అట్టి ఆత్మను నీవు అనుభవంలోకి తెచ్చుకొంటే ఆ ఆత్మే నీవు అవుతావు. భగవంతుడు ఒక్కడే, నిజం ఒక్కటే. ఆత్మ సుఖం తరగని సుఖం. నేచురల్ స్టేట్‌లో ఉండాలంటే "నేను ఉన్నాను" అనే స్థితిలో ఉండాలి. స్త్రీని అనిగాని, పురుషుడను అనిగాని, పదవిలో ఉన్నాను అనిగాని, హోదాలో ఉన్నానుఅనిగాని తాదాత్మ్యం చెందకుండా "ఉండాలి". మేధస్సుకు అతీతంగా ఆత్మ ఉంది. మంత్రుల దగ్గర ఉన్న పోలీసులు మంత్రులు చెప్పినట్లు ఉంటారు, ఆ పోలీసులే దొంగల దగ్గర ఉంటే వారిని తమ అదుపులో ఉంచుకొంటారు. అలాగే ఆత్మ తెలిసిన వారికి వారి మనస్సు అదుపులో ఉంటుంది. తెలియని వారు మనః పరిధిలోనే అసహాయంగా జీవితాన్ని వెళ్ళబుచ్చుతాడు.

శబ్దం, అర్థం వేరు కాదు. అలాగే శివుడు ఉన్నచోట శక్తి ఉంటుంది. అనామంగా, అక్షయంగా, అరూపంగా, అవ్యక్తంగా ఆత్మ ఉంది. అది నీ మనస్సుకు అందదు, నీ అనుభవానికి అందుతుంది. దృఢ మనస్సు, అల్ప మనస్సు మీద పనిచేసి ఫలితాన్ని ఇస్తుంది. మంచి స్నేహితుల వలన మంచి, చెడు స్నేహితుల వలన చెడ్డ వస్తుంది. సింపుల్‌గా ఉన్న ఆత్మ, నీ బ్రెయిన్‌ని గందరగోళం చేస్తున్నది. ఆడంబర జీవితానికి ఆత్మ తెలియదు. అంతా ఉన్నది ఆత్మే. ప్రపంచం కూడా ఆత్మతో కప్పబడి ఉంది. మాట్లాడినా, మాట్లాడకపోయినా సమాధే. నడిచినా, కూర్చున్నా శరీరం ఉన్నా లేకపోయినా ఆనందమే. అదే స్వర్గ రాజ్యం అదే మీరు. ఆత్మ సుఖం ఎలా ఉంటుంది అంటే ఎంత అనుభవించినా కొరత లేనిది, పుట్టని సుఖం, పూర్ణ సుఖం అది ఆత్మ సుఖం. దేవుడు అంటే శాంతి, సుఖం ఆనందం. విషయ జ్ఞానం వేరు బుద్ధిని నశింపచెయ్యదు. భూమావిద్య (ఆత్మవిద్య) నేర్చుకొంటే అనవసరపు తలంపులు నిన్ను పీడించవు.

20. మమకారం హృదయ వికాసాన్ని ఆపు చేస్తుంది. ప్రేమ హృదయ వికాసాన్ని పెంచి, చైతన్య స్థాయిని పెంచుతుంది. స్థిత ప్రజ్ఞుడు అంటే స్థిరమైన బుద్ధి గలవాడు. నిజంలో ఉండటం నేర్చుకొంటే నిజం తెలుస్తుంది. శంకరులు

srinannagaru.com

ఈ లోకం నిజం అని ఎందుకు అనలేదు అంటే నిజమంటే నీ మనస్సు రంపం పెట్టి కోసినా లోపలికి వెళ్ళదు. నిన్ను నీవు చూచుకొని లోకాన్ని చూస్తే లోకం నీకు భిన్నంగా లేదని గ్రహిస్తావు. రజోగుణం ఉన్నా వాడికి గురువు ఎంత మంచి మాట చెప్పినా, పెడర్థాలతో, వికృత అర్థాలు కల్పించుకొని పాడౌతారు. మిథ్యా నేను నిజంగా లేదు-ఉంది అని అనుకొంటున్నావు కాబట్టి తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. చిన్న నేను విడిచిపెట్టకుండా పెద్ద నేను ఎలా తెలుస్తుంది. వాడు కొట్టాడు, వీడు తిట్టాడు అనుకొంటే వాడి మీద కోపమే తిరిగి భూమి మీదకు తీసుకొని వస్తుంది. నీవు వాడిని క్షమించలేకపోతే భగవంతుడు నిన్ను ఎలా క్షమిస్తాడు. అంటే నీకు మోక్షసామ్రాజ్యం ఎలా సంప్రాప్తమౌతుంది. ప్రతీవాడి అహంకారం వాడి శరీరాన్ని అంటిపెట్టుకొని ఉంటుంది. నల్లగా ఉన్నాడు, పొడుగ్గా ఉన్నాడు అన్నా, అంతా బాధే అందంగా ఉన్నారు అంటే పొంగు వస్తుంది. తరువాత కుంగు తప్పదు. కృష్ణుని నల్లగా ఉన్నావన్నా దుఃఖం రాలేదు కారణం తాను శరీరం కాదని ఆయనకు తెలుసు. మరుపు జ్ఞాపకం మనస్సులో ఉన్నాయి. మనం దృశ్యాలను చూచేటప్పుడు మైండ్ విషపూరిత మౌతుంది. వ్యక్తి భావన లేకుండా పని చెయ్యండి. మనస్సుతో యుద్ధం చేస్తే అది బల పడుతుంది. నీవు నీవుగా ఉండు, అహంకారం పత్తా లేకుండా పోతుంది. మీకు గతించిన విషయాలు, విషయ వాసనలు జ్ఞాపకమొస్తే మీరు పూర్తిగా మాయలో ఉన్నట్లే లెక్క. సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా తలంపే, చావు, పుట్టుకా అన్ని తలంపులే, వాటికి ఆధారంగా దేహమే “నేను” అనే మొదటి తలంపు ఉంది దాన్ని పరిష్కారం చేసుకోవాలి. మనం రాష్ట్రపతి చేసినా అదీ తలంపే, ఇవి అన్నీ గెంటుకుంటూ ముందుకు వెళ్ళినప్పుడు సత్యం తెలుస్తుంది. తోలు బొమ్మలాటలో కూర్చున్నవాడు సత్యాన్ని తెలుసుకోలేడు. బ్రహ్మస్థితి వచ్చినప్పుడు ఇది తలంపుకాదని తెలుస్తుంది.

21. కృతజ్ఞత ఆశించినప్పుడు వ్యక్తి భావన బల పడుతుంది. కొన్ని కొన్ని స్నేహాలు చేస్తే మంచిని పొందలేము. అసూయను మనకు కలుగచేస్తారు. వాళ్ళను అలా అనుకోవటం మనదే పొరపాటు. కారణం వాళ్ళ దగ్గర ఉన్నది అదే. అదే ఇస్తారు మనకు. మమకార లక్షణం ఎలా ఉంటుంది అంటే మీ డబ్బును మీ సంతానం అనేక వ్యసనాలతో ఖర్చుపెట్టి పాడుచేసినా అది పది కోట్ల రూపాయలు అయినా మీరు ఇష్టపడతారు. కాని పరోపకారం చెయ్యటానికి ఇష్టపడరు. అదే మమకారం. రజోగుణం ఉన్నవాడు బయటికి శుచిగా ఉంటే చాలు అను కొంటాడు. సత్త్వ గుణం ఉన్నవాడు లోపల మనస్సు శుభ్రంగా ఉంటేచాలు అనుకొంటాడు కాని బయట, లోపలా శుభ్రంగా ఉండాలి. ఇంగ్లాండుకు రాజు

srinannagaru.com

కాబోయే ఒకాయన ఫ్రాన్స్ దేశ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయిస్తే ప్రజలు అలాచేస్తే మీరాచరికానికి దూరమౌతారు అని హెచ్చరించినా పెళ్ళి చేసుకొని పదవిని వదలుకున్నాడు. కారణం వాసన యొక్క బలం అటువంటిది. మనం అనుకో వచ్చును ఏమిటీ పిచ్చి పని చేసాడని. వాసన యొక్క బలం అంతగా ఉంటుంది. మనలో అజ్ఞానం ఉంటే ఎదుటి మనిషిలో ఎంత జ్ఞానం ఉన్నా మనం ఎంత ప్రయత్నించినా అర్థం కాదు. కారణం అజ్ఞానం అటువంటిది. మనస్సు తనలో ఉన్న భోగాలను అనుభవించటానికి తన ప్రాణాన్ని కూడా తెచ్చు కొంటుంది. మనస్సుతో నేర్చుకొన్నది ఏదో ఒక రోజున మర్చిపోవాలి, ఆరోజు వస్తుంది. తత్త్వం చిత్తం యొక్క మూలంలోనే ఉంది. అహంకారమే నీవు అనుకొంటున్నావు ఎప్పడైనా కొంతసేపు మర్చిపోయినా తిరిగి మర్చిపోలేకపో తున్నావు. దొంగ నేను అసలు లేనేలేదు. కాని అది నీలో తొంగిచూచినట్లు అని పిస్తే దాన్ని గుర్తించు, లేనిదాన్ని ఉంది అనుకొన్నాము అదే అవిద్య. ఖురాన్‌లో ఒక కథ ఉంది. ఒక గ్రామంలో సత్త్వగుణం ఉన్నవాడు కొన్ని గంటలలో చనిపోతా డనగా గ్రామస్తులు వాని వద్దకు వెళ్ళి నీ జీవితంలో నీవు ఎంతో ఓర్పుగా జీవించా వని ఎన్నో రకాలుగా శ్లాఘిస్తే ఆయన ఇలా అంటాడు "అలా నన్ను అనకండి. నా ముక్కులో గాలి పోయిన తరువాత అనుకొంటే అనుకోండి. ఏమో 'మాయ' నన్ను ఏ క్షణంలోనైనా వశం చేసుకోవచ్చును" అన్నాడు. ఆయనలోని ఔన్నత్యాన్ని మనం వశం చేసుకోవాలి. మాయ ద్వంద్వాల మధ్య తిరుగుతుంది. అంత బలీయమైనది.

22. మనిషిని మసి చేసేది కోరిక, కోపము. స్వార్థంతో చేసిన కర్మ నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుంది. అది దుఃఖం తీసుకొని వస్తుంది. అన్ని పాపాలకంటే మనిషిలో ఉన్న స్వార్థమే పెద్దపాపం. నీ మనస్సు యొక్క పీడ, రోత ఎంత వరకూ తొలగించుకొంటున్నావు అనేదే ముఖ్యంగాని, నదీ తీరాలలోను, అడవిలోనూ సాధన చేద్దామనేది ముఖ్యం కాదు. మనస్సు వదిలించుకొంటే పునర్జన్మ లేదు, మీ సాధన నిజమైతే తడి గుడ్డను పిండితే నీళ్ళు ఎలా రాలతాయో అలాగే నీ మనస్సులోని వాసనలు రాలిపోతాయి. సాధన ఎప్పడో చేసుకొందాము అనుకోవటం నీ అజ్ఞానానికి, మూర్ఖత్వానికి కొండగుర్తు. మనస్సు సాధనను వాయిదా వెయ్యమని చెబుతుంది. అదే మాయ. అహంకారం ఎక్కువగా ఉన్న వారు నరకానికి వెళ్ళకుండానే ఇక్కడే నరకం అనుభవిస్తారు. వారిని బాగు చెయ్యాలని అనుకొన్నా బాగుచెయ్యలేము. అహంభావన ఉన్నా వాడు మనిషి అది లేనివాడు ఋషి. అహంభావనకే మరోపేరు ప్రపంచం. మరో పేరు సృష్టి.

srinannagaru.com

ఐన్‌స్టయిన్ అంటారు "మనిషికి వాడి మూర్ఖత్వం మీద ఉన్న నమ్మకం ఉంది గాని, దేవుని మీద నమ్మకం లేదు" సత్యాన్ని ఆచరించేవారికి సమ బుద్ధి కలుగుతుంది. నేను-నేను అనే అహంకారంతో మిడిసి పడుతున్నావు ఆ "నేను" మీద దుమ్ము చల్లు. అంతే గాని అలంకరించకు. అలా చేస్తే ఎలాపోతుంది. కృత్రిమమైన అలవాట్లలో పడిపోతున్నారు. దాన్ని తొలగించుకోవాలి. నీ మనస్సు అటూ-ఇటూ పోతూ ఉంటే స్థిరత్వంగా ఉన్న మనస్సు గల వారితో సహవాసంచేస్తే స్థిరత్వం వచ్చి శాంతిని అనుభవిస్తావు. మనస్సు అంటుంది. "ధ్యానం చేసుకో, ధ్యానం చేసుకో" అని అదే ఆటంకమని మనకు తెలియనియ్యదు. నీరు, నీరులో కలిపినట్లు, నెయ్యి నెయ్యిలో కలిపినట్లు, పాలు-పాలులో కలిపినట్లు నీ మనస్సు నిర్మలమై, పవిత్రమైతే స్వచ్ఛంగా ఉంటే ఆత్మలో కలిసిపోతుంది. మనస్సుకు రూపాలంటే ఇష్టం. దేవాలయాలలో ఒక షేపులో ఉన్న దేవుడు కావాలి. మనస్సు ఉన్నంతకాలం ఆకారాలు లేని దేవుణ్ణి ఊహించలేము. అహంకార భావన పెరిగే కొలది, నీచమైన తలంపులు క్షుద్రమైన తలంపులు వస్తాయి. వారికి వచ్చే కలలు ఇతరులతో చెప్పకోలేని విధంగా ఉంటాయి.

23. కుంకుమ తెప్పించటం, విభూతి తెప్పించటం జ్ఞానం కాదు. అలాగే కడుపు నొప్పి తగ్గించటం జ్ఞానం కాదు. తగ్గితే తగ్గవచ్చు అది జ్ఞానం కాదు. అలాగే గోడలోంచి విభూతి తెప్పించటం, చనిపోయిన మనిషిని బ్రతికించటం జ్ఞానమా? నీ గురించి నీకు తెలియనప్పడు ఈ బుడబుక్కల కబుర్లు నీకు ఆకర్షణగా ఉంటాయి. అవి పారమార్థిక సత్యాలు కావు. వ్యవహారిక సత్యాలు మాత్రమే. ఇలాగే, ఫొటోలోంచి, కుంకుమా పసుపు రాలింది అనుకోండి. వారు కొనుక్కోనక్కరలేదు. మనం ఒక రూపాయి పెట్టికొనుకొంటాము. అంతకన్న ప్రయోజనం ఏమిటి? జ్ఞానులలో భోదించేవారు ఉంటారు. కాని ఒక ప్రక్క బోధిస్తూ, అనుగ్రహించే వారు చాలా తక్కువగా ఉంటారు. అటువంటివారిలో బుద్ధుడు, రమణుడు. శంకరాచార్యుల వారు చెందుతారు. మానవ జాతిమీద అత్యంత ప్రేమ గలవాడు తప్ప టీచరుగా పనికిరాడు. ఆత్మానుభవం పొందిన వారు మాత్రమే టీచరుగా పనిచెయ్యగలడు. పరమహంసగారిలాంటివారు బాగు చెయ్యటానికి పనికి వస్తారు. నిజాయితీ గల డాక్టరు బాగా ముదిరిన కేసైనా "సాయశక్తులా ప్రయత్నం చేస్తాను" అంటాడు. నా దగ్గరకు రావద్దు అనరు. అలాగే వ్యక్తి ఎంత అజ్ఞానంలో ఉన్నా ఏ జ్ఞాని తన వద్దకు రావద్దు అనడు. తలంపులతో మన బరువు మనం మోస్తున్నాము. జ్ఞాని బరువు ఈశ్వరుడు మోస్తాడు. జ్ఞాని శరణాగతిలో ఉంటాడు కాబట్టి. తల్లితండ్రుల రుణం తద్దినాలు

srinannagaru.com

పెట్టి తీర్చుకోవచ్చును గురు రుణం ఆయన చెప్పింది. నిజంగా అర్థం చేసుకొని ఆచరించినప్పుడే నాకు శివ, విష్ణు రామాలయాలకు వెళ్ళినప్పుడు నమస్కారం పెట్టాలి అనిపిస్తుంది. సుబ్రహ్మణ్య స్వామి కోవెలకు వెడితే నమస్కారం పెట్టాలి అనిపించదు. మన ఇంట్లో వారికి మనం నమస్కారం పెట్టటమేమిటి? అని బహుశా నాకు వారికీ ఉన్న సంబంధం అటువంటిది కావచ్చును.

# 3. మనస్సు, అహంకారం

తలంపుల సమూహమే మనస్సు. "ఆశ" అజ్ఞానం వలన కలుగుతుంది. రూపగర్వం, విత్తగర్వం, విద్యాగర్వం, మనిషిని కృంగదీస్తాయి. మరుజన్మ నీచ జన్మ వచ్చి చీకటిలో పడతారు. ఏ అపనింద వచ్చినా నేను గౌరవస్తుడిని అనుకోవటం వలననే వస్తుంది దుఃఖం. విక్షేపాన్ని విసిరి వెయ్యండి. చూపులోను తలంపులోను, చేతలోను కరుణ ఉండాలి. అలవాటు, అభ్యాసం లేకపోతే "నేను ఎవడను?" అనే ప్రశ్న వింతగా ఉంటుంది. తలంపులను రాసి రంపాన్ని పెట్టాలి. మూలాన్ని వెదకాలి. పూర్వజన్మ సంస్కారం లేకపోతే తలంపు రానేరాదు. అవమానం వలన మనిషి సూపర్ మేన్ అవుతాడు. భయపడితే దుఃఖం వస్తుంది. కోపం వస్తే అది కోపం కాదు అడుగున కోరిక ఉంది. కోరిక వల్లనే కోపం వస్తుంది. మీలో ఉన్న శాంతి మీ పరిసరాలను శాంతపరుస్తుంది. ఒక్క కోరిక మీలో ఉంటే ఎన్నో చెడ్డ లక్షణాలను తీసుకొని వస్తుంది. జన్మే-ద్వైతం. మీ బిడ్డలు భాగ్యవంతులు కావాలని, డాక్టర్లు కావాలని, పదవులు చెయ్యాలనీ కోరుకొంటున్నారు గాని జ్ఞాని కావాలని ఎవరైనా కోరుకొంటున్నారా? మనం భట్టరాజులా రాముడు గొప్పవాడు అని చెప్పకోవటం తప్ప మనకు ఏమి కలసి వస్తుంది. కాని రామునిలా జీవిస్తే రాముని అంతవారమౌతాము. దేహ బుద్ధి గలవాడికే వైకుంఠం, కైలాసం కావాలి. ఆచారాలు, ప్రచారాలే మన గమ్యమా, ఆత్మానుభవమే మన గమ్యం. నీ మనస్సును చంపే వరకూ దుఃఖం నిన్ను వెంటాడు తుంది. యోగమంటే అజ్ఞానాన్ని తొలగించుకోవటం. కామించేవాడు ప్రేమించ లేడు. మీ మంచి ప్రవర్తన వల్లనే భగవంతుడు సంతోషిస్తాడు. కళ్ళు లేని కన్య, చేతులు లేని వ్యక్తి పెళ్ళి అయిపోయిన తరువాత నేను దాటిపోయాను అంటే, నేను దాటిపోయాను అని ఆనందించారు. కాని తరువాత తిప్పలు తప్పలేదు. అలాగే ఈ జన్మలో మనం చేసిన మోసాలు అనుభవించకుండా దాటిపోతున్నాము అనుకొన్నా రాబోయే జన్మలలో అనుభవించే తిప్పలు తప్పవు. అనుమానం మనిషిని పీడిస్తుంది. మీరు చేసే పనులలో లెక్కింపు ఉండకూడదు. పూర్వ వృత్తాంతమే

srinannagaru.com

పురాణం. పురాణాలతోనే కాలాన్ని గడపకండి. సత్యదర్శనమే మన గమ్యము.

2. ప్రతీ మనిషికీ కొన్ని దౌర్భాగ్యాలు ఉంటాయి. దానివలన కలిగే నష్టాలను మననం చేసుకొంటే గమ్యాన్ని చేరుతారు. దుర్బుద్ధితో కాకుండా మంచిగా చిన్న పనిచేసినా పుణ్యం వస్తుంది. అది కోరికతో చెయ్యకుండా ఉంటే మనస్సు శుద్ధి అవుతుంది. యోగమంటే మనస్సుకు శిక్షణ యిచ్చేది, సంస్కరించేది. గతంలో మనం నడక నేర్చుకొన్నాము అందుచేతనే బాగా నడుస్తున్నాము. అలాగే ధ్యానం ప్రాథమిక దశలో అవసరం. వాసన మొదట అణు రూపంలో ఉండి వాసనగా బయటికి వచ్చి తలంపుగా విజృంభిస్తుంది. దాన్ని మొదటలోనే అణచాలి. లోకం యొక్క ప్రయోజనం ఏమిటి? అంటే మీలో ఉన్న వాసనలు తెలియపర్చి అందుండి మనలను బాగుచెయ్యటానికి ఉపయోగపడుతుంది. లోకం బంధమా? కాదా? అనేది మనకు అనవసరం. దాని వలన బాగుపడతాము. నడవటానికి శక్తి అంతగా లేనప్పుడు కర్ర ఉపయోగిస్తాము. జపానికి దండలు కూడా అటువంటివే. తోటి మానవుని యొక్క అభివృద్ధియే కళ్యాణం. తన బాధలను దిగమ్రింగుకొని ఓర్పుగా ఇతరులకు ఉపయోగపడాలి. రాగం వలన చెడ్డను మంచిగా తీసుకొంటాము. అబద్ధాన్ని నిజంగా భావిస్తాము. అట్టివారి మనస్సు నిర్మలం కాదు. ప్రకృతి యొక్క వేగం తలంపుల యొక్క వేగం మన అధీనంలో లేవు. దేవుని మీద మీరు విశ్వాసం ఉంచుతున్నారు మంచిదే కాని మీమీద కూడా మీరు విశ్వాసం ఉంచుకోకపోతే దానివలన ప్రయోజనం అంతంత మాత్రమే. మీరు చేస్తున్న కృషి పట్ల విశ్వాసంతో భయం లేకుండా ఉండాలి. దుఃఖం వలన మంచి గుణాలు రాణించవు. భక్తి అభివృద్ధి అవ్వదు. ప్రతీ చిన్న విషయానికీ భయపడకూడదు. పాపాలను తగ్గించేవాడు యముడు. కాముడు పాపాలను పెంచుతాడు. దేన్ని గురించీ బెంగపెట్టుకోకండి ఈశ్వర నిర్ణయం ఎలా జరగాలో అలా జరుగుతుంది. అది ఎన్నటికీ మారదు. ఈ గంతు ఇక్కడ ఇలా వేద్దాం, ఆ గంతు అక్కడ అలా వేద్దాము అనుకొంటే సాధ్యంకాదు ఒకచోట తీసిన సినిమా ఎక్కడ వేసినా ఒకలాగే ఉంటుంది, మార్పు ఉండదు. ఇల్లు పరిసరాలు మార్చినా ఆ కర్మానుభవానికి తగ్గ మనుషులను అక్కడా సిద్ధం చేస్తాడు ఈశ్వరుడు.

3. మరణ కాలం మనకు పరీక్ష లాంటిది. సంవత్సరం పొడుగునా చదివి పరీక్షరోజున కంగారు పడి రాయలేకపోతే ఎలా ప్రయోజనం లేదో, అలాగే మన శరీర పతన కాలంలో భగవంతుని స్మరించపోతే మన జన్మకి కూడా అలాగే ప్రయోజనం లేదు. యజ్ఞయాగాదులు ఆత్మ స్మరణం కన్న ఎక్కువైనవి ఏమీ

srinannagaru.com

కావు. ద్వేషం నిప్పులాంటిది. మన మూర్ఖత్వం వలన ఎదుటివారి ఔన్నత్యాన్ని తెలుసుకోలేము. ఒక జ్ఞానిని స్మరిస్తే శాంతి వస్తుంది, అజ్ఞానిని స్మరిస్తే వికారం వస్తుంది. కారణం వారి స్వభావాన్ని బట్టి ఎవరైనా మిమ్ములను భక్తులుగా ఎగతాళి చేస్తే, వాళ్ళ అనుబంధం ఏ ప్రాంతంమీదనో, కుటుంబం మీదనో కూరుకొని ఉన్న వాడే అటువంటి బుడిబుడి మాటలు మాట్లాడేవారి మాటలకు మీరు కంగారు పడకండి. మీరు శాంతంగా ఉండి పాపంతో పోరాడాలి. పాపం అంటే అజ్ఞానం. మన సాధనలో మన కోరికలే దృష్టిలో ఉండటం వలన మన ప్రయాణం పడమర వైపుకే కాని మనం అనుకొంటాము ప్రయాణం తూర్పువైపుకు అని. దేహ ప్రారబ్ధం, దాని గతి అది చూచుకొంటుంది. ఆత్మను చూస్తున్న మీకు, మీకు కలిగే కష్ట నష్టాలు మీకు కనిపించవు. ఎందుచేతనంటే సూర్యునికి అభిముఖంగా ఉన్న వాడు తన నీడ తనకు కనబడని రీతిగా, భక్తి మనదే, శక్తి మనదే, కాని నమ్మకం కావాలి. గౌరవం గురించి మీరు మర్చిపోతే గౌరవం వస్తుంది. దేహబుద్ధి ఉన్న వానికి తప్పక కోరిక వస్తుంది. దానివలన ఒకరోజు, రెండురోజులు తృప్తిపడ్డాక దాని వలన మీ మనస్సు వికారం చెందకుండా ఉందా? లేదా? అని ఆలోచించండి, నెరవేరిన కోరిక వలన ఆశ కలుగుతుంది. నెరవేరకపోతే కోపం రగులుతుంది. శరణాగతి వలన మీ కర్మలు అనే తుపాకులు క్రింద పడిపోతాయి. చూచేవారికి కర్మలు అనుభవిస్తున్నాడు అని అనిపించవచ్చు కాని మీకు ఏ సమస్యలూ ఉండవు. సందేహం కంటిలో నలుసువంటిది. దూరదృష్టి-జ్ఞానదృష్టి లేని వానికి జన్మలు తప్పవు. యోగం మొదటలో చేదుగా ఉంటుంది, తరువాత తాపీగా శాంతంగా ఉంటుంది.

4. జ్ఞాని పట్ల, అవతార పురుషుని పట్ల మీకు ప్రీతి కలిగితే మీ జీవితం అంతా కళాత్మకంగా ఉండి జీవితమే మారిపోతుంది. ధనం లేనివాడు దరిద్రుడు కాడు, దైవనామాన్ని జపించనివాడే దరిద్రుడు. క్రమశిక్షణ గల హృదయం, క్రమ శిక్షణ గల భావాలు సద్వస్తువుకు దారితీస్తాయి. ఏ దుర్మార్గుడిని ద్వేషించకు ఎందుచేత వాడి గురించే ఆలోచిస్తే ఆ దుర్మార్గమే నీకు గతి అవుతుంది. తల్లి కడుపులోంచి జాగ్రత్తగా బయటికి వచ్చాము. కొంచెం ఇబ్బంది ఉన్నా ఆపరేషన్ చేసి బయటకి వచ్చాము. కాని అహంకారమనే కడుపులోంచి బయటికి రాలేక పోతున్నాము. పెద్ద వయస్సువారు, వారు మేము ఎంతో పక్వానికి వచ్చామని అంటారు, కాని వారి వాసనలు ముగ్గిన పండులో ఉన్న గట్టి గింజల్లా ఉంటాయి. అహంకారం అణిగి ఉంటుంది, అది విశ్రాంతి తీసుకొంటుంది. ఇంకా తీవ్రంగా విజృంభిస్తుంది. మీతో చేయరాని పనులు చేయిస్తుంది. అది కాలి బూడిద

srinannagaru.com

అయ్యే వరకూ దాన్ని నమ్మకూడదు. అణిగినప్పుడు బుద్ధుడికి దగ్గరైనట్లు ఉంటుంది. విజృంభించినప్పుడు రావణాసురుడికి దగ్గరౌతాము. మీ శరీరంలో ఉన్న పరమాత్మకు "నేను", "నేను" అనేదే ముడిపెడుతున్నది. నేను ఉన్నాను అని తెలుసు, కాని నా గురించి నాకేమీ తెలియదు. నేను+తలంపు=మనస్సు. ఎండ్రిన్ తాగమని మనస్సు చెబుతుంది శరీరంతో. పాపం శరీరం చనిపోతుంది, కాని మనస్సు చావదు. ఇదే మాయ. నేను-నేను అనేది తలంపే, దానికి పునాది లేదు. అది కల్పితం మాత్రమే. జ్ఞానికి నేను అనేది పాతాళ లోకానికి కూరుకు పోతుంది. ఇది ఇలా జరిగితే బాగుండును అది అలా జరిగితే బాగుండును అనిపిస్తూ ఉంటుంది మనస్సుకు. భయకారణమైన విషయాన్ని అహంకారం చూస్తూ ఉంటుంది. అందుకే భయమేస్తుంది. ప్రతీ మనిషికి ఈ సృష్టిలో సమస్య ఉంది. ఆ సమస్య "నేను" అనేది. దాన్ని ప్రతీవారు పరిష్కరించుకొంటే ప్రపంచంలో ఉన్న జీవులను బ్రహ్మంగా చూడగలవు, లేకపోతే చూడలేవు. మనస్సు కదిలితే సంసారం. దుఃఖం కూడా మనస్సు చేసే తుంటరి తనం. దానిని ప్రాథమికస్థాయి లోనైనా సందేహించండి అది అంతర్ముఖి మౌతుంది.

5. అన్ని సౌకర్యాలు మనకు ఉన్నా దుఃఖపడుతున్నాము. కారణం మనస్సే. రోజులు గడవటం లేదు, రోజులు బాధగా వెళ్లిపోతున్నాయి అనేది మనస్సే. గురు అనుగ్రహం కవచంలాంటిది, గొడుగులాంటిది. ఒక్కొక్క సమయంలో ఆరు అడుగుల మనషి కూడా నాలుగు అంగుళాల నాలికకి కృంగిపోతాడు. లోకం మాట అలా ఉంచండి ప్రతీ మనిషి, తన కుటుంబ సభ్యుల కన్న తాను గొప్ప అనుకొంటాడు. ఇదే అహంకారం, దేహం యొక్క అంతస్తు చూస్తున్నాము గాని, అహంకారం యొక్క అంతస్తు చూడలేకపోతున్నాము. అహంకారం నశిస్తే సూర్యుడు ఉదయించినట్లు. సుఖం మానవుని హృదయంలోంచి ఉదయిస్తుంది. అహంకారంలో మనం ఉండి అహంకారంలో సుఖం లేదు అనువానికి తెలియదు అహంకారం లేని వానికీ అహంకారంలో సుఖం లేదని తెలుస్తుంది. మనస్సు పనసకాయ నరికినట్లు, దేశమని, రాష్ట్రమని, జిల్లా అని గ్రామమని విభజిస్తూ ఉంటుంది. దేశభక్తి కూడా ఇటువంటిదే, మనోపరిధిలోనిదే, దేహము, మనస్సు, లోకము అనే మూడు నీడలను చూచి మనం భయపడుతున్నాము. కంగారు పడుతున్నాము. అహంకారం, నిర్మూలనకు ఎంత సాధన చేస్తున్నాము అనే విషయం అలా ఉంచండి అసలు అహంకార నిర్మూలనను మనం ఇష్టపడు తున్నామా? అనేది ముఖ్య విషయం. దేహాన్ని నిర్లక్ష్యం చెయ్యకండి, శాంతిని కోల్పోతారు, రోగాన్ని పొందుతారు. దేహబుద్ధిలోంచి బయటపడే మాటలు, చేతలు

srinannagaru.com

చేయటం మంచివి. దేహబుద్ధిని నశింప చెయ్యని మాటలు వ్యర్థం. "ఐ" సెన్స్ సే నాన్ సెన్స్. భేదబుద్ధి నశించే వరకూ మోక్షం కలుగదు. అహంకారం జలగలాంటిది. ఒక రూపాన్ని పట్టుకొని మరియొక రూపాన్ని వదలదు. బంధంలో ఉన్నాను అనుకోవటం, మోక్షం కావాలి అనుకోవటం నీ తెలివి. స్వచ్ఛమైన శాంతి పొందుతున్నారు అంటే దేవునితో పనిలేదు. శాంతిలోంచే శక్తి వస్తుంది. సమత, మమత లేకుండా మనస్సు అంతర్ముఖం కాదు. అసలు నేను బంధించదు. కృత్రిమమైన నేనే బంధిస్తుంది.

6. అహంకారం చెప్పే మాట మీరు వినకపోతే ఆ క్షణం నుంచి మీకు జ్ఞానం వచ్చేస్తుంది. మీ పూర్వ జన్మలో మీరు చేసుకొన్న పుణ్యమే నిజమైన చుట్టం. అదే మిమ్ములను సరాసరి ప్రేమించేది. మీ కంటికి కనిపించే చుట్టాలు మాయ చుట్టాలు. మనస్సు కూడా ఇంద్రియమే, అయితే బయటికి కనిపించదు. చూచే కన్ను, వినే చెవి, మనస్సు పనిచెయ్యకపోతే శబ్దాన్ని, రూపాన్ని చూడలేవు. నేను అనే తలంపు వేరు, మనస్సు వేరు. నా మనస్సులో లక్ష గొడవలు ఉన్నాయి అంటారు ఎన్ని ఉంటే నష్టం ఏమిటి? అది నీవు కాదు కదా! దాన్ని పెంచి పోషించుకొన్నది నీవే అంటారు భగవాన్. ఆ భారాన్ని అంతా భగవంతుని మీద పెట్టండి సుఖపడతారు. కామ, క్రోధ, లోభాలు కమేండర్సు వాటి వెనుక చిల్లరి కోరికలు ఉంటాయి. రాక్షస గుణాలన్ని ఈ మూడింటిలోనే పెట్టాడు భగవంతుడు. అహంకారం వలననే వ్యర్థమైన తలంపులు, చర్చలు వీటి వలననే జీవితాన్ని అంతం చేసుకొంటున్నాము. భయం కూడా వ్యర్థమైన కోరిక వలననే అది కూడా అహంకారమే. మానసిక, శారీరక శక్తులను నిరుపయోగం చేసుకోకూడదు. పెద్ద మర్రిచెట్టు యొక్క విత్తనం చిన్నదే. అలాగే ఈ నేను చిన్నదే దానిలో ఎన్నో గొడవలు, ఎన్నో తుఫానులు, దేశాల గొడవలు, రాజ్యాల గొడవలు పెట్టాడు భగవంతుడు. మీ పూర్వ జన్మ వైభవం గాని, మరొకటి గాని మరొకటి గాని ఎక్కడికీ పోలేదు. నీ సంస్కారాల రూపంలో నీ మనస్సులోనే ఉన్నాయి. వచ్చే జన్మకు కావలసిన గొడవలు కూడా నీ మనస్సులోనే ఉన్నాయి. నేను అనే మొదటి తలంపు, మనస్సును మాటను శరీరాన్ని ఉపయోగించుకొంటుంది. నీ మనస్సు లోని సంస్కారాలే నిజమైన సంసారం. ఒకరిని చూస్తే ప్రేమ వస్తుంది, ఒకరిని చూస్తే అసహ్యం వేస్తుంది. కారణం అజ్ఞానం వలనే. వికృతమైన ఆలోచనలు, మాటలు, పనులు చేస్తూ ఉంటే మాయలో ఉన్నట్లే. గడియారంలో ముల్లు అటూ-ఇటూ తిరుగుతుంది. టిక్-టిక్ మంటుంది. అలాగే మనస్సు, పాపం, పుణ్యం అనే భావాలపై తిరుగుతుంది. నిర్వికల్ప సమాధిలో మనస్సు తాత్కాలికంగా

srinannagaru.com

అణుగుతుంది. దేహ తలంపు వచ్చిన తక్షణం అహంకారం వచ్చేస్తుంది. దానికీ కర్తృత్వం వచ్చేస్తుంది. ఇంద్రియాలనే జైలు గోడల మధ్య బంధీగా ఉన్నాము. కోరికలు అనే తాళ్ళతో బంధించబడ్డాము.

7. అబద్ధమైన "నేనే" ఆలోచన చేస్తుంది. "నాలుకను అదుపులో పెట్టుకోకపోతే మహా ప్రమాదం" అని ఒక ఇంగ్లీషు సామెత. "ఎవరైతే నిజాయితీగా ఉండరో వారే, నిరంతరం ఇతరులను విమర్శించటానికి అలవాటు పడిపోతారు. జరుగుబాటు ఉన్నవారిలో కొందరికి అహంకారం ఉంటుంది. ధనం పెరిగితే చెవులు వినబడవు. కళ్ళు కనబడవు. మనస్సు అనేక చమత్కారాలు చేస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి లేని విషయాలను కల్పించి భయపెడుతూ ఉంటుంది. అహంకారం ఒక పొగరుబోతు. దేహాన్ని, ఇంద్రియాలను స్వాధీనం చేసుకొని వాటిని సాధనగా ఉపయోగించుకో లేదా అశాంతిని తీసుకొని వస్తుంది. చెడు స్వభావం బాధ పెడుతుంది. చెడ్డ గుణం బాధపెడుతుంది. పరిశీలనగా చూచుకొంటే, అలాగే కల్మష ఆహారం వలన కూడా ఎండమావుల్లో నీళ్ళు లేనట్లే మనకు ఆ జన్మకాజన్మ, ఈ శరీరం నేను, ఈ శరీరం అందంగా ఉంది అని భ్రమలో పడతాము. ధనాన్ని సద్‌వినియోగం చెయ్యండి. ఖరీదైన బట్టలు ఒంటి మీద వేసుకొంటే మీకు తెలియకుండానే అహంకారం వచ్చేస్తుంది. మీమీద వాలిపోతుంది. మీ హృదయం నిండా జ్ఞానం, భక్తి, వైరాగ్యం ఉండాలి. కూర బాగుంది, బాగోలేదు అనేవాడు ఎవడు? వాడే దొంగ. ఆ రుచి చూచేవాడిని పట్టుకోండి. మీ మనస్సు హెచ్చు తగ్గులు రానియ్యకండి. నిదానంగా, సహజంగా ఉంటే చాలు మీకు జ్ఞానం వచ్చేస్తుంది. మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి వెళ్ళాలి అంటే ఒకటి శాంతి. రెండవది మౌనం. ఈ రెంటిలోనూ ఏది ముఖ్యం అంటే నీ కుడి కన్ను ముఖ్యమా, ఎడమ కన్ను ముఖ్యమా అన్నట్లు ఉంటుంది. అప్పయ్య దీక్షితులుకు కలిగిన భావాలు "భగవంతుడు అంతా ఉన్న మాట నిజమైతే నేను ఏ గ్రామంలో మరణిస్తానో అక్కడ ఉండుగాక! అది కూడా కాశీ అగుగాక! అనుకొన్నాడు. నాకు ఎన్ని జన్మలు ఇచ్చినా పరవాలేదు కాని రాక్షసులు చేసే పనులు నాతో చేయించకు, వారితో స్నేహం కలిగేటట్లు చేయకు, సత్‌పురుషుని నిందించే ప్రారబ్ధం నాకు పెట్టకు. నీ స్మరణ నా శరీరంలో భాగంగా ఉండాలని కోరుకున్నాడు". గర్వం వేరు పురుగులాంటిది. గర్వం ఉన్నవాడు ఏ రంగంలోనూ అభివృద్ధిలోకి రాలేడు.

8. మీ కృషే మీకు స్నేహితుడు. మీ సోమరితనమే మీకు శత్రువు. ఆధ్యాత్మికంగా మీరు అభివృద్ధి అవ్వాలంటే ఎదుటి వారి మీద మీరు జాలి పడ్డా

srinannagaru.com

పరవాలేదు. మీ మీద మీరు జాలి పడ్డారా (అంటే సాధన రేపు చేసుకుందాము అనుకొన్నారా) పతనం ప్రారంభం. మీ భవిష్యత్ జన్మలలో కూడా పతనం అవ్వటానికి బీజం పడిపోతుంది. మోహం నెత్తిమీద పడుతుంది. ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకొనే ప్రయత్నంలో మిమ్ములను ఎవరైనా హేళన చేసేవారు ఉండవచ్చు. మీకు కావలసింది తెలివి, కామన్‌సెన్సు. ఏమనుకొంటారో అనేవారు ఎప్పుడైనా మీ క్షేమం కోరుకొన్నారా! వాళ్ళకు జడుస్తున్నారు అంటే అది అహంకారానికి విలువ ఇచ్చినట్లే. కొందరు ముందు మాట్లాడుతారు, తరువాత ఆలోచిస్తారు. తరువాత పశ్చాత్తాపం చెందుతారు. కాని మీరు ముందు ఆలోచించండి. తరువాత మాట్లాడండి. ముందు వచ్చిన ఆలోచన కన్న తరువాత వచ్చే ఆలోచన చల్లగా ఉంటుంది. కుక్క తన తోకను వంకర తియ్యటానికి నోటితో పీక్కుంటుంది అనుకోండి వంకర పోతుందా! పోదు. అలాగే మనం చేసే పూజగదిలో పది నిమిషాల సాధనలు అటువంటివే. సాధకుడు నిరంతరం జాగరూకతతో ఉండాలి. సాధకుడుగా ఉన్న వ్యక్తి తన భావాలను తెలుపుతున్నప్పుడు సగంలో ఎప్పుడూ ఆపు చెయ్యకూడదు. అలా చేస్తే కొంత దాచేసుకొంటాడు. మనం ఎంతసేపు శరీర అందాన్ని చూచుకొంటూ ఎటువంటి బట్టకట్టు కొంటున్నాము, ఎటువంటి తిండి తింటున్నాము అనే గొడవే గాని లోపల మనస్సు ఉంది దాన్ని సూక్ష్మశరీరం అంటారు. అది మనం తెచ్చుకొన్నాము దాన్ని బాగు చేసుకోవాలి. కనబడే శరీరాన్నే బాగుచేసుకొంటున్నాము. లోపల శరీరానికి ఏమైనా పక్షవాతం వచ్చిందా! అని ఆలోచించుకొంటున్నారా? దానిలో మెట్టపల్లాలు ఉన్నాయి, ముళ్ళు ఉన్నాయి. దుమ్ము ఉంది, పొలం మీదే అయినా ఊడ్చకపోతే పంటరాదు. అలాగే ఆత్మ మీరు అయినా దాన్ని తెలుసుకోవటానికి అడ్డు వచ్చే మనస్సును సంస్కరించుకోకపోతే సుఖం రాదు. త్రాచుపాములో ఉన్న విషాన్ని పిండేస్తే అది ఏమీ చెయ్యలేదు. చదువులో ఉన్న గర్వం, డబ్బులో ఉన్న గర్వం పిండేస్తే అవి మనకు ఉపకారం చేస్తాయి. ఏ రంగంలో అభివృద్ధిలోకి రావాలన్నా ముందు గర్వం లేకుండా చూచుకోవాలి.

9. పూర్వం ఒక భక్తుని ప్రార్థన వలన దేవతలు వచ్చి వరాలు కోరుకో మన్నారు "నేను వరాల కోసం, బహుమతుల కోసం ప్రార్థనలు చెయ్యలేదు" అన్నాడు. కాని విడిచిపెట్టకుండా ఇలా అన్నారు "ధనం ఇస్తాను అన్నారు". "దాచుకోలేను, కాపలా కాయలేను" అన్నాడు. "భవిష్యత్తు తెలుసుకొనే శక్తి ఇస్తామన్నారు". "భవిష్యత్తు లేని వాణ్ణి నాకెందుకు" అన్నాడు. "ఎదుటి వారి మనస్సులో ఏముందో తెలుసుకొనే శక్తినిస్తామన్నారు". "నా మనస్సులో ఏం జరుగుతుందో నాకే తెలియ

srinannagaru.com

దు. ఎదుటి వారి మనస్సు గొడవలు నాకెందుకు" అన్నాడు. "రోగాలు తగ్గించే శక్తి ఇస్తామన్నారు". "రోగాలు తగ్గటానికి భగవంతుని నామం చాలు" అన్నాడు. చివరకు వాడు ఏమిచ్చినా పుచ్చుకోడని అతనికి తెలియకుండానే వాడి నీడ ఎవరి మీద పడితే వారికి వారి వారి కోరికలు నెరవేరే వరం ఇచ్చి వెళ్ళినారు. ప్రజలు గ్రహించి విషయం అడిగారు "నాకు ఏమీ తెలియదు" అన్నాడు. నిజంగా అతనికి తెలియదు. మీ హృదయం విశాలత్వం, లోతులు గనుక మీరు సంపాదిస్తే దాని వలన లోకానికి ఎంతో మేలు జరుగుతుంది. మనశ్శాంతి కోసం ప్రకృతి మీద ఆధారపడినంతకాలం ప్రకృతి మనకు దారి ఇయ్యదు. మీకు ఇంద్రియాలు బయటికి ఎందుకు వెదుకుతున్నాయి అంటే విషయాన్ని అర్థంచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి మీరు బండతనంగా సాధన చెయ్యవద్దు అలా చేస్తే ఏ ప్రయోజనం లేదు. మీరు ఎంత సాధన చేసినా ఏదో మూలనుంచి అహంకారం వచ్చేస్తుంది. ఒక ఆంగ్ల కవి ఇలా అన్నాడు "నేను మరో జన్మ పొందాలంటే ఈశ్వరుణ్ణి ఒక్కటే కోరుకొంటాను మంచి గ్రంథాలు లేని భాగ్యవంతుని ఇంటి కన్న ఆ గ్రంథాలు ఉన్న దరిద్రుని ఇంట పుట్టించమని కోరుకుంటాను" అన్నాడు. శ్రవణం వలననే విషయం తెలుస్తుంది. నీ మనస్సు అంతర్ముఖం చెయ్యటానికి నీవు ప్రయత్నము చేస్తే నీవు జ్ఞానివి అవుతావు. ప్రారబ్ధం శరీరానికే. నీవు సాధన చెయ్యవచ్చు. నీ మనస్సు అంతర్ముఖం చెయ్యటానికి నీకు స్వేచ్ఛ ఉంది. ఇదే "పురుషాకారం" అన్నారు భగవాన్. ఎక్కువ మలం ఉంటే ఒకటి రెండు జన్మలలో పోదు. మీకు పరమేశ్వరుని మీద భక్తి ఉంటే రానియ్యండి. మనిషి జన్మ ఎత్తి భక్తి లేకుండా ఉండటం కన్న పశుజన్మ ఎత్తి భక్తిగా ఉండటం మంచిది. భగవాన్ శరీరం వదిలే సమయంలో ఒక నెమలి ఎంత కన్నీరు కార్చిందో తెలియదు. ఎవరు చెప్పారు దానికి కన్నీరు కార్చమని, బ్రహ్మానుభూతికి ఆర్తి ముఖ్యం.

10. కడుపులో మలం ఉన్నట్లే, మనస్సులో కూడా పాపమనే మలం ఉంటుంది. అది ఉన్నంతకాలం ఆత్మ తెలియబడదు. ప్రకృతి మాయ దారి ఇయ్యదు. మనస్సును అనవసర విషయాలలోకి ఖర్చుపెట్టటం వలన పాపం వస్తుంది. మీకు పుణ్యం చేసే శక్తి లేకపోవచ్చు, వ్యర్థమైన ఊహాలతో, కోరికలతో, పనులతో మీ మనస్సులో ఉన్న శక్తిని ఖర్చుపెట్టకండి పరమేశ్వరుని తెలుసుకోవటానికే ఖర్చు పెట్టండి. మీరు ప్రేమ కలిగి ఉండటం కాదు మీ స్వరూపం ప్రేమ మయం అయిపోవాలి. మీరు వేరు, ప్రేమ వేరు కాకూడదు. జ్ఞాని స్వరూపం ప్రేమే. మీకు ఎంత ఐశ్వర్యం ఉన్నా హృదయాన్ని మటుకు బీదరికంలో ఉంచకండి. మీ ఇంట్లో భోగాలు ఉండవచ్చు, మీ హృదయం ఎప్పుడూ బీదగానే ఉండాలి.

srinannagaru.com

గర్వం వేరు పురుగులాంటిది. కారు, వెళ్ళినప్పుడు దుమ్ము లేస్తుంది, అయినా ప్రయాణం మానుకోము. అలాగే విమర్శల కోసం ఎవ్వరూ కంగారు పడకూడదు. మీరు ఎంత గొప్ప పనిచేసినా లోకం విమర్శిస్తుంది. మీరు చేసిన మంచి పనులు మిగులుతాయి. మీ పై విమర్శలు కారు దుమ్ములా అణిగిపోతాయి. మీ ఇంట్లో వస్తువులను మీరు ఎలా ఉపయోగించుకోవాలో తెలియనప్పుడు ఆ వస్తువు ఉన్నా ప్రయోజనం లేదు. సుఖం లేదు. అలాగే మనకు దేహబుద్ధి ఉంది ఈ దేహాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మనకు తెలియనప్పుడు వంద సంవత్సరాలు జీవించినా ప్రయోజనం లేదు. చిన్న చిన్న విషయాలు అస్తమాను ఆలోచించటం వలన అవే పెద్దవైపోతాయి. రూపాన్ని చూచి గౌరవిస్తాము, డబ్బును చూచి గౌరవిస్తాము. మనుషులు ఇలా ఉంటే మనం ఎంతకాలానికి బాగుపడతాము. ధనం, రూపం పారమార్థిక సత్యంకాదు. వ్యవహారిక సత్యం మాత్రమే. మనిషి లోపల భయం ఉంటేనే కంగారు పుడుతుంది. కంగారు కూతురు, భయం తల్లి. ఏ రకమైన కంగారు మనకు కలుగుతున్నా భయం దాక్కొని ఉంది అని లెక్క. అది ఉన్నంతకాలం కంగారు వస్తూనే ఉంటుంది. నదిని దాటటానికి బల్లకట్టు ఎటువంటిదో అజ్ఞానమనే నదిని దాటటానికి ఈ శరీరం అటువంటిది. ఈ శరీరంలో కూర్చోవటానికి రాలేదు. మనం కూర్చోవాలన్నా ఈశ్వరుడు కూర్చోనివ్వడు. తన్ని ఇవతలికి ఈడుస్తాడు. ప్రతీవాడు రెండు తప్పులు చేస్తూ ఉంటాడు. జరిగిపోయిన గొడవలకు బెంగపెట్టుకోవటం, జరగబోయే కాలం గురించి బెంగపెట్టుకొని బాధపడతారు. వర్తమాన కాలంలో ఎవ్వరూ ఉండరు.

11. శరీర అవసరాలను పెంచుకొంటూ ఉంటే, అలవాట్లు పెరిగి పోతాయి. వాడికి తెలియకుండానే కోట్లాది జన్మలకు పునాది వేసుకొంటాడు. వాడే బంధించుకొంటాడు. కొందరు అనవసరమైన మాటలు మాట్లాడి పాపం తెచ్చుకొంటారు. ఒక మాట మాట్లాడేటప్పుడు అవసరమైన దాని కంటే ఎక్కువ మాట్లాడకూడదు అదే వివేకి లక్షణం. శరీరాన్ని మనస్సును, మాటను పవిత్రంగా ఉంచుకొన్న వాడే జ్ఞాని అవుతాడు. మనం తెలుసుకొన్న విషయాన్ని ఎంతో కొంత ఆచరించకపోతే దాన్ని మెట్టవేదాంతం అంటారు. గర్భం దాల్చి సంవత్సరం దాటినా పురుడు రాలేదంటే గర్భంలో దోషం ఉన్నట్లు లెక్క. దేన్ని అయితే విశ్వసిస్తున్నామో దాన్ని మనస్సు నమ్మదు. నమ్మినట్లు నటిస్తుంది. అది మనలో ఉన్న లోపంగా గ్రహించాలి. కొందరికి చెడ్డ మాటలు వింటూ ఉంటే చెవిలో తేనెపోసుకున్నట్లు ఉంటుంది. అంటే వారికి లోపల చెడ్డ ఉందని లెక్క. "మరలా చెప్పండి, మరలా చెప్పండి" అంటారు. రాబోయే జన్మలు వారికి పాపపు జన్మలు, పాము జన్మలు

srinannagaru.com

వస్తాయి. ఎవరు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నారో పరిశీలన చెయ్యకుండా ఒక్క మాటను తీసుకోకండి. అనుకరణ ఎంత కాలమైతే విడిచిపెట్టమో అంతకాలం ఒక్క అడుగుకూడా ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్ళలేము. మీకు నచ్చిన కూరని తినటం గొప్ప కాదు. మీ ఆరోగ్యానికి మంచిదైతే మీకు నచ్చక పోయినా నచ్చేటట్లు చేసుకోవాలి. మీకు నచ్చిన పని చెయ్యటం గొప్పకాదు. ఆ పని గొప్పదైతే మీకు నచ్చకపోయినా నచ్చేటట్లు చేసుకోవాలి. చేప నీటికి ఎలా ఎదురీది వెళుతుందో, ఈ ప్రకృతి ప్రవాహానికి ఎదురీది ఎవరైతే పనిచేస్తారో వారికి జ్ఞానం కలుగుతుంది. మీలో ఉన్న హింసే మీచేత పాపం చేయిస్తుంది. అహింసా సిద్ధాంతం అంటే ప్రాణప్రియం. మనస్సు హింసలో ఉండటం వలన "క్రౌర్యం" పెరుగుతుంది. పాపం పెరుగుతుంది. అప్పుడు మనస్సు మృదుత్వం పడిపోతుంది. ఎవరికి క్రూరత్వం రాలిపోతుందో వాడి హృదయంలో ఈశ్వరుడు చోటుచేసుకొంటాడు. అహింసా సిద్ధాంతం లేకపోతే లోపల క్రూరత్వం రాలదు. ప్రకృతి మనుషుల దగ్గరకూ, గొప్పలు చెప్పకొనే వారి దగ్గరకూ వెళ్ళి మీకు అవసరమైనా సరే ఏమీ అడగవద్దు. నీకు ఏమైనా కావలసి వస్తే పుణ్య పురుషులను, భక్తులను అడుగు వారు ఇచ్చినది పుచ్చుకోవాలి.

12. మనకు లోపల పాపం ఉంది అనుకోండి, తలంపు వచ్చి తీరుతుంది. ఎంత కాలమైతే మిమ్ములను మీరు పరిశీలించుకోరో అంతకాలం ఏ దేవుడు, ఏమతం మీకు సహాయం చెయ్యదు. తలంపు లేకుండా ప్రపంచం ఉందేమో చూడండి. మీకంటే భిన్నంగా కనిపించేది ఏదీ నిజంకాదు. సర్వసాధారణంగా మనకున్న భౌతిక, ఆధ్యాత్మిక హీన పరిస్థితులకు భగవంతుడే కారణం అనుకుంటాము. అజ్ఞానం వలన ఆయన మీదకు నెంటేస్తాము ఇది అంతా మనస్సు కల్పించింది. తత్త్వంలోకి రాకుండా తప్పించి ప్రక్కకు తీసుకొని పోతున్నది. దానికి వాసనలే కారణం. ఆధ్యాత్మిక మార్గంలోకి తక్కువ మంది వస్తారు. అంత మాత్రాన దానికి విలువలేదు అని అనుకోకండి, సంతలోకి బీరకాయలు, వంకాయల కోసం ఎంతో మంది వస్తారు. బంగారం కొట్టులోకి ఇద్దరోముగ్గురో వస్తారు. అంత మాత్రాన బంగారానికి విలువ లేదా లోకంలో. అందరూ ఇలా ఉన్నారు, అలా ఉన్నారు అని మీకు ఆలోచన ప్రారంభమైనదా మీ అభివృద్ధి ఆఖరు. ఆత్మ తప్పించి దేన్ని కోరుకొన్నా మీ కంఠానికి ఉరితాడు వేసుకొన్నట్లే ఇత్తడిని చూచి బంగారం అనుకొంటే ఆ తప్ప మనదే గాని ఆ వస్తువుది కాదు. ప్రపంచం మీద మీకు మోహం కలిగితే మనకు అజ్ఞానం ఉన్నట్లే లెక్క. తత్త్వాన్ని తెలుసుకో కుండా ఎవరో వచ్చి మోక్షం ఇస్తారని కనిపెట్టుకోకండి. దేనిని గుడ్డి తనంగా

srinannagaru.com

నమ్మకండి. మీ బుద్ధిని తాకట్టు పెట్టవద్దు. మీరు పొరపాటు చేసినా నాకు ఇష్టమే మీ స్వతంత్ర ఆలోచన మాత్రం విడిచిపెట్టకండి. ఆత్మ సుఖ స్వరూపం అది మీలోనే ఉంది. కోరికలు జయించినవాడు రామచంద్రమూర్తితో సమానం. మీ ఐశ్వర్యాన్ని చూచి, కీర్తిని చూచి మీ చదువును చూచి గర్వం వస్తూ ఉంటే దాన్ని వదిలించుకోవటానికి వేలాది జన్మలు పడతాయి. గర్వం వలన వచ్చే లాభం పావలా, నష్టం ముప్పావలా. అది మట్టుకు గుర్తుంచుకోండి. చేపలకోసం గేలం వేసేవాడు ఎంత ఏకాగ్రతతో చూస్తాడో అంత ఏకాగ్రతతోటి పరిశుద్ధమైన హృదయంతోటి ఆత్మను లక్ష్యంగా పెట్టుకొన్నవానికి ఆత్మదర్శనమౌతుంది.

13. డబ్బు ఉందని, పెద్ద ఉద్యోగస్తుడిని ప్రేమించాము అనుకోండి ఉద్యోగం డబ్బు పోగానే ప్రేమించటం మానేస్తాము. అదే విధంగా దేవుని కోరికలతో ప్రేమిస్తే ఆ కోరిక తీరగానే ప్రేమించటం మానేస్తాము. అలాకాదు అకారణమైన ప్రేమ ఉండాలి. అదే నిజమైన ప్రేమ. కాలం విలువైనది. ఇసుకలో పడ్డ నూనె ఎలా తీసుకోలేమో, అలాగే ఖర్చుపెట్టిన కాలాన్ని తిరిగి పొందలేము. మీకు ఎవరైనా సహాయం చేస్తూ ఉంటే ఈశ్వరుడే చేయిస్తున్నాడనే భావన గుర్తుపెట్టుకోండి. అంతా ఈశ్వర సంకల్పంతోనే నడుస్తున్నదని మనం పుస్తకాలలో చదువుకోవచ్చు ఆ అనుభవం ఒక్క జ్ఞానికే తెలుస్తుంది. సాధన అంటే కష్టమని కొందరు అంటారు. బహు తేలిక. ఏ విషయం అయినా అర్థమైతే తేలిక, అర్థంకాకపోతే కష్టం. అభ్యాసం లేనివాడికి, వైరాగ్యం లేనివానికి, అనేకత్వం కనిపిస్తుంది. మీ గురించి మీరు నిరంతరం ఆలోచిస్తూ ఉంటే మీ గురించి ఆలోచించే పని భగవంతుడికి ఏమి ఉంటుంది. జ్ఞానికి ఈ ప్రపంచం అబద్ధమని తెలుసుకోవటానికి ఒక్క నిమిషం పట్టదు. అజ్ఞానికి ఎన్ని జన్మలు ఎత్తినా తెలియదు. దుర్మార్గుడిలో ఏ ఆత్మ అయితే ఉందో మంచి వానిలో కూడా అదే ఉంది. మరి అతన్ని ఎందుకు దుర్మార్గుడు అని అంటారు. అతని ఆలోచనలు, తలంపులు, అలవాట్లు, వాసనలు చెడ్డగా ఉన్నప్పుడు చెడ్డవాడు అంటాము. అది మనస్సుకే పరిమితంగాని ఆత్మకు ఎటువంటి సంబంధం లేదు. మనస్సుదాటిన జ్ఞాని, దుర్మార్గపు లక్షణాలను తగ్గించి చెబుతాడు. సన్మార్గులు ఎదుటివాడు చిన్న పనిచేసినా పెద్ద పని క్రింద చెబుతాడు. మన మాటలోనూ, ఎదుటివారి మాటలోనూ పరిశీలన లేకపోతే అనుభవం రాదు. వెర్రి వెయ్యి విధాలు. జ్ఞానం ఒక్క రకంగానే ఉంటుంది. అజ్ఞానులు అనేకం జ్ఞానులు ఒక రకంగానే ఉంటారు. నోరు ఉందని అనవసర విషయాలు మాట్లాడ రాదు. శరీరం ఉంది కదా అని శరీరంతో చెయ్యరాని పనులు చెయ్యకూడదు. మనస్సు ఉంది కదా అని అనవసర విషయాలు ఆలోచించకూడదు. ఈ

srinannagaru.com

మూడింటినీ నియమ బద్ధం చేసుకోలేనివాడు ఆధ్యాత్మిక జీవితానికి పనికిరాడు. జ్ఞానం సంపాదించటానికి డబ్బు ఖర్చుపెట్టనక్కరలేదు. ఆశ్రమాలు అక్కరలేదు. చాపా బల్ల అక్కరలేదు. అది ఇక్కడే ఉంది ఇక వాయిదా ఎందుకు? అదృష్టవంతుని మనస్సు తొందరగా బహిర్ముఖం అవుతుంది. దురదృష్టవంతుని మనస్సు అంతర్ముఖం అవుతుంది అని, గేరంటీ లేదు, అవకాశాలు ఎక్కువ.

14. గోపికల యొక్క ప్రేమ కొంత రూపానికి పరిమితమైనది. రుక్మిణి ప్రేమ గుణానికి పరిమితమైనది. కాబట్టే కృష్ణుని కొన్ని రోజులు చూడకపోయినా ఉండగలిగేది. గుణం మీద గనుక ప్రేమ ఉంటే రూపం ఎదురుగా ఉండనక్కరలేదు. భగవాన్ గుణం మీద మనకు ప్రేమ ఉంటే ఆయన శరీరం ఉంటే ఏమి? లేకపోతే ఏమి? కనీసం ఒక మంచి గుణం చాలు. వాడిని బాగులోనికి తీసుకొని వెళుతుంది. భగవంతుని దర్శించాలనే కోరిక కలగటం బ్రహ్మాండమైన విషయం. కొందరికి రంపం పెట్టికోసినా ఈ భావం కలుగదు. అది కొన్ని కోట్ల సంవత్సరాల పుణ్య సంస్కారాల పంట. మీరు పొందుతారో లేదో అనే విషయం మూటగట్టి ఒక ప్రక్కన పెట్టండి. ఆ అభిరుచి గొప్పది. నిన్ను నీవు తెలుసుకోవటం కన్న గొప్ప పని ఉంది అని నీవు అనుకొంటే అది నీ మనస్సు కల్పించే మాయ. శరీరం లేని వానికి, మనస్సు లేని వానికి రచనలతో పని ఏముంది? మనస్సులోంచే ఈ సాకారం అంతా వస్తున్నది. నా తలంపులను గెంటివెయ్యలేకపోతున్నాను అని దుఃఖపెడితే నేను తట్టుకోలేకపోతున్నాను అప్పడు దేవుడి సహాయం కావాలనే ఆర్తి కలుగుతోంది. మనిషి మహా మేధావి అయి ఉండవచ్చు వాడికి పుణ్య సంస్కారం లేకపోతే భగవంతుణ్ణి తెలుసుకోవాలనే కోరికే కలుగదు. అంత గొప్ప వాడికీ ఆ తలంపు కలగటం లేదు మనకెందుకు అని అనుకోకూడదు వారిని చూచి కాపీ కొట్టకూడదు. మీరు మాటలు జాగ్రత్తగా మాట్లాడాలి. అజాగ్రత్తగా మాట్లాడితే ఉన్న స్నేహాలు ఊడిపోతాయి. లేని విరోధాలు వస్తాయి. ఆచితూచి ఒళ్ళు దగ్గరపెట్టుకొని మాట్లాడాలి అదే తపస్సు, స్వార్థం ఉన్న మనిషికి పరమార్థం ఎప్పడూ అందదు. మీ మనుమడికి ఏదో సేవ చెయ్యాలని చూస్తారు కాని వాడి దగ్గర నుంచి ఏదైనా పొందుదామని చూస్తారా! మరి భగవంతుడి దగ్గరకు వచ్చేటప్పటికి ఏదో పొందాలని చూస్తారే? మీ మనుమల మీద ఉన్న ప్రేమ ఎంత ఉందో అంత భగవంతుని మీద ఉంటే దాన్నే భక్తి అన్నారు. దేవుని చూడటానికి కళ్ళు, మనస్సు ఉండాలి. ఆత్మను చూడటానికి అవి ఏమీ అక్కరలేదు. ఎందుచేతనంటే ఆత్మ మీరే అయి ఉన్నారు.

15. స్త్రీ, నేను స్త్రీని అనుకొంటుంది. పురుషుడు నేను పురుషుడిని

srinannagaru.com

అనుకొంటాడు. ఇది నూటికి నూరుపాళ్ళు పాపలక్షణమే. వాడు పవిత్రుడైతే వాడికి ఆత్మ భావనే ఉంటుంది. లోపల జ్ఞానం లేనప్పుడు, ఆత్మ భావన లేనప్పుడు కుక్క దేహమైనా, గాడిద దేహమైనా, మనిషి దేహమైనా ఒక్కటే. మీ బుద్ధికి పని చెప్పకపోతే తుప్పు పట్టేస్తుంది. బుద్ధిలో హెచ్చుతగ్గులు ఉంటాయి గాని బుద్ధిలేని వాడు అంటూ ఎవరూ ఉండరు. బుద్ధి యొక్క ప్రయోజనం ఏమిటి? అంటే సత్యాన్ని తెలుసుకోవటమే. నేను చెప్పినది నమ్మితే అది మీ స్వంతం అవ్వదు నేను చెప్పినది మీ బుద్ధితో మీరు ఆలోచించుకోగలిగితే అది మీ స్వంతమౌతుంది. మీ బుద్ధికి సత్యం అందితే అంతా మీ స్వంతం అవుతుంది. మనం పైకి మామూలు మనిషిలా కనబడాలి. లోపల ఆధ్యాత్మిక శక్తి పెంచుకోవాలి. పైకి, భక్తుల క్రింద కనబడకూడదు. బట్టలు కూడా మార్చనక్కరలేదు. మీప్రక్క ఇంట్లో వారికి గాని, మీ భక్తి తెలియనియ్యకూడదు. అది సాధకుడి లక్షణం. మీరు సత్యాన్ని ప్రేమిస్తున్నారు అనుకోండి అన్ని మంచి గుణాలు మీ కాళ్ళ దగ్గరకు వచ్చేస్తాయి. మీ ఇంద్రియాలు మనస్సు, మీ ప్రారబ్ధం, మీ కర్మలు అన్నీ దారిలోకి వచ్చేస్తాయి. దీనికి మనలో ఉన్న మంచి గుణాలను కాపాడుకోవాలి. వైరాగ్యం లేకుండా చెప్పే బోధ పనిచెయ్యదు. నాకు నాలుగు పదార్థాలు వేయించి పీకదాకా పెట్టారు అనుకోండి నాకు అన్నం సహించరాదు. మీరు శాంతి సముద్రంలో మునిగి ఉన్నప్పుడు దేవుని సహించ రాదు. ఆత్మ చింతన ఉన్న మనిషికి దేహం గుర్తుకు రాదు, మనస్సు గుర్తుకు రాదు, లోకం గుర్తుకు రాదు. రోజంతా ఆత్మ చింతనలో నీవు ఉంటే నీవు చిత్ స్వరూపుడవే అవుతావు. స్త్రీ శరీరం, పురుష శరీరం కలవటం వలన వాళ్ళకు ఇతర తలంపులు పోయి ఏకాగ్రత వస్తుంది. ఆ ఏకాగ్రత లోంచే సుఖం వస్తుంది. శరీరాలు కలవటం వలన రావటంలేదు, మీకు ఇతర తలంపులు పోయి ఒకే తలంపు ఉన్నా ఏకాగ్రత వస్తుంది. అప్పుడు మీ హృదయంలో ఉన్న శాంతే సుఖమే మీకు వస్తుంది. ఈ భూమికి సంబంధించిన విషయాలు ఒక రకమైన మత్తుని తీసుకొని వస్తాయి. సంతోషం కోసమే కోరిక, లేకపోతే కోరికతో పనిలేదు. మోహం ఉంటే తప్పని సరిగా పాపం చేసి తీరుతాడు. అవినీతి పరుడౌతాడు.

16. పుట్టింది మొదలు చనిపోయే వరకూ "నేను-నేను" అంటూనే ఉంటాము. చనిపోయే ముందు కూడా నేను చనిపోతున్నాను అంటున్నాడు. "నేను ఎవడను?" నేను అనేవాడు ఎవడు? ఈ ప్రశ్న మీలో ఎవ్వరికైనా వచ్చిందా? ఈ ప్రశ్న మీలో కలుగజేయకుండా చేయటమే "మాయ". నల్లత్రాచు పాము కనబడింది అనుకోండి మనకు ఎంతో భయమేస్తుంది. మనలోంచి ఒక్క పాపపు

srinannagaru.com

తలంపు వస్తే ఎవరు అలా భయపడతాడో వాడు భగవంతుని దర్శిస్తాడు. కాని మనం ఆ తలంపును చుట్టాలను మర్యాద చేసినట్లు చేస్తున్నాము. ఈ లోకాలు, ఈ దేవతలు, ఈ శరీరాలు, ఈ సృష్టి అంతా మాయ యొక్క కార్యం. ఎవడైతే మాయను వదిలి పెట్టి, అధిష్ఠానంగా ఉన్న పరమేశ్వరుని ఆరాధిస్తున్నాడో, ఆయనని పట్టుకుంటాడో వాడు మాయను జయిస్తాడు. వారికి మాయ దారిస్తుంది. మనం మాయను తప్పకోమంటే తప్పకోదు. అది మన ప్రవర్తనను చూచి, మన సంస్కారాన్ని చూచి దారి ఇయ్యాలి. పరబ్రహ్మమునకు ఎంత శక్తి ఉందో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఉపాధుల ద్వారా చూపించాడు పరమాత్మ. వారు అప్పుడు ఉన్నారు. ఇప్పుడు లేరు అని, వారికంటే వీరు గొప్పవారని అనుకొని మన ప్రాణశక్తిని నష్టపర్చుకొంటున్నాము. అసలు తత్త్వం దగ్గరకు ఎవ్వరూ రావటంలేదు. అందరూ దేవుళ్ళ దగ్గరే ఆగిపోతున్నారు. అందుచే దుఃఖంలోంచి విడుదల పొందలేక పోతున్నారు. రూపదృష్టి నామదృష్టి ఎంత కాలమైతే ఉందో అంతకాలం దుఃఖం కూడా వస్తూనే ఉంటుంది. రూపదృష్టిలో బంధించబడిపోయాము. దేవుణ్ణి కూడా రూపంగా చూడాలి అని మనం అలవాటు పడ్డాము. మీరు ఆరాధించే దేవుడు ఎక్కువని, ఇతరులు ఆరాధించే దేవుడు తక్కువని మీరు అనుకోకూడదు. మీరు ప్రేమించే దేవునిలో ఏ ఆత్మ అయితే ఉందో ఎదుటివారు ప్రేమించే దేవునిలో కూడా అదే ఆత్మ ఉంది. అక్కడ దేహంగా మట్టుకు నిజంకాదు. పుట్టెడు తెలివి తేటలు ఉన్న వాడికంటే తెలివి తేటలు లేకపోయినా భగవంతుని పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉంటే వారు తొందరగా తరిస్తారు.

17. ఈ ప్రపంచంలో నీచాతి నీచమైనది పిరికి తనం. కొంతమందికి అహంకారం ఉన్నట్లు అసలు తెలియనే తెలియదు. ఈశ్వరానుగ్రహం ఉంటేనే తెలుస్తుంది. ప్రతీ దేశానికీ రాజ్యాంగం ఉంటుంది. అలాగే భగవంతునికి కూడా రాజ్యాంగం ఉంటుంది. అది భగవత్ గీత అన్నారు. మీకు వచ్చే ఆలోచనలు జాగ్రత్తగా చూచుకోవాలి. అనవసరమైన ఆలోచనలు వస్తే ఒక్కొక్కసారి మీ శ్వాస బుసలు కొట్టేస్తూ ఉంటే మీ ప్రాణ శక్తి ఎంతో ఖర్చు అవుతుంది. అది మీకు తెలియదు. మీకు నియమించబడిన ప్రాణశక్తిని, మనశ్శక్తిని మీరు నిగ్రహించుకొంటే ఆత్మను తెలుసుకొనుటకు దారిచూపిస్తాయి. ఎవరైతే పనిని పూజతో సమానంగా చూచుకొంటారో వారి జీవితంలో అన్నం కరువు ఉండదు. పని ఉన్నవాడికి జేబులో రూపాయలు ఉంటాయి. ఎవడు జీవితాన్ని ఒక యోగంగా మార్చుకొని జీవిస్తాడో వాడు ఈ జన్మలోనే తరిస్తాడు. మీ దగ్గర ఒక రూపాయి ఉంది అనుకోండి దాన్ని క్రింద పడేయమంటే పడేయరు. మీకు ఒక లక్ష

srinannagaru.com

రూపాయలు ఇస్తాను ఆ రూపాయి పడేస్తే అంటే పడేస్తారు. అలాగే మీరు ఇంద్రియాలతో అనుభవించే సుఖాలకంటే అతి ఎక్కువ సుఖం మీ మనస్సుకు దొరికితే, ఇంద్రియ సుఖాలను వదిలేస్తే మీ మనస్సు అంతర్ముఖం చెందుతుంది. కాని ఆత్మ సుఖం తెలియక మనువు ఎంత మెట్ట వేదాంతం చెప్పకొన్నా ఇంద్రియ సుఖాలలోకే మనస్సు వచ్చేస్తుంది, అనుభవం రావాలి, ఆ పట్టు చిక్కాలి, అనుభవం లోపల నుంచే సుఖం రావాలి. మీకు ఏకాగ్రత కుదిరితే ఒక్కరోజు ఒక్క నిమిషం క్రింద వెళ్ళిపోతుంది. శరీరం వచ్చిన ప్రయోజనం మనస్సు అంతర్ముఖం చెయ్యటానికే ఎంత నిరాడంబరంగా జీవిస్తే అంత తొందరగా తత్త్వం పట్టు ఇస్తుంది. మానసిక జీవితం తెలియని వానికి ఆధ్యాత్మిక జీవితం రానేరాదు. మీ అజ్ఞానాన్ని మీరే పోగొట్టుకోవాలి. మీరు విషయాన్ని అర్థం చేసుకోవటం వలన అహంకారం పోతుంది. నాకు కొన్ని తలంపులు వస్తే నాకు ఒక మనస్సు అవుతుంది. ప్రతీవాడికీ "నేను" అనే ప్రథమ తలంపులోంచే అనేక తలంపులు వస్తున్నాయి. దాన్ని పరిరక్షించుకోవాలి.

18. డబ్బులేకపోయినా బ్రతకవచ్చు, చదువులేకపోయినా బ్రతకవచ్చు, బుద్ధి భ్రష్టుడు అయితే అన్ని విధాలా పతనమౌతాడు. బుద్ధే మనకు దారి చూపి స్తుంది. మన మానసిక ఆరోగ్యం కోసం స్థూల శరీరాన్ని నిర్లక్ష్యం చేసినా పరవా లేదు. ఎవడైతే బుద్ధి విషయంలో శుచిగా ఉంటాడో వాడే పవిత్రుడు అవుతాడు. తలంపుల విషయంలో మీకు జాగ్రత్త రాకపోతే మీకు మానసిక ఆరోగ్యం రాదు. రోడ్డు ప్రక్క మైలు రాళ్లలా ఉంటారు. మైలురాళ్లు ప్రయాణం చెయ్యవు. దేహం ప్రకృతిలో భాగం. అందుచేత మనలను ప్రకృతిలోకే గెంటేస్తుంది. దాని మూలం అది తెలిసే వరకూ జన్మలు వస్తూనే ఉంటాయి. ఈ ప్రకృతి మనలను విడిచి పెట్టదు. ఈ విషయం తెలియనంత కాలం ఈ బొమ్మలను వేసుకొని తిరగవలసి నదే. నీకు అనుభవం లేదు, నీవు మనస్సువని, శరీరానివని అనుకొంటున్నావు. దీనికి అదనంగా తెలివి ఒకటి. ఈ తెలివి కొందరికి స్వార్థం పెంచుకోవటానికి ఉపయోగపడుతుంది. మీరు సంఘాన్ని గనుక జయించకపోతే జ్ఞానులు అవ్వలేరు. మీ అహంకారానికే ప్రాముఖ్యం లేనప్పడు ఎదుటివారి అహంకారానికి మీరు ప్రాముఖ్యత ఇవ్వటం ఎందుకు? మీరాబాయి అంది "నువ్వు అన్నా ఉండాలి, నేను అన్నా ఉండాలి, నువ్వు ఉంటే నేను ఉండను, నేను ఉంటే నువ్వే ఉండవు. నువ్వు అంటే ఆత్మ (కృష్ణుడు) నేను అంటే అహంకారం. అది ఉన్న చోట కృష్ణుడు ఉండడు. అహంకారం ఉన్నంతసేపు ఆత్మ తెలియదు. నీవు ఆత్మవు అయితే పోగొట్టుకోవటానికి ఏమీలేదు." మీరాకు ఉన్న ధైర్యం మనకు

srinannagaru.com

ఉంటే జ్ఞానం వచ్చేస్తుంది. మీరా ఎన్నో కష్టాలు పడింది అయినా కృష్ణుని మీద భక్తి పోలేదు. ఆందోళన అనేది ఆవిడ జీవితంలో కలుగలేదు. కృష్ణుని విపరీతంగా ప్రేమించటంలో ఆవిడకి ఉన్న ప్రాపంచిక తలంపులు అన్నీ కాలి బూడిద అయి పోయాయి. భస్మమైపోయాయి, ఆవిడ జ్ఞాని అయినది. కృష్ణ ప్రేమలో ఒక అగ్ని పుట్టి ఆవిడ వాసనలు కాల్చి బూడిద చేసింది. ప్రేమ మార్గాన్నే భక్తి మార్గం అంటారు.

19. ప్రతీ మనిషికీ శత్రువు ఎవరంటే వాడి సందేహమే. మనం చేసిన చెడ్డ కర్మ, పూర్వ జన్మలలో చేసిన చెడ్డ కర్మ సందేహ రూపంలో వస్తుంది. అది మనకు తెలియదు. శాస్త్రం చెప్పింది వింటాము. మరల మనకు సందేహం వస్తూ ఉంటుంది. ఇది అంతా మన పిచ్చి, నిజంగా దేవుడు ఉన్నాడా? అని సందేహం వస్తుంది. సందేహం వచ్చి మరలా నాలుగు ఫర్లాంగులు వెనుకకు వెళ్ళిపోతాము. మీకు తలంపు వచ్చినప్పుడు ఆచరణలో పెట్టకండి. ఆ తలంపు ఎక్కడ పుడుతోందో చూడండి. మీరు బాగా ఆలోచించండి. మీరు ఉంటేనే తలంపులు వస్తున్నాయా, మీరు లేకుండా రావు కదా! ఈ షటిల్ పాయింటు మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీకు వచ్చే తలంపు మంచిదా? చెడ్డదా? అని నేను అడుగటం లేదు. "నేను" లేకుండా వచ్చింది అని ఎవరైనా చెప్పగలరా?

నెరవేరిన కోరికలు మనకు శత్రువుల క్రింద తయారౌతాయి. అవి కొత్త కోరికలను తెచ్చేస్తాయి. అందుకే అసలు తలంపు పుట్టకుండా ఉండు. నిజ స్థితిలో నీవు ఉండు నేను అనే భావన లేకుండా, భోజనం చేసినా అది ఉపవాసం తో సమానం. ఈ దేహం ఎంతకాలం ఉండాలి? ఎక్కడ పనిచేయాలి? ఎప్పుడు ఏది చెయ్యాలి? అనేది పెర్ఫెక్టుగా, ఒక ఆర్డరు ప్రకారం, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిపోతుంది. మన మెవ్వరిమో తెలిసే వరకూ ఇలా వస్తూనే ఉంటాయి. ఈ శవాలు వీటిని మోస్తూ ఉండవలసిందే. కోరికే ఈ ప్రపంచాన్ని, నిజంలా కనిపింప చేస్తున్నది. నేను-నేను అంటున్న ఈ నేను ఎప్పుడు మాయమౌతుంది అంటే నీవు దృఢంగా ఆత్మను వెదకటానినప్పుడు నీ ప్రయత్నం అక్కరలేకుండా ఈ నేను పడిపోతుంది. ఈ నేనుకు దూరమౌతారు. మీ అజ్ఞానానికీ, అహంకారానికీ, మీ తలంపులకు మీరు దూరమౌతారు. ఆ ప్రయత్నంలోనే మీకు మంచి గుణాలు వచ్చేస్తాయి. మిమ్మలను మీరు చూచుకోండి. ఎదుటివారి కళ్ళతో మిమ్ములను చూచుకోవటం ఏమిటి? వారు మంచి వారంటే మంచివారా?, చెడ్డవారంటే చెడ్డవారా? ఎదుటి వారి మెదడుతో మిమ్మలను మీరు చూచుకొంటారా మీకు మెదడు లేదా? భగవంతుణ్ణి నన్ను పాపం చెయ్యకుండా కాపాడు తండ్రీ అని ప్రార్థించేవారు ఎవ్వరైనా ఉన్నారా?

srinannagaru.com

20. శరీరం పుడుతుంది. పెరుగుతుంది. ముసలిది అవుతుంది, మరణి స్తుంది. మరణం అంటే కంగారు పడకండి బహు చిన్న విషయం. చావు అంటే దేవుని దగ్గర నుంచి వచ్చిన పిలుపు. తల్లి కడుపులోంచి జీవుడు బయటికి వచ్చేటప్పటికే రాగ-ద్వేషాలు పట్టేస్తాయి. మాయలో పడతాము తప్పకోలేము, రాగ-ద్వేషాలే మనస్సుకు గుడ్డితనం. అప్పుడు విచక్షణ పోతుంది. విడదీసుకొనే శక్తి పోతుంది. అనాత్మ ఆత్మగా కనిపిస్తుంది, డబ్బు ఉన్న వారు, డబ్బులేనివారు అనే తేడాలతో, హెచ్చు తగ్గులు చూడటం మనస్సుకు అలవాటైపోతుంది. వాటి వల్ల రాగద్వేషాలు పుడతాయి. అవి పెరిగే కొలది జన్మలు పెరుగుతాయి. తరువాత ప్రకృతి బంధిస్తుంది. ఈ సృష్టి అంతా భగవంతుని సంకల్పం వల్ల నడుస్తోంది అనే దృఢ విశ్వాసంతో గనుక జీవిస్తే మీకు దుఃఖం పుట్టదు. మీ పని పూర్తి అవుతుంది. హింసకు గురి కాకుండా, కష్టమైన మాటలు భరించకుండా ఈ ప్రపంచంలో మహాత్ములు అవ్వలేదు. ఈ ప్రపంచ చరిత్రలో మీరు చేసే మంచి పనులు ఊరికే పోవు. మిమ్మల్ని ఈశ్వరుడు అలంకరిస్తాడు.

చిన్న చిన్న మొక్కలు వేసవికాలంలో భూమి ఉపరితలంలో నీరు బహుకొద్దిగా ఉండటం వలన మొక్కలకు నీళ్ళు పూర్తిగా అందక వాడిపోతాయి. పెద్ద వృక్షాల వేరులు భూమి లోపలికి చాలా లోతుగా వెళ్లటం వలన నీరు సమృద్ధిగా దొరకటం వలన చెట్లు నిగనిగలాడుతూ ఉంటాయి. అలాగే ఆత్మ విషయం మీ హృదయానికి బాగా అందితే ఏ రకమైన దుఃఖం రాదు. ప్రశాంతంగా ఉండ వచ్చును. మీరు తలంపుల పరిధిలో ఉన్నంతకాలం పునర్జన్మ తప్పదు. మీరు పూజ చేసినా, ఆకలితో ఉన్నవానికి అన్నం పెట్టినా దేవుని గౌరవించినట్లే అవి మీరు చెయ్యకపోయినా, ఎదుటివారు చేస్తూ ఉంటే మీరు చూచి సంతోషించినా మీకు సగం వాటా వస్తుంది. ఎదుటివాడిలో ద్వేషాన్ని నీవు చూచావు అనుకో ఆయనలోని పాపం నీకు వస్తుంది. నాకు ఎంతో తెలివి ఉంది అనే బుద్ధి కూడా జడమే. ఈ లోకంలో ఆత్మ తప్పించి అంతా జడమే. రాగ-ద్వేషాల యొక్క వేగం తగ్గకుండా మనస్సు అంతర్ముఖం కాదు. దేహబుద్ధి ఉన్నవాడు పైకి చెప్పకపోయినా తప్పనిసరిగా దుఃఖం అనుభవిస్తాడు. మీకు ఎక్కడ కోర్కె ఉందో అక్కడకు వెళ్ళి మనస్సు కూర్చుంటుంది. దాన్ని ఆత్మవైపుకు మళ్లించాలి. అప్పుడే అది ఆత్మాకారం చెందుతుంది.

21. ప్రేమించేది మనస్సే, ద్వేషించేదీ మనస్సే కాబట్టి మనస్సును నమ్మ కూడదు. ఆత్మ ఉన్న చోట అహంకారం, అహంకారం ఉన్నచోట ఆత్మ ఉండదు. అహంకారమే కృష్ణ భక్తునిగా, రామ భక్తునిగా కల్పిస్తుంది అని గ్రహించాలి.

srinannagaru.com

మతాలతోనూ, కులాలతోనూ ఈ అహంకారం తాదాత్మ్యం చెందుతుంది. పుట్టలో పాము ఉంటుంంది అలాగే కోరికలు మనస్సులో ఉంటాయి. నీ మనస్సును బ్రహ్మ చింతన వైపే ఉంచు అది నశిస్తుంది. జీవ లక్షణాలు ఉన్నవారు కర్మలను ప్రోగు చేసుకొని వాటిని సంచీలో వేసుకొంటారు. దానినే సంచితం అంటారు. అహంకారమే ముఖ్య మంత్రి, ప్రధానమంత్రి పదవి చేస్తుంది. అహంకారమే తాతయ్యను, అమ్మమ్మను, అక్కాచెల్లెళ్లను తయారుచేయిస్తుంది. ఈలోకం తీరు అంతా అహంకారమే. ఈ సృష్టి అంతా అహంకారం యొక్క కల్పితం ఇంకా ఏమి చెప్పాలి. అత్యంత ప్రీతి పాత్రమైనది ఆత్మ మాత్రమే. అందులోనే శాంతి సుఖం నివసిస్తూ ఉంది. ఈ అహంకారానికి కాలక్షేపం కావాలి. పిల్లలు లేకపోతే దత్తత చేసుకొంటాము. వాడితో ఎంతో ఇష్టంగా కాలక్షేపం చేస్తూ ఉంటాము. వాడు పెరిగి తిరగబడ్డప్పుడు తెలుస్తుంది అహంకారం యొక్క చిద్విలాసము. మనకు వచ్చే తలంపుల వల్ల, ఊహల వల్లనే మన పునర్జన్మకు హేతువులు అవుతున్నాయి. అన్ని రకాల తలంపులు "నేను" అనే తలంపుకే వస్తున్నాయి. మనస్సు యొక్క సృష్టిలో నీవు ఉన్నంతకాలం ఈ ప్రపంచం నిన్ను పిండి పిండి చేసి వదలిపెడుతుంది. నీ కామక్రోధాలు, ఇష్టాఅయిష్టాలు, నీ సంతోషం అన్నీ నీ మనస్సు యొక్క కల్పితాలు. వాటికీ నీకూ సంబంధం లేదు. ప్లేటో అన్నారు "మనస్సును జయించకుండా డెబ్బది ఏళ్ళు జీవించటం కన్న అసలు పుట్టకుండానే ఉంటేనే నయం"అని. అజ్ఞాన పరం అశాంతి, జ్ఞాన పరం శాంతి. నేను ఇంతటివాణ్ణి, నేను అంతటి వాణ్ణి అనే భావన లేకుండా, ఈ నేను లేకుండే చేసుకోండి. అప్పడు మీరు ప్రతీది అవుతారు అంటే అంతటా వ్యాపించినది నేనే అనే అనుభవం వస్తుంది. దేహంతో విడుదల కాగలం గాని అహంకారంతో విడుదల కాలేము. కారణం మనం ఎప్పడూ అహంకారంతోనే ఉంటాము. అహంకారాన్ని అలంకరించుకోవడానికి ప్రయత్నం చెయ్యకండి మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనలను మనం పొగుడు కోపటం వలన మనకు అజ్ఞానం పెరుగుతుంది.

22. రాగం ప్రేమ కాదు, ప్రేమలా కనిపిస్తుంది. రాగం వలన బంధం వస్తుంది కాని మనస్సు వికాసం చెందదు. నేనుకు లక్ష్యం ఆత్మే. కాని మనలను ఎవరైనా "నీ బుద్ధి మంచిది కాదు" అంటే బుద్ధే నీవు అనుకొని కోపం తెచ్చుకొంటావు. నీవు అనగానే, నీకు ఆత్మ స్ఫురించాలి. ఇంద్రియాల ద్వారా విషయచింతన చేసే దొంగ మనస్సు, ఆత్మ సుఖంలో ఆనందం చూచినా తిరిగి అలవాట్ల ప్రకారం బయటికి వెళుతుంది. కాని కొంతకాలానికి ఆ దొంగ తిండి కంటే స్వంత తిండే ఉత్తమమని గ్రహిస్తారు. వాసనల బలం వలన కొంత కాలం

srinannagaru.com

తిరగటం తప్పదు. దానికి గురుసహాయం ఎక్కువగా ఉపయోగపడుతుంది. హృదయ గ్రంథి అంటే "ముడి". ఒక్కొక్క వాసన ఒక్కొక్క ముడి. వాసనలను గ్రంథులు అంటారు. ఆ ముడే దేహానికీ, లోకానికీ కట్టేస్తాయి. మమకారం మొసలి పట్టు లాంటిది. మన హితవు కోరేవాడే గురువు. రూపనామాలను పట్టుకొన్న అహంకారాన్ని నిరంతరం పరిశీలిస్తూ ఉండండి అది నశిస్తుంది. మనం ఇచ్చే విలువలు, ఆదర్శాలు భూటకాలు, వ్యర్థమైనవి. నిజమైన జ్ఞానం మన హృదయంలోనే ఉంది. రూపాన్ని ఆరాధించే గుణం మనస్సుకు ఉంది. మనస్సును ఆకర్షిస్తుంది రూపం. పుట్టుకకు పూర్వం మన కుటుంబ సభ్యులకు రూపం లేదు. శరీర మరణం తరువాత రూపం లేకపోయినా మనస్సు ఏడుస్తుంది. రూప దృష్టి వచ్చేటప్పటికి ఆ రూపం ఒక కెరటంలా వచ్చేస్తుంది. మనం అందులో మునిగిపోతాము. పరిణామంలో దుఃఖాలు తీసుకొని వచ్చే సుఖాల వెంట వెళు తూ ఉంటారు. అహంకారానికి పొరలు ఉంటాయి. వాటిని ఒక్కొక్కటీ తీసివేస్తే ఆత్మ వస్తువు లభ్యమౌతుంది. విషయాలు ఆలోచించేవాడు ఎంతనిజమో, విషయాలు కూడా అంతే అసత్యం. వస్తువు ఇక్కడే ఉన్నా అజ్ఞానం వలన తెలియటం లేదు. ఉపాధే, జీవుడికి మేత. గాఢ నిద్రలో మనస్సు, శరీరం లేవు. నీ నిద్రలో లేని ఈ రెంటిపైనా నీకు ఎందుకు మమకారం. రూప, నామ, క్రియలు తీస్తే ప్రపంచం వేరే ఏదీ లేదు. అహంకారం రెండు రాక్షస కృత్యాలను చేస్తుంది. మన స్వరూపాన్ని మనకు తెలియకుండా చేస్తుంది. సుఖంలేని చోట సుఖం ఉందని భ్రాంతిని కలుగజేస్తుంది. భగవాన్ ఈ అహంకారాన్నే దెయ్యం, పిశాచం అని తిట్టేవారు ఈ విషయం తప్ప ఎవరినీ తిట్టేవారు కారు.

23. అహంకారాన్ని తొలగించుకోవటానికే సాధన. దానికి గురువు అను గ్రహం కావాలి. దానివలనే ఈ విషవలయం నుంచి బయటపడగలడు. దానికి వినయం కావాలి. దేశకాలాలలో నశించేది ఏదీ సత్యంకాదు. అజ్ఞాన మనేది లేనేలేదు అని నిశ్చయంగల వానికి జ్ఞానం వస్తుంది. ఏ ఇంద్రియ విషయాలైతే మనం అనుభవిస్తున్నామో ఆ విషయాలే మనకు దుఃఖాన్ని తీసుకొని వస్తాయి పరిణామంలో. ఏ వస్తువులోనూ సుఖం లేదు. మన శరీరానికి ఉన్న వయస్సు కన్న మన మోహానికి ఎక్కువ వయస్సు ఉంది కాబట్టి బలంగా ఉంది అందుచేతనే అజ్ఞానం నుంచి బయట పడలేకపోతున్నాము. ఎక్కడ భ్రాంతి కలుగుతుందో అక్కడ ఏమీ లేదని గ్రహించండి. ఇతరులు ఏమనుకొంటారో అనుకొనేది నీ అహంకారం యొక్క కల్పితం. మనం మంచిని చూడాలి. మన దృష్టి అఖండంగా ఉండాలి. మీమీద నాకు ద్వేషం ఉంది అనుకోండి మీ చిన్న పొరపాటే పెద్దదిగా

srinannagaru.com

కనిపిస్తుంది. అలాగే మీకు నామీద "ప్రేమ" ఉంటే నేను చేసే పెద్ద పొరపాటు కూడా చిన్నదిగా కనిపిస్తుంది. సర్వ కాల సర్వ అవస్థలలోనూ గంభీరంగా ఉండాలి. ఆత్మకు వాసనలు లేవు. దానికి రూపం లేదు. వికారం లేదు. అసత్యానికి వికారం ఉంది. ప్రతీ జీవి రూపనామాల రొంపిలో కూరుకొనిపోయారు, అందు చేతనే రూప దృష్టికి మనస్సు అలవాటు పడిపోయింది. చిన్న కోడలు, పెద్ద కోడలు, కూతురు అని అనేక రూపాల మీదకు పోతున్నది. చివరి దశలో మెడలో గొలుసు ఎవరికి ఇయ్యాలో తెలియకుండా అయోమయంలో పడిపోతుంది. మనస్సు నశిస్తే మనం నశించం దుఃఖం నశిస్తుంది. మనస్సు బాహ్యముఖంగా తిరిగే కొలది మనస్సుకు బరువు రాదు, పక్వత రాదు. ముగ్గదు. దాన్ని అంతర్ముఖం చేస్తేనే అది ముగ్గుతుంది. నీవు లోపల ఉన్నావని అనుకొంటున్నావు. కారణం దేహాత్మ బుద్ధివలన నిద్రలో నీవు బైటాలేవు. లోపలా లేవు. ఇవి మనస్సు కల్పించేది మాత్రమే. కొందరు వారి గ్రామంలో ఏమి జరుగుతున్నదో గుక్క తిప్పకోకుండా చెప్పగలరు కాని వారి లోపల ఏమి జరుగుతున్నదో తెలియదు. అది తెలుసుకొంటే జీవితం సఫలమౌతుంది. కొందరు మనస్సు యొక్క అస్థిత్వం ఉంది అంటారు. భగవాన్ అంటారు మైండ్ అనేది లేనే లేదు అని తెలుసుకో. ఉంది అని అనుకొంటే అదిపోదు. మనస్సుకు ఆధారంగా ఉన్నదే "నిజం" మనస్సు నిజం కాదు.

24. ఆలోచన, నిజం దగ్గరకు తీసుకొని వెళుతుంది. చూడబడేది లోకం, చేచేది మనస్సు. మాయ (మనస్సు) నశించినప్పడు బాధ తీసుకొని రాదు శాంతిని తీసుకొని వస్తుంది. పూర్ణస్థితిలో అంతా (జగత్తు-జీవుడు-ఈశ్వరుడు) ఒకే ముద్దగా కనిపిస్తుంది. ఒక అమ్మగారితో భగవాన్ ఇలా అన్నారు. నీ భర్తకు నీవు ఏమౌతావు భార్య, నీ మనమరాలకు అమ్మమ్మవు. నీ కొడుక్కి నీవు తల్లివి, నీ మేనకోడలకు నీవు అత్తవు, నిన్ను వారు భిన్న భిన్న కోణాలలో చూస్తున్నారు. వారు కల్పించుకొన్న భావాలతో ఉంటున్నారు. మరి నీవు ఎవరవు? ఆత్మవు. ఈ భావాలు అన్నీ కృత్రిమమైన "నేను" కల్పించినదే. అబద్ధమైన "నేను" పేకముక్కల కోట, భ్రాంతి వలననే భ్రమలో పడతాము. సీతమ్మ బంగారు లేడిని భ్రమించినట్లు అసలైన "నేను" (ఆత్మ) బంగారం. నకిలీ "నేను" (మనస్సు) రోల్డుగోల్డు "నేను" (అహంకారం) వచ్చాకే నీవు వచ్చావు (ప్రకృతి). నీవు వచ్చిన తరువాతే వాడు వచ్చాడు (వాడు అంటే ఈశ్వరుడు). అహంకారం లేకపోతే ఏమీలేదు అని అర్థం. తల్లి లేకుండా పిల్లలు లేరు. "నేను" అనే మొదటి తలంపుకే అన్ని తలంపులు వస్తాయి దేహం నేను అనే తలంపుకే అన్ని తలంపులూ వస్తాయి. ఈ అహంకారం వలన దేశాన్ని ఉద్ధరించగలమా? నేటి సమాజం పట్టుకొంటా

srinannagaru.com

మని పడగొడుతున్నారు. తెలుసున్నవారు మాట్లాడకపోతే బెంగపెట్టుకొంటాము. మన సరుకు అంత ఉన్నదన్నమాట! అసలు మాట్లాడితే ఏమిటి? మాట్లాడక పోతే ఏమిటి? అహంకారాన్ని ఊహించకండి అది లేదని గ్రహించండి. కామక్రోధాలు లోపల శత్రువులు. గుణాల యొక్క, అలవాట్ల యొక్క సమూహామే మనస్సు. బ్రహ్మానుభవం లేకనే, శివుడు గొప్పని కొందరు, విష్ణువు గొప్ప అని కొందరు అంటారు. వారు "మాయ"లో ఉండటం వల్లనే అలా అంటారు. వస్తువు అనుభవంలోకి వచ్చేవరకూ ఆ రూపాలపై విశ్వాసం ఉంటుంది, అనుభవం ఉంటే నమ్మకంతో పనిలేదు. స్థూలదేహం మరణం వలన మనకు ప్రయోజనం కాదు. స్థూలదేహం ఉండగానే సూక్ష్మ శరీరం నశించటం ముఖ్యం. ఆభాస, అంటే కానిది అయిన దానిలా కనిపిస్తుంది అదే అహంకారం. పరమ మూర్ఖుడు కూడా తాను తెలివైన వాడని అనుకొంటాడు. కారణం అహంకారం. అహంకారం గాడు ఊరతాడు. ఇదే మాయ.

25. పునర్జన్మకు బయలు దేరిన జీవుడు మరో శరీరం ఎక్కడ దొరుకుతుందా అని వెదుకుతాడు. అన్ని శరీరాలలోకీ వెళ్ళడు. వాడికి అనువైన శరీరం కోసం వెదుకుతాడు. అర్హతనుబట్టీ శరీరం వస్తుంది. అందరికంటే పెద్ద "దాత" ఎవరంటే "లోభి" అని ఒక ఉపనిషత్ అంది. అంటే ఒక్కపైసా కూడా దానం చెయ్యకుండా కూడబెట్టి చివరకు మరణిస్తాడు. తరువాత అతని సంపద వాని వారసుల పరమౌతుంది. అందుకే పెద్ద దాత అన్నారు. కల్పితాలకన్న, ఆత్మ గొప్పది. మనస్సుకు కల్పితాలు అంటే ఇష్టం. అహంకారం ఎప్పుడు నశించిందో అది కల్పించే శరీరం, ధనం, దేవుడు అధికారం ఇత్యాది భావాలు అన్నీ నశించిపోతాయి. నీళ్ళ వాడకం కన్న "నేను" వాడకం వలననే పాపం ఎక్కువై అజ్ఞానం పెరుగుతుంది. అజ్ఞానానికి సైన్యం ఉంది అది మీ కూడా పరిగెత్తుకుంటూ వస్తూ ఉంటుంది. నీకు బయట లోకం ఉంది. జ్ఞానికి ఉండదు. అందుచేతనే "వాళ్ళు నాగురించి ఇలా అనుకొంటున్నారు" అనే సంకల్పం ఉదయించదు. మనస్సు కదలమన్నా కదలదు. "నేను-నేను" అనేది కొంచెం కూడా ఎక్కడ లేదో అక్కడే పరమాత్మ ఉన్నాడు. ఒక బల్లమీద ఒక వస్తువు ఉంది అనుకోండి, బల్లను లాగేస్తే ఆ వస్తువు పడిపోతుంది. కారణం ఆ వస్తువు బల్లను ఆశ్రయించుకొని ఉంది కాబట్టి. అలాగే మన సంస్కారాలు కృత్రిమమైన "నేను"ను ఆశ్రయించుకొని ఉన్నాయి కాబట్టి ఆ "నేను"ను లాగేస్తే సంస్కారాలు పడిపోతాయి. మనస్సుకు మౌనం అలవాటు చేస్తే అహంభావన నశిస్తుంది. "భయం" మానసిక వత్తిడి వల్లనే వస్తుంది. దేహం వచ్చేసింది అంటే పరిమితులు వచ్చేస్తాయి. వాటి నుంచి

srinannagaru.com

కావలసినంత దుఃఖం వచ్చేస్తుంది. ఏది మంచిది కాదో అది మంచిదని చెప్పేది రాగం. పరిణామంలో దుఃఖం తీసుకొని వచ్చేది రాగం. కార్యాచరణకు సంబంధం పెట్టేదే మనస్సు. మనిషికి, మనిషికి సంబంధం పెట్టేది మనస్సు. అంటే మాటల ద్వారా, జగడం పెట్టేదే మనస్సు. స్థూల బుద్ధి ఉన్నవాడు ప్రకృతి, ప్రలోభాలకు లొంగిపోతాడు. సూక్ష్మదృష్టి ఉన్నవాడు వీటి ప్రలోభాల నుండి దాటిపోతాడు.

26. "నేను" గురించి మీకు తెలియకపోతే పుట్టుక, చావుల యొక్క రహస్యం మీకు తెలియదు. మీకు ఇష్టంలేని వ్యక్తులు కనబడినా లేదా వారి నామ రూపాలు గుర్తుకు వచ్చినా మీకు దుఃఖం వచ్చేస్తుంది. కారణం మీరు నామరూపాలలోంచి విడుదల పొందలేకపోతున్నారు. సత్యం మీరైనా అది మీకు గుర్తుకు రావటం లేదు. మీరు అహంకార పరిధిలో ఉండటం వలన జ్ఞానిని ద్వేషించినా బాధపడడు. విమర్శలు, స్తోత్రాలు అహంకారానికే, అనవసరపు విషయాలు తలపెట్టుకొంటూ ఉంటే భగవాన్ అనేవారు అవి తలపెట్టుకొని బాధ పడటం ఎందుకు అనేవారు. మోహం లేనివాడికి బంధం లేదు. రూప నామాల వలననే బంధం పుడుతున్నది. మీరు మిథ్యా "నేను" లోనే బ్రతుకుతున్నారు. అందుకే దుఃఖం కొందరు అధిక అహంభావంతో వ్యవహరిస్తూ సమాజానికి, కుటుంబానికీ, వారి చేష్టలు ఉపయోగ పడవు. నీవు కాని దేహాన్ని, గౌరవాన్ని, చదువును నీవు అనుకొంటున్నావు. అజ్ఞానాన్ని పెంచుకొంటున్నావు. రాజు అసమర్థుడు అయితే మంత్రి చెప్పినట్లు వింటాడు, లోపల సద్వస్తువు తెలియనప్పుడు ఇంద్రియాలనే భటుల చేతులలో జీవుడు నడచుకొంటాడు. దేహగతమైన బుద్ధి వచ్చినప్పడే, ఆ వచ్చే గొడవలలో కొట్టుకుపోతున్నాము. కాని దేహగతమైన మూలతలంపును పట్టుకోలేక పోతున్నాము. అందుచేతనే కృష్ణుడు "నా మాయను ఎవరూ దాటలేక పోతున్నారు" అన్నాడు. ప్రతీ మనిషికి ఆర్థిక సంబంధమైన ఇతర బాధలు పదిశాతం మాత్రమే ఉండవచ్చును. మిగిలిన తొంబైశాతం అహంకారం వల్లనే. గురు అనుగ్రహం ఎప్పడు వస్తుందో అప్పడు అడ్డుకొనే అశాంతి పరిస్థితులు ఉండవు. మనకు భ్రాంతిని కలుగజేస్తే అది మాయ యొక్క ప్రభావం. మాయ చైతన్యం యొక్క అధీనంలో ఉంది. అది మనకు తెలిస్తే మాయ నుంచి బయటపడతాము. ఉన్న సద్ వస్తువు ఉన్నట్లు తెలిసే వరకూ మాయ వదలదు. ఏద్వైతే లేదో అదే మాయ. మీ కళ్లకు కనిపించే ప్రపంచం అంతా మాయ యొక్క కల్పితమని, తెలిసే వరకూ మనస్సు అంతర్ముఖం అవ్వదు. మోహం నశించినవానికి గాని సద్‌బుద్ధి కలుగదు.

27. నీకు సంకల్పాలు, వికల్పాలు కల్పించేది నీ మనస్సే. నిన్ను శిక్షించేది

srinannagaru.com

నీ మనస్సే. మీ మనస్సుకు "పౌడరు, స్నో"లు రాయకండి. దాని అందాన్ని అదే ముస్తాబు చేసుకొంటుంది, పొగడ్తలతో. మీ సద్గురువును కపటం లేకుండా ప్రేమిస్తే అదే తపస్సు. ఆ గురువే మీలో ఉన్న సద్ వస్తువును మీకు పట్టి ఇస్తాడు. నేను అనే తలంపు నీకు నరక యాతన కలిపిస్తుది. ఎలా అంటే పేదవాడిని, ధనవంతుడిని, అందగాడిని అని వాటితో తాదాత్మ్యం పొందటం వలన అన్ని సంకటాలు కలుగుతున్నాయి. ఈ బుద్ధికి సత్యవస్తువు తెలియదు. ఆహార శుద్ధి, ఇంద్రియ శుద్ధి, మనో నిశ్చలత వలన జ్ఞాన నిష్ఠ కలుగుతుంది. భూమికి ఎంత ఆకర్షణ శక్తి ఉందో; మనస్సుకు, లోక విషయాలపై అంతగా ఆకర్షణ ఉంది. మనలోని రాగ-ద్వేషాలు చాలా క్రూరంగా ఉంటాయి. వాటి వలన అశాంతి కలుగుతుంది. మనం ప్రధాన మంత్రి దగ్గర కూర్చుని భోజనం చేసినా, పూట గడవని వాని దగ్గర కూర్చుని భోజనం చేసినా అదీ మాయే, ఇదీ మాయే. అహంకారానికి సాధన అంటే ఇష్టం ఉండదు. ఎందుచేతనంటే తన్ను తాను నాశనం చేసుకోవటం అంటే ఇష్టముండదు. "నేను ఉన్నాను" అనుకొనే వాడికి జీవ లక్షణాలు లేనట్లే. నేను పేదవాడిని, ధనవంతుడిని, అందగాడిని, కురూపిని ఇలా ఎన్నో రకాలుగా అనుకొనే వాటితో తాదాత్మ్యం చెందకుండా ఉంటే, జీవుడు దాని అంతట అదే ఆత్మ గూటిలోకి వెళ్ళిపోతుంది. బంధం, మోక్షం నీ బుద్ధిలోని "వృత్తి" అని వేదాంత పరిభాషలో అంటారు. అహంకారం, మమకారం ఈ రెండూ దగ్గర స్నేహితులు వీరికి వారు గాలి కొడితే వారికి వీరు గాలి కొడుతూ "సై" అంటే "సై" అని ఒకరికి ఒకరు అంగీకారం తెలుపుకొంటారు. మమకారం అహంకారానికి నీళ్ళు పోస్తూ ఉంటే అహంకారం పెరిగిపోతూ ఉంటుంది. అజ్ఞానం అంతా ఈ రెంటి రూపంలో ఉన్నాయి. తాడూ బొంగరం లేని వానికి కూడా గర్వం ఉంటుంది. కారణం వారిలో ఉన్న అజ్ఞానమే, గర్వంగా వస్తుంది. ఈ గర్వం వచ్చినప్పుడు దేహబుద్ధి పెరిగిపోతుంది. ఆత్మ బుద్ధికి దూరమౌతాడు.

28. మనస్సుకి వేరుభావన అంటే ఇష్టము. ఆత్మభావన అంటే ఇష్టం ఉండదు. మనస్సులో కొన్ని కోట్ల జన్మలకు సరిపడే తలంపులు ఉన్నాయి. మనస్సు అడుగున ఒక తలంపు ఉంది అదే అహంకారం. అదే నేను. మొదటి తలంపు + అనేక తలంపులు = మనస్సు. ప్రథమ వికారం అహంకారము, ఆ "కారం" వచ్చిన తరువాతే మిగిలిన "కారాలు" అన్నీ వస్తాయి. మనకు వేరు వేరు భావన ఉంటేనే ఇతరులను చూడాలని అనిపిస్తుంది. అందుకే శివుడు, పార్వతికి అర్థ భాగాన్ని ఇచ్చేయటం వలన పార్వతికి వేరు భావన పోయింది. అహంభావన నశిస్తే ఉన్నది ఒక్కటే. సిద్ధులు కనికట్టు విద్యలు ఆ విద్యలను ప్రదర్శించే వారు వేలాది

srinannagaru.com

రూపాయలు మనకు చూపించి కార్యక్రమం అనంతరం మనలను చేయిచాచి యాచిస్తారు. ఆత్మ విద్య ఒక్కటే నిజమైన విద్య. నేను చనిపోతున్నాను అనే అహంకారమే పునర్జన్మకు, ఇతర లోకాలకు వెళ్ళిపోతుంది. ప్రయత్నం చేస్తే మనస్సు నశిస్తుంది. దృశ్యం ఏదో ఒక రోజున నశిస్తుంది. నశించటమే కాదు, దృశ్యం బుద్ధి యొక్క కల్పితం. గొప్పలు పెంచుకొనే కొలది అహంకారం అనే గొయ్యి పెరుగుతుంది. ద్వైత బుద్ధి ఉన్నవానికే దృశ్యం ఆకర్షిస్తుంది. మీరు దృశ్యాల చుట్టూ తిరగకుండా ఆత్మ యందే మనస్సును నిలబెట్టాలి. దృశ్యం నిజం కాదు. ఆలోచనలు వచ్చినప్పడే మాటలు వస్తాయి. చేను ఊడ్చికోతకోయటానికి ఐదు మాసాలు వ్యవధి చాలు. కానీ మానవ మానసం అంత తొందరగా పక్వానికి రాదు. విశ్వగతమైన "నేను" కు తలంపులు ఉండవు. శరీర మాత్రుడను అనే "నేను"కే తలంపులు వస్తాయి. ఈ "నేను" ఆకారాలను ప్రేమిస్తుంది. అంతేకాదు ఆకారాలను మారుస్తుంది. మనం ఈ అహంభావాన్ని అనుమానించం, ఈశ్వరుణ్ణి అనుమానిస్తాము. ఎందుకూ పనికిరాని అహంభావాన్ని విడిచిపెట్టము దీని కన్న పశువుల పేడ ఎరువుగా ఉపయోగపడుతుంది. దేహాభిమానం పోయేడప్పడు విపరీతంగా బాధపడతాము. మనస్సుకు విషయాలు అంటే చాలా ఇష్టం. స్థూల శరీరం ఉందని చెప్పేది సూక్ష్మ శరీరం. నేను అనే మూల తలంపును నీవు కదిపితే, పేక ముక్కలతో కట్టిన గోడలా పడిపోతుంది అది.

29. మానసికంగా శారీరకంగా అలసిపోవటానికి కారణం వ్యక్తి భావనే. మానవుడికి మొదటి వికారం అహంకారం తరువాత, బంధం మోహం, వికారం లేని వస్తువుకు ఆకారమే లేదు. అది ఒకటిగానే ఉంది. పేకాట బాగా అలవాటు పడ్డవాడు కొంచెం వివేకంతో ఎందుకు ఈ జూదం అని మానేసి ఇంటి దగ్గరే సుఖంగా ఉండిపోయాడు అనుకోండి, కాని అంతకు ముందు ఉన్న పేకాట రాయుళ్ళు వారి ఇంటికి వెళ్ళి ఇంతకాలం పేకాట ఆడి, ఇప్పడు మానటం ఏమిటని చేయి పట్టుకొని లాక్కొని వచ్చేసి ఆడిస్తారు ఆటను. అలాగే నీ మనస్సు సద్గోష్టి వలన వివేకం వలన హృదయ గుహలోకి వెళ్ళాలని ఉంటుంది. కాని అహంకారం చెయ్యిపట్టుకొని బయటి ప్రకృతిలోకి లాగుకొని వచ్చేస్తుంది. తల్లి గర్భాన్ని రూపం కోసం ఆశ్రయిస్తాడు జీవుడు. దేహమే నేను, అదే శాశ్వతం, అనే బుద్ధి ఎవడికి ఉంటుందో వాడికి వేదాంతం విన్నా మెదడుకు పట్టదు. నీ మనస్సు చేసే వంచన ఏమిటి అంటే లేని దాన్ని ఉన్నట్లు, ఉన్నదాన్ని లేనట్లు అనిపింపచేస్తుంది. మనకు ఏ తలంపు వచ్చినా భూతద్దంలో విశ్లేషణ చేస్తే దేహమే కారణమౌతుంది. దేహ భావన వలననే శరీరాలు వస్తున్నాయి. చాలామందికి దుఃఖం భయం వల్లనే

srinannagaru.com

వస్తుంది. "మాయ-మాయ" అంటే మారే వస్తువు, మారని వస్తువు ఆత్మ. సాధారణమైన వానికి కోపం వచ్చినా కొంతకాలానికి పోతుంది. కాని దుర్మార్గుడికి కోపం చచ్చిపోయేవరకూ పోదు. జీవితంలో చాలా అభివృద్ధిలోకి రావాలని ఉంటుంది కాని అది కూడా అహంకారమే అసలు వస్తువులో ఆ తలంపులు లేవు. బుద్ధికి నిజం మీద పక్షపాతం ఉంది మీరు కోటి జన్మలు ఎత్తినా ఆ "నిజం" గ్రాహ్యమయ్యేవరకూ చాపల్యం ఆగదు. జీవుడికి చాలా భయాలు ఉన్నాయి. అందులో మరణ భయం పెద్దది. ఆత్మలో భయం లేదు అది శాశ్వతం. "నేను" అనేది మొదటి తలంపు అంటారు వేదాంత పరిభాషలో, కానీ భగవాన్ అన్నారు అది మొదటి తలంపు కాదు. మొదటి పొరపాటు ఆ మొదటి తప్పకే అనేక తప్పలు వస్తాయి. అజ్ఞానం అనేది అహంకార రూపంలో ఉంది అని తెలుసుకోండి. పేపరులో నాపేరు వ్రాయండి అనటం అహంకారం, రాయవద్దు అనటం అహంకారం ఆ సంగతి తెలియటంలేదు.

30. ఆచార్యులవారు ఈ లోకం నిజమని ఎందుకు అనలేదు అంటే నిజం అంటే నీ మనస్సు రంపం పెట్టి కోసినా లోపలకు వెళ్ళదు. నిన్ను నీవు చూచుకొని లోకాన్ని చూస్తే లోకం నీకు భిన్నంగా లేదని గ్రహిస్తావు. దేవుడు అంటే శాంతి, సుఖం, ఆనందం. సంగీతం వినిపించేడప్పడు "శ్రుతి" ఎల్లప్పడూ ఎలా వస్తూ ఉంటుందో అలాగే ప్రతీ తలంపుకూ మూలం "నేను" అనే మూల తలంపు శ్రుతిలా మనలను వెంటాడుతుంది. "మిధ్యా నేను" నిజంగా లేదు. ఉంది అనుకొంటున్నావు. అందుచేతనే నీవు తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి అన్నారు భగవాన్. చిన్న "నేను" విడిచిపెట్టకుండా పెద్ద నేను ఎలా తెలుస్తుంది. వాడు కొట్టాడు, వీడు తిట్టాడు అనుకొంటూ ఉంటే వాడి మీద కోపమే తిరిగి భూమి మీదకు తీసుకొని వచ్చేస్తుంది. నీవు వాడిని క్షమించలేకపోతే నిన్ను భగవంతుడు ఎలా క్షమిస్తాడు. నీకు మోక్ష సామ్రాజ్యం ఎలా సంప్రాప్తమౌతుంది. మరుపు-జ్ఞాపకం మనస్సులోనే ఉన్నాయి. మనం దృశ్యాలను చూచేడప్పడు, మరలా ఒక వినరాని మాట విన్నా, మాట్లాడినా మనస్సు విషపూరితమౌతుంది. వ్యక్తి భావన లేకుండా పనిచేసుకోవాలి. మనస్సుతో యుద్ధం చేస్తే అది బలపడుతుంది. నీవు నీవుగా ఉండు. అహంకారం పత్తా లేకుండా పోతుంది. మీరు గతించిన విషయాలు, విషయవాసనలు తరచుగా జ్ఞాపకం వస్తూ ఉంటే మీరు పూర్తిగా "మాయ"లో ఉన్నట్లే లెక్క. మన దేహం, మన ఇష్టాలు, మన అయిష్టాలు ఇవి నేను కాను . ఇవి నేను కాను అనుకొంటూ గెంటుకుపోతూ ఉంటే "సత్యం" తెలుసుకోగలరు. తోలుబొమ్మలాట దగ్గర

srinannagaru.com

కూర్చున్నవాడు సత్యాన్ని తెలుసుకోలేడు. చావే తలంపైనప్పుడు ప్రతీదీ తలంపే. బ్రాహ్మీస్థితి వచ్చినప్పుడు ఇది తలంపుకాదని తెలుస్తుంది. కృతజ్ఞత ఆశిస్తే వ్యక్తి భావన పెరిగిపోతుంది.

31. మనం "నేను-నేను" అనే "నేను"ను భుజాన్ని వేసుకొని తిరుగు తున్నాము. ఆనేనే నిజమని నమ్ముతున్నాము. నేను, ఇంద్రియాలతోటి- మనస్సు తోటి-లోకంతోటి తాదాత్మ్యం చెంది మురికి చేసుకొని మురికి గుంటలో నీరులా ఉంటే మీకు సంతోషంగా ఉందా! స్వచ్ఛంగా, నిర్మలంగా, ఆకాశగంగ లాంటి "నేను" మీ హృదయంలోనే ఉంది. లోపలికి వెళ్ళి వెదకండి దొరుకుతుంది. ఈ విషయాన్నే భగవాన్‌తో ఒకరు ఇలా అన్నారు. "లోపలికి వెళ్ళండి, లోపలికి వెళ్ళండి అంటున్నారు. ఎలా వెళ్ళేది అంటే భగవాన్ అన్నారు నీ సంస్కారాలను, నీ తలంపులను చీల్చుకొని వెళ్ళటమే" అన్నారు. అవిద్య అహంకార రూపంలో ఉంది దాన్ని కాల్చి బూడిద చేస్తే అది నశిస్తుంది. అంతర్ దృష్టి కూడా గురువు అనుగ్రహం లేకుండగా కలుగదు. సినిమా చూచే అలవాటును మీరు రిపీట్ చేస్తే అది పెరుగుతుంది. అణచివేస్తే అది పోతుంది. దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూడటం ఆపితే అది క్రమంగా క్షీణించి పోతుంది. మనస్సుతో నేర్చుకొన్నది ఏదో ఒకరోజున మర్చిపోవాలి అలా మర్చిపోయే రోజు ఏదో ఒక రోజున వస్తుంది. మనం పని దొంగలాగా ఉండకూడదు. మమకారం లేకుండా మీ దైనందిన జీవితంలో అహంకారం లేకుండా పనిచేస్తే మీరు తరిస్తారు. మనం దేవునికి భక్తులం కాము అహంకారానికి భక్తులం పైకి నటిస్తున్నా లోపల అది ఎలా చెబితే అలా చేస్తాము. దేవుడితో కూడా ఈ అహంకారం ఇలా చెయ్యి అంటుంది, ఆదేశిస్తుంది, ఏది మంచిదో దానికి తెలియదు. దొంగ నేను ద్వంద్వాల మధ్య తిరుగుతుంది. స్వార్థంతో చేసే కర్మ నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుంది. అది దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. అన్ని పాపాల కంటే మనిషిలో ఉన్న స్వార్థమే పెద్ద పాపం. అహంభావన ఉన్నవాడు మనిషి. అది లేనివాడు ఋషి. అహంభావనకు మరో పేరే ప్రపంచం. మరో పేరే సృష్టి. అహంభావన వలనే లోకం వేరు అనుకొంటు న్నారు. అహంభావన అణిగితే లోకం అణిగిపోతుంది. నేను-నేను అనే అహంకారం తో మిడిసి పడుతున్నావు ఆ నేను మీద దుమ్ము చల్లు అంతే గాని అలంకరించకు అలా చేస్తే అది ఎలా పోతుంది. కృత్రిమమైన గౌరవాలకోసం అలవాటు పడిపోయి దాన్ని తొలగించుకోలేకపోతున్నాము.

32. అదృష్టం, దురదృష్టం మూల తలంపుకే. సత్యానుభవం కలిగాక ఏ దృశ్యాన్ని చూచినా, నిగ్రహించుకొందాము, నిగ్రహించుకొందాము అనే అవసరం

srinannagaru.com

ఉండదు. కారణం మనస్సు అక్కడ లేదు. కాబట్టి మనస్సు చెప్పినట్లు గంతులు వెయ్యకు. ప్రవాహానికి ఎదురీదు. అహంకారం ఉదయించగానే దాన్ని గుర్తించి ప్రక్కన పెట్టు అలా చెయ్యకపోతే అది ఇతర గొడవలోనికి నిన్ను తీసుకొని వెళ్ళిపోతుంది. కారణం దానికి ఆహారం అదే కాబట్టి. మనస్సు అటూ-ఇటూ పోతూ ఉంటే స్థిరత్వం ఉన్న మనస్సు గల వానితో సహవాసం చేస్తే నీ మనస్సు స్థిరత్వం చెందుతుంది. శాంతిని అనుభవిస్తుంది. మనస్సు అంటుంది, ధ్యానం చేసుకో. అది చేసుకో అని అంటుంది. అదే ఆటంకమని మనకు తెలియనియ్యదు. పెంట మీద కూర్చుని వాసన వేస్తున్నది అనుకోవటం ఎటువంటిదో నీ మనః పరిధిలో ఉండి శాంతి లేదు అనుకోవటం కూడా అటువంటిదే అహంకారమనే సర్పం ప్రమాదం. అది అనారోగ్యం వలన పడుకొన్నా తిరిగి ఎప్పుడో ఒకప్పుడు కాటేస్తుంది. మనస్సుకు రూపాలు అంటే ఇష్టం దేవాలయాలలో ఒక ఫేస్‌లో ఉన్న దేవుడు కావాలి ఈ మనస్సుకు. మనస్సు ఉన్నంతకాలం ఆకారాలు లేని దేవుణ్ణి ఊహించలేము. అహంభావన పెరిగే కొలది నీచమైన తలంపులు. క్షుద్రమైన తలంపులు వస్తాయి. కొందరికి వచ్చే కలలను కూడా ఇతరులకు చెప్పకోవటానికి వీలుగానివిగా ఉంటాయి. మనస్సు అణిగి ఉంటే నీవు ఎక్కడ ఉన్నా శాంతంగా, సుఖంగా రోజులు వెళ్ళిపోతాయి. జీవుల యొక్క రూపాలు పోవు రూపాంతరం చెందుతాయి. నీ మనస్సు ఎంత నిజమో, నీ భోగాలు అంతే నిజం. శరీరంలో ఉన్న రోగాలు కోసం ఎన్ని "ఎక్సరే"లు తీయించుకొంటాము. మనస్సులోకి వచ్చే చెడు తలంపులు ఎన్నో? ఎంత మెలుకువగా ఉన్నామో గ్రహించాలి. జుట్టు తెల్లబడితేనే రంగు వేసుకొన్న శ్రద్ధ, బట్టలకు ఇచ్చే శ్రద్ధ, మనస్సుకు ఇవ్వటం లేదు. గతించిపోయిన విషయాలు మర్చిపోవాలి. "మాయ" గతించిపోయిన విషయాలనే గుర్తు చేస్తుంది.

33.ఈ ప్రపంచ సంబంధాలు ఏవీ నిజం కావు. తల్లి బిడ్డ తండ్రి కొడుకు భార్య భర్త సంబంధాలు నిజం కావు. నిజం కావని బాధ్యతల నుంచి తప్పించుకోకు. శరీరం మరణిస్తే ఎవరికి ఎవరూ సంబంధం ఉండదు. ఈ బంధం అంతా నిజమనుకొని దేవుణ్ణి వదులుతున్నావు. కృష్ణుడి మీద నీకు ఉన్న పరాభక్తి నిజంగా కలిగితే ఈ బంధాలు నిన్ను బంధించవు. తూకం లేని మనిషి ఏమి అంటారు అంటే. వాడికి ఉన్న కపటం వాడు గ్రహించకుండా ఎదుటి వాడి కపటాన్ని విమర్శిస్తాడు. ఆ అధికారం వాడికి ఎక్కడ ఉంది. దేవుడు చేసే పనే జీవుడు చేస్తున్నాడు అనుకొనేవాడు ఎలా ఉంటాడంటే రెండెడ్ల బండి వెళుతూ ఉంటే ఒక కుక్క బయట ఎండ వలన తన ప్రయాణం కష్టంగా భావించి బండి క్రింద

srinannagaru.com

దూరి ఆ నీడలో సుఖంగా ప్రయాణం చేస్తున్నది. బండి భారాన్ని ఎడ్లు లాగుతున్నాయి. కాని కొంత సమయానికి ఆ కుక్క అనుకొంది ఇలా "ఈ బండిని నేనే లాగుతున్నాను", అని. అలాగే మానవుడు భగవంతుని నీడలో ఉండి సుఖంగా ఉండక అంతా నేనే చేస్తున్నాను అనుకొంటాడు. నాగుపాముకు ఒకటే "పడగ" ఉంటుంది. కాని అహంకారానికి త్రిగుణాలనే మూడు పడగలుఉంటాయి. అభిమాన రూపం అహంకారంలో ఉంటుంది. అభిమాన దోషం అహంకారానికి నీరుపోస్తుంది. మనస్సు కల్పించిన విషయాలను తెలుసుకోమంటే మనస్సు తెలుసుకొంటుంది. మనస్సు కల్పించని ఆత్మను తెలుసుకోమంటే దాన్ని తెలుసు కోవటానికి ప్రయత్నం చేస్తూ దాని అస్తిత్వాన్ని పోగొట్టుకొంటుంది. మనస్సు సాధ్యమైనంత వరకూ శాంతంగా, ఏకాగ్రంగా ఉంచుకోవాలి. అందరికీ కల్పించు కొన్న గొడవలే కావాలి కారణం ఈనేను కూడా కల్పించుకొన్నదే కాబట్టి. అందరికీ కృత్రిమమైన "నేను" గొడవలే, కృత్రిమంలేని "నేను" ఎవ్వరికీ అక్కరలేదు. మనస్సు ను అదుపుచేసుకొన్న వానికి అమృతానుభవం కలుగుతుంది. మనం "భూతాలు" ఎక్కడ ఉన్నాయో అని అనుకొంటాము. అహంభావన అనేది పెద్ద "భూతం". అది ఎన్నో దేహాలను పట్టుకొంటుంది. దానికి రూపం లేదు.

34. ఏమీ తెలియని వాడు జీవుడు. అన్నీ తెలుసున్న వాడు దేవుడు. ఇప్పుడు ఏమీ తెలియని వాళ్ళు అన్నీ తెలుసును అని సమాజాన్ని పీడిస్తున్నారు. మాటల వద్ద జాగ్రత్తగా ఉంటే మనస్సుకు ఆరోగ్యం. ఆస్తి రెండు రెట్లు పెరిగింది అనుకోండి ఆస్తి సంతోషించదు. అది జడం, నేను అనే తలంపు మనలో ఉంది అది సంతోషిస్తుంది. అలాగే ఆస్తి అమ్మవలసినవ్వడు కూడా ఈ నేనే విచారపడుతుంది. ఈ నేనులోనే విరోధులు, స్నేహితులు, ఈ నేను అణిగిపోతే ఏమీలేదు. మూల తలంపుకు రూప నామాలు మేతను సప్లై చేస్తాయి. లోకంలో మనుషులను చూచి కంగారు పడకండి, ఇష్టం, అయిష్టం అన్నీ నేనులోనే ఉన్నాయి. ఇది అర్థం చేసుకోండి, నేను అణిగితే ఏమీ లేవు, నీవు ఉన్నావు. ఈశ్వరుడు నిన్ను తనలోకి కలుపుకోవటానికి ఎదురుచూస్తున్నాడు. కొంచెం వివేకం కలిగి ఉండండి. గాఢాంధకారం అంతా మూల తలంపులోనే ఉంది. అందులో ఉన్న వారు ఎంత ధనవంతులైనా అందులోంచి విడుదల పొందవల సిందే. ఈ మూల తలంపు ప్రతీరోజూ ఏదో ఒక గొడవ, ఏదో ఒక చిక్కు తీసుకొని వస్తుంది. గొడవలు లేకుండా అది ఉండలేదు. అది తీసుకొని వచ్చే తలంపులు చూచి కూడా ఉండలేకపోతున్నాము. అటు చూడటం ఏడవటం ఇదే పని. సత్యం వైపుకు చూడలేకపోతున్నాము అంటున్నారు కారణం పుణ్యబలం, సాధనా

srinannagaru.com

బలం లేకపోవటమే, దానికి గురువు అనుగ్రహం కావాలి. సత్పురుషుని సహాయం వలన సత్‌ను తెలుసుకోవాలనే కాంక్ష కలుగుతుంది. ఆధ్యాత్మిక అభివృద్ధికి శ్రమ -క్రమ శిక్షణ అవసరం. అవివేకికి ఇతరులు ఉన్నారు వివేకానికి ఇతరులు లేరు. ఆకాశంలో మేఘాలు, అటూ, ఇటూ కదులుతూ ఉంటాయి. నీ మనస్సులో ఇష్టాయిష్టాలు అటూ ఇటూ తిరుగుతూ ఉంటాయి. ఒకరిని చూస్తే మొట్టాలని అనిపిస్తుంది. ఒకరిని చూస్తే పెట్టాలని అనిపిస్తుంది. నీ హృదయంలో ఆనందం కొంత రుచి చూస్తే పైవి ఏవీ బంధించవు. అంతవరకూ ఊరూరా తిరుగుతూ ఉంటావు. వేదనపడే బుద్ధి అలవాటైపోయింది. నీ వైభవాన్ని కొంచెం రుచిచూడు.

**35.** కుక్క తోక ఎటువంటిదో మనం చూచే ఈ లోకం అటువంటిదే. ఈ లోకానికి ఎంతో మంది జ్ఞానులు వచ్చినా పూర్తిగా సరిచెయ్యలేరు. "దేహి" అంటే దేహమును దరించినవాడు జీవుడు. ఇల్లు, ఒళ్ళు శుభ్రం చేసుకొంటున్నారు అలాగే మనస్సును కూడా శుభ్రం చేసుకోవాలి. మరణానంతరం కూడా వచ్చేది అదే. మనస్సును నియమబద్ధంగా, క్రమశిక్షణగా ఉంచుకోవాలి. మన స్వరూపాన్ని దూరం చేసేది మన తలంపులే. మనిషి రూప-నామాలతో అతని మనస్సు బాహ్యా ముఖానికి వెళ్ళిపోతే దుఃఖానికి కారణమౌతుంది. సంకల్పాన్ని త్యాగం చెయ్యకుండా మనస్సు నశించదు. ఇతరులతో గౌరవించబడాలనే కోరిక ఉంటే భక్తులం అవ్వలేము. కారణం దానివలన మనస్సు బాహ్యాముఖానికి వస్తుంది. మనస్సుకు సంబంధించిన వృత్తులే ఈ కక్షలు, ఈ కార్పణ్యాలు, ఈ కుటుంబ విరోధాలు. ఆ గడప దాటితే అంతా ఆనందమే ఎవరో వచ్చి మిమ్ములను యాతన పెట్టరు. మీ మనస్సు చాలు ఈ యాతనలు అన్నీ పెట్టటానికి. కాబట్టి ఈ యాతనా శరీరం నుంచి బయటికి రావాలి. నా బుద్ధి, నా మనస్సు అని అనుకొన్నంతకాలం కర్తృత్వ బుద్ధి పోదు. దానితో మనకు దుఃఖం పోదు. మాట్లాడితే మన అహంకారం, మన బుద్ధిని, మనస్సును వాడుకొంటుంది. మనకు ఇంకెక్కడ జ్ఞానం కలుగుతుంది. వాసన ఉన్నవానికి సంసారం తప్పనిసరిగా వస్తుంది. వాసన వస్తువును తెలియనియ్యదు. వాసన కూడా రోగమే. సోమరికి తిరోగమనమే గాని పురోగతి లేదు. అహంకారం జాగ్రదవస్థలోను స్వప్నావస్థలోనూ తలంపులు వేసుకొని తిరుగుతుంది. ఇద్దరు కలసినప్పుడు వాడి అహంకారాన్ని వీడు, వీడి అహంకారాన్ని వాడు పొగుడుకొంటూ చివరికి ఇద్దరూ కలసి గోతులో పడతారు. అంటే చీకటి జీవితాలు వస్తాయి. ఎరుకలోనూ, కలలోనూ, గాఢ నిద్రలోనూ జీవిస్తున్నాము. వాసనలు ప్రాచీన కాలం నుంచి వస్తున్నాయి. అవి తొందరగా పోవు. తలంపులు మేఘాలు లాంటివి. అవి జ్ఞాన సూర్యుణ్ణి కనిపింపనివ్వవు.

srinannagaru.com

36. సంసారమంటే అహంకారమే. మీ కుటుంబంలో పదిమంది ఉంటే, చెడ్డ జరిగితే కృంగిపోవటం, మంచి జరిగితే పొంగి పోవటం. రైలు ప్రమాదంలో వంద మంది చనిపోతే "అయ్యోపాపం పోయారు" అని అనుకోము. మన ఇంటిలో పోతేనే దుఃఖం వస్తుంది. ఇదే అహంకారం. శ్రీరాముడు పరమాత్మ, లక్ష్మణుడు రాముని పాదాలు ఆశ్రయించి జీవించినట్లు మనం జీవించాలి. గౌరవం పోతుంది అనుకోవటం మనఃపరిధిలోనిది. ఆత్మలో సమస్యలు లేవు, గౌరవాలు లేవు. కలహాలు అన్నీ అహంభావనే కల్పిస్తుంది. మనస్సును అరగదీసి, అరగదీసి వదిలితే నీవు పవిత్రుడివి అవుతావు. బాడి-దుమ్ము అంతా మనస్సులోనే ఉంది. సంతోషం కూడా సంసారమే ఈ విషయం మర్చిపోకండి. ఇంట్లో వ్యతిరేకమైన వాళ్ళు ఉంటే "ఎడ్డిం" అంటే "తెడ్డిం" అనే వాళ్ళు ఉన్నా అది కూడా సంసారమే. మనస్సు బయటికి పోతూ ఉంటే అక్కడ సంసారం ఉంది అని గుర్తు. మనస్సు, లోచూపు కలగకపోతే అసలు ఆధ్యాత్మిక జీవితం ప్రారంభం అవ్వలేదని, మొదటి మెట్టులోకి కూడా రాలేదని గుర్తు. వైరాగ్యం అంటే ఒక మానసిక స్థితి. జరిగి పోయిన గొడవలు ఎంత అబద్ధమో "నేను"గా వ్యక్తమయ్యే మనస్సు కూడా అంతే అబద్ధం. మనస్సు నిర్మలమయ్యే వరకూ వాక్యం యొక్క అర్థం తెలియదు. బుద్ధిలో స్పష్టత తక్కువ గందరగోళం అనుమానం ఎక్కువ. మన అస్తిత్వం దేహానికీ, మనస్సుకూ పరిమితమయ్యే వరకూ, కోరికలు, కీర్తి కాంక్షలు వెంటాడుతాయి. ఆత్మ జ్ఞానం ముందు ఈ కీర్తి కాంక్షలు ఏపాటిది? మనస్సు, ఆత్మ స్తుతి, పరనింద చేస్తుంది. మనస్సులో గూడు కట్టుకొన్న భావాలే సంసారం. మీరు దైవాన్ని గౌరవించటం నేర్చుకొంటే మీ మనస్సు కుదురు పడుతుంది. "నేను" అనేది తలంపు మాత్రమే. అది మీ సమస్య దేవుని సమస్య కాదు. విషయాన్ని సక్రమంగా అర్థం చేసుకొంటే మాయ నుండి బయట పడతాము. మనస్సును ఉత్పత్తి చేసేది శరీరమే. ఇంద్రియాల ద్వారా కోరికలను తీర్చుకొని పెరుగుతుంది.

37. ఎంతకాలం ఆశ ఉంటే అంతకాలం మనస్సు ఉంటుంది. చావదు. మనస్సు ఉన్నంత కాలం మోక్షం రాదు. ఆరోగ్యం బాగా ఉన్నప్పుడు ఆరోగ్య విషయం తెలియదు. రూపాయలు జేబులో ఉన్నప్పుడు రూపాయల విలువ తెలియదు. అలాగే అహంకారానికి దెబ్బలు తగలగా తగలగా విషయం అర్థమౌతుంది. అంతేగాని మన వంకర దండాలకు భగవంతుడు మోసపోయి మోక్షం ఇవ్వడు. మీకోరికలతోనే దేవుణ్ణి సృష్టించుకొంటున్నారు. ఏ కోరికా లేకపోతే భగవంతునితో పని ఏముంది? కోపం మనస్సుకాదు మనస్సు కోపంలో దించుతుంది. తలుపు

srinannagaru.com

తియ్యాలంటే గొళ్లెము పట్టుకొని ముందుకు గెంటాలి అంతేగానీ వెనుకకు లాగితే రాదు. అట్లాగే మనస్సును విషయాలలోంచి ఏ విధంగా లాగాలో ఆవిధంగా లాగాలి. ఆ నేర్పు గురువు తెలుపుతారు. మీ ఇంట్లో వారికి మీరు ఏదైనా పెడితే తింటారు. కాని ఏదైనామాట అంటే పడరు కారణం అహంకారం వలన అహంకారంలో నుంచి ఆడంబరం వస్తుంది. నిరంహంకారంలో నుంచి నిర్మలత్వం వస్తుంది. గర్వానికి మరోపేరే అభిమానం. అంటే దేహాభిమానము. నవగ్రహాలకు పూజ చేస్తే అందులోంచి బయట పడగలము అనేమాట ప్రక్కన పెట్టండి. మనస్సు అనే గ్రహం నుంచి బయట పడండి ఇక ఏ గ్రహాలు మిమ్ములను ఏమీ చెయ్యలేవు. జ్ఞాని కానివాడు దయ, ప్రేమ చూపలేడు. అజ్ఞాని దయ వ్యాపార ప్రేమలాంటిది జీవుడు కర్మలు చేస్తూ అనుభవిస్తాడు. దేవుడు చూస్తూ ఉంటాడు తానుగాని ధనంతో, విద్యతో, పదవితో తాను అని చెబుతాడు జీవుడు, అదే చీకటి ఏ క్షణంలో జీవుడు జీవం పోసుకొన్నాడో అదే కటిక చీకటి బ్రహ్మ భావన వెలుగు. మన తలంపులు, ఊహలు మిధ్యానేను మీద వాలే ఈగలు, దోమలు.

38. శ్రేయస్సు, ప్రేయస్సు అనే రెండు మార్గాలు ఉన్నాయి. పరిణామంలో చెడ్డ తెచ్చే పనులు చేసేవారు ప్రేయో మార్గంలో ఉన్నట్లు లెక్క. శ్రేయో మార్గంలో ఉన్నవారు కర్మ ఫలితాన్ని వదిలివేస్తారు. దీనిని అర్థం చేసుకొంటే శ్రేయస్సు మార్గంలోకి వస్తారు అంటే అజ్ఞానం నుంచి జ్ఞానంలోకి వస్తారు. మోహంలోంచి ప్రేమలోకి రావాలి. ఎండ్రిన్ డబ్బా చూచిన వాడు చావడు, తాగినవాడు మాత్రమే చనిపోతాడు. విషయాలలోకి దిగనక్కరలేదు. విషయం చింతన చేసినా చెడి పోతాడు. నీ మనస్సు ఎటుగంతువేస్తే అటుగంతు వేయకండి. చేప నీటికి ఎదురీదినట్లు నీ మనస్సుకు నీవు ఎదురీదు. నేను ఉన్నాను అనుకోవటంలో తప్పు లేదు. నేను అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అనుకోవటమే ప్రమాదం. అదే "కారం". అహంలో ఉండు. అర్థంకాని విద్య వ్యర్థం. మనం తిన్న ఆహారం జీర్ణం కాకపోతే ఎలా ఉంటుందో మన బుద్ధికి విషయం అందకపోతే అలాగే ఉంటుంది. అసలు వస్తువును మర్చిపోయాము. ఆత్మతో తాదాత్మ్యం వదిలేసాము. అహంకారం తో కాపురం పెట్టుకొన్నాము. అహంకారానికి డబ్బు కావాలి, అధికారం కావాలి, లోకం కావాలి. మీకు సబ్జక్టు అర్థమైతే మీ వేదన, రోదన ఈ క్షణంలో నశిస్తుంది, మనస్సుకు మరో పేరే యాతనా శరీరం. ఏదైతే నీవు కావో అది నీవు అనుకొంటు న్నావు అదే అహంకారం. మమకారంతో చేసిన పని నిన్ను బంధిస్తుంది. డాక్టరు నీ చేతికి వచ్చిన వ్యాధి మూలంగా నీ చేతిని తియ్యకపోతే నీకు ప్రమాదమని నీ

srinannagaru.com

చేయిని తీసివేస్తాడు. అలాగే ఒక దొంగ నీ చేతి కడియం రాకపోతే నీ చెయ్యి తీసేస్తాడు. వాడికి పాపం వస్తుంది. నిష్కామంగా చేసిన డాక్టరుకు పాపం రాదు. అక్కడ మమకారం లేదు. ఇతరులలో లోపాలు నీవు చూస్తూ ఉంటే నీ లోపాలను చూచుకొనే సమయం ఎక్కడ ఉంటుంది. నీ ఇంటిలో వాలిని గాని, బయట వ్యక్తులను గాని నీవు నామ రూప మాత్రులుగా మాత్రమే ప్రేమిస్తే నీకు కలిగేది దుఃఖం, వేదన.

39. "నేను" అనే తలంపు ఉన్నంతకాలం మనం భగవంతునికి భక్తునిగా ఉండటమే మంచిది. పాములకంటే పులులు కంటే ఈ అహంకారం ప్రమాద మైనది. అదే రాగ ద్వేషాలకు దుఃఖాలకు కారణమౌతూ పునర్జన్మను తీసుకొని వస్తున్నది. ఆ రోజులలో అంత కష్టపడ్డాము, ఈ రోజున ఇంత సుఖపడుతున్నాము అనే భావాల వలనే అహంకారం పెరిగిపోతున్నది అనే విషయం గుర్తించలేక పోతున్నాము. మన అహంకారం మనది కాదు. ఇతరుల అహంకారం కూడా నిజం కాదు. ఇతరులు నన్ను ఇలా అనుకొంటున్నారు, అనుకోవటం మన అహంకారం నిజమనుకోవటమే. మీ ఇష్టానికి అనుకూలంగా మీ భార్య ఉంటే మీకు ఇష్టము; ఎన్నికలలో తనకు ఓటు వేసేవాడే మిత్రుడు. వ్యతిరేకించేవాడు శత్రువు. ఇవి అన్నీ దేహం నేను అనే మూల తలంపుకే వస్తున్నాయి. అహం మూలం లోకి వెళ్ళాలంటే వీత, రాగ, భయ, ద్వేషాలు అనే గొలుసులు మీ మెడకు చుట్టుకొని నిన్ను బయటకు లాగేస్తున్నాయి. ఇంద్రియ, మనో నిగ్రహంతో, సహనంతో ఉండటం నేర్చుకొని, గమ్యం ఏమిటో తెలుసుకొని జీవిస్తే నీవు తరిస్తావు. జీవుడికి గుణాలు ఉంటాయి. శివునికి గుణాలు ఉండవు. నేను దేహంలో ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది. ఎక్కడో దేవుడు ఉన్నాడు అనే తలంపు అద్వైత అనుభవం వచ్చే వరకు పోదు, అహంకారం ఉన్నంత కాలం వికారం లేకుండా ఉండలేము. దేహ ప్రారబ్ధాన్ని బట్టి మీ కుటుంబ సభ్యులే వ్యతిరేకం కావచ్చును. దానిని గురించి ఆందోళన పడకూడదు. వర్షాకాలం నదులు ఎన్ని వచ్చినా సముద్రం పొంగదు, అలాగే వేసవి కాలం నది నుంచి ఒక్క చుక్క రాకపోయినా కృంగిపోదు. అలాగే నీవు నిండు సముద్రంలా, గంభీరంగా జీవించాలి. మనం గుణాల ఒడిలో ఉన్నాము. కానీ భగవంతుని ఒడిలో ఉన్నాము అనుకొంటున్నాము. గుణాలను విడిచిపెడితే భగవంతుని ఒడిలో పడిపోతాము.

40. దేహం నేను అనే తలంపే నాయకుడు. వాడిని చంపండి. ఆ నాయకుని అనుచరులు అయిన అరిషడ్ వర్గాలు వెళ్ళిపోతాయి. ఇంజను తీసేస్తే

srinannagaru.com

పెట్టెలు అక్కడే పడి ఉంటాయి. మూల తలంపు తీసివేస్తే సాధన లేదు. మన కోడళ్ళు ఎక్కడెక్కడి నుంచో వచ్చి సుఖపెడతారు, కొందరు నరకం చూపిస్తారు. అలాగే మన పిల్లలు ఎక్కడికెక్కడికో వెళ్ళి అలాగే చేస్తారు. ఇది అంతా దైవీ ప్రణాళిక. ఇది తెలియక కంగారు పడతాము. అనుకూలంగా ఉంటే సంతోషిస్తాము. వ్యతిరేకంగా ఉంటే దుఃఖపడతాము. ఇవి అన్నీ స్వప్నములే. రెండు ఎకరాల వాడు రెండు వందల ఎకరాలు వాడు అవుతాడు, అలాగే రెండు వందల ఎకరాల వాడు రెండు ఎకరాల వాడు అవుతాడు. అది అంతా ఈశ్వర ప్రణాళిక. ఈ విషయం చిన్న చిన్న మనస్సుకు అందదు. దేహాన్ని ధరించింది అహంకారం. దేహమే నీ అహంకారాన్ని పెంచేస్తుంది. ఈ రెంటినీ విడదీయలేము. గాఢ నిద్రలో మాత్రం మన జోలికి రాకుండా వదిలేస్తుంది. సంతోషం, దుఃఖం వికారాలు వాటి వలనే సత్యానికి మీరు దూరమౌతున్నారు. కొందరు ప్రతీ చిన్న విషయానికి తొందరపడి సొంత ఆలోచనకు దూరమౌతారు. వాడి స్వార్థానికి ఉపయోగపడితే ఒక రకంగాను, ఉపయోగపడకపోతే మరో రకంగాను ఉంటారు. ఈ చిన్న విషయం అర్థం కావటం లేదు, ఇక భగవద్గీత చదివినా ఏమి అర్థ మౌతుంది. దేహాన్ని, ప్రపంచాన్ని మర్చిపొండి. ప్రపంచంలో ఏమీ లేదు ప్రపంచ మంటే రూప, నామాలే దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని అదే శాశ్వతమని అనుకోవటం వలనే అన్ని అనర్థాలకు కారణమౌతుంది. నీవు నిజం నీతో చూడబడేది ఏదీ నిజం కాదు. ఈ నేను చిన్నదే కాదు, అసలు లేదు. దానిని గురించి కోట్లాది జన్మలు తీసుకొని వస్తున్నది. ఈ నేను దేహాన్ని మనస్సును ఆధారం చేసుకొని జీవిస్తున్నది. ఇది చిన్న తుంపర దానితో తాదాత్మ్యం పొందటం వలన ఆనందమనే సముద్రాన్ని పొందలేకపోతున్నావు.

41. చొక్కా మీద తేలు పడితే వెంటనే దులుపేసుకొంటావు. మనకు తేలువంటి తలంపులు వస్తూ ఉంటే విడిచిపెట్టాలి. జ్ఞానికి సన్మానం చేసినా సుఖం రావటం లేదు. ప్రయోజనం కనబడటం లేదు అనుకొంటాడు. జీవుడిది తిరకాసు బేరం. ముల్లును ముల్లుతో తీసివేసిన తరువాత రెండు ముల్లులు అవతల పారేస్తాము. చెడు తలంపును తీసివెయ్యటానికి మంచి తలంపులను ఆశ్రయించు. ఆత్మానుభవం అయ్యాక రెండు తలంపులూ పోతాయి. మీకు ఎవరి మీదనైనా ద్వేషం కలిగితే దాని వెనకాలే క్రూరత్వం వచ్చేస్తుంది. పనికి మాలిన భావాలను విడిచిపెట్టటమే సాధన. కొందరు నాలుగు గోడల మధ్య ఉండి "మేము మంచివారము" అని అనుకొంటారు. మంచివారైతే వారికి ఎందుకు జ్ఞానం రావటం లేదు. ఎవరైనా చిన్నమాట అంటే పడలేరు, లోపల

srinannagaru.com

ఉన్న చెడ్డే బయటకు కనబడుతుంది. అహంకారం మదగజంలాంటింది. దానికి గురువు యొక్క చూపుతో గజ-గజలాడి పత్తాలేకుండా పోతుంది. నేను, నాది అనే రెండు తలంపులు మిమ్మలను పీడిస్తున్నాయి. ఆ రెండే మీ రెండు కళ్లను పొడిచి గుడ్డివాడిని చేస్తున్నాయి. ఈ గుడ్డివాడికా పరమాత్మ తెలిసేది. అందరం సమానమనే బుద్ధి మనకు లేదు. అహంకారమే ఈ బేధ బుద్ధిని కల్పిస్తున్నది. మీ శరీరం తాత్కాలికం. మీ దురదృష్టం, మీ సంతోషం తాత్కాలికం. ఇది మంత్రంగా భావించండి. ఒక్క చైతన్యం తప్పించి అన్ని తాత్కాలికాలే. కాల ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోతాయి. వాసనలే అలవాట్లుగా మారతాయి. సముద్రంలో గాలివాన వస్తే, నావ, ఓడ పరిస్థితి ఎలా ఉంటుందో విషయ సుఖాలను ధ్యానం చేసే వాడి పరిస్థితి అలాగే ఉంటుంది. సముద్రంలో ప్రయాణం చేసినప్పుడు అంతా నీరే కాని తాగటానికి ఉపయోగం ఉండదు. నీలో ఆనంద సముద్రం ఉంది, నీ అహంకారం అడ్డువచ్చి అందకుండా చేస్తున్నది.

42. ప్రతీవారు ఆనందాన్ని కోరుకొంటారు. ఎందుకు కోరుకుంటారు? మనస్సు ఆనందంలోంచి వచ్చింది కాబట్టి. కోట్లాది జన్మల నుంచి మానవుడు రెండు తప్పలు చేస్తున్నాడు. శరీరం నేను అనుకోవటం. రెండు ప్రకృతిలో ఆనందం కోసం వెదకటం. ఆనందం నీలోనే ఉంది అని ఏ గురువు అనుగ్రహంతోనో తెలుసుకోవాలి తప్ప మన తెలివి తేటల వలన కాదు. మనస్సు ప్రశాంతత కలిగితే జ్ఞాపక శక్తి కలుగుతుంది. ఈ తింగర నేను ఎక్కడో ఒకచోట దుమ్ము లేపుతూ ఉంటుంది. అంటించుకొంటుంది. మరలా ఆ దుమ్మును ఇతరులకు రాస్తూ ఉంటుంది. అంతకన్న మంచి పని దానికి తెలియదు. అంతటితో ఆగదు ఈ తింగరనేను మరో తింగర నేనుకు సలహా చెప్పటం. అది మరలా దీనికి సలహా చెప్పటం. ఇదే సంసారం. ఇది తన గొడవలను సర్దుబాటు చేసుకోకుండా కొత్త గొడవలను పోగు చేసుకొంటుంది. ఇలా ఎన్నో జన్మల నుంచి సాగుతోంది. దానిని ఆపాలి వివేకంతో గురు అనుగ్రహంతో. మరో దారి లేదు. ఏ విషయం గురించీ "భయం" పెట్టుకోకండి. అహంకారం పెరుగుతుంది. మనస్సు అంటే ప్రతిబింబమే అది నీడ. దానిని చూచి భయమేల. అద్దంలో బొమ్మ నిజంకాదు, నీ ప్రతిబింబమే. బింబం ఆత్మ. ప్రతిబింబం మనస్సు. పరాయి బుద్ధి ప్రమాదం, సొంత బుద్ధి మంచిది. మంచు గడ్డను మంచు గడ్డగానే చూస్తున్నారు. కాని నీరును చూడటం లేదు. అలాగే జీవ కోట్లలో జీవుడిని చూడకుండా ఆత్మను చూడండి. మీ మనస్సుకు పరమశాంతి వస్తుంది. అలా చూస్తే మనస్సు ఎక్కడ ఉంటుంది. మనలను ఎవరైనా ఏదైనా అంటే ఎఱ్ఱచీమ కుట్టినంత పని. దానినే మనం

srinannagaru.com

సహించలేము, కాని ఆత్మజ్ఞానాన్ని ఆశ్రయిస్తాము. వంటికి పౌడరు ఎలా వ్రాసు కొంటామో, మీ మనస్సుకు వివేకం, వైరాగ్యం పూసుకోండి.

43. నీ తలంపుల వలనే స్వర్గం, నరకం ఆధారపడి ఉంది. అవి అన్ని ఆరోపితాలే. దానిలో సత్యం లేదు. మనలో ఒక పెద్ద సుడిగుండం ఉంది. అది దేహం నేను. అందులో పెద్ద ఏనుగులు అంటే మహాపండితులను కూడా లాక్కొని పోతుంది. భావనకు బలముంది. మీరాకు కుటుంబ సభ్యులు విషం ఇచ్చినా "విషం కాదు అమృతం" అని తాగినా విషం, పాయసంగా మారిపోయింది. భగవంతుని పాదాల మీద భక్తి కలిగి ఉండటంలోని వైభవం అది. లోపల పరమాత్మ ఉన్నాడు. మన పిచ్చి గొడవలకు, రాగద్వేషాలకు, శరీరానికి సంబంధం లేకుండా ప్రశాంతంగా ఉన్నాడు. దేహం ఏ పని మీద వచ్చిందో ఆ పని చూచు కొంటుంది. అది చస్తుంది. దేహం ఉండగానే మరణం లేని సత్ పదార్థాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటమే జీవిత లక్ష్యం. ఎవరి ఇంటికి వెళ్ళినా గుణాలు ఉంటాయి. రావణుని గుణం "అన్ని నాకే కావాలి". కుంభకర్ణుడి గుణం "కంచం, మంచం". విభీషణుని గుణం "సత్త్వగుణం". ఆయన రావణాసురిడికి చెప్పవలసింది అంతా ఇలా చెప్పాడు "నీ సంపద, బంగారంలాంటి కోట నాశన మౌతాయి" అని చెప్పాడు. తరువాత రాముని పాదాలను ఆశ్రయించాడు. ఎంతగా సోదరునికి చెప్పినా వినక పోయినా సత్త్వ గుణాన్ని వదల్లేదు. అది బాగుపడేవారి లక్షణం. కొందరు సహజంగానే నిర్మలంగా ఉంటారు. వారు ఉత్కృష్టమైన ఆనందాన్ని అందుకొంటారు. ఖలీల్ జీబ్రాన్ అన్నారు "ప్రతీ మనిషిలోనూ ఏదో లోపం ఉంటుంది. ఏమిటి? అంటే తనలో లోపాలను వెదకక, ఇతరులలో లోపాలను వెదకటం. ఈశ్వరుని వదలి ఇతరమైనది చెబితే అది వ్యర్థం. అవసరపు ప్రసంగము.

44. శరీరంలో కల్మషం ఉంటే శరీరం బాధ పెడుతుంది. మనస్సులో కల్మషం ఉంటే మనస్సు బాధపెడుతుంది. తనను తాను మేనేజ్ చేసుకొనే వాడు ఇతరులను మేనేజ్ చెయ్యగలడు. సముద్రంలో ఎన్ని కెరటాలు ఉంటాయో, భూమి మీద ఎన్ని రేణువులు ఉంటాయో అన్ని కోరికలు మనిషిలో ఉన్నాయని శాస్త్రం చెబుతున్నది. ఒక కోరిక నెరవేరితే అది వెయ్యి కోరికలను తీసుకొని వస్తుంది. తద్వారా అనేక జన్మలు తీసుకొని వస్తుంది. దుఃఖానికి కారణం కోరిక, కర్మలను పురిగొల్పేది మనస్సే. అనుభవించేది మనస్సే. ఆత్మకు వీటితో సంబంధం లేదు. నదులు అన్ని సముద్రంలో కలవవలసిందే. అలాగే మాటలు అన్ని మౌనమనే మహా సముద్రంలో కలవవలసిందే. మనకు బంధుకోటి బలం,

srinannagaru.com

ఆస్థిబలం, అంగబలం ప్రధానం. ముఖ్యం కాని జ్ఞానికి భగవంతుడు ముఖ్యం. నీవు అనుకొనే కోట్లు రేవు ఏమీ ఉండవు. ఇది అంతా భగవంతుని లీల. మమకారం పునర్జన్మలను తీసుకొని వస్తుంది. అది దుఃఖానికి కారణం దానిని వేళ్లతో పెగలించాలి. అప్పుడే అది వాడి నశిస్తుంది. జీవుణ్ణి కట్టిపడేసేవి "కోరికా, కోపము" అనే తాళ్ళు. భూమి లేకపోతే మొక్కరాదు. అలాగే అజ్ఞానం, కోపతాపాలు వ్యక్తం కావటానికి ఈ శరీరం ఆధారంగా ఉంది. ప్రాణం పోయేడప్పుడు నోరు తెరుస్తారు. కళ్లలోంచి ప్రాణం పోతుంది. మొక్కను భూమి నుంచి తీసినప్పుడు ఎంత బాధ పడుతుందో అలాగే ప్రాణం పోయేడప్పుడు శరీరంలో అన్ని ఇంద్రియాలు బాధపడతాయి. మరలా అదే వేదనపడటానికి మరో శరీరం వస్తుంది. సంపద ఉన్నప్పుడు అది పోయినప్పుడు నీవు నీవుగానే ఉన్నావు. కాని ఏదో పోయింది అని బాధపడుతున్నావు అదే "మాయ".

# 4. సమాజం, మతం

మతాలు అన్ని కల్పితాలు. మతం మనస్సు యొక్క సృష్టి. ఆత్మ కంటే గొప్పది కాదు మతం. భగవత్‌గీత హైందవ ప్రమాణ గ్రంథం. ఆ గ్రంథము మీద నీకు విశ్వాసం లేకపోతే నీవు హిందువుడవు కావు. నీ తల్లి దండ్రులు హిందువులు కావచ్చు. అంతమాత్రంచేత నీవు హిందువుడవు కావు. గీతలో ఆత్మ గురించి చెప్పే విషయాలపై నీకు విశ్వాసం ఉండాలి. అప్పడే నిజమైన మత విశ్వాసం గలవాడవు నీవు అవుతావు. భగవంతుణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించటమే మతం. మతాల సారాంశం అంతా ఒక్కటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని దర్శింప చేసుకోవటమే. "సైన్సు అంటే విజ్ఞానం. మతం అంటే విధానం". మతంతో సంబంధం లేని విధానం కుంటిది. సైన్సుతో సంబంధం లేని మతం గుడ్డిది. అని అన్నారు ఐన్‌స్టెయిన్. ఇతర మతాల వాళ్ళు తమ మతంలోకి రావటానికి డబ్బు, వైద్యం, విద్య ఎరగా చూపుతారు. ఇతర మతం వాళ్ళు మన మతంలోకి రావాలనే గుణం ఎక్కడా మన మతంలో కనిపించదు. మన మతంలో ఉన్న గొప్పతనం అదే. అందుకే దీనిని సనాతన మతం అన్నారు. మన దేశానికి, మన మతానికి, మన భక్తికీ చెరుపుచేసేవి, మన భౌతిక అభివృద్ధిని పాడుచేసే వాటిలో మీరు పాల్గొనకండి. మతంలో బాగుపడే విషయాలు కూడా ఉన్నాయి.

2. సంఘంలో కలవకుండా జీవించాలి, కలిస్తే ఆధ్యాత్మిక జీవితం కష్టం. లోకంలో కొందరు ఎన్ని పదవులు ఇచ్చినా పుచ్చుకొంటారు. ఆడవాళ్ళు నగలు పెట్టుకొన్నట్లు అలంకారం కోసమే కాని పదవికి ఏమి న్యాయం చేసాము అని

srinannagaru.com

ఆలోచించరు. మానవుడు స్వార్థం లేకుండా మాట్లాడడు, పనిచెయ్యడు. వారికి చాలా డబ్బు ఉంది. వారు బాగా చదువుకొన్నారు అంటే ఈ లోకం, అలాగా! అలాగా! అని ఆశ్చర్యంగా అంటారు కాని వారికి చాలా భక్తి ఉంది అంటే చిన్నగా తీసుకొంటారు. మన స్వార్థం వచ్చేడప్పుడు మన బుద్ధి ఉపయోగపడదు. అటువంటి స్వార్థపరుడు సమాజానికి ఉపయోగపడడు. హృదయం అధర్మంగా ఉంటుంది. బయటికి ధర్మంగా కనిపిస్తారు. ఈలోకం నీతి ఏమిటి అంటే మీరు డబ్బు ఉన్న వారిని ప్రేమించాలి అంటే మీకు కూడా బాగా డబ్బు ఉండాలి. వివేకానంద అన్నారు "నేను తత్త్వవేత్తననుకోను, డబ్బు ఉన్నవాడినీ కాను, నేను పేదవాణ్ణి, నేను పేదలనే ప్రేమిస్తాను" అన్నారు.

3. బుద్ధుడు ప్రయాణంలో ఉండగా ఒక నీచ కులస్థుల ఇంట ఆగి వారిని "త్రాగటానికి మంచినీళ్ళు ఇవ్వమని" అడుగగా వారు ఇలా అంటారు "మేము నీచ కులస్తులం" అనగా బుద్ధుడు అంటాడు "మీ కులం అడగటం లేదు, నేను అడిగింది మంచినీళ్ళు, అవి ఉంటే ఇయ్యండి" అన్నారు. సమాజంలో ఈ ఆత్మ న్యూనత అలా పాతుకుపోయింది. మంచివాడు మంచి పనిని ఎంత తేలికగా చెయ్యగలడో, చెడ్డపని చెడ్డవాడు అంతే తేలికగా చెయ్యగలడు. ఉదాహరణకు భారతంలో శకుని పాత్ర అటువంటిది. నాడు-నేడు ఈ పాత్రధారులు ఉన్నారు. ఈ సృష్టి తెగిపోయిన గాలిపటంలా లేదు. ఈశ్వరుని ఆజ్ఞననుసరించే అంతా నడుస్తున్నది. "సమాజం నుంచి నేను ఎంతో కొంత మేలును పొందుతున్నాను తిరిగి అంతా సమాజానికి ఇయ్యలేకపోతున్నాను" అన్నారు ఐన్‌స్టయిన్. పెద్దలకు సేవ చెయ్యటం వలన అనుగ్రహం లభిస్తుంది. కొందరు చేసే చెడ్డ పనులను గుర్తుంచుకోరు. మంచి పనులను గుర్తుంచుకొంటారు. అటువంటి వారితో స్నేహం చెయ్యకూడదు. ఇచ్చే గుణం లేనివాడు కోటీశ్వరుడైనా అడగవద్దు. ఇచ్చే గుణం ఉన్న బీదవాడైనా అడుగు. వానికి ఉన్న దానిలో ఎంతో కొంత తప్పని సరిగా ఇస్తాడు. మీరు ఏదైనా మంచి పనిచేస్తే సత్‌పురుషులు సంతోషిస్తే చాలు అందరూ సంతోషించాలని ఎప్పుడూ అనుకోకండి. అది పిచ్చితనం. అందరూ ఎప్పుడూ సంతోషించరు అటువంటి విషయాల పట్ల మీ మనస్సు వెళ్ళనియ్యకండి. నిజం ఎవరికీ అక్కరలేదు. మహిమలు, గొప్పలు కావాలి. వర్తమానం ఎవరికీ అక్కరలేదు. సమాజం పోకడ ఇది.

4. కొంతమంది మనుషులు ఇలా ఉంటారు "నీది నీదే, నాది నాదే" వారి వలన ప్రమాదం లేదు. మరికొందరు అంటారు "నాది నాదే, నీది కూడా నాదే" వాళ్ళ వలననే ప్రమాదం. ఏ వ్యక్తిని చూడండి వారి హృదయాన్ని చూడండి

srinannagaru.com

అంతేకాని రంగును, కులాన్ని, హోదాను, ఆర్థిక పరిస్థితిని చూడకండి. ఇవి అప్రధానాలు. ఏ ప్రాతిపదిక మీద మతాలు అన్ని ఏర్పడినాయి. గాఢనిద్రలో అవి లేవు. మతం అంటే మతిని బట్టి ఏర్పడినది. "మతం" అంటే "హితము" అని అర్థం. సంస్కారవంతమైన మనస్సు భగవంతుని వైపు పురోగమింపజేయునదే మతం. కాల ప్రవాహంలో నిలబడేవి కావు అవి. "సత్యం" కాలాతీతం శాశ్వతం శాశ్వతాన్ని నమ్మండి. నిర్వాణ స్థితి అంటే పూర్ణస్థితి. అక్కడ ఆనందము, ఆనందించువాడు కలిసిపోతాడు అదే సుప్రీం స్టేట్. ప్రపంచం అంటే రూపం, నామం, క్రియ. కొన్ని కొన్ని స్నేహాలు చేస్తే మంచితనం పొందలేము. అసూయ తను మనకు కలుగజేస్తారు. వాళ్లను అలా అనుకోవటం పొరపాటు మనదే. వాళ్ల దగ్గర ఉన్నది అదే. అదే మనకు ఇస్తారు. ఈ ప్రపంచంలో మంచితనానికి విలువ లేదు, కుయుక్తులకు, కుతంత్రాలకు, భేదబుద్ధికి విలువ ఎక్కువ ఇస్తున్నారు. సీత మారుతితో ఇలా అంది "ప్రపంచంలో చెడ్డపని చెయ్యనివారు ఎవరు ఉన్నారు? నన్ను హింసించేవారిని శిక్షిస్తానంటున్నావు, ప్రపంచం నైజం ఇంతే" అన్నది.

# 5. సంపద

ఐశ్వర్యం కూడా స్వప్నం మాత్రమే. వంటింట్లో ఎంత జాగ్రత్తగా ఉన్నా మసి అంటుకోకుండా ఉండదు. అలాగే డబ్బు, అధికారం వలన కలిగే వికారాలు, వాసనలు అంటుకోకుండా ఉండవు. దానం, ధర్మం, ధ్యానం తెలుసుకొని చెయ్యండి. జ్ఞానం వస్తుంది. తెలుసుకోకుండా చేస్తే ప్రయోజనం అంతగా ఉండదు. కోరికతో చేస్తే కోరిక తీరగానే అంతకు ముందు ఉన్న స్థితికి వస్తావు. డబ్బును నిగ్రహించుకొనే శక్తి లేకపోతే వాళ్లలోకి దుష్టత్వం ప్రకోపిస్తుంది. భయం లేని స్థితే గొప్పది, ధనంకంటే. చదువు, డబ్బు మనస్సును కుదురుగా ఉండ నియ్యవు. అది నరంమీద పుండులా మనస్సును చలింపచేస్తుంది. ఒక ఆంగ్ల కవి ఇలా అన్నాడు "ధనాన్ని ఎవరైతే సద్వినియోగం చెయ్యరో వారిని ఆ ధనం నాశనం చేస్తుంది. "అర్థమనర్థం భావయ నిత్యం, నాస్తి తతస్సుఖలేశః సత్యం, పుత్రాదపిధన భాజాంభీతిః" అని శంకర భగత్పాదుడు ధనము అనర్థ దాయకమని చెప్పినాడు. జ్ఞానాన్ని ఎవరైతే సంపాదించారో వారిని, ఆ జ్ఞానం కాపాడుతుంది. మనకు ధనం అవసరమే కాని, జీవితగమ్యం మట్టుకు అది కాదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలంటే అవసరాలు చూచుకోవాలి, భోగాలు చూచుకోకూడదు. ధనం భయాన్ని పెంచుతుంది. భయం అనుకరణను పెంచుతుంది. దరిద్రంలో

srinannagaru.com

ఉన్నా కొందరు ధనమందు ఆకర్షణ లేకుండా ఉంటారు. కొందరు కోట్లాది రూపాయలు ఉన్నా డబ్బు గురించే చింతిస్తూ ఉంటారు. స్నేహితులు శ్మశానం వరకైనా వస్తారు, డబ్బు రాదు. ఇతరుల ధనం, మీది అనుకోరు అలాగే మీ దగ్గర ఉన్న ధనం కొంత మీదికాదని భావించి లోకశ్రేయస్సుకోసం ఖర్చు పెడితే నీవు తరిస్తావు. ఎలా పని చేస్తే దేవుని అనుగ్రహానికి పాత్రులౌతామో అలా పని చెయ్యాలి. నీకు ఎంత సంపద ఉన్నా, నిగ్రహించుకొనే సహనం కావాలి. మీకు ధనం లేకపోతే, మీ కూడా మీ అభిమానులు, కుటింబీకులేమీ వెంట ఉండరు. ఈ ప్రపంచం చనిపోయేదాకా వదలదు అనుకోకండి బ్రతికి ఉండగానే ధనంలేకపోతే ప్రపంచం వదిలేస్తుంది. చాలామందికి డబ్బు ఉంటుంది వారు సుఖపడరు, ఎదుటివాళ్లను సుఖపడనియ్యరు. వాళ్లను చూచి మనం జాలిపడాలి.

2. మన చెవులను చూడమంటే చూడవు. మన కళ్లను వినమంటే వినవు. డబ్బు చేసే పని డబ్బు చేస్తుంది. శాంతిని తీసుకొనిరాలేదు, శరీరానికి కొంత సౌకర్యం కలుగజేస్తుంది అంతే. పొట్టకు-బట్టకు, నీడకు లోటు లేదు అనుకోండి ఎన్ని కోట్లు ఉంటే ఏమి ప్రయోజనం. వాల్మీకి రామాయణంలో అంటాడు "నీకు అనుకోకుండా నీ ఉపాధికి సంపద కలిగింది అనుకో, అంతకు మునుపు నీకు భోగ వాసనలు ఉండవచ్చు అవి నీకు తెలియకపోవచ్చును, కాని సంపద కలిగిన తరువాత అది నీ సంస్కారాలను పెంచేస్తుంది. అప్పుడు నీ ధనం నీకు శత్రువులా తయారౌతుంది. మీకు సాధనా బలం ఉంటే దానితో మీ ధనం వలన గర్వం రాకుండా చూచుకొంటే ఆ సంపదే మీకు మిత్రుణ్ణి చేస్తుంది" అన్నారు వాల్మీకి. మానవ మానసాన్ని ఎంత నిశితంగా చూచాడో దాన్నిబట్టి గ్రహించవచ్చును. ఆయనే మరలా ఇలా అంటారు "మీకు చిన్న చిన్న గొడవలు ఏమైనా గృహంలో ఉంటే వాటిని పెద్దవి చేసుకొని గృహంలో మానసిక ఆందోళన తెచ్చుకొని కుటుంబ సభ్యులకు దూరం కాకండి. మీకు ఎంతో సంపద, ఎన్నో సౌకర్యాలు ఉన్నాయి అనుకోండి ఇచ్చేగుణం మీకు లేదు అనుకోండి ఆ ధనానికి ప్రభువైన పరమేశ్వరుని ఆగ్రహానికి గురి అవుతావు. ఇయ్యటంతోనే నీ దినచర్య ప్రారంభించు" అన్నారు. దీనులకు అంటే ఈ పనిచేస్తే వీడి వలన మనకు ఏమి లాభం కనిపిస్తుంది అని అనుకొనే కూలి వాళ్లకు వాళ్ల ముఖాలు చూస్తూ ఉంటే సంవత్సరానికి ఒక్కసారి కూడా వారి మొహంలో నవ్వు కనబడదు. ప్రాపంచిక భోగాలు, సంతోషాలు పరిణామ క్రమంలో బాధలుగా మారిపోతాయి. ధనం ఉందని దుబారాలకు వెళ్లకూడదు. భోగవికారాలు రాకూడదు. మొత్తం ఆదాయంలో కొంత ధర్మకార్యానికి ఖర్చుపెట్టకుండా అంతా తనే అనుభవిస్తే భోగ

srinannagaru.com

ప్రవృత్తి పెరిగిపోతుంది. వెయ్యి కోట్లు ఉన్న వాడి ముఖం చూస్తే దుఃఖంతో అలమటిస్తూ ఉంటుంది. తాటాకు ఇంట్లో ఉండి కూలిపని చేసుకొనే వాడి ముఖం చూస్తే ఆనందంగా ఉంటుంది.

ఎవరికో ఆర్థికంగా సహాయం చేస్తే, మనకు నష్టం వస్తుంది అనుకొనే వాడికి వచ్చే జన్మ దరిద్రపు జన్మ సిద్ధమౌతుంది. ఆ జన్మ రావటానికే ఆ బుద్ధి కలుగుతుంది. సూర్యుడు ఉన్న చోటకి చీకటి రావటానికి భయం, అవకాశం లేదు. అలాగే కష్టపడి పనిచేసేవాడి దగ్గరకు దరిద్రం రావటానికి భయపడుతుంది.

# 6. ఈశ్వరుడు

జీవులందరికీ స్థానము కల్పించువాడే నారాయణుడు. భగవంతుడు మనకు మంచి మార్గము చూపటం కోసమే అవతరిస్తాడు. విషయ శూన్యుడు అంటే సమస్థితిలో ఉన్నవాడు, విషమ స్థితిలేనివాడు విష్ణువు అని అర్థం. నీ స్థితి గతుల గురించి నీవు అదే పనిగా కంగారు పడకు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు వాడు అన్నిటినీ పరిశీలిస్తూ నిన్ను ఎలా ఒడ్డుకు చేర్చాలో ఆయనకు తెలుసు. శివుడు నీ దుఃఖాలను లయం చేస్తాడు. కుండ కంటే ముందు మట్టి పుట్టింది. నగకు ముందే బంగారం ఉంది. అలాగే ఈ ప్రపంచానికి ముందే బ్రహ్మం ఉంది. అదే సనాతనం అంటే ఎల్లకాలాలలోనూ ఉండేది అని అర్థం. బ్రహ్మ విద్య ఎందుకని ఆచార్యులవారిని అడిగితే "ఈ దేహాన్నే నీవు ఆత్మ అనుకొంటున్నావు. ఈ భ్రమను తొలగించుకోవటానికే బ్రహ్మ విద్య అన్నారు. ఇతరుల వ్యవహారాలలో నీవు కలుగచేసుకొంటే నీకు తెలియకుండానే అహంకారం పెరిగిపోతుంది. "నేను-నేను" అనే తలంపు మచ్చుకు కూడా ఎక్కడ లేదో అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు. దీపం వెలుతురు లేకుండా ఉండదు, బ్రహ్మం శక్తి లేకుండా ఉండదు. మనకు ఒక్కొక్క సమయంలో, సంఘటనలు, తలుపు సందులో పెట్టి నొక్కినట్లు అనిపిస్తుంది, కాని ఈశ్వరుడు అలా చెయ్యడు భక్తులను, అలా అనిపింపచేసి శాంతి తీరానికి చేరుస్తాడు. ఒకటి "నిజం", రెండు "మాయ". నీవు ఎప్పుడూ ఒకటిగానే ఉన్నావు. మనం పుట్టినది లగాయతు ఎంతో ఏడ్చాము, ఇంకా ఏడ్చేది చాలా ఉంది అనుకోండి ఇంకొక శరీరాన్ని ఇచ్చి ఏడవమంటాడు ఈశ్వరుడు. అదే పునర్జన్మ. భగవాన్ తల్లి ఏడుస్తూ ఉంటే ఎంత ఏడిస్తే అంతా మంచిదే అనేవారు. ఈశ్వరునకు "కర్మ ఫలదాత" అని పేరు.

2. ఈ శరీరం నేను అనే బుద్ధిని కల్పించేది ఈశ్వరుడు. ఇదే మాయ, ఈ మాయను దాటిన వాడికి తలంపులు లేవు, జన్మలు లేవు. నీ గౌరవాన్ని మర్చిపోయి

srinannagaru.com

చిన్నపని చేసినా పెద్ద బహుమతి ఇస్తాడు ఈశ్వరుడు. ఆయనను స్మరించుకొంటే ఉన్నతమైన ఆలోచనలు వస్తాయి. కర్మకు కర్మఫలానికి అనుసంధానం చేసేవాడే ఈశ్వరుడు. భగవంతుడు ఒకడు ఉన్నాడనే పరిపూర్ణ విశ్వాసం ఉంటే నీవు ఎంత దురాచారుడవైనా తరిస్తావు అంది గీత. "నారాయణ" అంటే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అని అర్థం. నీవు కాని దేహాన్ని "నీవు" అని అనిపింపజేసి కర్మానుభవాన్ని నీచేతే అనుభవింపచేస్తాడు ఈశ్వరుడు. దేహాన్ని "నేను-నేను" అని అనుకోకపోతే, కర్మలు అనుభవింపచేయటం సాధ్యం కాదు. ఋగ్వేదం ఇలా అంటోంది "భగవంతుడు స్వతంత్రుడు, ఆనంద స్వరూపుడు లోకం ఉన్నా లేకపోయినా, దేహాలు ఉన్నా ఊడిపోయినా ఆయన స్వతంత్రుడు" కర్మఫల త్యాగి = సన్యాసి. మీకు వికారమైన తలంపులు వస్తూ ఉంటే గురువు బాధపడతాడు. ఫండమెంటల్‌గా మీకు ఉన్న నమ్మకం కంటే ఈశ్వరుని మీద నమ్మకం లేదు. శరీరం, ఇంద్రియాలు, లోకం మీద ఉన్న నమ్మకం ఈశ్వరుని మీద లేదు, ఉంటే నీ బలహీనతలు అన్ని వేరుతో సహా నశిస్తాయి. ఈ సృష్టిని భగవంతుడు ఎందుకు సృష్టించాడు అని అంటే భగవాన్ "దేవుడు దేవుడిగానే ఉన్నాడు లోకంగా నీ కంటికి కనిపించినా ఈ లోకానికి ట్రైనింగ్ కోసం వచ్చాము" అన్నారు. ఈశ్వరుని ధ్యానం చెయ్యటం వలన ఆయన ప్రేమ మనకు లభ్యమౌతుంది అప్పుడు మనం ఆయనకు సేవ చెయ్యటం కాదు ఆయనే మనకు సేవ చేస్తాడు. అన్ని కోరికలు నెరవేరినవాడు ఎలా ఉంటాడో భగవంతుడు కూడా అలానే ఉంటాడు. కోరిక పరిమితులను సృష్టిస్తుంది. కోరిక లేని స్థితిలోనే పరిమితులు లేని స్థితికి వెడతావు.

3. శాంతి ఉన్న వానికి శక్తి ఉంటుంది. ఇక ఈశ్వరునికి శక్తి లేకపోవటం ఏమిటి? ఈశ్వర సంకల్పాన్ని గౌరవించటం నేర్చుకోవాలి. సూర్యునికి రాత్రి తెలియదు. నిజమైన "నేను"కు కాలం తెలియదు. పునర్జన్మలు, ద్వంద్వాలు లేవు. భౌతికంగా మన సందేశాన్ని పంపే, డిపార్టుమెంటు ఎలా ఉంటుందో అలాగే ఒకరిపట్ల సానుభూతి చూపినట్లైతే ఆ సందేశాన్ని భౌతికంగా ఆ వ్యక్తి ఉన్నా లేకపోయినా ఆ జీవుడికి మన సందేశం అందే వ్యవస్థ ఒకటి ఉంది. నిప్పుకు వేడి సహజలక్షణం అలాగే ఈశ్వరునకు దయ సహజ లక్షణం. ఈశ్వరానుగ్రహం వలననే జీవుడికి ఈశ్వరుడే "గతి" అని తెలుస్తుంది. జీవుడు ఈశ్వరుని సొమ్ము జీవుడు ఈశ్వరుని వద్దకు చేరితేనే శాంతి తెలుస్తుంది. జీవుడు ఏమనుకొంటాడు వాడి గొప్ప, వాడి అహంకారం అంతా వ్యాపించాలి అని అనుకొంటాడు. శాంతి వ్యాపించాలి, జ్ఞానం వ్యాపించాలి అని అనుకోడు. జీవుడికి వ్యష్టిగాని సమిష్టి అక్కరలేదు. ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఎప్పుడు ఇస్తాడంటే, నీ బలహీనతలు తెలుపుతాడు, దాన్ని తొలగించుకొనే బుద్ధిని కలుగజేస్తాడు. బలహీనతలలో

srinannagaru.com

నష్టాలను తెలుపుతాడు. అప్పటివరకూ నిరీక్షిస్తాడు. అప్పుడు మీకు ఆపరేషన్ చేస్తాడు. అంటే నీ బలహీనతలను తొలగించుకోవాలనే బుద్ధిని కలుగజేస్తాడు. మనకంటే మన గురించి ఎక్కువగా భగవంతుడికి (గురువుకు) తెలుసు. ప్రతీ చిన్న విషయానికీ ఆందోళన పెట్టుకోకండి. పంచభూతాలు లేకుండా, సూర్య చంద్రులు లేకుండా స్వతంత్రమైన సుఖం నీ హృదయంలో ఉంది దాన్ని అనుభవం లోకి తెచ్చుకోవాలి. అందరిలోనూ ఈశ్వరుడు ఉన్నాడు అంటే ప్రయోజనం ఏమిటి? చూడటం నేర్చుకోవాలి కదా? మూల తలంపుగాడు పలాయనం చేస్తే ఇక సాధన ఏమిటి? ఉండటమే ఈశ్వరుడు.

4. నిజమైన జ్ఞానం పొందినప్పుడు చావుకూ-బ్రతుక్కూ తేడా తెలియదు. ఎప్పుడూ ఆత్మస్థితిలోనే ఉంటారు. సంసారమనే స్మశానం నుంచి విడుదల చేసే వాడే శివుడు. ఆడించేవాడు అంతర్యామిగా నీలోనే భగవంతుడు ఉన్నాడు. ఆడించబడేవాళ్ళం మనం. పొందవలసింది పొందిన తరువాత ఈ జ్ఞానం నిజం కాదని, ఈ సాధన నిజం కాదని తెలుస్తుంది. నీకు అన్యంగా దేవుడు లేడు అనే విషయం నీకు తెలుస్తుంది. నన్ను అపార్థం చేసుకోకండి. మీకు ఏ కారణం వలననైనా భయం కలిగితే మీరు మీరుగా ఉండరు. ఏదోలా ఉంటారు. మరలా భయంపోయాక మీరు మీరుగా ఉంటారు. ఈశ్వరుని మీద పరిపూర్ణ విశ్వాసం ఉంటే భయం రానే రాదు. ఈశ్వరుడు తప్ప మరి యొకటి ఉందా? అంటే ఉంది అని అనుకొంటే అదే అజ్ఞానం. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే. ఈ విషయాన్ని శ్రవణం చెయ్యాలి. మననం చెయ్యాలి. దాని అర్థాన్ని గుర్తింపులోకి తెచ్చుకొంటే అది మీకు స్వంతమౌతుంది. బుడగలోని నీరును చూడటం నేర్చుకోండి బుడగను కాదు. అంటే జీవుడిలోనే ఆత్మను చూడండి అంతే గాని ఏదో ఉంది ఏదో ఉంది అని అనుకోకండి. మనం చూచేది అంతా ఈశ్వరుడే అన్న విషయం మర్చిపోకండి. బంగారం ఆభరణం కాదు ఆభరణమే బంగారం. శరీరమే దేవుడు కాదు, శరీరం లేకపోయినా దేవుడు ఉండగలడు. మన బలహీనతలలోంచి మనం బయట పడాలంటే ఈశ్వరుని దయ లేకుండా బయటపడలేము. కర్మఫలం అనుభవిస్తే అది నశిస్తుంది. అగ్ని-శివుడు. అగ్నిలోని వేడి పార్వతి. వ్యాకరణ సూత్రాలు అన్నీ శివుని నాట్యం నుంచే వచ్చాయి. "అఇఉణ్, ఋఌక్, ఏఓఙ్, ఐఔచ్...." మొదలగు 14 సూత్రాలు ఈశ్వరుని ఢమరుక నాదం నుండి వెలువడినట్లు పరిగ్రహించి పాణిని మహర్షి తన "అష్టాధ్యాయి" అను వ్యాకరణ శాస్త్రంలో మొట్టమొదట అక్షర మాలకు చెందిన సూత్రాలుగా రూపొందించాడు. చదువులకు అధ్యక్షుడు శివుడు. అక్షరాభ్యాసంలో "ఓం నమఃశివాయ" అని వ్రాయిస్తారు.

srinannagaru.com

5. హద్దులు ఉన్న వస్తువుకు దుఃఖం వస్తుంది. హద్దులు లేని వస్తువుకు (ఈశ్వరునికి) దుఃఖం రాదు. ఈ సృష్టిని అంతా పరిపాలించేది ఈశ్వరుడే. ఆయనే స్వతంత్రుడు. మరి ఎవ్వరూ స్వతంత్రులు కారు. ఆయన ఉండటం వలనే మీరు నాకూ, నేను మీకూ కనిపిస్తున్నది. ఆ సూర్యునికి వెలుగునిచ్చేది ఆ ఈశ్వరుడే. ఈ పంచభూతాలు చైతన్యానికి స్వాధీనమై ఉంటాయి. సైన్సుకు లోబడి ఉండవు. గాలి వాన ఈశ్వరునికి తెలియకుండా రాదు. సైన్సు దాన్ని ఆపు చెయ్యలేదు. ఈ సృష్టి అంతా పిచ్చోడి చేతిలో రాయిలా లేదు. ఈశ్వరుని అధీనంలో ఉంది. సైన్సు భగవంతుని చేతులలో గడ్డిపరకతో సమానము. భగవంతుడు ఆడిస్తూ ఉంటాడు. ఆటతో సంబంధం లేకుండా ఉంటాడు.

6. ఈశ్వరుడు అంతర్యామిగా లేకపోతే ఈ సృష్టిలో ఏ శరీరం భూమి మీదకు రాదు. ఆత్మ చాలా ప్రేమగలది కాబట్టి నా మీద మీకు ప్రేమ కలుగుతున్నది. నా హృదయంలో ప్రేమ వస్తువు లేకపోతే మీ మీద నాకు ప్రేమ కలుగదు. రాముడు అంటే రమించేవాడు, కృష్ణుడు అంటే ఆకర్షించేవాడు ఆ ఈశ్వరుడే రాముడుగా, కృష్ణుడిగా వచ్చాడు. ఒక భక్తునితో ఒక రాజుగారు ఇలా అన్నారు దేవుడు ఏదైనా తింటాడా? అనగా "నేను నేను" అనే దానిని తింటాడు అన్నాడు. ఆయన ఎప్పుడైనా నవ్వుతాడా? అనగా అన్నదమ్ములు ఆస్థి పంచుకొన్నప్పుడు పకపకా నవ్వుతాడు. అనగా, ఇంకా ఏదైనా చేస్తాడా? అనగా మీరు ఆ సింహాసనం వదలి ఇక్కడ కూర్చోండి చెబుతాను అనగా రాజు అలా చెయ్యగా, భక్తుడు రాజుగారి సింహాసనం మీద కూర్చొని ఇలా అన్నాడు. ఈ పని కూడా చెయ్యగలడు (అంటే రాజును ఫకీరుగాను చేస్తాడు. ఫకీరును రాజుగా కూడా చేస్తాడు అని అర్థం) మనం అనుకొనే నేను తింగర నేను దీనికి తోక, ఒకటి లేదు ఇంద్రియాలతోనూ మనస్సుతోనూ కలుషితమై పోయింది. దీని వలనే కోర్టులు, పోలీస్ స్టేషనులు అవసరమైనాయి. లక్ష్మణ రేఖ దాటకూడదనే గుర్తు సీతకు రాలేదు. కారణం ఈశ్వరాజ్ఞ దానిని అతిక్రమించలేము. ఆమె స్త్రీ పురుష సంబంధం లేని జన్మ అగ్ని హోత్రంతో సమానం ఆమెకు "మాయ" కమ్మింది. అక్కడ లక్ష్మణుడు లేడు, సీతా లేదు. సీతను ఈశ్వరుడు ఆడించినప్పుడు మనమెంత? అక్కడ ఉన్న ఈశ్వరుడు ఇక్కడ ఉన్నాడు. ఇక్కడ ఉన్న ఈశ్వరుడు అక్కడా ఉన్నాడు. ఈశ్వరునికి భిన్నంగా ఏమీ లేదు అన్న విషయం గుర్తుంచుకోండి. ఈశ్వరుడు ప్లీడరు చేసే పని చెయ్యడు జడ్జీ చేసే పని చేస్తాడు. అంతటా ఉంటాడు. సరియైన నిర్ణయం తీసుకొంటాడు.

srinannagaru.com

# 7. సత్సంగము

మీరు సజ్జన సాంగత్యం, మహాత్ముల దర్శనం చేసుకోకపోతే మీ అహంకారం బలిసిపోతుంది. దాహంవేస్తే నీరు త్రాగి దాహం తీర్చుకోవచ్చు, ఆకలి వేస్తే అన్నంతిని ఆకలి బాధ తీర్చుకోవచ్చు, అలాగే అజ్ఞానంతో అశాంతిని పొందుతూ ఉంటే సత్సంగం వలన భగవంతుణ్ణి తెలుసుకొని శాంతిని పొందవచ్చును. చెప్పే వాడిలో స్పష్టత లేకపోతే, ఆ చెప్పేవానికి ఏమీ తెలియదని అనుకోవాలి. ఒకరు నిద్రపోతూ ఉంటే, వారిని మేల్కొల్పటానికి, పేరు పెట్టి పిలిస్తే వారు లేచి, నన్ను ఎవరు లేపారు అని అడుగుతాడు, వారిని నీవు చేతితో తాకకపోవచ్చు, నీ మాట యొక్క శబ్దం వారిని లేపింది, అలాగే నీవు ఒక జ్ఞాని బోధిస్తూ ఉంటే, ఆ శబ్దం, నిన్ను ఎప్పటికైనా ఆత్మ దగ్గరకు తీసుకొని వెళుతుంది. నీకు జ్ఞాని దొరకకపోయినా నీ కన్నా ఆధ్యాత్మిక అభివృద్ధిలో ఉన్న వానితో స్నేహం చేస్తే మంచి జరుగుతుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చును. నీవు రోజూ జపం, ధ్యానం చేస్తూ ఉంటే అది కృత్రిమమైన గాలి, సత్‌పురుషులతో స్నేహం సహజమైన గాలి లాంటిది. ఉపవాసం మీ ఓపికను బట్టి చేసుకోండి, సహవాసంలో మాత్రం జాగ్రత్తగా ఉండండి. గుహవాసం (ఆత్మలో ఉండటం) నీవు చేయలేకపోతే సజ్జన సహవాసం చేయి, తరువాత గుహవాసంలో ఉంటావు. వారి స్నేహం వలన భవిష్యత్తులో మంచి జరుగుతుంది. వాళ్ళ అలవాట్లు, మాటలు చల్లగా ఉంటాయి. నీ ప్రాణాన్ని నీవు ఎంత శ్రద్ధగా కాపాడుకొంటావో, అలాగే నీ సంస్కారాల నుంచి నీవు బయటికి రావాలంటే, సత్‌పురుషులతో నీకు ఉన్న స్నేహం అంత జాగ్రత్తగా కాపాడుకోవాలి. అలవాట్లు బుద్ధికి స్వేచ్ఛ లేకుండా చేస్తాయి. గురువు బోధిస్తాడు. ఆచార్యుడు బోధించి, తాను ఆచరించి ఇతరులతో ఆచరింపజేస్తాడు.

2. సైన్సు విషయానికి వస్తే లేటెస్టు విషయానికి ప్రాముఖ్యత యిస్తారు, అదే ఆధ్యాత్మిక విషయానికి వస్తే ఎంత లేటెస్టుగా చెప్పినా పట్టించుకోరు. వశిష్టులు మొదలుగా గల ఋషుల మాటలనే ప్రమాణంగా ఎంచుకొంటారు. పుస్తక జ్ఞానం కన్న ఆధ్యాత్మిక తత్త్వవేత్త నుంచి శ్రవణం తొందరగా తత్త్వాన్ని అవగాహన చేసుకో వచ్చును. కొందరు పీఠాధిపతులకు పుస్తక జ్ఞానం ఉంటుంది. తపో జ్ఞానం ఉండదు, దాని వలన ప్రయోజనం అంతంత మాత్రమే. మాటకంటే రచనకు ఎక్కువ స్థిరత్వం ఉంటుంది. మీకన్న అహంకారం ఎక్కువగల వాళ్ళతో స్నేహం చెయ్యటం వలన ఆ స్థితికి మీరూ వెళ్లిపోతారు. పూర్తిగా కుళ్లిపోయిన వారితో సహవాసం చెయ్యటం వలన మీరూ కుళ్ళిపోతారు. సత్ పురుషుల సహవాసం

srinannagaru.com

ప్రయోజనం, మూలతలంపు యొక్క వేరును సన్నగిల్లేలా చేస్తుంది. మహాత్ముల దర్శనం వలన లోపల ఉన్న సద్ వస్తువు తియ్యగా ఉంటుంది. అహంకారం చేదుగా ఉంటుంది, దాన్ని ఊసేయటానికి ప్రయత్నం చేస్తాము. కొందరికి జీవితం మీద ఏవగింపు ఉంటుంది. వారు మహాత్ములను చూడటం వలన జీవితం మీద, సాధన మీద ఆసక్తి కలిగి తరించటానికి పురిగొల్పుతుంది వారి దర్శనం. కూర ఉడికిన తరువాత రుచిగా ఉందో లేదో చూచారు అనుకోండి, ఆ రుచిని ఆమె గ్రహించలేకపోతే ఇతరులు ఎలా ఎంజాయ్ చేయగలరు. అలాగే నీవు ఏమి మాట్లాడినా దాని అనుభవం ఎంతో కొంత నీకు ఉండి నీవు ఎంజాయ్ చేస్తే నీ మాటలు ఇతరులకు ఎంజాయ్‌మెంటును కలుగజేస్తుంది. సత్ పురుషుల కు గతి ఏమిటి? అంటే మోక్షం. సత్‌పురుషులు సత్సంగాలు పెట్టుకొంటారు. శ్రవణభక్తిని మన ఇంటికి వెళ్ళి ధ్యానం చేస్తే, శ్రవణం చేస్తే మనకు అది అందు తుంది. తలకాయ ఉంటే బాధలేదు, తలపోటు ఉండకూడదు, మీకు అజ్ఞానం వలన కాని ఇతర కారణాల వలన కాని దుఃఖం వచ్చింది అనుకోండి దాన్ని తొలగించువాడే రుద్రుడు.

3. వేదంలో ప్రతిపాదించిన విలువలే రామాయణంగా అవతరించాయి. దాన్ని శరణాగతి గ్రంథం అంటారు. మీరు సత్‌పురుషులతో స్నేహం చేస్తే ఆధ్యాత్మికం గానే కాదు, భౌతికంగా కూడా మీకు గౌరవం వస్తుంది. దేని ప్రకాశం వలన నీ ఇంద్రియాలు, నీ మనస్సు తెలియబడుతున్నదో అది యదార్థం. సందేశం లేని గ్రంథం కాని, సందేశం లేని ప్రవచనంగాని నిరుపయోగం. శ్రవణానందం కూడా సాపేక్షిక జ్ఞానమే అది ఒకదాని మీద ఆధారపడిందే స్వతంత్రమైనది కాదు. ప్రాథమిక దశలో అది అవసరం. ఈ శ్రవణానందం కూడా చెయ్యలేని వారు ఆధ్యాత్మికంగా పురోభివృద్ధి కలుగదు. విజ్ఞానం అంటే సత్యవస్తువు యొక్క అనుభవాన్ని నేర్పుతో ఇతరులకు బోధించటం. "స్థితి" పొందినవారికి జ్ఞానం సరిపోతుంది. శ్రీకృష్ణుడు అంటారు "సద్గురువు ప్రవచనాన్ని నీవు చెవులతో కాకుండా, చెవులను మనస్సుగా చేసుకొని విను" అన్నారు. అప్పుడు ఆ "జ్ఞానం" నీకు స్థిరమౌతుంది. అది నిజమైన ఆనందానికి సహకరిస్తుంది. విషయాన్ని బాగా అర్థం చేసుకొంటే అది "యోగం"గా మారిపోతుంది. టీచరుకు స్పష్టత లేకపోతే విద్యార్థికి ఏ ఉపకారం చెయ్యలేడు. విద్యార్థికి విషయం అర్థం కాకపోతే పొరపాటు విద్యార్థిది కాదు, టీచర్‌దే. టీచరుకు స్పష్టత ఉంటే "గోడ" కూడా గ్రహించగలదు. శంకరాచార్యులువంటి టీచరు ఉంటే టీచరువలన ఎనభై శాతం విద్య, విద్యార్థికి అందుతుంది. మిగిలిన విద్య, గ్రహణశక్తి, సాధనాబలం వలన

srinannagaru.com

ఇరవై శాతం విద్యను, విద్యార్థి పొందుతాడు. సాధారణంగా భక్తులు ఇలా కోరుకొంటారు "నాకు మంచి గురువు కావాలి" అని, కాని గురువు కూడా "నాకు మంచి శిష్యుడు కావాలి" అని కోరుకొంటాడు. కొందరు మాట్లాడితే "నాకు తప్ప మీకు ఏమీ తెలియదు" అన్నట్లు మాట్లాడుతారు. వ్యక్తి భావనతో మాట్లాడే మాటల వలన మనం సంపాదించుకొన్న జ్ఞానం కూడా పోతుంది. వాటి వలన ప్రయోజనం శూన్యం. "సబ్జక్టు" ప్రధానం. జ్ఞానుల మాటలవలన ప్రయోజనం ఉంటుంది.

4. ఏ గ్రంథాన్ని అయినా నిర్మలంగా అధ్యయనం చేస్తే ఆ గ్రంథం యొక్క హృదయాన్ని మనకు ఇస్తుంది. నీ హృదయంలో ఉన్న ఆనందం నీ ముఖంలో కనబడాలి. నీవు ఉపనిషత్తులు చదివేసి ముఖంలో ఆనందంలేకపోతే, లోపల ఏదో దుర్గంధం ఉంది. దాన్ని తీసి ప్రక్కన పెట్టండి, అదే సాధన. సత్‌పురుషుల సహవాసంలో ఒక దోషం ఉంటుంది. వారి సమక్షంలో ఉన్నంత సేపూ మల్లెపూల వాసనలో ఉండటం జరుగుతుంది, విడిచి వెళ్ళేడప్పుడు బాధగా ఉంటుంది. సజ్జన సాంగత్యం వలన అభ్యాసం చెయ్యాలి అనే తపన కలుగుతుంది. పాయసం దొరకలేదని విషం త్రాగం. అలాగే సత్‌పురుషులు దొరకనప్పుడు ఒంటరిగా ఉండు. దుష్ట సహవాసం పనికిరాదు. జప-ధ్యానాల వలన సత్‌పురుషుల సహవాసం వలన బుద్ధిలో దోషాలు తగ్గుతాయి. భగవంతుని విగ్రహాన్ని చూచిన భక్తులకు వారి శరీరంలోని అన్ని ఇంద్రియాలకు ఆనందం కలుగుతుంది. ఆయన ధర్మ స్వరూపుడు. ఆ ధర్మంలో లోపాలు ఉండవు. మీరు బాగుపడేలా మాట్లాడటమే బాగా మాట్లాడటం. సజ్జన సాంగత్యం వలన వైరాగ్యం కలుగుతుంది. సత్సంగంలో ఉండటం వలన విషయచింతనలోంచి బయట పడతాము. సత్యంలో నీకు అనుభవం వ్యక్తమౌతుంది. మనం తెలుసుకొనే కొలది తెలుస్తుంది మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయని. అన్నీ తెలుసుకొన్నాము అనుకొనే వాడికి ఏమీ తెలియదు. టీచరు "ప్రేమ"ను పెంచాలి, ద్వేషాన్ని పెంచకూడదు.

5. చెడ్డ సలహా చెప్పేవారి మాటలు వింటే శల్యసారధ్యం కలిగిన కర్ణుడు గతి మనకు కలుగుతుంది. మంచి మాటలు చెప్పే పెద్దల మాటలు వింటే శ్రీ కృష్ణ సారధ్యంలో ఉన్నట్లుగా మన గమ్యాన్ని చేరుతాము. మనస్సుగా, దేహంగా ఏమి చెప్పినా నిలబడదు. ఆత్మగా చెబితేనే కలకాలం నిలబడుతుంది. దేహ ప్రారబ్ధం ఎంత తీవ్రంగా ఉన్నా ఈ ప్రవచనాలు మీరు వింటూ ఉంటే ఎ/సి. గదిలో ఉన్నట్లు చేస్తుంది. ఈ ఆత్మ విషయం శ్రవణం చెయ్యటం వలన శుభం కలుగుతుంది. సజ్జన సాంగత్యంలో తీపి తెలిస్తే వారితో సహవాసం చెయ్యాలి అనిపిస్తుంది.

srinannagaru.com

తీపే తెలియనప్పుడు రుచి ఎలా తెలుస్తుంది. "రామనామంలో తీపి తెలియనప్పుడు ఆ నామాన్ని ఎలా చెయ్యగలడు రామా" అని త్యాగరాజు అన్నాడు. ఏ గూటి పక్షి ఆ గూటికే చేరుతుంది.

# 8. నిష్కామ కర్మ

ప్రతిఫలాన్ని ఆపేక్షించకుండా చేసే పనే నిష్కామకర్మ. స్వార్థం లేకుండా మనం పనిచేస్తే మన స్వరూపం మనకు తెలుస్తుంది. కామాన్ని విడిచిపెట్టిన వాడికే నిష్కామ స్థితి తెలుస్తుంది. నిష్కామ స్థితికి ప్రతీక మహాత్మాగాంధీ "నా మాటే నా సందేశం, నా జీవితమే నా సందేశం" అన్నారు. ఫలితాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పనిచెయ్యాలి. ఈశ్వరార్పితంగా పనిచేసి, ఈశ్వరుని పాదాల చెంత ఉంచినట్లయితే దాన్ని అనంతంగా చేసి మనకు ఇస్తాడు ఈశ్వరుడు. ఈశ్వరునిపై, సజీవ విశ్వాసంతో కర్మని చెయ్యాలి. నిష్కామకర్మలోనే మనిషి బరువుగా ఉంటాడు. సకామకర్మ చేసేవాడు తేలిపోతాడు. హృదయంలోకి దిగలేడు. మన మనస్సును బలవంతంగా ఆత్మ ధ్యానలోకి పంపలేము. ఈశ్వరార్పితంగా పనిచేస్తే అది ఆత్మలో లీనమౌతుంది. మనం అజ్ఞానమనే జైలులో ఉన్నాము. కాని స్వేచ్ఛగా ఉన్నామని అనుకొంటున్నాము. ఎవడిస్వార్థం వాడికి బంధిఖానా, మనం చేసే పని నిస్వార్థంగా చేస్తే మనకు స్వేచ్ఛ కలుగుతుంది. సంఘపరంగా నూటికి నూరుశాతం పనిచెయ్యాలి అంటే అది ఒక్క జ్ఞానికి మాత్రమే సాధ్యం. నీవు ఆ పని అంతగా చెయ్యలేకపోతే నీకు చేతనైనంత వరకూ ఆ పని చెయ్యటానికి ప్రయత్నం చెయ్యి. ఒక ఘనకార్యం మీరు చేయాలి అనుకొంటే మీకు, సహనం, ఓర్పు, నేర్పు, విశ్వాసం కావాలి. కర్మ ఫలితం వదిలిన వానికి కర్మవాసనలు నశిస్తాయి. కర్మఫలితాన్ని ఆలోచించకుండా ఉంటే వాసనలు బలపడవు. దేహబుద్ధిలేని వాడికి యజ్ఞముతో పని ఏమిటి? యజ్ఞమంటే స్వార్థం లేకుండా పనిచెయ్యటం. యజ్ఞ ప్రయోజనం దేహబుద్ధిని నశిపంచెయ్యటానికే!

2. "బింబా"నికి బొట్టుపెడితే, అద్దంలో ఉన్న ప్రతిబింబానికి కూడా బొట్టు పెట్టుకొన్నట్లే. అలాకాక అద్దంలో ప్రతిబింబానికి బొట్టుపెడితే బింబానికి సమకూరదు. అలాగే మనం చేసే దానాలు, ధర్మాలు లోకం మెప్పుకోసం చేసేవి. ఎందుకూ పనికిరావు. భగవంతుడి మెప్పుపొందే నిష్కామ కర్మ అత్యుత్తమమైనది. అది అలవడితే ఈశ్వరానుగ్రహం సమకూరుతుంది. మానవసేవే, మాధవ సేవ అంటే, మానవునికి సేవ చేస్తున్నాను అనుకొనే బదులు, మాధవునికి సేవ చేస్తున్నాను అని చెయ్యాలి. గుడిలో హారతికి డబ్బు వేసేటప్పుడు ధర్మం చేస్తున్నాను

srinannagaru.com

అనుకోవు కాని మానవునికి ఇచ్చినప్పుడే అలా అనుకొంటావు. నీ చేతిలో ఉన్న పనిని నీవు చెయ్యి, దేవుని చేతిలోని పనిని దేవుడు చేస్తాడు. మనం ఏమనుకొంటున్నాము, దేవుడికి గుర్తుచెయ్యకపోతే సహాయం చెయ్యడని ప్రార్థిస్తాము. అర్పణభావం వలన అనుగ్రహం వస్తుంది. మనకు నిజమైన గతి శరణాగతే. సత్‌కర్మలు నీకు మోక్షాన్ని కలుగజేయవు కాని ఆ సద్ వస్తువును తెలుసుకోవాలనే బుద్ధిని కలుగజేస్తాయి. కర్మఫలం మన ఊహల మీద ఆధారపడదు, ఈశ్వర నిర్ణయానికి అనుగుణంగా వస్తుంది. మిథ్యా"నేను" లేకపోతే కళ్ళు నిర్మలంగా ఉంటాయి. చాపల్యం ఉండదు. మంచి తనంతో పాటు హృదయం లోతుగా ఉండాలి. కర్మ ఫలితం తరచు జ్ఞాపకం వస్తూ ఉంటే అది సంస్కారంగా మారిపోతుంది. ప్రీతిలేని కర్మ, ప్రేమలేని కర్మ ప్రయోజనం శూన్యం కర్మఫలం ఆశించి నీవు పని చేస్తే ఆ తలంపులు, కొన్ని వేల జన్మలు నీ వెంట పరుగెత్తుకొని వస్తాయి. కర్మ ఫలితం వచ్చినంత తొందరగా, ఆత్మ సాధనలో ఫలితం అంత తొందరగా రాదు. కర్త ఎవరో తెలిస్తే కర్తృత్వం పోతుంది. దేవునికి గుర్తింపులు అక్కరలేదు. గుర్తింపులు లేకుండా పనిచేస్తే నీవు తరిస్తావు.

3. తన స్వంతపని తప్ప ఇతరుల పని ఇతరుల క్షేమం చూడని వాని కన్న చీకటి గుహలో పాములా బ్రతకటం మంచిది. గుడిలో శివునికి అభిషేకం చెయ్యటంలో ఎంత ప్రశాంతంగా, నిర్మలంగా ఉంటావో అలాగే, నీ విధి నిర్ణయంలో నీ కర్మలను చూచి నిర్మలంగా జీవించు, చిరాకూ పరాకుగా చెయ్యకుండా, ఇష్టంగా చెయ్యి, కర్మని యోగంగా చెయ్యి. కోరలు తీసిన పాము ఏమీ చెయ్య లేదు, నిష్కామకర్మ మానవుణ్ణి బంధించదు. అది చిన్న పని అయినా మనలను పవిత్రుణ్ణి చేస్తుంది. కర్మ ఎక్కడ నుంచి వస్తుంది అంటే కోరిక నుంచి, కోరికను బట్టి ఫలితం వస్తుంది. అది మంచిదైతే మంచిది, చెడ్డదైతే చెడ్డ జరుగుతుంది. సామాజిక స్పృహ వలన కూడా మనిషిలో తూకం పెరుగుతుంది. చెట్టు ఆకులు పండే కొలది చెట్టు నుండి రాలిపోతాయి. అలాగే నీ కర్మలు ఖర్చు అయ్యే కొలది నీ తలంపులు నశించిపోతాయి. బ్యాంకు మేనేజరు ఆ బ్యాకులో ఒకరికి అప్పు ఇచ్చిన తరువాత వాడు కట్టలేకపోతే బెంగపెట్టుకోడు కారణం ఆ "అప్పు"కు పెట్టిన తాకట్టు ఆస్థి ఉంది. అది బ్యాంకు చూచుకొంటుంది అని ఆందోళనపడడు కాని అతనే ఇంటికి వచ్చి తన స్వంత సొమ్ము ఎవరికైనా నోటు మీద ఇస్తే అతను ఇయ్యలేకపోతే బెంగపెట్టుకొంటాడు. బ్యాంకులో ఆస్తిపోతే స్థిత ప్రజ్ఞుడిలా, గుణాతీతుడిలా ఉంటాడు. సొమ్ము "నాది-నేను ఇచ్చాను" అనే భావనే బాధ కలుగజేస్తుంది. ధ్యానం చేసేవాడు ఏ ఫలితాన్ని పొందుతాడో నిష్కామంగా

srinannagaru.com

పనిచేస్తే అదే ఫలితాన్ని అదే అంతస్థులో పొందుతాడు. కొందరు గంటల కొద్దీ పనిచేస్తారు, ముఖంలో అలసట కనిపించదు. అంత నిర్మలంగా ఉంటారు. మనకు ఈశ్వరుని మీద ప్రమాణ బుద్ధి కలగటం లేదు. అందుకనే అలసిపోతున్నాము. ఈశ్వరుని మాటలు నమ్మటానికే ఈ భూమి మీదకు వచ్చాము. పని నేను చేస్తున్నాను అనుకొన్నప్పుడే అలసిపోతాము.

4. మనం ఎవరింటికైనా భోజనానికి వెళితే వడ్డనలో ఆ ఇంటి యజమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతాము. వారి గుర్తింపును కోరుకొంటాము. అది ఈశ్వరానుగ్రహాన్ని ఇయ్యదు. బయట వ్యక్తుల వడ్డనలో కూడా ఈశ్వరుడు ఉన్నాడనే తలంపు లేదు. ఈ చిన్న విషయాన్ని మనం గుర్తించలేము. పనిచేస్తే హృదయ పూర్వకంగా పనిచెయ్యి. మంచిని ప్రేమించాలి మంచి తనంతో మంచి పనులు చేసేవారిని చూచి సంతోషించు. మంచి తనమును ప్రేమించలేని వాళ్ళు మంచి పనులు ఎలా చెయ్యగలరు? పనిచేసి ఫలితం పట్ల ఆసక్తి లేకపోవటం వలన వైరాగ్యం వస్తుంది. పనిపాట లేకుండా, సోమరితనంగా ఉండే వానికి వైరాగ్యం ఉంది అనుకోకండి వైరాగ్యం ఉన్నవాడు పనిని సమర్థ వంతంగా చెయ్యగలడు. వాడి ద్వారా సమాజానికి ఎక్కువ పని జరుగుతుంది. వైరాగ్యం పైకి కనిపించదు అది ఒక వైభవం. వైరాగ్యం అంటే టెన్షన్ కాదు. వైరాగ్యం ఉన్నవానికి లోకవాసన నెమ్మదిగా తగ్గిపోతుంది. వైరాగ్యం కూడా సంపదే. భగవంతుడు చెప్పిన దాన్ని సరిగా అర్థం చేసుకోకపోవటానికి కారణం వైరాగ్యం లేకపోవటమే. వైరాగ్యం అంటే ఆసక్తిలేకపోవటం. గంగ, గోదావరి, కృష్ణా నదులు సముద్రంలో కలిసిపోతే ఆ సముద్రాన్ని పరిశీలిస్తే నీరు ఏఏ నదిది అని చెప్పలేము. అలాగే చైతన్యానికి ఇతరులు లేరు. జ్ఞానికి, ఇతడు- ఆమె-వాడు అని ఏమీ ఉండదు. నిజంగా మనం ఎవరికైనా ఉపయోగపడితే ఉపకారం పొందినవాడు పదిశాతం లాభపడితే నిష్కామంగా చేసినవాడు తొంభై శాతం లాభం వస్తుంది. ఎందుకంటే వాడు పవిత్రుడు అవుతాడు. ఆ సంగతి వాడికి తెలిస్తే ఉపకారం చెయ్యకుండా ఉండలేడు. వాడు, చైతన్యంలో కలిసి పోతాడు.

5. భగవంతుడు మీకు కొన్ని యోగ్యతలను ఇస్తాడు. దాన్ని మీరు సమాజానికి ఉపయోగపడేలా చేసుకొంటే, మరుజన్మ ఉత్తమ జన్మ వస్తుంది. నీవు సమాజం నుంచి ఏమీ ఆశించకు, ఆశిస్తే నీవు బంధింపబడతావు. నీవు చేసే పని ఈశ్వరుడు చూస్తూనే ఉంటాడు. బహుమతి ఇచ్చేది ఆయనే. కర్మ యోగంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మీరు ఏదైనా ఒకరికి సహాయం చేస్తే గర్వం పెంచుకొంటే నష్టం తొంభై శాతం సంక్రమించినట్లే. ఇతరులను ప్రేమించి

srinannagaru.com

వారికి తగిన ఉపకారం చేస్తే మీ మనస్సు విశాలమౌతుంది. హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. కర్మ ఫలితం పట్ల ఆశక్తి లేకపోతే జీవితం సుఖంగా వెళ్లిపోతుంది.

# 9. భగవాన్

భక్తులు నాశనం కారు, వారి యోగక్షేమాన్ని చూస్తాను అంటున్నారు భగవాన్ శ్రీ రమణ. ఒక బాలుడు ఆయన వద్దకు వచ్చి ఏదో చూస్తూ ఉండగా ఏం కావాలి బాబూ? అంటే "నాకు ఏమీ అక్కరలేదు" అన్నాడు. దానిపై భగవాన్ "ఏనాటికి దొరికావు రా, నాయనా, నా జాతి వాడవు" అన్నారు. వైరాగ్యాన్ని కోరుకొనే వారు ఎంతమంది ఉన్నారు మనలో. తపోవన్ మహరాజ్ సాధకునిగా ఉన్నప్పుడు అరటి పళ్ళ అత్తం భగవాన్‌కి ఇస్తూ ఉండగా కోతి ఆ అత్తాన్ని ఎత్తుకోపోగా చింతా క్రాంతులై ఉండగా భగవాన్ అన్నారు ఆ దేహం ఆత్మకు ఎంత దూరంలో ఉందో ఈ దేహానికీ ఆత్మ అంతే దూరంలో ఉంది అన్నారు. తన కన్న భిన్నంగా దేన్నీ ఆయన చూడలేదు. కల్పన లేని అందం వారిది. భగవంతుడు మానవ జాతికి బహుమతిగా భగవాన్‌ని ఇచ్చాడు. ఆయన మహర్షి, మర్చెంట్ కాదు. రమణ అంటే ఆత్మ మాత్రమే. క్రైస్తవులకు బైబిల్ ఎటువంటిదో రమణ భక్తులకు భగవాన్ విరచితమైన "అక్షరమణమాల" అటువంటిది. అరుణాచలేశ్వరుడే తిరుచ్చుళిలో రమణుడిగా జన్మించి అరుణాచలం వచ్చారు. భగవాన్‌తో మురుగునార్ ఇలా అన్నారు "నీ మౌనం ముందు, లోకంలో ఉన్న గ్రంథాలు అన్నీ దిగదుడుపే" అని. భగవాన్ శరీరాన్ని పొందక మునుపు పండితులు అంతా శాస్త్ర జ్ఞానంతో మునిగి పోయారు. దాన్ని భగవాన్ అనుభవంతో చెప్పారు మానవజాతిని శాస్త్రాల నుంచి మళ్ళించిన మహానుభావుడు. వారి వద్దకు ఒక వేద పండితుడు వచ్చి భగవాన్ తన కన్న తక్కువ చదువుకొన్నవారనే భావంతో పెద్దరాయి తెచ్చుకొని ఉన్నత ఆసనంపై కూర్చున్నారు. అప్పుడే ఒక కోతి వచ్చి చెట్టుపై కూర్చుంది. అప్పుడు భగవాన్ " ఆ పండితుణ్ణి ఉద్దేశించి ఒకరితో నాకన్న ఈ స్వామి గొప్పవారు వారి కన్న ఆ కోతి గొప్ప ఎత్తులో ఉంది కాబట్టి వారు గొప్పవారు" అన్నారు. హాస్యాన్ని జోడించి శులభంగా తెలిపేవారు విషయాన్ని.

2. సమత్వం అనే మాట గుర్తుకు వచ్చేటప్పటికి భగవాన్ గుర్తుకు వస్తారు. "నీ ఫలాలతో పాటు నీ స్వార్థాన్ని కూడా భగవంతునికి అర్పించు" అనేవారు. భగవాన్‌తో ఒక భక్తుడు "మేము అహంకారంతో ఉన్నాము. మీరు దాన్ని అధిగమించారు కాని మీరు మాలాగే కనిపిస్తున్నారు. మమ్ములను గౌరవిస్తున్నారు.

srinannagaru.com

సమానంగా చూస్తున్నారు" అనగా సముద్రానికి కెరటాలు సంగతి తెలియదు. ఆత్మకు అహంకారం గురించి తెలియదు అన్నారు. భగవాన్‌ని చలం ఇలా అన్నారు "నీవు రావు, నన్ను పోనియ్యవు. మత్తెక్కించావు, మధురగానాలతో లాలించావు. నీ ఆశ, నీ చూపు వెలుగులో ఏ చాటున ఉన్నదో నీకా శక్తి తెలియదు" అని. ఆయన ఆశ్చర్యపడటం, ఎదురు చూడటం, జరగలేదు. అన్నారు "గురువు లేకుండా, గుళ్ళోకి వెళ్ళకుండా శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యకుండా బ్రహ్మానుభవం పొందారు భగవాన్, అనేవారు కంచి పరమాచార్యులవారు. భగవాన్ ఉపనిషత్తులని, అవి అని, ఇవి అని ప్రమాణాలు తీసుకోలేదు. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థల పైనా భూత-భవిష్యత్-వర్తమాన కాలాలపైనా విషయాన్ని ఉతికి పారేసారు. తరచు "నిద్రానుభవాన్ని గుర్తు చేసుకోండి" అనేవారు. భగవాన్‌కు భూమా విద్యా విశారదుడు అనే పేరు ఉంది అంటే ఆత్మ విద్యను గురించి చెప్పటంలో విశారదుడు అని అర్థం. భగవాన్‌కు "హెవీ వైట్" అనే బిరుదు ఉంది. ఏ సంఘటనకు చలించరు. వారికి వైరాగ్యం నూటికి నూరుపాళ్ళు ఉంది. మనస్సు చలించటానికి వీల్లేదు. మోష్టు మోడరన్ ఋషి అంటారు ఆయనను. "నేను ఎవడను?" అని ప్రశ్నించుకోవటం వలన నీకు నీవు మహోపకారం చేసుకొన్నట్లే". "మీ బుద్ధితో మీమ్ముల‌ను మీరే అలా ప్రశ్నించుకొంటే మీరు కృతార్థులు అవుతారు" అన్నారు భగవాన్.

3. హృదయంలోని వస్తువు అనుభవంలోకి తెచ్చుకో అది ద్వైతమో, అద్వైతమో నీకు తెలుస్తుంది. కూర తినబోతూ రుచి అడగటం దేనికి, భగవాన్‌ని ఒకరు "వస్తువు ఒకటా? రెండా?" అంటే భగవాన్ అన్నారు "ఎప్పుడు?" అనగా "ఇప్పుడే" అన్నాడు అవతలి వ్యక్తి. దానికి "ఇప్పుడైతే రెండే" అన్నారు. అంటే నీవు అహంకారంలో ఉన్నావని అర్థం. వేదాంతాన్ని అంతా ఒక్కమాటలో చెప్పారు భగవాన్. హేతువాదులకు హేతువాది. వారికి విషయం ప్రధానం, ఆలోచన ప్రధానం. భగవాన్‌ని ఒకరు ఇలా అన్నారు "మీకు పండు ఇస్తే తింటున్నారు, డబ్బు తీసుకోవటం లేదు. డబ్బు అవసరం లేదా?" అంటే అద్భుతంగా "డబ్బును ప్రేమించకుండా, అసహ్యం చేసుకోకుండా అందంగా ఇలా అన్నారు గోచీలు కావాలన్నా, అన్నం కావాలన్నా, మందులు కావాలన్నా ఇస్తున్నారు. ఇక డబ్బుతో పనేముంది" అని కొందరు మెడిటేషన్‌లో పడే బాధలు చూస్తూ ఉంటే అక్కడ ఉండాలని అనిపించదు. భగవాన్ అన్నారు నీవు ఆత్మగా ఉండు చాలు అంత కన్న ఎక్కువ కష్టపడవలసిన పని లేదు. భగవాన్ వద్దకు ఒకరు వచ్చి నేను వచ్చాను అంటే.... "ఆ నేను ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడికి పో, దేవుడవు

srinannagaru.com

అవుతావు" అన్నారు భగవాన్. భగవాన్ ఒకరితో ప్రేమగాను, మరియొకరితో ముఖం ప్రక్కకు పెట్టుకొన్నట్లు, ఒకరితో చాలా నిర్లిప్తంగాగాను, మరియొకరి వంక అటుచూచే వారే కాదు. కారణం ఏ వాసన వారిలో ఉందో అది నిర్మూలించ టానికి దానికి తగ్గట్లుగా వ్యవహరించే వారు. భగవాన్‌ని "అరుణాచల రమణుడు" కాదు "ఆనంద రమణుడు" అంటే బాగుంటుంది. దేహంతో తాదాత్మ్యం ఉన్నంత కాలం ద్వైతం తప్పదు. మనస్సు దేహంతో తాదాత్మ్యం లేకపోతే అద్వైతం. ద్వైతం-అద్వైతం-విశిష్టా ద్వైతాలపై ఎన్నో గ్రంథాలు వ్రాసారు? ఈ విషయాన్ని భగవాన్ ఒక్క వాక్యంలో నిజం చెప్పారు.

4. "అహం బ్రహ్మోస్మి" అనుకోవటం కాదు. దాన్ని తెలుసుకొంటే అదే నీవు అవుతావు అన్నారు భగవాన్. అరుణాచలంలో సర్వాధికారిని పులితరుము కొని వస్తే కొద్దిగజాలలో ఉన్న భగవాన్ ఆపులితో "వాడు సర్వాధికారి అంటే సర్వానికీ అధికారి. ఆ సంగతి నీకు తెలియక తరుముకొని వచ్చావు. ఆ తప్పు నీది" అన్నారు. ఇంతకీ భగవాన్ ఎవరిని మందలించినట్లు, తన తమ్ముడు సర్వాధికారి అనే అహంతో ఉన్నవాడినా? పులినా? పులి వెళ్ళిపోయింది. భగవాన్ వద్దకు ఒక రాజస్థాన్ వ్యక్తి వచ్చి ఇలా అన్నాడు "నేను పొరపాట్లు చేసాను. పాపిని" అనగా భగవాన్ "నీవు పొరపాట్లు చెయ్యలేదు. పవిత్రుడవే" అన్నారు. అంటే మనిషిని ఎక్కడికి తీసుకొని వెళుతున్నారో చూడండి. మనిషి ఏ స్థితిలో ఉన్నా అక్కడ నుంచి పైకి తీసుకొని వెళ్ళాలి. అది భగవాన్ వైభవం. ఆయన అన్నారు "ఎక్కడ పుడతానో ఈ పాపానికి అని ఆలోచించేబదులు ఈ శరీరంలోనే చచ్చిపోయి తిరిగి ఈ శరీరంలోనే జ్ఞానం పొందటానికి ప్రయత్నం చెయ్యి" అన్నారు. మూఢ నమ్మకాలను భగవాన్ ప్రోత్సహించలేదు. అంటే కాశీ వెళ్ళు, రామేశ్వరం వెళ్ళు అనే మాటలు మాట్లాడలేదు. మొడరన్ ఋషి, సాధారణంగా శరణాగతి మార్గంలో భక్తులు అంటారు "నీ సంకల్పమే నా సంకల్పం. నీ ఇష్టమే నా ఇష్టం" కాని భగవాన్ అలా అనలేదు "నీ సంకల్పమే నాకు శాంతి, ఆనందం, మోక్షం". భగవాన్‌తో వంట ఇంట్లో ఒక అమ్మగారు ఇలా అన్నారు "మీరు అప్పుడప్పుడూ మాపై చిరాకు-కోపంతో ఉంటున్నారు. అది మాకు బాధగా ఉంది". భగవాన్ "మీ మనస్సులో వంకర్లు పోలేదని నాకూ బాధగా ఉంది" అన్నారు. గౌతమ బుద్ధుని కాలం రమణుని కాలం స్వర్ణకాలం. మధ్యవర్తులతో సంబంధం లేకుండా శాంతి, సుఖాలను అందిచటానికి కృషి చేసిన మహాత్ములు.

5. మానవులలో కన్న జంతు జన్మలో ఉన్న జీవులు కూడా చైతన్యస్థాయి ఎక్కువగలవి ఉంటాయి. భగవాన్ అన్నారు "మా అమ్మకు, గోవు లక్ష్మికి పోలిక

srinannagaru.com

లేదు. అమ్మకు ఎన్నో జన్మలకు సరిపడా సంస్కారాలు ఉన్నాయి. గోవు లక్ష్మికి అంతిమ కాలంలో ఒక్క వాసన కూడా లేదు. ఆశ్రమంలో గోశాలను, నిర్మించి గోవు లక్ష్మితో మొదటపాదం పెట్టాలని సర్వాధికారి ఆలోచన. కాని చివరి సెకనులో ఒక్క ఉదుటున భగవాన్ వద్దకు వచ్చి పేపరులాగింది "భగవాన్ తరువాత గాని ముందు నేను వెళ్ళటమేమిటి" అని. భగవాన్ విషయం గ్రహించి ఆయన వెనుక ప్రశాంతంగా వెళ్ళింది. దానికి ఆశ్రమ అధికారల చైతన్యస్థాయికి ఎంతో తేడా ఉంది. అది పశుజన్మే. అది ఏమీ చెప్పలేదు. ఎంత పవిత్రతతో ఆలోచించిందో చూడండి. భగవాన్‌ని ఒకరు ఇలా ప్రశ్నించారు "నాకు మోక్షం ఎప్పడు వస్తుందో డైరెక్టుగా చెప్పండి" అనగా "నీవు పుట్టలేదన్న విషయం నీకు తెలిసినప్పడు" అన్నారు. దేహం పుడుతుంది, ఆత్మ పుట్టదు. నీవు ఆత్మవు. ఆ సంగతి తెలిసినప్పడు అని అర్థం. భగవాన్ అన్నారు "మీరు ఎక్కడ చస్తారు, చావులేని వస్తువు మీరైనప్పడు" అని. భగవాన్ వద్ద ఏ నాయకుడైనా, ఏ వ్యక్తి అయినా తెలివి తక్కువగా మాట్లాడితే ఏమీ అనేవారు కాదు. కారణం అది వారి హుందా తనానికి, వైభవానికి, పవిత్రతకు భంగం. పళని వెడుతున్నాము స్వామి అక్కడ పాలాభిషేకం చేయించుకొందామని ఒక భక్తుడు అనగా ఎప్పడూ దొరకని భగవాన్ ఇలా అన్నారు ఆ సందర్భంలో "అక్కడ ఉన్నదే ఇక్కడ ఉంది" అని.

6. భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి "అయ్యా నేను దొంగ తనం చేసాను ఆ తలంపు వచ్చినప్పడు నాకు దుఃఖం కలుగుతోంది ఎలా" అన్నాడు. భగవాన్ గొప్పగా సమాధానం ఇలా చెప్పారు. "నేను దొంగతనం చేసాను అనే తలంపు నీవు మర్చిపో" అన్నారు. అంతేగాని గంగలో మునుగు దానం చెయ్యి అని చెప్పలేదు. మీరు రమణ మహర్షి గురించి చెప్పటం వలన కాని, వారిని ధ్యానం చెయ్యటం వలన గాని, వేరేవారు ఒకరు మీకు ఆయన వైభవాన్ని చెప్పటం వలన గాని వారి భక్తులు కాలేదు. జన్మాంతర అనుబంధం వలన మాత్రమే వారి భక్తులైనారు పైవి అన్నీ నిమిత్త మాత్రము. ప్రతీ ప్రవక్త కరుణామయుడే, జ్ఞానం వచ్చిన తరువాత, దయ లేకుండా, కరుణ లేకుండా ఉండడు, భగవాన్ వద్దకు ఒక దొంగ వచ్చి "నేను దొంగతనం చేసాను" అంటే భగవాన్ "నీ శరీరం దొంగతనం చేసింది. నీవు ఆత్మవు. ఆత్మ దొంగతనం చెయ్యదు" అన్నారు. వారిని ఒకరు ఇలా ప్రశ్నించారు "ప్రపంచం ఉందా" అజాత వాదాన్ని సమన్వయం చేస్తూ అద్భుతంగా ఇలా అన్నారు. "కనిపిస్తున్నది" అంటే మనస్సుకు సంబంధించినది అని అర్థం.

srinannagaru.com

# 10. బంధస్వరూపము, సామరస్యము

మనం ఇతరులను ద్వేషించి, వారికి సంకటాలను కలిగించే ముడులు, మనం వేసుకొన్న ముడులు, మరుజన్మలలో మనమే రెట్టింపు శ్రమతో విప్పకోవ టానికి వందలాది జన్మలు పడతాయి. పాపమనే విత్తనం నుంచి సంసారమనే చెట్టు పుట్టింది. మిమ్ములను మీరు హింస పెట్టుకోవటం కూడా పాపమే. లోభి తన ధనాన్ని దాచినట్లే భగవంతుడు మన వాసనలను దాచి తగిన సమయంలో అనుభవింప చేస్తాడు. పూర్వ జన్మల నుంచి తరుముకొని వచ్చే వాసనలే సంస్కారాలు. మీరు ఎప్పడైనా గౌరవాలను మూటకట్టి దైవాన్ని ప్రేమించారా? ప్రేమించేటప్పడు మిమ్ములను మీరు మర్చిపోయారా? అదృష్టం వెనుక దురదృష్టం కనిపెట్టుకొని ఉంటుంది. దేహమాత్రుడను అని అనుకోవటమే బంధము. మన చేతలే, మన శత్రువులు. శత్రుత్వం అకారణంగా రాదు. "అంత్య కాలమందు నన్ను స్మరించినా నీకు మోక్షం ఇస్తాన"ని తెలిపాడు శ్రీకృష్ణుడు. మనం ఎందుకు అలా తలంచలేకపోతున్నాము. శివుడు నాట్యం చేసినట్లు మన కోరికలనే మహా వృక్షాలు మనముందు నాట్యం చేస్తున్నాయి. జీవితం పొడుగునా మనం కోరుకొనే ప్రకృతి సంబంధమైన కోరికలే, మన పీక పట్టుకొని ఆ పరమాత్మని స్మరణ రానియ్యకుండా చేస్తున్నాయి. ఇంట్లో వ్యక్తులుపోతే మనకు దుఃఖం వస్తుంది కారణం మన సౌకర్యాలకు, సుఖాలకు లోటు వస్తుందని. వాళ్ళమీద ప్రేమ వలన కాదు. ముఖ్యంగా ఇంద్రియాలు ప్రాపంచిక విషయాలపై ఆధారపడు తుంటాయి. దేవుని కోసం, దేవుని ప్రేమించటం లేదు, మన స్వార్థం అక్కడ ప్రధానం, రూపమే మన మనుకొంటున్నాము అదే బంధము. మన లోపల ఏమైనా ఆకర్షణ ఉంటే అది మనలో లోపం ఉన్నట్లే. దూడను కట్రాడుకు కట్టికొట్టినట్లు మానవుడు దేహమే తానని అనుకొని దుఃఖాలను అనుభవిస్తున్నాడు.

2. జన్మ ముందా కర్మ ముందా? అనే ప్రశ్నలు అనవసరం. "నేను" ఉంటే కర్మ ఉంది అది లేకపోతే కర్మ లేదు. మనకు సహజస్థితి అంటే ఇష్టముండదు అందుకనే అసహజ స్థితిని కోరుకొంటున్నాము. నిత్యం మెడలో వేసుకొనే గొలుసు పోతే ఇరువది రోజులు నా గొలుసు ఏమైపోయింది అనుకొంటూ అవును పోయింది కదా అని అనుకొంటాము. అలాగే మన శరీరం శ్మశానంలో కాల్చిన 20 రోజుల దాకా నా శరీరం ఏమైనది అనుకొంటూ మరల అవును శ్మశానంలో కాల్చి వేసారు కదా అని అనుకొంటాము. మీ తలంపులను మీరు కంట్రోల్ చెయ్యలేని వారు "లోకాన్ని ఉద్ధరించగలం" అనుకోవటం వెర్రితనం. మన

srinannagaru.com

తలంపులకు మనం బానిసలం. దానితో మనం కట్టేసుకొని బాధపడుతున్నాము. గౌరవం కూడా బంధకారణమే. తల్లి తండ్రులు శరీరాన్ని ఇస్తారు కాని వారు సంస్కారాలను ఇయ్యలేరు. పూర్వజన్మ సంస్కారాలే వాసనలుగా ఉంటాయి. బుద్ధునితో తమ్ముడు ఆనంద్ అంటాడు "నిన్ను చూచినవారు, నీతో మాట్లాడిన వారు జ్ఞానులు అవుతున్నారు. నేను నీకు ఎంతో సేవ చేస్తున్నా, పైగా దగ్గర బంధువును నాకు జ్ఞానం రావటం లేదు ఏమిటి?" అంటే "నీ చివరి మాటలే నీకు జ్ఞానం రాకుండా చేస్తున్నాయి" అన్నారు. బుద్ధుని మహా నిర్యాణ అనంతరం, బుద్ధుని వలన జ్ఞానం పొందిన వారి పట్టిక రాస్తే అందు ఆనంద్ పేరు లేకపోవటంతో అతనికి విపరీతమైన దుఃఖం వచ్చింది. ఆ దుఃఖంలోంచే ఆనంద్‌కు జ్ఞానం కలిగింది. జ్ఞానితో బంధుత్వం ముఖ్యం కాదు మానసిక అనుబంధం ముఖ్యం. బంధువులు బంధువులు అని అనుకొంటే వారే బంధిస్తారు. లోకంలో మంచి వారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు. చెడ్డ వాళ్ళ వలన మనలో ఉన్న వాసనలు పోవటానికి వారి ప్రయోజనం మంచి వాళ్ళకు ఉంటుంది. వాళ్ళను శుద్ధిచెయ్యటానికి చెడ్డవాళ్ళను సృష్టిస్తాడు భగవంతుడు.

3. ఏ భక్తుడైనా భగవంతుణ్ణి తన అవసరాలు అడిగితే పరవాలేదు. కాని కోరికలు అడుగుతాడు. అవసరాలు బంధించవు కోరికలు బంధిస్తాయి. మీ ఇంద్రియాలు మీ స్వాధీనంలో ఉంచితే ఈ లోకం మిమ్మలను ఏమీ చెయ్యదు. "నాకు దుఃఖం రాకూడదు" అనుకోవటం కాదు. ఒకవేళ దుఃఖం వచ్చి మీద పడినా దున్నపోతు మీద ఈగ వాలినట్లు ఉండాలి. ప్రసవం టైములో తల్లి కష్టపడకుండా, బాధ పడకుండా ఉండదు. అదేవిధంగా ఈ అహంకారమనే గుడ్డును పగులగొట్టుకొని మనం బయట పడాలంటే కొంత బాధ పడాలి తప్పదు. ఇంద్రియాలతో మీరు పేచీ పెట్టుకోకండి. వాటికి జాగ్రత్తగా నచ్చచెప్పండి. వాటికి అర్థం కాకపోతే తిరగబడతాయి. అణిచిపెట్టిన మనస్సు పగపట్టిన త్రాచు పాములాంటిది. ఎప్పుడో ఒకప్పుడు అవకాశం చూచుకొని కాటేస్తుంది. అందుకే మీ మనస్సును, ఇంద్రియాలను వశం చేసుకోవాలి. నదిని దాటటానికి బల్ల కట్టు ఎటువంటిదో ఈ అజ్ఞానమనే నదిని దాటటానికి శరీరం అటువంటిది. త్యాగం అంటే ఇష్టం లేని వస్తువును వదిలివేయటం కాదు, నీకు ఎంత ఇష్టమైన వస్తువునైనా అది నీకు తినటం మంచిది కాదన్నప్పుడు అది మానేస్తేనే మంచి కలుగుతుంది. అదే త్యాగం. భోగం ఒక్కటే లక్ష్యం అనుకొన్నప్పుడు రోగానికి సిద్ధమవ్వవలసిందే. మీదేహాలు శ్మశానంలో కాలుతాయి. మీ వాసనలు ఊరిలో పుల్ల అంతా వేసినా కాల్చలేవు.

srinannagaru.com

**4.** ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ గలవారే చెప్పేడు మాటలను తొందరగా నమ్ముతారు. ఒక క్రమబద్ధంలేని జీవితాలతో, ఒక ఆదర్శం కోసం జీవించని వారితో మనకు ఎంత దగ్గరి వారైనా, ఎంత స్నేహితులైనా సాధ్యమైనంత వరకూ దూరంగా ఉండాలి మనం సత్యాన్ని తెలుసుకోవటానికి. ఎండ్రిన్ మన ఇంట్లోనే ఉంటుంది మనం నోట్లో వేసుకొంటామా? అలాగే పై వారిని కూడా దూరంగా ఉంచాలి. మన నిజస్వరూపమే శివ స్వరూపం. అందులో ఉండటమే నిజమైన పూజ. దానికి మించిన ధ్యానంగాని, జపంగాని, యజ్ఞంగాని ఈ లోకం లో లేదు. మనస్సు యొక్క మూల స్వరూపం ఆత్మే కాబట్టి మన మనస్సు అక్కడ నుంచే వచ్చింది కాబట్టి మన స్వరూపాన్ని చింతించగా చింతించగా, మూలంలో మన మనస్సు కలిసిపోతుంది. దానికి మించిన సాధన లేదు. మీ కంటే ఈశ్వరుణ్ణి వేరుగా చూడటం అలవాటు చేసుకొంటే అస్తమానూ ఏదో ఒకటి అడగాలని అనిపిస్తుంది. మీ స్వరూపంగా ధ్యానం చేస్తూ ఉంటే మీకు ఏది కావాలో ఆయనకు తెలుసు. కర్మ విషయంలో బహు జాగ్రత్తగా ఉండండి, పని వలన సంస్కారం పుడుతుంది, సంస్కారంలోంచి స్వభావం వస్తుంది, ఆ స్వభావాన్ని మనిషి సాధన చేసి జయించలేడు. కేవలం నిగ్రహం వలన స్వభావం మారదు. అది మనం చేసే పనులలోంచే వస్తుంది. ఈ సృష్టి అంతా రాగ-ద్వేషాల చుట్టూ తిరుగుతోంది. అవి లేకపోతే శరీరం తయారు అవ్వటానికి కావలసిన మెటీరియల్ ఉండదు. శరీర ఉత్పత్తే ఉండదు. ఎవరినైతే రాగ-ద్వేషాలనే పాములు కరిచాయో, వారు మృత్యువు నుండి తప్పించుకోలేరు. పాము నోట్లో నుంచి వచ్చిన విషం కన్న చెడు స్నేహాల వల్ల మనస్సుకు ఎక్కువ విషం ప్రవేశించి మనస్సుకు నిర్మలత్వం పోయి ఎన్నో నీచ జన్మలు దౌర్భాగ్యపు శరీరాలను తీసుకొని వస్తుంది.

**5.** హృదయంలో నిరంతరం మనస్సును నిలబెట్టటం వలన వాసనలు, తలంపుల క్రింద మారవు లేకపోతే మారిపోతుంది. తలంపు మీ చేత పని చేయిస్తుంది. చిన్న వాసన, చిన్న సంస్కారం బంధిస్తుంది. మనస్సు అంటే జీవుడు. మీరు చనిపోయినప్పుడు జీవుడు వెళ్ళిపోయాడంటే కంగారు పడతారు. అది చిన్న విషయం. ఈ జీవుడికోసం వాడిలో ఉన్న వాసనల కోసం ఈశ్వరుని ప్రార్థిస్తూ ఉంటే జీవ లక్షణాలు పెరుగుతాయి. అజ్ఞానం కూడా వస్తుంది. ఏదో గర్భంలో గుల్ల తయారు అవుతుంది. ఏదో శ్మశానంలో కాలిపోతుంది. ఆత్మకు తన కన్న వేరుగా వస్తువు కనిపించదు, అందుచే కామించదు. మనస్సుకు తనకన్న వేరుగా వస్తువు కనిపిస్తుంది కాబట్టి, కామించక మానలేదు. మనిషికి భ్రాంతి కలుగుతూ ఉంటే బుద్ధిలోని దోషమే. మీ కంటే వేరుగా భగవంతుడు

srinannagaru.com

కనిపించకూడదు. వాసనా క్షయం అయ్యే వరకూ ఈ పోరాటం తప్పదు. ఏ శక్తి అయితే మిమ్ములను ఈ భూమి మీదకు తీసుకొని వచ్చిందో ఆ శక్తే మిమ్ములను ఈ భూమి మీదనుంచి తీసుకొని పోతుంది. ఆ శక్తే మిమ్ములను కొంత మందిచే తిట్టిస్తుంది, కొంతమందిచే పొగిడిస్తుంది. ఈ పనులు అన్నీ చేసేది ఒక శక్తి, ఇక మీరు తొందర పడవలసిన పని ఏముంది. ఈ సెకనులో మీకు జ్ఞానం కలిగే ఉపాయం చెబుతున్నాను. మీరు మీ జీవితాలతో రాజీ పడండి. మీరు ప్రాణాయామం చెయ్యమని, యాత్రలు చెయ్యమని అనటం లేదు, రాజీ పడటం వలన సంస్కారాలు అంటుకోవు. భగవంతుడు చెప్పే మాట నేను నమ్మలేక పోతే నా పాపమే నన్ను నమ్మనియ్యటంలేదు. అందుచే మీరు పోరాడండి, మీ అలవాట్లుతోనూ, బలహీనతలతోనూ, పాపాలతోనూ అంతేగాని వ్యక్తులతో కాదు. ఈ దేహమే "నేను" అని ఎవరనుకొంటారో వాడికే చావు-పుట్టుక.

6. శరీరం పంచభూతాల కల్పితం అయినప్పటికీ దాని మీద మనకు మోహం ఉన్నందు వలననే ఈ మమకారాలు ఏర్పడతాయి. పాపం ఎందువలన చేస్తాము? మోహం వలన. మోహం ఎందుకు పుడుతుంది? తాను గాని శరీరాన్ని తానుగాని మనస్సును తాను అనుకోవటం వలన. విషయాన్ని ఎంత కాలమైతే విడదీసుకోలేడో అంత కాలం పాపం చేస్తాడు. పాపం చేసే కొలది బుద్ధి స్థూలమైపోతుంది. తన హృదయంలో ఉన్న సత్యాన్ని గ్రహించే శక్తి కోల్పోతుంది. మీ మనస్సు అబద్ధానికి అలవాటు పడిపోయింది. ప్రకృతి గొడవలలో తడిసిపోయింది. అందుచే నిజాన్ని అర్థం చేసుకోలేదు. మన బుద్ధితో నిర్ణయించి మళ్ళీ స్వీకరిస్తే అది కాకిరెట్టతో సమానం. మనం గింజలు భూమిలో పెడతాము, ఆ గింజలు మొలకెత్తుతాయి. అదే విధంగా అహంకారం మొలిచేటప్పటికి మరలా శరీరం వస్తుంది. అహంకారం ఉన్నంత కాలం అలా శరీరాలు వస్తూనే ఉంటాయి. ఎవ్వరూ ఆపలేరు. ఈ ఆధ్యాత్మిక విద్య అబ్బకపోతే ఎన్ని శవాలనైనా మొయ్యాలి. మరణ సమయంలో వచ్చే తలంపుకు అనుగుణంగానే పునర్జన్మ వస్తుంది. ప్రేమ లేని వాడు, సమత్వం లేనివాడు జ్ఞాని కాడు. మహిమలు చేసినా భవిష్యత్తు తెలిపినా ప్రేమ లేకపోతే జ్ఞాని కాడు. భవిష్యత్తును చెప్పలేక కాదు, చెబితే ఏడుస్తూ కూర్చుంటారు. ఈ శరీరం పుట్టింది కాబట్టి చనిపోతుంది. ఇక రేపు ఏముంది ఆత్మకు. కాలాన్ని మనస్సు కల్పించినదే అందులో ఇమిడిపోయి బయటికి రాలేక పోతున్నది. మనస్సు అందులో ఇరుక్కుపోయింది. అదే బానిసత్వము.

7. మీకు ఇష్టంలేని కోరికలు కూడా వస్తూ ఉంటాయి. అవి చేసే అప కారం కూడా మీకు తెలుసు. తెలుసుండి లొంగిపోతున్నారు. అప్పుడు స్వతంత్రుల

srinannagaru.com

మని ఎలా అనుకొంటున్నారు, ప్రపంచాన్ని దేవుడిని అలా దూరంగా ఉంచండి. మిమ్ము్మలను బాధించే తలంపుల నుంచి స్వతంత్రం పొందండి. అప్పడు మీ హృదయంలో సుఖం ఎంత ఉందో మీకు కనబడుతుంది. మీకు వచ్చే తలంపుల గురించే మీరు ఆలోచించుకొంటూ ఉంటే ఆ జన్మకాజన్మ అజ్ఞానంలో కూరుకు పోతారు. ప్రాణం కంటే ఎక్కువ తీపి అహంకారం. అందుకే అహంకారానికి ఎప్పడైనా దెబ్బతగిలితే ఎండ్రిన్ తాగి, ఉరి పోసుకొని ప్రాణం తీసుకొంటున్నారు. అజ్ఞానం అంటే అంత తీపి, ప్రారబ్ధం ఉంటే అనుభవిస్తే పోతుంది. అలా కృత్రిమ చావులు చావకూడదు. కొంతమంది అహంకారాన్ని అణచిపెట్టి ఉంచుతారు. మర్యాదగా ఉంటుందని అలాగే అణిచి ఉంచితే, అహంకారం పగ పట్టిన త్రాచు పాములా తయారౌతుంది. ఆత్మను వదలి ఎంత దూరం వెళ్ళినాడో అన్ని మైళ్ళు తిరిగి రావాలి. కోరికలు నెరవేరే కొలది అహంకారం పెరుగుతుంది. కళ్ళకు చూచే అలవాటు ఉంది అది మాన మంటే మానదు. అలాగే చెవులకు వినే అలవాటు ఉంది, అది ప్రకృతి విషయాలను వినటం మానదు. అలాగే బుద్ధి ఆలోచించటం మానదు. ఈ మూడూ వాటి పని అవి మానవు. మనం వాటితో రాజీ చేసుకోవాలి పేచీ పెట్టుకోకూడదు. వాటికి మంచి పని చెప్పండి, పవిత్రత నేర్పండి. మీరు జ్ఞానులు అయిపోతారు. మీకు పూర్ణత్వం వచ్చిందంటే మోక్షం వచ్చినట్లే.

8. ఈ ప్రపంచానికి భగవంతుడు పెట్టిన పేరు "దుఃఖాలయం". దీనికి రెండు గోపురాలు పెట్టాడు. ఒకటి "అనిత్యమైనది" రెండు "అశాశ్వతమైనది". ఈ లోకానికి సంబంధించి దేనిలోంచి అయినా మీకు సంతోషం వస్తూ ఉంటే మరలా దాన్ని విడిపించుకోవటానికి ఎన్నో జన్మలు కావాలి. మనం తల్లి గర్భం నుంచి వంద వాసనలతో వచ్చి మరణించేడప్పడు తొంభై వాసనలతో మరణిస్తే మన జీవితం సక్సెస్ అయినట్లే. అలా కాకుండా ఇంకా కొత్తగా ఇంకో ఇరవై వాసనలతో వెళ్ళిపోతే బంధంలోకి వెళ్ళిపోతున్నామా? మోక్షంలోకి వెళ్ళిపోతున్నామా మీరే ఆలోచించుకోండి. బ్రహ్మము తెలుసుకొనే వరకూ మానవునకు, పీడన వేదన తప్పదు. ఇంద్రియ జ్ఞానంలో దుఃఖం అణురూపంలో ఉంటుంది. బ్రహ్మంలో దుఃఖం లేదు. కరెంటు ఉంది కాని "బల్బు" పోవటం వలన లైటు వెలగటం లేదు. అలాగే బ్రహ్మం నీలో ఉంది దాన్ని తెలుసుకొనే శక్తి నీలో లేనందువలన మన "స్థితి" మనకు తెలియటం లేదు. "ఈ దేహం నాది" అని నేను అంటున్నాను కాని దేహం "నేను" అని దేహం అనటం లేదు. ఇదే మాయ. కామానికి, ప్రేమకు తేడా తెలియని వాడు నశించిపోతాడు. ప్రకృతి గుణాలు అన్నీ కామంలోంచే

srinannagaru.com

వస్తాయి. లోపాలే-పాపాలు. వ్యక్తి భావనే పాపం. ముక్కులో గాలిపోవచ్చు కాని "నేను"పోదు. మరుజన్మలో నైనా ఆ "నేను"ను పరిష్కరించుకోవాలి. నేను యొక్క మూల స్వరూపం తెలియకుండా ఎన్ని దేవుడులను సేవించినా ప్రయోజనం లేదు. "నేను" అనే తలంపు ప్రాణంలోంచే వస్తే మరణించిన తరువాత "నేను" పోవాలి. నేను అనే తలంపు రక్తంలోంచి ఎముకలలోంచి, గుండెలోంచి రావటం లేదు. "నేను" అనేది దేవుని దగ్గర లోంచే వస్తున్నది.

9. "నేను" యొక్క స్వరూపం తెలిసే వరకూ ఎన్ని శాస్త్రాలు చదివినా ఒకటి లేని సున్నలకు ఎంత ప్రయోజనం ఉందో పై చదువులకు కూడా అంతే ప్రయోజనం. నిద్రలో ఈ "నేను" దేవుని దగ్గరకు వెళుతుంది. మనస్సుకు, ప్రాణానికీ మూలం నీ హృదయంలోనే ఉంది. ముక్కులోంచి గాలి రావటం లేదు దాని మూలం ప్రాణంలోంచే వస్తుంది. ద్వేషానికి పెట్టుబడి పెట్టనక్కరలేదు. అసూయ లేనివానికే శాస్త్రం అర్థమౌతుంది. ద్వేషించే వారి వలన కూడా ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే మనస్సు అంతర్ముఖం అవుతుంది. మనం అన్ని స్థూల బుద్ధితో అంటే ఇష్టాయిష్టాలతో మాట్లాడుతాము. అందుచేతనే బంధించబడు తున్నాము. బ్రహ్మం తెలియటం లేదు. ఆత్మ న్యూనత పనికి రాదు. దాని వలన ఏదీ సాధించలేము. పతనమౌతాము, భవిష్యత్తు లేదు. ఆత్మ బలం ఉన్న మనిషి ఉచ్ఛస్థితికి వెళతాడు. దేవుని మీద మీకు విశ్వాసం ఉంటే మంచిదే, కాని మీ మీద కూడా విశ్వాసం ఉంచుకోకపోతే ప్రయోజనం అంతంత మాత్రమే. శారదా దేవి అంది "నా భర్త ఎప్పడూ బెంగపెట్టుకోలేదు, విచార పడలేదు" వాళ్ళ మనస్సులు ఎటువంటివో చూడండి, మీరు బెంగపెట్టుకొంటే మీలో వాసన ఉన్నట్లే. అవి ఉంటే సమాధి రాదు. నీ శరీరం బుడగలాంటిది. దానితో తాదాత్మ్యం పొందకు, ఆత్మ నీరులాంటిది. దానితో తాదాత్మ్యం చెందు. ధర్మం అధర్మ మనోపరిధిలోనివే. శుద్ధ మనస్సు ఆత్మాకారం చెందుతుంది. గుడ్డివాడిని కుంటివాడిని పేరు పెట్టి పిలవాలి. అంగవైకల్యానికి తగ్గ పేర్లతో పిలిస్తే తరువాత జన్మలో అదే గతి అవుతుంది. మాట తంటాలను తెచ్చి పెడుతుంది.

10. దుష్టులకు దూరంగా ఉండాలి. వారు ముందు ఆశలు చూపుతారు. తరువాత అశాంతిని కలుగజేస్తారు. బూరి పెడతామని ఇంటికి పిలుస్తారు. అలా అన్నప్పడు ఎంతో కొంత మంచి ఉద్దేశ్యం ఉంటుంది. కాని ఇంటికి వచ్చిన తరువాత వాడు బూరి పెట్టడు. వాడికి అప్పడు ఈ తలంపు కలుగుతుంది "వీడికి బూరి పెట్టటం అనవసరం. వీడి బూర (గొంతు) కొరికి చంపుదాము అనుకొంటాడు. చేతికి చిక్కిన తరువాత దుష్టుడు నమ్మకద్రోహం చేసి చంపు

srinannagaru.com

తాడు. వారు అస్థిర చిత్తులు, దేవుని నమ్మినవాడు ఎన్నడూ చెడిపోడు.

11. తలంపులు ఎక్కడ నుంచి వస్తున్నాయి అని పరిశీలన అవసరం. ఇంద్రియాలకు రాజు మనస్సు. దాన్ని స్వాధీనం చేసుకొన్నవాడు మహాత్ముడు అవుతాడు. వ్యక్తి భావన ఉన్నంతకాలం ఆత్మ దర్శనం కలుగదు. విషాద స్పర్శ లేకుండా వెలుగు రేఖలు విచ్చుకోవు. వెలుగు కానరాదు. తాగుబోతే తెలివి లేని మాటలు మాట్లాడుతాడు అనుకొంటారు, దేహబుద్ధి ఉన్నవాడు కూడా తాగుబోతు మాటలు లాగే తెలివిలేని మాటలు మాట్లాడతాడు. జ్ఞాని నోటి నుండి సత్యం పలుకుతుంది. కర్తృత్వం వదిలిన వాడిని ఏ కర్మలు బంధించవు, ప్రారబ్ధ కర్మ కూడా ఏమీ చెయ్యలేదు. మనస్సు, ఇంద్రియాలు పాములాంటివి కామక్రోధ, లోభాలు నరక ద్వారాలు. దేహంతో నీవు తాదాత్మ్యం పొందితే అశాంతి, పొందక పోతే శాంతి. ఈశ్వరుడు ఇచ్చిన ఈ స్వేచ్ఛను నీవు సద్ వినియోగం చేసుకొంటే దైవీ సంపదలోకి వెళతావు. దుర్వినియోగం చేసుకొంటే అసుర సంపదలోకి వెళ్ళి అధోగతి పాలౌతావు. మనిషి మనస్సు చలించటానికి ముఖ్య కారణం భయం. దాని వలనే ఆయుష్షు తగ్గుతుంది, చికాకు వస్తుంది. అందుకనే అభయస్థితిని కోరుకోవాలి.

12. మన అహంకారమే మన అజ్ఞానం. నా గ్రామం, నా కుటుంబము, నా సాంప్రదాయం గొప్పదనే భావాలే తరువాత జన్మలలో మీకు జ్ఞానం పొందటానికి అడ్డు వస్తుంది. జ్ఞానాభివృద్ధికి కొండ గుర్తు మీరు పక్షపాత రహితంగా ఉండటమే. వినయం ఉన్న వానికి సాధనతో పనిలేదు. కష్టాలు రాకుండా ఉండటం గొప్పకాదు, కష్టాలు వచ్చినా చలించకుండా ఉండాలి. దేహప్రారబ్ధం ఆపుచేసుకోవటం వలన ప్రయోజనం లేదు. "ఎన్ని కష్టాలు వచ్చినా నా మనస్సుకు అశాంతిని కలుగ జేయకు, కష్టాలు నిల్వ ఉంచకు, రానియ్యి" అని భగవంతుణ్ణి ప్రార్థించాలి. దేహం ఉండగానే రాగ-ద్వేషాలు తట్టుకొనే శక్తి అలవర్చుకోవాలి. ఎవడైతే తన మనస్సును నిగ్రహించుకొంటాడో వాడే వీరుడు. బుద్ధిని బాగుచేసుకోవటమే నిజమైన చదువు. తలుపు సందులో పెట్టి మిమ్ములను ఎవరైనా నొక్కితే ఎంత బాధగా ఉంటుందో అలాగే ఒక్కొక్కసారి ఈశ్వరుడు మీకు కష్టాలను, సంకటాలను కల్పించి మీ వాసనలను బయటికి గెంటుతాడు. గుడ్లగూబకు చీకటి అంటే ఇష్టం. అలాగే కొందరు పేచీలు లేకపోతే "ఫ్రీ"గా ఉండలేరు. కొందరు ఈ విషయంలో ఖడ్గ మృగంలా ఉంటారు. మరికొందరు స్వార్థపరులై ఉంటారు. రెండు రకాలుగా ఉన్న వారిని భరించటం కష్టం. స్వార్థపరుడు అంటాడు "మీ ఇంటికి వస్తాను ఏమి ఇస్తావు. నీవు మా ఇంటికి వస్తే ఏమి పట్టుకొస్తావు".

srinannagaru.com

రెండూ లాభాలే. దేహబుద్ధి అనే జబ్బు పోవాలంటే, లౌకికులతో స్నేహం చేస్తే పోదు. వాళ్ళు నిన్ను పొగిడినా, తిట్టినా పట్టించుకోకు.

13. మనం మనిషిని గౌరవిస్తాము కాని అతని నీడను గౌరవించం. కారణం ఆ నీడకు ఆధారం ఆ మనిషే కాబట్టి. అలాగే మనం ఎవరం ఆత్మ. కాని దాని నీడ మనిషి, మనం ఇప్పుడు దేనికి విలువ ఇస్తున్నాము నీడకే కదా! లోకం మెప్పుకోసం ఏ పనిచేసినా ప్రయోజనం లేదు. దేవుడు ఇచ్చే బహుమానాల కన్న మనకు లోకం ఇచ్చే బహుమానాలే ఇష్టం. కోరిక ఉన్నంతకాలం "భయం" విడిచి పెట్టదు. గాలిలో మేడ కట్టుకోవటం వలన నిజ జీవితానికీ, ఆధ్యాత్మిక జీవితానికీ దూరమౌతాము. నీవు సంపాదించేది ఏదీ శాశ్వతం కాదు. మానసిక ఆరోగ్యం లేకుండా ఆత్మ దర్శనం కలుగదు. చీకటి వెలుగు వలన పోతుంది. అవిద్య విద్య వలన పోతుంది. మానవుడు "తాను మెలకువగా ఉన్నాను" అనుకొన్నప్పుడు కూడా నిద్రలోనే ఉన్నాడు. అదే అజ్ఞానమనే నిద్ర. జ్ఞాని ఇతరుల మనస్సును నొప్పించకుండా సత్యం వైపుకు తీసుకొని వెడతాడు. సిక్కు గురువులలో ఒకరు ఒకరితో ఇలా అన్నారు "ఈ చిన్న గుండు సూది పరలోకంలో నాకు ఇవ్వవలసినదిగా" కోరాడు, అవతల వ్యక్తి ఇలా అన్నాడు "నా దేహమే నా కూడా రానప్పుడు ఈ గుండు సూది మీకు అక్కడ ఎలా ఇయ్యగలను" అనగా జ్ఞాని అంటాడు "ఈ గుండు సూదే తేలేని నీవు నీ స్వార్థాన్ని కేంద్రంగా పెట్టుకొని, జీవితం పొడుగునా పాకులాడుతున్నావే, నీ జీవిత రహస్యం తెలుసుకోలేక పోతున్నావు" అన్నారు. మనకున్న అలవాట్లు వలన "దేవుడు లేడు" అనుకొంటు న్నాము. దేవునిలోనే నిజమైన ఐశ్వర్యం ఉంది. ఆత్మ విచారణ కాకుండా, ఇతర విచారణలు చెయ్యటం "దొమ్మరి విద్యలు" అంటారు. మనం కోరవలసింది ప్రాపంచిక ప్రతిష్ఠ కాదు మనలను, మనం కోరుకోవాలి. అంటే మన స్వస్వరూపాన్ని కోరుకోవాలి. మన స్వరూపం ఆత్మ.

14. బాహ్యంగా ఉన్న అందం, డబ్బు, విద్య, అధికారం మీకు ముక్తికి ఉపయోగపడవు. అందులో ఏమీ లేదు. అది అంతా తాలింపు సరుకు మాత్రమే. మనో నిగ్రహం అనే ఆస్తి ఉంటే మోక్షం సంప్రాప్తమౌతుంది. ఎవరి అహంకారానికి వారు పొలేరుతనం చేసుకొంటున్నారు. ఈ శరీర వయస్సు కొద్ది కాలమే, కాని "శరీరమే నేను" అనే బుద్ధిని ఎన్నో లక్షల జన్మల నుంచి మోసుకొని వస్తున్నాము. మీరు ఎవరో మీకు తెలిసే వరకూ పూర్ణత్వం పొందలేరు. మీరు బాహ్యంగా ఏది సంపాదించినా అది మీకు నిజంలా కనిపించినా అది నిజం కాదు. నీవు సదా ఎవరినీ నిందించకు అలా చేస్తే నీవు సదా నిందా స్వరూపుడవు అవుతావు.

మంచిని ఖండిస్తూ ఉన్నవాడు ఆత్మజ్ఞానం పొందటానికి ఎన్ని జన్మలు ఎత్తినా సాధ్యం కాదు. ఎదుటివాడిలో చెడును కూడా నీవు సహించే స్థితికి వచ్చినప్పుడు మాత్రమే నీవు ఆత్మ వైపు స్థిరంగా నిలవటానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉపద్రవం లేని జన్మ అంటూ ఏదీ ఉండదు. ఒక్క మోక్షంలోనే ఉపద్రవం లేదు. అహంకారంతో మాట్లాడకండి. ఆడంబరం కోసం మాట్లాడకండి. ఈ విషయంలో మీరు ఎంత వరకూ ఉంటున్నారో లెక్కలు కట్టి తేల్చుకోండి. సురేంద్రనాథ్ బెనర్జీ పై ఒకరు చెప్పు విసరగా "నేను ఈ భారతదేశానికి నాల్గు దశాబ్దాలు సేవచేసాను ఒక చెప్పు ఇచ్చారు" అని కన్నీరు పెట్టుకున్నారు అంటే అంతటి మహోన్నతుడు కూడా "నేను" అనే అహం నుంచి విడుదల పొందలేకపోయాడు. బుద్ధుని నిర్వాణం గురించి బాధపడుతున్న వ్యక్తితో బుద్ధుడు "నేను దేహాన్ని విడిచి పెడుతున్నానని బాధపడకు. నేను పొందిన స్థితికి రావటానికి ప్రయత్నం చెయ్యి" అన్నారు. మన గమ్యం మరిచిపోకూడదు.

15. మేథావి ఎప్పడూ నిర్మలంగా ఉంటాడు. ప్రతీ దానికీ ఉద్రేకపడే వ్యక్తి జీవితంలో ఏమీ సాధించలేడు. మన హృదయంలోనే శాంతి ఉంది, సుఖం ఉంది. కాని అనుభవించలేకపోతున్నాము. కారణం అభ్యాసం లేకపోవటమే. భోగ ప్రవృత్తిని తొలగించుకోకపోతే, నీవు ఆత్మ సుఖాన్ని పొందలేవు. "నేను-నాది" అనే రెండు తలకాయలు లేనివాడు శాంతిని పొందుతాడు. ఒక భక్తుడు భగవాన్‌ని విరూపాక్ష గుహలో ఉండగా ఇలా అన్నాడు "నిన్ను చూస్తే జాలేస్తున్నది. నీ గోచీ, నీ గృహం మొదలగు విషయాల గురించి, నన్ను నీవు బాగుచెయ్యలేక పోతున్నావు కాని నేను నిన్ను విడిచిపెట్టను. గురువుగా ఎన్ని జన్మలకైనా నీవే ఉండి నన్ను ఉ ద్ధరించాలి. ఇది నా అభిలాష". అది ఎన్నో జన్మల పుణ్యఫలం ఆ అభిలాష. దేహబుద్ధి ఉన్నంతకాలం లోకం, మనస్సు, దేవుడూ, విడిచిపెట్టవు. కోట్లాది జన్మల నుంచి పోగుచేసుకొన్న వాసనలు, భగవంతుని ప్రేమిస్తే నశిస్తాయి. భగవంతుని ప్రేమించు, ఎల్లప్పడూ ప్రేమించు. ఈశ్వరునిపై "ప్రేమ" పెంచుకొంటే మన రాగ-ద్వేషాలను, గడపదాటినట్లు దాటగలము. సాహిత్యం, కవితాధోరణి ఒక లగ్జరీయే, దాని వలన ప్రయోజనం, గౌరవాలు, భోజనాలు బాగా సాగుతాయి. సమాధికి అది కూడా ఆటంకమే. జ్ఞానికి బంధువులు లేరు, మిత్రులు లేరు. సామాన్య మానవులకు పది ఇంద్రియాలే శత్రువులు. స్వాధీనం చేసుకొన్న వానికి ఆ ఇంద్రియాలే మిత్రులు. ఎవరైతే ఆత్మను తెలుసుకోవటానికి పురుష ప్రయత్నం చెయ్యటం లేదో వారు బ్రతికి ఉన్నా మరణించిన వానితో సమానం. విశ్లేషణ కావాలి భోగ దృష్టి ఎక్కువ కలుగుతూ ఉంటే కారణం దేహ భావన. కొందరు

srinannagaru.com

కోరికతో మంచి పని చేస్తారు. కాని వాళ్ల కోరిక ఇంకామంచి లోకాలు, మంచి జన్మలు రావాలని. "సత్యం" ధ్యాసే ఉండదు. అదే మాయ.

16. ఎన్ని నదులు పొంగి సముద్రంలో కలిసినా సముద్రం ఎలా స్థిరత్వంగా ఉంటుందో అలాగే నీవు అతిగా ప్రేమించిన భార్య, పుత్రాదులు, గతించినా నీ హృదయంలో నీ మనస్సులయమైతే నీకు ఎలాంటి దుఃఖం రాదు. నీ భార్యను కూడా నీవు ఆత్మ దృష్టితో చూచిన నాడు, ఈ ఆత్మానుభవం లేకపోతే ఎంత తత్త్వశాస్త్రం చదువుకొన్నా, సామాజికంగా ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిం చినా సహజంగా దగ్గర వాళ్ళు పోయినప్పుడు దుఃఖం వస్తుంది. గాఢ నిద్రలో సుఖం జాగ్రదవస్థలో మనకు అందటం లేదు, అంటే కారణం దేహాభిమానమే. దృశ్యం ప్రతీదీ అదృశ్యం అవ్వవలసిందే. ఆత్మ ఒక్కటే దృశ్యం కానిది. ఎంత వారికైన రూపం కనిపిస్తే సుఖం, కనిపించకపోతే దుఃఖం. తల్లి గర్భంలో జీవుడు ఎందుకు ప్రవేశిస్తాడు అంటే కేవలం దేహం కొరకే. దేశ కాలాలకు బంధింపబడేదే దేహం. ప్రాణ ధర్మం-కాఫీ తాగటం, భోజనం చెయ్యటం, అది దేహధర్మం కాదు. అదే దాని ధర్మమైతే శవం కూడా కాఫీ, భోజనం చెయ్యాలి. శరణాగతి పొందిన వానికి బాధ ఉండదు. తల్లి గర్భం నుంచి ఆడ, మగ అని నిర్ధారణ అయినప్పుడు దాన్ని అనుసరించి ఒక పేరు పెడతారు. వ్యవహారం కోసం, ఆ పేరు పట్టుకొని, జీవితం పొడుగునా కలసిపోయి జీవిస్తున్నాడు. మన శరీరమే మనకు శత్రువు. నీ దేహం మీద నీకు ఎంత ప్రీతి ఉందో అంత ప్రేమ భగవంతుని మీద ఉంటే నీవు మోక్షాన్ని పొందుతావు. దేహం మీద ప్రేమ వలన మరణించేడప్పుడు దుఃఖం కలుగుతుంది. అహంకార మరణంలోనే ఎక్కువ సుఖం ఉంది. రూపం "నేను" అని చెప్పే ఆ "నేను"ను తెలుసుకొంటే భగవంతుని తెలుసుకోవటానికి కావలసినంత అవకాశం ఉంది అన్నారు భగవాన్.

17. మిధ్యాభావం వలననే ఉన్న దాన్ని లేనట్లుగాను, లేనిదాన్ని ఉన్నట్లు గాను తెల్పుతుంది. అందుచేతనే భగవంతుని పేరు "మాయ" అన్నారు. సంతానం పైనా, మనుమల పైనా, భార్య పైన లేని ప్రేమను ఉన్నట్లు అలాగే ఉన్న ప్రేమను (భగవంతుని) ప్రేమించకుండా ఉంచుతుంది. ఈ మాయ భగవంతుని ఏమీ చెయ్యలేదు, పరమహంసగారు అన్నట్లు పాము కోరలో ఉన్న విషం పామును ఏమీ చెయ్యనట్లే ఒక్క బ్రహ్మమును పొందిన వానికి మాత్రమే కోరిక రాదు. గత జన్మలలోని మంచి వాసనలను బట్టి, పవిత్రతను సంతరించుకొని అహంకారం నుండి విడుదల పొందుతాము. ఈ సృష్టి ఉందా? పునర్జన్మ ఉందా? అనే సందేహాలు "శ్రద్ధ" తగ్గటం వలన వస్తాయి. ఆత్మాన్వేషణలో మీరు ఉంటే మీకు

srinannagaru.com

ఉన్న ఇరుకు భావాలు, దుంగలు అన్నీ అందులో కొట్టుకొనిపోతాయి. నీకు సందేహం వస్తే శాస్త్రాన్ని ప్రమాణంగా చూచుకో అని చెప్పాడు కృష్ణుడు. ఆత్మనుంచే అనుగ్రహం రావాలి. మనస్సు నుంచి చేసే ప్రయత్నం వలన పొగరుబోతు తనం పెరుగుతుంది. మనస్సు బహిర్ముఖం కావడానికి నీలోని వాసనలే కారణం. వైరాగ్యం లేకపోతే వాసనలు తగ్గవు. కోరికను సంతృప్తి పరిస్తే అది మరో పది కోరికలను కోరుతుంది. జ్వరం వస్తే దానికి సంబంధించిన రోగాలు, ఆకలి మందగించటం, వాంతులు, కళ్ళు తిరగటం అనేకమైన పైత్యాలు వస్తూ ఉంటాయి. అలాగే వైరాగ్యం లేకపోతే మనలోని వాసనలు అన్నీ మనలను విషయ చక్రంలోనికి ముంచుతూ ఉంటాయి. భగవాన్, భగవంతుడు పంపగా వచ్చాడు. మనం కామం వలన వచ్చాము. నీవు తీసుకొనే ఆహారంలోనూ, మాటలోనూ, నిద్రలోనూ అతిగా ప్రవర్తిస్తూ ఉంటే నీ అహంకారాన్ని చంపే పురుష ప్రయత్నం చల్లారిపోతుంది.

18. ఏకాంత భక్తి అలవాటు చేసుకొంటే మనలో ఉన్న వాసనలు అన్ని హరించుకొని పోతాయి. అంటే నేను భగవాన్ భక్తుడను అయితే అందరిలోనూ భగవాన్‌ని చూడగలగాలి. దాని వలన మనస్సు బహిర్ముఖం కాదు. బ్రహ్మమే ప్రపంచంగా కనిపిస్తున్నది. నగలన్నీ బంగారు, లోహంలాగే, నామరూపాలు అన్నీ మాయ అని గ్రహిస్తే బయట పడతాము. అప్పుడు మనం లక్షమందిలో కూర్చున్నా నీకు ఏమీ అనిపించదు. అన్ని శాస్త్రాలు అచలంగా ఉండు, నెమ్మదిగా ఉండు అంటున్నాయి. అరుణాచలం, "అచలం" ఆ అచలాన్ని జపించగా, జపించగా మనలోని చాపల్యం పోతుంది. అహంకారం అనేది పుండు, దాని వలన ఈగలు ముసురుతాయి, చీము నెత్తురు కారటం వలన జ్వరం మొదలుగా గల అనేక వికారాలు వచ్చి శరీరం పాడౌతుంది. గౌరవం కూడా దురదే. అహంకారానికి పొగరు బోతుతనం, గర్వం కావాలి, లోకం కావాలి. అహంకారం తగ్గితే అన్నీ తగ్గుతాయి. ఎక్కువ మాటల వలనే అహంకారం పెరుగుతుంది. నీ కుటుంబ సంక్షేమం గురించి నీ స్వేచ్ఛను విడిచిపెట్టు, నీ గ్రామ సంక్షేమం గురించి, నీ కుటుంబ స్వేచ్ఛను, నీ రాష్ట్ర సంక్షేమం గురించి నీ గ్రామాన్ని నీ దేశ సంక్షేమాన్ని గురించి నీ రాష్ట్ర సంక్షేమాన్ని విడిచిపెట్టు అలాగే ప్రపంచ సంక్షేమం గురించి నీ దేశ సంక్షేమాన్ని విడిచిపెట్టు, నీ ఆత్మ సుఖం గురించి ఈ ప్రపంచ సంక్షేమాన్ని వదులుదాన్ని సాధించాలి లేదా మరణించాలి. మాయ ఎలా ప్రవేశించింది ఎప్పుడు పుట్టింది అనుకోవటం కన్న మాయను పోగొట్టే సద్గురువును ఆశ్రయించు. పాము కాటు కాలుమీద ఎక్కడ కుట్టింది అనే తర్కం కన్న వైద్యుని వద్దకు వెళ్ళి బాగు చేయించుకొంటే సుఖపడతావు. "పరిత్యాగం" అంటే అహంకారాన్ని విడిచిపెట్టటం.

srinannagaru.com

19. "ఆత్మస్మరణ" వలన ఆత్మ స్ఫురణ కలుగుతుంది. జ్ఞానికి, అజ్ఞానికి పుస్తకాలతో పనిలేదు, జిజ్ఞాసువుకే పుస్తకంతో పని. మనం చనిపోవటం అంటే, అబద్ధం, అబద్ధం. ఎందుచేతనంటే, తిరిగి జన్మించి తీరుతాము. భగవాన్ వద్దకు ఒకరు వచ్చి ఇలా అన్నారు "మా బంధువులలో ఒకరు చనిపోయారు అందుకే దుఃఖంగా ఉంది" దానిపై భగవాన్ "నీవు చావలేదని ఏడవటం లేదు. అంటే చచ్చిపోయారు అని ఏడ్చే ఆ "నేను"ను చంపు ఏ ఏడుపు ఉండదు" అన్నారు. మూడు-మూడు అంటే (ప్రకృతి, పురుషుడు, ఈశ్వరుడు) అనుకొనే వారు "మాయ"లో ఉన్నట్లే. ఒకటి-ఒకటి అంటే (ఆత్మ ఒక్కటే సత్యం) అనుకొనే వారు "మాయ"నుండి బయట పడతారు. భగవాన్ వద్దకు, ధనవంతులు, సౌందర్య వంతులు గాయకులు వచ్చినా ఎవ్వరూ ఆకర్షించలేక పోయారు. అక్కడ నిగ్రహించుకోవటం అనే ప్రశ్న లేదు. అంతా పేలవంగా కనిపిస్తూ ఉంటుంది, కారణం నిజం ఒక్కటే ఉందని తెలిపోవటం వలన మీకు ఏ ఆధారం అయితే మీరు ప్రీతిగా ఎంజాయ్ చేస్తున్నారో ఆ ఆధారాన్నే భగవంతుడు దూరం చేస్తాడు. ఎందుకంటే మీకు ఆత్మానుభవం కలుగజేయటానికి "మనో నిగ్రహం ఉన్న వాడికి "మడి"తో పని ఏముంది" అన్నారు త్యాగరాజు. ప్రపంచం అంతా దుమ్ములా కనిపించే వాడికి మనస్సు అంతర్ముఖం అవుతుంది. ప్రపంచంలోని విషయాలు ఆశ్చర్యంగా, ఆహ్లాదంగా కనిపిస్తే అంతర్ముఖం అవ్వదు. ఓట్లుతో జయించిన వాడు మహాత్ముడు కాడు, హృదయాలను జయించిన వాడు మహాత్ముడు అవుతాడు. ఎవరైతే హృదయంలో ఉంటారో వారి శరీరం పోయినా వారు ఎప్పుడూ మనలోనే ఉంటారు.

20. ఎవరి చేతిలో రాగ-ద్వేషాలు చచ్చిపోతాయో వారికి శాంతి కలుగుతుంది. తొందరగా ఉద్రేకపడితే ఆలోచన తగ్గిపోతుంది ప్రశాంతంగా ఉండే వాడికి ఆలోచనా శక్తి పెరుగుతుంది. "దేహమే నేను" అనే తలంపు నిజమైతే గాఢ నిద్రలో కూడా ఉండాలి. ఇది ఖచ్చితంగా సైన్సు నిజమైన "నేను"కు తలంపే లేదు. అబద్ధమైన "నేను"కే తలంపులు. పునర్జన్మను తీసుకొని వచ్చే తలంపులు, బంధాలను నిర్లక్ష్యం చేస్తే తిరిగి జన్మ వస్తుంది. ఇతరుల మీద మీకు అసూయ కలిగింది అనుకోండి. దానికి కారణం, భయం లోభిత్వం వలన కూడా మనస్సు అంతర్ముఖం కాదు. మీ భావాలు వికృతరూపంలోకి వెళ్లిపోతాయి. ఎదుటివారి దుఃఖానికి మనం కారణం కాకూడదు. అలా జరిగితే తిరోగమనమే గాని, పురోగమనం కాదు. ప్రకృతిలో అశాంతి ఉంది. ఆత్మలో శాంతి ఉంది మనో మూలం లోనే ఆత్మ ఉంది కారు ముందుకు నడపటం కన్న వెనుకకు నడపటం కష్టం

srinannagaru.com

మనస్సును మూలంలోకి వెనుకకు పంపటం కష్టం. ఆనందం ప్రతీ వారిలోనూ ఉంది అది సత్ ప్రవర్తన ఉన్న వానికి అందుతుంది. మనం ఎవరింటికైనా వెళితే అక్కడ కుక్కలు ఉంటే అవి మనపై పడి, కరవటానికి, చంపటానికి ప్రయత్నం చేస్తాయి కాని ఇంటి యజమాని ఆ కుక్కను పేరుపెట్టి పిలిచి "ఏ" అని కళ్ళు ఎఱ్ఱచేస్తే చాలు తోకముడిచి తన స్థానంలో కదలకుండా కూర్చుంటుంది. అలాగే భగవంతుని అధీనంలో "మాయ" ఉంది. వారి పాదాలను శరణు వేడిన వానికి మాయ మనపై విరుచుకొని పడకుండా వెనుకకు పిలుచుకొని మనపై రాకుండా చేస్తాడు. సద్వస్తువును మానేసి బాహ్యమైన వస్తువుల మీద, పదార్థాల మీద ఆధారపడినంత కాలం భవిష్యత్ జీవితం అంతా అంధకారమైపోతుంది.

21. మంచివాళ్ళు అని, చెడ్డవాళ్ళు అని విభజన ఎందుకు కలుగుతోంది అంటే వ్యామోహం వల్లనే. మనం చూచే అందరిలోనూ బ్రహ్మ పదార్థాన్ని గ్రహించ లేకపోవటం వల్లనే. చంటి పిల్లలకు పంచదారతో చేసే చిలకలు, ఏనుగులు, పాములు ఇస్తే పాములను దూరం చేసి మిగిలిన వాటిలో ఏది ఇష్టమైతే దాన్ని తీసుకొంటారు. నిజానికి అన్నీ పంచదారతో చేసినవే. అంతా తీపే కాని రూపానికి ప్రాముఖ్యం ఇయ్యటం అజ్ఞానం వలన వాడి ఇంట్లో పెళ్ళికి వెళ్ళాలంటే, మన ఇంట్లో పెళ్ళికి వాడు వచ్చాడా? భవిష్యత్తులో మన ఇంట్లో జరిగే పెళ్ళికి వాడు వస్తాడా? అని ఆశించటం కూలివాళ్ళతో సమానం. "ప్రేమతో వెళ్ళు అంతే" కుళ్ళిపోయిన మనుషులను చూడటం కన్న దగ్గరలో సముద్రం ఉంటే చూడు లేదా ఆకాశాన్ని చూడు. నీ హృదయం విశాలమౌతుంది. వీడి పతనానికి వాడు కారణం, వాడి పతనానికి వీడు కారణం అనే మాట వలన ప్రయోజనం శూన్యం. మీరు ఎవ్వరినీ ప్రేమించలేరు. మిమ్ములను అందరూ ప్రేమించాలి అనుకోవటం "వెఱ్ఱి". వాసనల గురించి మీకు తెలియటం లేదు. విత్తనంగా ఉన్నప్పుడు అందులోనే కాండం రొమ్మలు, ఆకులు ఉన్నాయి. భూమిలో పదును వచ్చినప్పుడు పాతి పెట్టగా అప్పుడు అన్ని పుట్టుకొస్తాయి. అలాగే వాసనలు మనలో ఉన్నా సంస్కారాలు బయటికి వచ్చినప్పుడు వ్యక్తమౌతాయి. పనికి జ్ఞానం విరోధం కాదు. ఇల్లు వదిలితే జ్ఞానం రాదు. ఎవరైనా మిమ్ములను ఒక మాట అంటే మీరు నిర్మలంగా మౌనంగా ఉంటే అది ఆత్మానుభవానికి ఎక్కువ సహకరిస్తుంది.

22. మీ మనస్సు అంతర్ముఖం కావటానికి బాధ ఉపయోగపడుతుంది. ఇవి కూడా పునాది రాళ్ళలా ఉపయోగపడతాయి. నిన్ను కష్టపెట్టాలని ఇబ్బంది పెట్టాలని కాదు. భగవంతుడి దృష్టి. నిజం ఏమిటి అంటే "కష్టం అంటే ఏమీ తెలియని వానికి నిజమైన ఆనందం అనుభవానికి రాదు. వడ్డించిన విస్తరిలా

srinannagaru.com

ఉండే జీవికి, కష్టం అంటే ఏమిటో తెలియని వానికి ఆత్మలోని సౌందర్యం ఎలా ఉంటుందో తెలియదు. మీకు సంభవించే కష్టాలను మీరు ఓర్చుకొంటే మీ కన్నీళ్ళు ఆనంద భాష్పాలుగా మారిపోతాయి. నీ కష్టాలు ఆనందంగా మారిపోయే రోజు కోసం ఎదురుచూస్తున్నాడు ఈశ్వరుడు. నీవు ఈ ప్రపంచాన్ని ఇంతకన్న అందంగా చెయ్యాలని నీకు ఉంటే ముందు నీవు వైరాగ్యం పొందితే అది సాధ్యమౌతుంది. వైరాగ్యం కూడా సంపదే, నీవు స్వార్థంగా పనిచేస్తే ప్రపంచాన్ని మార్చలేవు. బుద్ధుడు, తన భార్యను, సంపదను, కుమారుని, రాజ్యాన్ని వదలి, ఈ సృష్టిని ప్రేమించాడు. అంతేకాదు తన రాజ్యానికి తన వారసుని కూడా ఉండ కుండా చేసాడు. అంటే ఆయనలోని అఖండ వైరాగ్యమే కారణం. నీ అహంకారం యొక్క వేగం హెచ్చేకొలది భగవాన్ నీ విషయంలో కలుగజేసుకోరు. నీవు నిర్మలంగా, నిరహంకారంగా ఉంటే, నీ జీవిత సమస్యలలో తప్పకుండా కలుగ జేసుకొని నిన్ను కాపాడుతాడు, నీకు ఆత్మానుభవం కలుగుతంది. ప్రాపంచిక వ్యవహారాలలో అతిగా ఉంటే, నీ సాధన కుంటుపడుతుంది. నీ అహంకారం చిక్కబడుతుంది. మీ కుటుంబం అభివృద్ధిలోకి రావాలంటే మీరు శాంతంగా ఉండాలి.

23. దేహబుద్ధి గలవాడు, ఆత్మ బుద్ధిగా జీవించలేడు. ఆత్మబుద్ధి గలవాడు దేహబుద్ధితో జీవించలేడు. మెటా ఫిజిక్స్ పై నుంచి క్రిందికి దిగుతుంది. ఫిజిక్స్ క్రింద నుంచి పైకి వెళుతుంది. ఈ రెంటి కలయికే ఆత్మానుభవము. నీ దుఃఖానికి నీవు ప్రకృతి మీద, సమాజంలో వ్యక్తుల మీద నీవు నెపం వెయ్యకు. నీ మనస్సు లోని బలహీనతలను గుర్తించుకో. గౌతమ బుద్ధుడు ఆరు సంవత్సరాలు తపస్సు చేసిన తరువాత "దొరికాడు దొంగ" అన్నారు. నిర్వాణ స్థితికి అడ్డువస్తున్న వారు ఎవరో తెలుసుకో. మన సుఖాన్ని మనం ప్రేమిస్తున్నాము. మనలను సుఖపెట్టే వారిని ప్రేమిస్తున్నాము. అలాగే దేవుణ్ణి ప్రేమిస్తున్నాము. మన సుఖానికి ఎవరు వ్యతిరేకించినా, వాళ్ళను ద్వేషిస్తున్నాము. రాగ-ద్వేషాలు అనేవి జంట శత్రువులు. ఇవి మనలో ఉన్న శత్రువులు, మనలో ఉన్న శత్రువులను వదలి బయట శత్రువులను ద్వేషిస్తున్నాము. మనస్సుతోనూ, ఇంద్రియాలతోనూ గ్రహించేవి అన్నీ దృశ్యాలే. మనం అద్దంలో చూచే ముఖం నిజమైనది కాదు. అది ప్రతిబింబమే. మనం ఎంత నిర్మలంగా ఉంటే అంత భగవంతుని సహాయం అందుతుంది. కష్టాల వలన వివేకం రాదు. వివేకం వలన వచ్చే వైరాగ్యమే నిలబడుతుంది. మనం పొందే ఆనందం నిజం కాదు. ఏ శాంతి అయితే అంతం లేదో అదే నిజమైన ఆత్మ సుఖం. దాన్ని పొందినవారు దేహం పోతున్నా, పట్టించుకోరు. కారణం దేహం

srinannagaru.com

కూడా దృశ్యమే అని నిర్ణయించుకోవటం వలన మానవునికి దుఃఖం-మమకారం తగ్గించుకోవటం వలన పోతుంది. మన దృష్టి పని మీద ఉండాలి ఫలితంపై ఉండకూడదు, ఉంటే దుఃఖం రావటం జరుగుతుంది. గౌరవం కోసం ఏ పని చేసినా అది మిమ్ములను బంధిస్తుంది.

24. నీ మనస్సును పవిత్రం చేసుకో. బట్టకు జుట్టుకు ఇచ్చే విలువను కూడా మీ మనస్సుకు ఇయ్యలేరా! మరణానంతరం వచ్చే మనస్సును బాగు చేసుకోండి. దూడను వదిలితే దాని తల్లి దగ్గరకు అది ఎలా వెళుతుందో అలాగే నీ కర్మలు ఎన్ని జన్మలు ఎత్తినా నీ దగ్గరకు వచ్చి తీరుతాయి. మనం మన మమకారాలను తగ్గించుకోకపోతే భవిష్యత్తులో బంధాలుగా తయ్యారు అవుతాయి. మీరు ఎంత సేపూ జాతకాల గొడవలలో ఉండిపోతే ఆగ్రహం వచ్చేస్తుంది, అశాంతి వచ్చేస్తుంది, ఈ గ్రహం వలన ఈ శాంతి వచ్చేస్తుంది అని హైరానాయే గాని అసలు ఈ అలజడులు, అశాంతి, ఈ సంతోషం ఎవరికి కలుగుతోంది? అజ్ఞానికి, అంటే మనస్సుకు. అదిలేకపోతే అన్నీ పోతాయి. కష్టాలను, సుఖాలను నిండు కుండలా భరించాలి. మన మనస్సును భోగాల వైపు వెళ్ళకుండా చూచుకోవాలి పూర్వజన్మలో మంచిని ప్రేమించి, ఆచరించి ఉంటేనే ఆత్మసాధనలో ఉండగలం. లేకపోతే రంపం పెట్టికోసినా ఆ మార్గంలో ఉండలేడు. ఆధ్యాత్మిక అభివృద్ధి చెందిన వారితో స్నేహం చెయ్యాలి. డబ్బు ఉన్నవారితో స్నేహం చేస్తే ఆ భోగాలవైపే మనస్సు పోయి, మనమే పతనమౌతాము. కులమని, మతమని, ప్రాంతమని వరిగి పోతున్నాము. కుంచుకొని పోతున్నాము. అందుచేతనే దుఃఖం వస్తున్నది. రూప నామాలను పట్టుకొని అహంకారం పెరిగిపోతున్నది. కోపం తెచ్చుకోవటం వలన సహజత్వం పోతున్నది. ఫలితం పట్ల స్పృహ లేకుండా ఉంటే కర్మ కూడా చుట్టుకోదు. ఇష్టం, అయిష్టం పెట్టుకోకండి. ఎవరిని చూచినా, రోత పెట్టుకోకండి. ఆధ్యాత్మికం గా పరమ స్థితికి వెళ్ళాలి అంటే మీ మనస్సును ప్రశాంతంగా ఉంచుకోండి.

25. ఉన్న వస్తువును ఉన్నట్లు చెబితే ఈ లోకంలో వినేవాడే కనిపించడు. ఎంతసేపు పురాణాలు, మహిమల గురించే ఉబలాటం పడతారు. అవి అన్నీ ఒక్క క్షణం మెరుపులా మెరిసేవి మాత్రమే. నిరంతరం భవిష్యత్తును గురించి ఆలోచించే వాడు కాలాన్ని పాడుచేసుకొన్నట్లే. ప్రతీ మానవునికీ దేహం ఒక పనిష్మెంట్. గర్వం, విచారం, దేహాత్మ బుద్ధి ఉన్నవానికే. ఈ దేహానికి గతంలో చేసుకొన్న పాప పుణ్యాలను చూచి తదనుగుణమైన దేహంలో ఉంచుతాడు. తద్వారా అది సంక్రమిస్తుంది, దాన్ని చూచి మురిసిపోవటం, కుంగిపోవటం అలవాటు పడిపోయాము. జైలులో ఉండటం అలవాటుపడ్డ దొంగను "తరచు

srinannagaru.com

దొంగతనాలు చేసి జైలుకు రావటం ఏమిటి?" అని అధికారులు అడిగితే "నాకు జైలు జీవితమే సుఖంగా ఉన్నట్లు ఉంది" అన్నాడట. అలాగే మనకు శరీర యాత్రే సుఖమని అనుకొంటున్నాము. శరీరమే ఒక శిక్ష అని తెలుసుకోలేకపోతున్నారు. దేహమే నేను అనే భావనే పాపాలను తీసుకొని వస్తుంది. ఆలోచించటమే నీ స్వభావం అనుకొంటున్నావు. అది నీవు కావని ఎప్పడు తెలుస్తుంది? ఏ గురువో దాన్ని తొలగించాలి, నీవలన అది కాదు. ప్రాపంచిక సంఘటనలు జ్ఞానిని ప్రభావితం చెయ్యలేవు. టార్చిలైటు తాడును తాడుగా చూపుతుంది కాని పాముగా కాదు. అలాగే విచారణ అనే లైటు ద్వారా నీవు అసత్యాన్ని తెలుసుకోగలవు. అప్పడు నిజమైన "నేను" తెలుసుకోగల్గుతావు. భగవంతుని స్వరూపం నీకు తెలియనంత కాలం నిన్ను దుఃఖం వెంటాడుతుంది. బాధలు, భయాలు, కోపాలు, తాపాలు తప్పవు.

26. జీవితం అంటే యాక్షన్, రియాక్షన్ తప్ప సామాన్య మానవులు చేసే పని అంతకన్న ఏమీ లేదు. అంటే అపకారానికి, అపకారం చెయ్యటం. మానవుడు అసహజ స్థితిలో ఉన్నంతకాలం సాధన చేస్తూనే ఉంటాడు. బ్రహ్మానుభవం పొందిన తరువాత సాధన చేసేవాడే ఉండడు. "నాలుకను జయించిన వాడే వీరుడు" అని భాగవతం అంటోంది. అంటే ఎంతవరకూ మాట్లాడాలో అంత వరకూ మాట్లాడాలి. అలాగే ఆహారం విషయంలో కూడా అని అర్థం. ఒక దుష్టుని మనం ప్రేమించాము అనుకోండి, ఆయన మనలను ద్వేషిస్తూనే ఉంటాడు అనుకోండి, అలా ద్వేషిస్తూ ఉన్నాడని వాళ్లను ప్రేమించటం మానకూడదు. వాళ్ళు అలా చేస్తున్నారంటే వాళ్ళలో ద్వేషబుద్ధి ఎక్కువగా ఉందని భావించాలి. పని మనలను బంధించదు. ఆసక్తే మనలను బంధిస్తుంది. తత్త్వం తెలిసే వరకూ కామ-క్రోధాలు లొక్కుపోతాయి. మానవుడిలో అవి అంకురిస్తే చాలు లొక్కొనిపోతాయి. ఎలా అంటే వేగంగా వెళ్ళే రైలుబండి పట్టాలకు దగ్గరగా మనం ఉంటే ఆ గాలికి మనం అందులోకి లాగి వేయబడతాము. మీ మనస్సుకు అతీతమైన శక్తి ఒకటి ఉంది అనే విషయం మీ మనస్సు గుర్తించక పోతే మీ మనస్సు నశించదు. "భార్య వలన భర్త, భర్త వలన భార్య మోసగించ బడతారు" అని ఒక ఉపనిషత్తు చెప్పింది. అంటే ఆత్మను తెలుసుకోవటానికి భార్య వలన భర్తకు, భర్త వలన భార్యకు అడ్డు అని. ఇది అంతరార్థం కోసం చెప్పిన మాట. ఉద్రేకంలో అన్నది కాదు. ఇది నిజం. అది శాంతిలోంచి వచ్చిన మాట. కాలప్రవాహంలో ఆ మాట నిలబడుతుంది. కలకాలం ఉంటుంది. అది హృదయసారం.

srinannagaru.com

27. సహనం ఉన్న వాడు సహజంగా ఉంటాడు. ఉద్రేకం ఉన్నవాడు అసహజంగా ఉంటాడు. తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం దేవుని చుట్టాలం కాదు. లోకానికి చుట్టాలం. ఈ లోకం ఒక పిచ్చిది. అందుచేతనే వాసుదేవ స్వామి దీనికి "దుఃఖాలయం" అని పేరు పెట్టాడు. ఈ లోకం చుట్టాల వలన పిచ్చి పుడుతుంది. మనం దేవునికి దూరంగా ఉన్నాము. కానీ దగ్గరగా ఉ న్నాము అని అనుకొంటున్నాము. దృక్కు వేరు, దృశ్యం వేరు. దాన్ని కలగాపులగం చెయ్యకండి. దృశ్యం ఎప్పటికైనా అదృశ్యమయ్యేదే. శరీరం ఉన్నవానికి యవ్వనం, ముసలితనం. శరీరమాత్రుణ్ణి కాను అనుకొనే వాడికి యవ్వనం. ఏమిటి ముసలితనం ఏమిటి? ఒక మనిషి దుర్మార్గుడు అనుకోండి వాడితో సహవాసం చెయ్యకండి. కాని వాడిని ద్వేషించకండి. మన ఇంట్లో గాని, మన ఊరిలో గాని ఎవరైనా మరణిస్తే బాధపడకండి. అది దేవుని సంకల్పమని భావించండి. చిల్లు పడవలో ప్రయాణం చేస్తే అందరితోనూ మనం మునిగిపోతాము. దుష్ట సహవాసం గలవారితో సావాసం చేస్తే మన గతి అధోగతే. సత్‌పురుషులతో సహవాసం చేస్తే ఈ కర్మ సముద్రాన్ని తేలికగా దాటగలము. మనిషి కేవలం తలంపుల వలనే బంధింపబడుతున్నాడు. ఆ తలంపు లేకపోతే కోరికాలేదు, దుఃఖమూ లేదు. సర్వ అనర్థాలకు దేహబుద్ధే కారణం. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలి సాధన చెయ్యాలి. ప్రారబ్ధంలో జరుగవలసినది ఉంటే నీవు తలంచక పోయినా జరుగుతుంది. జరుగరానిది నీ ప్రారబ్ధంలో ఉంటే తలంచినా జరుగదు.

28. కొంతమందికి మనం తక్కువ వాళ్లమనే భావనతో ఇతరులతో మాట్లాడటానికి జంకుతారు. అజ్ఞానానికి కారణమైనది తెగిపోవాలి. అప్పటి వరకూ స్వచ్ఛంగా ఉండలేము. ఏ వస్తువునైనా అనుభవించేడప్పుడు (అంటే ఆస్తి సంబంధించిన లాభాలు, సౌకర్యాలు) ఏమీ చెయ్యదు. అది నాది అనుకొన్నప్పుడే పీక పట్టుకొంటుంది. భగవాన్‌ని ఒకరు ఇలా ప్రశ్నించారు "పురాణాల్లో తపస్సు చేసి, దర్శనం చేసుకొని వరాలు పొందారు అని ఉంది ప్రారబ్దం తప్పించు కొంటున్నాడు" అనగా భగవాన్ అన్నారు "వాడి ప్రారబ్దంలో అది తొలగే ఫలితం ఉండటం వలననే అలా కోరుకొన్నాడు. భగవంతుడు తనకు ఆ బాధ తొలిగే పరిస్థితి గ్రహించి "అలాగే" అంటాడు. అంతే, నీలో యోగ్యత ఉంటేనే, ఎవరైనా సహాయం చేస్తారు. బుద్ధునికి జ్ఞానం పొందాలనే కాంక్ష పుట్టిన తరువాత కూడా చాలా జన్మలు పట్టినవి. మీకు అందమైన భార్య, సంపదలు, అదృష్టాలు అన్నీ కలుగుతున్నా మీకు శాంతి లేకపోతే ఏమిటి ప్రయోజనం. మీకు శాంత చిత్తం లేకపోతే బలహీనతలతోనూ, పాపాలతోనూ ఎలా పోరాడగలుగుతారు. శాంత

srinannagaru.com

చిత్తం బ్రహ్మం కాదు, కాని అది బ్రహ్మానుభవానికి సహకరిస్తుంది. దేహబుద్ధి ఉన్నంత కాలం నీ నీడ నీవెంట వచ్చినట్లు దుఃఖం వస్తుంది. ప్రస్తుతం మీకు ఏ దుఃఖం లేదు అనుకోండి ఇక మనకు రాదు అనుకోకండి అది వాయిదా పడుతుంది అంతే మనస్సు అణగినప్పుడు శాంతి లభించవచ్చు. అది శాశ్వతం కాదు. బాగా పండ్లు కాసిన చెట్లునే రాళ్ళతో కొడతారు. అలాగే మంచి గుణాలు ఉన్నవారికే ఎక్కువగా విమర్శలను, బాధలను పామరజనులు కల్పిస్తారు.

29. దుఃఖం కూడా తలంపే, అది అసత్యం. మరలా ఆ అసత్యాన్ని గురించి ఆలోచించటం వ్యర్థం. ఎవరైనా మిమ్ములను విమర్శిస్తూ ఉంటే మీరు ఓర్చుకొంటే ఆ ద్వేషాన్ని పరమేశ్వరుడు ఆ పాపాన్ని అన్నవానికి బదలీచేస్తాడు. నీ కష్ట సుఖాల పట్ల, రాగద్వేషాల పట్ల నీకు స్పృహ లేకపోతే ఇక నిగ్రహించటానికి ఏముంది. మనం పనిచెయ్యాలి, ప్రతీకారం కోసం పనిచెయ్యకూడదు. కర్మ ఫలితాన్ని ఎవరైతే ఆశిస్తారో వారికి తప్పనిసరిగా జన్మ వచ్చి తీరుతుంది. ఇది కొండ గుర్తు. త్యాగం లేని వానికి మోక్షం లేదు. తలంపులతో తాదాత్మ్యం చెందకు, సాక్షిగా ఉండు, తలంపులు రాకూడదని అనుకోకు. ఊరక ఉండు. కొందరు "తను చెప్పినట్లు నడుచుకోవాలి" అనే భావంలో ఉంటారు. ఇది కూడా పిచ్చే. మనం తాగుబోతులం కాకపోయినా మన వాసనలు సద్వస్తువు మీద నమ్మకం కలుగ జేయకుండా ఉన్నాయి. తాగుబోతుల బుర్రకు ఏమీ ఎక్కదు. భోజనం చేసినప్పుడు పది నిమిషాలలో కంచంలో ఉన్నది తిని బయటికి రావాలి. పదార్థాలు బాగా ఉన్నాయని కంచం ముందే కూర్చోకూడదు. కారు ఉందికదా అని ఎప్పుడూ కారులోనే ఉండకూడదు. దాని ప్రయోజనం నెరవేరిన తరువాత దాన్ని వదిలేస్తాము అలాగే మనస్సు ఉంది కదా అని ఎప్పుడూ దాన్నే అంటిపెట్టుకొని ఉండకూడదు. హృదయంలోకి వెళ్ళాలి. కొందరికి బయట చెప్పుకోలేని బాధలు ఉంటాయి, కొందరికి దరిద్రం వలన బాధలు ఉంటాయి. కొందరికి అజ్ఞానం వలన వచ్చే దుఃఖం వస్తుంది. చివరిదే ఎక్కువ బాధ పెడుతుంది. "గాధల వలన బాధలు పెరుగుతాయి". ఎంతసేపు పురాణ సంబంధమైనదే కాని "నీవు ఎవరివో నీవు తెలుసుకో" అంటే ఈ మాట ఎంతకాలం వినాలి అంటారు. దేహ బుద్ధిగలవాడు దేహంలో గల దేవుణ్ణి మాత్రమే ఆరాధిస్తాడు.

30. ఎదుటివారు మనలను నొప్పించినా మనం వికారం చెందకుండా ఉంటే మోక్షం మనలను వరిస్తుంది. ప్రతీకారం చేద్దామన్న ఆలోచన వలన రజోగుణం పెరుగుతుంది. "అమాయకుడు" అంటే మాయ ఎలా ఉంటుందో తెలియని వాడు అని అర్థం. సాధనలో మీ అభివృద్ధిని, మీ అంతట మీరు లెక్కలు

srinannagaru.com

వేసుకొన్నది నిజం కాదు. ఈశ్వర నిర్ణయం మాత్రం నిజం. ఎంత దగ్గర బంధువులైనా ప్రాణప్రయాణ సమయంలో వదలి వెళ్ళాలి. ఒంటరిగానే. గాంధీగార్కి ఒక రోజు నిద్ర పట్టటం లేదు కారణం ఏమిటా అని దిన చర్య తెరిచి చూస్తే ఆరోజు ప్రార్థన చెయ్యలేదని తెలుసుకొన్నారు. వెంటనే స్నానం చేసి ప్రార్థన చేసిన తరువాత సుఖ నిద్రపోయారు. మనం కొన్ని మంచి అలవాట్లు చేసుకోవాలి. కోపం రావటానికి కారణం ఈశ్వరుడు, నీ ప్రారబ్ధాన్ని నీ కాళ్ళ వద్ద వదిలేసి నిన్ను కోపంతో ముంచేటట్లు చేస్తాడు. ఉమ్మడి కుటుంబంలో ఉండటం వలన కూడా ఆధ్యాత్మిక శిక్షణే, వారు తలో మొట్టికాయ మొట్టటం వలన మనలో ఏముందో మనకు తెలుస్తుంది. అలవాట్ల వలనే పునర్జన్మ కలుగుతుంది. ఒక మహాత్ముడు ఇలా అన్నారు "జపం, యజ్ఞము వలన పాపము నశిస్తుంది" అంటూ ఆయనే "కాని పాపం జపం చెయ్యనియ్యదు" అన్నారు. పాపానికి ప్రాయశ్చిత్తమే మందు. పనిని విడిచిపెట్టటం కంటే కర్మఫలితాన్ని విడిచిపెట్టటం వలన సమాజం బాగుపడుతుంది. తాను ముక్తి పొందుతాడు. కొందరు మాట్లాడుతూ ఉంటే వినలేము, వ్యక్తిభావనతో తన్ను తాను పొగుడుకొంటూ మాట్లాడుతారు. నిజమైన మంచి వాడికి తాను మంచి వాడననే స్పృహ కూడా ఉండదు.

31. ఒకాయన శరీరం నల్లగా ఉంది అనుకోండి ఆయన రంగు నలుపు కావచ్చును, ఆయన నలుపు కాదు. వారు "తత్త్వమసి" ఇది గుర్తులో ఉంచుకోవాలి. కొందరు ఊరికే కోపంతో ఊగిపోతారు. అది వారి జబ్బు. వాళ్ళలా మనం ఉండాలి అనుకోవటం అంటే ఆ రోగాన్ని నీవు అంటించుకొంటున్నావు అన్నమాట నీవు శాంతంగా ఉంటూ, భగవంతుని మీద ప్రేమ, ఇష్టం పెంచుకొని నీ ఆనందాన్ని నీవు పొంది శాంతిని పొందాలి. కొందరికి క్రూరత్వం, దుర్మార్గం కూడా ఉంటాయి వారు చాలాకాలానికి గాని "తత్త్వం" తెలుసుకోవటానికి సిద్ధంగా ఉండరు. విషయాన్ని అర్థం చేసుకొంటే స్వంతమౌతుంది. విషయాన్ని ఆచరణలో పెట్టినప్పుడే సమస్యగా ఉంటుంది. విషయం స్వంతమైతే సుఖపడతావు. కాని మనస్సుకు సోమరితనం అలవాటై పోయింది. శరీరం మరణించినప్పుడు, శరీరం కాలుతుంది, గుణాలు కాలవు. గుణాలు మనస్సులో ఉన్నాయి. ఒక గదిలోంచి, మరో గదిలోకి మనం వెళితే ఎలా మారమో, ఒక జన్మలోంచి, మరో జన్మలోకి వెళితే సంస్కారాలు మారవు. ప్రకృతిలో మనం "సుఖం" కోసం వెదుకుతాము కాని "శోకం" ఎదురౌతుంది. ప్రతీ జన్మలోనూ మనస్సును అంటిపెట్టుకొన్న ప్రకృతి గుణాలను దులుపుకోవటమే సాధన. హృదయంలో మనస్సును పెడితే మనస్సు కరిగిపోతుంది. సుఖం తెలుస్తుంది. మిమ్మలను ఎవరైనా విమర్శిస్తే పరవాలేదు,

srinannagaru.com

కాని వారు మిమ్ములను ఇలా విమర్శిస్తున్నారు అంటే ప్రమాదంలో పడతారు. విషయం వేరుగాను, ఇంద్రియాలు వేరుగాను ఉంటే ప్రమాదం లేదు. ఇంద్రియాలకు, విషయానికీ సంబంధం ఏర్పడినప్పడే ప్రమాదంలో పడతారు. ఇంద్రియాలు మొదటి ద్వారాలు. వాటి ద్వారా మనస్సులోకి విషయాలు అన్నీ తీసుకొని వెళతాయి.

32. ఎవరి పట్ల అయినా అమర్యాదగా మాట్లాడితే వారు బాధపడవచ్చు. అంతేకాదు మీ అహంకారం పెరుగుతుంది. ఈ విషయం మీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చెబుతున్నాను. అవినయం పనికిరాదు. ఠాగూర్ అన్నారు "తల్లి బిడ్డకు పాలు ఇచ్చేటప్పుడు ఒక స్తనంలో పాలు అయిపోతే బిడ్డ సుఖపడదని గ్రహించి రెండవ స్తనంలోకి మారుస్తుంది. కాని బిడ్డ అనుకొంటాడు నాకు ఇచ్చే పాలను అమ్మ తీసేస్తున్నది అని ఏడుస్తాడు. తిరిగి రెండవ స్తనంలో నుంచి పాలు వచ్చే వరకూ ఏడుస్తూనే ఉంటాడు." అలాగే భగవంతుడు కూడా మనం ముసలివాళ్లమైనప్పడు కీళ్ల నొప్పలతో, చెప్పలేని బాధలతో బాధపడుతూ సతమతమౌతూ ఉంటే, మన శరీరాన్ని భరించలేకపోతున్నప్పడు మరో శరీరంలోకి మారుద్దామని చావు పెడతాడు. కాని అజ్ఞాని ఏమనుకొంటాడు అంటే "శాశ్వతంగా బూడిద అవుతున్నాను, ఈ శరీరమే నేను కదా" అని అనుకొంటూ తిరిగి జన్మ వచ్చే వరకూ ఏడుస్తాడు. ఆత్మబుద్ధి ఎప్పడైతే కలిగిందో అప్పడే దేహ బుద్ధి పోతుంది. మనం "ఆత్మ" కాని దాన్ని తెలుసుకోవాలని, అనుకోక పోవటం ఒక తప్ప, ఆత్మకాని దాన్ని ఆత్మ అనుకోవటం మరో తప్ప. నీ బంధానికీ అశాంతికి కారణం నీవు, కాని శరీరాన్ని నీవు అని నిశ్చయానికి వచ్చావు. "దాని వల్లనే పుట్టాను, పెరిగాను, మరణిస్తున్నాను" అని అనుకొంటున్నావు. మనకు పరమేశ్వరుని మీద ఉండే భక్తి వలన లోకం మీద ఉన్న మోహం తగ్గుతుంది. ఆయనపై మనకు పూర్తి విశ్వాసం కుదిరితే దుఃఖం పూర్తిగా నశిస్తుంది.

33. నీవు అజ్ఞానమనే చీకటిలో నీ మనస్సు అనే దీపంతో బ్రతుకును వెళ్ళబోసుకొంటున్నావు. సూర్యుడు ఉదయించిన తరువాత, దీపంతో పని లేదు. అలాగే నీవు సిద్ధి పొందిన తరువాత మనస్సుతో పనిలేదు. కొందరు అందరినీ ప్రేమిస్తారు కాని వారే ఎవరైనా తమతో ప్రేమగా లేకపోతే వాళ్ళు నన్ను ప్రేమించటం లేదు అనుకొంటారు. కారణం అక్కడ మనస్సు వ్యక్తమౌతున్నది. ప్రేమ-ప్రేమ కోసమే. ప్రేమ కోసమే మనం పని చెయ్యాలి కారణం తెలియకుండా కార్యం తీసేద్దాము అనుకోవటమే మనం చేసే ప్రయత్నం. జనన మరణాలు కేవలం శరీరానికి సంబంధించినవే. జన్మ మరణాలకు హేతువులైన అహంకారాన్ని

srinannagaru.com

తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యటం లేదు. మన అహంకారం ఒక "టైం బాంబు" అది కాలం వచ్చినప్పుడు పేలిపోతుంది. కాలం వచ్చినప్పుడు ప్రతీదీ నశించి పోతుంది. అధికారం వచ్చినప్పడు ఎప్పుడూ ఇలాగే ఉండాలని అనుకొంటాడు. ఆ పదవీ వియోగం రాగానే దుఃఖపడతారు. అహంకార పరిధిలో ఉన్నది అంతా ఇంతే. ద్వేషం వలన కక్ష, కార్పణ్యం వస్తుంది. దాని వలన మనం ఏమి మాట్లాడుతున్నామో మనకే తెలియదు. రాగ-ద్వేషాల వలనే పాపాలు పోగుజేసుకొంటాము. "పొరుగు, దేవుడు ఇస్తాడు" స్నేహితులను మనం ఎన్నుకో వచ్చును. దేవుడు ఇచ్చిన పొరుగును విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళలేము. బలవంతంగా వెళ్ళినా ఆ అసూయలు అక్కడ కూడా తప్పవు. మనలో కర్మ వాసనలు ఉంటాయి. భగవంతుడు ఇలా అన్నాడు "కర్మ మార్గాన్ని మూసేయకండి" అని. కారణం మననోటితో చెప్పేదాని కన్న చేతులతో చేసేదే ఉపయోగం.

34. వస్తువును చూచేది "కన్ను" దాని ద్వారా మనస్సుకు సంకేతం పంపుతుంది. అందుకనే శమదమాదులు అన్నారు మనోనిగ్రహంలోనిదే కదా ఇంద్రియనిగ్రహం అని కొందరు అనవచ్చు కాని ఇంద్రియాలు దృశ్యాలను చూడకపోతే మెదడుకు విషయాలు అందవు. మనం ఆత్మ వస్తువుని గురించి ఆలోచించటంలేదు ఈ దేహాన్ని గురించే ఆలోచిస్తున్నాము. ఇంద్రియాలు బుద్ధి గెడలాంటిది. అంటే జడపదార్థమే. దానికి శక్తిని ఇచ్చేది ఆత్మే. మన ఇంట్లో ఎవరైనా పోతే బాధపడటం ఎందుకు, భగవంతుడే కలిపాడు, భగవంతుడే విడదీస్తాడు, వరదలో కలప దుంగలు కలుస్తాయి, విడిపోతాయి, సంసార సభ్యులతో గొడవలు పడే వారు ఉన్నారు, సంతోషపడేవారు ఉన్నారు. ఒక్కొక్క సారి భగవంతుడు విరోధులు ఉండే కొంపలో పడేస్తాడు, కర్మానుభవాన్ని బట్టి ఒక్కొక్కసారి దరిద్రం వస్తుంది. ఒక్కొక్కసారి భాగ్యం వస్తుంది. ఒక్కొక్కసారి అనారోగ్యం వస్తుంది. దానితో మనం తాదాత్మ్యం పొందకూడదు. అది అంతా కర్మ సిద్ధాంతాన్ని బట్టినడుస్తుంది. రీజన్‌తో మనం తాదాత్మ్యం పొందకపోతే సంస్కారాలు రాలిపోతాయి. ఈశ్వరుని చేతిలో మనం ఒక పనిముట్టుగా మాత్రమే ఉండాలి. మానవుడు తన అస్తిత్వాన్ని గుర్తించలేకపోవటానికి అడ్డు వచ్చే కర్మ వాసనలే కారణం. సమబుద్ధి పొందినవాడు ప్రకృతి నుండి బయట పడతాడు. కొందరి మనుషులతో మనకు సంబంధం ఏర్పడితే ఇహానికీ, పరానికీ అక్కకుండా చేస్తారు. అటువంటి వారిని ఏనుగుపాదం క్రింద జమకడతారు. ఏనుగు పాదం క్రింద పడ్డ చీమగతిలా మన గతి తయారౌతుంది. కాని భగవంతు ని మీద విశ్వాసం, సడలనియ్యకూడదు.

srinannagaru.com

35. ఈశ్వరుడు ఎవరినో ఒకరిని అడ్డుపెట్టుకొని నడిపిస్తూ ఉంటాడు కార్యాన్ని. మనలను సుఖపెట్టాలనుకొనేవారు, భోగజీవనానికి కృషి చేసిన వారు చనిపోతే మనకు దుఃఖం వస్తుంది. వాళ్ళు చనిపోయారని దుఃఖంరాదు మన సుఖం వాడులేక పోవటం వలన పోయింది అనే భావన వలన మాత్రమే. అందులో మన స్వార్థం తప్పనిసరిగా ఉంది. దాన్ని గుర్తించము. ఇంట్లో అనామకత్వంగా ఉండేవాడు పోతే దుఃఖంరాదు. వాడు ఉన్నా సుఖపడం అనే భావనే. మనిషికి వాడిమీద వాడికి ప్రేమ ఉంది కారణం నిజమైన వస్తువు మనలోనే ఉంది. ఆత్మ వస్తువు లభ్యమైతే అంతటా నేనే ఉన్నానని అనిపిస్తుంది. నీ మనస్సును నీవు విచారణ చేస్తే వివేకం, విచారణ చేయకపోతే అవివేకం. మాయ మనస్సులో ఉంది కాబట్టి విచారణ చేస్తే నశిస్తుంది. రూపం నామం వచ్చిన తరువాతే ఆసక్తి కలుగుతుంది. తలంపు లేకపోతే కామం లేదు, కోరికా లేదు. శవదృష్టి బంధిస్తుంది, శివదృష్టి బంధించదు. పిల్లలు తప్పచేస్తే మనం వాళ్లను కొడతాము. తప్ప మనస్సు చేస్తుంది. దెబ్బలు శరీరం తింటుంది. పిల్లల మనస్సే తప్ప చేస్తుంది కాని వాళ్ళ మనస్సును కొట్టలేము. వారి దేహాలను కొడతాము. కొందరికి కర్మ ప్రవృత్తి ఉంటుంది, కొందరికి జ్ఞాన ప్రవృత్తి ఉంటుంది, వారి వారి ప్రవృత్తికి అనుగుణంగానే ఆయా మార్గాలలో పయనిస్తారు. గాంధీజీ, తిలక్ కర్మ ప్రవృత్తి. అన్నం తిన్న తరువాత విస్తరిని పెంట మీద వేస్తాము ఇంట్లో దాచుకోము. అలాగే బ్రహ్మానుభవం పొందినవానికి శరీరాన్ని ప్రేమించడు కారణం శరీరం మరణించినా తాను మరణించనని తెలుసుకొంటాడు.

36. మనకు ఏవిధమైన సంస్కారాలు ఉంటాయో, ఆ రకమైన కుటుంబంలోనే పడవేస్తాడు ఈశ్వరుడు. వారి సంస్కారాలు మంచివి కావచ్చు, చెడ్డవి కావచ్చు, కొన్ని కుటుంబాలలో కొన్నికొన్ని సంస్కారాలు పొందుతారు. వాటితో జీవిస్తూ ఉంటారు. శివుడు జల స్వరూపుడు, జలానికి దేవుడు శివుడు. జలంతో అభిషేకం చేస్తే శివుడు సంతోషిస్తాడు. అలాగే సూర్యుడు ఆరోగ్య ప్రధాత, తేజస్సుకు దేవుడు. కృష్ణుడు, ఆకాశానికి దేవత ప్రేమలేని వారు కృష్ణుని ప్రేమిస్తే ప్రేమ కలుగుతుంది. భూమికి దేవత వినాయకుడు. విఘ్నాలు రాకుండా ఉంటాయి. క్రియకు, జ్ఞానానికి గుర్తు కుమారస్వామి. ధనం కావలసిన వారు పార్వతిని గాని, లక్ష్మినిగాని ఆరాధిస్తే ధనం కలుగుతుంది. ధనం శక్తి గలది కాబట్టి ఉపాసనచేస్తూ ఉంటారు. అసలు తత్త్వానికి, రూపం లేదు, నామం లేదు. క్రియా లేదు. అహంకారంలో ఉన్న స్థితి "అసహజస్థితి", సమాధి స్థితి, సహజ స్థితి. మనం సమదృష్టితో ఉన్నప్పడే సమాధి స్థితి కలుగుతుంది. సమాజం పట్ల మనం

srinannagaru.com

సమదృష్టితో వ్యవహరించాలి. వాసనలు హృదయంలో ఉండి శిరస్సులోకి వస్తూ ఉంటాయి. వచ్చిన తలంపులను ఆదరించకపోతే అది నశిస్తుంది. కాని సాధనా బలం ఉన్నవాడు తలంపుతో తాదాత్మ్యం పొందకపోవటంతో సాధకుడు ఆ విషయంలో సఫలుడు అవుతాడు. సాధనా బలం తక్కువగా ఉన్నవాడు ఆ తలంపుల యొక్క ప్రభావానికి బలియై ఓడిపోతాడు, వేదన పడతాడు. స్నేహాలు అతిగా ఉంటే ఎటాచ్‌మెంట్ చేయిస్తుంది. ఆ రాగమే, మనతో పాపం చేయిస్తుంది. రాగం ఉన్నవాడు పొరపాటు చెయ్యకుండా ఉండలేడు. బద్ధ పురుషుడికి దుఃఖం. శుద్ధుడికి ఆనందం.

37. ద్వైత గ్రంథాలు చదవటం వలన మనస్సు బాహ్య ముఖానికి వెళ్లిపోతుంది. అద్వైత గ్రంథాలు చదవటం వలన మనస్సు అంతర్ముఖం అవుతుంది. "ఎటాచ్"మెంటు వల్లనే "పాపం" వస్తుంది. ద్వైతం ఉంటే చప్పట్లు ఉంటాయి. ముచ్చట్లు ఉంటాయి. విషయాల పట్ల అజాగ్రత్తగా ఉంటే వాటిని సంతృప్తి చెయ్యాలనే బుద్ధి కలుగుతుంది. సినిమా తెరపై నిప్పులు కాలటం ఎటువంటిదో పుస్తక జ్ఞానం నిజమనుకోవటం అటువంటిది. వస్తువు గూటిలో పెట్టి మర్చిపోతారు అనుకోండి నీవు మర్చిపోయినా ఆ వస్తువు అక్కడే ఉంది. నీవు పోయింది అనుకొన్నా అక్కడే ఉంది. అలాగే నీవు ఆత్మవైనా నీ మరుపు వలన తెలియటం లేదు అనుకొంటున్నావు. నీవు తెలుసుకోలేకపోయినా అది నీవే. తెలిసుంటే సుఖపడతావు లేదా దుఃఖం. ప్రారబ్ధం పాఠాలు నేర్పుతుంది. రామకృష్ణుడు ప్రకృతిని చూచి పాఠాలు నేర్చుకొన్నారు. ద్వైతంలో భయం ఉంటుంది. బాధ ఉంటుంది. దుఃఖం ఉంటుంది. ఎన్నో బాధలు ఉన్నాయి. "ఓం అభయస్థితయే నమః" అంటే అద్వైతంలో భయం లేదు. అద్వైత స్థితే కాదు అసలు అద్వైత భావన రావటానికి ఆ వాసన రావటానికి కొన్ని వేల జన్మలు పడుతుంది. ప్రకృతి విషయాల పట్ల ఆసక్తి వల్లనే దుఃఖం వస్తుంది. శరీరాన్ని ఆడించేది వాసనలే. మనకు వెయ్యి కోట్లు ఉన్నాయి అనుకోండి మనం చనిపోతే ఒక్క పైసారాదు కూడా, కాని మన వంకర గుణాలు అన్నీ మనతో పాటు వస్తాయి. మీ మనస్సులో వాసనలు మిమ్ములను గోకుతున్నాయి అనుకోండి వాటి నుండి బయట పడాలంటే మీ సద్గురువును మనసారా స్మరిస్తే ఆ వాసనలు రాలిపోతాయి. అప్పుడు మీ బుద్ధి స్థిరంగా ఉంటుంది. శాంతి స్థిరత్వాలు అబ్బుతాయి.

38. మీరు విషయ వాసనలతో సతమతమౌతూ బుద్ధి నిశ్చలంగా ఉంది అని నటిస్తే మోసపోయేటంతటి అమాయకుడు కాడు ఈశ్వరుడు. నిన్ను నిరంతరం చూస్తూనే ఉన్నాడు. లోక విచారణ చేస్తే చావటం పుట్టటం అనే

srinannagaru.com

చక్రంలో నుంచి బయటికి రాలేవు. విరోధులు మన దగ్గరకు రారు. స్నేహితులలో దురలవాట్లు ఉన్న వారి వలనే ఎక్కువ నష్టం వస్తుంది. మనస్సుకు ఏకాగ్రత కలుగనియ్యరు. చైతన్యస్థాయి పెరగటానికి సహకరించరు. రూపదృష్టి, నామ దృష్టి, గుణదృష్టులతో నీవు తాదాత్మ్యం మానివేయాలి. నిరంతరం ఆత్మ దృష్టిలో ఉండాలి. నీకు మంచి గుణాలు ఉండవచ్చును. దానితో నీవు తాదాత్మ్యం పొందకూడదు. నాకు మంచి గుణాలు ఉన్నాయని అనుకోకూడదు. నీకు తెలియని ఈశ్వరుని వదిలేయి. నీకు తెలుసున్న బుద్ధిని బాగుచేసుకో. తెలియనిది నీకు అప్పుడు తెలుస్తుంది. నీ రాగ-ద్వేషాలే బాహ్యముఖం చేస్తున్నాయి. అవి తగ్గించుకొంటే నీ మనస్సు సమానంగా ఉంటుంది. అప్పుడు నీవు ఆత్మ జ్ఞానివి కావటానికి అర్హత కలుగుతుంది. నిజంగా మీరు దుఃఖపడుతూ ఉంటే మీ సద్గురువును గాఢంగా ప్రేమిస్తూ ఉంటే నీ దుఃఖం నిన్ను విడిచిపెడుతుంది. నిజమైన భక్తుడు ఏమీ కోరడు. వాడు పవిత్రుడు అవుతాడు. పనిచెయ్యి, కపటం లేకుండా పనిచెయ్యి. పరమేశ్వరుని మీద ఇష్టం కలగటమే చాలు అనుగ్రహం దాని అంతట అది వస్తుంది. కర్మ ఫలితం తాత్కాలికమే కాదు, అనిజం, అవాస్తవం, రూప ధ్యానం, స్థూల ధ్యానం. వాటికంటే ఆత్మ ధ్యానం ఇంకా లోతుగా మిమ్ములను గమ్యానికి చేరుస్తుంది. మీరు మీ కుటుంబ సభ్యులను "మమ్ము బాగా ప్రేమించు" అని చెప్పి ప్రేమించుకోలేము. ప్రేమ అనేది ఆటోమేటిక్‌గా రావాలి.

39. రాధ, కృష్ణుని చూడగానే ఒంటి మీద బట్ట ఉందో లేదో కూడా తెలియదు అంత గాఢంగా ప్రేమించింది. అలాగే జీవుడు దేవుణ్ణి ప్రేమిస్తే తరిస్తాడు. రామకృష్ణుడు అన్నారు "అందరికీ కామాన్ని, క్రోధాన్ని జయించి మోక్షాన్ని పొందాలనే ఉంది. కాని దాన్ని ఎలా పొందాలి అని వివరణ ఇయ్యలేకపోతున్నారు. నీ ప్రక్క గదిలో ఒక మణుగు బంగారం ఉంది అనుకోండి మీకు దొంగతనం చేసే బుద్ధి ఉంది అనుకోండి, రాత్రి అంతా ధ్యాస బంగారాన్ని ఎలా పొందాలనే విషయం మీదే ఉంటుంది. నిద్ర పట్టలేదు అనే బాధ ఉండదు. మీ గురి అంతా బంగారాన్ని ఎలా కైంకర్యం చెయ్యాలనే ఆలోచనతోనే ఉంటారు. అలాగే మీ బుద్ధి బ్రహ్మంపై ఉన్నప్పుడు అది నీకు లభ్యమౌతుంది. ఏ మాటనైనా ఆ సందర్భాన్ని బట్టి ఆ మాటను అర్థం చేసుకోవాలి. అంతేగాని బండతనంగా అపార్థం చేసుకో కూడదు. సహనం ఉన్నవానికి సాధన బాగా జరుగు తుంది. హృదయం లోతులు బాగా తెలుస్తాయి. మనస్సు ఎక్కడ పుడుతున్నదో అక్కడ ఉండటమే మౌనం. మనకు బ్రహ్మచర్యం తీసుకోవాలని పూర్తిగా ఉంటే ఆ నిర్ణయం తీసుకో అంతేగాని సన్యాసం తీసుకొని, రోజూ సంసార సుఖాల లాలనలో కాలిపోకుండా సంసారం లోనే ఉంటే మంచిది.

srinannagaru.com

విషయాన్ని గుర్తించ టానికే శ్రవణం, మిధ్యానేనుకు, మిధ్యావస్తువులు అంటే ఇష్టం. ఆత్మ జ్ఞానం ఉన్నవాడు లోకంలో ఏ వస్తువును చూచినా మోహం కలుగదు. ఊరక ఉన్నవారు ఊళ్ళో వారందరికీ బంధువు అవుతారు. అధ్యయనం, సూక్ష్మ దృష్టి అవసరం. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీ ఉపాసనకు సాకారం ఉపయోగపడు తుంది. నామ, ధ్యానం ఎల్‌కెజి, రూపధ్యానం యుకెజి. మీ ఉ పాసనకు ఏదో ఆలంబన కావాలి. మీరు ముఖ్యమైన మాట వినేడప్పుడు "ఈ మాట జ్ఞాపకం ఉండాలి" అని స్మరించుకొంటే తరువాత ఆ మాట మీకు జ్ఞాపకం వస్తుంది.

40. ధైర్యం ఉండాలి. అది నిర్మలంగా ఉండాలి. కొంతమందికి నేత్రానంద మనే బలహీనత ఉంటుంది. అది వారి మనస్సును బాహ్యముఖం వైపుకు తిప్పేస్తుంది. మీరు ఎప్పడూ విమర్శలకు కంగారు పడకండి. అవి నూటికి 90% అసూయతో వస్తూ ఉంటాయి. డివోషన్-డెడికేషన్-డిసిప్లిన్ కావాలి. చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టేవాడు "జోగి" అవుతాడు. చేతిలో ఉన్న పనిని చేసేవాడు "యోగి" అవుతాడు. తలంపుల విషయంలో జాగ్రత్త ఉంటే -మాట-చేత యోగ్యంగా ఉంటాయి. బడిలో నేర్చుకొనే పాఠాలు కన్న, జీవితంలో నేర్చుకొన్న పాఠాలే మీకు ఎక్కువ మేలు చేస్తాయి. అవినయం ఉన్న వాని మనస్సు సంస్కరించబడదు. ఉద్రేకం ఉంటే ప్రతీమాటకూ భయపడవలసిందే. నీ హృదయంలో నీవు ఎలా ఉన్నావో అలా ఉండగల్గినప్పడు కదా నీకు బ్రహ్మానుభవం కలిగేది. నీ ఇంద్రియాలను నీవు నమ్మవద్దు. వాటికి ఇష్టమైన వస్తువులు దగ్గరగా ఉన్నా నిగ్రహంగా ఉండాలి. నిజమైన ధైర్యవంతుడు పైకి ధైర్యవంతుడిలా కనిపించడు వాడు అవసరమైతే ప్రాణాలు ఇస్తాడు. నీ మనస్సు నిగ్రహంగా లేదు అనుకో నీ గురువుతో స్నేహం చేస్తే మనస్సు నశిస్తుంది. ఆరు మాసాలు సహవాసం చేస్తే వారు వీరు అవుతారు అన్నట్లు. మనకు తినే ఆహారంలో కరివేపాకు, మిరప కాయలు ఉంటాయి. వాటిని ప్రక్కన పెడతాము అలాగే ఉపయోగంలేని తలంపు లు వస్తూ ఉంటే వాటితో పేచీ పెట్టుకోకుండా వాటిని ప్రక్కకు పెట్టటం నేర్చుకోవాలి. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా, అవమానం వచ్చినా మన హృదయంలో ఉన్న ఆత్మను గుర్తించుకోవాలి. మీకు ఏదైనా శరీర బాధ వస్తే అది అనిత్యం అనుకోవాలి. దాని వలన కొంత ఉపశమనం కలుగుతుంది. మీకు ఎవరిమీదనైనా కోపం అసూయ కలుగుతూ ఉంటే "మాయ"తో ఉన్నట్లే లెక్క. వాటి నుండి విడుదల పొందటానికి ఈశ్వరుని ప్రార్థించాలి.

41. కోరిక లేకుండా, భయం లేకుండా జీవిస్తే నీ జీవితం ప్రశాంతంగా

srinannagaru.com

సాగుతుంది. ఈశ్వరానుగ్రహం మనకు కలుగుతూ ఉంటే వాసనల వేర్లు దూరంగా తొలగిపోతాయి. మీ హృదయంలో ఉన్న సత్యం మీ బుద్ధికి కొంచెం, కొంచెం తగిలితే బాహ్యముఖంగా పరుగెట్టే మీ మనస్సు, క్రమం క్రమంగా సత్యం వైపు మరలి మీరు చైతన్య స్వరూపాన్ని పొందుతారు. సత్యం పరిమితులు లేని వస్తువుగా ఉన్న, గుడిలోని దేవతా మూర్తిని దర్శించటానికి చిన్న చిన్న భావాలు ఉన్నవారు వస్తూ ఉంటారు. మనం పరిమితులలో ఉండిపోవటం వలన ఇరుకుగా ఉన్నాము. క్రమశిక్షణ అనేది ఆధ్యాత్మిక జీవితానికి తప్పనిసరిగా ఉండాలి. జీవిత పాఠాలు నేర్చుకొన్నవాడు వివేకి, పాఠాలు నేర్చుకోనివాడు పామరుడు. అజ్ఞాని సన్నిధిలో వాడు మనతో మాట్లాడకపోయినా వాడి వైబ్రేషన్స్ మనపై పనిచేస్తాయి, జ్ఞాని సమక్షంలో ఉంటే జ్ఞానం కలుగుతుంది. లోకంలో ఏదో ఉంది అనుకొంటున్నాము ఏమీ లేదు. అంతా నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో ఉన్నదే లోకంలో ఉంది ధర్మరాజుకు, దుర్యోధనునికి వారి వారి హృదయాలలో ఉన్నదే లోకంలో కనబడింది. తెలివి గలవాడు జీవితంలో పాఠాలు ఎక్కువ నేర్చుకొంటాడు. అంతా భగవంతుడే చేస్తాడు, మన వలన గడ్డిపరక కదలదు. మన వలన ఏదో అవుతుంది అనుకోవటం వలన మనకు అహంకారం తప్పదు. "ఇంతమందిని నేను ఎలా చంపను" అంటే అర్జునుడు "నీవు చేతులు ఊపించు చాలు" అన్నాడు పరమాత్మ. మొదటిమాట, మధ్యమాట, చివరి మాట సహనమే. సహనం వలన లోచూపు వస్తుంది. కాలాన్ని మీరు ఎంత సద్వినియోగం చేసుకొంటే అంత తొందరగా మీరు బాగుపడతారు. ఎక్కడ సంకల్పాలు, ఊహలు లేవో అక్కడ మేల్కొనాలి, దాన్ని గురించి ఊహించకు, ఊహిస్తే అది జరగకపోతే దుఃఖం. ప్రతీ తలంపు దుఃఖానికి కారణమౌతుంది. బంధం వస్తుంది.

42. గుణాలలో రాముని గుణాలు గొప్పవి అరణ్య వాసానికి వెళ్ళవద్దని ప్రజలు మొత్తుకుంటే రాముడు అంటాడు "దాని వలన దేహప్రారబ్దంలో ఏమి జరగాలో అది జరుగుతుంది". కాని కైకేయి కోరిక నెరవేరుతుంది కదా! ఈ వాక్యానికి రాముడు దేవుడు అనటానికి సరిపోతుంది. జీవుడు ఆ మాట అనలేడు. ఆ ఒక్కవాక్యం జీర్ణించుకొంటే రామాయణం గొప్పతనం తెలుస్తుంది. మీకు కొన్ని క్షణాలలో భగవదనుభవం కలుగుతుంది. అది అతి బలీయంగా మిమ్ములను వరిస్తుంది. "ఊహించకండి, నిరాశ పడకండి" మీరు తరిస్తారు. చిత్త శుద్ధి లేకుండా ఏకాగ్రత కుదరదు. మనం బ్యాంకులో రుణం తీసుకొనే ముందు అసలు ఎంత, వడ్డీ ఎంత అవుతుంది, ఆ రుణాన్ని ఆ సమయంలో ఎలా తీర్చాలి అని ఆలోచించి రుణం తీసుకోవాలి అలాగే కష్టాలు, నష్టాలు వచ్చినా ఓర్చుకొని

srinannagaru.com

రుణం తీర్చాలి. నిర్లక్ష్యం చేస్తే రుణం తీరదు, బాధలు తప్పవు. అలాగే కష్టాలు, నష్టాలు వచ్చినా, విమర్శలు వచ్చినా, మీ జీవితంలో వాటిని మీరు భరించాలి. మన గమ్యం ఆత్మానుభవం అన్న విషయం మర్చిపోకూడదు. ఇంట్లోకి పనికి రాని వస్తువులను బయటికి ఎలా పారవేస్తామో అలాగే దేహాభిమానాన్ని విసిరి వెయ్యాలి. అందుకే అన్నారు త్యాగరాజు "నిధి సుఖమా రాముని సన్నిధి సుఖమా నిజముగ తెలుపుము మనసా" అని. ప్రతీ నిమిషం "ఎటెంన్షన్"లో ఉండి అహంకారం యొక్క జాడ కనిపెట్టి, జీవించాలి. బంగారం తూచేవాడు ముల్లు ఎటువైపు జరుగుతుందో అని చూచుకొంటాడు. మధ్యలో ఎవరైనా ఏమన్నా అన్నా ఏమీ పట్టించుకోడు. అలాగే అహంకారాన్ని పొగిడేవారు, తెగడేవారు ఎవరైనా నీకు తారసపడితే నీ గమ్యమైన ఆత్మానుభవానికి బేలెన్సు తప్పకుండా జీవితం పొడుగునా జీవించాలి.

43. వైరాగ్యం తక్కువగా ఉన్న వానికి "భయం" ఎక్కువగా ఉంటుంది. ప్రారబ్ధానికి ఓవర్‌గా రియాక్టు అవ్వకూడదు. మర్చిపోతే ఏమీ లేదు. శరణాగతి మార్గంలో ప్రయాణం చేసే వారికి గతి మోక్షం అవుతుంది. మోహమనే సముద్రంలో నీవు ఉన్నంత కాలం అనిజం, నిజంలా కనిపిస్తుంది. మనస్సులో ఎంతో ఘర్షణ జరిగితే గాని సత్యం తెలియబడదు. జీవితంలో ఎన్నో ప్రలోభాలు ఉంటాయి. ఆ వ్యక్తి ప్రధానమంత్రి కావచ్చు, సామాన్య మానవుడు కావచ్చు, ఆ ప్రలోభాలలోంచి తప్పకొని మనస్సును ఆత్మవైపు తిప్పాలి. వాడే కృతార్థుడు అవుతాడు. గురు పూర్ణిమ సందర్భంగా నైనా "మనస్సును సంస్కరించుకోవాలనే బుద్ధిని సాధించాలి" అని ప్రతిన పూనాలి. "నిరీక్షణ నేర్చుకొనే వారికి శరణాగతి కుదురు తుంది" అన్నారు భగవాన్. "సహనం" అనే కర్రను ఊపిరి ఉన్నంత వరకూ ఎవరైతే వదలరో వారికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. అజ్ఞానం ఏదో ఒకటి సృష్టిస్తుంది. మనస్సు యొక్క విజృంభణ ఆపకపోతే ఆత్మానుభవం కలుగదు. మనం నేచురల్‌గా ఉంటే, అంటే కర్తృత్వం లేకుండా ఉంటే మనస్సు ఆత్మగూటిలోకి పడిపోతుంది. మీకు ఏదైనా కష్టం వస్తే మిఠాయి తిన్నట్లు అనుభవిస్తే మీరు గమ్యాన్ని చేరిపోతారు. ఎవరితోనూ అతిగా స్నేహంగాని, అతిగా విరోధం గాని పెట్టుకొంటే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. కాలక్షేపం కోసం స్నేహాలు చేసినా, మీరు ఎంతో నష్టపోతారు. ఒక్క నిమిషం పాడుచేసుకొంటే తిరిగి సంపాదించలేము. భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మీరు ఏ రంగంలో ఉన్నా మీరు చేసే పని వలన మీ మనస్సు ఎంత వరకూ పక్వానికి వచ్చింది అని చూచుకోవాలి. ఆ పనిలో మీ మనస్సు ముగ్గాలి, లేకపోతే ఆ పని వదలాలి.

srinannagaru.com

44. మీరు సమానంగా ఉంటే సమానంగా ఉన్న ఆత్మ వస్తువు మీకు లభ్యమౌతుంది. నీకు సిద్ధి కలుగవచ్చు, కలుగకపోవచ్చు. నీ బుద్ధిని సమానంగా ఉంచుకోవాలి. దాని వలన సహజస్థితి వస్తుంది. ఒక వస్తువును గదిలో పెట్టి తాళం వేస్తే అది మనం తీసే వరకూ కదలదు. అలాగే నీ మనస్సును హృదయ గుహలో భద్రపరిస్తే అది ఎటూ కదలదు. మీకు ఒక్కొక్కసారి అనుకోని పనులు ఘనంగా జరిగిపోతే అప్పుడు సమానంగా ఉంటే అది "జయం". నీకు అప్పుడు గర్వం వస్తే అది జయం కాదు అది అపజయమౌతుంది. ఆ జయ ఫలితం ఈ జన్మలో పోతుంది. దాని వలన వచ్చే గర్వం మరుజన్మలో మీకూడా వచ్చి మిమ్ముల్మలను కృంగదీస్తుంది. మీకు గర్వం వస్తూ ఉంటే పూర్తిగా మాయలో ఉన్నట్లే లెక్క. దాని గురించి రుజువులు, సాక్ష్యాలు అవసరం లేదు. ప్రతీ గంటా నీ మనస్సును అదుపులో ఉంచుకో. అప్పుడు మనస్సు నెమ్మదిగా నాశనమౌతుంది. "ఎవడి బుద్ధి అయితే సూక్ష్మత కలిగిందో వాడి పుణ్య-పాపాలు ఇక్కడే వదిలేసి పోతాడు" అన్నాడు వాసుదేవ స్వామి. ఇతరులు మనలను చూచి జాలిపడేటట్లు ఉండాలి కాని అసూయపడేటట్లు ఉండకూడదు. పైకి మనం సామాన్యంగా ఉండాలి. ఆత్మకు నేను యజమానిని అని ఉండదు. మనస్సుకే యజమానత్వం కావాలి. దేన్నీ ఉద్రేకంతో ఆలోచించకు నీలో ఉన్న శాంతితో నీలో ఉన్న ఉద్రేకాన్ని ఆర్పు. శాంతి వేరు, సంతోషం వేరు. శాంతి స్వతంత్రంగా ఉంటుంది. సంతోషం, లోకంలో ఏదో ఒక వస్తువు వల్లనో, సంఘటన వల్లనో ఆధారపడి ఉంటుంది. పోరాటం లేకుండా "సత్యం" అనుభవంలోకి రాదు. శ్రవణం తరువాత ఆచరించు నప్పుడు పోరాటం ప్రారంభమౌతుంది. ఆపోరాటానికి శక్తి, ఓర్పు కావాలి.

45. మనకు డబ్బు మీద, చదువు మీద, కీర్తిమీద గౌరవం ఉంది. కాలం మీద గౌరవం లేదు, అది ఉంటే గమ్యాన్ని చేరతాము. కొంతమంది ఇరువది నాల్గు గంటలు లోకంతోనే ఉంటారు. వారు బాగుపడరు. ఇతరులను బాగుపడ నీయరు. గాంధీజీ అన్నారు "లోకానికి సాక్షిగా జీవించటం కాదు, మనస్సుకు సాక్షిగా జీవించిన వాడికి వాడి మనస్సు చైతన్యం వైపు ప్రయాణమౌతుంది" ప్రకృతి మనుషులతో అనుబంధం ఉంటే మనస్సు విషపూరితమౌతుంది. దేవుని అనుగ్రహం లేకపోతే, దేవుని అధీనంలో ఉన్న "మాయ" మనకు అర్థంకాదు. సత్యానికి సంబంధించిన వాక్యం అర్థంకావాలన్నా ఆయన అనుగ్రహం కావాలి. తలంపులు ఉంటే శత్రువు, మిత్రుడు. గాఢనిద్రలో వారు ఎక్కడ ఉన్నారు. ఇది గ్రహించాలి. నీవు విషయాన్ని వినటంతోనే సరిపెట్టుకోక అనుభవానికి ప్రయత్నం చెయ్యి. చేసింది ఊరికే పోదు. కుయుక్తులు, కుతంత్ర దార్లకు దూరంగా

srinannagaru.com

ఉండాలి. వాళ్లను గురించి తీర్పు చెప్పకు, అజ్ఞానంలో పడతారు. సాధ్యమైనంత వరకూ సమాజానికి దూరంగా ఉండు. తప్పనిసరి అయినప్పుడు సమాజంతో కొంతకాలం గడుపు. నిజం తెలిసే వరకూ ఎవరికో ఒకరికి, దేనికో దానికి బానిసలే. యుద్ధంలో భీష్ముడు అంటాడు వచ్చేవాడు ఉత్తర కుమారుడు కాడు "ఫల్గుణుడు" జాగ్రత్తగా ఉండండి. అలాగే నీ బలమైన వాసనలకు నీవు నిలబడాలి అంటే నీవు పరమేశ్వరుని మీద దృష్టిని నిలుపు. వారి నామాన్ని భక్తిగా, ప్రేమగా చెయ్యి. అది నిన్ను నీ వాసనల నుండి గెంటటానికి సహకరిస్తుంది. గృహస్థులుగా ఉన్న వారు ముందు జరిగే మంచి సంఘటనలకు పెడ అర్థాలు తీసి మాట్లాడితే వారే పతనమౌతారు.

46. భోగమును సాధ్యమైనంత వరకూ తగ్గించుకోవటం కూడా "తపస్సే". సెక్స్‌తో కూడిన ప్రేమ నిజంకాదు. సహనం వలన వివేకం పెరుగుతుంది. హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. వాసనలు తగ్గుతాయి. అంతేకాదు జీవితంలో ఏ ప్రమాదం జరిగినా నిలబడగలుగుతావు. వాస్తవ వాదులు అన్ని కాలాలలోనూ అభివృద్ధి చెందుతారు. ఎక్కడైతే ఆడంబరం ఉంటుందో అక్కడ నిజం ఉండదు. ఈ ఎముకలు, ఈ దేహమే నీవు అనుకొంటున్నావు. లోపల మనస్సు ఉంది, దాన్ని శుభ్రం చేసుకోవాలి. హృదయం ఆడంబరంగా లేదు. మనం కూడా అలా జీవిస్తే సత్యాన్ని తెలుసుకోవాలనే బుద్ధి కలుగుతుంది. కొందరు మాట్లాడుతూ ఉంటే ఆ మాటలు ఎలాగూ మనకు అర్థం కావు. వాళ్లకైనా అర్థమైతే బాగుండును అనిపిస్తే చాలు. మనం ఎవరితో మాట్లాడినా అవును కాదు అనే భావంతో చెప్పు. కపటంతో మాట్లాడకు, ఋజు ప్రవర్తనతో ఉండు. ఎవరింటికైనా, ఏ టైముకైనా వస్తానంటే ఆ టైముకు వెళ్ళు. కపటమైన మాటలు మాట్లాడకు. సత్యం పై మనకు భక్తి ఉంది. దానికై మనకు అన్వేషణ కావాలి. నీ ఇష్టమైన గురువును నీవు ఇష్టపడవచ్చు కాని "అందరినీ నీ గురువుకు సన్నిహితమవ్వండి" అనటం అహంకారము. ఆ విషయంలో బలవంతం పనికిరాదు. అలా చేసినా ఎంతో కాలం నిలవరు. తన గురువుతో సన్నిహితం కాలేదు అనే బాధతో పేచీలు వస్తాయి. అది బలహీనత. భక్తులకు అది ఉండరాదు. మనం మాట్లాడేటప్పుడు గౌరవంగా మాట్లాడాలి. నామం చేస్తూ ఉంటే నామంపై ప్రేమ ఉండాలి. అలా నామంలో ఉంటే మధ్యలో ఎవరైనా మాట్లాడితే ఆ మాటలు అయిన తక్షణం మనస్సు నామంపై మరలాలి. మధ్యలో మాట్లాడారని విసుగు పనికిరాదు.

47. సత్వగుణం వలన బుద్ధి సూక్ష్మమౌతుంది. ఆ గుణంతో ఎవరికి ఉపకారం చేసినా వాడికి ఉపయోగం, ఇచ్చిన వాడికి ఉపయోగం. రజోగుణంతో

srinannagaru.com

చేస్తే ఏ ఉపయోగం ఉండదు. అన్ని గ్రంథాలు అధ్యయనం చెయ్యి, తరువాత అన్నీ మర్చిపో. ఎవరైతే బుద్ధిని సమానంగా ఉంచుకొని మాట్లాడుతారో వారికి సత్య దర్శనం అక్కరలేదు - సత్యం వారికి సాక్షాత్కరిస్తుంది. నీకు కళ్యాణ గుణాలు ఉంటే గుడి, బడి అని కాదు, అనుగ్రహించటానికి స్నానాలగదిలో ఉన్నా ప్రయాణంలో ఉన్నా సత్యాన్ని సాక్షాత్కరింపచేస్తాడు ఈశ్వరుడు. మీరు నిగ్రహంగా ఉంటే మిమ్ములను విమర్శించిన వారి కన్న మీరే పవిత్రులు అవుతారు. "నీవు ఆందోళన పడే పరిస్థితి వస్తే నీవు ఆందోళన పడకుండా ఉంటే గ్రేట్‌మేన్ అవుతావు" అన్నారు టాల్‌స్టాయ్. స్వార్థం పెరగిపోతూ ఉంటే పరమార్థానికి దూరమౌతావు. వ్యక్తి భావన పెరిగిపోతుంది. కారుకు డ్రైవరు ముఖ్యం. డ్రైవరు సమర్థుడైతే కారు సజావుగా నడిచి, గమ్యాన్ని చేరుతాము. అలాగే నీవు దేహానికి డ్రైవరువు. నీ బుద్ధిని శుద్ధి చేసుకొంటే, లోచూపు కలిగితే నీవు తరిస్తావు. నీకు దుఃఖం వస్తూ ఉంటే నీకు సరియైన ఆలోచన లేదని గుర్తు. మీకు ఏ రకమైన దుఃఖం ఉన్నా దాన్ని మర్చిపోతే మీకు ఆత్మధ్యాన స్థితి కలుగుతుంది. మీరు "అలా ఉన్నాను, ఇలా ఉన్నాను" అని అనుకోకండి. మీరు ఎలా ఉన్నారో అలా ఉండండి తరిస్తారు. ఈశ్వరుని పట్ల మీకు సజీవ విశ్వాసం ఉంటే మీ దుఃఖం అక్కడికక్కడ ఆరిపోతుంది. కబీరు అన్నాడు "భగవంతుడు ఒకడు ఉన్నాడు, మన యోగ క్షేమాన్ని చూచేవాడు ఒకడు ఉన్నాడు, అని ఏ భక్తుడైనా తన దైవం పట్ల భక్తితో రెండు కన్నీటి చుక్కలు రాలిస్తే అవి కాశిలో ఉన్న గంగకన్న పవిత్రమైనవి" అన్నారు.

48. భాగవతంలో శ్రీ కృష్ణుడు "ఆ శనిగ్రహం నడుస్తున్నది. ఈ కుజ గ్రహం నడుస్తున్నది అని ఆందోళన ఎందుకు. నీ మనస్సు అనే గ్రహం నుంచి బయటికి రా, ఆ గ్రహాలు ఏమీ చెయ్యవు" అన్నారు. కంటిలో కామం ఉన్నప్పుడు హృదయంలో రాముడు ఎలా కనిపిస్తాడు. శాంతి అనేది ఒక పదవి. ఆత్మ శాంతి అనే పదవి ముందు అన్నీ తక్కువే. బుద్ధిని బాగు చేసుకోకుండా ఎవ్వడూ బుద్ధుడు కాలేడు. మీకు ఒక వాసన ఉంది అనుకోండి, దాన్ని నీవు తట్టుకొంటే ఆ వాసన నీనుంచి తప్పకొంటుంది. దాని పీడనలో నీవు ఓడిపోతే వాసన తన బలాన్ని పుంజుకొంటుంది. జాగ్రదవస్థలో పనిచెయ్యటంలో "ఓడిపోవచ్చును, అప్పక పోవచ్చును, కాని జాగ్రదవస్థలో నిద్ర పోవటం నేర్చుకో, నీవు సాక్షిగా ఉండటం అలవాటు పడతావు. క్రమంగా నీవు యోగివి అవుతావు. నీకు వచ్చే కామ-క్రోధాలు ఫీలింగ్స్ అన్నీ దొంగనేనుకే వస్తున్నాయి. ఆ విషయం గ్రహించు. "స్వేచ్ఛ" హృదయం లోంచే వస్తుంది. నాలెడ్జి పుస్తకాలు చదవటం వల్ల వస్తుంది, జ్ఞానం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి తపస్సు వలన, రెండు చదువు వలన. తపస్సు

srinannagaru.com

వలన కలిగే జ్ఞానమే నిజమైనది. ఏదైతే మనకు "నేను"గా వ్యక్తమౌతుందో అది రెండింటిని ఆశ్రయిస్తుంది. ఒకటి రూపం, రెండు నామం. రూపం వచ్చాకే నామం వస్తుంది. అహంభావం అభిమాన రూపం మీద ఆధారపడి ఉంటుంది. రూప నామాలు వదిలేసారు అనుకోండి. అహంకారం అగాధాలలోకి కూరుకొని పోతుంది. తులసీదాస్ భార్య అంది "నా దేహానికి నీవు భర్తవు. నా శరీరం నీకు బంధం. నన్ను స్మరించేకన్న రాముని స్మరిస్తే ఎంతో బాగుంటుంది. మనస్సుకు పతి-గతి ఈశ్వరుడే" అన్నది భర్తతో. సాధనలో శాంతంగా ఉండాలి, తేలికగా ఉండాలి. గమ్యంలో ఎంత సుఖం ఉందో సాధనలో కూడా అంత సుఖం ఉండాలి. అసలు గమ్యం గురించి ఆలోచనే పనికిరాదు.

49. కఠోపనిషత్తు మూర్ఖుడు ఎవరు అంటే "మరణానంతరం జీవితం లేదని శ్మశానంతోనే జీవితం ముగుస్తుందని, అమృత స్థితి ఒకటి ఉందనే ఆలోచన లేకపోవటం, కర్మఫలం అనుభవించాలనే ఆలోచన ఉండదు. వాళ్ళు మూర్ఖులు" అన్నది. మిమ్ములను గురించి మీరు అర్థం చేసుకోలేనప్పుడు ప్రపంచం గురించి వేదనపడటం వెర్రి. మీలోని ఆనంద సముద్రంలో మీరు మునిగినప్పుడు మీకు శాంతి కలుగుతుంది. మీ మనస్సు మిమ్ములను ఎలా మోసం చేస్తున్నదో మీరు గ్రహించాలి. ఇది అంతా మనస్సు యొక్క గారడీ. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే మీకు వారి పట్ల ప్రేమ ఉంటుంది. కాని మీ మీద మీకు ఎక్కువ ప్రేమ ఉంటుంది. వాళ్ళు చనిపోయిన తరువాత వాళ్ళను మర్చిపోలేము అనుకోండి మనమే దుఃఖపడతాము. చనిపోయిన వాళ్ళు మనలను ఎలాగూ మర్చిపోతారు మనం వాళ్ళ గురించి బాధపడటం కన్నా వాళ్ళ పేరు మీద ఏదైనా మంచి పని చేస్తే ఈశ్వరుడు ఆ పోయిన వారికి శాంతిని అందజేస్తాడు. అమృత స్థితి ఎప్పుడు పొందుతాము అనుకోవటం నిజమైన సాధన కాదు. సాధన ఓర్పుగా, శాంతంగా చెయ్యాలి. ఒకవేళ భగవంతుడు ప్రత్యక్షమై "నీకు వెయ్యి జన్మలు పడుతుంది మోక్షానికి" అన్నాడు అనుకోండి అప్పుడు మీరు కంగారుపడితే దాన్ని మరో మూడు జన్మలకు పెంచుతాడు, కాని మీరు కంగారు పడకుండా క్వయిట్‌గా ఉంటే అరగంటలో మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. ఇది రహస్యం. మీరు మాట్లాడేటప్పుడు సున్నితంగా, తియ్యగా మాట్లాడాలి అది కూడా సాధనలో భాగమే. మీకు ఎవరిని చూచినా అసూయ కలిగితే మరల పది జన్మలు వెనుకకు వెళ్ళిపోవచ్చును. సాధన లేకుండా పుస్తకాలను మాత్రమే చదివే వాడిని పుస్తకాల పురుగు అంటారు. నీ బలహీనతలను నీవు లోచూపుతో నిరంతరం నీవు గమనించాలి ఆ ధ్యాస రాకపోతే నీకు ధ్యానం రాదు.

srinannagaru.com

50. మీకు నష్టం వచ్చింది. అది మంచికి జరగవచ్చును, అది భగవంతుడికి తెలుసు. దాని వలన మనము ఎవరమో మనకు తెలుస్తుంది. అంతులేని సహనం ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారికి అవసరం. మనం రోజూ వందసార్లు టపాకాయలు పేలిపోయినట్లు పేలిపోతున్నాము. మనకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి ఏమిటి? ఆ సహనం ఉంటే ఈ మార్గంలోకి రావాలి. ఈ మిధ్యా నేను ప్రక్కకు పెడితే, మీకు ఎన్ని సమస్యలు ఉన్నా ఇట్టే తొలగిపోతాయి. ఈ దొంగనేను నామరూపాల మీద ఆధారపడి బ్రతుకుతున్నది. ఇది ఫండమెంటల్ రూల్. ఇది తెలుసుకోకపోతే నీవు ఎంత సాధించినా ప్రయోజనం శూన్యం. కొంతమందికి గర్వం ఉంటుంది. దాన్ని కనిపించకుండా జాగ్రత్త పడతారు. కాని ఎంతకాలం కాపాడుకొంటారు. వాళ్లను "డంబాచారులు" అని కృష్ణుడు అన్నారు. యోగం దేనికి అంటే, మనస్సు యొక్క చాపల్యం ఆగటానికే. అంతర్ దృష్టి గురువు అనుగ్రహం లేకుండా రాదు. మీకు సినిమా చూచే అలవాటు ఉంది అది కూడా పోవాలంటే గురువు అనుగ్రహం కావాలి. ఆ అలవాటును మీరు రిపీట్ చేస్తే అది పెరుగుతుంది. దాన్ని అణిచితే అది పోతుంది. గాంధీ అన్నారు "నీ మనస్సు వెళితే వెళ్లనియ్యి నీ దేహాన్ని వెళ్లనియ్యకు. ఒకవేళ నీ మనస్సు కొంత సేపు వెళ్లినా తిరిగి వస్తుంది" అన్నారు. అంటే దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూడటం ఆపితే అది క్రమంగా క్షీణిస్తుంది. బాహ్య కారణాల వలన ఏ అశాంతి రావటం సంభవించినా అది నీ శాంతికి భగ్నం కాదో ఆశాంతి నిజమైన శాంతి. మనది దొంగ శాంతి. ఇడ్లీలో పచ్చడి బాగా లేకపోతే చాలు మనకు అశాంతి వచ్చేస్తుంది. గుర్రం కదిలితే బండి దాని వెనుక అదే వస్తుంది. అలాగే నీవు శరణాగతి పొందితే శాంతి దానంతట అదే నీకు వస్తుంది. దానిని బాహ్యపరిస్థితులు వస్తువులు ఆపు చెయ్యలేవు. అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతోంది అనుకొంటాడు.

51. "విచారణే" మాష్టర్ "కీ". దృశ్యాలే దొంగలు. దృశ్యాల నుంచి నీ మనస్సును మళ్లించు. అది నీ మనస్సుకు "ఒక వృత్తి" దాన్ని మళ్లించు. మనస్సు ఏ బలహీనతల వైపు వెళుతుందో గ్రహించి దానికి ఎదురీదు. చేపలు ప్రవాహానికి ఎదురీదినట్లు నీ మనోవేగానికి ఎదురీది దాని పుట్టిన చోటికి వెళ్లాలి. అణిగిన మనస్సుకు ఏదైనా ఆకర్షణ వస్తే విజృంభిస్తుంది. మన అజ్ఞానం ఎక్కడ ప్రారంభ మైనది అంటే నేను దేహంలో ఉన్నాను. నాకు బయట ప్రపంచం ఉంది అనుకోవటం వల్లనే. సృష్టిని దాటి బయటకి రావాలి అంటే నీకు పవిత్రత కావాలి. ఈ ప్రయత్నంలో నీవు ఆవలి ఒడ్డుకు వెళ్లే వరకూ విసుగు లేకుండా ప్రేమగా సాగాలి. లేదా విషయ వాసనలు అనే దొంగలు నిన్ను బయటకి తీసుకొని

srinannagaru.com

వచ్చేస్తాయి. ఈ దొంగలు నీ సొమ్మును దొంగిలించుకొని పోతారు. నీళ్ళు పడే వరకూ బావిని తవ్వుతూనే ఉండాలి. ఈ ప్రయత్నంలో నీకు చెడు సావాసాల వాళ్ళు దొరికితే నీ పని "అంతే". నీకు సత్‌పురుషుల సహవాసము కావాలి. నీవు వివేకంగా ఉంటే మనస్సు అనే దొంగ నశిస్తుంది. లేదా పారిపోతుంది. ఎవరైనా మనకు ప్రేమతో ఇస్తే మనం గౌరవంగా స్వీకరించటం వివేకం. మీరు గుళ్ళో అభిషేకం చేసి ధ్యానం చెయ్యటమే సాధన కాదు. మీ దైనందిన జీవితంలో ఆత్మానుభవానికి ఎంత వరకూ మన ప్రయత్నం సహకరిస్తున్నదని పరిశీలన చేసుకోవాలి. నీ వృత్తి నీ జ్ఞానానుభవానికి సహాయకారి కావాలి, వ్యతిరేకంగా పని జరగకూడదు. ఏపనిలోనైనా నీకు నిగ్రహం కావాలి. కంగారు ఆత్రుత కలిగితే, నీకు రజోగుణం కలుగుతుంది. నీ మనస్సు కలుషితమౌతుంది. నీ మనస్సును నీవు స్వాధీనం చేసుకొంటే ఎవ్వరూ చెయ్యలేని ఉపకారం నీ మనస్సు నీకు చేస్తుంది.

52. ఎవరైనా దుఃఖ పడుతూ ఉంటే, ఆ కష్టం మనదే అని అనుకొంటే వాడే నిజమైన భక్తుడు. బొట్లు పెట్టుకొన్నవారికి బొట్లే మిగులుతాయి. తన అస్తిత్వం దేహానికే పరిమితమైనవాడు నిరాకారుడైన భగవంతుని ఆరాధించలేడు. రాగ-ద్వేషాలు లేకుండా, ధర్మ బుద్ధితో ఏ పనినైనా చెయ్యి. రాగ-ద్వేషాలతో చేస్తే నీ మెడకు ఇనుప సంకెళ్ళు తగిలించుకొన్నట్లే. ఏ విషయాలలో మనం ఆకర్షితులము అవుతున్నామో వాటికి బలం లేదు. కాని దానికి బలం ఉంటుంది అని ఆనందం ఉందని అనుకోవటం వలననే దానికి బలం మనంతట మనమే ఇస్తున్నాము. మనకున్న వాసనల మీద ఉన్న విశ్వాసం, ఈశ్వరుని మీద లేదు. రాగం వలన ఆకర్షణ పుడుతుంది. అది సత్‌పురుషులతో సహవాసం చేస్తే ఆ ఆకర్షణ పోతుంది. ఆకారాలు వికారాలను తీసుకొని వస్తాయి. చిన్న కారులో ప్రయాణం చేసిన వాడు ఒంటెద్దు బండిమీద ప్రయాణం ఎప్పుడు చేద్దాము అని అనుకోడు. ముక్తి సుఖం పొందిన తరువాత, విషయ సుఖాలు, ఇంద్రియ సుఖాలు ఆశించరు. శివుని అనుగ్రహం ఉంది కాని ఆయన అనుగ్రహం పొందే అర్హత నీవు సంపాదించుకోలేకపోతున్నావు. మనం నీతి మార్గంలో ప్రయాణం చెయ్యాలి. మౌనం వలన కలహం తగ్గుతుంది. మనం విమర్శించి ఎవ్వరినీ బాగుచెయ్యలేము. సలహా రూపంలో ఎడ్యుకేట్ చేసేలా ఉండాలి. అది కూడా స్వీట్‌గా, షార్టుగా ఉండాలి. అందరిలోనూ మంచిని చూస్తే మనం మంచి వారమైపోతాము. అందరిలోనూ చెడ్డను చూస్తూ ఉంటే మనం చెడ్డ వాళ్ళమై పోతాము. ముఖ స్తుతి వలన మీకు మనో వికారం రాకూడదు. అలా వస్తే

srinannagaru.com

అహంకారం ముస్తాబు అవుతుంది. భగవంతుడు ఎవరినో గిల్లి మీ ముఖస్థితిని పాడుచెయ్యాలని చూస్తాడు. నీవు అప్పడు నిగ్రహంగా ఉంటే సత్యం నిన్ను వరిస్తుంది.

53. మీ సాధన ఎలా అంటే, మీరు ఏకాంత వాసంలో ఉంటే మీ బలహీనతలు ఏమిటో మీకు తెలుస్తాయి, ఆ బలహీనతలను బయటికి తీసి కాల్చి మట్టుపెట్టాలి. అదే సాధన, భగవాన్ అన్నారు "నీవు చైతన్యానివి, నీవు కాని నీ దేహానికి పరిమితి చేసుకొన్నావు దాన్ని ఆపు". అదే సాధన యొక్క ప్రయోజనం. గౌరవాన్ని నీవు ఆశిస్తూ ఉంటే అది పిచ్చివాడు, బలహీనుడు అని అర్థం. అందరి చేత మంచి అనిపించుకోవాలనే తలంపు వలన కూడా మనస్సు బాహ్య ముఖానికి వెళ్ళిపోతుంది. అలవాట్లలోంచి బలహీనతలలోంచి బయటికి వస్తే అసలు వస్తువు నీకు వ్యక్తమౌతుంది. భౌతికం వేరు, ఆధ్యాత్మికం వేరు చేస్తారు. దాని వలన అసలు వస్తువుకు దూరమౌతారు. పూజ గదిలో ఒకరకంగాను బయట ఒక రకంగాను ఉంటాము. సత్యం ఒకటిగానే ఉంది. మనం సహజంగానే ఉండాలి. రెండు జంతువులు దెబ్బలాడుకొంటూ ఉంటే షిర్డీబాబా అనేవారు "ఈ దెబ్బలాట ఇప్పటిదికాదు, ఐదు జన్మల నుంచి వస్తున్నది" అన్నారు. మిమ్ములను ఎవరైనా శత్రువులుగా చూస్తే బాధలేదు. మీరు మాత్రం ఎవరినీ శత్రువులుగా చూడకండి. చూస్తే ఆ శత్రువులను తరువాత జన్మలో మీ కొంపలోనే పుట్టించి మిమ్ములను దెబ్బలాడుకొనేటట్లు చేయిస్తాడు ఈశ్వరుడు. వాల్మీకి అన్నారు "చెట్టు చివారు కొమ్మకు వెళ్ళి సుఖంగా నిద్రపోదామని అనుకోవటం ఎటువంటిదో, జీవ లక్షణాలను దాటకుండా ఆత్మ సుఖాన్ని పొందాలి అనుకోవటం కూడా అటువంటిదే" భగవంతుడు ఒక్కొక్కసారి నీ దేహాభిమానం పరిక్షించటానికి "నీవు ఎంత మంచి మాట మాట్లాడాలని అనుకొన్నా, ఎంత మంచి పనులు చేసినా, ఎదుటివాళ్ళు పొగిడే పరిస్థితి వచ్చినా నీవు మాట్లాడనివ్వకుండా నీ నోరు నొక్కే పరిస్థితి కల్పిస్తాడు. అప్పడు మన బండారం బయట పడుతుంది.

54. చేతితో చేసే కర్మను శ్రద్ధగా చేస్తూ, మనస్సుతో గురువును సదా స్మరించుకొంటూ ఉంటే మీకు జ్ఞానం కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించటంలో అశ్రద్ధ పనికిరాదు. ఇతరుల దర్మాన్ని నీవు ఆలోచించకు, నీ ధర్మాన్ని నీవు ఆచరించటం ముఖ్యం. గౌరవించవలసిన ఆత్మపై దృష్టిలేదు, గౌరవించని శరీర విషయాలపై గౌరవాన్ని చూపుతున్నారు. ఇదే సాధకుడు చేసే పొరపాటు. "విషం చూస్తే చనిపోము. నోట్లో వేసుకొంటేనే చనిపోతాము. కాని విషయాలు చూస్తే చాలు చెడిపోతాము" అన్నారు వివేకానంద. సాధన చేసేటప్పుడు అనేక పరీక్షలు

srinannagaru.com

వస్తాయి. ఎవరైనా మిమ్ములను తిడితే మీ మనస్సు బహిర్ముఖమౌతుంది. సాధకునికి ఓరుపు ఉండాలి. మనస్సుకు నిర్మలత్వం వస్తే గైడెన్సు మనస్సు లోపల నుంచే వస్తుంది. సోమరితనం ఉన్నవానికి జీవితమే గడవదు ఇంకా ఆత్మజ్ఞానం ఎలా కుదురుతుంది. దేహంలేని వానికి రోగం ఏమిటి? అహంకారం లేని వానికి సాధన ఏమిటి? బండతనంగా సాధన చెయ్యటంకాదు. ధ్యానించేది అహంకారమే దాన్ని గ్రహించండి. మీరు అహంకారానికి జీవితం పొడుగునా ప్రాముఖ్యత ఇస్తున్నారు. "నేను" అనే తలంపు ఒక సముద్రము. ఇది గతాన్ని భవిష్యత్తుని గురించి ఆలోచిస్తూ ఉంటుంది. గాఢనిద్రలో మీరు ఏదిగా ఉన్నారో దాన్ని మర్చిపోయారు. లేనిదాని మీద గౌరవం పెంచుకొంటున్నారు. నీవు ఆత్మ గురించి ప్రయత్నం చేస్తూ ఉంటే శక్తి దానిలో నుంచే వస్తుంది. ఆత్మ శక్తి లేనిది కాదు. గాఢనిద్రలోని స్థితిని ఎరుకలోకి తెచ్చుకో. స్వంతబలం ఉన్నవాడు ఎదుటి మనిషి విమర్శలకు కంగారు పడడు. గతించిన కాలం గతించినదే. దాని వలన వర్తమానం పాడౌతుంది. అలాగే భవిష్యత్తును గురించి ఆలోచించకూడదు. రాగ ద్వేషాలు ఎంత తగ్గించుకొంటే అంత లోతుకు వెడతావు. ఎంత పెంచుకొంటే అంత బాహ్యముఖానికి వెడతావు.

55. విక్షేప దోషం అంటే శరీరం ఉన్నచోట మనస్సు ఉండదు. ఎక్కడో తిరుగుతూ ఉంటుంది. పుస్తకం తీసినా అందులో నిలబడదు ఎక్కడికెక్కడికో వెళుతుంది. దానికి పరమేశ్వరుని నిరంతరం ప్రీతిగా స్మరించటం వలన మనస్సులో దోషాలు నశిస్తాయి. చాలామంది మనుషులు యాక్షన్ వలన మాట్లాడుతారు. అది మనస్సు యొక్క వికారం. వేరు బుద్ధి చివరిది కాదు. చివరి వస్తువు చేరటానికి వేరు బుద్ధి నశించాలి. గాంధీజీకి గ్రౌండ్ రియాలిటీస్ బాగా తెలుసు. ఆలోచించి మాట్లాడుతారు. ఆ మాటలు సమగ్రంగా హితవుగా ఉంటాయి. మీకు 105 డిగ్రీలు జ్వరం ఉంది అనుకోండి నాకు జ్వరం లేదు అనుకోవటం తెలివి తక్కువ తనం. దానికి పత్యం చేసి, మందు వేసుకొని తగ్గించుకోవాలి అలాగే నేను బ్రహ్మమును, నేను బ్రహ్మమును అనుకొని, ఎవరైనా నీవు నల్లగా ఉన్నావు అంటే ఉద్రేకపడితే నీవు బ్రహ్మము ఎలా అవుతావు. రోడ్డు మీద వెళుతూ ఉంటే ముళ్ళ కంప తగిలితే దానికి దూరంగా, ఒక ప్రక్కగా వెళతావు అలాగే నీ ఆధ్యాత్మిక ప్రయాణంలో అహంకారమనే ముళ్ళ కంపను ప్రక్కకు పెడితే అప్పుడు నీ ప్రయాణం సుగమమౌతుంది. లేదా మరో మార్గం ఉంది. "నేను" అనేది మీకు తెలుస్తున్నది కదా! దాన్ని పట్టుకొని దాని మూలంలోకి వెళ్ళు. అది నిజమైన దారి మధ్యవర్తులతో పనిలేదు. అజ్ఞానం "నేను" రూపంలో ఉంది.

srinannagaru.com

అది తీసివేస్తే నీవు (ఆత్మగా) మిగులుతావు. ఇల్లు కాలిపోతే ఇంట్లో ఉన్న ఎలుకలు అన్నీ చనిపోతాయి. మనస్సు నశిస్తే కోరికలు కూడా నశిస్తాయి. బాగా ధనమున్నవారిని "మీరు బాగా ధనవంతులు" అంటే వారి అహంకారం ఉబ్బుతుంది. వారు తినేది మనం తినేది ఒకటే. విచారణ వలన బుద్ధి సూక్ష్మమౌతుంది. మనలను ఎవరైనా విమర్శించినా, పొగిడినా వాళ్ళు ఎందుకు అలా అంటున్నారు అని సూక్ష్మదృష్టితో ఉంటే నీకు తెలుస్తుంది నిజ స్థితి.

**56.** మీ జీవితంలో ఏదో కాలంలో కొంత శాంతి, సుఖం పొందవచ్చును. అవి మరలా రమ్మనమంటే రాదు. కాని ఏది శాశ్వతమో దాని శాంతిని పొందాలనే కాంక్ష, హృదయంలో ఉండాలి. పట్టుదల కావాలి. ప్రయత్నంలో ఉన్నది సాధన. ప్రయత్నం లేని స్థితి సమాధి. నీకు దుష్ట ఆలోచన వస్తూ ఉంటే నెమ్మదిగా తొలగించుకోవటానికి ప్రయత్నం చేయటం కూడా ధ్యానమే. "ఆలోచన ఉన్నతం, జీవితం సామాన్యం" అనేది షిర్డిసాయిబాబా నుంచి నేర్చుకోవాలి. సాత్త్విక బుద్ధి, సాత్త్విక నడక బ్రహ్మానుభవాన్ని కలుగజేస్తుంది. కామ, క్రోధ, లోభాలనే పెద్ద గేట్లు ద్వారా నరకానికి వెళ్లిపోవచ్చు. తొక్కిసలాట పడవలసిన పని లేకుండా విశాలంగా ఏర్పాట్లు జరిగిపోయాయి. ఎవరికైనా సహాయం చేస్తే పూజ చేసాను అనుకొంటే నీ మనస్సు చల్లబడుతుంది. సహాయం చేసాను అనుకొంటే అహంకారం పెరిగి పోతుంది. ఒకేసారి నీవు గుణాతీతుడవు కాలేవు. నెమ్మది నెమ్మదిగా ప్రయత్నం చెయ్యాలి. గుర్రానికి గంతలు ఎందుకు కడతారు అంటే నిదానంగా నడవటానికి అలాగే జపం ఎందుకంటే మనస్సును నిదానంగా ఉంచటానికి. ఆత్మస్తుతి, పర నిందల వలన గత జన్మలలో చేసుకొన్న పుణ్యం ఏదైనా ఉంటే అది కూడాపోతుంది. ఏవైతే నీవు పోగుచేసుకొన్నావో అంటే సంస్కారాలు ఉన్నాయో వాటిని పోగొట్టుకోవటమే సాధన. మీ గురించి మీకు సహజంగా ఉన్న మంచి లక్షణాలు ఎన్ని ఉన్నాయో చెడ్డ లక్షణాలు ఎన్ని ఉన్నాయో అంచనా వేసుకోవాలి. లేనివి ఉ న్నాయి అనుకొన్నా, ఉన్నవి లేవు అనుకొన్నా ప్రమాదమే. అవినయం ఉంటే వాడు ఎంత? వీడు ఎంత? అనే మాటలు వస్తాయి. పరిశీలన ఉండాలి. వాళ్ల వలలో మనం పడకూడదు. చాలామందికి మెంటల్ కేసులకు వీక్ మైండే కారణం. మనస్సును నిరోధిస్తే అవినయం పోతుంది. పరిస్థితులపై మీకున్న అనుబంధం చెడిపోతే దుఃఖం వస్తుంది. జీవ లక్షణాలు పెరగటానికి కారణం జీవుడేగాని దేవుడు కాడు.

**57.** స్తుతి నిందలను నిప్పులో వేసినట్లు వేస్తే అది కూడా యజ్ఞమే. "భగవంతుని స్మరించుకొంటే చాలు, తరించటానికి మిగిలినవి అన్నీ కోతి చేష్టలే"

srinannagaru.com

అన్నారు శ్రీ కృష్ణ చైతన్యులు. మొదటే అద్వైతం అవలంభిస్తే ఉక్కిరిబిక్కిరి అవుతాము. ద్వైతంలో ప్రారంభించి, అద్వైత అనుభవం పొందాలి. ఎప్పుడూ హృదయంలో ఉన్న వానికి, రూప బుద్ధి, నామ బుద్ధి తగ్గుతుంది. శిరస్సులో ఉంటే అవి పెరిగిపోతాయి. మాటలను కూడా మనం అధిగమించి వెళ్ళాలి. పరమాత్మతో మానసిక అనుబంధం ముఖ్యం. మన దేహం ఎక్కడ ఉన్నా పరవా లేదు. మనస్సు పరమాత్మ మీద ఉండాలి. మనం ఆకాశాన్ని, సముద్రాణ్ణి చూస్తే మనస్సు విశాలమౌతుంది. ఆకారాల మీద ఆకర్షణ ఉన్నవానికి "అహంకారం" పెరుగుతుంది. బంధించేవి నామరూపాలు. వాటినుండి విడుదల పొందితేనే కాని మమకారం నశించదు. మమకారం నశిస్తేనేగాని శాంతి లభించదు. చనిపోయే దాకా మనం ఎక్కడ ఉన్నా, ఏం చేస్తూ ఉన్నా అహంకారం ముస్తాబు చేసుకోవటంతోనే సరిపోతున్నది. అంటే అది దివాళాకోరుతనం. ఇంట్లో వారు అంతా ఒకచోట పుట్టవచ్చు కర్మఫలాలు వేరు, వేరుగా ఉంటాయి. "భయం" ఉన్నచోట జీవుడికి దుఃఖం ప్రారంభమౌతుంది. మంచితనం అనేది వివేకానికి సంబంధించినది. నేను ఫలానా అనుకోవటం అహంకారం. మీ గురించి మీరు ఏమి అనుకొన్నా నిజంకాదు. తండ్రులు, తాతలు, గొప్పలు కావు. "చచ్చిన వాడి కళ్ళు చారెడు" అన్నట్లు వారు చేసిన పొరపాట్లను గుర్తించి దాన్ని అధిగమించాలి. మమకారం తగ్గే కొలది హృదయంలో ఉన్న ఆనందం అందుతూ ఉంటుంది. మహా మేధావులు ఒక కాలు తీసి ఒక కాలు వేస్తూ ఉంటే, చీకటిగా ఉంది. పాము పుట్రా ఉంటాయి, బురద అని ఆలోచిస్తూ ఉంటారు. తలంపుల విషయం లో ఎంతో జాగ్రత్తగా ఉండాలనే విషయంలో ఆలోచించరు.

**58.** సత్తరువులోకి జనం వస్తూ ఉంటారు, వెళుతూ ఉంటారు. అలాగే మన తలకాయలోకి కూడా తలంపులు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. చివరి దశలో మీకు ఏది బాగా ఇష్టమో ఆ తలంపును మీ హృదయం పట్టుకొంటుంది. మీ సాధనలో మీరు అభివృద్ధిలోకి రావాలంటే ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోండి. మీకు ఎవరు బాగా విరోధులుగా ఉంటారో వారిని మీరు మర్చిపోకపోతే మీకు వారు పది జన్మల కాలాన్ని తీసుకొంటారు కారణం ప్రతీకార తలంపు ఫలితం అది. లోకవాసన, శాస్త్రవాసన, దేహ వాసన, ఒక్కొక్కటే ఒక్కొక్క జాన దూరంలో ఉంది. ఈ మూడు జానలు దాటితో భగవంతునిలో పడిపోతాము. దానికి వైరాగ్యం కావాలి. వైరాగ్యం ఒక మానసిక స్థితి. చైతన్య స్థితిని నీవు మర్చిపోవటం వల్లనే నీవు బంధంలో పడ్డావు. మూల తలంపే నీవు అనుకొంటున్నావు. దాన్ని తొలగించుకోవాలి. చిన్న చిన్న తలంపులతో ఇరుకుగా

srinannagaru.com

గల వాళ్లకు అది సాధ్యం కాదు. నీ బెంగకు కారణం నీవు ఆత్మగా ఉండలేక పోతున్నావు. నీవు మనస్సుగా ఉంటున్నావు, అదే కారణం. ఆత్మ విచారణ వదిలితే లోక విచారణలో పడిపోతావు. బెంగలు అణచటానికి, బెంగల్లోంచి పారిపోవటానికి ప్రయత్నించకు. ధ్యానం పూజ వంటి టెంపరరీ పనులు మనకు వద్దు. బెంగ ఎందుకు వస్తున్నది అని డైరెక్టుగా ఫేస్ చెయ్యి. ఇంట్లో సొమ్ము పోయినా, ఇంట్లో వ్యక్తులు పోయినా ఆ సొమ్ము నాది. వారు నావారు అనేదే బెంగకు కారణం. అది మనో పరిధిలోనిది. నీవు ఆత్మవు.

59. ఒక వస్తువును ఎంజాయ్ చెయ్యటంవలన అందులోంచి బయట పడలేవు. దాన్ని తిరస్కరించటం వల్లనే ఆ వాసన నుంచి బయట పడగలవు. స్వరూపానందం కన్న విషయానందం లోంచి వచ్చిన ఆనందం, దుఃఖంగా మారిపోతుంది. శాస్త్ర పాండిత్యం నిజమనుకొని మురిసిపోతే నీ గాఢ నిద్రలో ఆ శాస్త్ర పాండిత్యం ఏమైనది? అదినిజం కాదు కాబట్టి. అవి పంచకోశాలకు బయట ఉన్నాయి. కర్మ చేసినవాడికి భోగం మీద, భక్తుడికి మోక్షం మీద అభిమానం ఉంటుంది. తత్త్వ దర్శికి ఏరకమైన అభిరుచి ఉండదు. అంతవరకూ ఈ ముడులు తప్పవు. మానవుడు బాగుపడటానికి త్యాగం ఒక్కటే చాలదు. యోగం కూడా కావాలి. త్యాగం వలన బుద్ధి శుద్ధి అవుతుంది. యోగం వలన బుద్ధి సమానమౌతుంది. వైరాగ్యం ఉన్న వానికి అల్పబుద్ధి, స్వల్ప బుద్ధి ఉండదు. పని దొంగలకు "రేపు" ముఖ్యం. ఈరోజు ముఖ్యం కాదు. సాధన రేపు అంటే ఆరేపు రానేరాదు. అది కర్మ యోగి లక్షణం కాదు. గొరవాల చుట్టూ తిరిగితే బ్రహ్మ తెలియదు. లోపల ఉన్న సత్యం అనుకొంటుంది ఈ సాధకునకు మనమంటే ఇష్టం లేదు వాడి సాధన మజ్జిగ అన్నంలో పచ్చడి నంచుకొన్నట్లు ఉంటుంది. వాడు నాకు ఇష్టం, వీడు నాకు అయిష్టము అనేవే నిన్ను జన్మ సముద్రంలో ముంచేస్తాయి. సత్యం తెలియదు. సమానంగా చూడటం అలవాటు చేసుకోండి అజ్ఞానికే ఎలపడ, దాపడా అనేది ఉంటుంది. జ్ఞానికి బయటా లోపలా ఒకే రకంగా ఉంటుంది. మీకు అనుబంధాలు ఉంటే ధ్యానం కుదరదు. ఏ అనుబంధం గురించీ అదే పనిగా గుర్తుకువస్తూ ఉంటే అది ధ్యానానికి కష్టమౌతుంది. నేను తెల్లవారుజామున 4 గంటలకు లేస్తున్నాను. నేను చపాతి తింటున్నాను అంటుంది ఈ నేను. మీరు ఏమార్గంలో ప్రయాణం చేస్తున్నా "నేను" ఉంటుంది. ఈ "నేను"ను మీరు మర్చిపోవటం లేదు. అందుకనే గమ్యాన్ని గురించి నిరంతరం గుర్తుచేసుకొని "నేను"ను ప్రయోజనం లేకుండా చూచుకోవాలి. సాధనచేసేవాణ్ణి తీసివెయ్యాలి. చూచేవాణ్ణి తీసివేస్తే చూడబడేది లేదు.

srinannagaru.com

60. ఎవరైనా మనలను విమర్శిస్తున్నారు అనుకొంటే వారి జైలులో పడిపోయినట్లే. శత్రుత్వం మనస్సును బాహ్య ముఖంచేసేస్తుంది. క్షమించటం వలన మాత్రమే ఆశత్రువు జైలు లోంచి బయటపడగలం. సాత్విక బుద్ధి వల్లనే సత్యం తెలుస్తుంది. అద్వైత భావన అనుభవంలో ఉండాలి వ్యవహారాలలో అద్వైత భావన ఉండకూడదు. గురువు పట్ల అద్వైత భావన ఉండకూడదు. కర్మలు ఖర్చు అయ్యేవరకూ మూలతలంపు మూలంలోకి వెళ్ళలేము. నీ కర్మానుభవం పూర్తి అయ్యేవరకూ శరీరం "నేను" అని అనుకొంటూనే ఉంటావు. అమృతానుభవం కలిగే వరకూ తలంపుల ఆగవు. మనం మాట మాట్లాడేడప్పుడు ఈ మాట ఎక్కడికి తీసుకొని వెళుతుందో గ్రహింపు ఉండాలి. తన కోసమే తను బ్రతికేవాడు చచ్చిన వాడితో సమానం. త్యాగం వల్ల బలం వస్తుంది. గాంధీజీయే దానికి ఉదాహరణ. ఆ మనిషిని అణచాలన్నా అణచలేము. అది త్యాగబలం. నీ వెనకాలే దేవుడు ఉన్నాడు. కోట్లాది జన్మల నుంచి నీకు ముందు చూపే గాని లోచూపు లేదు. దాని వలన వాడు లేడు అనుకొంటున్నావు. రమణ మహర్షి మాటలు మనకు అందవు. అర్థంకావు. ఆదేహాన్ని ప్రేమగా చూస్తే చాలు మనం గమ్యానికి చేరుతాము. చూడటం వలన నష్టంలేదు. మనం శరీరాన్ని వాడేడప్పుడు శరీరం భయపడదు, ఈ శరీరం నాది అనుకొనే "నేను"కే భయమేస్తుంది. మనం హృదయాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తే అన్ని సహజంగానే ఉంటాయి. మన ఆలోచన, చేత, మాట సహజంగా ఉండటంలేదు. ఉపాసన చెయ్యగా చెయ్యగా గాలి లేనిచోట దీపం ఎలా ప్రకాశిస్తుందో మీ మనస్సు నిర్మలమౌతుంది. ఆ నిశ్చలత్వం కలిగితే ప్రారబ్ధ రీత్యా ఏవైనా అడ్డంకులు కలిగినా మనస్సు వాటిని గెంటుకుంటూ హృదయాభిముఖంగా ప్రయాణమౌతుంది.

61. మనం ఏ దూర ప్రాంతానికో విమానంలో వెళ్ళి తిరిగి ఇంటికి చేరుకొన్నప్పుడు "అమ్మయ్య" ఇంటికి చేరుకొన్నాము అనుకొంటాము. అలాగే మన మనస్సు హృదయానికి చేరితే అప్పుడు అనుకొంటాము "అమ్మయ్య" ఎన్ని జన్మలలో ఎన్నో కష్టాలు పొందాము. ఎంత బాధపడ్డాము అన్నీ తీరిపోయాయి అనుకొంటాము. రాత్రి వెళ్ళిన తరువాత పగలు వస్తుంది. అవి ఏ ఒక్కటి నిలవవు. తిరుగుతూనే ఉంటాయి. అలాగే కష్టాలు, సుఖాలు జీవితంలో వస్తాయి అవి నిలవవు. నది ఎన్ని వంకర్లు తిరిగినా ఆగకుండా ఎలా వేగంగా వెళ్ళిపోతుందో, అలాగే కష్ట సుఖాలను చూచి ఆగకు, గమ్యాన్ని మర్చిపోకూడదు. సాధన మర్చిపోకూడదు. ఈశ్వర సంకల్పమే నా సంకల్పం అనుకొంటే ఆయనే మిగులుతాడు. మనం ఉండము. మన క్షనే ఆనందంగా మారిపోతుంది అని గ్రహిస్తే

srinannagaru.com

నీకు సద్గతి ప్రాప్తమౌతుంది. ఈశ్వరునికి శరణాగతి చెందటం వలన నీ అహంకారంలో ఉన్న దుమ్ము అంతా తీసిపారేస్తాడు. రాముడు ఎన్ని కష్టాలు పడ్డా ఎప్పడూ నిర్మలంగానే ఉన్నాడు. వేరు బుద్ధిని తొలగించుకోవాలనే ప్రయత్నమే సాధన. "నేను" అనే తలంపు చైతన్య సాగరంలోంచే వచ్చింది. బుడగ కూడా సముద్రములోనిదే. అది పగిలితే అఖండ సముద్రమౌతుంది. నేనుపోతే మీరు చైతన్య సాగరమౌతారు. చేప ముల్లు గొంతుకునకు గుచ్చుకొని అడ్డుపడినట్లే నీవు కర్మ-యోగ మార్గంలో ప్రయాణం చేసినా "నేను" అనే ముల్లులాంటి తలంపు నీ గమ్యానికి అడ్డు వస్తుంది. దాన్ని నీవు వివేకంతో తొలగించుకోవాలి. "ఈ కష్టాలు నాకు ఎలా కలిగినవి" అని అనుకొనే వాడు శరణాగతి చెందిన వాడు కాదు. భగవాన్ అన్నారు "జీవుడు నీ సొత్తు అనుకొంటూ దాన్ని ఈశ్వరునికి ఇచ్చేస్తాను అని అనుకొంటున్నావు కాని అది కూడా ఆయనదే. వాడిది, వాడికి ఇయ్యటానికి నీకు నష్టం ఏమిటి? పైగా లాభం కూడా" అన్నారు.

62. దమ్ము చెయ్యకుండా ఊడ్చిన చేను వలన ఏ ప్రయోజనంఉండదు. దమ్ము చేయటం అంటే సత్పురుషుల వాక్యాలను నిరంతరం స్మరించుకోవటమే దాని వలన ఆధ్యాత్మిక పురోభివృద్ధి జరుగుతుంది. ఎదుటి వాడు గౌరవంగా ఇచ్చినది పుచ్చుకో లేదా అహంకారం పెరుగుతుంది. ఇచ్చేవాళ్ళ ఫీలింగ్‌ని గ్రహించి తీసుకోవాలి. ఒక తలంపుకు, ఒక తలంపుకూ మధ్య విరామ సమయంఉంటుంది. అది కొద్ది టైమే దానిని పట్టుకోండి హృదయ గృహంలోనికి వెళ్ళిపోతారు. ఇద్దరు మొద్దులు దెబ్బలాడుకొంటున్నారు అనుకోండి కొంత సమయానికి ఎవరో ఒకరు అలసట చెందుతారు వాడిని మరియొకడు అణగదొక్కివేస్తాడు. అలాగే నీవు సాదన చేసేటప్పుడు నీ మనస్సులో వాసనలు విజృంభిస్తున్నప్పడు, నీ సాధనాబలం ముందు నీ వాసనలు అలసట చెందినప్పడు నీ సాధన జయప్రదమౌతుంది. ఇది రహస్యం. నీవు పది సంవత్సరాలు సంపాదించినది పేకాటలో అంతా పోగొట్టు కోవటం ఎలాంటిదో నీవు పది సంవత్సరాలు గురువును ప్రార్థించి అనుసరించి పొందిన సంపదను గురువును, ఈశ్వరుని ఒక్కరోజు ద్వేషిస్తే నీ పది సంవత్సరాల సాధనా అనుగ్రహం అంతా పోతుంది. మీరు మీదేహాభిమానాన్ని పోగొట్టుకోవ టానికి సాధన చేస్తున్నారు. అదే కాలంలో మీ దేహాభిమానాన్ని పోగొట్టటానికే ఈశ్వరుడు ఇతరులచే మిమ్ములను విమర్శింపచేస్తాడు, దూషింపచేస్తాడు. దాని వలన మీకు తెలియకుండానే మీ దేహాభిమానాన్ని ఆయన పోగొడతున్నాడు. దాని వలన మీకు మేలే జరుగుతుంది. అది గ్రహిస్తే సాధన విజయం వైపు వెళు తుంది. మీ విరోధులకు ఏదైనా చెడ్డ జరుగుతున్నప్పడు మీకు సంతోషం కలిగితే

srinannagaru.com

ఆ చెడ్డను ఈశ్వరుడు భవిష్యత్ జన్మలలో మీకు అనుసంధానం చేస్తాడు. మీకు ఏదైనా చెడు తలంపు వస్తూ ఉంటే అది మిమ్ములను బంధిస్తుంది.

63. మీరు మాట్లాడే మాటలు మీ మనస్సుకు బలం చేకూర్చకూడదు. కొందరు మాట్లాడుతూ ఉంటే మనస్సు లేదనిపిస్తుంది. వాళ్ళ ప్రవర్తన చూస్తే వాళ్ళు పూజ చేయనక్కరలేదు అనిపిస్తుంది. చాలామందిలో అవినయం ఎక్కువగా ఉంటుంది. వాళ్ళు ఎంత సాధన చేసినా గానుగు ఎద్దుగానే ఉంటారు. అంటే వారు సాధన ఎక్కడ మొదలు పెట్టారో అక్కడే ఉంటారు. ఎదుటి మనిషిలో మంచి ఉంటే చూడాలి, ఆచరించాలి. చెడ్డ ఉంటే దాన్ని చూడకూడదు. ఎగిరి ఎగిరి పడేవాడికి రజోగుణం పెరుగుతుంది. అణిగి అణిగి ఉన్నవాడికి సత్త్వగుణం పెరుగుతుంది. దారిన పోయే వాడితో తగువు వస్తే మనం బాధపడం. ఇంట్లో వారితో తగువు వస్తే బాధపడతాము. కారణం అనుబంధం వలన దుఃఖం వస్తుంది. ఇష్టం-అయిష్టం లేకుండా పనిచేసే బుద్ధికి యోగ బుద్ధి కలుగుతుంది. దాని వలన అంతర్ దృష్టి కలుగుతుంది. మన పని మనం ఇష్టంగా చెయ్యకపోతే వెనక్కి వస్తుంది. కాని మనస్సు లోపలికి వెళ్ళదు. గౌరవంతో తాదాత్మ్యం పొందేవాడు అగౌరవం వస్తే దుఃఖం వస్తుంది. తాదాత్మ్యం లేకపోతే దున్నపోతు మీద ఈగ వాలినట్లు ఉంటుంది. నీ తలంపులు అంత తేలికగా పోవు. నీవు వంద జన్మల నుంచి వాటిని మంచివని పెంచి పోషించుకొంటున్నావు. ఒక్కసారి అవి చెడ్డవని ప్రయత్నం చేసి విరమించుకోవటం అంత తేలికకాదు. కొంత సమయం పడుతుంది. దానికి గురు అనుగ్రహం కూడా కావాలి. అది కష్టమని అనుకోవటం కూడా తలంపే. వాటికి అలవాటు పడిపోయావు. నీవు కాని దానితో నీవు తాదాత్మ్యం చెందినంతకాలం, ఎన్ని జన్మలు ఎత్తినా ఎంత సాదన చేసినా అది దుఃఖానికి కారణమౌతుంది. నీ ఇంట్లో వారు మంచివారు అనుకోండి దాన్ని పదిసార్లు అనుకోవటం వలన గర్వం వచ్చేస్తుంది. మీకు గర్వం రావటానికి పదికోట్లు అక్కరలేదు. ప్రతిదీ ఊహించుకోవటం వలన గర్వం వస్తుంది.

64. సత్త్వగుణం ఉన్నవానికి "యాక్షన్" ఉంటుంది. గాని "రియాక్షన్" ఉండదు. "బహుజన్మల కృషి ఫలితంగా గాని మోక్షం రాదు" అన్నారు కృష్ణుడు. మోక్షం మాట అలా ఉంచండి కనీసం సత్త్వగుణం కూడా రాదు. ఈశ్వరుడు సంతోషించే పని రజోగుణం ఉన్నవాడు చెయ్యడు. సత్త్వగుణం ఉన్నవాడు యూనివర్సల్‌గా చేస్తాడు. తమోగుణం ఉన్నవాడు ఏమీ చెయ్యడు. రజోగుణం ఉన్నవాడు దేవుడితో వ్యాపారం చేస్తాడు. సత్త్వ గుణం ఉన్నవాడు భగవంతునితో

srinannagaru.com

ఇలా అంటాడు "నీ అనుగ్రహం ఉంటే చాలు. ఏమీ అక్కరలేదు" అని. శారదా మాత అనేవారు "సహనం, సమన్వయం ఉండాలి" పై రెండూ కావాలంటే సత్త్వగుణం కావాలి. కుటుంబంలో సహనంతో పాటు సమన్వయం చేకూర్చేవారు ఉంటే ఆ కుటుంబం "సుఖి" అవుతుంది. కల్మషం ఉన్న వాడి మాటకు చేతకు ఆలోచనకు పొంతన ఉండదు. అదే కొండ గుర్తు. లోకంలో ఏదీ లేదు అని గ్రహిస్తే మనస్సు ఎటూ పరుగెట్టదు. లోకం అంటే చెరుకు పిప్పి. కనిపించే రూపాలు అన్ని చెరుకు పిప్పే. నీవు అలా ఉండాలి. ఇలా ఉండాలి అని అనుకోకపోతే మోక్షం గూట్లో నీవు పడిపోతావు. నీవు నీవుగా ఉండవని అర్థం. ఎండలో ఏదో ఉందని అక్కడ ఏదో ఉందని అక్కడ ఒక అరగంట ఉంటే ఎండ "చుర్రు"మంటే మరల పందిరిలోకి వస్తాడు. అలాగే ప్రకృతిలో ఏదో ఉందని అక్కడకు వెళ్ళి అక్కడ దుఃఖమే అని తెలుసుకొని ఆత్మ సుఖాన్ని కోరుకొంటాడు. మీరు ఆత్మ గూటికి చేరే వరకూ, ఈ అసూయలు, ఈ కార్పణ్యాలు, వేదనలు, రోదనలు తప్పవు. సుఖం ఎక్కడో లేదు. నీలోనే ఉంది. ఈశ్వరుని మీద ఎంత గౌరవం ఉందో నీ ధ్యానం మీద కూడా అంత గౌరవంతో చెయ్యాలి. కారణం ధ్యానరూపంలో ఉన్నది కూడా ఈశ్వరుడే. దీనికి ప్రమాణం తైత్తరీయోపనిషత్తు "తపస్సు" అంటే బ్రహ్మమే అంది.

65. మనస్సు బయటికి వెళితే జడం. లోపలికి వెళితే చైతన్యం. శాంతి. మనస్సు బయటికి వెళితే అశాంతి, అహంకారం. లోపలికి వెళితే ఆత్మ. నీ దేహాన్ని మనస్సును ఎంతవరకూ సాధ్యమో అంతవరకూ ఆత్మ సాధన కోసం ఉపయోగించుకో. అంతకు మించి ఈ రెంటి వలన ఏ ప్రయోజనం లేదు. జీవునికి పనికిమాలిన అలవాటు ఏదైనా ఉంటే దానికి పరిష్కారం ఇది ఎక్కడ నుంచి వస్తున్నది అని చూచుకొన్నా అది పడిపోతుంది. స్వంత ఆలోచన ఉన్న వాడు, గట్టి మైండ్ కలవాడు. వాడే ఆత్మ అనుభవానికి సరిపోతాడు. ఆత్మానుభవానికి అడ్డదార్లు లేవు. కష్ట పడ్డవాడే బాగుపడతాడు. గాంధీజీ హృదయపూర్వకంగా పనిచేసేవారు. ఈ రోజున మనం వారి రూపాన్ని రూపాయల నోట్లు మీద చూచేలా ఈశ్వరుడు నిర్ణయించాడు. కర్మఫలం ఆశించని వారికే ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. వివేకం ఉన్నవానికి చదువు వస్తే బాగుపడతాడు. వివేకం లేని వాడికి చదువు వస్తే గర్వం వస్తుంది. అలాగే ధనం విషయంలో కూడా వివేకం ముఖ్యం. దాన్ని వదలిపెట్టకూడదు. నిరంతరం ఈశ్వర స్మరణ వలన వారి అనుగ్రహానికి పాత్రులౌతాము. నిరంతరం సద్గురువును స్మరించటం వలన నీ మనస్సు నశిస్తుంది. "మాయ"తో సంబంధం లేనివారు మహర్షులు అవుతారు.

srinannagaru.com

"మోహం" ఉన్నవానికి స్థూలబుద్ధి ఉంటుంది. లోచూపు రాదు. సత్యం తెలియదు. సత్త్వ గుణం ఉన్నవాడు ఆధ్యాత్మిక ప్రయాణంలో దూసుకొని పోతాడు. రజోగుణంఉన్న వానికి ఆధ్యాత్మిక ప్రయాణంలో అన్నీ ఆటంకాలే. మనం ఏ పనిచేసినా లాంఛనం కోసం చెయ్యకూడదు. సంతోషంతో చెయ్యాలి. విషయ చింతనచేస్తే పాముల క్రింద-పశువుల క్రింద పుట్టవచ్చు. ఆత్మ చింతన చేసేవారు ఆత్మను పొందుతారు. తలంపుకు అనుగుణంగానే మాట వస్తుంది. దానికి అనుగుణంగానే దేహం పనిచేస్తుంది. అందుచేత తలంపు విషయంలో జాగ్రత్త చాలా అవసరం.

66. నీరు పల్లానికి వెళ్ళునట్లు సహనం వలన మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణమౌతుంది. నీ దేవుని మీద నీకు ఎంత భక్తి ఉందో, బయట వ్యక్తుల దేవుళ్ళ మీద కూడా నీకు అదే భక్తి కావాలి. అంతేగాని మనస్సు ఇరుకుగా ఉండకూడదు. మనకు ఒక రూపాయి లాభం వస్తుంది. అంటే ఇతరులతో వందరూపాయలు నష్టం పెట్టి కూడా నిందించేవారు ఉన్నారు. అటువంటి ఇరుకు మనుషులు ఏమి చేస్తారు. శివుని కన్నా విష్ణువు గొప్పవాడు అంటారు. వేదంలో విష్ణువు గొప్పవాడా శివుడు గొప్పవాడా అని తేల్చుకోమని చెప్పలేదు. నీవు ఎవరివో తెలుసుకోమని చెప్పింది. నేను ఆత్మను అనే నిశ్చయ జ్ఞానంతో జీవించాలి. విషయ మనస్సు మలిన మనస్సు. అది ఎల్లప్పడూ బహిర్ముఖమై ఉంటుంది. అబద్ధానికి ఆనవాళ్ళు ఎక్కువ చెప్పాలి. నిజానికి (ఆత్మకు) ఆనవాళ్ళు అక్కరలేదు. మనం ఏదైతే కాదో దాన్ని బాగా జ్ఞాపకం పెట్టుకొంటాము. ఏదైతే అయి ఉన్నామో దాన్ని జ్ఞాపకం పెట్టుకో లేకపోతున్నాము. అదే "మాయ". లోకాన్ని, లోకంగా చూస్తున్నాము. వాసుదేవునిగా చూడలేకపోతున్నాము. అందుకే బంధం. మోహం కలుగుతున్నది. సత్యం కాని దాన్ని సత్యంగా చూడకుండా ఉండాలంటే వైరాగ్యమనే గొడ్డలితో అసత్యాన్ని నరకాలి. అప్పడుగాని నిజం తెలియదు. శరీరం శ్మశానానికి వెళ్ళే లోపల ఎన్ని చేదు అనుభవాలో అన్ని రానియ్యకుండా నీవు ఏమీ చెయ్యలేవు. కాని నీవు దానితో తాదాత్మ్యం పొందకుండా ఉండే స్వేచ్ఛ నీకు ఉంది. దాన్ని నీవు సంపాదించుకోవాలి. నీ గమ్యం నీవు మర్చిపోకు. కష్టానికి నీవు ప్రాణం పోస్తున్నావు కాబట్టి, కష్టంగా ఉంది. నీ మనస్సుకు ఏదో జ్ఞాపకం కావాలి అందుకు అరుణాచలాన్ని పట్టుకో. నీ మనస్సు ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టు. అసలు వస్తువు అయిన దానితో పరాకువద్దు. ఈ షికార్లను దృష్టిలో పెట్టుకొని అసలు వస్తువును మర్చిపోకు.

67. నీకు తూకం లేకపోతే ఎవరైనా మిమ్మలను గుర్తించలేకపోతే

srinannagaru.com

ఆందోళన వస్తుంది. తూకం ఉంటే గుర్తింపు లేకపోయినా కంగారు పడవు. నిర్మలంగా ఉంటావు. మనకు తెలివి లేదు అనుకోండి. ఆధ్యాత్మికంగానే కాదు భౌతికంగా ఉన్న అభివృద్ధిని కూడా నష్టపోతాము. భయం కూడా భావనే, వాడు ఏమనుకొంటాడో, వీడు ఏమనుకొంటాడో అనే వాడికే భయం. వ్యతిరేకంగా ఉన్న వానికే భయం. సబ్జక్టు మీద ఆలోచన ఉన్న వానికి "భయం" లేదు. మనస్సు చలనంగా ఉన్న వానికి ఎంత చదివినా చదువు రాదు. మనస్సు ఏకాగ్రత ఉన్న వానికి ఏమాత్రం చదివినా బాగా చదువు వస్తుంది. నీ మనస్సులో కామ-క్రోధాలు అనే వృత్తులు విజృంభించినప్పడు వాటిని, నిరోధించటమే యోగం. ఏకాగ్రత ఉన్నవానికే యోగం సిద్ధిస్తుంది. కొందరికి వాళ్లను వాళ్ళు పొగుడుకొనే బుద్ధి ఉంటుంది. దాని వలన వారికి అహంకారం పెరుగుతుంది. ఉన్నవాడికి ఉన్నదే దిక్కు. ఆస్తి ఉన్నవాడు అదే మనకు దిక్కు అనుకొంటాడు. ఏమీలేని వాడు అనుకొంటాడు "రక్షించే భగవంతుడు మనకు అండగా ఉన్నాడు ఆయనే మనకు దిక్కు" అనుకొంటాడు. మనకు అంతకన్న ఏమి కావాలి అని అనుకొంటాడు. భగవంతుడిని నమ్మినవాడు ఎన్నడూ చెడిపోడు. ఒక్కొక్కడు నోరు తెరిస్తేచాలు అన్ని అబద్ధాలే చెబుతాడు. వాడి దగ్గర మీరు కూర్చుంటే మీకు అశాంతి వచ్చేస్తుంది. వాడి అబద్ధాల ముందు మన సాధనా బలం హరించుకు పోతుంది. రోగాలు అన్నీ శరీరాన్ని అంటిపెట్టకొని ఉన్నాయి. అలాగే తలంపులు అన్నీ అహంకారాన్ని అంటిపెట్టుకొని ఉన్నాయి. ఆత్మకు చీము నెత్తురూ లేవు. రొంప లేదు. తలపోట్లు లేవు. మోకాళ్ళ నొప్పలు లేవు. దేహాన్నే ఆత్మగా భావించి వాటిని అన్నిటినీ నీకు ఆరోపించుకొని గోలతో ఉన్నావు నీవు ఆత్మవు.

68. ప్రపంచానికి అంతటికీ నీవు గొప్ప ఉపకారం చెయ్యాలని అనుకొంటే నీవు "ఆత్మగా ఉండిపో" ఆత్మకు చుట్టాలు లేరు. ఆత్మే నీవైతే తప్ప మార్గంలో ప్రయాణం చేసేవాళ్ళను నీవు నిజ మార్గంలో ఉంచగలవు. నీలో "దివ్యత్వం" ఉంది. ప్రాపంచిక చింతనలు లేకుండా మనస్సుతో దాన్నే నిండా నింపుకో, దాన్ని ఎప్పడూ మర్చిపోకు. మిమ్మలను ఎవరైనా అవమానిస్తే దాన్నిగుర్తుపెట్టుకొంటూ ఉండకు. కాని కొందరు అవమానం నిజం అనుకొంటారు. దివ్యత్వం (ఆత్మ)ను నిజమని అనుకోవటం లేదు. మనస్సు నిండా దైవత్వాన్ని నింపుకొంటే దుఃఖం ఏమిటి? వేదన ఏమిటి? కర్మ నీకు గుర్తులేనప్పడు కర్మఫలం నీకు ఎక్కడ గుర్తుకు వస్తుంది. ప్రకృతి గుణాలను దాటితే ఉన్న సత్యం ఒక్కటే. "లెక్కను" ఎక్కడ ఏ రకంగా చేసినా జవాబు ఒక్క రకంగానే ఉంటుంది. ఉదాహరణకు 6+3=9 అలాగే 3+6=9. బాగా రాయలేనివాళ్ళకే రూళ్ళ పుస్తకాలను

srinannagaru.com

ఉపయోగిస్తారు. రాస్తే వాటితో పనిలేదు. అలాగే అంతటా ఉన్న భగవంతుని దర్శించలేనప్పుడే ఏదో ఒక గుర్తుగా భగవంతునికి గుడి కట్టించి ఆరాధిస్తారు. మనస్సు బాహ్య ముఖమైతే అందులో పూర్వపు వాసనలు ఎన్ని ఉన్నాయో అన్ని నామరూపాలతోనూ, విషయ సుఖాలతోనూ, కీర్తి కాంక్షలతోనూ మనస్సు తాదాత్మ్యం చెందుతుంది. అంతర్ముఖమైన మనస్సు వలన శాంతి-సుఖాలు కలుగుతాయి. నీ మనస్సును ఎటు తిప్పాలో నీవే నిర్ణయించుకో. నీవు ఎంత సహజంగా స్నానం చేస్తావో అంత సహజంగా నీ గురువును ప్రేమిస్తే నీకు దైవానుగ్రహం కలుగుతుంది. రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు. అలాగే కృషి-కృపా కలిస్తేనే నీవు తరిస్తావు. పది నిమిషాలలో చేసే భోజనం పది గంటల శక్తిని ఇస్తుంది. అలాగే నీవు ఐదు నిమిషాల ధ్యానంలో నిజం, ఉంటే నీకు చాలా శక్తి వస్తుంది.

69. "నన్ను అవమానం చేస్తున్నారు. నన్ను స్తోత్రం చేస్తున్నారు" అనేవి అన్నీ మూలతలంపు పైన "నేను"కే వస్తున్నాయి. ఆ నేను లేనప్పుడు, స్తుతి, నిందలను అతిక్రమిస్తారు. కోపాన్ని నటించటం వలన ప్రమాదం లేదు. జ్ఞాని నటించినా ప్రమాదం లేదు. మూలతలంపు సందేహించినప్పుడే దాన్ని అంటిపెట్టుకొని ఉన్న అన్ని తలంపులూ ఉప సంహరించుకొంటాయి. మీ గురించి అందరూ గొప్పగా చెప్పకోవాలనే అనుకొంటే కీర్తి కాంక్ష, లోకవాసన బాగా ఉన్నట్లే లెఖ్క. బాగా చదువుకొన్నవారు అంటే సంతోషం వస్తూ ఉంటే లోకవాసన ఉన్నట్లే. నిజమైన సత్యాన్వేషకునకు ఆ దేవుడి నుంచి ఈ దేవునిలోకి ఆ మార్గం నుంచి ఈ మార్గంలోనికి ఇతరులను మార్చాలనే పిచ్చి ఆలోచనలు ఉండవు. చర్మ సౌందర్యం ఆకర్షిస్తున్నంతగా ఆత్మ సౌందర్యం ఆకర్షించటం లేదు. అందుకే గురువులు, భగవంతుడు నీకు వెయ్యి కళ్ళు ఇచ్చినా నీ హృదయ సౌందర్యాన్ని చూడలేవు. నరిసే మెహతా అంటారు "నీ ముక్కు సౌందర్యాన్ని చూచి నీవు మురిసిపోకు. నీ ముక్కును తయారుచేసినవాడు ఎంత అందంగా ఉంటాడో" అన్నారు. మనం పూజగదిలో భగవంతుని విష్ణు సహస్ర నామాలతో భట్రాజులలాగ పొగుడుతాము. కాని మనం కూడా అంతటా వ్యాపించిన ఆ పరమాత్మే అని అనుకోము. "వారు మంచివారు" అనేది, వ్యవహారిక సత్యము. పారమార్థిక సత్యం కాదు. గుణాలే గమ్యంకాదు. మంచి గుణాలు గమ్యాన్ని చేరుస్తాయి. ఇష్టంలేని తలంపులు వస్తూ ఉంటాయి. వాటిని నిరోధించకండి. అలా చేస్తే రెండు నిమిషాలలో తలపోటు వస్తుంది. తలంపుతో తాదాత్మ్యం పొందకుండా ఉంటే అదే పోతుంది. దేహం ఉన్నవాడికి ఏదో రోగం వస్తుంది. అలాగే మూల తలంపు ఉన్నవానికి

srinannagaru.com

ఏదో తలంపు వస్తూనే ఉంటుంది. బెంగ వస్తూనే ఉంటుంది. ఏ జ్ఞానికి స్వంత ఇష్టాలు ఉండవు. దేవుని ఇష్టమే నా ఇష్టం అనుకొంటాడు.

70. ఆత్మ సంగతి అటు ఉంచండి "మనకు ఏమీ తెలియదు" అని తెలుసుకోవటానికి కూడా జ్ఞానం కావాలి. మనస్సు మూలతలంపులో లేనప్పడే విషయ చింతన వస్తుంది. మనస్సు హృదయంలో నిలబెట్టి ఉంచటం వలన నీ మీద నీకు విశ్వాసం కుదురుతుంది. మూల తలంపు మూలంలోంచే మనస్సు వస్తున్నది అనటం కన్న మూలతలంపే మనస్సు అనటం బాగుంటుందేమో అనేవారు భగవాన్. "ఈ మధ్య నాకు చెడు ఆలోచనలు వస్తున్నాయి" అని బాధపడేవారు ఉన్నారు. కారణం మూల తలంపు నశించకుండా చెడు ఆలోచనలు రావటం మానవు. సమత్వంలో ఉన్నప్పడే లోచూపు వస్తుంది. నిత్యం జీవితంలో మీరు ఎవరితో మాట్లాడినా, ఏ పనులు చేస్తూ ఉన్నా అజ్ఞానం నుండి విడుదల పొందాలనే గమ్యం మర్చిపోకూడదు. "వారి అభిమానం పొందాలి, వీరి అభిమానం పొందాలి" అనేవి, స్వప్న సమానమైనవి. వాటికి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదు. మనస్సును సత్యానుభవానికి ఎంత వరకూ సాధ్యమో అంతవరకూ ఉపయోగించుకో. తెలివిగలవారు అవకాశాన్ని అంది పుచ్చుకొని అభివృద్ధిలోకి వస్తారు. గాంధీజీ అనే వారు "మేడ మీదకు వెళ్ళాలి అంటే మెట్లు లెక్క పెట్టుకొంటే సరిపోదు. నిదానంగా, స్థిరంగా అడుగు వెయ్యాలి. లేదా పాకుతూ వెళ్ళు, మేడ మీదకు వెళ్ళిపోతావు. చతికిలబడి కూర్చుంటే మేడ ఎక్కలేవు" అనేవారు. ఆధ్యాత్మికంగా మన పయనం అటుగా సాగాలి. ధర్మాన్ని ఆచరించేవారికి సమ బుద్ధి కలుగుతుంది. ఎవరైనా మంచి మాటలు చెబుతూ ఉంటే వాటిని తీసుకోక పోతే, మనస్సులో దోషం ఉన్నట్లే లెక్క. ఏ వస్తువును అయితే నీవు తెలుసుకోవాలని అనుకొంటున్నావో ఆ వస్తువు రసహీనమైలేదు. అది నీకు తెలియబడాలనేఉంది కాని నీవు తట్టుకోగలవో లేవో అని ఎదురుచూస్తున్నది. గురువుకూడా అలాగే ఉంటాడు అనుగ్రహం ఇయ్యటానికి.

71. నిజంగా సాధనచేసేవాడికి కాలం సరిపోదు. ఎక్కువ నిద్ర లేకుండా జాగ్రత్త పడతాడు. దేవుడు ఉన్నాడో-లేడో అనుకొని, కాని పనులు చేస్తే ఒకవేళ ఉన్నాడు అనుకో ఎన్ని వేదనలు, ఎన్ని రోదనలు, ఎన్ని సంకటాలు, ఎన్ని ఆటంకాలు వస్తాయో యోచించుకోండి. పరిమితులు, హద్దులు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. నీ మనస్సు లయిస్తే ఒక్కటి అంటే ఒక్కటే అన్న బ్రహ్మము నీకు అనుభవమౌతుంది. రంగులు ఆర్థిక అర్హతలు, అందం అన్నీ మనస్సులోనే, మనకు ఆత్మానుభవం కలిగితే ఆ అర్హత కలిగితే అగరువత్తులు, దీప, ధూప నైవేద్యాలు ఏమీ పెట్టేవారు ఉండరు.

srinannagaru.com

కుక్క విశ్వాసానికి గుర్తు. యజమాని రమ్మనమని చెప్పకపోయినా కూడా వచ్చేస్తుంది. అలాగే నీవు చేసిన సత్‌కర్మ నీ కూడా వచ్చేస్తుంది. మనం ఈశ్వరుని విశ్వసించటం మానేసి విశ్వాన్ని విశ్వసిస్తున్నాము. విశ్వేశ్వరుని విశ్వసించలేకపోతున్నాము. ఏకాగ్రత లేనప్పుడే చెడు తలంపులు వస్తాయి. మీరా బాయి, నిరంతరం కృష్ణుని తలుచుకొంది. త్యాగరాజు చివరి శ్వాస వరకూ రాముని తలచుకొన్నారు. నీకు ఇష్టమైన దైవాన్ని నీవు తలంపుగా ఉంచుకో, ఉపాసనకు శక్తి ఉంది. కాని దానికి అభ్యాసం చెయ్యాలి. అది చివరకు ధ్యాన మౌతుంది. నీ "ధ్యాస", "ధ్యానం"గా మారిపోతుంది. అప్పుడు నీకు తెలియ కుండానే ధ్యానం సాగిపోతుంది. నిర్వాణసుఖాన్ని అందుకొంటావు. రామదాసు రామునికి దాసుడు. ఎవరూ వ్యక్తి భావనకు దాసులు కాకూడదు. ఆత్మ స్తుతి, పరనిందలతో ఉన్న వానికి జ్ఞానమా? అజ్ఞానంలో ఉండి జ్ఞానాన్ని ఆశించటమా? "శ్రద్ధ"లోంచే భక్తి, జ్ఞానం వస్తుంది. బయట శత్రువులను దేహంతో పోరాడవచ్చు, లోపల ఉన్న శత్రువులను మనస్సుతో పోరాడాలి. నామంతో మనస్సును చంప వచ్చును. లోపల శత్రువులను, తుపాకులతో, కత్తులతో చంపలేము. ప్రయోజనం లేదు.

72. సహనం ఉన్నవానికి ఎన్ని ఆపదలు వచ్చినా తొలగిపోతాయి. ఏడుపు ముఖం ఉన్నవాళ్ళు సాధన చేస్తే ఎలా ఉంటుందో శాస్త్రం ఇలా చెప్పింది. ఒక వృక్షాన్ని నరకటానికి "కర్ర గొడ్డలి"ని తయారు చేసి నరకటం ప్రారంభించాడు, అది కూలుతుందా? కూలదు. అలాగే టైము చూచుకొని ఎప్పుడు లేచిపోదామా అని అనుకొనేవాడికి ధ్యానం ఎలా కుదురుతుంది. ధ్యానం వచ్చేది-చేసేది కాదు. "మీ అభిప్రాయం నాకు నచ్చలేదు" అని మిమ్ములను ఎవరైనా అంటే, ఆ మాటకు మీ మనస్సు గాయమైతే మీకు దైవానుగ్రహం ఎలా కలుగుతుంది? ప్రయత్నంలో బంధం ఉంది. దుఃఖం ఉంది ధ్యానంలో బంధం, దుఃఖం ఉంది. కొందరి ధ్యాన స్థితిని చూస్తూ ఉంటే ఎంత బాధ పడిపోతున్నారో అని అనిపిస్తుంది. మీరు సహజంగా ముగ్గాలి. ధ్యానంలో ఆనందం వస్తే మంచిదే. బలవంతంగా పనిచెయ్యవద్దు. నేచురల్‌గా, నార్మల్‌గా జీవిస్తే ధ్యానస్థితి వస్తుంది. సత్యం గురించి ప్రయత్నము చేస్తే వారికి ధ్యాన స్థితి సహజంగా వస్తుంది. కొందరు ధ్యానం చేస్తూ ఉంటే వాళ్ళ బాధ శత్రువులకు కూడా ఉండకూడదు అనిపిస్తుంది. మీరు ఎవరికైనా మంచి, మంచి తలంపులతో విషయాన్ని వ్యక్తం చేసేటప్పుడు మంచి యోగ్యమైన పదజాలంతో తెలపగలగాలి. లేకపోతే ఎదుటివాడు సంకట స్థితిలో పడిపోవచ్చును. యోగ్యమైన పదజాలంతో తెలపటానికి దృష్టాంతం

srinannagaru.com

ఆంజనేయ స్వామి. పూర్వ జన్మలో ఎంతో పుణ్యం చేసుకొంటే కోపం తక్కువగా ఉంటుంది. పంటలు బాగా పండించటానికి రైతులకు ఎంతో తరిఫీదు ఇస్తారు. జన్మ జన్మల నుంచి మోసుకొని వస్తున్న మనమనస్సులోని లోపాలను తొలగించుకోవటానికి ఎంత తరిఫీదు కావాలో ఆలోచించండి. "భయం" మనిషిని నిర్వీర్యం చేస్తుంది. శారీరక, మానసిక, వాక్కు, తపస్సు వలన భగవంతుని చేరుకోవచ్చును. అతిగా మాట్లాడటం వలన కలహాలు వస్తాయి.

73. కొందరు సహజంగా సమాజానికి, భగవంతునికీ దూరమౌతూ ఉంటారు. కారణం వారిలోని అహంకారం వలనే. వారు ఎవరో వారికి తెలిసే వరకూ గర్వం రావటం మానదు. ఉపయోగం లేని తలంపులు, మాటలు శవాలతో సమానమని బాపూజీ తెలిపేవారు. కొందరు ఎప్పుడు చూచినా అసూయతో ఉంటారు. అదే "దరిద్రం". కొందరు శాంతంగా, నిర్మలంగా ఉంటారు. వారు ఐశ్వర్యవంతులు. అట్టి మంచి వాళ్లను మంచి వాళ్ళుగా చూడండి. దేవుడి దాకా వెళ్ళనక్కరలేదు. నీ హృదయంలో ఉన్న సత్యం సర్వకాల సర్వ అవస్థలలోనూ నీవు ఎరుక కలిగి ఉంటే నీవు పవిత్రుడివి అవుతావు. ఎవరి అహంకారాన్ని వాళ్ళు అలంకరించుకోవటం మానేస్తే అదే సన్యాసం. మనస్సు బయటికి వెళితే, ఎంజాయ్‌మెంట్ లోపలికి వెళితే శాంతి. ఈ విషయం నిరంతరం పరిశీలించుకొనే వాడికే ఆధ్యాత్మిక ప్రగతి. మీరు ఎవరినైనా అతి మర్యాదగా చూస్తూ ఉంటే వారి మనస్సుకు దూరమౌతున్నట్లే లెక్క. "అతి సర్వత్ర వర్జయేత్" అన్నారు. విషయ వికారాలు చెందే మనస్సు బంధకారణం, నిర్విషయం చెందిన మనస్సు నిర్వాణ స్థితిని పొందుతుంది. మనం ఒక చెడ్డ వ్యక్తితో స్నేహం చెయ్యటం జరిగింది అంటే మనలో ఆ చెడ్డ ఉండబట్టే. ఆ విషయం సాధకుడు గ్రహించాలి. రాగ-ద్వేషాలు తగ్గించుకొంటే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి గల శివపూజలు ఫలిస్తాయి. ఎంతకాలమైతే పాడుబుద్ధి ఉందో అంతకాలం శరీరాలు రావటం తప్పవు. తిన్న అన్నం జీర్ణమైతే శక్తిని, సుఖాన్ని తీసుకొని వస్తుంది. జీర్ణం కాకపోతే దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. అలాగే, నా మాటలు మీకు అర్థమైతే శాంతిని, సుఖాన్ని తీసుకొని వస్తాయి. అర్థం కాకపోతే దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. సహనం అలవాటు చేసుకొంటే రాగ-ద్వేషాల తాకిడి నిన్ను బంధించదు.

74. లోకానికి సంబంధించిన ఏ భోగం కోరినా దాని వెనుక దుఃఖం వచ్చి తీరుతుంది. ఈ విషయం బాగా గ్రహించుకో. నీవు గ్రహించకుండా కోరుకొంటే భోగానుభవం వెనకాలే ఆ దుఃఖం ఒక కిరీటం పెట్టుకొని దర్జాగా వస్తుంది. కిరీటం చక్రవర్తి పెట్టుకొని శాసిస్తాడు. ఇదీ అంతే ఆ శాసనానికి

srinannagaru.com

తిరుగులేదు. అతి స్నేహం వలన చెడ్డ జరుగుతుంది. ఎందుకు అంటే ఏదో ఒక రోజున వాళ్ళు విరోధులు అయిపోతే దాని ప్రభావం వలన నీవు గమ్యానికి వెళ్ళటానికి నాలుగు సంవత్సరాలు ఆలస్యమైపోతుంది. పుణ్యబలం లేకపోతే వారు శ్రవణం చెయ్యటం లేదు. మనమెందుకు చెయ్యాలి అనే ఆలోచన వస్తుంది. ఒకరు భగవాన్‌తో "శంకరులు, షేక్స్‌పియర్ మాటలు వింటూ ఉంటే ఆనందం వస్తున్నది" అంటే భగవాన్ అన్నారు "ఆ పొయిట్రీ నుంచి ఆనందం రావటం లేదు. ఆ వాక్యాన్ని నీవు ఎంజాయ్ చెయ్యటం వలన నీకు ఆనందం వస్తున్నది" అన్నారు.

మీ ముఖాలు నేచురల్‌గా, నార్మల్‌గా లేకపోతే శరణాగతి లేదని అర్థం. మీ జేబులోంచి వంద రూపాయలు పోతే మీ ముఖం మారిపోతుంది. రాముడికి రాజ్యం పోయినా ముఖంలో మార్పు రాలేదు. వాల్మీకి రామాయణంలో ఇలా అన్నారు "నాకు నమ్మకాలు వస్తున్నాయి. పోతున్నాయి. కాని రాముని మంచితనం విషయంలో నాకు నమ్మకం పోవటం లేదు" అన్నారు. రాముని గొప్పదనం ఇందులో ఉంది. విషయాల పట్ల ధ్యాస లేకపోతే అవి వాటంతట అవే రాలిపోతాయి. మనకు ఆ ధ్యాస ఉంటే దేవుడు కూడా దూరంలోనే ఉంటాడు. ప్రతీ మనిషికి కొన్ని బలహీన లక్షణాలు ఉంటాయి. నిర్మలంగా ఉండేవాడే దాన్ని అధిగమించ గలడు. పుట్టుకతో వచ్చే బలహీనతలను పోగొట్టుకోవటమే సాధన. కొందరు వాటితోనే పుడతారు. సాధన చేసి ఆ బలహీనతలను తొలగించుకోవాలి. అలా చెయ్యకపోతే వడ్డీతో సహా పెరిగిపోతాయి.

**75.** ఒక ఉపనిషత్ ఇలా అంది "నీవు వంద చేతులతో సంపాదించు, వెయ్యి చేతులతో దానం చెయ్యి కాని ఇచ్చేటప్పుడు 'నేను చేస్తున్నాను' అని అనుకొంటే బంధించబడతావు. సహృదయంతో, చిత్తశుద్ధితో దానం చెయ్యి. అలా చేస్తే రూప-నామ బుద్ధుల్లోంచి బయట పడతావు" అంది. మనం మంచి విషయాలను తొందరగా మర్చిపోతాము. బాగుపడని వాడు పనికి మాలిన విషయాలు, అహంకారం గుర్తుంచుకొంటాడు. గర్వం ఉన్నవాడు ఏ రంగంలోనూ అభివృద్ధి కాలేడు. వ్యవహారంలో నమ్రత, మాటలలో నమ్రత, ఆలోచనలో నమ్రత కావాలి. ఎవరైనా ఉద్రేక పరిచినా నమ్రతను విడిచిపెట్టకూడదు. ఉద్రేక పడకూడదు. మీ జీవితంలో మీరు చేసిన ఏదైనా మంచి పని గుర్తుకు వస్తే, దాన్ని మీరు ఎంజాయ్ చేస్తే అహంకారం పెరుగుతుంది. అసలు ఈ అహంకారమే తన మేత కోసం ఏదో ఒకటి గుర్తుచేస్తూ ఉంటుంది. కోరిక ఎక్కువగా ఉన్నప్పుడు బుద్ధి సూక్ష్మతపోతుంది. ఎన్నో జన్మలనుంచి "ఏదైతే నీవో" అది మర్చి పోయావు. అందుకే ఎన్నో జన్మల నుంచి బాధలు, రోదనలు అనుభవిస్తున్నావు.

srinannagaru.com

నీలోని నిజాన్ని తెలిపే వాడే గురువు. నీకు ఎన్ని జన్మలు వచ్చినా "దేహమే నేను అనే మూల తలంపుకే వస్తున్నాయి. కట్రాడుకు కట్టిన దూడకు స్వేచ్ఛ ఎటువంటిదో దేహాభిమానం గల జీవుని జీవితం కూడా అటువంటి స్వేచ్ఛను మాత్రమే అనుభవిస్తాడు. తాడు పొడుగును బట్టి దూడ తిరిగినట్లే జీవుడికి జన్మాంతరం నుంచి మోసుకొన్న తెలివిని బట్టి ప్రకృతిలో తిరుగుతాడు. ఎక్కడ ఉద్రేకం లేదో అక్కడ విమర్శ ఉండదు. అరిచేది దేహగతమైన నేనులోంచే వస్తుంది, కొందరు భార్యా-భర్తలు కోడళ్ళు, చుట్టాలు లేనప్పుడు తిట్టుకొంటారు. ఒకరి మీద ఒకరు విరుచుకుపడతారు ప్రక్కవాళ్ళకు తెలుస్తుందని తలుపులు వేసుకొంటారు. అది కూడా దేహ వాసనే. కొందరు దగ్గరలో ఉన్న వాళ్ళతో కూడా గట్టిగా మాట్లాడుతారు, అరుస్తారు. అది అజ్ఞానమే.

76. మీ మనుమల ముద్దుముద్దు మాటలు నిరంతరం గుర్తు పెట్టుకొని మురిసిపోతారు. కాని గురువు చెప్పే అమృత తుల్యమైన మాటలను జ్ఞాపకం పెట్టుకొని మురిసిపోలేకపోతున్నారు. అంటే మీ సాధన సక్రమంగా లేదు అని గుర్తు. మీరు ఇంటి వద్ద ఏమి ఆలోచిస్తున్నా మీ గురించిగాని, ఇతరుల గురించి గాని లేదా ఇతరులు మన గురించి ఏమి అనుకొంటున్నారో అని, మనం ఇలా ఉన్నాము అని అనుకోవటం వలనే అమృతానుభవం కలగటం లేదు. "నేను" అనేది లేనే లేదని గుర్తించి ఆచరించినప్పుడే మీరు సక్రమంగా ప్రయాణం చేస్తున్నారని గుర్తుంచుకోవాలి. భగవంతుడు నీలో ఎంత వికాసం వచ్చినదీ అనే చూస్తున్నాడు. మన జన్మ పరంపరలను చూస్తున్నాడు. మనకు గోడ అవతల ఏముందో మనకు తెలియదు. నిప్పు వేడి లేకుండా ఉండదు. జ్ఞానం శక్తి లేకుండా లేదు. అది మనకు తెలియబడటానికి మన సహస్రారానికి ఆ వెలుగు చిమ్మటానికి మన దేహభావనే అడ్డం వస్తున్నది. నీవు కాని వస్తువును నీవు అనుకోవటమే మొదటి పొరపాటు; మధ్యపొరపాటు, చివరి పొరపాటు దాన్ని తొలగించుకోవటమే సాధన. మరణానంతరం జీవితం లేదనే మనుషుల దగ్గర నుంచి ప్రేమ ఆశించకు, బయట శత్రువుల కంటే కోరికా, కోపం అనే అంతశ్శతృవుల వలనే మనకు ఎక్కువ హాని జరుగుతోంది. మనిషిని మరీ ఎక్కువ పీడించేది అహంభావన. లోపల ఉన్న శాంతి సముద్రాన్ని పొందకుండా చేసేది అహంభావన. మన మాటలో అహంభావన ఉండకూడదు. మనం ఎవరిని విమర్శిస్తున్నామో వారికి ఉపకారం జరుగుతున్నది అని గుర్తుంచుకోండి. కారణం దానివల్ల వారి పాపాలను స్వీకరిస్తున్నాము. ఈ లోకం అనుగ్రహించటం వలన మనకు లాభం రాదు, ఈశ్వరుడు అనుగ్రహించటం వలనే లాభం. దానికి బహు జాగ్రత్తగా సాధకుడు మసలుకోవాలి.

srinannagaru.com

సాధన అంటే ఏమీలేదు బాహ్యంగా విజృంభిస్తున్న మనస్సును అంతర్ముఖం చెయ్యటం.

77. ప్రతీమాటకు చిరాకు, ప్రతీపనికి విసుగు ఉన్నవారికి అభివృద్ధి ఉండదు. దేహ ప్రారబ్ధం కూడా తలంపే. మనస్సు అరుణాచలంలోనో, కాశీలోనో అణగదు. నేను-నేను అని ఏ హృదయం నుంచి వస్తున్నదో అక్కడ అణిగితేనే మనస్సు నశిస్తుంది. నేను ఎక్కడికి వెళ్ళినా, సమాజం నుంచి, ఇంటిలో నుంచి వచ్చిన సమస్యలనే చెబుతున్నారు అవి అన్నీ నిజమనుకొనే చెబుతున్నారు. అవి నిజం కావు. అది సమస్య కాదు. నీ మనస్సే నిజమైన సమస్య లక్షలాది జన్మల నుంచి ఆ వాసనలు మోసుకొని వస్తున్నావు. మన మనస్సు మారినట్లు నటిస్తున్నది కానీ మారదు. మనస్సును ఖాళీ చేస్తే అనుగ్రహాన్ని ప్రవేశించమని అడగనక్కర లేదు, అదే వస్తుంది. ఉపయోగం లేని మాటలు మాట్లాడకుండా ఉండాలి నీవు ఆ మాటలు మానకపోతే అవి నిన్ను బంధిస్తాయి. అదే అజ్ఞానం. నాలుగు సార్లు ఆలోచించి ఒక మాట మాట్లాడాలి. నీ మాట, నీ సంకల్పం, నీ చేతలు నిన్ను బంధిస్తున్నాయి. మీరు అనుకొనే మహా చెడ్డ మీకు ఉజ్జ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. దుర్యోధనుడు లేకపోతే పాండవుల మంచితనం ఎవరికీ తెలియదు. చాలా మంది విషయాలలో మనకున్న స్వార్థమే ప్రేమ అనుకొంటాము. పిల్లల మీద ఉన్నది ప్రేమ కాదు స్వార్థమే. ఒక హైయర్ పవర్ ఉందని మూల తలంపును గుర్తించిననాడు ఈశ్వర ఆజ్ఞ నుంచి వచ్చిన ప్రారబ్ధం నుంచి ఏది వచ్చినా అమృతంగా తీసుకొంటాడు. ఈ సృష్టిని, నిన్ను రక్షించేది ఒక హైయర్ పవర్ ఉందని గుర్తిస్తే స్వీట్‌గా ఉంటావు. అందరిలోనూ నీవు ఉన్నావు. నీలో అందరూ ఉన్నారు. మన శరీరాలు శ్మశానంలో సమానం. మనం బయట కూడా సమత్వం అలవర్చుకోవాలి. గాలికి, వర్షానికీ తేడా లేదు. పేదవాని గుడిసె మీదా, ధనవంతుడి భవనం మీదా వర్షం కురుస్తుంది. అలాగే గాలి వీస్తుంది. అలాగే భర్తృహరి వంటి మహానుభావులు రాగద్వేషాలు లేకుండా అమృత వచనాలు పలికి వెళ్ళిపోయారు. వారియందు కృతజ్ఞత కలిగి ఆ సారాన్ని అందుకొన్నవారు ధన్యులు.

78. మీ ప్రయత్నానికి అసాధ్యం ఉండవచ్చు, గురు అనుగ్రహానికి అసాధ్యం ఉండదు. సాధకుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి అంటే అహంకారమైన మాట వస్తే అది వాసనై మరుజన్మకు కారణమౌతుంది. ఆ సంగతి మీకు తెలియదు. ఆ మాట మీ పీక పట్టుకొంటుంది. ఏ వ్యక్తి మీదనైనా విపరీతమైన మమకారం పెంచుకొన్నా ఆత్మానుభవానికి ఆటంకమే అవుతుంది. అలాగే విపరీతమైన దయ,

srinannagaru.com

జాలి కూడా ఆత్మానుభవానికి ఆటంకమౌతుంది. ఈ సృష్టి నిజంగా కనిపించినంత కాలం ఏదో మూల నుంచి అశాంతి దుఃఖం తప్పదు. "బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య" అనేది మనస్సు నమ్మినట్లు నటిస్తుంది కాని నమ్మదు. గీతలో పరమాత్మ మరణం గురించి ఎంత తేలికగా "చిరిగిన వస్త్రమును వదలి నూతన వస్త్రమును ధరించినట్లు జీవుడు జీర్ణమైన శరీరాన్ని వదలి కొత్త శరీరాన్ని ధరిస్తాడని" చెప్పినా మనస్సు ఉన్నంతకాలం మరణం బాధగానే కనిపిస్తుంది. దుఃఖం వస్తుంది. ఆధ్యాత్మిక టీచింగ్ చెయ్యటం వలన తరువాత మన నిజ జీవితంలో మనం చెప్పిన దానికి మనం ఎలా జీవిస్తున్నాము ప్రస్తుతం అనేది పరిశీలన జరుగుతుంది. అది ఆధ్యాత్మిక ప్రగతికి ఎంతో ఉపకరిస్తుంది. కామం నిజంకాదు ఒక తలంపు అలాగే నీ రాగం-నీ ద్వేషం-నీ కోపం-నీ ఇష్టం-నీ ఉద్రేకం-నీ చావు, తలంపులు మాత్రమే. ఈ తలంపులు నిజమా? నీ గాఢ నిద్రలో ఈ ప్రకృతి లక్షణాలలోంచి వచ్చినది ఏమైనాయి. నీవు పోలేరమ్మలా ఊగిపోతే నిజం దగ్గరకు ఎలా వెళ్ళగలవు. ఈ తలంపులతోనా, సత్యం దగ్గరకు వెళ్ళేది. ఎక్కడ ఊహలు లేవో ఎక్కడ తలంపులు లేవో అక్కడ సత్యం ఉంది. కావలసినది విషయ చింతన కాదు. ఆత్మ చింతన, నీ మనస్సు రవ్వంత, ముల్లంత. విషయ చింతన లేకుండా నిరంతరం ఆత్మ చింతనలోనే ఉంటే నీకు సత్యానుభవం కలుగుతుంది.

79. అందరిలోనూ ఏ సత్యం ఉందో దాన్ని తెలియపర్చే తెలివే తెలివి. మిగిలిన తెలివి అంతా పాడు తెలివి. పుస్తకాలు చదివి మంచి మాటలు ఎవరైతే ఉపయోగించుకోరో వారు పుస్తకాలు చదవటం వలన ప్రయోజనం లేదు. మీలో ఉన్న "పొరపాటు నేను" లోంచి బయట పడకపోతే ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. నిర్మలంగా ఆలోచించండి, నిశ్చలంగా పని చెయ్యండి. సహృదయంతో మాట్లాడండి. ఎవరైనా అస్థిరచిత్తులు అయితే వారిని తోకలేని కోతితో సమానం అంటారు. అటువంటి వారితో సహవాసం చెయ్యకండి. అభ్యాసం వైరాగ్యం వదలకూడదు. దేవుడు ఎక్కడ ఉన్నాడు హిరణ్యకసిపుని "రోదన" దేవుడు ఎక్కడా లేడు అనేది. ప్రహ్లాదుని "వేదన" భక్తుడైన ప్రహ్లాదుని మాటను పోషించటం కోసం స్తంభంలోంచి వచ్చాడు నరసింహస్వామి. ప్రహ్లాదుని విశ్వాసం మనకు ఉండాలి. అహంకారం ఉండటం వలన గురువు, ఆచార్యుని విలువ తెలియటం లేదు. అంతేకాదు భక్తి కూడా తెలియటం లేదు. వివేకం ఉంటే దైనందిన జీవితంలోని కష్టాలలోను, నష్టాలలోనూ శాంతంగా ఉండగలడు. మీలోని బలహీనతలు మిమ్ములను పీడించినప్పుడు ఈశ్వరుడు గురుకృప ద్వారా శిష్యుని మీద అనుగ్రహాన్ని వర్షింపచేస్తాడు. శరీరంలో ఏ జబ్బు ఉన్నది మనకు

srinannagaru.com

తెలుస్తుంది. సాధన చేసేవాడికి మనస్సులోని బలహీనతలు తెలుస్తాయి. "ఆ బలహీనతల నుంచి విడుదల చెయ్యి" అని ప్రార్థించాలి. ఈ మాటలు ప్రకృతి మనుషులతో చెబితే యాగీ చేస్తారు. మహిమలు కూడా ప్రలోభమే. దానిలో ఆగిపోతే అసలు స్థితి పొందలేము. శరణాగతి వలన అసహజస్థితి నుంచి, సహజ స్థితికి వస్తాము. కోపం కోరికలతో ఎంతో సేపు ఉండలేము. అక్కడ నుండి బయటపడనివానికి ఆధ్యాత్మిక ప్రగతి ఉండదు. దేహం నేను అనే తలంపులోంచే భయం వస్తుంది. దుఃఖ కారణం బయటలేదు. శరీరాలు అన్నీ నీడలే. నేను చేస్తున్నాను అనే బుద్ధి నశిస్తే దుఃఖం లేదు.

80. కీర్తికాంక్ష ఉన్నవానికి లోకంగాని ఆకాంక్ష లేకపోతే వాడికి లోకం లేదు. కొందరు అంటారు "వారికి ఈ ఉపకారం చేసాను, కాని కృతజ్ఞత కూడా చూపటం లేదు" అని. అంటే అతను ఈశ్వరార్పణ బుద్ధితో సాయం చెయ్యలేదని భావం. ఎంతోకొంత పుణ్యభావం లేకపోతే అద్వైత అనుభవమే రాదు. అద్వైత వాసనకూడా రాదు. శాంతిని కాపాడుకొన్న వానికి శక్తి కలుగుతుంది. మనస్సును, ఇంద్రియాలను, వాక్కును, భగవంతుని పొందటానికి అంకితం చెయ్యి మృత్యువనే కసాయి వాని చేతిలో నీ జీవితాన్ని పెట్టకు. బుద్ధిమంతుడు ఇతరులలో మంచి గుణాలను చెబుతాడు. బుద్ధిహీనుడు తనలోని మంచి గుణాలను మాత్రమే చెబుతాడు. నిరంతరం ఎవరినో ఒకరిని విమర్శిస్తూ ఉండేవాని మనస్సు చాపల్యానికి గుర్తు. ఈ విషయం వారికి తెలియదు అనే వారు భగవాన్. తిరిగే కాలు, తిట్టే నోరు గలవారిని వాండరింగ్ మైండ్ అంటారు. మాట నిశ్చలంగా ఉండాలి మనస్సు నిశ్చలంగా ఉండాలి, చేత నిశ్చలంగా ఉండాలి, అలా ఉండగా ఉండగా ఆరోజుకారోజు మీరు అభివృద్ధిలోకి వచ్చి, సత్యానుభవం పొందుతారు. "నీవు ఎంతోకొంత ప్రయత్నం చేసి నీ మనస్సును బాగుచేసుకోవాలనే ప్రయత్నం చెయ్యకపోతే, ఆ మాధవుడు మాత్రం ఏమి చెయ్యగలడు" అన్నారు అష్టావక్రుడు. నిరంతరం విషయచింతన చేసే వాడికి భ్రాంతి పెరుగుతుంది. వారికి ఆత్మ చింతన కలుగనే కలుగదు. ఉన్న వస్తువును ఉన్నట్లు తెలుసుకొన్నదే విద్య. ఉన్న రోగాన్ని ఉన్నట్లు తెలుసుకొన్నవాడే వైద్యుడు. అటుచూడకు, ఇటుచూడు. అటు అంటే ఈ తలంపులను ఎలా తొలగించుకోవాలని చూడకు, ఇటు చూడు అంటే చైతన్యాన్ని చూడు. తలంపులు పత్తా లేకుండా పోతాయి.

81. ఈశ్వరుని కన్న నేనే గొప్పవాణ్ణి అనుకొనేవాడు శరణాగతి మార్గంలోకి ఎలా వస్తాడు. దొంగనేనే నిజమనుకొనేవాడు శరణాగతిని ఎలా పొందగలడు. ఈ దొంగ నేను ఏ వెలుగులో జీవిస్తున్నదో తెలియని వాళ్లకు

srinannagaru.com

నిజం ఎలా తెలుస్తుంది. గమ్యం ఎలా తెలుస్తుంది. ద్వైతంలో పేచీగాని అద్వైతంలో ఏ పేచీ లేదు. అద్వైతంలో దుమ్ములేదు. ద్వైత చింతనలోనే దుమ్మంతా. అద్వైత ఆనందం పొందేవరకూ కర్మ సముద్రం నుంచి ఎవ్వరూ విడుదల పొందలేరు. నీ కృషి ముందు, నీ పట్టుదల ముందు, నీ సహనం ముందు నీ ప్రారబ్ధం ఎంత? విత్తనం మెత్తబడటానికి నీటిలో ఒక నిమిషమే నానపెట్టము. నానే వరకూ ఉంచుతాము. అలాగే మంచిని చేస్తూ ఉంటే నీ మనస్సు మెత్త బడుతుంది. అప్పుడు నీ మనస్సు నీ హృదయంలో నిలకడగా ఉంటుంది, తరువాత కరిగిపోతుంది. ఏమి జరుగుతున్నా, ఏమి జరగబోతున్నా మన మంచికే అని తలంచే బుద్ధికి సమానత్వం వస్తుంది. ఆహారంలో సూక్ష్మాతిసూక్ష్మమైన భాగం నీ మానసిక పరిస్థితి మీద పనిచేస్తుంది. రోగాలు అన్నిటికి పొట్టే కారణం అనటానికి కారణం అతిగా తినటం. నీరాగ-ద్వేషాలనే దుఃఖాలను తొలగించు కోవటమే యోగం. జీవునికే వర్తమానం. గతం-భవిష్యత్ కాలం, భగవంతునికి అంతా వర్తమాన కాలమే. మనం ఎవరినైనా ప్రేమిస్తూ ఉంటే కారణం ఉండ కూడదు. కారణం ఉంటే దుఃఖం వచ్చేస్తుంది. స్వార్థం-వ్యక్తిభావన-మమకార భావన ఉన్నంత కాలం మీరు పచ్చికూరలు తినటంలో ఎంత ట్రైనింగ్ అయినా మీకు జన్మ తప్పదు. మీకు స్వార్థం ఉంటే, ఆ వ్యక్తిపై ఆసక్తి ఉంటే వాడు దొంగైనా మంచి వాడిలా కనిపిస్తాడు. కొంతమంది శాంతిని, కాంతిని ఇయ్యమంటే ఇయ్యలేరు, "పొగ"పెట్టమంటే పెడతారు.

82. బయట దోమలు గుడ్‌నైట్ పెట్టుకొంటే పోతాయి. లోపల ఉన్న తలంపులనే దోమలు నీకు నిద్రపట్టనియ్యవు. నిద్రపట్టని రాత్రి ఎలా ఉంటుందో జ్ఞానంలేని జీవితం కూడా అలాగే ఉంటుంది. కొందరు కోపంగా ఉన్నప్పుడు "ఆ కాఫీ ఇలా తగలేయి" అంటారు. అది అసహజస్థితి, నిర్మలమైన అంతఃకరణ గల వానికే నిజస్థితి తెలుస్తుంది. "మాయ" గుణాల రూపంలో ఉంది. సత్వగుణం అభివృద్ధి చేసుకొంటే, రజోగుణం నుంచి, తమోగుణం నుంచి దూరమౌతాము. ఫలకాంక్ష ఉన్నంతకాలం పవిత్రులం కాలేము. శరీరము + మనస్సు + తెలివి ఈ మూడు కలిసి ఉంటాయి. జీవితం పొడుగునా వాటికి క్రమశిక్షణ నేర్పాలి. నిరంతరం ప్రకృతిలో ఏదో ఆశించటం వలన ఉన్న సంపదను గూడా పోగొట్టుకొనే సందర్భాలు ఉన్నాయి. శివానంద ఒక మంత్రం చెప్పేవారు "ఏది వచ్చినా నిలబడదు. ఆ ఎరుక కలిగి ఉండాలి. నిజ జీవితంలో ఆడంబరమైన మాటలు చెప్పేవారు పనిచెయ్యరు. పాజిటివ్ ఆలోచన వచ్చేవారు బాగుపడతారు. ధ్యేయదృష్టితో ఏ పని చేసినా అది భౌతికమైనా, ఆధ్యాత్మికమౌతుంది. ఆధ్యాత్మిక సాధనలో రహస్యం

srinannagaru.com

"మిథ్యానేనుకు ఎంత దూరమౌతున్నాము" అనేదే ముఖ్యం. మనస్సుకు చరిత్ర కాని ఆత్మకు చరిత్ర లేదు. నీవు ఏదిగా ఉన్నావో దానికి "హిస్టరీ" లేదు. ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీ దుఃఖం ఈ క్షణంలో పోతుంది. జరిగేది జరిగి తీరుతుంది. జరగరానిది ఎవరు ఎంత ప్రయత్నించినా జరగనే జరుగదు. నీ శరీరానికి అపచారం ఉండవచ్చు. నీ మనస్సుకు అపచారం ఉండవచ్చు కాని ఆత్మకు అపచారం ఉండదు. నీవు ఆత్మవు. నిప్పుకు తుప్పు పట్టదు. నీవు ఏదో ఒకటి ఇలా అనుకొంటూ ఉన్నావు. నేను నలుపు, తెలుపు, పెద్దవాణ్ణి, చిన్నివాడిని నాది ఆ రాజకీయ పార్టీ, నాది ఆ కులం, నేను పురుషుడను, స్త్రీని ఇలా అనుకోవటం మానేస్తే ఈ క్షణంలో ఆత్మానుభవం పొందుతావు. ఆత్మ విద్య అత్యంత సులభం.

83. రమణాచార్యులు ఒక్కటే చెప్పేవారు "నీవు సింపుల్‌గా ఉండు, స్వచ్ఛంగా ఉంటే అంత తొందరగా "సత్యం" దాని అంతట అది ఎరుక బడుతుంది. ఎవరైనా "నీ మనోరోగాన్ని నయం చేసి 'సత్యం' నిన్ను వరించేటట్లు చేస్తాను" అంటే అది ఆధ్యాత్మికమైన బ్లాక్‌మెయిల్ చెయ్యటమే. పురుష ప్రయత్నం కావాలి. దేహాన్ని, మనస్సును ఎంతవరకూ ఉపయోగించుకోవచ్చో అంతరవకూ ఉపయోగించాలి. ఆత్మానుభవం పొందాలి. పనిచేసి మైండ్‌ని పెంచుకోకు దానికి కంట్రోల్ కావాలి. లోతుగా ఆలోచించటం వలన చాలా విషయాలలోంచి బయట పడతాము. కంసాలి వాడి సుత్తి ఎన్ని దెబ్బలు కొట్టినా స్థిరంగా ఉంటుంది. అలాగే సహనం కూడా ఉండాలి. అణిగిన మనస్సు ఆత్మవైపుకు, విజృంభించిన మనస్సు ప్రకృతిలోకి వెళుతుంది. ఒక్కమాట గుర్తుంచుకోండి, ఏ మతస్థులైనా, ఏ గురువు భక్తులైనా వ్యక్తిభావన తగ్గించుకోవాలి. "నీ మైండ్ యొక్క వాండరింగ్ తగ్గించేదే సాధన" అనేవారు శివానంద. జరిగిపోయిన గొడవలకు, జరగబోయే గొడవలకు ప్రారబ్ధం గురించి బెంగలే. మీలో ఉన్న ఆనందం మీ సహస్రారాన్ని ముంచితే మీ అన్ని గొడవలు మహావరదలో గట్లు-దిమ్మలు కనబడక పోయినట్లు మీ బాధలు అన్నీ నామరూపాలు లేకుండా పోతాయి. మీరు ఏమీ అనుకోకుండా ఉండండి, మీరే దేవుడై పోతారు. ప్రతీదానికి మనస్సును పుండు చేసుకోకండి. మీకు సబ్జక్టు అర్థమైతే పదిశాతం సాధనతో సఫలమౌతారు. మీకు రామాయణం, భారతం గొడవలు అక్కరలేదు. భగవంతుడు ఒకడు ఉన్నాడనే విశ్వాసం ఉంటే చాలు. అర్థం చేసుకోవటాన్ని బట్టే అనుభవం వస్తుంది. నిజమైన ఆరోగ్యవంతునికి దేహం గుర్తుకురాదు, అనారోగ్యం ఉన్నవానికే దేహం గుర్తుకు వస్తుంది. నిజమైన శాంతినీకు దొరికితే బాహ్య అశాంతి నిన్ను బంధించదు.

srinannagaru.com

84. కర్మ సిద్ధాంతం నుంచి మీరు బయటపడ్డారు అనుకోండి ఏ సిద్ధాంతమూ లేదు. నీ శరీరానికి రోగం వచ్చింది. విరోధులు ఎక్కువయ్యారు. కర్మలు ఇలా అనుభవిస్తున్నాము అనుకొంటారు. అలా అనుకొనేది ఎవరు? దేహం నేను అని అనుకోదే, చైతన్యం అనుకోదు. మీకు చైతన్యం అనుభవంలోనికి వస్తే రాముడు వచ్చినా చూడాలని ఉండదు. మీ మిథ్యానేను ఉన్నంతకాలం అన్నీ ఆశ్చర్యంగానే కనిపిస్తాయి. చైతన్య అనుభవం రాకపోతే రాగ-ద్వేషాలు కాలిపోయే స్థితి రాదు. సాధన పేరుతో ఆడంబరం పెంచుకోకండి. మీ ఇంటి వద్ద తుండుతో క్రింద కూర్చున్నట్లు కూర్చుంటారు. చుట్టాలు ఇంటికి వెళితే బట్టలు అన్నీ కూడా తేడాలు వస్తాయి. నీ సాధన అలా ఉండకూడదు. నీ ఆధ్యాత్మిక ప్రగతిని గురించి నీవు నిరంతరం పరిశీలించుకోవాలి. తినే విషయాలలోను, మాట్లాడే విషయాలలోను విచక్షణ ఉండాలి. చదివే గ్రంథాలలో క్రమశిక్షణ విషయాలు ఉండాలి, జ్ఞానానంద ఏకాగ్రత వలన ఆరు సంవత్సరాలలో నేర్చుకొనేది ఆరు మాసాలలో నేర్చుకొనేవారు. క్రమశిక్షణ ప్రయోజనం ఎలా ఉంటుంది అంటే బండి ముందు గుర్రాన్ని కట్టి తోలితే బండి సాఫీగా వెళ్ళిపోయినట్లు ఉంటుంది. క్రమశిక్షణ వలన ఏకాగ్రత-నమ్రత లాంటివి అన్నీ వాటంతట అవి వస్తాయి. చాడీలు చెప్పేవారితో సన్నిహితమైతే మీ సాధన ఫలితం కూడా పోతుంది. మనకు చిన్న చిన్న మాటలు అర్థం కావాలంటే ఎంతో పుణ్యబలం కావాలి. వాల్మీకి అంటారు "నీకు ఎన్ని మంచి గుణాలు ఉన్నా అసూయ అనే గుణం ఉంటే నీ అన్ని మంచి గుణాలను హరించివేస్తుంది". నీవు ఏ పని చేసినా కోరిక సహిత కర్మ, కోరిక రహిత కర్మా అని ఆలోచించి చేయి. కోరిక రహిత కర్మ వలన సత్యం తెలుస్తుంది. దేహబుద్ధి నశిస్తేగాని సత్యానుభవం కలుగదు. మనం నిజాయితీగా పనిచెయ్యలేము.

85. చాలామంది ఇలా అనుకొంటారు "మనకు కడుపులో పోటు రాకూడదు, ఇతరులకు వచ్చినా పరవాలేదు. మన పేరు పోకూడదు, ఇతరుల పేరు పోయినా పరవాలేదు". కారణం ఒక శరీరంతో తాదాత్మ్యం పొందటం వలనే, ఈ దేహాభిమానం ఉన్నవానికి ఆత్మానుభవమా? మనం "సత్య" స్థితిలో లేము. అసత్య స్థితిలో ఉన్నాము. మరి మనకు సత్యస్థితి ఎలా వస్తుంది అంటే "నేను" అనే తలంపు ఎవడు తొలగించుకొంటాడో వాడికి మాత్రమే వస్తుంది. గ్రంథ పారాయణాల వలన ధన, గౌరవాల వలన రాదు. దొంగ "నేను" లోంచి విడుదల పొందటమే సాధన. శవబుద్ధి ఉన్నవానికి నమస్కారం పెడితే ఆ శవానికే చెందుతుంది. శివబుద్ధి ఉన్నవానికి నమస్కారం పెడితే శివునికే చెందుతుంది.

srinannagaru.com

కెరటానికి, కెరటానికి మధ్య సముద్రంలో స్నానంచేసి రావాలి, కెరటాలు తగ్గిన తరువాత స్నానం చేద్దాము అంటే సాధ్యం కాదు. అలాగే రాగ-ద్వేషాలు, లాభ-నష్టాలు అనే పరిస్థితుల మధ్య సాధన చేసి తరించాలి. ఆవేశాలు, ప్రతిఘటనలకు గురికాకుండా వివేకంతో జీవించాలి. చాలామంది చెబుతారు ఇతరులను బాధ పెట్టకూడదని, కాని ఎవరికి వారే హింస పెట్టుకొంటున్నారు. ఆందోళన వచ్చిందంటే మనస్సు ఉన్నట్లే లెక్క. సత్యం తెలిసే వరకూ మనం ఇతరులను హింస పెట్టకుండా ఉండలేము. మనం స్నేహాలు అజ్ఞానులతో చేస్తాము. జ్ఞానం ఎలా వస్తుంది. శాంతి ఎలా వస్తుంది. ఈ చిన్న విషయం గ్రహించలేకపోతే మీరు ఎందుకు జీవిస్తున్నట్లు. జ్ఞానుల మీద గౌరవం ఉంటే జ్ఞానులతో సహవాసం చెయ్యి. శ్రీరాముని ఫొటోలు పెట్టుకొని భజనచేస్తూ సరిపెట్టుకొంటే ప్రయోజనం లేదు. మారు మనస్సు పొందాలి.

సుమతీ శతకంలోని కంద పద్యము :

ఉపకారికి నుపకారము, విపరీతము గాదు చేయ వివరింపగా,
నపకారికి నుపకారము, నెపమెన్నగ చేయువాడె నేర్పరి సుమతీ॥

అపకారికి కూడా ఉపకారం చెయ్యాలి. అప్పుడు సత్వగుణం వస్తుంది. చైతన్యస్థాయి పెరుగుతుంది. పనిముఖ్యం. ప్రతీకారం, బుద్ధిని కలుషితం చేస్తుంది. మాట అణగాలి, మనస్సు అణగాలి మనస్సును ఎక్కువగా వాడకూడదు మాటలో స్పష్టత ఉండాలి.

86. మనకు ఇష్టంలేని వాళ్ళు తిడుతూ ఉంటే అది సహజం, దాన్ని గురించి కంగారు పడకూడదు. నిర్మలంగా ఉండాలి. శాంతి-సుఖాలు ఆకాశం నుంచి ఊడిపడవు. హృదయంలో నుంచే ఊరాలి. సమదృష్టి అలవర్చుకోవాలి. వికారాలు ఉన్నా అన్నీ అహంకారానికే అని గ్రహించాలి. మనం దుప్పటి కప్పుకొని నిద్రిస్తాము దాన్ని వదలం. అలాగే మనం ఎప్పుడూ అహంకారమనే దుప్పటిని కప్పుకొని ఉంటున్నాము. వదలటం లేదు. ఎటువంటి దుఃఖం వచ్చినా, ఎటువంటి అశాంతి కదలించినా శాంతిని పొందు-బ్రహ్మానుభవం పొందాలనేదే మన జీవిత గమ్యం. భగవాన్ బోధ ఒక్కటే "నీవు ఏదైతే అవునో దాన్ని గురించి ఆలోచించు. నీవు ఏదైతే కాదో దాన్ని గురించి ఆలోచించకు. నీ జీవిత గమ్యం మర్చిపోకు" రాముని అరణ్యవాసానికి పంపటానికి మందరతో ఈ సైతానుగాడు ఎన్ని చెప్పాలో అన్ని చెప్పింది. మీ సహస్రారం శుద్ధి అవ్వకుండా ఈశ్వరానుగ్రహం కలుగదు. దాన్ని శుద్ధి అవ్వనివ్వడు, ఈ సైతానుగాడు. దానికి గురు అనుగ్రహం కావాలి.

srinannagaru.com

ఆత్మ జ్ఞానానికి సహకరించని తలంపులను ప్రక్కకు తీసిపెట్టు అది చేతకాకపోతే శరణాగతి చెందు. వ్యాపారంలో భయం, వ్యవసాయం చేస్తే భయం అన్ని భయాల లోనూ జీవిస్తున్నాము. సుఖం ఉన్నప్పడు మనమే దేవతలం అనిపిస్తుంది. దుఃఖంగా ఉన్నప్పడు మనమే దెయ్యాలమని అనిపిస్తుంది. ఆ అశాంతిని తొలగించుకోవటానికి మరలా మనమే శాంతులను చేసుకొంటాము. పనిని అశ్రద్ధగా చెయ్యకూడదు. ఓపిక ఉన్నంతకాలం పనిని విడిచిపెట్టకూడదు. మన వంతు పనిని మనం చేస్తూ ఉండాలి. పని చేస్తూ ఉంటే ఆలోచనలు తగ్గిపోతూ ఉంటాయి. అలాగని రాత్రి పగలు పనిలో ఉండకూడదు. మధ్యే మార్గం అవలంబించాలి. నెలలు నిండిన అమ్మాయిని నీవు పనిచెయ్యకు అని చెబుతారు అలాగే ఈశ్వరుడు మనం పక్కానికి వచ్చాక పనిని వదిలింపచేస్తాడు. అంత వరకూ పని చెయ్యాలి.

87. పెద్దలను ఎప్పడూ అగౌరవపర్చకూడదు. హేళనగా నవ్వకూడదు. మంచి కుటుంబంలో జన్మించిన వారు ఎవ్వరూ అనవసరంగా నవ్వరు. ఇవి అన్నీ యజ్ఞాలే. వాళ్ళు మనలను పెంచితే కదా ఇంతా వాళ్ళమైనాము అందుచేత పెద్దలను గౌరవించటం యజ్ఞం చేసిన దానితో సమానం. ఇవి పైసా ఖర్చు లేని యజ్ఞాలు. ఇటువంటివి చెబితే లోకువగా చూస్తారు. పూర్వ మీమాంసలో చెప్పినవన్నీ భగవంతుని అనుగ్రహం కోసం చెప్పిన పునాదులు లాంటివే. మాట కూడా లక్ష్మి, మన మాట సౌమ్యంగా ఉంటే అది కూడా లక్ష్మితో సమానం. ఏపని చెయ్యాలన్నా దీక్ష, వివేకం, సహనం ఉండాలి. బుద్ధిని బాగా ఉపయోగించుకొనే కొలది సహనం, వివేకం కలుగుతాయి. క్రమశిక్షణ, నిష్ఠ అవసరం. ఒక మనిషికి ఎంత ఆస్తి ఉన్నది అనే విషయం కన్న హృదయం ఎంత బాగుంది అనే విషయం లోనే భగవంతుడు అనుగ్రహిస్తాడు. మనం ఏ పని చేసినా త్రికరణ శుద్ధిగా చెయ్యాలి. అది స్వధర్మం. ఈశ్వరుని నిరంతరం స్మరించటం వలన పవిత్రుల మౌతాము. వినీలత వస్తుంది. నీవు నిగ్రహంతో లేనప్పడు నిగ్రహం ఎలా వస్తుంది. మనస్సు విజృంభించకుండా చూచుకోవాలి. దేవుని అనుగ్రహం వరదలా రావాలంటే, సమాజ పరంగాను, ఇంట్లోను కోపకారణం ఉన్నా వ్యతిరేకత అవ్వ కూడదు. మీరు నిగ్రహంగా ఉంటే సఫలురు అవుతారు. ద్వేషించేవారిని కూడా ప్రేమించాలి. భక్తుల లక్షణాలను అలవాటు చేసుకోవాలి. వాటిని గ్రహించాలి. మనకు ఈ సృష్టి ఏదో ఏదో రూపంగా కనిపిస్తున్నది. అలా ఉండకుండా పరమాత్మగా చూస్తే మీకు అనుగ్రహం వస్తుంది. నోటితో, "నేను కర్తను కాను" అనుకొంటూ, మనస్సుతో "నేను కర్తను" అనుకొంటున్నావు. దాని వలన శాంతిని

srinannagaru.com

పొందలేవు. పూజ ఒక్కటే చాలదు. ప్రతీక్షణం పరమాత్మలో మనస్సు నియమించు కోవాలి.

88. మనం తినటానికి, బట్ట చుట్టబెట్టుకోవటానికీ రాలేదు. మన గమ్యం ఏమిటో నిరంతరం గుర్తించాలి. ఈ తలంపు వీడికి ఎప్పడు కలుగుతుందా అని ఎదురు చూస్తున్నాడు, గైడ్ చేస్తున్నాడు ఈశ్వరుడు. మనం ఎంత వరకూ ఆచరిస్తున్నాము అనేది ముఖ్యం. అంతేగాని వాళ్ళు ఆచరించటంలేదు, వీళ్ళు ఆచరించటం లేదు అనే ఆలోచన నీకు అనవసరం. మనం మన కళ్ళతో మనలను చూచు కోవాలి. అదే సాధన యొక్క ప్రయోజనం. ఏసును ఎలా శిలువ వేసారో అలాగే "నేను" అనే తలంపును శిలువ వెయ్యాలి. అదే సాధన. నీ బుద్ధి ఎంత వరకూ ఈ విషయంలో సాయం చేస్తే అంత వరకూ ఉపయోగించు కోవాలి. విచారణా మార్గాన్ని ఎంచుకోవాలి, హేతువాదాన్ని ఎంతవరకూ వెళ్ళగలిగితే అంత వరకూ ఉపయోగించుకొని, తరువాత నీ బుద్ధికి అందని విషయాలపై భగవంతుడు చెప్పిన విషయాలపై ఆధారపడి ఉండాలి. నిద్రలో నీకు తెలియకుండానే దేవుని దగ్గరకు జారిగిపోతున్నావు. అలాగే జాగ్రదవస్థలో ప్రయత్నం చేసి దేవుని లోనికి జారిపోవటమే సాధన. ఆ నిద్రపోవటానికి ఎ.సి.లు, ఫ్యాన్లు ఎన్నో ఏర్పాటు చేసు కొంటున్నావు. దానిలో సగం ప్రయత్నం జాగ్రదవస్థలో చెయ్యి గమ్యాన్ని చేరిపోతావు. ఏసు అంటాడు "నిన్ను నీవు పోగొట్టుకొని, కుళ్ళిపోయి ఉన్నావు" అంటే అక్రమాలతో నీవు ఎంతో సంపాదించినా ప్రయోజనం సున్నా. వస్తువు సిద్ధంగా ఉంది. దాన్ని కనిపెట్టనక్కరలేదు. ఆ వస్తువును కనిపెట్టకుండా అడ్డువచ్చే వాటిని తొలగించు కోవటమే సాధన. సహనానికి భూమి ప్రతీక అంటారు. అటువంటి సహనం రామచంద్రమూర్తిలో ఉంది అన్నారు వాల్మీకీ రామాయణంలో. భరించలేని రోగంతో మీ శరీరం బాధపెడుతూ ఉంటే దాని కన్న అసూయ గల వాడు పదిరెట్లు బాధపడతాడు అని కూడా ఆయన అన్నారు.

89. నిజమైన చూపు గలవాడు నిజాన్ని తెలుసుకొంటాడు, విషయ వికారాలను చూడడు. నీ బుద్ధిలోని దోషాలను తెలుసుకొని పవిత్రుడివికా, అప్పుడు నీ ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. నిజమైన "నేను"కు అంతా తానే. దేహమే నేను అనే దానికి ద్వంద్వాలు వస్తాయి. ఆ తలంపు పోతే ద్వంద్వాలు పోతాయి. మహాత్ములు, మంచివాళ్ళు "నేను" అనే మాటను వాడరు. దాన్ని వాడే కొలది, అది పెరిగిపోతుంది. దేహగతమైన నేను కోసమే అంతా బ్రతుకు తున్నారు, దాన్ని గురించే దాంపత్యాలు విడిపోతున్నాయి. ఆందోళనకు గురి అవుతున్నారు. ఒక్కమాటలో చెబుతున్నాను జాగ్రత్తగా వినండి "దేహం నేను అనే

srinannagaru.com

తలంపుకు దూరంగా ఉండండి చాలు" అది భారమైనది, బరువైనది. ఆ నేను గాయపరిస్తే ఎవరూ ఊరుకోరు. ఆ నేను వాడకాన్ని తగ్గిస్తే అది వెనక్కు వెళ్ళి కూరుకుపోతుంది. అదే జీవితధ్యేయం. సత్యాన్ని ఈ దొంగనేను మూసేస్తున్నది. దాన్ని తొలగిస్తే సత్యం అనుభవమౌతుంది. సత్యానుభవం పొందినవానికి, సూర్యుడు చల్లబడ్డా, చంద్రుడు వేడెక్కినా మంటలోని పొగపైకి వెళ్ళటం మాని లోపలికి వెళ్ళినా ఆశ్చర్యపడడు, అట్టిది ఆ సత్యానుభవం. చుట్టాల ఇంటికి వెడితే గంటలు, రోజులూ లెక్కపెట్టుకొంటే ఎంతో కాలం ఉండలేము. అలాగే సాధన గంటలు లెక్కపెట్టుకొంటే సాధన ఏమిటి? శ్రీ కృష్ణుడు ఇలా అన్నారు నీకు చివరి జన్మ ఎప్పుడు అంటే "ఇది అంతా వాసుదేవ మయం" అని ఒరిగి ఉండు, వేరుగా అది కనిపిస్తే నీ బుద్ధికి మాత్రమే అని అన్నారు. ఈ ముత్యం వంటిమాట చెబుతూ ఉంటే, చెవులు ఉన్నా వినలేరు. ధ్యానబలం ఉన్నవాడు, సహజంగా క్వయిట్‌గా ఉంటాడు. మాటతీరు స్పష్టంగా ఉంటుంది. వినయం వలన ఉన్నది పోదు. లేనిది వస్తుంది. అవినయం వలన ఉన్నది పోతుంది. రావలసినది కూడా రాదు. అన్ని అవస్థలలోనూ వినయం, శ్రద్ధ గుర్తించుకోవాలి.

90. మమకారం దుఃఖానికి కారణం. ఆధ్యాత్మిక పురోభివృద్ధి ఉండదు. మన తెలివిని, వివేకాన్ని కాపాడుకోవాలి. మన సుఖం కోసం ఇతరుల మీద ఆధారపడితే దుఃఖం వస్తుంది. దేహం ఎంత అసత్యమో దేహానికి సంబంధించిన ప్రారబ్ధం కూడా అంతే అసత్యం. ప్రారబ్ధంతో తాదాత్మ్యం చెందకపోతే చైతన్య సాగరంలో కలిసిపోతాము. గంగానదిలో నిప్పరవ్వలు వేసినా చల్లార్చుకొని గంభీరంగా సముద్రంలో కలిసిపోతుంది. అలాగే నీ జీవిత యాత్రలో లోకంలో విమర్శలు, పొగడ్తలు వస్తూ ఉంటాయి. వాటిని అంటకుండా ఉంటే మోక్ష సుఖాన్ని పొందగల్గుతావు. మీరు లోకాన్ని చూచి భయపడకండి, ఇతరులను భయ పెట్టకండి. జీవుడు అంటే ఎవరో అర్థం అవ్వాలికదా! సబ్జక్టు అవసరం. కాని కొందరు మత పెద్దలు, పూజను ఉదయం 8 గంటలకు ప్రారంభించి 12 గంటలకు లేచి ఐదు నిమిషాలు మాట్లాడుతారు. వివేకం గల ప్రముఖులు, ఉద్ధరించేవారు కావాలి. ధర్మాన్ని ఆచరించు, దేవుని పూజ గదిలో పూజను ఎంత శ్రద్ధగా చేస్తావో అంత శ్రద్ధతోనూ నిత్య జీవితంలో నీ పనిలో ఉండాలి. దేహ బుద్ధిలోంచి బయట పడితే ఇతరులు విమర్శలతో నిన్ను నిందించినా ఎర్ర చీమకుట్టినట్లు కూడా ఉండదు. ధర్మాన్ని ఆచరించటం వలన ఆరోగ్యం, ఐశ్వర్యం యశస్సు కలుగుతాయి. ఇరువది నాలుగు గంటల కాలం ఇరువది నాలుగు క్షణాలుగా గడిచిపోతుంది. మైండ్ కంట్రోల్‌లో ఉంటుంది. మీ ఉద్ధరణకు ఇది ఉపయోగపడుతుంది. నీ

srinannagaru.com

బుద్ధి ధర్మంగా లేకపోతే బాగాపాతదైన హెలీకాప్టర్‌లా గమ్యాన్ని చేర్చదు సరికదా చంపేస్తుంది. మనపాడు బుద్ధి మన పతనానికి కారణమౌతుంది.

91. లోకంలో లక్షమంది అమ్మాయిలు ఉంటారు. మీ కోడలే ఇలా అయినది అనుకొని ప్రయోజనం లేదు. ఈశ్వరుడికి తెలియదా మీ కోడలి పరిస్థితి. మీ ప్రారబ్ధంలో అది ఉంది. దాని ప్రారబ్ధంలో అది ఉంది అని రాజీపడాలి. బంగారం తెచ్చుకొందామని వెళ్ళటం కాని పిడకలు, పుల్లలు తెచ్చుకొంటున్నారు. కొందరు దేహపోషణలోని వైభవాన్ని, కొందరు తెలివి తేటలతోనూ, కొందరు మనస్సుతోను, కొందరు గౌరవాలతోనూ తాదాత్మ్యం పొందుతూ ఉంటారు. గమ్యమైన ఆత్మను మర్చిపోతూ ఉంటారు. మాట్లాడి ఆలోచించటం కన్న ఆలోచించి మాట్లాడితే మంచిది. మంచివాళ్ళతో సహవాసం చెయ్యండి. దుష్ట బుద్ధి ఉన్నవాడితో సహవాసం చెయ్యకండి. కాఫీ లేదని ఎండ్రిన్ తాగకండి. ఆధ్యాత్మిక అభివృద్ధికి శాంతిని, ధైర్యాన్ని సంపాదించుకోవాలి. బుద్ధుడిని ఒకరు "నాకు నిర్వాణ సుఖం ఎప్పుడు వస్తుంది" అనగా, ఒక పళ్ళెంతో నీళ్ళు తీసుకొని రమ్మన్నారు. అందులో అతని కాళ్ళు పెట్టి కొంత సమయమైన తరువాత తీయుమన్నారు. నీళ్ళు చూడుమనగా అవి నలకలుగా ఉండటానికి కారణం ఏమిటి అనగా నా కాళ్ళ దుమ్ము అన్నాడు. దానిపై బుద్ధుడు అంటాడు "నీ కాళ్ళు దుమ్ముతో ఉన్నాయి, నీ నడకకు పూర్వం ఇంటి వద్ద నీ కాళ్ళు శుభ్రంగా ఉన్నాయి. నీ ప్రయాణంలో దుమ్ము అంటుకోవటమే కారణం. అలాగే నీ మనస్సులో జన్మ-జన్మల నుంచి పోగుచేసుకొన్న దోషాలు పోగొట్టుకో, నిర్వాణ స్థితిని పొందుతావు" అన్నారు. ఇది మంచిదని భావించినప్పుడు దాన్ని నీవు చెయ్యక లేకపోతే నీలో ధైర్యం లేదని పిరికితనం ఉందని లెక్క. ధర్మాన్ని ఆచరించటం అవసరం. శంకరులు అంటారు ఈ రెండు అక్షరాలను మర్చిపోకండి "శ్రద్ధ". అది లేకపోతే మోక్షం రాదు. శ్రద్ధలేకపోతే భక్తి, జ్ఞానం, ధర్మం ఆచరించలేము. ప్రతీ క్షణం నీ మనస్సులోని తలంపులను గమనించుకోవాలి. బుద్ధిని శుద్ధి చేసుకోవాలి.

92. మీరు పుట్టినది లగాయతు ఇంద్రియాల ద్వారా పొందే ఆనందం ఏమైనా ఉందా, లాభం ఏమైనా ఉందా ఆగి ఆలోచించుకోండి. మీ ఇంద్రియాలతో పొందే భోగం పరిణామంలో రోగంగా మారిపోతున్నది. శాంతి మీ ఇంట్లో ఉన్న వస్తువులలో లేదు, పరిసరాలలో లేదు. అది నీ హృదయంలోనే ఉంది. దేహం నేను అనే తలంపు ఇక్కడే వదిలేయండి. వెంటనే మీకున్న బండెడు దుఃఖం ఇక్కడే ఈ క్షణంలోనే వదిలిపోతుంది. మనం తినే ఆహారం మనకు పడకపోతే

srinannagaru.com

అది తెలుస్తూ ఉంటుంది. అలాగే, భగవంతుడు, జ్ఞాని చెప్పే మాటలు మన పూర్వ జన్మ సంస్కారం, తిరస్కరిస్తుంది. అక్కడే మన తెలివి కావాలి. మన సంస్కారమే కదా అలా మనచేత అనిపింపచేస్తున్నది. జ్ఞాని చెప్పిన మాటలు నిజమే అని ఆ మాటలను ఇముడ్చుకొని ఆచరించాలి. పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము అనే గొడవలేగాని ఏ తలంపులు వస్తున్నాయి, అందులోంచి ఎలా బయట పడాలి, అనే తలంపు రావటం లేదు. మనస్సు యాత్రలకు వెళ్ళమంటుంది. అక్కడ చిడతలో, బొమ్మలో, దండలో కొని తెచ్చుకొని వాటితో ఆడుకొంటాము. చంటి పిల్లకు తల్లి ఆట వస్తువులు పడేసి తన పనికి ఆటంకం రాకుండా చూచుకొన్నట్లు మనస్సు చేస్తుంది. మన జీవితాన్ని చక్రం తిప్పినట్లు ఆ సూత్రధారి తిప్పుతున్నాడు. మనం తెగిపోయిన గాలి పటాల్లా లేము. ఈ విశ్వాసం నిజంగా కుదిరితే మనస్సు చలించదు. మనం గాలి పీల్చుకొనేడప్పుడు ఇలా అనుకోవాలి. మనం జ్ఞాన సముపార్జన కోసమేనని భావించి, గాలి పీల్చుకో, వదులుకో. నీ సమస్య నీవు పరిష్కారం చేసుకోలేనప్పుడు భగవంతుని మీద పూర్తి భారం వెయ్యి. నీ జీవితం ధన్యమౌతుంది. మంచి జరిగినా చెడు జరిగినా, అవమానం జరిగినా అంతా భగవంతుడికి తెలుసు అన్న విశ్వాసం కుదిరితే, భయరహితుడవు, దుఃఖ రహితుడవు అవుతావు.

93. ఏ సంఘటన ద్వారా ఈశ్వరుడు మీ జీవితాన్ని మలుపు తిప్పుతున్నాడో అది మీకు చెడు అనిపించవచ్చు. కాని అది మీ ఆధ్యాత్మిక జీవితానికి సహాయ పడుతుంది అనే వివేకం మీకు కలగాలి. అప్పడే మీ జీవితం సఫల మౌతుంది. డబ్బు కాపాడుకోవటం కన్న మంచి తనాన్ని కాపాడుకోవటం కష్టం. నీ మంచి తనాన్ని చెడగొట్టే స్నేహితులను నీవు దూరం చేసుకోవాలి. ఏ సంఘటన ఎలా జరిగినా కొందరు దుఃఖ పడరు. భక్తులైన వారి మనస్సు భగవంతుని పాదాల మీద ఉంటుంది. జీవకోటికి శత్రువు కామం మాత్రమే. ఇంద్రియాలతోనూ, బుద్ధితోనూ కృష్ణుని ఆరాధిస్తే వాటిలో ఉన్న కామం మిమ్ములను ఏమి చేస్తుంది. భక్తి ముందు కామం ఏ పాటిది. నీవు చర్మాన్నేనా ఆరాధించేది. శివుణ్ణి ఆరాధించలేవా. చర్మానికి లోతు తక్కువ. మన చర్మ సంబంధమైన ప్రేమలు కూడా అంతే. ఏ మతం చెప్పినా ధర్మాన్ని ఆచరించమనే. ఆశలేకుండా పనిచేస్తే జపతపాల వలన కలిగే ఫలితం దాని వలన కూడా కలుగుతుంది. హృదయంలో "నేను తరించాలనే" గట్టి విశ్వాసం కావాలి. మన చేతిలో ఉన్న పనిని, నిజాయితీగా చెయ్యాలి. మీ శరణాగతి నిజమైతే మీ శరీరంలో ప్రతీ కణంలోనూ మార్పు వస్తుంది. భోగాలవైపు ఆసక్తి తగ్గుతుంది. లోపల శుచిగాను, బయట శుచి

srinannagaru.com

గాను ఉండాలి. అది ఎంత శుచిగా ఉంటే అంత తొందరలో తరించగలవు. ఒక మహాత్ముడు ఎవరికి దానం చేసినా తలవంచుకొని ఇచ్చేవారు. కారణం ఏమిటి అని అంటే ఆయన ఇలా అన్నారు. "నాకు భగవంతుడు ఈ సంపదను ఇచ్చాడు. నా అహంకారం వలన ఏమీ జరుగదు. కాని పుచ్చుకొనే వారు ఏమను కొంటున్నారు అంటే నేను ఇచ్చాను అని అనుకొంటున్నారు. అందువల్లనే సిగ్గుతో తలవంచుకొంటున్నాను" అన్నారు. బుద్ధుడు ఎక్కువగా చెప్పేది నైతిక ప్రవర్తన ముఖ్యం అనేవారు.

94. అజీర్తిరోగం ఉన్నవాడు ఎంత తిన్నా, ఏది తిన్నా రాణించలేడు. అలాగే మమకారం లోపల పెట్టుకొని నీవు ఎంత సాధన చేసినా రాణించదు. ఈ ప్రపంచంలో రెండు పదార్థాలను చూస్తున్నాము. ఒకటి జీవ పదార్థం, రెండవది జడ పదార్థం. ఈ రెంటికీ అతీతంగా ఒక హయ్యర్ పవర్ ఉంది. బుద్ధిలోని దోషాలను తొలగించుకోవటానికి నీ తెలివి తేటల ప్రయోజనం కన్న, ఈశ్వరుని పట్ల సజీవ విశ్వాసం ఉంటే దాని ప్రయోజనం ఎక్కువ. నీవు వాసనా రహితుడవు అవుతావు. కృతార్థుడవు అవుతావు. బుద్ధుడు ఆరు సంవత్సరాలు సాధన చేసి శరీరం "నేను అనే దుంప, కోరికలతో కూడిన దుంప కాలిబూడిద అయినది. ఇప్పుడు స్వేచ్ఛను పొందాను" అన్నారు. మనం పాట విన్నా, నాట్యం చూచినా వ్యసనమే. దాన్ని మీరు అనుకరిస్తే అజ్ఞానం పెరుగుతుంది. గౌరవం నీవే, అగౌరవం నీవే అనే భావన వలన శరణాగతి సాధ్యమౌతుంది. భాగవతంలో ఇలా ఉంది "రాయిని ఆరాధిస్తే నీవు పవిత్రుడివి అవ్వవు. రాతి మీద నీకు దేవతాబుద్ధి కలిగితే నీవు పవిత్రుడివి అవుతావు. ఏకాగ్రబుద్ధి కలుగుతుంది. పరమశాంతి నిన్ను వరిస్తుంది". శరణాగతే మీ బుద్ధిలోని వంకర్లను లాగివేస్తుంది. ఇంద్రియాలు అన్నీ కండిషన్‌లో పడిపోతాయి. చెడ్డ ఆలోచన అంతాపోయి, మంచి ఆలోచన వస్తుంది. శరణాగతికి మించిన ప్రార్థన ఈ సృష్టిలో ఏదీ లేదు. మన బుద్ధులు జడబుద్ధులు కాబట్టే జడమంటే ఇష్టం, చైతన్యమంటే ఇష్టం ఉండదు. అర్జునుడు చైతన్యమైన కృష్ణుని కోరుకున్నాడు. దుర్యోధనుడు జడమైన సైన్యాన్ని కోరుకున్నాడు. ఒక మనిషి ఔన్నత్యం సత్‌పురుషులకు తెలుస్తుంది. కృష్ణుడు అవతార పురుషుడని భీష్ముడి వంటి కొద్దిమందికే తెలిసింది. అన్ని ఆనందాలలోకి బ్రహ్మానందం గొప్పది. అందుకే బ్రహ్మచర్యాన్ని అనుసరిస్తారు.

95. కొందరు ఏబది ఏళ్ళనాటి కాలంలో జీవిస్తారు మా తాతలు అటువంటి వారు అని, కొందరు భవిష్యత్తును గురించి గాలిమేడలు కట్టుకొని జీవిస్తారు. కాలాన్ని చంపేసుకొంటారు. స్నేహంవలన విరోధాలు వస్తాయి. కాలం

srinannagaru.com

పాడౌతుంది. లోక వాసన, దేహ వాసన పెరిగిపోతుంది. హృదయ పరిశుద్ధత, హృదయ నైర్మల్యం ప్రధానం, దాన్ని ప్రయత్నంతో సాధించాలి. విషయాలతో, ఇంద్రియాలకు తాదాత్మ్యం వచ్చింది అంటే రాగద్వేషాలు వచ్చేస్తాయి. వినయాన్ని వివేకాన్ని కాపాడుకోవాలి. ఈశ్వరుని పాదాలమీద ధ్యాస విడవకూడదు. అది వదిలితే, విరోధులతోనూ, స్నేహితులతోనూ తాదాత్మ్యం తప్పదు. కొందరికి మనస్సు బాహ్య ముఖమైపోతుంది. మనస్సు బయట బొమ్మలతో తాదాత్మ్యం పొందుతుంది. కాని మీకు వివేకం చెబుతూ ఉంటుంది. ఇలా "ఇది నీకు ఉపయోగం కాదు" అప్పుడు దాన్ని పట్టుకొంటే తేలికగా విడుదల పొందుతావు. దుర్యోధనుడు భీష్ముల వారి హితబోధ విన్నాక అంటాడు "ధర్మాధర్మాలు నీవు నాకు చెప్పనక్కరలేదు నాకు తెలుసు కాని నేను దాన్ని ఆచరించలేకపోతున్నాను. అధర్మంలోంచి బయట పడలేకపోతున్నాను. ఏమిచెయ్యమంటావు" అని అంటే పతనావస్థలో ఉండే వారి స్థితి అది. మనస్సును స్నేహం చేసుకొంటే ప్రారబ్దాన్ని కూడా జయించవచ్చును. ఆ శక్తి దానికి ఉంది. ఏవిషయంలోనూ అతిగా ఉండకూడదు. మధ్యే మార్గం అవలంభించి తరించాలి. కొందరు ఇలా అనుకొంటారు. "వారికి సమాధి స్థితి వచ్చింది, మాకు రాలేదు" అనే గొడవలే. నిజ భక్తుడు భగవంతుని పాదాలు విడిచి పెట్టడు. వారు ఇలా అంటారు "సమాధి అంటారు అదే మీ మాకు తెలియదు. ఈ శరణాగతి చాలు మాకు" అంటారు.

96. ఏ విషయంలోనైనా ఆ విషయం ఎంతవరకూ అర్థమయితే అంత వరకూ అర్థం చేసుకోవాలి. విపరీత అర్థాలు కల్పించుకోకూడదు. నీ విపరీత బుద్ధి, పెడబుద్ధి నీ చైతన్యస్థాయి పెరగకపోవటానికి కారణమౌతున్నది. ఊహించు కోవటం, కల్పించుకోవటంతో నీ కాలం అంతా వృధా అవుతున్నది. మనస్సులోని వంకర్లు తీయటం అంత తేలికకాదు. ఈశ్వరుని పాదాలు ఆశ్రయించాలి, అప్పుడు అక్కరలేని తలంపులు రావు. ప్రకృతిలోంచి బుద్ధిని విడదీస్తే అదే మోక్షం. ఇది నాది, అది నాది, ఇది ఇష్టం, అది అయిష్టం అనుకోవటంతోను, ప్రకృతి విషయాల తో విడిపోతే నీ మనస్సు ఆత్మ గూటిలో పడిపోతుంది. పరమ పవిత్రమైన మనస్సు కు, ఆత్మకు తేడా లేదు. మలిన మనస్సు బంధహేతువు. భేదబుద్ధి నశించాలి. తలంపే దుఃఖానికి కారణం. అందులోంచి విడుదల పొందాలి. అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తున్నది అనేది అర్థమయితే దుఃఖం తగ్గుతుంది. మనం ఎవరి అభివృద్ధిని చూచి అసూయపడితే వారి అభివృద్ధి ఆగదు. తరువాత ఆ అసూయే మిమ్మల్ని బంధిస్తుంది. నీ మనస్సులోని కుటిలత్వాలలోంచి నీవు బయటికి రావటమే సాధన. కొందరిని ముఖస్తుతి చెయ్యాలి, ధూపం వెయ్యాలి, వాడు

srinannagaru.com

దుర్యోధనుడైనా శ్రీకృష్ణునితో పోల్చాలి అటువంటి వారి మధ్య కూడా జీవించాలి. ఎవరైతే మనస్సును బంగారం చేసుకొంటారో వారికి శాంతి, పవిత్రత ఉంటుంది. ఇవి ధైర్యవంతునికి మాత్రమే వస్తాయి. ఈ రెంటివలన గమ్యాన్ని చేరుతాము. జగత్తు అంతా కామం చుట్టూ తిరుగుతున్నది. ఈశ్వరునికి జీవునికీ ఉన్న సంబంధం ప్రేమ. జీవుడికి-జీవుడికీ ఉన్న సంబంధం కామం.

97. చావుకు దయ ఎలా ఉంటుందో తెలియదు. కాలాన్ని సద్ వినియోగం చేసుకోవాలి. భగవంతుని రూపంతో పాటు మాటను కూడా ధ్యానం చెయ్యాలి. ఈశ్వరుని పాదాలు ఆశ్రయించి ప్రయాణం చెయ్యాలి. ఫలితం ఈశ్వరుని అధీనంలోనే ఉంది. ఈ దేహం, ఈ పేరు నాది. అనేదానిలోంచి విడుదల పొందితే ఇప్పుడే, ఇక్కడే చైతన్య సాగరంలో ఈదులాడుతావు. వాటిలో తాదాత్మ్యం పొందితే పూర్తిగా అజ్ఞానంలో మునిగిపోతావు. అజ్ఞానం నుంచే భ్రాంతి వస్తుంది. ఎవరైనా అజ్ఞానంతో బాధపడుతూ ఉంటే మంచి మనస్సుతో భగవంతుని ఇలా ప్రార్థించండి. "ఆ బలహీనత నుంచి వారిని తప్పించు". ఆ ప్రార్థనా ప్రభావం తప్పక పనిచేస్తుంది - అతనికి, అతన్ని విమర్శించకు. విషయాలకు స్వతంత్ర్యం లేదు. మనస్సే విషయాలకు శక్తినిస్తుంది. వాసన నశిస్తే విషయాలు ఎక్కడ? అద్దం లేకపోతే ప్రతిబింబం ఎక్కడ? దేహం నేను అనే తలంపే విషయాలను చింతిస్తుంది. సత్యాన్ని ధ్యానం చేస్తే విషయ చింతన ఉండదు. విషయాలను చింతించేవాడు లేకపోతే వాటికి అస్తిత్వం ఎక్కడ? "మనిషికి మానసిక స్థిమితం అవసరం. రామనామం చెయ్యటం వలన నాకు మానసిక స్థిమితం వచ్చింది" అన్నారు గాంధీజీ. "మానసిక స్థిమితం" అంటే రజోగుణం తమోగుణంతో మాట్లాడకుండా ఉంటూ శాంతిగా ఉండటం. మనిషి ఏ పని చేసినా నిజాయితీగా చెయ్యాలి. ఏనుగు చాలా అందంగా, గంభీరంగా నడుస్తుంది. అలాగే మాటను బట్టి, నడకను బట్టి వారు ఉన్నత కుటుంబంలో జన్మించారని మనం గుర్తు ఉంచుకోవచ్చును. శరణాగతి మహా యోగం. యోగాలకు యోగం. అది జీవుడిని నొప్పి లేకుండా బ్రహ్మంలో కలుపుతుంది.

98. రామకృష్ణ పరమహంసగారి శిష్యులులో శివానంద ఒకరు వారు తన పెంపుడు కుక్కతో ఇలా అన్నారు. "నేను నీకు ఏ ఆహారం పెట్టినా నీకు నా పాదాల మీద ఎంత విశ్వాసం ఉందో. అలాగే నాకు భగవంతుని పాదాల మీద అంత విశ్వాసం ఉంటే తరించగలను" అన్నారు. విషయాలను కోరుకోని వానికి పునర్జన్మరాదు. మనః ప్రవాహానికి వాలుగా వెళ్ళేవాడికి సాధన అక్కరలేదు. మనో మూలానికి ఎదురీదటానికే సాధన. మిమ్ములను ఎవరైనా విమర్శిస్తే దుఃఖ

srinannagaru.com

పెడుతూ ఉంటే మీకు ఇక సాధన ఏమిటి? శరీరం నేను అనే తలంపే పాపం. దానికి మించిన పాపం మరి యొకటి లేదు. అది ఉంటే ఈ రోజు పాపం చెయ్యకపోయినా రేపైనా పాపం చేసి తీరుతావు. చెట్టు కొమ్మలు, కాండం, ఆకులు, పుల్లలకు బీజమే మూలాధారం. అలాగే ఈలోకం, సంసారం, కుటుంబం, అన్నీ శరీరం నేను అనే తలంపు పైనే ఆధారపడి ఉన్నాయి. విషం అంతా ఆ తలంపు మీదే ఉంది. విషంతో కూడిన సంసారం విషయాకారం కాక ఏమౌతుంది. చేసేపనిని శ్రద్ధగా చెయ్యటం కూడా ధ్యానంతో సమానం. మార్గాలు అన్ని సమన్వయం చేసుకోవాలి, విచక్షణ ఉన్నవాడు ఎప్పుడు, ఎక్కడ, ఎంత వరకూ మాట్లాడాలని భావిస్తాడు. అది లేనివాడు పేచీలు పెట్టుకొంటాడు. నీలో సుఖ సముద్రము పొంగితే మహా ప్రవాహంలో అరిటాకులు, ఏనుగులు ఎలా కొట్టుకొని పోతాయో ఆనదిలో, అలాగే నీ దుఃఖాలు, బలహీనతలు అన్నీకొట్టుకొని పోతాయి. జీవితాన్ని నడిపేది తలంపులే. వాటి విషయంలో అజాగ్రత్తగా ఉంటే పతనమౌతాము. గమ్యం తప్పిపోతాము. లోకవాసన ఉంటే జ్ఞానం ఎన్నడూ రాదు. గతాన్ని తలపెట్టుకోవటం, భవిష్యత్తు గురించి కలలు గనటం వర్తమానాన్ని పాడుచేసుకోవటమే.

99. ఈ దేహం నాది అనుకోవటం వలన తప్పలేదు. "నేను దేహాన్ని" అనుకోవటం వలననే ప్రమాదం. ఆత్మస్తుతి పరనింద దేహభావనను పెంచేస్తుంది. పరనింద వలన దోషం అంటుకొంటుంది. అది ఈశ్వర ఆజ్ఞ. దేహభావన ఎన్నడూ అలంకరించుకోకు అదే సాధన. సమాధి స్థితి వచ్చినప్పుడు దేహభావన వేరుతో సహా నశిస్తుంది. మనకు శాంతి కావాలి, శాంతి ఎక్కడనుంచి వస్తుంది? పవిత్రత నుంచి వస్తుంది. అందుకనే త్రికరణ శుద్ధి కావాలి. నీమాట నీతలంపును బట్టి వస్తుంది నీపని, నీ తలంపును బట్టి వస్తుంది. వాటికీ ఎల్లప్పుడూ అన్ని కోణాలలోంచి పవిత్రతను పట్టించాలి. మన ఆలోచనా స్థాయి పడిపోకూడదు. ఎంత ఉద్రిక్తస్థితిలోనైనా నీ ఆలోచనా స్థాయి పడిపోకూడదు. స్తోత్రాలకు, విమర్శ లకు నిలకడగా ఉండాలి. ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్. నీ మైండ్‌ని ఎప్పటికి అప్పుడు అజమాయిషీ చేసుకోవాలి. ఫ్యాక్టరీ ఓనరు తన నౌకర్లను ఎలా మేనేజ్ చేస్తాడో, కారు నడిపేవాడు హేండిల్‌ని ఎలా మేనేజ్ చేస్తాడో అలాగే మీ మైండ్‌ని మేనేజ్ చేసుకొంటే ఈ జన్మలోనే తరిస్తారు. నీ తలంపు భగవంతుని పాదాల వద్దకు చేరేలా ఉండాలి. ఆ తలంపు నీకు, ఇతరులకు కూడా ఉపయోగ పడేలా ఉండాలి. పుణ్య బలం లేకపోవటం వలననే ఓర్పు రాదు. భగవంతుని పొందాలనే కాంక్ష కలగటం లేదు. తాత్కాలిక వస్తువులను, పరిస్థితులను దృష్టిలో

srinannagaru.com

ఉంచుకొని జీవించకండి. పరమాచార్యుల వారిని ఒకరు ఇలా ప్రశ్నించారు "ఈ శరీరం నాది కాకపోయినా నాది అని ఎందుకు అనుకొంటున్నాను?" అనగా ఆయన "అలా అనుకోకపోతే ఏనాడో ఆ కొంపలోంచి బయటికి వచ్చేవాడివి" అన్నారు. సోమరితనం ఉన్నవానికి మంచి లక్షణాలు రావు.

100. వ్యక్తి భావన, స్వామికి అర్పించుకో అప్పుడు అందుండి విడుదల పొందుతావు. నీ ప్రయత్నంలో నిజాయితీ ఉంటే, వేదన ప్రారంభమైతే ఆయన సహాయ సహకారాలు నీకు అందుతాయి. బియ్యంలో బెడ్డలు ఏరి పారేస్తాము. దాని గురించి పట్టించుకోము. అనవసరంగా అహంకారంతో ఎవరైనా మాట్లాడితే వాటిని పట్టించుకోకండి. మీ చిరు కోరికలే మిమ్ములను ఈశ్వర సామ్రాజ్యంలోకి ప్రవేశించకుండా బంధిస్తున్నాయి అని మీకు తెలియటం లేదు. మనకు విభేదం వద్దు, అభేదంలో ఉందాము. మంచి జరిగినా, చెడు జరిగినా ఈశ్వర ప్రేరణ ఉంటుంది అది గ్రహించలేక అది అలా జరిగింది ఏమిటి? ఇది ఇలా జరిగింది ఏమిటి? అని మనం అనుకొంటాము. వైరం, అసూయ, భయం పనికిరావు. అవి ఉంటే నీ ఇష్టదైవం ముందు నీవు కూర్చుని ధ్యానం చేసినా పై కారణానికి హేతువులైనవారు నీకు గోచరిస్తారు. మన గమ్యం మరుస్తాము. జన్మాంతర బంధం ఉంటేనే స్నేహం, జీవితాంతం ఉంటుంది. ప్రతీ సంఘటనా ఈశ్వరుడు తన చేతులను కనబడనీయకుండా ఇతరులతో చేయిస్తూ ఉంటాడు. యశోద అంటుంది ఫిర్యాదు దారులతో "మా అబ్బాయి మా ఇంటి దగ్గరే ఉన్నాడు. మీరు చెప్పేది నిజంకాదు" ఆ చేష్టలే దానికి ఉదాహరణ కలియుగంలో ఒక మెరిట్ ఉంది. మీరు ఎవరినైనా ద్వేషించినా, ద్వేషం-పగ-తలంపులోకి వచ్చినా నోటి ద్వారా అది కాకపోతే అది సంస్కారంగా రాకుండా ఉంటుంది. అదే సత్యయుగ మైతే మనస్సులోకి వచ్చిన దోషం కూడా మైనస్ మార్కుల క్రిందకి వస్తుంది. లేని వస్తువును తెలుసుకోవటం కాదు లోపల ఉన్న నిజమైన వస్తువును తెలుసు కోవటమే నిజమైన సాధన. మన క్షోభలకు, బాధలకు, అమర్యాదలకు, లోపల ఉన్న సత్యానికి ఎట్టి సంబంధం లేదు. ఎవరింటికి వెళ్ళినా, గౌరవాలు, అగౌరవాలు అనే ప్రవాహంలో కొట్టుకుపోకు. దానికి దేహం లేదు. లోకం లేదు.

101. ఇంట్లో కష్టాలు వస్తే అవి మీకు లోచూపును కలుగచేస్తాయి. అవి మంచివే. నిన్ను నీవు ఎలాగూ తిట్టుకోలేవు ఎవరైనా తిట్టనియ్యి. నీకు మంచే జరుగుతుంది. కష్టాలను ఆత్మానుభవం కోసం మలుచుకోండి. మనం పాడైపోవటానికి కారణం ఉద్రేకపడటమే. సమగ్రంగా జాగ్రత్తగా ఆలోచించు శాంతిగా ఉండు, నిశ్చలంగా ఉండు నీవు చల్లగా ఉంటే లోపల ఉన్న సత్యం నీకు

srinannagaru.com

తెలియబడుతుంది. గర్వం బాధ రాకుండా చూచుకోవాలి. పదవి, సౌభాగ్యం, భోగం వచ్చినప్పుడు గర్వం రాకుండా చూచుకోవాలి. ఒక్కొక్కసారి దురదృష్ట పరిస్థితులు వెంటాడుతూ ఉంటాయి. అప్పుడు బాధ రానియ్యకూడదు. ఈ రెంటిలోనూ ఏది వచ్చినా గమ్యం మర్చిపోతాము- తప్పిపోతాము. సర్వకాల సర్వ అవస్థలలోనూ గర్వం రాకుండా ఉన్నవానికి సమాజం గౌరవిస్తుంది. అభ్యాసం, వైరాగ్యం లేకుండా సత్యం కానరాదు. రెంటి విలువ తెలియక చిలక పలుకులు పలుకుతున్నారు. కర్తలేని పనే కర్మ యోగం. కామక్రోధాలు అనే శత్రువులు నీ ఇంటికి వస్తూ ఉంటే నీవు వారిని ఎందుకు రానిస్తున్నావు. నీ బుద్ధిని పాడుచేసి నీకు పునర్జన్మను తీసుకొని వచ్చేవారిని ఎందుకు అనుమతిస్తున్నావు. నీకు ఇష్టంలేని వారిని నీ ఇంటికి రానియ్యవు కదా! నగరాలలో పగలే తలుపులు వేసుకొంటారు ఎవరైనా వస్తే అద్దంలోంచి చూచి ఉపయోగమైన వారిని రానిస్తారు. చెడు చేసేవారికి తలుపు తియ్యరు. అలాగే నీవు కాని వాటికి, నీకు చెడు చేసేవారికి అంటే కామక్రోధాలను ఎందుకు రానిస్తావు. ముందు ఆ తలుపులు ముయ్యి. అదే సాధన. ఈ ఉద్రేకాలతో కూడినవి. ఇష్టాలతో కూడిన తలంపులు ఏమీ నిజంకావు. నీ నిజమైన బంధువు ఎవరో కష్టకాలంలో తెలుస్తుంది. గుడ్డి వాళ్లను, కుంటి వాళ్లను భరించవచ్చు, అమాయకులను భరించటం ప్రపంచంలో అన్నింటికంటే భరించరానిది, కష్టమైనది.

102. సాధన చేసుకోలేని వాళ్లను వదిలేయండి, సాధన చేసుకొనే వాళ్ళు కూడా, దేహం నేను, దేహం నేను అని అనుకోవటం వలన కాటిలోకి వెళ్లే వరకూ దుఃఖం వదలటం లేదు. నిద్రలో నీకు దుఃఖం లేదు. వల్లకాటి దాకా ఎందుకు దానికి కారణం పుణ్యబలం లేకపోవటమే. "అందరి గురించి తెలుసుకొని నీ గురించి నీవు తెలుసుకోకపోవటం జ్ఞానమా?" అన్నారు భగవాన్. దానిపై ఒకాయన అన్నారు "నాకు అర్థమైనా అందరికీ ఈ మాటలు అర్థం అవుతాయా?" అంటే "దొంగ నేను కల్పించేదే అందరూ, నీ విషయం నీవు చూసుకో, దొంగ నేను తెలుసుకోలేకపోతే దాన్ని మర్చిపో" రెండూ అవకాశాలే. పుట్టిన వస్తువుకు పరిణామ సిద్ధాంతం కాని, పుట్టని వస్తువుకు ఆ సిద్ధాంతం వర్తించదు. నీ సంకల్పమే సంసారం, నీ తలంపే సంసారం. ఈ సంకల్పాలను ఎవరు పోషిస్తున్నారు అంటే దేహం నేను అనేదే, నీ మనస్సులో అజ్ఞానం, అహింస పుట్టించేది అదే. "తాడు" ఎంతకాలం పాముగా కనిపిస్తుందో అంతకాలం అది తాడే అనే బుద్ధి కలుగదు. గురు అనుగ్రహం వలన దేహం నేను అనే తలంపు పోతుంది. తలంపులో ఏముంది అనుకోకండి తలంపు పుట్టిన తరువాతే పని

srinannagaru.com

చేస్తాము. ఈశ్వరుని పాదాలమీద విశ్వాసం కలిగితే చాలు. మీ జీవితం సఫలమౌతుంది. మెదడులో పవిత్రత మాట - చేతలలో పవిత్రత, ఎంతో కొంత లేకపోతే ఈశ్వరుని పాదాల మీద దృష్టి నిలవదు. కొందరి ముఖాలు ఎప్పుడూ ప్రశ్నార్థకంగానే ఉంటాయి. వారు దుఃఖం వస్తే ఊరంతా పంచిపెడతారు. సంతోషం వస్తే తానే అనుభవిస్తారు. వారికా జ్ఞానం. జపధ్యానాలే అభ్యాసం. దుఃఖం తలంపు లేకుండా రాదు. అది నీవు కాదు. జగడాలు అన్నీ మూలతలంపు లోంచే లెగుస్తూ ఉంటాయి.

103. సముద్రంలోనే బుడగపుడుతుంది. అందే, లయమౌతుంది. కొంతకాలం ఉండి అలాగే మానవ జీవితాలు కూడా బ్రహ్మంలోనే ఉద్భవించి అందే కొంతకాలం ఉంటూ తరువాత అందే లయమౌతాయి. అది అంతా స్వప్న మాత్రము. పుణ్యఫలం లేకపోతే మంచి మాటలు వినే తలంపు, వాటిని ఆచరించాలనే తలంపు రాదు. లోచూపు ఉన్నవానికి, వివేక బుద్ధి, సూక్ష్మదృష్టి కలుగుతుంది. సాధన ఎలా చెయ్యాలి అనే విషయం తెలుస్తుంది. దానికి గురువు అనుగ్రహం ఉండాలి. పాము కంటే "పాపము" ప్రమాదం. పాము కరిస్తే శరీరం మాత్రమే పోతుంది. పాపము, జన్మ జన్మలకు వస్తుంది. పాపములో మధ్య అక్షరమైన "ప" తీసివేస్తే "పాము" అవుతుంది. మంచి చెప్పినా కొందరు విరోధులౌతారు. కారణం వారిలో ఉన్న పాపమే. కోరికలను నెరవేర్చుకొంటూ, ఆత్మానుభవం పొందినవాడు ఈ సృష్టిలో ఎవ్వరూ లేరు. ఒక కోరిక నెరవేరితే అది పది తరువాత, వంద, వెయ్యి అలా సాగుతూనే ఉంటుంది. ముగింపులేదు. మూఢాచారాలు, మూఢనమ్మకాల మీద ఉన్న విశ్వాసం, మన తెలివి మీద, మన వివేకం మీద మనకు లేదు. ఈ లోకంలో సత్త్వగుణం ఉన్నవారు తక్కువ. మనం ఈ లోకానికి ట్రైనింగ్ కోసం వచ్చాము. అనే విషయం మర్చిపోకూడదు. మీ ప్రయత్నం మీద విశ్వాసం లేదు అందుకే మానసికంగా ఎదగటం లేదు. భగవాన్ అన్నారు "మీలో ఏదైనా దోషం ఉంటే ఆత్మజ్ఞానం రావటానికి ఆటంకం కాదు. మీలో దోషం ఉందని భావించే తలంపుకే ఆత్మజ్ఞానం రాకుండా చేస్తుంది" ఈ మాట అద్భుతమైనది. అందమైనది. నీవు కల్పించుకొన్న విషయాలను వదులు కోవటమే సాధన. మంచి మాటకూడా ధనమే అది అనేక మందికి శాంతిని కలుగచేస్తుంది. మనం ఏమి చేస్తున్నా ఎంత వరకూ పవిత్రులమౌతున్నామనే ఆలోచన రావాలి. భగవంతుడు సర్వసాక్షి, ఆయన అన్నీ గమనిస్తున్నాడు.

104. జీవలక్షణాలలో భయం ఒకటి తానుగాని శరీరంతో, పరిసరాలతో వ్యక్తులతో, తలంపులతో తాదాత్మ్యం పొందిన వానికి భయం వస్తుంది. పాయసం

srinannagaru.com

కప్పులో పోసి ఇస్తే మనం గుర్తించవలసింది కప్పను కాదు పాయసానికి ఒక ఆధారం కోసమే అది ఇచ్చారు. అలాగే, మనం వ్యక్తులను చూచేటప్పుడు రంగు, ఆస్తి ముఖ్యం కాదు, చైతన్యాన్ని మాత్రమే గుర్తించాలి. పాయసం పిడతలో పోసి ఇచ్చినా రుచిలో మార్పు ఉండదు, కురూపి, దరిద్రుడిలో కూడా చైతన్యం ఉంది. గతం అనేది వేస్టు. ఫ్యూచరు అనేది మిస్టరీ. వర్తమానంలో జీవించాలి. నీ గురించి పొగుడుకోకు, ఇతరులను తిట్టకు ఈ రెండూ చెడ్డవి. ప్రారబ్ధంలో లేనిది రాదు, ఉన్నది నీవు వద్దు అనుకొన్నా రాకమానదు. దేహ భావన పెంచే మాటల వలన తెలివి తక్కువ మాటల వలన నీ జీవితం కష్టమౌతుంది. ప్రమాదాల పాలౌతావు. ఫలితం పట్ల నిరీక్షణ వలన మనస్సు అపవిత్రమౌతుంది. ఏకాగ్రత పోతుంది. మీకు ఏ తలంపు వల్లనైనా సంతోషం వస్తే వెంటనే అది దుఃఖంగా మారిపోతుంది. నిరంతరం మీరు దుఃఖానికి గురి అవుతూ ఉంటే మీకు వివేకం తక్కువ అని అర్థం. సంఘటనల దగ్గర, మనుషుల దగ్గర ఆగిపోకండి. జీవిత గమ్యాన్ని మర్చిపోకండి. "సత్యం" మనలోనే ఉంది అనే విశ్వాసం లేని బుద్ధులం జీవితంలో జరిగే ప్రతి సంఘటనను సాధనగా మార్చుకోవాలి. సహనం కావాలి. తేలిక మనుషులకు తత్త్వం తెలియదు. భయం లేకుండా చెప్పటం కంటే భయం లేకుండా జీవించటమే ముఖ్యం. భయం కూడా తలంపే. తలంపులు లేని వస్తువు ఆత్మ. అది నీవు శరణాగతి పొందితే కోరికలు, భయాలు తగ్గిపోతాయి. నీకు బాహ్య దృష్టి ఉంది కాబట్టి లోకం కనబడుతున్నది. అంతర్ దృష్టి కలిగితే నీ లోపాలు నీకు తెలుస్తాయి.

105. కర్తృత్వ బుద్ధి మనతో భగవంతుణ్ణి ఏదో ఫలితం కోసం అడిగిస్తుంది. ఎవరితోనూ విరోధం పెట్టుకోకండి. అతి స్నేహం వలన సంఘటనల వలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. అన్నం తిన్నప్పుడు నీది అని తినకు. ఆయనది అని తిను. ఈ ప్రకృతికి యజమాని ఆయన. అందరికీ శరీరం అంటే ఇష్టం కాని మనలను శరీరం విడిచిపెట్టేస్తున్నది. కొందరు అంటారు మీరు లేకపోతే మేము బ్రతకలేము అని అంటారు. మరి వారి దేహం దహనం చేసేస్తూ ఉంటే దానితోపాటు వెళ్ళటం లేదు. అది అంతా అహంకారం యొక్క కల్పితం. చిక్కులు ఎందుకు వస్తున్నాయి అంటే కర్త నేను అనుకోవటం వల్లనే. నీ సాధన అంతా నీ దుఃఖకారణమైన అహంకారాన్ని వివేకంతో నశింపచేసే వరకూ నీ దుఃఖం పోదు. అదే సాధన. ఈ అహంకారాన్ని కాల్చి బూడిద చెయ్యాలి. రాజీ లేదు దీనత్వం ఉన్నంతకాలం శరీరం నిన్ను వెంటాడుతుంది. సభ్యత, సంస్కారం లేని వారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. కపటి సాధన, గజ స్నానం

srinannagaru.com

లాంటిది. కల్మషం లేనివాడు, శాంత మనస్కుడు అదృష్టవంతుడు. అదృష్టం వస్తే పకపకలు, దురదృష్టం వస్తే రోదనలతో ఉండకుండా ప్రశాంతంగా ఉంటూ బ్రహ్మంలో ఒకటిగా ఉండగల్గితే పరమాత్మ అందుతాడు. ఎవరైనా అపకారం చేస్తే మర్చిపోవాలి. ఉపకారం చేస్తే గుర్తుంచుకోవాలి. అది బుద్ధిమంతుల లక్షణం. కాని మనది తిరకాసు బేరం. మనం ఇలా ఉంటే మూల తలంపు మూలంలోకి వెళ్ళలేము. మనకు ఏడవటం తప్పించి ఇంకోపని లేదు. అది మన తప్పుకాదు. 'విధి చేతలలో మనం కీలు బొమ్మలం' అని శాస్త్రాలు ఎంతగా చెప్పినా మనం ఆ ఎరుకలో ఉండలేకపోతున్నాము. తల్లడిల్లిపోతున్నాము.

106. భగవాన్ విధిని గడ్డిపరకలా తీసి ఒక ప్రక్కన పెట్టారు. "విధి ఎవరికి శరీరానికి. ఈశ్వరుడే నాకు గతి" అని పరిపూర్ణ విశ్వాసంతో ఉంటే విధి నిన్ను ఏమి చేస్తుంది. నీవు ఆత్మవు. పుట్టిన దానికి విధి, పుట్టని ఆత్మవు నీవు. దానికి విధి ఏమిటి? శరణాగతి పొందినవాడు అలసిపోడు. ఆందోళన వాడికి ఉండదు. శరణాగతి పొందిన వానిని విధి ఏమీ చెయ్యదు. కోరలు తీసిన పాము ఏమీ చెయ్యనట్లే అది అంతే! అన్నారు. తీర్పులు చెప్పకు, విమర్శలు చేసే కొలది, నీ మనస్సు చిక్కబడిపోతుంది. తరువాత నీవు ఎంత ప్రయత్నం చేసినా నీకు అది స్వాధీనం కాదు. మీకు రాత్రి సమయంలో నిద్ర పట్టనప్పుడు శ్రద్ధగా, భక్తిగా, గౌరవంగా ఒక దేవతాపురుషుని స్మరించుకొంటే అక్కడ నుంచి ఎంతోకొంత స్పందన తప్పనిసరిగా వస్తుంది. భౌతికంగా తల్లిని ప్రాధేయపడితేనే ఇచ్చేది. భగవంతుడు ఎందుకు అనుగ్రహాన్ని ఇయ్యడు? సహనంగా మీరు పని చేస్తే భౌతికంగానేకాదు ఆధ్యాత్మికంగా కూడా పురోభివృద్ధి చెందుతారు. కర్మానుభవం కోసమే శరీరం నేను అనుకొంటున్నావు. అది లేకపోతే కర్మ ఎలా అనుభవం అవుతుంది. కట్రాడుకు కట్టిన దూడను ఎన్ని దెబ్బలు కొట్టినా కొట్టవచ్చు కాని కట్రాడుతో బంధం లేని దూడను ఒకటి రెండు దెబ్బలు తగలగానే దొరకకుండా పారిపోతుంది. స్వేచ్ఛను పొందుతుంది. శరీరం నేను కాను. అనే దృఢవిశ్వాసం ఉన్నవానికి ప్రారబ్ధం దెబ్బలు తగులవు. బాధపడడు. "ఓర్పు" అంతా ప్రయత్నంలో చూపించాలి. కాలం కలిసి వస్తే ఈశ్వరుని దయకు అసాధ్యం అంటూ ఏదీ లేదు. లోపల ఉన్న ఏడుపు అంతా ఖర్చు అయితేగాని శాంతి రాదు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు అనే స్థిరమైన బుద్ధి ఉన్నవాడు తప్పనిసరిగా తరిస్తాడు. శరణాగతి పొందిన వానికి కర్మలు లేవు. ఇవి అన్నీ నీవు కల్పించుకొన్న గొడవలు.

107. మనస్సు ఆత్మలో లయమవ్వటానికి అతి రహస్యం ఒకటి ఉంది. ఆత్మ ఎంత అత్యంత పవిత్రమైనదో మన మనస్సు కూడ అంత పవిత్రమైతే ఆత్మలో

srinannagaru.com

లయమౌతుంది. మనం మనలను తిట్టిన వాళ్ళను, అపకారం చేసిన వాళ్ళను మర్చిపోలేము. అంతేకాదు అసలు మనలను మనం మర్చిపోలేము. ఇక మనకు ఆత్మజ్ఞానం ఏమిటి? ఎప్పుడో ఒకప్పుడు "శివా", "రామా" అని యాంత్రికంగా అంటాము. అన్నింటినీ సందేహించిన వానికి, సందేహ రహితమైన ఆత్మ నీకు ఎలా వ్యక్తమౌతుంది. మనకు ఆత్మ మీద నమ్మకం లేదు. అంతా వ్యాపించిన వస్తువును ధ్యానం చేస్తూ ఉంటేకదా అహంకారంలోంచి బయటపడేది. వ్యక్తి భావన నశించిన చోట అఖండ భావన తక్షణం నీకు వ్యక్తమౌతుంది. భూమి ఎంత తవ్వినా బాధపడదు. మనం చిన్నమాట అంటే భరించలేము. ఒకరు ఎంత తెలివిగలవారైనా "మాయ" ఒక్కొక్కసారి తెలివి తక్కువ మాటలను మాట్లాడిస్తుంది. రావణాసురుడు సీతను అపహరించే సమయంలో సీత, లక్ష్మణునితో "రాముడు మరణిస్తే నీకు నేను దక్కుతాననా" అన్నమాట ఉదాహరణ. నిజమైన సాధకునకు భూమికి ఉన్న సహనం కావాలి. కళ్యాణ గుణాలు కావాలి. దేవుడు అంటే మౌనం. సత్యం అనుభవంలోకి వస్తే నిజమైన మౌనం అనుభవంలోనికి వస్తుంది. సముద్రంలో తరంగాలు లేచి పడుతున్నట్లే ప్రకృతిని ఆరాధించేవాడు, జన్మ-జన్మలకు చస్తూ పుడుతూ విషయ చింతనలో ఉండి పోతాడు. మనస్సుతో చూస్తూ ఉంటే మోహ పడతాము. ఆత్మను చూస్తూ ఉంటే ఆనందసాగరంలో ఉంటాము. మనలను ఉద్రేకపరిచే వారితో సహవాసం చెయ్యకూడదు. మనస్సును గందరగోళం చేస్తారు. తెలివితేటలు పాడు అవుతాయి. తలకాయ ఉంది ఆలోచించటానికి, తల ఊపటానికి కాదు. స్వంత బుద్ధి విడువకు.

108. మైండ్ మేనేజ్‌మెంటుకు ఆహార విహారాలలో జాగ్రత్త ఉండాలి. ఆధ్యాత్మిక జీవితంలో అపజయం, జయానికి దారి తీస్తుంది. అపజయాన్ని జయానికి అనువుగా మలచుకోవాలి. వినయం ఉన్నచోట విజ్ఞానం ఉంటుంది. మూల తలంపు మూలాన్ని శోధించు, మూలంలో నిలబడు. ఒక వ్యక్తి తన బాకీ దారు దగ్గరకు వెళ్ళి నా పదివేల బాకీ తక్షణం కావాలంటే బాకీ దారు అంటాడు "మీ ఇంటి వద్ద అంతా బాగున్నారా? మీ పరిస్థితి అంతా బాగుందా?" అంటూ తొంభై అంశాలు ఏకరువు పెడుతూ ఉన్నాడు. కానీ బాకీ దారు ప్రధాన సమస్య "నా బాకీ ఎప్పుడు ఇస్తావు. ఆ గొడవల కోసం రాలేదు. ఆ విషయాలు వదలి, విషయానికి రా" అన్నాడు. అలాగే మూల తలంపు మూలాన్ని శోధించాలి. అంతే గాని దేవుడు ఉన్నాడా? లేడా? పాపం-పుణ్యం మాటలు ఏమిటి? ఇలా ఎన్ని విషయాలలోకి వెళ్ళినా, మూలతలంపు మూలంలోకి వెళ్ళటమే జీవిత గమ్యము.

srinannagaru.com

జుట్టులేని వాడు దువ్వుకోవలసిన పనిలేదు. మూలతలంపు మూలంలో నీవు ఉంటే కర్మ ఎవరికి? దేహంతో తాదాత్మ్యం పొందే నేనే కర్మానుభవం పొందుతుంది. ఆ తలంపు ఎన్నో కష్టనష్టాలను అనుభవింపచేస్తుంది. పాలను-తెలుపును వేరు చెయ్యలేము. బ్రహ్మంలో సుఖాన్ని, శాంతిని, జ్ఞానాన్ని వేరుచెయ్యలేము. ఎన్ని తలంపులు వస్తున్నా ఎంత ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నా "నేను ఎవడను?" అనే ప్రశ్నతో పలాయనం చిత్తగిస్తుంది. ఎంత పెద్దగడ్డి మేటు అయినా ఒక్క అగ్గిపుల్లతో భస్మమౌతుంది. నీ జీవితం గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటే భగవంతుడికి దూరమౌతావు. భగవంతుని నిరంతరం స్మరిస్తూ ఉంటే మనస్సుకు దూరమౌతావు. అంతేగాని, మనస్సును బజారులో తిప్పకండి. మాట అన్నవారి కన్న పడ్డవారే గొప్పవారు అవుతారు.

109. మన మాట శాంతిని కాంతిని తీసుకొని రావాలి, లేదా మౌనంగా ఉండాలి. మాట కఠినంగా ఉండకూడదు. ప్రయత్నంలో దుఃఖం ఉంది. ప్రయత్నం లేని స్థితిలో దుఃఖం లేదు. ప్రయత్నం ఎందుకు అంటే ప్రయత్నం లేని స్థితికి వెళ్ళటానికే. తెలివి ఎందుకంటే ఇతరుల వంచనలో పడకుండా ఉండటానికే. భగవంతుని ప్రార్థించండి. మీరు భరించలేని ఆనందం సుఖం మిమ్మలను వరిస్తుంది. బుద్ధిలోని దోషాలను తొలగించు, అని ప్రార్థించటమే మొదటి, మధ్య, చివరి ప్రార్థన. శరీరం యొక్క ప్రయోజనం, మనస్సు యొక్క ప్రయోజనం లోకం యొక్క ప్రయోజనం వాటిని ఉపయోగించుకొని సత్యానుభవం పొందటానికే. విద్య, శీలాన్ని కాపాడుకోవటానికే. మనస్సులో ప్లస్ పాయింట్లను, మైనెస్ పాయింట్లను గుర్తించి, మైనస్ పాయింట్లను అధిగమించటానికి ప్రయత్నం చెయ్యాలి. కొందరికి నోరు మంచిది కాదు, వారిని భగవంతుడు ఉపయోగించు కొంటాడు. మన వికారాన్ని కడిగి మరలా ఆ దుఃఖం నుంచి బయట పడే శక్తిని కూడా ఆయనే మనకు ఇస్తాడు. స్వతంత్రంగా పనిచెయ్యకపోతే జ్ఞానం మాట అటు ఉంచండి, భౌతికమైన సంపద కూడా రాదు. ఎత్తు వారి బిడ్డలతో సహవాసం కూడదు అన్నాడు బుద్ధుడు. సమాజంలో చాలామంది గొర్రెలు. స్వంత ఆలోచన ఉండదు. మీ సంసారంలో ఏదో ఇబ్బంది ఉంది అనుకోండి, పూర్వ జన్మలో సంబంధం ఉంటుంది. ఈశ్వరుడు నిరంకుశుడు, నియంత, మంచి చెడులను ఈ జన్మలోనే ఇయ్యడు. పది జన్మల తరువాత అయినా ఇచ్చి తీరుతాడు. దుఃఖ పడేవాళ్ళందరికీ పాపం నశిస్తుంది. ప్రశ్నించటానికి మనకు అర్హత లేదు. ఆత్మ జ్ఞానానికీ, దీనికీ సంబంధం లేదు. వ్యవహారజ్ఞానం కూడా అవసరమే. ఇతరుల వంచనలో పడకూడదు. పారమార్థిక జ్ఞానం, వ్యవహారికి జ్ఞానం రెండూ

srinannagaru.com

జీవుడికి అవసరమే.

110. ప్రతీ చిన్న విషయానికీ కోపం తెచ్చుకొంటే మీరే నష్టపోతారు. ఏ కర్రకు నిప్పు ఉంటే ఆ కర్రే కాలిపోతుంది. హృదయం సంతోషంతో నిండి పోయినప్పుడు కోరికే ఉదయించదు. మన గురించి మన విశ్లేషణ చేసుకొంటే మూలతలంపే లేదు. ఉల్లిపాయ పొరలను అన్నీ తీసివేస్తే ఉల్లిపాయలేదు. కష్టాలు పరీక్షలు, ఆ పరీక్షలలో నెగ్గితేగాని పై క్లాసులోకి వెళ్లలేము. జ్ఞానాన్ని ప్రచారం చేస్తే జ్ఞానం వస్తుంది. అసూయను ప్రచారం చేస్తే అధోగతి పాలౌతావు. భక్తిని ప్రచారం చేస్తే భక్తులమౌతాము. మీరు ప్రకృతిని, టి.వి. ద్వారా ఉల్లాసకరమైన విషయాలను చూస్తున్నా ఈశ్వరుడు చూస్తున్నాడు మీరు ఆరకంగా ఉంటే ఆయన అనుగ్రహం ఇవ్వడు. బొమ్మలతో ఆడుకొనేవాడికి అనుగ్రహం ఇవ్వడు. లేని దాన్ని ఉంది అనుకొంటున్నారు అందులోంచే భయం కలుగుతోంది. ఉన్నది ఏదో ఉంది, లేనిది ఏదో లేదు. ఇది నిశ్చయం. కొందరు మీ మీద అసూయను ప్రచారం చేస్తూ ఉంటారు. కారణం మీలో ఆ అసూయా ప్రభావాన్ని ఎంత వరకూ అధిగమిస్తారని వాళ్లతో ఈశ్వరుడు అనిపిస్తాడు. అది మీకు అర్థమైతే మీరు ధన్యులు. అసూయాపరుల పన్నాగాలలోంచి మీరు బయటపడకపోతే మీరు బలహీనులు అవుతారు. పూర్వం పుట్టినవాడు, ఇప్పుడు పుట్టినవాడు, రేపు పుట్టబోయేవాడు భగవంతుడే. మనకెందుకు ఈ గోల "ఒక్కడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు ఎవరు; ఇది నీ జాలము అరుణాచలా" అని భగవాన్ అన్నారు. "మీ అజ్ఞానమే మీకు శిక్ష". జీవితంలో చదువు ఒక్కటే చాలదు. శిక్షణ కూడా కావాలి. సహనం లేకపోతే, సాత్త్విక ప్రవృత్తి రాదు. సాత్త్విక ప్రవృత్తి గలవారు శాంతంగా ఉంటారు. సమాజాన్ని శాంతింప చేస్తారు.

111. గమ్యం వైపు ప్రీతి, భక్తి లేకపోతే పెడమార్గంలో వెళ్ళిపోతారు. చెడు తలంపులను ఆరాధించకపోతే అవి నశించిపోతాయి. ఋగ్వేదంలో ఇలా ఉంది "నీ హృదయంలో ఉన్న వస్తువును స్మరించటమే నీ పని. అది స్మరించక ఎన్ని స్మరించినా దుఃఖాన్ని తీసుకొని వస్తాయి" ఏరోజు కారోజు ఆ సద్ వస్తువును స్మరించాలి. శివుని కంఠాన్ని అలంకరించిన నాగుపాము గరుత్మంతుని చూచి ఇలా అంది "బాగున్నావా?" దానికి ఆయన అన్నాడు శివుని కంఠం విడిచి బయటకి రా ఎలా ఉన్నానో తెలుస్తుంది అన్నది. అలాగే మనం శివుని సన్నిధిలో ఉంటే రాగద్వేషాది వర్గాలు మనలను సమీపించవు. భయమే ఉండదు. సాధన ముఖ్య లక్షణం. మాట తగ్గించుకోవాలి. తలంపులు తగ్గించుకోవాలి. మనం పాఠాలు నేర్చుకోవటం మానకూడదు. చిన్న తలంపు వలన వేలాది జన్మలు

srinannagaru.com

వచ్చేస్తున్నాయి అని గ్రహించాలి. సృష్టిలేని వానికి అశాంతి లేదు. "సృష్టి" అంటే కల్పించబడిందని అర్థం. శరీర రూపాల నుంచిగాని మరే రూపాల నుంచి గాని సంతోషం కలుగుతూ ఉంటే అది పరిణామంలో దుఃఖం క్రింద మారిపోతుంది. అది దైవ నిర్ణయం. బుద్ధి తక్కువ వాళ్ళు తెలివి తక్కువ వాళ్ళు విషయ వాసనలలో ఎంతో సుఖం ఉందని దాన్ని జుర్రుకొంటూ ఉంటారు. తెలివిగల వాళ్ళు, సూక్ష్మ దృష్టి ఉన్నవాళ్ళు, ఆత్మానందంలో ఉన్న ఆనందం కోసం ఆతృత పడుతూ ఉంటారు. పూర్వ జన్మలలో చేసినవే, మనకు ఇష్టంగా ఉంటాయి. జరిగిపోయిన గొడవలు తరచుగా తలపెట్టుకోవటం వలన దేహమే నేను అనే తలంపు పొడిగింప బడుతుంది. వివేక బలం ధ్యాన బలం వలన వస్తువు లభ్యమౌతుంది. దేన్ని ధ్యానించకూడదో దాన్ని ధ్యానిస్తే పరిణామంలో దుఃఖం, అశాంతి కలుగుతుంది. స్మరించదగ్గది బ్రహ్మము ఒక్కటే మనకు వచ్చే ప్రయోజనం లేని తలంపులు మొయ్యటం కన్న ఒక బస్తా ధాన్యం మొయ్యటం తేలిక.

112. మీ కోడలు మిమ్ములను నిరంతరం తిడుతోంది అనుకోండి వెంటనే వేరేకాపురం పెట్టుకోవటం మంచిది. అది కూడా స్నేహంగా జరగాలి ఎలాగంటే "మీరంటే మాకు ప్రేమ, నేనంటే మీకు ప్రేమ ఏం చేస్తాము మీరు వయస్సులో ఉన్నారు మీ అలవాట్లు మీవి" అని అనుకూలంగా ఉండాలి. తాడు తెగకుండా దూరంగా ఉండవచ్చును. జీవితంలో కొంత నటన అవసరమే లేకపోతే రోజులు గడవవు. మీరు సదా శాంతిని కాపాడుకోవాలి. మనం రామేశ్వరం వెళుతున్నాము, కాశీ వెళుతున్నాము, సముద్రయానం చేసి చాలా మైళ్ళు ప్రయాణం చేస్తున్నాము. కానీ మీ మనస్సు నుంచి హృదయానికి దూరం కేవలం ఒక్క అడుగు మాత్రమే. అందులోకి వెళ్ళలేకపోతున్నాము. ఇది మాయ యొక్క ప్రభావం. రజోగుణం, తమోగుణం, సత్త్వగుణం గలవాళ్ళు ప్రతీ కుటుంబంలోనూ ఉంటారు. అటువంటి పరిస్థితులలో రజోగుణం ఉన్నవాళ్లను కూర్చోబెట్టి సంభాషించటం మన మొదటి ప్రయత్నం. దాని వలన ప్రయోజనం లేకపోతే దైవ నిర్ణయానికి వదిలేయాలి. ఆధ్యాత్మిక జీవితానికి సహనం యొక్క ప్రయోజనం చాలా ఉంది. బజారులో పోరు పడగలం గాని ఇంట్లో పోరు పడలేము. అందుకే వేమన అన్నాడు "ఇంటిలోని పోరు ఇంతింత కాదయా" అని. గత జన్మలో బయట ఉన్న శత్రువులను అంతా పగతీర్చుకోవటానికి కుటుంబంలోనే పుడతారు. బయట ఉండి సాధించలేరని ఈశ్వరుడు అలా చేస్తాడు. వాటితో కలిసిపోకుండా ఎరుక కలిగి ఉండాలి. ప్రతీ సంతోషం, దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఒకోసారి మనం ఇలా అనుకొంటాము. ఇది ఇలా జరిగింది ఏమిటి? అలా అనుకోకండి అది

srinannagaru.com

అంతా ఈశ్వర నిర్ణయం, తర్కాలు, కుయుక్తులు శరణాగతి పొందిన వానికి రావు. మీకు కోరికే లేదు అనుకోండి. దుఃఖం, భయంరానే రాదు. భగవంతుని మీద భారం వేసి జీవించేవానికి భయమే రాదు, బాపూజీ కత్తులు పెట్టి నరుక్కొన్నచోట పోలీసులు లేకుండా వెళ్ళారు.

113. "నేను ఉన్నాను" అనే స్థితిని గుర్తించలేక, నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అని బయటికి వచ్చి దుఃఖంలో మునిగిపోతున్నావు. దేహమే నేను. ఇదే సత్యం. ఇంకా ఏమీ లేదు, అనే వానిని రక్షించలేము. వాళ్ళను రక్షించాలంటే బురద పాములవంటి గురువులు కాదు, త్రాచుపాముల వంటి గురువులు కావాలి. బంధువులు పడగొట్టకుండా ఉంటే చాలు, దారిన పోయే వారికి మీమీద అసూయ ఏముంటుంది. చుట్టాలు, స్నేహితులకే మీ అభివృద్ధిని చూచి అసూయ పడతారు. కాని మీరు సర్వకాల సర్వ అవస్థలలోనూ గంభీరంగా ఉండండి. మాట జారకండి. మీ భక్తి పరిపూర్ణత్వానికి వస్తే నిండు కుండలా ఉంటారు. ముందు ఆ రకంగా జీవించండి. జ్ఞానం వెదుక్కుంటూ మీ దగ్గరకే వస్తుంది. ఆ స్థితి మీకు వస్తే మీకు మోక్షం ఇయ్యకుండా ఉండలేడు ఈశ్వరుడు. మన స్నేహాలు, బంధుత్వాలు ఒకరిని ఒకరు పాడుచేసుకోకుండా ఉంటే చాలు, పాడవ్వడానికి బంధుత్వం ఎందుకు. పరస్పరం నాశనం కోరుకొనేడప్పుడు బంధుత్వం ఏమిటి? స్నేహం ఏమిటి? చేతనైతే సాయం చెయ్యండి. చెడగొట్ట కూడదు. భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధి పొందాలంటే, నిరాశా వాదం పనికి రాదు. చాలామంది చదువు నేర్చుకొంటారు అది ఒక్కటే సరిపోదు. వివేకం కూడా నేర్చుకోవాలి. నేను-నాది అనే తలంపులు గాఢనిద్రలో లేవు కాని మనం ఉన్నాము. కాని ఎరుకలో రెండూ లేకపోతే బ్రతకలేము అని అనుకొంటాము. "నేను" అనే తలంపు వస్తే దానిలోనే "నాది" అనే తలంపు ఉంది. అవి రెండూ లేకపోయినా మనం ఉండగలమనే నిశ్చితమైన అభిప్రాయం మనకు లేదు. అద్వైత అనుభవం వచ్చేవరకూ ఈ ప్రపంచం నిజంగానే కనిపిస్తుంది. అలాగే ప్రవర్తిస్తాము. ఇంటికి ఎలుకలు ఎంత హాని చేస్తాయో, చెడు తలంపులు జీవితానికి అంత హాని చేస్తాయి. మీకు కృంగిపోయే తలంపులు వస్తే కంగారు పడకండి. జప-ధ్యానాల వలన అవి పోతాయి. మనస్సుకు ఏకాగ్రత వస్తుంది.

114. దేహంతో తాదాత్మ్యం పొందిన తరువాతే ఈ "నేను" లోకంలో తాదాత్మ్యం పొందుతుంది. రైలు ఇంజను లాంటిది మూల తలంపు. అది కదిలితే, నేను పెద్ద మనిషిని, చిన్న మనిషిని అనే పెట్టెలు కదులుతాయి. నిజమైన సత్యమే అందం. నాది నేను అనేవి మీ చెవులకు పెట్టుకొన్న దుద్దులు అని అనుకోవచ్చు.

srinannagaru.com

కాని అవి దుద్దులు కావు తేళ్ళు. అవి దుష్ట స్వభావం కలవి. ఆ స్వభావం అంత తేలికగా పోదు. దూరంగా ఉన్న తేళ్ళు అంతగా కుట్టవు. చెవులకు ఉన్న తేళ్ళే తరచుగా కుడతాయి. అవి బయటికి వెళ్ళిపోతున్నాయో లేదో చూచుకోండి. నా మనస్సు బాగా లేదు అంటే ఆ తేళ్ళను నీవు వదిలించుకోవాలి. సాధన చేసి వాటిని పోగొట్టుకోవాలి. గురు అనుగ్రహం వలన పోతాయి. దొంగలు పట్టుకెళ్లినట్లు అవిపోవు. సాధనలో సహనం కలిగి ఉండాలి, నీ ఇష్ట-అయిష్టాలను తగ్గించుకొని అమనస్క స్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యాలి. అపశ్రుతి వినకండి, శ్రుతి వినండి అంటోంది వేదం. అంటే అజ్ఞానాన్ని చూడకు, వినకు, అనకు. అది చేస్తే బంధింపబడతావని అర్థం. వేదం తల్లి లాంటిది. తల్లిని మించి క్షేమం కోరేవారు ఎవ్వరూ లేరు. మీకు కాలూ, చెయ్యి లాగుతోంది అనుకోండి దాని తాలూకు ప్రభావం మీ శరీరం మీద, మనస్సు మీద పనిచేస్తుంది. అలాగే చిన్న చెడు తలంపే మీకు అనేక జన్మలు తీసుకొని వస్తుంది. వాసనలు నశించే వరకూ సాధన చెయ్యవలసిందే.

115. రాముడు, కృష్ణుడు, రమణుడు వచ్చారు వెళ్ళిపోయారు. వాళ్ళ కాలంలో మనం ఉంటే బాగుండును అనుకొంటారు. కాని వర్తమాన కాలంలో జ్ఞానిని చూడలేకపోతున్నారు. ఇదే మాయ. మీ సత్యాన్వేషణలో నిజాయితీ ఉంటే ఈ జన్మలోనే మీరు తరిస్తారు. మీరు బాగుపడాలనే ఆలోచనను ఎవ్వరూ మీకు చెప్పరు. మీ అంతట మీకు కలగాలి. మీ దేహాన్ని-మనస్సును ఎవరైతే ఆడిస్తున్నారో వారే ఇతరులను, ఈ పంచ భూతాలనూ ఆడిస్తున్నాడు అనే బుద్ధి ఇంకా మనకు రాలేదు. ఒకడు కల్పతరువును సాధించటానికి తపస్సులో కూర్చున్నాడు. వాడి భావన దాన్ని ఐదు సంవత్సరాలు తపస్సు చేస్తేగాని సాధించ లేము అనుకొన్నాడు. అసలు అనుకోవటంలోనే ప్రమాదం ఉంది. వాడికి ఐదు నిమిషాలలోనే కల్పతరువు దొరికింది. వాడికి ఈ ఆలోచన వచ్చింది. ఇంత తొందరలో దొరికింది నిజం కాదని దాన్ని అవతల పారేసాడు. అలాగే మనం కూడా భగవదనుభవం కలిగినా మనం స్వీకరించటానికి సిద్ధంగా లేము. "లోపలికి రండి" అని ఈశ్వరుడు అన్నా మనం వెళ్ళలేకపోతున్నాము. మనం రవ్వంత ప్రయత్నం చేస్తే చాలు ఆహ్వానం ఎప్పడూ ఉంది. భగవదనుభవం ఉంటే, గడపను దాటటం ఎంత తేలికో మాయను దాటటం కూడా అంత తేలిక. చిక్కగా ఉన్న బట్ట చింపటం కష్టం, పల్చగా ఉన్న బట్టను చింపటం తేలిక. అలాగే అహంకారం పల్చబడితే చంపటం తేలిక. ప్రచారం వలన ఏమానవుడు మహర్షి, మహాత్ముడు కాలేడు. డబ్బు సంపాదించటం కంటే కీర్తి సంపాదించటం కష్టం.

srinannagaru.com

సహృదయత సంపాదించటం ఇంకా కష్టం. నీకు బయట శత్రువులు ఉన్నా పరవాలేదు. నీకు నీవు మిత్రుడిగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. గంటల తరబడి ధ్యానం చేసిన ఫలితం ఏం వస్తుందో నీవు నిరాడంబరంగా, నిస్వార్థంగా పనిచేస్తే అదే ఫలితం వస్తుంది.

116. కష్టపడి కుండ నిండా పాలు నింపుకొన్నారు అనుకోండి, చిన్న రంధ్రం ఉంటే పాలు అన్నీ బయటికి వచ్చేస్తాయి. అలాగే మీరు ఎంత సాధన చేసినా మీకు బయట వాళ్ళమీద అసూయ కలిగింది అంటే మీ సాధనా బలం అంతా పోతుంది. మీరు శాంతంగా ఉంటే శారీరక మానసిక రోగాలు అన్నీ తగ్గిపోతాయి. ఎవరైతే శాంతి దాతలో వారే గురువులు. అశాంతిగా ఉన్నప్పడే శాంతి విలువ తెలుస్తుంది. మనకు దుఃఖం రావటానికి కారణం లోకాన్ని భరించలేకపోవటమే లోకం కుక్క తోకలాంటిది, దాన్ని ఎవరూ వంకర తియ్యలేరు. మనం శివునికి దూరంగా ఉన్నాము, లోకానికి దగ్గరగా ఉన్నాము. అందుకే దుఃఖం వస్తున్నది. మనం స్టేజీమీద యాక్టర్లము. మన పాత్రకు మనం న్యాయం చేసి స్టేజీమీద నుంచి తప్పకోవాలి. మనం ట్రైనింగ్ పొందటానికి వచ్చాము ఆ విషయం మర్చిపోకూడదు. మానవ జీవితంలో అనుబంధం కావించబడ్డవారు పాములు లాంటివారు, గొట్టెలు లాంటివారు ఉంటారు. వారితో సహజీవనం నేర్పగా ఉండాలి. చెడ్డదృశ్యాలను చూస్తూ ఉంటే అహంకారానికి అదే ఆహారం, ఇంద్రియాల ద్వారా ప్రకృతి విషయాలను చూస్తూ ఉంటే అహంకారం పెరుగుతుంది. వివేకం లోంచి, మహా వైరాగ్యంలోంచి జ్ఞానం వస్తుంది. వాడు కాంక్షారహితుడు కావాలి. అట్టివాడే మోక్షానికి అర్హుడు. మన మనస్సును మనమే బాగుచేసుకోవాలి. నీ బలహీనతలలోంచి బయట పడటానికి కృషి చెయ్యి. కృషి కృపగా మారుతుంది. జీవితం అంటే రాజీపడటమే. ఇద్దరూ ఎదురుతిరిగితే రోడ్డు మీదకు వచ్చేస్తారు. కల్చరు వేరు, సివిలిజేషన్ వేరు. కొందరికి సంస్కారం ఉంటుంది. సంస్కృతి ఉండదు. పైకి నాజూకు బట్టలు వేసుకొని, నాజూకుగా మాట్లాడుతారు. లోపల కల్చరు ఉండదు. “మానవుని మనోవికాసం సంస్కృతి యొక్క ముఖ్య ధర్మము, బాహిరమైన అభివృద్ధి నాగరికత” అవుతుంది అని విలియమ్ జోడ్ అన్నాడు.

117. మీకు కష్టం వచ్చింది అంటే దానికి కారణం ఉంది. అది తెలియక కంగారు పడుతున్నారు. ఆయన రాగ-ద్వేషాలకు అతీతుడే. రాగం వలన కూడా నీవు బంధింపబడతావు. నీ మైండ్‌కి కంట్రోల్ ఉంటే దుఃఖానికి కృంగు, సుఖానికి పొంగు రాదు. అన్ని ప్రారబ్దాలకు సంబంధించినవి మాత్రమే దేహంతో తాదాత్మ్యం

srinannagaru.com

పొందే వాడిని త్యాగం చెయ్యటం వలన అన్ని అరిష్టాలు నశిస్తాయి. మనో దేహముల నుండి విడుదల పొందిన వాడు ముక్తుడు అవుతాడు. జ్ఞానమంటే ఏమీ లేదు అని తెలుసుకోవటమే. దేహం, మనస్సు భగవంతుని స్వాధీనంలో ఉన్నాయి. మిమ్మలను ఎవరైనా ఏదైనా అంటే అది ఈశ్వరుడే అనిపిస్తున్నాడు. మనం అసలు లేము. భగవాన్‌కి ఎక్కడికి వెళ్ళాలి అని సందేహం వస్తే "అరుణాచలం-అరుణాచలం" అనే స్ఫురణ వచ్చింది. అంటే ఆడించేవాడు ఒకడు ఉన్నాడని అర్థం. ఉద్యోగస్థులు, నిరుద్యోగి, అధికారి, ధనవంతుడు అందరికీ ఇదే ప్రశ్న. "నేను ఎప్పుడు సుఖపడతాను" మీరు మీరుగా ఉండే వరకూ సుఖపడరు. వంద కోట్లు ఆస్తి ఉన్నా అదే గోల. ఆ తలంపు దేహగతమైన నేనులోంచే వస్తున్నది. ఎవరిని సుఖపెడదామని. ఈ శవాన్నా సుఖపెట్టేది. మీ వేదన-రోదన, తగ్గాలంటే ఒక రహస్యం ఉంది. ఈ లోకంలో ధరించే శరీరాలను అన్నింటినీ ఆడించేవాడు ఈశ్వరుడే. ఎవరి మీద కోప్పడతాము. ఎవరి పాత్ర వాళ్ళు "ప్లే" చేస్తారు అంతే. భూమి ఉన్నంతకాలం భూకంపాలు వస్తాయి, వరదలు వస్తాయి. మానవునిలో అశాంతి ఉన్నప్పుడు యుద్ధాలు వస్తాయి. అవి అన్నీ భగవంతుని సంకల్పం వలన జరుగుతాయి. ప్రపంచంలో ఏమి జరిగినా మనం ఆందోళన పడకూడదు. అశాంతి తెచ్చుకోకూడదు. భగవాన్ తాటాకు పాకలో జీవిస్తున్నప్పుడు కొందరు ఇలా అనేవారు, ఇక్కడ ధ్యాన మందిరం, ఇక్కడ వంటశాల, అక్కడ అది కట్టాలి అంటే భగవాన్ అనేవారు "మనం ఇక్కడికి రాకముందే భగవంతుడు అన్నీ నిర్ణయించాడు" అనే వారు. శరణాగతి అంటే అది.

118. మనకు వచ్చే చెడు తలంపులకు సహకరిస్తాము, సమాజానికి ఉపకరించే తలంపులకు సహకరించం. మనకు వచ్చే మంచి తలంపులకు సహకరించకపోతే మనకే నష్టం. నీ కళ్ళు మూసుకొంటే చీకటి మిగులుతుంది. సూర్యునికి నష్టమేమిటి? పామరుడికి, లోకవాసన ఎంత ఉంటుందో, పండితుడికి శాస్త్రవాసన అంత ఉంటుంది. రెండూ బంధించేవే. మనం ఏదో ఒకటి అనుకోకుండా ఉండలేకపోతున్నాము. భగవంతుడు ఎలా ఉంటే, అలా ఉంటే నీకు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. గుఱ్ఱాన్ని నీళ్ల దగ్గరకు తీసుకొని వెడతాము. త్రాగటం మాత్రం అదే చెయ్యాలి. గురువు సబ్జక్టు చెబుతాడు. అందులో ప్రవేశించటానికి కావలసిన వనరులు అన్నీ ఆయనే కల్పిస్తారు. కాని వెళ్ళవలసింది నీవే. అంతర్‌దృష్టి లేనిదే సత్యం దొరకదు. మీరు పరిమితులకు లోబడి ఆ రోజు కారోజు కృంగిపోతున్నారు. నీవు మనస్సుతోనూ, దేహంతోనూ పరిమితులు వదలితే, అపరిమితుడవు అవుతావు. అప్పుడు దుఃఖంరాదు. హద్దులు ఉన్నచోటే దుఃఖం

srinannagaru.com

వస్తుంది. మనస్సును స్వచ్ఛంగా, సమర్థతగా, ఏకాగ్రతగా ఉంచుకోవాలి. ఏకాగ్రతలేని వాడు ఎందుకూ పనికిరాడు. ఏమీ సాధించలేడు. శరీరానికి ఆరోగ్యం ఎంత అవసరమో మనస్సుకు శాంతి అంత అవసరం. శాంతచిత్తం గలవాడు ఉద్రేకపడడు. ఉద్రేకరహితుడికి మాత్రమే చిత్తశుద్ధి కలుగుతుంది. మనస్సులో స్వచ్ఛత పెరిగే కొలది నిదానంతోపాటు ఏకాగ్రత వస్తుంది. ఏకాగ్రత ఇహపరములకు మూలము. ఏకాగ్రత గలవాడే వాడి కలలను సాకారం చేసుకో గలడు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా జీవిస్తాడు. చిల్లర చింతలకు దూరంగా ఉంటాడు. ఇది కలియుగం త్రికరణ శుద్ధిగా మాట్లాడే వాళ్ళు నూటికి ఒకరు ఉంటారు. భగవంతునిపై డెడికేషన్ (విశ్వాసం) ఉండాలి. మీకు దేవుడు చెప్పిన ఒక్క వాక్యం అర్థమైతే పది సంవత్సరాల ధ్యాన ఫలితం అందుతుంది. సరియైన అర్థం మీరు గ్రహిస్తే చాలు మూలతలంపు వేరుతో సహానశిస్తుంది. అంతవరకూ దాన్ని నమ్మకూడదు. జాగ్రత్త అవసరం.

119. నువ్వు ఎంత అని ఎవరైనా అంటే నువ్వు ఎంత అని మీరు అంటే భయపెట్టటం పోతుంది. భయపడితే భయపెట్టేవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. తలంపులను చూచి భయపడకండి. ఇవి ఎవరికి అని తెలుసుకొని మొండి కెత్తండి, భయం పోతుంది. సాధన అంటే బెంగ పెట్టుకోకండి. కంగారు పడకండి. తుపాకీ కనిపెట్టిన ఇంగ్లాండువాడు ప్రపంచాన్ని జయించాడు. అలాగే నీ సాధనలో, మీకు తలంపులు వచ్చినా తుపాకీ లాంటి "ఈ తలంపులు ఎవరికి?" అని ప్రశ్నించు కోండి. మీరు అహంకారాన్ని జయించగలరు. మా బంధువులు, మీ బంధువులు, మీ శత్రువులు, మా శత్రువులు అనేవారు లేరు. ఇది అంతా ఈశ్వరుని లీల, ఆట. ప్రపంచంలో మూడు వందల కోట్ల జనాభా ఉన్నా అందరూ స్నేహితులుకారు, అందరూ శత్రువులూ కారు. నీకు కేటాయించిన వారితోనే బంధుత్వాలు, స్నేహాలు అందులో ముంచేవారు ఉంటారు. కాపాడేవారు ఉంటారు. మూల తలంపులోనే వారు అంతా ఉన్నారు అది లేకపోతే ఏదీలేదు అదే నీకు దుఃఖం. దృశ్యం ఉన్నంతకాలం దుఃఖం తప్పదు. మనస్సు నశిస్తే శాంతే, వాడే ముని. మంత్రి పదవి పొందవచ్చు. ధనాన్ని ఆర్జించవచ్చు. స్వభావాన్ని మార్చుకోవటం కష్టం. అంటే ఈశ్వర సంకల్పానికి అనుగుణంగా జీవించాలి అనే దృక్పథంలోకి రావటం. నా పది ఎకరాల పొలం మీద నాకు ప్రీతి కలగటానికి కారణం నా స్వార్థమే. అంటే ఆ ఆస్తి మీద వచ్చే ఆదాయం వలన నేను సుఖంగా బ్రతకగలను అని మనం అవగాహన చేసుకోవాలన్నా చేసుకోలేము. అది కూడా అనుగ్రహమే. మనకు అవగాహన అవుతూ ఉంటే అది కూడా మన తెలివి తేటలు కాదు.

ఈశ్వరానుగ్రహం వల్లనే. ఇటువంటి చిన్న చిన్న విషయాలు కూడా గీతలో చెప్పాడు. పైగా "అర్థం చేసుకునే బుద్ధిని కూడా నేనే ఇస్తాను" అన్నాడు. "వాడికి ఉన్న బుద్ధి నిజమైతే వాడు ఎంత దురాచారుడైనా అవగాహన చేసుకొనే బుద్ధిని ప్రేమగా ప్రసాదిస్తాను" అన్నాడు.

120. అతి నిద్ర, అతి భోజనం, శత్రువుగా పరిణమిస్తుంది. జరుగుబాటు కోపం కూడా "వినోదమే". పరాయి బుద్ధి ప్రమాదం. స్వంత బుద్ధితో ఆలోచిస్తే సుఖంగా ఉంటుంది. సముద్రంలో కెరటాలుపైనే ఉంటాయి. లోపల అంతా నిర్మలం, అలాగే కొంచెం అంతర్ముఖంగా ఉంటే శాంతి కలుగుతుంది. మనం ఏదైతే అయి ఉన్నామో అది అయ్యే వరకూ దేహాలు వస్తాయి. లోకం వస్తుంది, దుఃఖం వస్తుంది. ఇది చివరి మాట; ఏ మతం అనేది అప్రధానం. బయట ఎంత ఎండగా ఉన్నా మన ఇంట్లో మనం ఉంటే మనకు ఎండగోల ఉండదు. అలాగే మన హృదయంలో మనం ఉంటే ఈ దుఃఖం, ఈ బాధలు, ఈ రోదనలు ఎన్ని ఉన్నా మనకేల. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటే తలపోటు వస్తుంది. భవిష్యత్తును గురించి గాలిమేడలు కట్టుకోకండి, వచ్చిన దాన్ని కాళ్ళతో తన్నుకోకండి. దేనికోసం నిరీక్షించకండి. ఇక్కడ కంటే అక్కడ బాగుండేది, భవిష్యత్తు బంగారం చేసుకోలేక పోతున్నాము అనేవి నిజం తెలిసే వరకూ తప్పవు. అది అంతా మాయ. అదే అజ్ఞానం. ముత్యపు చిప్పలో వెండి ఉంది అనుకొన్నంతకాలం ఆశ వదలదు; లోకం నిజం అనుకొన్నంత కాలం భయం, ఆశ పోవు. తెలివి గలవారు అవకాశాలను ఉపయోగించుకొంటారు. దాన్ని ఉపయోగించుకోలేని వారిని తెలివి తక్కువ వారు అంటాము. దేహం వచ్చేసింది, దాన్ని గురించి ఏమీ చెయ్యలేము, మన బుద్ధిని, శరీరాన్ని సక్రమంగా ఉపయోగించుకొని తిరిగి శరీరం రాకుండా చేసుకోండి. కామ-క్రోధాల కంటే కీర్తి కాంక్ష ప్రమాదమైనది. కేన్సర్‌ను గుర్తించటం ఎంతకష్టమో కీర్తి కాంక్షను గుర్తించటం కూడా అంతే కష్టం. మిమ్మలను ఎవరైనా విమర్శిస్తే మీరు మిమ్మలను సమర్థించుకొంటారు. రాముడు అడవికి వెళ్ళమన్నా జంకలేదు. సమర్థించుకోలేదు.

121. పెద్దలను, సత్‌పురుషులను గౌరవించటం వలన మనం లాభం పొందుతాము. రాముడు లోకమర్యాదను అనుసరించాడు. మునులను దర్శించాడు. దేహాన్ని ప్రారబ్ధం పోషిస్తుంది. కర్మ యోగంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మీరు ఎవరికైనా సహాయం చేస్తే గర్వం పెంచుకొంటే నష్టం తొంభై శాతం సంక్రమించినట్లే. మీకు ఏ కారణం వల్లనైనా గందరగోళం వస్తే మీరు

srinannagaru.com

ఎవరో మీకు తెలియక మీకు ఏదైనా చెడు తలంపు వస్తే రానియ్యండి, రావద్దు అంటే రాక మానవు. కాని వాటితో తాదాత్మ్యం పొందకండి. ఉన్న వాసనలు లేవు అనుకోవటం ఒక ప్రమాదం, లేని వాటిని అవుననుకోవటం మరో ప్రమాదం. మనకు ఆత్మతో ఎటాచ్‌మెంటు లేకపోయినా యాక్సిడెంట్లు మిగులుతున్నాయి. "కొన్ని సంఘటనలు మర్చిపోదామన్నా మర్చిపోలేకపోతున్నాము" అంటారు. అలాగే భగవంతుని మాటలు మర్చిపోదామన్నా మర్చిపోలేకపోతే మీ రాగ-ద్వేషాలు నాశన మౌతాయి. చిన్నతనం నుంచి మీరు ప్రపంచాన్ని సహజంగా చూస్తున్నారు ఈ విషయంలో ఎవ్వరూ మీకు నేర్పనక్కరలేదు. అలాగే మీరు ప్రతీ జీవిలోనూ పరమాత్మని సహజంగా చూడండి. ఒకరు తన సన్నిహితునితో ఇలా అన్నారు "నీ పొరుగువారు నిన్ను నిరంతరం తిడుతున్నారు ఎందుకు ఊరుకొంటున్నావు" అనగా, ఆయన ఇలా అన్నారు "నాలో పాపాలు పోతాయని ఊరుకొంటున్నాను నేను బొత్తిగా అమాయకుణ్ణి కాను" అంటే అది ఎరుకతో కూడిన సహనం. అది కావాలి.

122. మీకు కళ్ళు మండుతున్నాయి అంటే కంటిలో దోషం ఉంది. అలాగే మీకు శాంతి లేకపోతే శరణాగతి లేదని అర్థం. సబ్జక్టును మీరు సరిగా అర్థం చేసుకొంటే దుఃఖం మీ గుమ్మంలోనికి రాదు. మీ తెలివిని ఆత్మ జ్ఞాన సముపార్జన కోసం వినియోగించుకోండి. ఇతరులను మనం గౌరవించటం వలన మనకు లాభం వస్తుంది కాని నష్టం రాదు. అగౌరవ పరిస్తే నష్టం వస్తుంది. వినయంలేని వానికి సత్యం గురించి, వినాలని అనిపించదు. శరీరానికి వచ్చే జబ్బు పెద్ద జబ్బు కాదు. శ్మశానంలోనైనా కాలిపోతుంది. జనన మరణాలే పెద్ద జబ్బు. సన్యాసమంటే దేహ భావనను విడిచిపెట్టటమే. దాన్ని గృహస్థాశ్రమంలో కూడా చెయ్యవచ్చును. "నిన్ను నీవు తెలుసుకో" అంటే నీవు రెండుగా లేవు తెలుసుకొనే వానిని ప్రక్కకు తీసేస్తే తెలుసుకొనేది ఏదీ లేదు. ఇది అంతా నీ కల్పితం. నీవు ఎప్పుడూ ఒకటిగానే ఉన్నావు. అప్పుడే చేసిన మిఠాయి ప్రసాదం వేడిగా ఉందని, తరువాత తిందామని ప్రక్కన పెడతాము, చేతికి అంటుకున్న పంచదార రేణువులను నాకుతూ ఉండటం ఎలాంటిదో నీ హృదయంలో ఉన్న ఆనందాన్ని వదలి బజారులో ఆనందాన్ని కోరుకోవటం కూడా అటువంటిదే. విభీషణుని వైభవం చూడండి, ధర్మం ప్రక్కకు వెళ్ళాలా? అధర్మం ప్రక్కకు వెళ్ళాలా అని ఆలోచించి సరియైన నిర్ణయం తీసుకొన్నాడు. రాముడు ధర్మానికి ప్రతీక. మన ఆలోచనలు కూడా ధర్మం వైపే వెళ్ళాలి. సాధన అంటే నీలో ఉన్న బలహీనతలను, ప్రతిబంధకాలను తొలగించు కోవటమే. ఆలోచన విశ్వాసంతో భగవంతుని పాదాల చెంతకు చేరాలి. కొందరు

srinannagaru.com

మనుషులు మంచి వారే కాని సహవాస దోషం వలన పూర్తిగా కుళ్ళిపోతారు. ఇది నా అనుభవంతో చెప్పినమాట.

123. ప్రపంచం మిమ్ములను బంధించకుండా ఉండాలంటే మనస్సుతో చూడకండి, దానిలో పరిమితులు ఉన్నాయి. రాగ-ద్వేషాల వల్లనే మనస్సు గాయమౌతుంది. గాఢనిద్రలోని స్థితిని ప్రాక్టీస్ చెయ్యండి. మీ మనస్సులో తలంపులు వస్తాయి కంగారు పడకండి. వాటిని పట్టించుకోకండి. అవిపోతాయి అది మీరు అనుకోవటం వల్లనే మిమ్ములను బాధిస్తుంది. భగవంతుని నామాన్ని మర్చిపోకండి, మనస్సుగా ఉండకండి, బ్రహ్మంగా ఉండండి. అదే సాధన. కర్తృత్వ భావన పెట్టుకోకండి. ఈ ప్రపంచాన్ని ఎవరైతే కల్పించాడో వాడు ఉన్నాడు. పారిపోలేదు. దాన్ని ఎలా చూచుకోవాలో ఆయనకు తెలుసు. ఇది అంతా లీల, మాయ, వినోదం. ఉన్నది ఉన్నట్లుగా కనిపించేవరకూ లేనిది ఉన్నట్లుగా కని పిస్తుంది. పదికోట్లు ఉన్నవాడు పిచ్చివాడైతే ఆ డబ్బు ఆయన ఏం చేసుకొంటాడు. నీ బుద్ధి పాడయిపోతూ ఉంటే డబ్బు ఏం చేసుకొంటావు. పరమాత్మను స్మరించటం వలన శాంతి కలుగుతుంది. ప్రపంచంలో అన్నిటికంటే గొప్పది శాంతి. సంఘపరంగా, కుటుంబపరంగా, సమాజపరంగా, ప్రకృతిపరంగా చిక్కులు వచ్చినా పారిపోకు. పరిష్కారం చూచుకో, చేసుకో. మంచి తలంపులు వచ్చేటట్లు చూచుకోండి. మనస్సు అందంగా ఉంచుకోండి. చింతాకు అంత చింత కూడా రానియ్యకుండా చూచుకోండి. మీ గొప్పదనాన్ని, తెలపాలనే కాంక్ష రానియ్యకండి. శరీరానికి సీతోష్ణములలాగ, మనస్సుకు కోరికల బాధను రాకుండా చూచుకోండి. మీకాలాన్ని అంతా మీరు బాగుపడటానికి చూచుకోండి. వైరాగ్యం లేనివాడు ఎంత ప్రయత్నం చేసినా ప్రకృతి ఆకర్షణ నుంచి బయటకి రాలేడు, వైరాగ్యాన్ని సంపాదించుకోండి.

124. "గజేంద్ర మోక్షం" ఘట్టంలో గజేంద్రుని సహచరులు అందరూ వదిలేసారు. గజేంద్రుడు తన బలంతో నది నుండి బయటికి కొంతదూరం వస్తున్నాడు తిరిగి మొసలి అంతదూరం నదిలోకి తీసుకొని పోతున్నది. అలాగే మనం రక్త బిగి ఉన్నంతకాలం, ఎముకలు బలంగా ఉన్నప్పుడు, మీ పుణ్య కర్మలు బాగా ఉన్నప్పుడు అభివృద్ధిలోకి వస్తాము. పాపకర్మలు ప్రవేశిస్తే దుఃఖాలు వస్తూ ఉంటాయి. గజేంద్రుడు వెయ్యి సంవత్సరాలు పోరాడి బలహీనుడైన తరువాత దైవ సహాయం కావాలనే తలంపు వచ్చింది. అలాగే కర్తను నేను కాదు అని అనుకొంటే దుఃఖం మీ ఇంటికీ, మీ వంటి మీదకూ రానేరాదు. మీ మీద అసూయ ఉండేవాడు చేసే పనులు మీరు తట్టుకొంటేనే మీకు సుఖం కలుగుతుంది. వివేకం

srinannagaru.com

వైరాగ్యం అనే రెండు రెక్కల సహాయంతో ఆధ్యాత్మిక శిఖరాలను చేరుకోవాలి. మమకారం ద్రోణాచార్యులవారిని కూడా నిర్వీర్యం చేసింది. తన తనయుడు తల్లిలేని పెంపకం, చేసినందు వలన అటువంటి దుఃఖం వచ్చింది. నీ మనస్సు, శరీరం, నీ ఇష్టం, నీ అయిష్టం అనే పొరలు ఆత్మను కప్పి ఉన్నాయి. ఈ పొరలను పెంచుకోవటం కాదు, తెంచుకోవటం చెయ్యాలి. అప్పుడే నీ స్వరూపం తెలుస్తుంది. సత్యాన్ని పొందాలనే తపనే-తపస్సు. మన బుద్ధి స్థిమితం తగ్గిందంటే కోపం. కోరికా ఉందని లెక్క. బుద్ధిలో వివేకం పోయేడప్పటికి నీవు భ్రష్టుడవు అవుతావు. ఇది అది. అది ఇది. నేను-నీవు అన్నీ ఉద్రేకాలు సాధన చేస్తే అవిపోతాయి. నిజంగా అవి నిజమైతే సాధనచేసినా పోవు. పైవి నశిస్తేగాని శాంతి లభించదు. మతంలోని సారాన్ని వదిలేసి అందులోని బాహ్య ఆడంబరాలను పట్టుకొంటున్నారు. మనం తరించాలంటే విషయం ప్రధానం, ఆలోచన ప్రధానం. మీకు నష్టం రావచ్చు, లాభం రావచ్చు. ఆలోచన బ్రహ్మం మీదే ఉండాలి. బండి చక్రాలను పట్టా అంటిపెట్టుకొని ఉన్నంతకాలం పరవాలేదు ప్రమాదం రాదు. మన ఆలోచనా ప్రవాహం నది వెళ్ళి సముద్రాన్ని చేరినట్లు ఉండాలి.

125. కొందరు అతిగా మాట్లాడుతారు. అది కూడా బలహీనతే. సాధకునకు అది కూడదు. భరించే వాడికి బాధ ఏమిటి? దేహానికి సంబంధించిన స్పృహలేనివానికి చావు గొడవ ఏమిటి? నిద్రలో చావు గొడవ ఉందా? ఎంత సేపు వారు ఇలా అన్నారు, వీరు ఇలా అన్నారు అనే గొడవలే. నీ ద్వారా ఏమి జరిగినా ఈశ్వరునికి తెలియకుండా జరగదు. అందుచేత నోరు మూసుకొని కూర్చోండి. అది అంతా కర్త యొక్క ఆజ్ఞ ప్రకారం జరుగుతుంది. వ్యాపకాలు పెంచుకోకండి. సాగే స్థితి సమాధి. జపధ్యానాలు సహజ స్థితి కాదు. ఇంద్రియ జీవితంతో కాని సంబంధమే జీవితం. తినటం కంటే జీర్ణించుకోవటం కష్టం. అలాగే విషయాన్ని వినటం కాదు అర్థం చేసుకోవటం ముఖ్యం. మీరు నిర్మలంగా కూర్చుంటే మీకు ఏది మంచిదో అది మీకు చెబుతుంది. మనకు కామన్‌సెన్సు ఉండాలి. రాగద్వేషాలను పెంచుకొంటే మనలోని ఈశ్వరునిపై ఉన్న నమ్మకం తగ్గిపోతుంది. రైలు చక్రాలు పట్టాలను వదలనట్లే మనం ఏ ఉద్రేక పరిస్థితి వచ్చినా గమ్యాన్ని మర్చిపోకూడదు. సహనం వలన మేలు, అసహనం వలన కీడు కలుగుతుంది. జరిగిపోయిన గొడవలు రోజూ తలపెట్టుకోవటం వలన మీకు మోత మిగులుతుంది. వర్తమానం కాపాడుకోవాలి. భవిష్యత్తు గురించి మేడలు కట్టుకోకండి. మీరు సింపుల్‌గా ఉంటే ఇతరులకు మీరు యూజ్‌ఫుల్‌గా ఉంటారు. మిమ్ములను విమర్శించినా, పొగిడినా దాని

srinannagaru.com

ప్రభావం సాధకుని మీద పడకుండా కాపాడుతాడు గురువు. అదే గురువైభవం, వ్యక్తిగత భావాలకు మీరు ఎప్పుడూ ప్రాధాన్యం ఇయ్యకండి కారణం వాడికి రాగద్వేషాలు ఉంటాయి. అవి గ్రహిస్తే వాటిని మనకు అంటిస్తాడు. మీరు ఏదైనా మంచిపనిచేస్తే యాభై శాతం సంతోషిస్తారు. అందరూ గౌరవించాలి అనుకొంటే మానసిక అనారోగ్యానికి దూరమౌతారు.

126. భయపడటం వలన వ్యతిరేకాలోచన వస్తుంది. తరువాత అది సంస్కారాలను ప్రోగుచేస్తుంది. జీవిత సముద్రంలో మహా తిమింగలాలు ఉంటాయి, సొరచేపలు ఉంటాయి. వాటిని అధిగమించి ఒడ్డుకు చేరాలి. అప్పుడే జ్ఞానం కలుగుతుంది. అంటే జీవితంలో అనేక మంది ఎదురౌతారు వారిని అధిగమించాలి. లేనిది లేనట్లుగా తెలిస్తే ఉన్నది ఉన్నట్లుగా తెలుస్తుంది. జీవితంలో కామన్‌సెన్సు ఉంటే చాలా సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చును. నేను ఇలా మాట్లాడితే వాడికి నేను దూరమౌతాను అని భయపడేవాడికి బానిసత్వం వస్తుంది. బానిసత్వంలో ఎంతకాలం జీవించగలము. ప్రేమ నెమ్మదిగా పనిచేసుకొంటూ వెళుతుంది. ద్వేషం తొందరగా పనిజరుగుతుంది. ముముక్షువు నిందాస్తోత్రాలకు అతీతంగా ఉంటాడు. భక్తుడు వేరు, ముముక్షువు వేరు. ముముక్షువు దృష్టి మోక్షం మీదనుంచి చలించదు. బాగా సాధన చెయ్యాలి అనుకొనే వారు సమాజంతో ఎంతవరకూ ఉండాలో అంతవరకూ ఉండాలి. ఎక్కువగా ఉండ కూడదు. పద్మము బురదలో ఉంటుంది కాని బురదను అంటించుకోదు. అలాగే సమాజంలో ఉన్న వాసనలు అంటించుకోకూడదు. లోకంలో క్రూరత్వం ఉంది. కబీర్, మీరా, సక్కుబాయి ఇలా ఎంతోమంది బాధ పడ్డారు. క్రూరత్వంతో వ్యవహరించే వారు చరిత్రలో పత్తాలేకుండా పోయారు, బాధలుపడ్డవారే నిలిచారు. సక్కుబాయి రంగని చూడాలని వ్యధను తట్టుకోలే నప్పుడు రంగడు ఆమె వద్దకు వచ్చి "నీ వేషంలో నేను ఉంటాను. నీ ఇంటిపని నేను చేస్తాను నీవు రంగని చూచిరా" అని పంపించి ఆమెచేసే పాలేరుతనం తనుచేసాడు. అలాగే మీరా అంది "భగవదనుభవం పొందేకాంక్షలో వాళ్ళు పెట్టే బాధలు నన్ను నా కాంక్షలో నుంచి మరలించలేదు, నన్ను దారితప్పించలేదు" అంది. అది గొప్పసాధన. ఈశ్వరుని చేతిలో మీరు పనిముట్టుగా ఉంటే ఈ క్షణంలో మీ దుఃఖరాసి అంతా బూడిద అవుతుంది.

127. మీ జీవితంలో ఏదైనా చెడు జరిగింది అనుకోండి. దానికి కోటి రెట్లు అభివృద్ధి కోసం ఈ చెడు పని జరుగుతోంది అన్న వివేకం మీకు కావాలి. పుట్టిన బిడ్డను మంచి వాడని, చెడ్డ వాడని అనము. వయస్సు వచ్చాక అతని

srinannagaru.com

పనులను బట్టి నిర్ణయిస్తాము. మన కర్మలను బట్టి స్నేహితులు సిద్ధమౌతారు. అది ప్రారబ్ధాన్ని బట్టి సిద్ధామౌతారు. అది నీ ప్రారబ్ధాన్నిబట్టి నిర్ణయమౌతుంది. మంచి స్నేహితులను కూడా ప్రారబ్ధం నిర్ణయిస్తుంది. అంతేగాని ఎదుటి వాళ్లను ఆ రకమైన స్నేహితులు అని నిందించకండి. మీకు కాలక్షేపం అవ్వకపోతే మీ ప్రారబ్ధాన్ని తిట్టుకోండి. మనిషి తిరిగి తిరిగి ఎక్కడికి వస్తాడంటే తన దగ్గరకే. నీవు ముఖ్యం. ప్రపంచంలోని బంధువులు అంతా నిజంకాదు. విరోధులను, స్నేహితులను కలుస్తున్నావు, అంటే నీ దగ్గరకే వస్తున్నావు. ఇదే లాజిక్కు. మనిషి పనులు అన్ని ఎందుకు చేస్తాడు నీకోసమే, ఆనందం కోసమే. నదిలో స్నానం చేసినంత తేలిక కాదు సాధన. సాధనలో ఉంటే పొరలు, పొరలుగా దేహం నేను అనే తలంపులు వస్తాయి. కామ, క్రోధ, లోభాలు అప్పుడు బయట పడతాయి. సాధన లేకపోతే అంతా పెద్దమనుషులుగానే ఉంటారు. దేహాలు, మిధ్య, అహంభావన మిధ్య వీటిని అలంకరించుకొంటూ సత్యాన్ని తెలుసుకొందాము అనుకొంటున్నాము. బ్రహ్మ భావన పొందటానికి ఎన్ని ఆటంకాలు వస్తాయో అన్ని రానియ్యండి. బ్రహ్మభావనలో ఉంటే అన్ని రాలిపోతాయి. శాస్త్రం మీ ఎదురుగా ఉన్నా మీకు దానిమీద శ్రద్ధలేకపోతే దాని ప్రయోజనం లేదు. మమకారం వలననే ప్రపంచానికి బంధిపబడతాము. ప్రపంచంలో అన్నిటికన్న కష్టమైన పని ఈశ్వరుని పాదాలయందు మనస్సును నిలబెట్టి ఉంచటం. అది నీకు సాధ్యమైతే ఆ అనుగ్రహంలో నీవు తరిస్తావు. సంసార రోగం నుంచి నీవు బయట పడతావు.

128. పిల్లి ఎక్కే గుమ్మము, దిగే గుమ్మము, అలాగే లక్ష్మి ఒక తరంలో ఒకరి దగ్గరకు, మరో తరంలో మరియొకరి దగ్గరకూ వెళుతుంది. ముప్పది సంవత్సరాలు కుచేలుడుగా ఉంటాము తరువాత కుబేరులమౌతాము. కొందరు అనుకొంటారు "మా ముత్తాత ఎంత వైభంగా ఉండేవారు". ఇవి అన్నీ ప్రకృతిలో భాగాలు. హెచ్చుతగ్గులు ఉంటాయి. సాధన చేసే వారికి సద్వస్తువు దగ్గర అవుతుంది. చెయ్యని వానికి దూరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆర్థిక సమస్యల కన్న ఇంటి సమస్యలు, గ్రామ సమస్యలు ఎక్కువ అవుతాయి. మన మనస్సులో శాంతి లేకపోతే మన ఇంట్లో శాంతి కలుగదు. ముందు మన మనస్సులో శాంతి ఉందా లేదా అని చూచుకోండి. శాంతి లేదు అని చెప్పే వాడికి శాంతి ఉంది. మనకు శాంతి ముఖ్యం. శాంత చిత్తంగల వాళ్ళు ధన్యులు. మనం శాంతిలో స్థిరపడినప్పడు లోకంతో సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. ధర్మాన్ని ఆచరించేవాడు దురాశలేనివాడు శాంతి సామ్రాజ్యమునకు అధిపతి అవుతాడు. మానవుని మానసంలో ఉన్న అశాంతి మాత్రమే లోకంలో ఆందోళనగా అలజడిగా

srinannagaru.com

కనిపిస్తుంది. పుష్పంలో వాసన కొంత దూరమే వెళుతుంది. నా హృదయంలో అందం ఉంటే, ధర్మాచరణ ఉంటే లోకాలన్ని వ్యాపిస్తూ ఉంటుంది. నీవు ఒక నదిని దాటాలంటే ఈత ఈది అవతలకు వెళ్ళాలి. ఆ నదిని దాటకపోతే అవతల ఒడ్డుకు వెళ్ళలేవు. అలాగే నీ మూలతలంపు మూలంలోనే చైతన్యం ఉంది. మూల తలంపులు అధిగమించాలి. దానికి, అవమానాలు, అసహనాలతో నిండిన అహంకారాన్ని దాటితే శాంతి తీరానికి వెళతావు. అజ్ఞాన ఫలం=దుఃఖం. వేరు భావన దుఃఖాన్ని కలుగజేస్తుంది. పేచీలు వద్దు, కూడికలు, తీసివేతలు, భాగహారాలు తెలియని వాడు ఎలా సంపాదిస్తాడు, ప్రేమించే గుణం సంపాదించు. హంసలా ఉండు. మంచితనం తీసుకో. చెడును వదిలేలా ఉండు. కొండేలు, చాడీలు చెప్పేవానికి జ్ఞానం రాదు. ఇతరులను కూడా పాడు చేస్తాడు.

129. ఎక్కడైతే కోపం ఉంటుందో అక్కడ హింస ఉంటుంది. దుఃఖం ఉంటుంది. కొందరు ఇంట్లో వాళ్ళ మాటలతో కోపం వ్యక్తం చేస్తారు. దానికన్న కొట్టుకోవటం మంచిది. నీవు గాఢనిద్రలో ఎలా ఉన్నావో అలాగే జాగ్రదవస్థలో నామరూపాలతోనూ, రాగ-ద్వేషాలతోనూ సంబంధం లేకుండా ఉండగలిగితే బ్రహ్మజ్ఞానం నీ దగ్గరకు వస్తుంది. ఏదో కారణం వలన నీ మనస్సు కంగారు పడుతున్నది అనుకోండి అవి ప్రకృతి పరంగా కావచ్చును. కుటుంబపరంగా కావచ్చును. అప్పడు మీలోని అపవిత్రతే గాయపడుతుంది. మీరు అపవిత్రులు అయితే, గాయాలు తొలగవు. మీరు అనవసరంగా ఇతరులను అనుకోవటం పొరపాటు. ముళ్ళు అన్నీ తీయలేము, చెప్పలు వేసుకొంటే ఏ బాధాలేదు. వర్షం వస్తుందని గొడవ పడకుండా గొడుగు కొనుక్కో. అలాగే నీవు ప్రశాంతంగా ఉండు. ప్రకృతి గొడవలు నిన్ను ఏమీ చెయ్యలేవు. లోకం అంతా దుఃఖమయం. బాగుపడేవారు అంతా భవిష్యత్తుకు సంబంధించిన అంటే ఆత్మజ్ఞానానికి సంబంధించిన వాటి గురించే ఆలోచిస్తారు. రాయి దెబ్బతిన్న తరువాతే రాయి విగ్రహమౌతుంది. అప్పడు దాన్ని ఆరాధిస్తాము. మట్టిని కాల్చిన తరువాతే కుండ అవుతుంది. మీరు ఊహించుకొంటూ ఉంటే అహంకారం పెరుగుతుంది. మనకు బయట సంఘటనల కంటే మీ అపవిత్రత వలననే దుఃఖం వస్తుంది. భేదాలు ఉన్నంతకాలం బాధలు తప్పవు. ఆత్మలో భేదాలు లేవు. నిజంగా భగవంతునిపై విశ్వాసం ఉంటే భయంతో పనిలేదు. "ఎంతవరకూ ఉపకారం చెయ్యగల్గితే అంత వరకూ ఉపకారం చెయ్యి. ఎంత వరకూ సాధన చెయ్యగల్గితే అంత వరకూ సాధన చెయ్యి" అని శాస్త్రం చెబుతున్నది. శివునితోబాటు నీ శవాన్ని కూడ ధ్యానం చెయ్యి అంటే నేను కూడా ఏనాటికైనా అదే అవుతాను కదా అని

srinannagaru.com

అంతర్దృష్టి కలుగుతుంది.

130. రహదారి బంద్ అయితే గంటల తరబడి ఆగిపోవాలి. బుల్‌డోజర్లు తొలగించలేని నీ వాసనలను నీచేత ఊరికే చెయ్యి వేయించి గురువు గెంటుతాడు. అది గురువు వైభవం. భౌతికంగా అభివృద్ధి కావాలన్నా పరుష వాక్యాలు ఎన్నడూ పలుకకూడదు. రంగురంగుల పూవులతో దండను కడతాము. అలాగే అనేక మంచిగుణాలు ఎవరిలో చూచినా దాన్ని మనం స్వంతం చేసు కోవాలి. ఎక్కువ బెంగపెట్టుకొంటే నిలువరు. గుడి దగ్గర దాకుంటారు. బెంగ పెట్టుకొంటే ఆఖరుకు ఆకలి కూడా కలుగదు. భయం వలన ప్రేగులు ఉద్రేకపరిస్తే విరోచనాలు అవుతాయి. ఆందోళనగా ఉంటే మీ గుండె వేగంగా కొట్టుకొంటుంది. భయం మనస్సునే కాదు, దేహ ఆరోగ్యాన్ని కూడా పాడుచేస్తుంది. గుణాలకు అధిపతి గణపతి బుద్ధిని శుద్ధి చేస్తాడు. మంచి మనస్సు ఉన్నవాడు మంచి మార్గానికి ఆకర్షించబడతాడు. భగవంతుడు బుద్ధికి అందకపోయినా శరణాగతికి అందుతాడు. ఉద్రేకం వచ్చే ఆలోచనలు మనకు మంచివి కావు. ప్రపంచాన్ని నిషేధించాలి కాని మనం భగవంతుడిని నిషేధిస్తున్నాము. అంటే లేని దాన్ని స్వీకరించి ఉన్నదాన్ని వదిలేస్తున్నాము. సైకిల్‌కి ఆయిలింగ్ ఎటువంటిదో మన జీవితానికి సహనం అటువంటిది. కొంతమంది అనుకొంటారు "గురువును తలుస్తూ మా విషయాలు అన్నీ ఆయనకు తెలుసు బాగా గుర్తు" అనుకొంటారు. గుర్తు అనుకోవటానికి అంతా ఆయనే కదా వేరే గుర్తుంచుకోవటానికి నీకు అన్యంగా ఏదీ లేదు. మీరు కష్టపడి, కష్టపడి వందకాసుల బంగారాన్ని సంపాదిస్తే ఒక రాత్రి దొంగలు దోచుకుపోతే ఎలాంటిదో మీరు పూజ, ధ్యానాలు, జపాలు చేసి సంపాదించుకొన్నది రాగ-ద్వేషాలనే దొంగలు దోచుకొనిపోతారు.

131. భౌతిక, ఆధ్యాత్మిక సంపద లేకపోయినా దేహభావన అనేది ఉంది. అటువంటి దాని కన్న కట్రాడు మెరుగు, పశువులను కట్టేసుకోవటానికైనా పనికి వస్తుంది. దేహమే కేంద్రంగా పెట్టుకొన్నవాడు ఆరోజుకారోజు అధోగతి పాలౌతాడు. అంతా భగవంతుడే, కాని ఆయనకు భిన్నంగా నేను ఉన్నాను. నేను అది సాధించాను, ఇది సాధించాను అనుకోకు. అది దేహబుద్ధి చేస్తుంది. మనం చేసేది ఏదీ లేదు. అంతా ఆయన అనుగ్రహం వలనే జరుగుతున్నది. నీవు ప్రశాంతంగా కూర్చుని ఏ తలంపు నిన్ను బాధపెడుతున్నదో దాన్ని తొలగించుకోవటానికి ఎంతోకొంత ప్రయత్నం చెయ్యాలి. మనం ఎలా తయ్యారయ్యాము అంటే మనం భగవంతుణ్ణి తలచుకోకూడదు. ఆయనే మనలను తలచుకోవాలి. కంప్యూటరు ఉన్నా ఆపరేట్ చేసేవాడు లేకపోతే ఏ పని జరగదు. అలాగే మన

srinannagaru.com

హృదయంలో ఒకడు ఉన్నాడు. మిమ్ములను నడుపుతున్నాడు. మీరు ఏమి చేస్తున్నారు అంటే సంతోషంతోనూ, దుఃఖంతోనూ తాదాత్మ్యం పొందుతున్నారు. ఇదే మాయ. నాకు అన్నీ తెలుసు అనుకొనేటప్పుడు, తెలుసుకొనే బుద్ధి ఎలా కలుగుతుంది. ఏమీ తెలియదు అనుకొనే వాడికే భగవంతుని తెలుసుకోవాలనే బుద్ధి కలుగుతుంది. మానవత్వం లేనివానికి దైవత్వం ఎలా తెలుస్తుంది. ఆత్మ ఉందని నిదర్శనం ఒక్కటే మీరు అంటే మీకు ఇష్టం ఎందుకు. ఇష్టం మీ హృదయంలో ఉంది. అది ఆత్మకాబట్టి. బయట సంబంధాలన్నీ ఇష్టాలు అనబడవు. భగవంతుని ఎంత ఇష్టంగా ప్రేమించాం అని తెలపాలంటే రాధాప్రేమ సంకేతం. రాధ జీవుడు, కృష్ణుడు పరమాత్మ. ఆమె కృష్ణుణ్ణి ఎలా ప్రేమించిందో తెలపటానికే రాధాష్టమి.

132. ప్రహ్లాదునకు "నాకు కష్టం వస్తున్నది దాన్ని తొలగించు అనే బుద్ధే కలగలేదు". అది నిజమైన శరణాగతి. నేత్రాలు అన్నీ చూస్తాయి కాని దాని కన్నును అది చూడలేదు. అహంకారం అన్నీ చూస్తుంది. తన మూలాన్ని అది చూచుకోలేదు. ఇదే రహస్యం. ఆత్మ ఏమీ రాయదు, మాట్లాడదు. వారు ఎలా ఉంటారో నీవు అలా ఉండు. వారు తెలియబడతారు. నేను అలా రాస్తున్నాను. నాకు అంత పేరు ఉంది అని నీవు అనుకొంటే నీవు ఆత్మలా ఎలా ఉండగలవు. "నీవు దేహం కాదు, మనస్సు కాదు. వాటితో తాదాత్మ్యం పనికిరాదు" అని శాస్త్రాలు అన్నీ చెబుతున్నాయి. కాని నీవు కాని వాటిలోకి దిగజారకండి. ఇక ఏమి చెప్పాలి. నీవు ఎలా ఉండాలో అలా ఉంటే వేదనా, రోదనా ఉండదు. నీ సాధన పేరుతో శ్రమ ఉండదు. అదిగా ఉండటం కంటే, నీకు వేరే పని ఏముంది అదే నిజమైన పని. రోజులు సుఖంగా, మంచిగా వెళ్ళిపోతున్నాయి అంటే అది మంచి స్వప్నము. అంటే దుఃఖంగా వెళుతున్నాయి రోజులు అంటే దుఃఖ స్వప్నము అంతే. మనస్సును మనం పవిత్రం చేసుకొంటూ వెళుతూ ఉంటే అది ఆత్మాకారం చెందుతుంది. మనం ఎవరికి ఉపకారం చేసామో, వారే శత్రువులు అవుతారు. దారిపోయే వాళ్ళు శత్రువులు అవ్వరు. వాడికీ నీకు సంబంధం లేదు. గురువు చెప్పేమాట నీకు అనుభవంలోకి రావాలంటే వారి అనుగ్రహం లేకుండా ఆ వాక్యం నీకు అందదు. దేహానికి సంబంధించిన సుఖాలు-సంతోషాలు, భోగాలు తెలుస్తాయి. పుట్టని ఆత్మ తాలూకు సుఖం మీకు అనుభవంలోనికి రావటంలేదు. ఆ సుఖం పరిణామంలో దుఃఖాన్ని తీసుకొని రావటంలేదు. చిత్తశుద్ధి, చిత్తం యొక్క మూలాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తుంది. దానికి పుణ్యబలం, ఏకాగ్రత సంపాదించుకోవాలి.

srinannagaru.com

133. మంచి మాట-మంచి పని, మంచి అభిప్రాయం ఆత్మజ్ఞానానికి సహకరిస్తుంది. పుట్టిన వస్తువుకు ప్రారబ్ధం ఉంటుంది. పుట్టని ఆత్మకు ప్రారబ్ధం లేదు. ప్రారబ్ధం సాఫీగా, సుఖంగా సాగిపోతే పొంగిపోతారు. అది బాధాకరంగా సాగుతూ ఉంటే కృంగిపోతారు. వీటికి మనం సమానంగా ఉండాలి. దేహం నిజమని అనుకొంటాము దాని వలన ప్రారబ్ధం కూడా నిజమనుకొంటాము. ఐశ్వర్యం, దరిద్రం రెండు స్వప్న సమానమే. ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొని పోకుండా ఏదో ఒక నామాన్ని జపిస్తూ ఉంటే అది మిమ్ముల్ని కాపాడుతుంది. నదీ ప్రవాహం వేగంగా ఉన్నప్పుడుఏదో ఒక చెయ్యి, ఏదో ఒక ఆధారం పట్టుకొంటే సురక్షితం. అలాగే నామం కూడా మనస్సుకు పవిత్రత కలుగుతూ ఉంటే అది ఆత్మాకారం చెందుతుంది. వినోదం, సాధకునికి పనికిరాదు. అది ప్రకృతికి సంబంధించినది, విజ్ఞానం సాధకునికి ముఖ్యము. రాముడు పరమాత్మ. మనం లక్ష్మణునిలా రాముని పాదాలను ఆశ్రయించినట్లు, జీవిస్తే తరిస్తాము. మనకు దుఃఖం, బాధ కలుగుతూ ఉంటే, మన మనస్సుకు ఆనందం కలగటానికి మన మీద మనం నిలబడేటట్లు చెయ్యటానికి ఈశ్వరుడు ఆ పని చేస్తున్నాడు అని గుర్తు ఉంచుకోండి. ఎక్కడికి వెళ్ళినా ఈ ముళ్ళ కంపలు ఏమిటి అని అనుకోకండి. ఊహించుకోవటం వల్లనే నిరుత్సాహం వస్తుంది. భగవంతుడు ఇచ్చిన ప్రారబ్ధాన్ని ప్రీతిగా స్వీకరిస్తే భగవదనుగ్రహానికి పాత్రులమౌతాము. తపస్సు లేకుండా, సభ్యత, సంస్కృతి పెరగదు. కేవలం అధ్యయనం ఒక్కటే చాలదు. శరీరపరమైన అనారోగ్యము, మనస్సులో ఉన్న క్షోభను భరించటం కూడా తపస్సే. మనస్సులోని సంస్కారాలను ఎండబెట్టటమే తపస్సు. హృదయం వైపుకు మనస్సు తోలుకొని వెళ్ళటం తపస్సులో ముఖ్యమైన భాగము. జప, ధ్యానముల యొక్క ప్రయోజనము అహంభావ రహితస్థితిని పొందటం మాత్రమే. గతించిన విషయముల నుండి పాఠాలు నేర్చుకోవాలి. వాటిని మనం భవిష్యత్తుకు ఉపయోగించుకోవాలి. వర్తమాన కాలంలో జీవించటం నేర్చుకోవాలి.

134. బయటచూపువలన అభివృద్ధి రాదు. నీ మనస్సు ఎలా ఉందో చూచుకో. ఎదుటివాళ్ళ కళ్ళతోకాదు, నీ స్వంత బుద్ధి వదలకు. కీర్తి కూడా దుమ్ముతో సమానం. నీకు సమస్యను పరిష్కరించుకొనే నేర్పు ఉండాలి. వాయిదా వేసి సినిమాకు వెళితే అది తాత్కాలికం. పని దగ్గర నీ మనస్సు ఉండాలి. దుఃఖానికి కారణం ఏమిటి? అని గ్రహించాలి. నీ తలంపులతో నీ తాదాత్మ్యాన్ని కత్తిరించు కొంటే దుఃఖం అప్పటికప్పుడు ఆగిపోతుంది. అమనస్క స్థితి వచ్చే వరకూ ఏదో ప్రయత్నం చెయ్యక మానవు. ఇంటెన్సివ్ కేర్‌లోని పేషెంటుకు భయం కలుగు

srinannagaru.com

తుంది. కారణం ఏ ప్రమాదం ప్రాణానికి జరుగుతుందో అని. అలాగే నీ మనస్సులో కలిగే భయాలతో నీవు ఉండి భయపడకు. ఎవడో ఇస్తే పుచ్చుకొనేదా వైకుంఠం. తలకాయతో ఆలోచించలేవా స్వంతబుద్ధి లేదా! బట్టల కొట్టులో మిరుమిట్లు గొలిపే కాంతిలో బట్ట ఇలా ఉంటుంది, బయట వెలుగులో ఎలా ఉంటుందో నాణ్యం అని బయటికి పట్టుకెళ్ళి పరీక్షిస్తావే. అలాగే బియ్యం సరిగాలేకపోతే బయటికి వచ్చి ఎన్నోసార్లు చూచుకొంటావే. మరి ఆధ్యాత్మిక విషయాలలో ఎంత నేర్పు ఉండాలి. జాగ్రత్త ఉండాలి. నీవు ఏ ఆకర్షణకు లోనైనా ఎన్నో జన్మలు అది తీసుకొని వస్తుంది. మీ మెదడుకు పని చెప్పకోండి. నీవు ఏదిగా ఉన్నావో అదిగా ఉండే వరకూ నీవు ఏదో ఆకర్షణకు బలి అవుతూ ఉంటావు. ప్రకృతి నిన్ను వెంటాడుతుంది. లాభంలోనూ, నష్టంలోనూ ఏమీ లేదు. అంతా ప్రకృతే. హృదయంలో ఉన్న ఆనందం చూసాక బయట ఉన్న ఆనందం చూడాలని ఉండదు. చెక్కతో చేసిన సీతాఫలం చూచినా ఆనందం కలుగదు, నిజమైన సీతాఫలం తిన్నప్పడే నిజమైన ఆనందం కలుగుతుంది.

**135.** మనం తెగిపోయిన గాలిపటాలలా లేము. దారం భగవంతుని చేతుల్లో ఉంది. చచ్చిపోవటం అంతా బొమ్మ పోవటం. అలా పారిపోదాము, ఇలా పారిపోదాము అంటే కుదరదు. ఏ గంటలో ఏ రోజు ఎలా అనుభవం పొందాలో అది పొందిన తరువాత బొమ్మను తెరమీద నుంచి తీసేస్తాడు. అది అందమైన బొమ్మ అయినా డైరెక్టుగా తీసేస్తాడు. ఎవరి మీదా కోప్పడకు. ఎవరూ నీకు ఉపయోగపడరు. నీవు కోప్పడితే, నీవే పాడౌతావు. సమాజం నీకు ఏమీ ఉపయోగపడదు. సత్సాక్షి నీకు ఉపయోగపడుతుంది. కొండ మీద ఎక్కడ కురిసినా వాన నీరు జలపాతాలను, నదులను దాటుకుంటూ సముద్రాన్ని చేరి శాంతిస్తుంది. మనం భగవంతుని లోంచే వచ్చాము. తిరిగి అక్కడకు చేరే వరకూ శాంతి, సుఖాలు కలుగవు. భగవంతుని సంకల్పాన్ని గౌరవిస్తే మనం ఈ క్షణంలోనే మనకు జ్ఞానం కలుగుతుంది. అనుకూల వ్యతిరేక ప్రారబ్ధాలను రెండూ అంగీకరిస్తే ఇప్పడే మనస్సు చల్లబడుతుంది. మోహం నశిస్తుంది. ప్రపంచం అంటే ఏమీ లేదు. అజ్ఞానమే. అజ్ఞానమే ప్రపంచానికి ఆధారం. అజ్ఞానం లేకపోతే సృష్టి ఉండదు. తాడు పాముగా కనిపిస్తూ ఉన్నంత కాలం దుఃఖం, జన్మ పరంపరలు ఆగవు. ఉన్నది ఆత్మే. అది తెలిసే వరకూ దుఃఖం ఆగదు. కోరిక ఉంది కాబట్టి ప్రపంచంలో ఏదో ఉంది అని అనిపిస్తుంది. కోరిక లేకపోతే ప్రపంచమే లేదు. బాహ్యంగా ఎవరైనా మిమ్ములను "మీకు చాలా డబ్బు ఉంది అనిగాని, మరే రకంగా అన్నా మీకు సంతోషం కలిగితే రెట్టింపు దుఃఖం నీవు

srinannagaru.com

భవిష్యత్తులో పొందాలి. అది ప్రకృతి చేసేపని, నిన్ను ఏ రకంగా పొగిడినా నిజం అనుకొంటే దుఃఖం తప్పదు.

136. భయరహితుడుగా నీవు ఉండాలి లేదా నీవు గమ్యం తప్పిపోతావు. గోక్కొనే కొలది దురద ఎక్కువ అవుతుంది. అలాగే తలంపులను పెంచుకొంటే అవి ఎక్కువ అవుతాయి. ఈ తలంపులు ఎవరికీ అని విచారణ చెయ్యండి. యజ్ఞయాగాదులు చేసేవాడికి దేవుడు అగ్నిహొత్రంలో ఉన్నాడని ఉత్తరగీతలో ఉంది. సాధకునకు హృదయంలోనే ఉన్నాడు. జిజ్ఞాస లేకుండా జ్ఞానం కలగదు. లోకంలో ఇష్టం-అయిష్టం ఉన్నాయని అనుకొంటారు. ఉన్నది ఇష్టం ఒక్కటే, దానికి భంగం వచ్చినప్పుడు అయిష్టంగా మారుతుంది. ద్వైతం, రకరకాలుగా మారుతుంది. లోకాన్ని వెదికితే దుమ్ము దొరుకుతుంది. హృదయంలో వెదికితే స్వేచ్ఛ కలుగుతుంది. దేహం అబద్ధమైతే దేహానికి సంబంధించిన ప్రారబ్ధం కూడా అబద్ధమే. వృత్తి వేరు, మనిషి వేరు. వృత్తిని బట్టి మనిషి బాగుపడడు. మనం భగవదనుభవం పొందటానికి రాగ, ద్వేషాలు లేకుండా జీవిస్తున్నామా అనే దాన్ని బట్టి ఉంటుంది. ప్రారబ్ధం ఇష్టంగా అనుభవిస్తే సుఖంగా ఉంటుంది. చివరకు మనస్సు నశిస్తుంది. కట్టుకొనే బట్టను బట్టి, తిరిగే కార్లను బట్టి మనిషి విలువ కట్టకూడదు. లోకంలో ఎవరిని చూచి భయపడకండి. భగవంతుడే మనకు నిజమైన తండ్రి. భోగంలోంచి వచ్చేది అశాంతి, రోగం. జ్ఞానంలోంచిం వచ్చేది ఆరోగ్యం, మోక్షం. సరియైన ఈ అవగాహన లేనివారినే "భోగకాంక్షకులు" అని అనుకోవాలి. ఎలా జీవించాలో కాలేజీలోనే నేర్చుకొంటారు. అవి బాహ్యానికి సంబంధించిన విషయం. వికారం గల మనుషుల మధ్య ఉండి వికార రహితంగా జీవించటం నేర్పుతుంది గీత. కొందరు అన్ని ఇబ్బందుల మధ్య, కష్టాల మధ్య సంతృప్తిగా ఉంటారు. వారికి ఈశ్వరానుగ్రహం తొందరగా అందుతుంది.

137. తినటం వలన, వినటం వలన, వాసన చూడటం వలన, తాకటం వలన ఈ కారణాలలో ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళిపోతుందో చూచుకోవటమే నీ పని. న్యాయం కంటే సత్యం గొప్పది. దయ గొప్పది. దయకు ఉత్కృష్టమైన స్థానం ఇచ్చారు బ్రహ్మానుభవం పొందటానికి. రైలు ఇంజను ఎంత గొప్పదైనా పట్టాల మీద ఉంటేనే దాని ప్రభావం కనబడుతుంది. అలాగే సహనం ఉంటే బ్రహ్మానుభవానికి సహకరిస్తుంది. ఎవరి వెర్రి వాడికి ఆనందం. ఆ వెర్రి నీకు ఉంటే సత్యం, నీకు ఎన్నటికీ తెలియబడదు. ఆత్మ కాని దాని మీద ఆత్మబుద్ధి పెట్టుకోకూడదు. మీరా అంది "వారు ఏమనుకొంటారో వీరు ఏమనుకొంటారో అనే వెర్రి నాకు ఎప్పుడూ లేదు". ఇంట్లో ఎవరైనా మిమ్ములను సరిగా

srinannagaru.com

చూడటం లేదు అనుకోండి వాళ్ళమీద మమకారం పోయి మనస్సు వెళ్ళి ఆత్మ గూటిలో పడిపోతుంది. మీలో ఉన్న సద్వస్తువుకు ఏ దోషం లేదు. అది మీరై ఉన్నారు. దాన్ని మీరు సదా జ్ఞప్తిలో ఉంచుకోండి. ఈ మనస్సు ఎవరి కోసమో ఏడుస్తూ ఉంటుంది. వాళ్ళకూ నీకు ఏమిటి సంబంధం. నీ మనస్సులో పోరాటం ఏమిటి? అని నిరంతరం గ్రహించుకోవాలి. మనకు గర్వం రాకుండా చూచుకోవాలి. గర్వం గల వాళ్ళతో స్నేహం చెయ్యకూడదు. నీవు కాని దాన్ని నీవు అనుకొంటూ పారల మీద, పొరలు కప్పకుంటూ నీ అహంకారాన్ని పెంచుకొంటున్నావు. నీ మనస్సును బోనెక్కించక వాళ్ళ గురించి వీళ్ళ గురించి ఆలోచన ఏమిటి? ఆత్మ విశ్వాసం, బలాన్ని ఇస్తుంది. సందేహం దౌర్బల్యాన్ని ఇస్తుంది. పెద్ద పెద్ద సాధనలు చేసే వారిని తీసుకొందాము. చివరి దశలో ఈశ్వరుని దయలేకపోతే ఈశ్వర సాక్షాత్కారం కలుగదు. ఆ ముడి పోదు.

**138.** మిమ్ములను ఎవరైనా పీడిస్తూ ఉన్నా, మీ కుటుంబ సమస్యలతో సతమతమవుతూ ఉన్నా ఒక్కసారి ఇలా అనుకోండి. వాళ్ళకూ నాకూ సంబంధం ఏమిటి? అని అనుకోండి దుఃఖం అక్కడికక్కడ ఆగిపోతుంది. పాండవులు అన్నీ పోయి చెట్ల వెంట, పుట్ల వెంట తిరిగినా తేజస్సు పోలేదు. దేవుని తిట్టుకోలేదు. కాని మనం అన్ని సుఖాలు, అన్ని వసతులు, అన్ని అవసరాలకు లోటు లేకున్నా ఏడుపు ముఖంతో ఉంటున్నాము. మనం ఆత్మగా ఉన్నామనే బుద్ధే లేదు. అంతా పరాయి బుద్ధే. అంటే లోకవాసనతో మాట్లాడుతారు. మీరు ఒక మంచి పనిచేసి, అందరూ మిమ్ములను మంచి పని చేసారు అని అన్నా లేదా మీరు కూడా అలాగే అనుకొన్నా మీకు ప్రతిష్ఠ కావాలనే కోరిక ఉందని గుర్తు. అటువంటప్పడు మీకు అహంకారం పోగొట్టుకోవాలనే బుద్ధి మీకు లేదు అని గుర్తు. మీకు లోచూపు కొంత ఉంటే ఈ విషయం తెలుస్తుంది. అసలు లోచూపే లేనప్పడు ఈ విషయం ఎలా తెలుస్తుంది. నీ జీవితంలో జరిగే ప్రతి సంఘటనలోనూ ఒక "సందేశం" ఉంది. దాన్ని నీవు గ్రహిస్తే నీవు వివేకవంతుడవు అవుతావు. ఆత్మానుభవం "నాకు రాదు, నాకు రాదు" అని మీరు అనుకొంటూ ఉంటే మీ మనస్సు మిమ్ములను లోపలికి వెళ్ళనివ్వదు. ఆత్మ విశ్వాసం పెంచుకొంటే మీరు తరించ గలరు. ఇష్టం లేని తలంపు వస్తే దుఃఖం వస్తుంది. ఇష్టం గల తలంపు వస్తే సంతోషం వస్తుంది. ఇవి రెండూ అసత్యాలే. సాధనా బలం ఉన్న వానికి పని ఎక్కువ. ప్రతీకారం తక్కువగా ఉంటుంది. కోరికలేని వానికి ప్రపంచం లేదు, దుఃఖం లేదు. గుడికి వెళ్ళటం పెద్ద పని కాని నిజమైన ఆధ్యాత్మిక ప్రగతి, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యటంలోనే ప్రారంభమౌతుంది.

srinannagaru.com

139. చావుకీ జీవితానికీ భేదం కనిపిస్తూ ఉంటే మనకు జ్ఞానం లేదని గుర్తు. కుళ్ళిపోయిన కొబ్బరికాయను తీసి ఒక ప్రక్కన పెడతారు. మనం అంతే. మంచి పనులు ఎందుకంటే చిత్తశుద్ధి కలగటానికి. అవి చేస్తున్న మనస్సు శుద్ధి కాకపోతే మీ ప్రగతి సున్నా. పరవంచన కన్న ఆత్మవంచన ప్రమాదం. మనం ఒంటరిగా ఉన్నప్పుడు ఇలా ఆలోచించుకోవాలి మన మాట, చేత, తలంపు సహజంగా ఉందా, అసహజంగా ఉందా అని ఆలోచించుకోవాలి. మనకు అర్హత ఉంటే జ్ఞానం పొందాలని అనుకోకుండానే జ్ఞానం వచ్చేస్తుంది. మన పద్ధతి ఎలా ఉందంటే మనకు అర్హత లేకపోయినా జ్ఞానం వచ్చేయాలి. ఏ తలంపు వచ్చినా పీట వేసి కూర్చోపెట్టకండి. కూర్చోపెడితే ప్రక్క వేస్తుంది. కదలదు. దేహమనేది దేశ కాలాలకు అనుగుణంగా ఉంటుంది. ఆ కాలం వచ్చేటప్పటికి అది చనిపోతుంది. ఆత్మ దేశకాలాలకు అతీతం. దేశకాలమానాలకు లోబడి ఉండే మనస్సు, బుద్ధి, శరీరాన్ని ఆలంబనంగా చేసుకొని ఆత్మను తెలుసుకోండి. మీరు ఆందోళనతో ఉంటే ఏమీ చెయ్యలేరు. మీరు సహజంగా ఉన్నప్పుడే మీచేత ఘనకార్యాలను ఈశ్వరుడు చేయిస్తాడు. అప్పుడు అనేక విషయాలు గుర్తుకు వస్తాయి. శబ్దాన్నికూడా అతిక్రమించాలి. ఫలితం కోసం ఎదురు చూడకపోతే ఫలితం వస్తుంది, పేరు వస్తుంది. అలాగే మోక్షం కోసం ఎదురు చూడకండి. వారు ఏమనుకుంటారో, వీరు ఏమనుకొంటారో అనుకొంటే మోక్షాన్ని పొందలేవు. నీవు ఆత్మవు. దానికి అనుకూలమైన తలంపులను అనుసరించు. మీ భోగాలు అన్నీ మీకు మైకం కమ్మేలా చేస్తాయి. మీకు మెడలో గొలుసు అలంకారం, నాకు ఈ పుస్తకం నా చేతికి అలంకారం. సుఖానికి, శాంతికి మించిన ఐశ్వర్యం ఎక్కడా లేదు.

140. ఎవరి మనస్సులోంచి ఏ సరస్వతి వచ్చినా వారు నాకు విరోధులైనా ఆ మాటను గౌరవిస్తాను, నా నెత్తి మీద పెట్టుకొంటాను. జరిగే సంఘటనలు ఎంత అబద్ధమో నేనుగా వ్యక్తమయ్యే మనస్సు అంతే అబద్ధం. సాధనా బలం పెంచుకొంటే బాహ్య సంఘటనలకు నీవు తలక్రిందులు కావు. మనస్సు స్వాధీనమౌతూ ఉంటే బాహ్యంగా సహాయం గొడవలలోకి నీవు వెళ్ళవు. నీ ఆధ్యాత్మిక జీవితం ఎప్పుడు ప్రారంభమౌతుంది అంటే "నీ దేహానికి ఎక్కడ ప్రారబ్ధం ఉంటే అక్కడ అది ఉంటుంది. నీ దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేయి. నీ మనస్సు అంతర్దృష్టి రావటం ప్రారంభించాలి. లోపల ప్రయాణం మొదలు కావాలి. అప్పుడు ఆధ్యాత్మిక జీవితంలో ఎల్.కె.జిలో జాయిన్ అయినట్లు లెక్క. దక్షిణామూర్తి పాదం క్రింద మాయను ఎలా తొక్కి ఉంచాడో అలాగే నీ మనస్సు అనే తొత్తుగాడిని

srinannagaru.com

తొక్కిపెట్టి ఉంచాలి. మీరు ముందు భగవంతుని చూచినా, చూడక పోయినా ఈ తొత్తుగాడిని చూచుకోవాలి. మనం భగవంతుని చేతులలో పనిముట్లుగా లేము, ఈ తొత్తుగాడి చేతులలో ఉన్నాము. అభ్యాసం వలన సాధ్యంకాని విద్య అంటూ ఏదీ లేదు. "కీర్తి" కూడా మాయే. పునర్జన్మలు తీసుకొని రావటానికి ఒక్క ముడి చాలు. భగవంతుని నామరూపాలను ధ్యానం చెయ్యటం వలన ముడులన్నీ రాలిపోతాయి. దేవుని మాట అటు ఉంచండి. నామ రూపాలతో ఉన్న లోకాన్ని దాటండి. అసత్యమైన సుఖాలు, రోగాలకు దారి తీస్తాయి. భారత యుద్ధంలో తాతగారైన భీష్ముడిని ధర్మరాజు ఇలా ప్రార్థించాడు. "మీ చేతులతో పెంచారు. మీ దయ మాకు ఉండాలి". తాతగార్కి ఆ మాట గుర్తుకు వచ్చి వెనక్కి తగ్గిపోయే వాడు లేకపోతే పాండవ సైన్యం అంతరించేది. దీనిని అర్థం ఏమిటంటే నమస్కారం పెట్టటంలో జరిగిన వైభవం అది.

141. కోపకారణం ఉన్నా ఎవరికైతే కోపం రాదో వారు కోపరహితులు అవుతారు. ద్వేష కారణం ఉన్నా ఎవరికి ద్వేషం రాదో వారు ద్వేషరహితులు అవుతారు. కృష్ణుడని కొందరు వారి కళ్యాణ గుణాలను చూచి, చైతన్యంగా చూచినవారు ఉన్నారు. రూప దృష్టి గలవాళ్లను ఆకర్షించటానికి, దండలు వేసుకొని, నగలు వేసుకొని, సిల్కు బట్టలు వేసుకొనేవారు. ముఖం అందం, అధరం మధురం, శరీరం అంతా మధురమే. ఎందుకు అలా ఉన్నారు అంటే రూప దృష్టి ఉన్న వాళ్ల కోసమే. లేకపోతే ఆయనకు అలంకారాలు ఎందుకు, మొద్దు అబ్బాయిలను ఆకర్షించటం కోసం అలా చేసేవారు. నీకు విషయాల పట్ల విరక్తి కలిగే వరకూ భగవంతుని నామాన్ని స్మరించాలి. వారి కళ్యాణ గుణాలను స్మరించుకోవాలి. ఒడ్డుకు వచ్చేవరకూ సాధన చెయ్యాలి. పుణ్యబలం లేనివారు నేత్రాలు ఉన్నా చూడలేరు. చెవులు ఉన్నా మంచి మాటలు వినలేరు. రక్తిలోంచి విరక్తిలోకి వచ్చే వరకూ సాధన సాగాలి. ఇతరులు నిన్ను బలహీన పరుస్తూ ఆత్మ విశ్వాసం పొందకుండా చేస్తే నీవు దానికి తల ఒగ్గవద్దు. అలాచేస్తే నీవు బలహీనుడవు అవుతావు. ఏ వ్యక్తి మీద అతిగా సహవాసం పనికి రాదు. ఉదాసీనంగా ఉండాలి. అలాగే అతిగా మాట్లాడకూడదు. విషయాలను ధ్యానించకు, భగవంతుని ధ్యానించు. ఆయన్ని ధ్యానించకుండా ఉండలేని విధంగా సాధన జరగాలి. భావనా బలాన్ని విడిచిపెట్టకు. లోకం మీద వ్యామోహం కొలది అందులో బంగారం ఉంది అనుకొంటున్నావు. అది దుఃఖాల పుట్ట. అలా ఉంది అని నీవు అనుకొన్నా ప్రయోజనం లేదు. నీ ఆత్మ స్థైర్యంలో నీవు ఉండు అవి నిన్ను ఏమీ చెయ్యలేవు. నీ బుద్ధి స్థిరత్వం కలిగితే లోకం అంతా దుఃఖంగా ఉన్నా నీకేల.

srinannagaru.com

142. కృష్ణుడు అన్నాడు "గతం వ్యధః అంటే గతాన్ని గురించి ఏడవకు. అది భక్తుడి లక్షణం కాదు. దుఃఖ కారణం ఉన్నా దుఃఖం లేకుండా ఉంటే నాకు వాడు ఇష్టుడు అవుతాడు, నా హృదయంలోకి తీసుకొంటాను" అన్నాడు. భక్తుడు భగవంతుని చేతిలో ఆట బొమ్మలా ఉంటాడు. వాడే అనుగ్రహానికి పాత్రుడౌతాడు. మనం భక్తులు కాని వారితో సహవాసం చేస్తే మన సాధన అంతా పోతుంది. విరోధులను, ఇష్టులను ఈశ్వరుడు నీకు కల్పించేసాడు. అది నీకు అర్థమైతే గాని శరణాగతి పొందలేవు. నీ కళ్ళకు కష్టం కలిగేది పరిణామంలో సుఖాన్ని ఈశ్వరుడు కలుగజేస్తాడు. అది నీకు తెలియాలి. భగవంతుని మీద నూటికి నూరు పాళ్ళు విశ్వాసం కుదిరితే మన కర్మలు కాలి బూడిద అవుతాయి. ఏమీ మిగలవు. కామ్య కర్మలకు దూరంగా ఉండు. దానితోనే ఉంటే నిష్కామ కర్మకు కాలమును ఎప్పుడు ఉపయోగిస్తావు. గీతాసారం విలువలతో ఉండు. సమర్థత-స్థిరత్వం-ఉన్నతత్వం కలిగి ఉండు. దీన్నే నోబిలిటీ-ఎబిలిటీ-స్టెబిలిటీ అంటారు. పెంట అంతా మనస్సులో ఉంది. పునర్జన్మ కారణాలు అన్నీ అందులో ఉన్నాయి. మనస్సు ప్రభావం శరీరం మీద ఉంటుంది. ఈ రెంటినీ సమన్వయం చేసుకోవాలి. మనకు మనం మంచి చేసుకొంటే ఇతరులకు మంచి చెయ్యగలం. పనిని గౌరవించి, భగవంతుని ఆరాధించవచ్చును. నీ పనిని నీవు బాగా చేస్తూ ఉంటే నీ కృషి కృపగా మారిపోతుంది. ఫలితం కోసం ఎదురు చూడకు. మీరు మంచి పనిచేసి మోసుకొని తిరుగుతూ ఉంటే అంతఃకరణ శుద్ధి రాదు. భయంవెనకాలే దుఃఖం నీడలా వస్తుంది. సత్యానుభవం కలిగే వరకూ ఈ ప్రపంచంలో ప్రతీ చిన్న విషయం గొప్పగా కనిపిస్తుంది.

143. మనం చైతన్యంగా ఉన్నాము. అది ఆనందం, శాంతి మయం. కాని మనం ఒక్కొక్కసారి బెంగపెట్టుకొంటాము. కోపంగా, చిరాకుగా ఉంటాము. ఇవి అన్నీ చైతన్యానికి అంటగడతాము. ఆందోళన పడతాము. ఆ గొడవలు వదిలేయి. ఇప్పడే, ఇక్కడే సుఖపడతావు. వివేకాన్ని విడదీసుకొనే బుద్ధిని విడిచి పెట్టకు, అన్ని యోగాల కంటే అవగాహన గొప్పది. విచక్షణా బుద్ధి గొప్పది. గాఢనిద్రలో మన మనస్సు ఎక్కడ నుంచి ఉదయిస్తున్నదో అక్కడే లయిస్తుంది. అక్కడ సుఖంగా ఉన్నాము, అక్కడ బూరులు తినలేదు, కారణంలేని సుఖాన్ని మనం జాగ్రదవస్థలో పొందాలి. విషయ చింతన నుండి దైవచింతనలో నిరంతరం ఉంటే ఒక్కటి అంటే ఒక్కటి అయిన బ్రహ్మం వ్యక్తమౌతుంది. భగవంతుని స్మరించగా, స్మరించగా రాగద్వేషాలు అనే మలదోషాలు నశిస్తాయి. ఈ ప్రపంచాన్ని, ఎవరు నడుపుతున్నారో వాడే నీ హృదయంలో ఉన్నాడనే విశ్వాసం

srinannagaru.com

మాత్రం మర్చిపోకండి. నూటికి నూరు మార్కులు తెచ్చుకొన్న విద్యార్థి కన్న యావరేజి మార్కులు తెచ్చుకున్నవాడు పరీక్ష పూర్తి అయిన రోజున ఎంత ఫ్రీగా ఉంటాడో, రేపు పరీక్ష అనగా అంత ఫ్రీగా ఉన్నవాడంటే నాకు చాలా ఇష్టం. సంసారంలో రాజీ పడాలి. నా మాటే నెగ్గాలి అని అనుకో కూడదు. కొంతమంది కుటుంబాలలో భోజనాలు అయిన తరువాత కూర్చుని ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుపుకొంటూ ఎవరి అభిప్రాయాలు సురక్షితమో గ్రహించి, దాన్ని అవలంబిస్తారు. అది గొప్ప విషయం. నా మాటే నెగ్గాలి అంటే పతనం తప్పదు. పొగుడుకొనే వాడి దగ్గర నుంచి డంబాలు చెప్పేవారి దగ్గర నుంచి తెలివిగా ఒక వంకపెట్టుకొని తప్పించుకొని వెళ్ళిపోవాలి. రాబోయే రోజులు డబ్బులేకపోయినా జీవించవచ్చు కాని తెలివి లేకపోతే జీవించలేము.

144. ఎవరి మనస్సు నగ్నమై ఉంటుందో. అంటే మినహాయింపులు లేకుండా ఈశ్వరునిపై ప్రేమ కలుగుతుందో వారికి సత్యం గోచరిస్తుంది. అంటే ఏ వాసనా లేకుండా ఈశ్వరభక్తితోనే ఉంటే అని అర్థం. ఎక్కడెక్కడో ఆనందం ఉంది అనుకొంటున్నావు. అక్కడ ఆనందం లేదు. ఆనందం అంతా ఆత్మలోనే ఉంది. కాలం వెళ్ళిపోతున్నది అని అనుకొంటున్నాము. కాలం ఎప్పుడూ ఉంది మనమే మృత్యువు దగ్గరకు వెళ్ళిపోతున్నాము. పారమార్థిక సత్యంలో ఇవి ఏమీ లేవు. ఏ బంధాలు లేవు. అవి అన్నీ నీ మనః కల్పితాలు. మనం పేద వాళ్ళమని, గొప్పవాళ్ళమని అనుకోవటం మానేస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది. భాగ్యం పొందితే సుఖపడిపోతామని ప్రకృతి మనుషులు ఎలా అనుకొంటారో భక్తులు కూడా భగవదనుభవం కలిగితే సుఖపడిపోతామని అనుకొంటారు. మన మీద ఎవరికైనా అయిష్టం ఉంది అనుకోండి అది నిజమని నమ్మితే నీకు తెలివి లేదని అర్థం. పిరికి వారు, అసమర్థులు అని అర్థం. నీ గుణాలు, అవి కల్పించే విషయాల్లోంచి, బయట పడకపోతే కర్మ చక్రంలోంచి బయట పడలేవు. నీవు గుణాతీతుడువు కావాలి. బుద్ధిలో చీము, కషాయం పెట్టుకొని కళంకాలను పెట్టుకొని సత్యానుభవం ఎలా పొందుతావు. దుఃఖాన్ని తీసి ఆనందాన్ని పెంచేవాడు స్నేహితుడు. నీవు ఏమీ అనుకోకుండా ఉండు. మనస్సు వెళ్ళి ఆత్మ గూటిలో పడిపోతుంది. ఏ దేహమైతే శవమౌతుందో దాన్ని ఆత్మ అని, అదే నీవు అనుకొని జీవిస్తున్నావు. మన శరీరం శవం అవ్వటం మనం చూడకపోయినా పక్క వాళ్ళు శవమవ్వటం చూస్తున్నారు కదా. అదా నిన్ను ఉద్ధరించేది. దాన్ని ఆధారంగా చేసుకొని సత్యాన్ని పొందటం మన ధ్యేయంగా పెట్టుకోవాలి.

145. జీవితం పొడుగునా జపతపాలు చేసి, సమాజానికి ఉపయోగపడే

srinannagaru.com

వాళ్ళకే సత్యానుభవం కష్టమౌతూ ఉంటే, ఆరు వారాల యోగసాధనతో సత్యం తెలియబడుతుందా? డబ్బు లేనివాడు ముందు ఓడ ఎక్కితే ఎలా ఉంటుందో, చిత్త శుద్ధి లేనివాడు ఆత్మజ్ఞానం ఆశించటం అటువంటిది. వివేకం లేని వానికి, సాధనా బలం లేని వానికి, కృతజ్ఞత లేనివానికి కాలాన్ని సద్వినియోగం చేసుకోలేని వానికి, యోగం చేసుకోలేనివానికి ఆత్మజ్ఞానం కలుగదు. జీవిత విధానం ప్రేమ పూర్వకంగాను, జ్ఞాన పూర్వకంగాను ఉంటే సత్యం దగ్గరకు మనం వెళ్ళనక్కరలేదు. అదే మన దగ్గరకు వస్తుంది. మీ ఇంట్లో సభ్యులు మిమ్ములను కళ్ళు ఎఱ్ఱచేసి చూస్తే ఈశ్వరుడే చూస్తున్నాడని అనుకోండి. అలా కాకుండా దానికి భిన్నంగా చూస్తే అది మీ దుఃఖానికి కారణమౌతుంది. తెలుసుకోవలసిన వస్తువును తెలుసుకొన్న తరువాత, చూడవలసింది, వినవలసినది ఏమీ ఉండదు. ధ్యానం క్లాసులు పెడుతున్నాము. తాగుడు వగైరా పనులు మానిపిస్తాము అంటున్నారు. అది తాత్కాలికంగా అణగవచ్చును కాని భగవంతుని దయలేకుండా వాసన నశించదు. అన్ని సంఘటనల్లోనూ భగవంతుని అనుగ్రహమని భావించు. జ్ఞానం వచ్చేస్తుంది. మామిడి పండు ముగ్గితే దాని రుచి తెలుస్తుంది. అలాగే మన బుద్ధి ముగ్గాలి. దానికి సంబంధించిన సంఘటనలను భగవంతుడు కల్పిస్తాడు. దాన్ని నీవు అనుకూలంగా మార్చుకోవాలి. ఈ విషయాన్ని జీర్ణం చేసుకొనే శక్తిని సంపాదించుకో లేకపోతే నీకు ఎన్నిసార్లు ఎన్ని మంచి మాటలు చెప్పినా ప్రయోజనం ఉండదు. చేను దున్నకుండా ఊడ్చటం ఎలాంటిదో, మీ బుద్ధికి భగవంతుని మాట అర్థం అవ్వాలంటే మీ బుద్ధి దానికి ప్రిపేర్ అయి ఉండాలి. అలా లేకుండా ఉంటే దాన్ని విన్నా నీకు ప్రయోజనం లేదు.

146. ఏదో గుడికి వెళుతున్నాము. ఏదో పుస్తకం చదువుదాము అనుకోవటమే గాని, మనకు దుఃఖం కలుగచేసే మనస్సును తీసి ఒక ప్రక్కన పెట్టాలనే బుద్ధి కలుగటంలేదు. ఎవరో వచ్చి మనలను ఉద్ధరిస్తారని కనిపెట్టుకోకండి. మీకు ఏదైనా బాధవస్తే కాలం తగ్గిస్తుంది. దేవుని దయ తగ్గిస్తుంది. అసత్యమైన దేహంతోనూ, అసత్యమైన లోకంతోనూ మనస్సు ఎందుకు తాదాత్మ్యం పొందుతున్నది అంటే అది అసత్యమైనది కాబట్టి. మనిషి నడుస్తూ ఉంటే దాని వెనకాల నీడ ఎలా వస్తుందో. శరీరం నేను అని అనుకొనే వాని వెంట అజ్ఞానం వెంటాడుతుంది. నీకు రూప బుద్ధి వచ్చాకే ద్వేషాలు ప్రారంభ మౌతాయి. అహంకారానికి జతలు ఉన్నాయి. ఆత్మకు జతలు లేవు. జతలు కట్టేది అహంకారం మాత్రమే. భగవంతుని చేతిలో నా దేహం ఒక పనిముట్టు అనుకొన్నప్పడు నాకు పుణ్యపాపాలతో సబంధం ఏమిటి? కొన్ని కొన్ని తగవులు

srinannagaru.com

కలగుచేసుకోవటం వలననే వస్తున్నాయి. సామాన్య మానవునికీ గొప్ప శాస్త్రవేత్తకు తేడా ఏమిటి అంటే ఏకాగ్రత. తిండిలోనూ అన్ని పనులలోనూ అన్నీ సమానమే. ఏకాగ్రత ఉంటే గొప్ప పనులు చెయ్యగలము. దానివలన చాపల్యం, వేదన కలిగే బుద్ధి తగ్గిపోతుంది. ఇరువది నాలుగు గంటలు ఇరువది నాలుగు నిమిషాలలో గడిచిపోతాయి. ఏకాగ్రత పవిత్రత ఉంటే సుఖ స్వరూపాన్ని పొందుతాము. నీకు పదవి వచ్చినా, కీర్తి వచ్చినా ఒడ్డుకు చేరే వరకూ గర్వం రాకుండా చూచుకోవాలి. మనకు ఉపయోగపడే తలంపులకన్న ఉపయోగం లేని తలంపులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. దాన్ని గమనించి మెలకువగా ఉండాలి. మన అపవిత్రత స్వభావమే బయట ఏదో ఉంది అనిపింపచేస్తున్నది బయట ఏమీ లేదు. అంతా పంచభూతాలే.

147. కుటుంబ సభ్యుల విషయంలో మమకారం పెట్టుకోకుండా డ్యూటీ చేస్తే దుఃఖం రాదు. డ్యూటీ చెయ్యకపోతే అది ఒక చెడ్డకు దారితీస్తుంది. ముక్కులో గాలి తప్పకున్న క్షణం నుంచి ఎవరి దారి వారిదే. ఎవరి టైము వచ్చినప్పుడు వారు చనిపోతారు. ఏమీ అనుకోకుండా ఉంటే ఏమీ అనుకోని ఆత్మలో నీవు ఐక్యమౌతావు. దనం-పాండిత్యం-అధికారం నిగ్రహించుకొనే శక్తి లేకపోతే అవి నరం మీద పుండువేస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. మీకు భగవంతుడు లేదా గురువు జ్ఞానం ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు పెంట అంతా మన హృదయంలో నింపుకొన్నాము. ఎప్పుడూ హృదయాన్ని ఖాళీగా ఉంచు కోవటం లేదు. లోకంలో ఉన్న సత్తరువులు ఎప్పుడైనా ఖాళీ అవుతాయి. కాని మన హృదయం ఎప్పుడూ ఖాళీ అవ్వటంలేదు. నిరంతరం విషయాలతోనూ, రాగ-ద్వేషాలతోనూ ఖాళీ లేకుండా ఉంటే అనుగ్రహాన్ని ఎలా ఇస్తాడు. కాబట్టి అభ్యాస వైరాగ్యాలను అలవర్చుకోవాలి. అంతఃకరణ శుద్ధిలేనివాడు రూప నామాల బుద్ధిలోంచి బయటపడలేడు. కోపం-ఇష్టం, భయం ఇవి అన్నీ నీ మనస్సును బహిర్ముఖం చేస్తున్నాయి. లోకం అంతా విషయాలతోను రాగద్వేషాలతోనూ నిండి ఉంది. వాటి మధ్య జీవించటానికే మనం ఈ భూమిమీదకు వచ్చాము. ఈశ్వరుడు ట్రైనింగ్ కోసం పంపాడు. వచ్చిన పని మర్చిపోయాము. సత్యాన్ని దర్శించినవాడు మాత్రమే ద్వంద్వాలలో ఉండి కూడా నిర్వికారంగా సుఖంగా ఉండగలడు. లాభనష్టాలతో తాదాత్మ్యం పొందకపోతే మనస్సు నశిస్తుంది. "అహం" అంటే నేను "మమ" అంటే నాది. ఈ రెంటివల్లనే దుఃఖం వస్తూ ఉంటుంది. ఈ భూమీమీద ఉండగానే పై రెంటినీ వదిలించుకొని బయటపడితే సత్యం దర్శనమౌతుంది.

srinannagaru.com

148. తాటాకు ఇంట్లో ఉన్న వాడికి మేడలో ఉన్న వానికి జున్ను తినేడప్పడు ఇంద్రియాలు ఒకేరకమైన ఆనందాన్ని పొందుతాయి తేడా ఏమీ లేదు. ఇదే మాయ. పనిచేసుకొనే వానికంటే పనిచెయ్యని వానికే కోరికలు ఎక్కువగా ఉంటాయి. ఇంద్రియాలు అన్ని దేహానికి బయట ఉన్నాయి. కారణం తొందరగా మాయలో పడటానికి, కళ్ళు, ముక్కు, చెవి శరీరానికి బయట ఉన్నాయి. సినిమా వాల్‌పోష్టరు ఎందుకు అంటిస్తారు అంటే ఆ బొమ్మలను చూచి ఆ సినిమాకు పరుగెత్తుకొని పోతాము ఎన్నో వాసనలు అంటించుకొంటాము. సంసారమంటే కోరికా, కోపము ఈ రెంటి వలననే పునర్జన్మలు వస్తాయి. ఈ రెంటి యొక్క వికారమే ప్రపంచము. శాంతి చిత్తం లేనివానికి మోక్షం పొందలేరు. హృదయ సందేశం అందదు. ఇంటిలో దరిద్రం ఉంటేపరవాలేదు. మనస్సులో దరిద్రం ఉంటే ప్రమాదం. "సర్వేజనా సుఖినో భవంతు" అనుకొంటే చాలు, ఆ కాంక్ష గొప్పది. పెద్దమనిషి అనుకొనే వాడు ఎప్పడూ ఆడంబరంగా మాట్లాడడు. లోకంలో తొంభై గొడవలు జరుగుతాయి. వాటిని మనస్సులోనికి రానియ్యకూడదు. కంటిమీద పొర ఉంటే చూపు కనబడదు. నీవు బ్రహ్మమైయున్నా "నేను" అనే మొదటి తలంపు పొరగా ఉండి బ్రహ్మాన్ని తెలియనియ్యటం లేదు. అలవాట్లు పెంచుకోవటం వలననే దరిద్రం వస్తుంది. తల్లికి కృతజ్ఞత తెలపటం వలననే భగవంతుని అనుగ్రహానికి పాత్రులు అవుతాము. ఏదో ఒకటి అనుకోవటం మానేస్తే అనుకోని సద్‌వస్తువు నీకు వ్యక్తమౌతుంది. ఒకస్థాయికి వెళ్లిన తరువాత భౌతికమని, ఆధ్యాత్మికమని వేరుగా ఉండవు. మంచిమాట శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగుజేస్తుంది.

149. చెరువులో నీళ్లు ఉంటాయి. మన ఇంటికి రమ్మనమంటే రావు. ఒక కుళాయి ఏర్పాటుచేసుకోవాలి. అలాగే హృదయంలో ఆనందం ఉంది. నీవు ధర్మాన్ని ఆచరిస్తే నీ హృదయంలో ఉన్న ఆనందం నీ సహస్రారానికి అందుతుంది. మిమ్మల్లను గురించి ఎవరైనా అసూయ పడితే మన గురించి ఇలా అనుకొం టున్నారు ఏమిటి? అని అనుకొంటే ఆ అసూయను మీరు కూడా నేర్చుకొంటారు. మోసగించబడే ప్రారబ్ధం ఎంతకాలం ఉంటుందో మోసం చేసేవాడు ప్రక్కనే ఉంటారు. "మహిమలంటే నీకు ఇష్టమైతే నీ జీవితం అంతా మహిమలే, నీవు నడవటం, శ్రవణం చెయ్యటం, అన్నం తినటం, జీర్ణించుకోవటం అన్నీ మహిమలే. ఈ పనులు అన్నీ ఏ శక్తి వలన జరుగుతున్నాయి. ఇందులో నీ ప్రయోజకత్వం ఏమైనా ఉందా? మహిమలు లేవు అనుకొంటే ఏదీ లేదు. ఏదో మార్గాన్ని అనుసరించండి అన్నారు భగవాన్. అనామకంగా జీవించేవారే అదృష్టవంతులు.

నిర్మలంగా ఉన్నవాడే నిర్వాణ స్థితిని పొందుతాడు. సాధకుడు సోమరితనంగా ఉండకూడదు. దైవ చింతన తప్పించి ఇతర చింతనలు ఉండకూడదు. పని చెయ్యటంలో ఫలితం పట్ల ఆశక్తిగా చేస్తావు. అలా కాదు, పనిలో నీకు సంతోషం రావాలి. ఫలితం ఎలా ఉన్నా చదవకుండా నూటికి నూరు మార్కులు రావాలంటే ఎలా కుదురుతుంది. పనిని ప్రీతిగా చేస్తే వ్రతం చేసినట్లే అని గీత చెబుతున్నది. దుఃఖం తలంపు రూపంలో వస్తుంది. తలంపును చూచేవాడు అహంకారమే. ఆ అహంకారాన్ని తీసేస్తే శోకరహితులు అవుతారు. ఒక అహం మరో అహంకారం తో వ్యతిరేకమవ్వటానికి ఒక్క క్షణం చాలు. లోపల కుయుక్తులు పెట్టుకొని బయటికి నిజాయితీగా ఉండటం "కర్మ" అంటారు.

150. ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పనులు ఈ దేహం ద్వారా జరుగుతాయి. ఆ సంగతి భగవంతునికి తెలుసు. తెలియకుండా ఎలా ఉంటుంది. మనస్సు బలహీనంగా ఉంటే బలంగా తయారు చేయటానికి మీకు ఆత్మవిశ్వాసం కలుగజేయటానికి, మీకు దుఃఖం ఉంటే అది లేని స్థితికి తీసుకొని వెళ్ళటం కోసం భగవంతుడే అనేక సంఘటనలను కల్పిస్తూ ఉంటాడు. మిమ్ములను ఆదర్శ మానవునిగా తీర్చిదిద్దటానికి, మీమీద మీకు నమ్మకం కలుగ జేయటానికి, భగవదానుభవం పొందటానికి ఆయన అలా సంకటాలను కల్పిస్తాడు. అది అంతా భగవంతుడే చేస్తున్నాడని తెలియక దుఃఖం, భయం వస్తుంది. దోషాలు ఉన్నవానికి భగవత్ దర్శనం కలుగదు. నీ మనస్సు సర్వకాల సర్వ అవస్థలలోనూ, నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలంటే నిరంతరం ఆయనను స్మరించుకోవాలి. ప్రతికూల పరిస్థితిలో కూడా ఓర్పు మనోనిగ్రహం ఉంటే అది ఆధ్యాత్మిక జీవితానికి పునాది. ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని చెప్పేవాడిని తీసివేస్తే అది ఏమీ చెయ్యదు. దేహం నేను అనే తలంపు వేరుతో సహా తీసే వరకూ సాధన చేయవలసినదే. జీవిత సంఘటనలలో మనం పాఠాలు నేర్చుకోవాలి. విషయాన్ని మీరు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే సింహాసనం మీద కూర్చున్నట్లు ఉంటుంది. రోగాలు శరీరానికీ, వికారాలు మనస్సుకు వస్తూ ఉంటాయి. గాఢ నిద్రలో అవి లేవు, ఆ స్థితిని నీవు ఎరుకలోకి తెచ్చుకోవాలి. దానికి నీ తలంపులే అడ్డు వస్తున్నాయి. ఇది ఇలా జరిగిందేమిటి? అది అలా జరిగిందేమిటి? అని అనుకోకండి. అలా జరగాలి కాబట్టి అలా జరిగింది అంతే అది గ్రహిస్తే వివేక వంతులు అవుతారు. బాహ్య సంఘటనలకు నీవు ఉద్రేకపడకు. నీవు లోకాన్ని జయించాలి. నీకు ధైర్యం, ఓర్పు లేదు అనుకో అవి సంపాదించాలి. వాసన బలంగా ఉన్నప్పుడు సత్యానుభవం పొందగలమా? లేమా? అనే సందేహం

srinannagaru.com

వస్తూ ఉంటుంది. మన బుద్ధి చేతిలో మనస్సు ఉంటే పురోగతి. మనస్సు చేతిలో బుద్ధి ఉంటే తిరోగతి.

151. ఏ విషయంలోనైనా కర్త ఈశ్వరుడు అనే విశ్వాసం ఉండాలి. దొంగ నేను కర్త నేను అనుకొంటుంది. ఇక్కడ నుంచే దుఃఖం ప్రారంభమౌతుంది. దుఃఖానికి కారణం బయట లేదు నీలోపలే ఉంది. కోరిక అశాంతికి కారణం. కోరికే కోపం క్రింద, మోహం క్రింద, గర్వం క్రింద అనేక రకాలుగా మారుతుంది. కోరిక ఉన్న వానికే స్నేహం, విరోధం. మన బయట మనుషులతో పోరాటం కాదు, మనలో ఉన్న ఈశ్వరునిపై ఉన్న అవిశ్వాసంతోపోరాడాలి. అదే సాధన. పాయసం నోట్లో పోసుకొంటే ఎలా ఉంటుందో అలాగే దేహ ప్రారబ్ధాన్ని అనుభవిస్తే అప్పుడు మీకు తెలియకుండానే మీ హృదయం ఖాళీ అవుతుంది. అప్పుడు భగవంతుడు దానిలో జ్ఞానాన్ని, శాంతిని, ఆనందాన్ని నింపుతాడు. ఖాళీ చెయ్యకుండా పొయ్యి, పొయ్యి అంటే ఎలా కుదురుతుంది. మనం ఈశ్వరుని కోసం బ్రతికితే, ఆనందం, శాంతి, అహంకారం కోసం బ్రతికితే దుఃఖం, అశాంతి మిగులుతుంది. నీవు చెడు సంస్కారాలలోంచి బయటపడకపోతే వాటి నుండి బయట పడటానికి ఎలా దెబ్బలు కొట్టి అందుండి మరల్చాలో ఈశ్వరునికి తెలుసు. బాగా పాఠం చెప్పిన వానికి గోడ కుర్చీలు వెయ్యవలసిన పనిలేదు. టీచరు వారిని ఏమీ బాధించడు. మావి ప్రాపంచిక జీవితాలు "అంతా ఈశ్వర సంకల్పం వలనే జరుగుతున్నాయి" అని జీవించలేము అని కొందరు అంటారు. అసలు అంగీక రించక పోవటం వలనే దుఃఖం వస్తున్నది. ఆయన అస్థిత్వం మీద అవిశ్వాసం రానియ్యవద్దు, ఆయన ఏమి చేస్తాడో వేచిచూడు. నీ జీవితాన్ని ఎందుకు ఎలా మలుపు తిప్పతాడో ఏ సత్ ఫలితం వస్తుందో వేచిచూడు. తొందర, ఆందోళన పడవద్దు. నీవు చెప్పినట్లు ఆయన నడుచుకోవాలని అనుకోవద్దు, ఆయన చెప్పినట్లు నడుచుకొంటే మోక్షం వస్తుంది. నీకు ఏది మంచిదో నీకంటే ఈశ్వరునికే తెలుసు. ఈ విషయం అర్థం చేసుకొన్నవారు ధన్యులు. అదృష్టవంతులు.

152. కర్త మనమనుకోవటం వలనే దుఃఖం యొక్క బీజం ఇక్కడే ఉంది. మీరు తొంబై శాస్త్రాలు చదువనక్కరలేదు. ఈ వాక్యం అర్థమైతే ఎంత దుఃఖం ఉన్నా ఈ క్షణంలో చల్లారిపోతుంది. "మనకు భగవంతుని మీద విశ్వాసంనిజమైతే మన ప్రయత్నంలో పని లేకుండా పనులు పూర్తి అవుతాయి". విరోధులు కూడా దేహప్రారబ్దాన్ని బట్టే సిద్ధమౌతారు. ఎవరో మనలను ద్వేషిస్తూ ఉంటే మనకు నష్టం ఏమిటి? మన డబ్బును తినేస్తాడా, మన గౌరవాన్ని తినేస్తాడా,

srinannagaru.com

వాడి గురించి మీకు ఎందుకు అల్లరి, కంగారు. అది ప్రారబ్ధంలో ఒక భాగం. అందుచేత అటు చూచే బదులు, ఆత్మను చూడండి. మీ దేహం ఎంత నిజమో, ఆ విరోధులు, స్నేహితులు అంతే నిజం. ఇవి అన్నీ పట్టించుకొంటే మనస్సు బాహ్యా ముఖానికి వచ్చేస్తుంది. ఆ తలంపులను చూచి నవ్వుకోండి అవే పోతాయి. ఈ శరీరం ఉండగానే దైవీగుణాలను సంపాదించుకోవాలి. మన ప్రయత్నం లేకుండా ఒక విషయం మీద మీ మనస్సు వెళుతూ ఉంటే పూర్వ జన్మలో వాటిని బాగా ఎంజాయ్ చేసామన్న మాట అని అర్థం చేసుకోండి. మనస్సు చంచలత్వాన్ని నిగ్రహించటం కష్టమే. కొంత సాధన, వైరాగ్యం లేకపోతే అదుపులోకి రాదు. మనస్సు అటు వెళుతూ ఉంటే దాని పిలక పట్టుకొని వెనుకకు లాక్కొనిరా. దైవ చింతనలో పెట్టు. ఇలా అనేకసార్లు పరాభవం పొందుతున్నా ప్రయత్నం మానకు. మనస్సు దాని అలవాట్లు అది మాననప్పుడు మన ప్రయత్నం మనం మానకూడదు. అభ్యాసం పోగొట్టుకోకూడదు. భగవంతుని అస్థిత్వంపై మనకు నిజమైన విశ్వాసం ఉంటే పెద్ద సాధనతో పనిలేకుండా మనస్సు కండిషన్‌లో పడిపోతుంది. మనస్సు అణిగినప్పుడు విరోధులు, స్నేహితులు అనే బొమ్మలు అన్నీ అణిగిపోతాయి. "నాకు ఆత్మ బుద్ధిని కలుగజేయి, నీ పాదాల వద్ద స్థిరంగా బుద్ధి ఉండేటట్లు అనుగ్రహించు. ఒకవేళ నీ పాదాల మీద నాకు విశ్వాసం లేదు అనుకో, ఆ విశ్వాసాన్ని నీవే కలిగించు. నేను ఎంతోకొంత ప్రయత్నం చేస్తాను. కాని విశ్వాస బలాన్ని నీవే ఇవ్వాలి" అని నీవు భగవంతుణ్ణి ప్రార్థించాలి.

**153.** గుండె జబ్బు, కేన్సర్ వంటి తీవ్ర వ్యాధులు శరీరాన్ని ఎలా చంపుతుందో అలాగే దేహ వాసన, సాధకునకు జ్ఞానం రాకుండా చంపేరోగం, కేన్సర్ వ్యాధిగ్రస్తుడు కొద్ది రోజులలో మరణించటం ఖాయమన్న విషయం వైద్యులకు, బంధువులకు తెలుసుకొన్నా, వ్యాధిగ్రస్తుడు వ్యాధి తీవ్రత తెలియకపోవటం వలన సంతోషంగా ఉంటాడు. అలాగే ఆధ్యాత్మిక సాధకుడు దేహవాసన ఉన్నా సత్యానుభవం పొందగలనన్న నమ్మకంలో ఉంటాడు. కొందరికి కొన్ని క్షణాలలో ఉపద్రవం ముంచుకొని వస్తున్నా గ్రహించలేరు. దేహబుద్ధి ఉన్నవానికి వేరుబుద్ధి ఉంటుంది. అది సత్యాన్ని దర్శించకుండా చేస్తూ జనన మరణాలకు కారణమౌతుంది. కొందరి శరీర ఛాయ పసిడి బంగారు ఛాయలా ఉంటుంది అనుకోండి అది కూడా మట్టే చేతితో ఆ శరీరాన్ని రాపాడితే మట్టి వస్తుంది. బంగారం రాదు అటువంటి దేహాలను చూచి మురిసిపోకండి. ఎంత అందమైన దేహమైనా అగ్నికి ఆహుతి ఇయ్యక తప్పదు. అది స్థూల బుద్ధి. సూక్ష్మ బుద్ధి గలవాడు సత్యాన్ని తెలుసుకొంటాడు. ఎవరైనా మిమ్మలను ప్రేమించకపోయినా కంగారు పడకండి,

srinannagaru.com

విమర్శించినా కంగారుపడకండి. ప్రేమించేవారికి వంద నమస్కారాలు, ద్వేషించే వారికి వెయ్యి నమస్కారాలు. ముక్కులో గాలి ఉన్నంత వరకే ఈ దేహ సంబంధమైన బంధువులు భూములూ ఉంటాయి. తరువాత దేవునితోనే సంబంధం. మనకు శత్రువులు ఉంటే పరవాలేదు వారిని గురించి ఆలోచించకండి, ఆలోచిస్తే వారి మీద పగ తీర్చుకొనే బుద్ధి పుట్టి తరువాత పాము జన్మ రావటానికి అవకాశం ఉంది. దానిని వదలాలి. మన స్వభావాన్ని బట్టి శరీర పరిశరాలను ఈశ్వరుడు ఇస్తాడు. దానిని మనం గౌరవించాలి.

154. ప్రపంచం దయగా ఉంటుంది అని అనుకోకండి కఠినమైనది. ఈశ్వరుడు దయామయుడు. దయామయుడిని వదిలేసి ప్రపంచాన్ని పట్టుకొన్నాము. కఠినత్వం ఉన్నచోట పాపం ఉంటుంది. ఇలా ప్రపంచాన్ని తెలుసుకొని జీవించు సుఖపడతావు. దృశ్యం నశిస్తేగాని ద్రష్ట హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యలేడు. ఈ ప్రపంచానికి అస్థిత్వం లేదు. నీతో చూడబడేది నిజంకాదు. ఈ దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఈశ్వరుడు ఏది ఇస్తే దానిని ప్రీతిగా, ప్రేమగా, విసుగు లేకుండా తిరస్కార భావంతో కాకుండా పురస్కార భావంతో స్వీకరించాలి. వ్యతిరేకం కాకుండా శరణాగతి మార్గంతో స్వీకరించాలి. "నేను, నాది" అనే ఎలకల బోనులో పడ్డాము. బోనులో పడ్డ ఎలక బయటకు రాలేదు. ఆ రెంటిలో ఉన్నవారు స్వేచ్ఛామండలంలో ప్రవేశించలేరు. సమస్యలు లేనిది చైతన్యం. నీవు సమస్యలతో ఉంటున్నావు. అందులో ఉన్నంతకాలం జన్మలు తప్పవు. చైతన్య అనుభవం పొందిననాడు నీకు సమస్యలు ఉండవు. దేహమే కేంద్రంగా పెట్టుకొన్నవానికి అన్ని అవలక్షణాలు ఏర్పడి నరకానికి వెళ్ళిపోతాడు. బయట ఉన్న ఆటంకాలు ప్రయత్నం చేసి పోగొట్టుకోవచ్చు. మనస్సులో ఉన్న ఆటంకాలు, రుచులపైన, సంగీతం పైనా ఉండే అభిరుచులు అంత తేలికగా పోవు. దేవునిపై ఆలోచన ఉపయోగం, పనికిరాని తలంపులు దెయ్యాలు, దెయ్యాల చేతులలో ఉండి దేవుడు తెలియాలి అనుకొంటున్నావు. దెయ్యాలు మనలను ఆడిస్తున్నాయి.

155. మీ జీవితాన్ని సహజంగా కొనసాగిస్తే నీకు సహజంగా ఉన్న ఆత్మ తెలుస్తుంది. మీ ప్రారబ్ధంలో ఏమి వచ్చినా తాదాత్మ్యం పొందకపోతే ఆత్మ స్థితిని అందుకొంటావు. కర్త భగవంతుడు అనుకొంటే పొరపాటు లేదు. కాని మనం అనుకొంటున్నాము. అందుకనే దుఃఖం. ఈ బొమ్మలను ఆడించేవాడు ఒకడు ఉన్నాడు. ఆటను ఆయన ఆడించేవరకూ ఉంటుంది. తరువాత స్మశానానికి వెళుతుంది ఆ బొమ్మ. కర్త ఈశ్వరుడు అనుకొంటే పునర్జన్మలు ఆగిపోతాయి. మన సుఖంకోసం ఇంద్రియాల మీద ప్రపంచం మీద ఆధారపడకూడదు.

srinannagaru.com

ఇంద్రియాలు ఎంతకాలం ఉంటాయి. అది సరియైన మార్గం కాదు. సుఖం మన హృదయంలోనే ఉంది. అనుకరణ పిరికి వారి లక్షణం. చదువుకొన్న వారు మేము చదువుకొన్నవారము అనుకొంటారు. నీవు చదువుకొన్నవాడవా? నీవు ఆత్మవు. అలాగే ప్రతీవారు మేము ధనవంతులం, అందగాళ్ళము, పలానా కులస్తులం అని అనుకొంటారు. అలా అనుకొన్నంతకాలం మీరు అలాగే ఉంటారు మీకు ఆత్మానుభవం కలగదు. ప్రతీ మాటకూ లౌక్యంగా మాట్లాడేవారి మనస్సు గాజు చిమ్మినీ మసి బారినట్లు వారి మనస్సు మసిబారిపోతుంది. అతి లౌక్యంగా మాట్లాడేవారు ఏమనుకొంటారు అంటే వారు అమాయకులు అనుకొంటూ ఉంటూ లోకానికి దగ్గర అవుతారు, భగవంతునికి దూరమౌతారు. మనం ఏ రంగంలో ప్రముఖులను చూచినా వారిలా ఉండాలని అనుకొంటాము, ఉదాహరణకు ఒక మంత్రిని, ఒక ధనవంతుని, ఒక గాయకుడిని చూచినా అలాగే అవ్వాలని అనుకొంటాము. ఇలా అనుకోవటం వలనే నీవు గమ్యానికి దూరమౌతావు.

156. భయాన్ని ఊహించుకోవటం వలననే ఎక్కువ దుఃఖం వస్తుంది. మనస్సు అణిగి ఉండటమే నిజమైన నమస్కారం. రైలులో ప్రయాణం చేసే ప్రయాణికుల మధ్య కొంత ఆప్యాయత ఉంటుంది. వారు తినేది మనకు ఇస్తే మనం తినేది వారికి ఇస్తాము. చోటు లేకపోతే జాగా ఇస్తాము. దిగిపోయేటప్పుడు ఏమీ అనుకోము. అలాగే నీ నిజ జీవితంలో నీతో అనుబంధం కాబడిన వారితో అలా ఉండండి చాలు తరిస్తాము. రైలుకు ఇరువది పెట్టెలు ఉండవచ్చును, అన్ని పెట్టెలు ఉన్న వారితోనూ మనకు సంబంధం ఉండదు. మన పెట్టెలో ఉన్నవారితోనే మనకు సంబంధం ఉంటుంది. అలాగే లోకంలో అనేక జీవరాసులు ఉండవచ్చు నీకు అనుబంధం ఉండేవారి పట్ల నీవు సహజంగా ఉంటే నీవు తరిస్తావు. ఎవరైనా నీకు శత్రువులు అనుకొంటే వాడి వలలో పడిపోయినట్లే. నీవు దేహానికి పరిమితమైనదానినే వదిలేయి. రాగం లేదు, ద్వేషం లేదు. అన్నీ వదిలిపోతాయి. వైరాగ్యం ఉన్న వాడు పనిని నిజాయితీగా చెయ్యగలడు. బంధం లేకుండా చెయ్యగలడు. బుద్ధి మంతుడు తనలోని దోషాలను చూచుకుంటాడు. బుద్ధిహీనుడే ఇతరుల లోని దోషాలను చూస్తాడు. లోకం అంతా గుల్ల అన్న అనుభవం పొందే వరకూ ఈ శరీరాలను మోస్తూ ఉండవలసిందే. అధ్యయనం ఒక్కటే సరిపోదు. తపస్సు సత్పురుషుల సాంగత్యం అవసరం. ప్రపంచంలో ఏ మానవుడికి దుఃఖం వచ్చినా కోరికే కారణం. ఏ కోరికాలేని వానికి ఈ సృష్టి అంతా గడ్డిపరకతో సమానం. బ్రహ్మం అనే తెరమీద రాయబడ్డ నామరూపాలే ఈ జగత్తు అంతా.

157. నీవు ట్రెయిన్‌లో బెర్తు రిజర్వుచేసుకొంటే పడుకొంటే నిద్ర

srinannagaru.com

సాగుతుంది. గమ్యానికి చేరువావు. అలాగే నీ అహంకారం కల్పించుకోకుండా ముట్టుకోకుండా నీ పనులు నీవు చేసుకొని పోతూ ఉంటే నీ దేహయాత్ర పూర్తి అవుతుంది. నీగమ్యమైన ఆత్మను చేరుకొంటావు. నీ బంధువులు, సంతానం, కుటుంబీకులు నిన్ను వదిలినా సత్యం నిన్ను అన్ని కాలాలలోను నీ చెంతనే ఉంది. అది ఆనందాన్ని విరజిమ్ముతూనే ఉంది. దాని తాలూకు ఎరుకే ఆనందం, చావు లేని స్థితి, దాని తాలూకు మరుపే మరణం. నీ జీవిత సమస్యలు పరిష్కారం చేసుకోవాలి అది సాధ్యం కాకపోతే, సహనం నేర్చుకోవాలి. కాని పారిపోవటానికి ప్రయత్నం చెయ్యకూడదు. డబ్బు ఉన్న వానికీ చదువు ఉన్నవానికీ దేహబుద్ధి ఉంటుంది. ఎవడు మహాపాపి అంటే దేహబుద్ధి ఉన్నవాడు, తన అస్థిత్వాన్ని దేహానికే పరిమితం చేసుకొన్నవాడు. మరి పుణ్యాత్ముడు ఎవరు అంటే ఆత్మ బుద్ధి గలవాడు. మీరు ఏ గురువుని, ఏ మతాన్ని ఆశ్రయించినా, ఏ దేవుణ్ణి ఆరాధించినా నాకు సంబంధం లేదు, పేచీ లేదు. కాని పొందవలసిన విషయాలలో రాజీ లేదు. నాలోని సద్వస్తువే నీలో ఉంది. సృష్టిలో ఉంది. అంతా ఒక్కటే ఇది అంతా భేదబుద్ధి గల మనస్సు కల్పిస్తున్నది మీరు నన్ను మనస్సుతో చూస్తున్నారు. ఆత్మగా చూడలేకపోతున్నారు. అనేక అడ్డంకులను కలుగజేస్తున్న మనస్సును అధిగమించాలి. అప్పుడే సత్యం వ్యక్తమవుతుంది. కోరికలోంచే "ఆశ" వస్తుంది. "ఆశ"లోంచే అశాంతి వస్తుంది. పరమ వైరాగ్యం ఉన్నవానికి అశాంతి అనేది లేనేలేదు. ఆత్మ జ్ఞానం లేకపోతే దుఃఖం చల్లారదు.

**158.** పట్టుకోవలసిన ఆత్మగతమైన నేను వదిలేసాము. వదిలేయవలసిన దేహగతమైన నేను పట్టుకొంటున్నాము. ఇదే తిరకాసుకు కారణం. నీ ఇష్టా అయిష్టాలు, నీ పగా, ప్రతీకారాలు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. ఈ పాడు బుద్ధిగల నేనుకా మోక్షం. అవగాహన లేని వాడు, బుద్ధిలేనివాడు పరమేశ్వరుని గుర్తించగలడా? మనకు యోగ్యతలేదు. యోగ్యత లేకపోవటమే తప్పు. ద్వేష హీనుడికే పరమాత్మ దారి ఇస్తాడు. లోపల ఉన్నదే బయటకు కనబడుతుంది. బాగా డబ్బు ఉన్నవాడు పెద్ద పదవిలో ఉన్నవాడు కనబడితే మీకు వాడు దేవుడిలా కనబడతాడు. గాంధీగార్కి ప్రధానమంత్రి పదవి గడ్డిపరకతో సమానం. వ్యక్తి భావన వదిలించుకోవటానికి విచారణ పద్ధతి మంచిదే, అంటే బియ్యంలో బెడ్డలు తీసివేస్తే బియ్యమే మిగిలుతాయి. నీవు కాని దానిని నీవు తిరస్కరిస్తే మిగిలేది ఆత్మ మాత్రమే. ఆత్మలోనే ఆనందం, సుఖం ఉంది. ఆత్మ విచారణ లేకపోతే నిర్మలమైన బుద్ధి కలుగదు. వారు ఎక్కువ, వీరు తక్కువ అనే తలంపులు ఉండకూడదు. నిజమైన చూపుకే నిజం తెలుస్తుంది. జపానికి పైసా ఖర్చు

srinannagaru.com

అక్కరలేదు. దానిని అనుసరించమని చెబితే తేలిక అనుకొంటారు. పైసలు అయ్యేదే నిజమనుకొంటారు. కోరికలోంచి పూర్తిగా విముక్తి పొందే వరకూ సత్యం తెలియబడదు. చైతన్యం మాయ యొక్క కూడికే. అవాస్తవాన్ని కాదు, కాదు అనుకొంటేనే వాస్తవంలోకి వస్తాము. కానివి అన్నీ ఆధ్యాత్మిక ప్రయాణానికి అడ్డు వస్తూ ఉంటాయి. శరీరంలో ఎన్ని అవయవాలు ఉన్నాయో అన్నిటినీ వినియోగించుకొంటున్నా మానవుడు బుద్ధి విషయంలో మాత్రం బహు తక్కువగా ఉపయోగించుకొంటున్నాడు.

160. మాలిన్యం శరీరంలో లేదు. ఉన్నా స్మశానంలో కాలిపోతుంది. మనస్సులోనే మాలిన్యమంతా ఉంది. అది స్మశానంలో కాలదు. ఆ మాలిన్యమే మరో దేహాన్ని తీసుకొని వస్తుంది. ఎవరైతే తన స్వభావాన్ని మార్చుకొంటారో అంటే చైతన్య స్ఫురణతో ఉంటారో వారే తరించగలరు. ద్వంద్వాలకు అంటే కష్ట సుఖాలకు అతీతంగా బేలెన్స్‌గా ఉండగా, ఉండగా నెమ్మదిగా నీ మనస్సు హృదయాభిముఖంగా జారిపోతుంది. బడిలో జారుడు బల్లమీద పిల్లలు జారిన రీతిగా నీవు హృదయంలోకి జారిపోతావు. మనకు కావలసింది వివేకం. నాన్సెన్స్ అంతా మనస్సులో ఉంది. పారిపోవటానికి ప్రయత్నించ కూడదు. సమస్యను పరిష్కారం చేసుకోవాలి. మనలో దోషాలను ఒక్కటి చెప్పము. ఇతరులలోని దోషాలను లెక్కపెడతాము. ఇతరులలో దోషాలు లెక్కపెట్టే టైము నీకు దొరక కూడదు. సాధన ఆ దిశగా సాగాలి. గతాన్ని అన్ని వేళలా మర్చిపోవాలి. అన్ని సందర్భాలలోను మర్చిపోవాలి. చింతా, టెంగా పోగొట్టే ఆనంద స్థానం నీలో ఉంది దానిలో ప్రవేశించాలి. ప్రతీ పొరుగువారు స్నేహితులు కానక్కరలేదు. అది వారి ఇష్టం. నీ శ్రేయస్సును కోరేవారు ఇతర దేశాలలో ఉన్నా నీకు వారే పొరుగు వారు. ప్రతీ జీవిత చరిత్ర ఎప్పుడు ముగియాలో అంటే ఎన్ని సంవత్సరాలు, ఎన్ని నెలలు, ఎన్ని రోజులు, ఎన్ని గంటలు, ఎన్ని నిమిషాలు, ఎన్ని సెకనులకు పూర్తి అవుతుందో అంతా తల్లి గర్భంలో ఉండగానే ఈశ్వరుడు నిర్ణయించాడు. జ్ఞాపకాలే బంధాలు, దుఃఖాలు.

162. పని అంటే ఒకటే పని అది ఆధ్యాత్మికంగా ఆత్మానుభవానికి పనికి వచ్చే పని. పొట్టకోసం ఏదో పని చేసుకోవచ్చును. అది పని కాదు దొంగ నేను లోంచి బయట పడటమే నిజమైన పని. నిన్ను నీవు తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం. ఆకారాల వలనే వికారాలు వస్తాయి. నిర్వికారానికి (ఆత్మకు) వికారాలు ఉండవు. బుద్ధుని బోధ అంతా "దేవుని కన్న నీవు బాగుపడటం ముఖ్యం" అనే సిద్ధాంతం మీద ఆధారపడిందే. పాము కోరలో ఉన్న విషం కన్న మనలో ఉన్న రాగ-ద్వేషాలు

srinannagaru.com

జన్మ జన్మలకు మనలను చీకటిమయయం చేస్తాయి. చేదు మాటలు, చేదు పనులు అమృత స్థితికి తీసుకొని వెళ్ళలేవు. అమృతంతో కూడిన మాటలు విన్నప్పడే అమృత స్థితి పొందుతావు. మనస్సులో మలంతో మాట్లాడితే అంటే రాగ-ద్వేషాల రూపంలో మాట్లాడితే చిరాకు, మాట్లాడకపోతే పరాకు. ఇటువంటి మనుషుల వద్ద జీవిస్తున్నాము. ఎవరు ఎలా వ్యవహరించినా మనం నిదానంగా భగవంతుడు చెప్పినట్లు జీవించాలి. నేను ఎంతోమంది సంపదగల వారిని, చదువుకొన్న వారినీ, అధికారం గల వారిని, డాక్టరేట్ పుచ్చుకొన్న వారినీ చూసాను, ఎవరు సుఖంగా జీవిస్తున్నారు అంటే "భగవంతుని సంకల్పమే జరుగుతున్నది" అనే పరిపూర్ణ విశ్వాసం ఉన్నవారు సుఖంగా, శాంతంగా, ఆనందంగా బ్రతికేస్తున్నారు. వారికి ఏ సంపదా లేకపోయినా ఏ కష్టం కలిగినా భగవంతుడే పంపిస్తున్నాడు. నన్ను ఉద్ధరించటానికి ఇది ఒక "వరం" అని అనుకోవాలి. మనం గృహస్థాశ్రమంలో ఉన్నా ఇతరుల క్షేమాన్ని కోరుకొంటే మనం సన్యాస ఆశ్రమంలో ఉన్నట్లే. తన క్షేమాన్ని తాను కోరుకొనేవాడు గృహస్థుడు అంటారు. కొందరు ధ్యానంలో ఉన్నాము అనుకొంటారు "తలుపు చప్పడు చేయకండి, కుక్కను మొరగనియ్యకండి, పిల్లలను ఈ ధ్యానమందిరంలోకి రానియ్యకండి" అని హెచ్చరికలు జారీ చేస్తూ, ధ్యానంలో కూర్చుంటారు. అంటే వంట మానేసి ఈ పని చెయ్యాలా, సరే ఇంటి కుక్కను కాపలా కాస్తాము రాజుగారు ధ్యానంలో ఉన్నారని, కాని వీధిలో కుక్కలను ఎలా కాపలా కాయగలం. ఏ శబ్దం వచ్చినా నీలోని కోపమే నిన్ను బయటకి లాగుకొని వస్తున్నది. మీ మనస్సుతో తాదాత్మ్యం పొందుతున్నారు మీలో స్పష్టత ఉండాలి. జ్ఞానం అంటే ఏమిటి? అని దాని తాలూకు స్పష్టత వస్తే మీరు కాని దానితో మీరు విడిపోవటం, సహజంగా జరుగుతుంది. మెలకువలో పనికి రాని తలంపులు ఎన్నో ఉన్నాయి. ముక్కు లావుగా ఉందంటే కోపం, అందంగా ఉంది అంటే సంతోషం. అన్ని స్మశానంలో కాలిపోయేవే. కష్టపడితే గాని మంచి గుణాలు రావు. మనకు రాగ, ద్వేషాలకు సంబంధించిన ఎరుక ఉంది. అసలు ఎరుక లేదు.

163. ఆత్మ విశ్వాసం పెంచుకోవాలి, స్వార్థం తగ్గించుకోవాలి. స్వార్థం లోంచే చెడు అసూయ అంతా వస్తుంది. ప్రపంచ చరిత్రలో విమర్శించటం వలన పతనమైనవారు ఉన్నారు. ఇతరుల నుంచి విమర్శలకు గురి అయిన వారికి ఏ హానీ రాదు. తక్కువ మాట్లాడేవారికి విలువ ఉంటుంది, గౌరవం పెరుగుతుంది. ఇది సామాజిక స్పృహతో మాట్లాడుతున్నాను. భగవంతుడు రెండు సార్లు నవ్వుకొంటాడు "లోకం సత్యమా? అసత్యమా?" అనుకొన్నప్పడు,

srinannagaru.com

రెండు "ఈ సమస్య పరిష్కారం అయ్యేటప్పటికి ఈ సమస్య మరలా వచ్చి పడింది?" అనుకొన్నప్పుడు. "అసలు ఆ సమస్యలు దేహం నేను అనుకొన్నప్పుడేరా" అని నవ్వుకొంటాడు. "ఈ లోకం ఎంత కాలమైనది ఉద్భవించి" అనే పిచ్చి గొడవలలో ఉన్నప్పుడు నేను అప్పుడు పుట్టాను, అలా ఆ సమస్యలను పరిష్కారం చేస్తాను అనుకొన్నప్పుడు.

164. "ప్రియం" వలన కోరిక కలుగుతుంది. "అప్రియం" వలన క్రోధము కలుగుతుంది. ఈ రెంటివలన మనస్సు బాహ్య ముఖం అవుతుంది. రోడ్డు ప్రక్క మురుగు గుంటకన్నా, మనస్సులోని మురుగుగుంట వలనే వేలాది జన్మలు వస్తాయి. సంఘటనలను బట్టి దుఃఖం రావటం లేదు, ఆ సంఘటనలతో తాదాత్మ్యము పొందటం వలన దుఃఖం వస్తుంది. సంఘటనలతో రియాక్టు అవ్వటం వలన జీవితం దుఃఖమయమై పోతున్నది. శంకరాచార్యులవారు తల్లి మీద కోపపడి ఇల్లు విడిచిపెట్టితే, లోకాన్ని ప్రేమించలేరు. నన్ను నేను బ్రహ్మంగా చూచుకోవాలి, ఇతరులను కూడా బ్రహ్మంగా చూస్తే మనస్సుకు వికారాలు రావు. మనలో చిన్న వైరభావన, అసూయ భావన ఉంది అనుకోండి మనం సత్యానికి దూరమౌతాము. ఆ చిన్న బలహీనత తొలగించుకోకపోతే అది కొండంత అవుతుంది. దేవుడు చూచేది "రాసి" కాదు, "వాసి". అంటే పరిమాణం కాదు, పక్వత. మాటి మాటికీ కోపం వచ్చినా లోపల కుదురులేదని అర్థం. జరిగింది తలిస్తే బాధ, జరగబోయే దానిని తలిస్తే ఆందోళన కలుగుతుంది. వర్తమానంలో ఉండటం లేదు. ఇష్టా అయిష్టాలు గల మనుష్యుల మధ్య ఉండి తరించటానికే ఈ భూమి మీదకు వచ్చావన్న సంగతి మీరు గుర్తుంచుకోవాలి. నాకు ఎవరి మీదా పగలేదు అనటం కాదు, ప్రేమను కూడా కలిగేలా చూచుకోవాలి. చాలా మంది ఏదో పోగొట్టుకొంటున్నాము అనుకొంటారు. యవ్వనం ఎలా వచ్చిందో అలాగే పోతుంది. అలాగే ధనం వగైరాలు. అది ప్రకృతి పని.

165. దుఃఖం కూడా మందే. అది రాకూడదని బాధ పడకండి. ప్రతీ చిన్న పని పెద్ద మనస్సుతో చేస్తే మీరు ఈ జన్మలోనే తరిస్తారు. మనం కాని దానిని మనం అనుకొనేటట్లు చేసేదే మాయ. సంసారానికి పునాదిరాళ్ళు రాగ, ద్వేషాలు. రాగ ద్వేషాలన్నా కామ క్రోధాలన్నా ఒక్కటే. రాగం ఉన్నచోట కామం. ద్వేషం ఉన్నచోట క్రోధం ఉండి తీరుతాయి. కోపకారణం ఉన్నా కోపం రాకుండాను, ద్వేష కారణం ఉన్నా ద్వేషం రాకుండాను ఉంటే చెరుకురసం త్రాగితే ఎంత సుఖంగా ఉంటుందో అంత సుఖంగా ప్రారబ్ధం నశిస్తుంది. మనం కోప్పడితే ఆవతల వారికి నష్టం లేదు. ఆ క్రియ ఒక ముల్లుగా మారి తిరిగి మనకే గుచ్చు

srinannagaru.com

కొంటుంది. ఎన్ని ముల్లులు గుచ్చుకొనేటట్లు చేసుకొంటాము. "ఆశ" అనేది పాశం. పాశాలను తెంచగల వాడే శివుడు. మనం చిల్లర దుకాణంలా ఉన్నాము అంటే ఈ పూజ చేసుకోండి, ఈ వ్రతం చేసుకోండి అంటే ఇష్టపడు తున్నాము. శాశ్వత సుఖం కోసం పెద్ద ప్రయత్నం చెయ్యటం లేదు. మీకు కొన్ని పాఠాలు నేర్పటానికి ఈశ్వరుడు కొన్ని చిక్కులను కల్పిస్తాడు. ఏమిటి ఈ చిక్కులో పడ్డాము అని అనుకొంటావు. పాఠాలు నేర్చుకొన్న తరువాత అందులోంచి తొలగిస్తాడు. ఆ చిక్కులు ఎప్పుడూ ఉండవు. అతి నిద్ర, అకాల భోజనం పనికి రాదు. వేరు బుద్ధిలోంచే వైర బుద్ధి వస్తుంది. సర్వశక్తిమంతుడైన పరమాత్మను మన హృదయంలో పెట్టుకొని ఏడుస్తూ కూర్చుంటున్నాము. రోజూ నాలిక మీద ఉన్న పాచి తీసుకొన్నట్లే, మనస్సులోకి వచ్చే చెడు తలంపులను ఏ రోజుకారోజు తియ్యాలి. తిరిగి ఆ చెడు ఆలోచన రాకుండా జాగ్రత్త వహించాలి.

166. పట్టుకొంటే మీ రూపాలను లేదా ఇంటిలోని రూపాలను పట్టుకొని ఏడుస్తూ ఉంటున్నాము. ఎలాగైనా ఏడుపు తప్పటం లేదని పెద్దలు గుడి కట్టించి అక్కడ ఏడవమని నిర్ణయించారు. "ఇంటికంటే గుడి పదిలం" అన్నారు. వినయం లేకపోతే విద్య రాణించదు. జీవుణ్ణి పరమాత్మను సమానం చేసేదే సమాధి. మనస్సులో ఏరకమైన పిచ్చిలేని వానికి మానసిక ప్రశాంతత ఉంటుంది. శారీరక ఆరోగ్యం బాగుపడుతుంది. అనారోగ్యం వచ్చి మీద పడుతున్నా సహించటం కూడా తపస్సే. మనస్సులో చాలా మాయ పొరలు ఉన్నాయి. వాటిని చీల్చుకొని హృదయంలోకి వెళ్ళాలి. ఉన్న ఆత్మయందు లేని బుద్ధి వలన, భగవంతుని వాక్యం ముందు నమ్మకం లేని కారణంగా దుఃఖం వస్తున్నది. ఏదైతే లేదో అది ఉంది అనుకొంటున్నాము. పుండు అంతా ఇక్కడే ఉంది. కర్మను అనుభవించటానికి, ఈ తెలివిని, మనస్సును, లోకాన్ని మనకు ఇచ్చాడు ఈశ్వరుడు. శబ్ధంలో అర్థం తెలుసుకోలేనప్పుడు శబ్ధంలో అర్థం ఏది సూచిస్తుందో అది నీవు ఎలా అవుతావు శబ్ధం శివుడు. అర్థం పార్వతి. నేను మంచివాడిని అని చెప్పకొనే కర్మ నీకు ఏముంది. నీవు ఆత్మ స్వరూపుడవు, అహంకారం ఉన్న వాడే ఎంతో ఆలోచించి ఎంతో శ్రమతో బాధపడుతూ నేను మంచివాడినని గంటల తరబడి చెబుతాడు. దొంగనేను లేడు అని నోటితో అనవచ్చును కాని అది పీడిస్తున్నది. కాని పరిశీలిస్తే పత్తా లేకుండా పోతున్నది. అది ఆత్మ జ్ఞానం వస్తే పోతుంది. అంతవరకూ ఉందని చెప్పలేము, లేదు అని చెప్పలేము. దెయ్యంలా తయారైనది మోడు. చీకటిలో దెయ్యం; లైటు వేసి చూస్తే మోడు. ఇది అంతే. అబద్ధానికి ఆన వాళ్ళు ఎక్కువ చెప్పాలి.

srinannagaru.com

167. తొలి తలంపు నేనుతోనే ద్వేషాలు అన్ని ప్రారంభమౌతాయి. పాపాలే దోషాలుగా సిద్ధమౌతాయి. నిజమైన సాధకుడు విషయ వాసనలు లాంటి తలంపులు పెట్టుకోవటమనే తప్పలను తిరిగి చెయ్యడు. నిరంతరం నీ మనస్సులోకి ఇతర తలంపులు రాకుండా చూచుకోవాలి. పెంపుడు కుక్క అలవాటు ప్రకారం మన వడిలోకి వస్తూ ఉన్నా అనేకసార్లు తిరస్కరిస్తే కొంత కాలానికి రాదు. అలాగే తలంపులను ఆదరించకపోతే చస్తాయి. ఎక్కడ మారాలో అక్కడ మారటం లేదు అందుకే ఆత్మానుభవం కలగటం లేదు. ప్రకృతి రూపాల మీద ఆసక్తి వలన అలా జరుగుతున్నది. మోహం నశిస్తేనే మోక్షం. నీవు కాని దానిని నీవు ఆలోచిస్తూ ఉంటే, ఎన్ని తలంపులు, ఎన్ని గొడవలు అలాగే ఉంటే నీవు అయ్యేది ఆత్మకాదు. శరీరంగానే మిగులుతావు. ఏది ఎప్పడు ఎలా జరగాలో అలా జరుగుతాయని అనుకొంటున్నాము. కాని ఉండ గలుగుతున్నామా? ఉండలేకపోతున్నాము. కారణం వ్యక్తి భావన. ఈశ్వరునితో తాదాత్మ్యం లేకపోవటం వలనే అది అలా జరిగింది ఏమిటి? ఇది ఇలా జరిగింది ఏమిటి? అనే తలంపులు వస్తున్నాయి. మిమ్ములను ఎవరైనా మంచి పనులు చేస్తున్నారు అంటే మీరు పొంగిపోతే దాని వెనకాలే దుఃఖం కాచిపెట్టుకొని ఉంటుంది అనే విషయం మర్చిపోకండి. చేసిన పుణ్యం చెబితే పోతుంది. సత్యానికి టామ్ టామ్ అక్కరలేదు. అవి అన్నీ అహంకారం యొక్క చేష్టలు. సమాజంలో ఎవరి మనస్సు ముట్టుకొన్నా బెంగలే, కొరతలే. ఈ శరీరం ఉండాలని కోరుకొంటున్నారు. జాగ్రదవస్థలో మనం అనుభవించేది ఏడుపులు. దానిని పొడిగించుకొందామనా ఉబలాటం. ఇక్కడ ఏమున్నాయి? రాగద్వేషాలు అసూయలు.

168. మనలో పెద్ద చెడ్డ ఏమిటి? అంటే వాడిలో ఆ లోపం ఉంది, వీడిలో ఈ లోపం ఉంది అనుకోవటమే. వాడిలో లోపం ఉంటే మీకు నష్టం ఏమిటి? నిజమైన సాధకుడనకు ఇతరులలో లోపాలు వెదటకానికి సమయం చాలదు. వాడి ఇల్లు అంటుకొంటే మీకు నష్టం ఏమిటి? నీ ఇల్లు అంటుకోకుండా చూచుకో. అంటే నీవు అహంకారం పెంచుకోకుండా ఉండు. దానిని నశింపు చేసుకోవాలి. మీకు సంతోషం, సుఖం కలిగే పరిస్థితులు నీకు తారసపడితే దానిని నీవు నిగ్రహించుకోకపోతే నీకు ఆత్మానుభవం ఎలా కలుగుతుంది. చలం గారితో ఎవరైనా మీ ఊరునుంచి ఉత్తరం వచ్చిందా? అంటే "ఇంకా నా ఊరు ఏమిటి? అరుణాచలం వచ్చిన తరువాత మా ఊరు అంటే అహంకారం పెరుగుతుంది. దేహానికి ఊరు, ఆత్మకు ఊరుంటుందా?" అనేవారు. జ్ఞానికి ప్రపంచం అంతా తన ఊరుగానే ఉంటుంది. దత్తాత్రేయులకు గల గురువులలో గాలి

srinannagaru.com


ఒకటి. గాలి వీస్తూ ఉంటే చేయి అడ్డుపెట్టినా క్రిందనుంచి పై నుంచి వెళ్లిపోతుంది. పోరాటం పెట్టుకోదు. ముళ్ల కంపల మీద నుంచి అయినా వెళ్లిపోతుంది. అలాగే మనకు ఇంట్లోవారుగాని, వీధిలోవారుగాని మన ఆధ్యాత్మిక మార్గానికి అడ్డు తగిలితే తప్పించుకొని తిరుగువాడు ధన్యుడు. పోరాటం పెట్టుకొంటే అభివృద్ధి ఆగిపోతుంది. డబ్బులేని వానికి భోగం ఎక్కడ నుంచి వస్తుంది. అలాగే శాంతి లేనివానికి సుఖం ఎక్కడ నుంచి వస్తుంది. నీకు నిజంగా శాంతి కావాలంటే ఇతరులలో లోపాలు వెదకకు. నీలోని లోపాలు వెదుకుకొంటే శాంతి లభిస్తుంది. కబీరుకు ఎక్కడా చెడ్డ కనబడలేదు. తనలో (మనస్సులో) చూచుకొన్నాడు, చెడ్డ కనబడింది. దానిని తొలగించుకొని ఆత్మానుభవంలో ఉన్నారు.

169. ఇంట్లో చెడ్డ అలవాట్లు, చెడ్డ భావాలు గలవారు ఉంటే అదే ధ్యాసతో ఉంటే గమ్యాన్ని తప్పిపోతావు. ఏదైనా సలహా ఇయ్యి. మధురంగా మాట్లాడి తప్పించుకొని తిరుగువారు ధన్యులు. ఇంటిమీద, ఇంట్లో వారి మీద ప్రేమ తగ్గుతూ ఉంటే నీ బుద్ధి విశాలమౌతుంది. అంతేగాని వారు అప్పుడు అలా అన్నారు అని అన్నవి మర్చిపో. నీవు ఆత్మకావటానికి అదే మందు. నీవు ఎలా ఉన్నావో అలా ఉంటే దాని పని అది జరిగిపోతుంది. నా మాటే వినటం లేదు అనక నీ ధర్మాన్ని నీవు చెయ్యి. రేపు ఎలా జరుగుతుందో మనకు తెలియదు. ఒకవేళ రేపు కష్టం రావచ్చు. దాని కోసం ఇప్పుడు బాధపడటం ఏమిటి? రేపు వచ్చే బాధను ఇప్పుడు కోరుకోవటం ఏమిటి? ఇప్పుడు సుఖంగా ఉండు. రెండుసార్లు ఏడవటం ఎందుకు? కష్టం వచ్చినప్పుడు నీకు భగవంతుని మీద విశ్వాసం లేకపోతే ఏడవ వచ్చును. ఇప్పుడు కాలాన్ని సద్వినియోగం చేసుకో, సింహం సంవత్సర కాలం బోనులో ఉండి విడుదల అయితే మనిషి కనబడితే ఎలా చీల్చిచెండాడుతుందో, అలాగే నీ ప్రారబ్ధంపై గురువు అలా మీదపడి చీల్చి చెండాడుతాడు. ఇంకా ఏడుపులు ఎందుకు? మనో దేహాలు ఎవరి చేతిలో ఉంటాయో వాడు యుక్తుడు. రెండు ఉంటే గౌరవం, అగౌరవం. సంసారం ఆత్మకు గౌరవము ఏమిటి? దుఃఖ కారణమైన అశాంతి పరిస్థితులు ఉన్నా ఉద్రేక పరిస్థితులు ఉన్నా ఇంట్లో ముళ్ల కంపలు, బయట ముళ్ల కంపలు ఉన్నా శాంతి చిత్తంతో ఉంటే దేవుని అనుగ్రహం నీ మీద వర్షిస్తుంది. మర్చిపోవలసిన విషయాలు జ్ఞాపకం పెట్టుకొని దుఃఖించటం, జ్ఞాపకం పెట్టుకోవలసిన ఆత్మను మర్చిపోయి అశాంతి పొందటం చెయ్యదగినది కాదు. ప్రారబ్ధాన్ని మర్చిపోవటం మంచిది.

170. "గీత అహంకారానికి కోత". దత్తాత్రేయులవారికి చంద్రుడు కూడా గురువే సూర్యుని వేడి కిరణాలను చంద్రుడు స్వీకరించి చల్లదనాన్ని ఇస్తాడు.

srinannagaru.com

కొందరు ఎన్నో మాటలను భరిస్తూ, బాధలుపడుతూ ఇతరులతో వారు మాట్లాడేడప్పుడు చల్లగా, మధురంగా మాట్లాడుతారు. పరిమితులు ఉన్న ఏ వస్తువు నిజం కాదు. భక్తి-జ్ఞానం-వైరాగ్యం త్రివేణీ సంగమము. వాటిని అలవర్చుకోవాలి. ప్రపంచంలో బాధలు భరిస్తూ భగవంతుడు మీకు దారి చూపిస్తూ ఉన్నాడు. మీ ఇంట్లోకి వచ్చిన కోడలు తింగర తింగరగా బాధ కలిగించే పనులు చేస్తూ ఉంటే మీరు భరించలేరు కానీ ఆ అమ్మాయిని వారి తల్లిదండ్రులు ఇరువది సంవత్సరాలు భరించారు. కారణం ప్రేమ వలన. మీకు ఆ ప్రేమ లేదు కాబట్టి భరించలేక పోతున్నారు. ఇది రహస్యం. బయట కొంపలు అంటుకొంటే, ఆ మంటలను నీటితో ఆర్పగలము. మనస్సులో ఉన్న దుఃఖం, వేదన, అశాంతి పై నీటితో అర్పలేము. ఆవేదనను భగవంతుని యొక్క, గురువు యొక్క మాటలు ఆర్పుతాయి. శంకరా చార్యులవారి దగ్గర ఒకరు రాముణ్ణి గురించి గొప్పగా చెబుతూ ఉంటే ఆయన అన్నారు "రాముని కన్న గొప్పవారు ఉన్నారు ఎవరంటే ఏవిధమైన కోరికాలేని వారు" అన్నారు. ఆ మాట అనటానికి ఎంత ధైర్యం ఉండాలో చూడండి. మనం ఎవరినో ఒకరిని తిడతాము, అపకారం చేస్తాము. కారణం వాడు నీవే అన్న సంగతి తెలియక.



srinannagaru.com

# 11. సాధనా రహస్యాలు

ఆత్మార్పణం అంటే అహంకారాన్ని ఈశ్వరునికి అర్పించటం. భక్తి మార్గంలో పయనించేవారికి ఇది సులువుగా తెలుస్తుంది. ఒక సుగుణ సంపదగల వ్యక్తి మనకు కనబడితే అది మనం ఈ జన్మలో కృషి ఫలితంగా సంపాదించుకొన్నది కాదు. అనేక జన్మల కృషి ఫలితం మాత్రమే. ప్రపంచంలో ఏ వస్తువు నీది అనుకొన్నా, సత్యాన్వేషణకు అడ్డు వస్తుంది. మహాత్ముల దగ్గర మనం కూర్చున్నాము అనుకోండి మనకు తెలియకుండానే మనకు మార్పు వస్తుంది. మనలో ఉన్న బలహీనతలు ఏమిటో తెలుస్తూ ఉంటాయి. మన అంతరంగంలోకి వారి శక్తిని పంపించి మనలో మార్పును తీసుకొని వస్తారు. అంతకంటే మనకు కావలసినది ఏమున్నది. వారి వద్ద కూర్చోవటం వలన మన అలవాట్లు మారిపోతూ ఉంటాయి. మన ప్రవర్తన మారిపోతూ ఉంటుంది. మనస్సు చల్లబడుతుంది. బయట దృష్టితో చూస్తే భయమేస్తుంది. అద్వైత దృష్టితో చూస్తే భయంలేదు. మానసిక అనారోగ్యం వలన శారీరక అనారోగ్యం వలన మనస్సు చలిస్తుంది. మౌనం వలన దైవీ సంపద అందుతుంది. ఈశ్వరానుగ్రహం తొందరగా అందుతుంది. మనస్సుకు శాంతి కలుగుతుంది. సాధనచేసేవాడు పడిపోవచ్చు కాని అసలు సాధన చెయ్యని వాడు, లేవలేని వానితో సమానం. లేవలేని వాడు పడిపోవటం అనేది లేదు. మంచివాళ్ళను ఇంకామంచి వాళ్ళను చెయ్యటానికి, చెడ్డవాళ్ళను ఈశ్వరుడు ఉపయోగించుకొంటాడు. మనస్సుతో చేసే పని, శరీరంతో చేసే పని వాసనగా ఏర్పడుతుంది. మనస్సును తపింపచేయటమే తపస్సు. చెడు తలంపులను గెంటి వేయుటమే తపస్సు. తిరువళ్ళువారు అన్నారు "మనం అన్ని కోరికలను వదులుకొంటే ఒక పెద్ద కోరిక కలుగుతుంది, అదే మోక్షం అనే కోరిక".

2. భగవాన్ తత్త్వం పూజ, జపం కాదు. "తట్టండి తెరువబడుతుంది. వెదకండి కనబడుతుంది; తెలియబడుతుంది. దీనినే విచారణ మార్గం అంటారు" పూర్వ జన్మ సంస్కారాలలో ఏ గమ్యం గురించి మీరు కృషిచేస్తే దానిలోనే ప్రీతి పెరుగుతుంది. దాన్ని పట్టుకొని మీరు ప్రయాణం చెయ్యండి మనలో వచ్చే ప్రతీ తలంపు గురువు చూస్తూనే ఉంటాడు. గురువుపై ఇష్టం వల్ల మీకు అనుగ్రహం వస్తుంది, ప్రారబ్ధం అనుభవించేటప్పుడు రాగం పుడుతుంది. ఆ రాగబంధనాలలో చిక్కుకోకుండా ఉంటే నీ ప్రారబ్ధం నశించిపోతుంది. అదే సాధన రహస్యం. గుణంలేని వానికి జ్ఞానం ఏమిటి? జ్ఞానం కావాలంటే అహంకారాన్ని నరికివెయ్యి. కొందరు మాట్లాడుతూ ఉంటే పోట్లాటకు దిగినట్లు ఉంటుంది. వారికి దూరంగా

srinannagaru.com

ఉండటం మంచిది. మంచి వాక్కు కూడా తపస్సే. "సోహం" చేసేవాడికి మోక్షం వస్తుంది. ఇది రహస్యం. ఎందుచేతనంటే గీతలో మీసేవే నిజమైతే మీకు హృదయం వికసిస్తుంది కాని అందులో వ్యక్తి భావన ఉండకూడదు. ఈశ్వర భావన ఉండాలి. మీ బంధువులు ఎవరైనా మిమ్ములను ద్వేషిస్తూ ఉంటే మీరు కంగారు పడకండి. ఎందుచేతనంటే ఈశ్వరుడు ఆయన వైపు తిప్పుకోవటానికి వాళ్ళతో తిట్టిస్తూ ఉంటాడని భావించండి. "నీవు లోకంలో అన్ని సుఖాలు పొందాలంటే గుఱ్ఱంలా పని చెయ్యి. సన్యాసిలా జీవించు" అంటారు. శరణాగతి చేసేవాడిని సుఖ, దుఃఖాలు అంటవు. సుఖ, దుఃఖాలు కలిగితే శరణాగతి పొందనట్లే లెక్క. మీ మైండ్‌ని సిద్ధం చేసేదే సాధన. మీరు స్థిరపడ్డారా, జ్ఞానం సెకనులో వచ్చేస్తుంది. కపటంతో చెయ్యకుండా, ఆలోచించకుండా, చూడకుండా ఉంటే మీకు ఈ నిమిషంలో జ్ఞానం వచ్చేస్తుంది.

3. మనిషి కనబడితే పులి ఎంత వేగంగా వచ్చి మన మీదకు దూకుతుందో అలాగే అవకాశం ఉన్నప్పుడు మీలో ఉన్న వాసనలు బయటికి పోవటానికి ఈశ్వరుడు ఎవరినో ఒకరిని మీమీద ఉసిగొలిపి మీకు క్లేశం కలిగించి మీ వాసనలు బయటికి గెంటటానికి పన్నాగాలు పన్నుతూ ఉంటాడు. ఈశ్వర కరుణ ఉంటే మీలో ఎంత బరువైన వాసనలు ఉన్నా అది మహా ప్రవాహంలో కొట్టుకొని పోయే దుంగలు లాగ కొట్టుకొని పోతాయి. మీకు కలిగే నష్టాలకు, మీ ప్రవర్తనను చూచి ఈశ్వరుడు సంతోషిస్తూ ఉండాలి. అప్పుడు మాత్రమే మీ అజ్ఞానాన్ని ఈశ్వరుడు కాల్చి బూడిద చేస్తాడు. ఏ కోరిక వచ్చినా నేను అనే దానికే వస్తుంది అని గుర్తించుకోవాలి. నిజం చెప్పాలి అంటే మనం అందరం లేము. ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడు. మీ కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా కంగారు పడకండి. మంచికలా, చెడ్డకలా, కలే. అలాగే జీవితంలో సంఘటనలు కూడా అంతే. దేహ ప్రారబ్ధం అనుభవించినప్పుడు రాగం అంటుకోకుండా ఉంటే మీ ప్రారబ్ధం ఖర్చు అయిపోతుంది. అదే కాలంలో జ్ఞానం వచ్చేస్తుంది. మీ మనస్సు ఆత్మలో ఉంచండి చాలు. సాధన వలన ఆత్మ దర్శనం కలుగదు. మీరు పవిత్రులు అవ్వాలి. చేత-మాట-తలంపు పవిత్రంగా ఉండాలి. మీ పవిత్రతను చూచి దేవునికి కలగాలి మీకు దర్శనమియ్యాలని. రక్షించేది రామాయణం "రాముని గుణాలను మీరు అలవర్చుకొంటే సీత మీ దగ్గరకు వచ్చి కూర్చుంటుంది" అన్నారు తులసీదాస్. ఈశ్వరుడు అనే పిచ్చి ఎవరికి కలగదో వారి మనస్సు బహిర్ముఖమౌతుంది. ఈశ్వరానుగ్రహం మీమీద ఉండాలంటే మీకు వినయం కావాలి. మన శరీర అవసరాలకు సరిపడ శ్రమపడు, మిగిలిన కాలాన్ని

srinannagaru.com

భగవంతుని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి.

4. ఇంద్రియాలను, బుద్ధిని దాటిన వానికి కామం ఎక్కడ ఉంటుంది. సర్వకాల సర్వ అవస్థలలోనూ గంభీరంగా ఉండాలి. భేద భావన లేనప్పుడు తలంపు లేదు. తలంపు లేకపోతే కామం లేదు. కలలో తన అన్నదమ్ములతో కొట్టుకొన్నట్లు మెలుకువ వచ్చిన తరువాత తనకు అసలు అన్నదమ్ములు లేనే లేరని అంతా కల అని ఎలా తెలుసుకొని శాంతంగా ఉంటారో, అలాగే ఆత్మను తెలిసిన తరువాత ఈ లోకం లేదని, దేవుడు లేడని తెలుసుకొంటావు. ఆత్మకు,-గురువుకు, దేవునికీ తేడా లేదు. మీరు మంచి పని చేసి చెప్పకుంటే మీరు ఆత్మకు దూరమౌతారు. అహంకారం పెరుగుతుంది. వాడు కొట్టాడు, వీడు తిట్టాడు అని అనుకొంటే ఎన్ని జన్మలకైనా శాంతి కలుగదు. ఒడ్డుకు చేరలేవు. మీకు ఎవరిమీదనైనా గతంలో కోపం ఉన్నా వారిని మీరు పలకరించాలని ఉన్నా గతంలో మీకు చేసిన చెడు పనులు గుర్తుకు వచ్చి పలకరించలేరు. కాని అవతలి వాళ్ళు "పొరపాటైనది క్షమించండి!" అని అంటే పలకరించాలని ఉంటుంది. కాని మీరు పొరపాటైనదని ఆవతల వాళ్ళు అనకుండానే మీరు మీ మనస్సులో అవతల వాళ్ళను క్షమించి పలకరించండి. మీ వాసనలు కాలిపోతాయి. స్తోత్ర గ్రంథాలు మనస్సును చల్లబడటం కోసం ప్రశాంతత, పవిత్రత కోసం ఉపయోగ పడతాయి. రాగ ద్వేషాలకు, కష్ట సుఖాలకు మీరు అతీతంగా ఉంటే, దేహప్రారబ్ధం దాని పని అది చూచుకొంటుంది. జరిగేది జరిగి తీరుతుంది. జరగరానిది ఎవరు ఎంత ప్రయత్నము చేసినా జరగనే జరగదు. మౌనం ఉత్తమం. సృష్టి యొక్క స్వభావం, అహంకారం యొక్క స్వభావం మూట కట్టి ఒక ప్రక్కన పెట్టండి. మనస్సును ఆత్మవైపు మళ్ళించండి. మనస్సు చల్లబడటానికి, ప్రశాంతత, పవిత్రత సహాయపడతాయి.

5. నీవు ఆత్మ విశ్వాసం పొందకపోతే మరణించిన వానితో సమానం. మీకు ఆ విశ్వాసం ఉంటే ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అంతమంది శత్రువులు ఉన్నా మీకు ఏ హానీ జరగదు. లౌకికమైనవి తాత్కాలికమైన విషయాలపై దృష్టిని కేంద్రీకరిస్తే అజ్ఞానంలో పడతారు. మన గమ్యం ఏమిటో నిరంతరం జ్ఞాపకం చేసుకోవాలి. అసహనం పోవటానికి సహనాన్ని ఆశ్రయించాలి. "మర్యాదగా మాట్లాడటమే తెలియనప్పుడు నీకు జ్ఞానం ఎలా వస్తుంది" అన్నాడు బుద్ధుడు. తీగ చెట్టుపైకి ప్రాకి చెట్టును సమూలంగా ఆక్రమించుకొని ఎలా కృంగదీస్తాయో నీలోని దుర్గుణాలే నిన్ను తరువాత జన్మలలో కృంగదీస్తాయి. మనో నిగ్రహం తెలిసిన తరువాత, దాని ప్రయోజనం తెలిసిన తరువాత, గ్రంథ పఠనం,

srinannagaru.com

యాత్రల వలన ప్రయోజనం లేదు. మంచితనం వేరు, గొప్పతనం వేరు, గొప్పతనం అంటే పదవులు కలిగి యుండటం, మనకు కావలసింది గొప్పతనం కాదు, మంచితనం. కొందరికి మంచితనం ఉన్నా, వారికి తెలియదు. తెలుపనియ్యరు కారణం వారి మంచితనం వారి మంచితనాన్ని కూడా బయటికి తెలుపనియ్యదు. "మీ గురువు మీద ఎంత విలువ ఇస్తారో కాలానికి అంత విలువ ఇయ్యండి" అన్నారు గీతాచార్యుడు. కాల స్వరూపుడను నేను అన్నాడు. మీకు ఎవరినైనా చూస్తే అసూయ, అసహనం కలిగితే చీకటిలో ఉన్నట్లే లెక్క. ఈ వెలుగు నిజం కాదు. అజ్ఞానమనే కిటికీలోంచి ప్రపంచాన్ని చూస్తే అశాంతి. జ్ఞానమనే కిటికీలోంచి ప్రపంచాన్ని చూస్తే శాంతి కలుగుతుంది. నాతో ఎవ్వరూ మాట్లాడటం లేదు అనే భావనలో ఉండటం హృదయ దౌర్బల్యం. అది నీచాతి నీచమైనది.

6. మన జీవితాలలో కలిగే కష్టాలు, సుఖాలు, దుఃఖాలు, గౌరవాలు శాశ్వతం కాదనుకోండి బాహ్యమైన వస్తు జాలం అంతా నశించేదనే, విషయం సదా గుర్తుంచుకోండి. అహంకారం ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏమీ లేదు. మీకు వైరాగ్యం కలిగే సూచనలు కలుగుతున్నాయి అనుకోండి భగవాన్ మిమ్మల్ని అభివృద్ధిలోకి తీసుకొని వెడుతున్నాడని గుర్తుంచుకోండి. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు సాధన చేసుకోండి. వ్యతిరేకంగా ఉన్నప్పుడు వైరాగ్యం పెంచుకోండి. మనలో ఉన్న శాంతిని, ఆనందాన్ని మనకు అందకుండా అడ్డుతెరగా ఉన్న అజ్ఞానాన్ని కత్తిరించేదే "నేను ఎవ్వడను?" అనే ప్రశ్న ప్రయోజనం. ఆ ప్రశ్న వలన మనలో రగిలే ఆవేశం, అశాంతి యొక్క వేగం తగ్గుతుంది. మనం పని చెయ్యాలి, ప్రతీకారం చెయ్యకూడదు. మన ఆలోచనలు అన్నీ దేహం చుట్టూ తిరుగుతున్నాయి. అలా ఉంటే మనం దేహానికి, రూపానికి దగ్గరౌతాము. మన దేహ రూపంలోంచి దూరం కావటానికి మన నామరూపాలను వదులుకోవాలి. ఆలోచన అమృతంతో సమానం. లీజన్ ఎంతవరకూ వెళ్ళగలిగితే అంత వరకూ వెళ్ళగలగాలి. మనం మనిషికి ఇస్తామా గౌరవం, ఆ మనిషి నీడకు ఇస్తామా? మనిషికే ఇస్తాము. ఎందుచేత, ఈ నీడకు ఆధారం ఆ మనిషే కాబట్టి. మనం ఎవరం? ఆత్మ. దాని నీడే మనిషి. మనం ఇప్పుడు దేనికి విలువ ఇస్తున్నాము. నీడకే కదా! ఇతరుల మెప్పులకోసం కాక దేవుని మెప్పుకోసం పనిచెయ్యాలి. భావనాబలం ఉన్నవాడు మాత్రమే ఆత్మను గురించి ఆలోచించగలడు. పాముకు ఎంత దూరంలో ఉంటామో రాగ-ద్వేషాలకు అంత దూరంలో ఉండాలి.

7. గీతలో శ్రీకృష్ణుడు "శ్రద్ధ గలవానికే నా మాటలు చెప్పమ"న్నాడు. క్రీస్తు అన్నాడు "రత్నాలను పందుల దగ్గర పదలకు, ఎందుచేతనంటే అవి కాలుతో

srinannagaru.com

తొక్కుతాయి. అలాగే మధురమైన పదార్థాలను కుక్కలకు పెట్టకు" అన్నాడు. తత్త్వం యొక్క రహస్యాలను యోగ్యులకే తెలపాలి. సత్పురుషుల సహవాసం వలన మన మనస్సు క్రమమార్గంలో ఆత్మవైపు మరలటానికి అవకాశం నిలకడగా ఉంటుంది. పూజచెయ్యటం కన్న పూజ చేసేవానిని పట్టుకోవటం ఉత్తమం. జపం ఏకాగ్రతనే కాదు, పవిత్రుడిని కూడా చేస్తుంది. అణగని మనస్సు కంటే అణిగిన మనస్సు ఆత్మ ధ్యానం చెయ్యటానికి ఎక్కువ సహకరిస్తుంది. ఆత్మగా చింతించేదే ఆత్మాకారం చెందుతుంది. చావు అంటే ఎందుకు భయమేస్తుంది అంటే తెలుసున్న పరిస్థితులు, వ్యక్తులు, ఆప్తులు తెగిపోతున్నారని భయమేస్తుంది. వినటం వలన భోధించే సామర్థ్యం వస్తుంది. ఆడంబరం కోసం మాట్లాడేవాడు, పని ప్రతిష్ఠ కోసం చేసేవాడు, జీవితాన్ని ఆడంబరంగా మలచుకొనేవాడు బాగుపడడు. ఎదుటి వాడిని బాగుపడనివ్వడు. పూజ, జపం, ధ్యానం, పరోక్ష జ్ఞానం. ఆత్మ విచారణ మార్గం, ప్రత్యక్ష మార్గం. "నేను" అనే తలంపుకు కారణం లేదు. అది నూటికి నూరు పాళ్ళు కల్పితం. దాన్ని విచారణ చేస్తే అది నిజంగా లేదని దాని మూలం లోకి వెళ్ళి లయమౌతుంది. అసలు నేను అయిన బ్రహ్మం వ్యక్తమౌతుంది. మీరు ఎక్కువ కాలం ఈశ్వర ప్రేమలో ఉంటే అహంకారం నశించిపోతుంది. మీరు పూజ, జపం చెయ్యనక్కరలేదు, ఓపికగా ఉంటే మీరు భగవంతునికి దగ్గరౌతారు. ధ్యానం అలవాటు చేసుకొన్న మనస్సు శాంతంగా ఉంటుంది.

8. కొందరు యుక్తిగా మాట్లాడుతున్నాము అని అనుకొంటారు. కాని అవిఏమీ చూడడు భగవంతుడు. ఆయన మీద అస్థిత్వం ఎంతవరకూ ఉందని మాత్రమే చూస్తాడు. యుక్తిగా మాట్లాడినామనుకొన్న వారే వాళ్ళమీద వాళ్ళు అక్షింతలు వేసుకొంటారు. భయం ఉన్న వానికి బ్రహ్మం తెలియదు. బ్రహ్మంలో ఉన్నవానికి భయం ఉండదు. కారణం తనకన్న అన్యంగా ఏదీలేదని అతనికి తెలుస్తుంది కాబట్టి. అలాగే మిమ్ములను మీరు చూచుకొంటే భయం వెయ్యదు కదా. ద్వైత దృష్టి వలనే భయం. మాంసపు కళ్ళతో చూస్తే భయమేస్తుంది. జ్ఞాన దృష్టితో చూస్తే అభయం. ఏకాంతవాసం సాధనకు ఉపయోగపడుతుంది. మీ మనస్సు చేసే చేష్టలు ఏమిటి? అని తెలుసుకొంటారు కోరికను సంతృప్తి పరిస్తే అది పెరుగుతుంది. కోరికను గౌరవించకండి. "మీరు ఒక మంచి మాటను విన్నప్పుడు జ్ఞాపకశక్తి మీద ఆధారపడకుండా కాగితం మీద రాయండి" అన్నారు గాంధీజీ. నోటిమాటకన్న రచనకు ఎక్కువ స్థిరత్వం ఉంటుంది. సముద్రం దగ్గరకు వెళ్ళినప్పుడు నీటిని మాత్రమే చూడు. కెరటాలను చూడకు. సముద్రం లోనిదే కెరటం కూడా. అలాగే నిజజీవితంలో ప్రతీ వ్యక్తి రూపదృష్టితో కాకుండా

srinannagaru.com

దేవుని దృష్టితో చూడాలి. మనస్సుతో జ్ఞానిని చింతిస్తే ఆ మనస్సు ఆత్మలో కలిసిపోతుంది. మానవుడికి తెలివితోపాటు పవిత్రత కూడా కావాలి. జ్ఞానిపైగాని, అవతారపురుషునిపైన గాని మన తపన హృదయపూర్వకమైతే ఈశ్వర కృప తప్పకుండా ఉంటుంది. సత్యం తెలిసాక దేహం ఉంటే ఎవరికి? ఊడితే ఎవరికి?

9. తెలివి ఉన్నవాని మనస్సు కన్న, ఓర్పు ఉన్నవాని మనస్సు అంతర్ముఖి అవుతుంది. కొందరికి స్వార్థం మాత్రమే ఉంటుంది. దుర్మార్గం ఉండదు. కాని రెండూ ఉన్న వాళ్ళను భరించలేము. అవతారపురుషుడైన ఆ శ్రీరామచంద్రుడే భరించాడు. అరణ్యవాసానికి తయారౌతున్న రాముడు కౌసల్యతో "అమ్మా నాకు ఈ అవకాశం అదృష్టంగా భావిస్తున్నాను. ఎందుకంటే మునిపుంగవుల దర్శనం చేసుకొని ఆత్మ తత్త్వాన్ని గ్రహించటానికి సహకరిస్తుంది" అంటాడు. అహంకారంతో నీవు ఏ పనిచేసినా నీకు, ఇతరులకూ ఉపయోగం ఉండదు. కొందరు అహంకారంతో ఈ సమాజానికి ఎంతో సేవ చేసామని పలికేటప్పుడు ఏమాత్రం జ్ఞానం కలిగిన వారైనా వారికి ఈ మాటలు పేలవంగా తలుస్తారు. ఒక మనిషి సభ్యతాసంస్కారాలు తెలుసుకోవటానికి అతని మాటలు రెండు వింటే సరిపోతాయి. తేలికగా గ్రహించవచ్చును. అన్నం ఉడికిందో లేదో గ్రహించటానికి అన్నాన్ని అంతా పరీక్షించనట్లు, భగవంతుని మీద ప్రేమ లేకుండా పత్రం-పుష్పం-ఫలం-ఉదకం భగవంతుని పాదాల వద్ద పెట్టినా ఉత్త దండగ. ద్వేషంతోనూ అసూయతోనూ ఉన్న వ్యక్తి తన మనస్సును ఆత్మలో ముంచలేడు. చాలామంది మేధావులు ఆలోచనే మహోన్నత స్థితి అంటారు. మరి ఆలోచించేవారు, నిద్రలో ఏమైనట్లు? ఆలోచించేవాడిని, చూచేవాడిని, వినేవాడిని ఎవరైనా పట్టుకొన్నారా? ఆత్మలో ఆనందం ఉంది. వినయం అలవాటు చేసుకోండి. మీరు జ్ఞానులు అవుతారు. కపటం లేకుండా పనిజేసిన వాడికి జ్ఞానం వస్తుంది. అందరి మెప్పునూ కోరుకొనేవాడు చివరికి అతనే నశించిపోతాడు.

10. భగవాన్‌ని ఒకరు ఇలా ప్రశ్నించారు "మీరు మానవులకన్న పశు పక్ష్యాదులనే ఎక్కువ ప్రేమిస్తున్నారు" అనగా "నిజమే అవి సహజంగా నన్ను ప్రేమిస్తున్నాయి. వాటికి కోరికలతోనూ, ఆడంబరాలతోనూ నా దగ్గరకు రావటం లేదు. కపటం లేకుండా వస్తున్నాయి. అదే రీతిగా నేను వాటిని ప్రేమిస్తున్నాను" అన్నారు. మనస్సు ఒకసారి హృదయంలో ప్రవేశించింది అంటే తిరిగి ప్రకృతి ప్రవాహంలో పడిపోవటం జరగదు. సాధన అంటే ఏదో సంపాదించేది కాదు అహంకారాన్ని తొలగించుకోవటమే. ఆత్మ సాధించేది కాదు. మానసికంగా ఎన్ని రోగాలు ఉన్నా ధైర్యం అనే మందు మీకు ఉంటే అన్నీ కొట్టుకుపోతాయి. మీరు

srinannagaru.com

పొరపాట్లు చేసినా భయపడకండి. మీ ప్రీతి మీ ఇష్ట దైవం ముందు గురువు మీదో నదీ ప్రవాహంలాగా, ఒక తైలధారలా ఉంటే ఆ ప్రవాహ వేగంలో మీ వాసనలు అన్నీ కొట్టుకుపోతాయి. నిద్రలో నీవు పొందే సుఖం నిజం. అందులో ప్రకృతికి సంబంధించిన, ఇంద్రియాలకు సంబంధించినవి అంటూ ఏమీ లేవు. అది పరమ పవిత్రమైన సుఖం. అది మెలుకువలో కూడా పొందవచ్చు. మీరు ప్రయత్నం చేస్తే సాధిస్తారు. మీ జీవితంలో స్నానం చేస్తున్నారు, భోజనం చేస్తున్నారు, సినిమా చూస్తున్నారు అలాగే చావు కూడా తలంపే. అందులో ఏ ప్రత్యేకతా లేదు. నిద్ర అంటే ఎందుకు భయం కలగటం లేదు అంటే నిద్రపోయిన తరువాత తిరిగి ప్రపంచాన్ని చూడవచ్చు అనే తలంపు వలన. దేవునిలా పనిచేస్తే దేవునిలా అవుతావు. ఆత్మానుభవం గురించి చిన్న అడుగు వెయ్యకపోతే అది చాలా కష్టమని పెనుభూతంలా కనిపిస్తుంది. జగడమే ఇష్టంగలవారి మాటలు మూట కట్టి ఒక ప్రక్కనపెట్టకపోతే వారిపై ప్రతీకారం తీర్చుకోవాలనే బుద్ధి పుట్టి మనస్సు బహిర్ముఖ మౌతుంది.

11. గురునానక్ ఒకరిని ఒక ప్రదేశంలో ఉండగా, పవిత్రమైన చేతులతో ఒక గ్లాసు మంచి నీళ్ళు ఇయ్యమనగా ఒక భాగ్యవంతుడు అందుకొని తేగా "నీ చేతులు పరిశుభ్రమైనవే కాని పవిత్రమైనవి కావు. నీ చేతులతో ఎవరికైనా సహాయం చేసావా?" అన్నారు. శరణాగతి వలన ప్రయోజనం అందరికీ అంతగా తెలియదు. మీలో కంట్రోల్ వస్తుంది. సాధన చెయ్యకుండానే మనస్సు వశమౌతుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందినట్లు భావించండి. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన మీ సాధన కుంటుపడుతుంది. మీ మంచితనం వలన మీ మనస్సు కంట్రోలులోకి వస్తుంది. ఈశ్వరునిపై ధ్యాస ఉంటే ధ్యానం కుదురుతుంది. రాధాకృష్ణన్ అన్నారు "నేను గొప్ప పదవులను పొందాను, అనుకూలమైన భార్య ఉంది. కాని నా మనస్సు శాంతిగా ఉంటేనే నేను గొప్పవాడను" అన్నారు. ఇంద్రియ సుఖం, ప్రథమంలో సుఖం కనిపిస్తుంది. దాని తరువాత తరుగుదల ఉంది. అందుచేత, తరువాత చేదుగా ఉంటుంది. పుట్టిన సుఖానికి వికారం ఉంటుంది. ఆత్మ సుఖం శాశ్వతమైనది. ప్రతీ మానవుడు తానుగాని విషయాల మీద ఆసక్తిగా పోతాడు. శారదామాత అన్నారు "ఈ భూమికి ఎంత ఓర్పు ఉందో అంత నీకు ఉంటే నీవు ఆత్మను తెలుసుకో గల్గుతావు. లౌకికుల, దుష్టుల యొక్క దుర్మార్గాలు నీవు సహించలేకపోతే నీకు ఆత్మదర్శనం కలుగదు." నీ తలంపులకు, నీవే నీరుపోసి పెంచుతున్నావు, దాని వెంటపడి నాకు శాంతిలేదు అని బాధపడుతున్నావు. వాసనలు ఉన్నంతకాలం

srinannagaru.com

మనస్సు అంతర్ముఖం కాదు. సోమరితనం వలననే నీవు సాధన చెయ్యలేక పోతున్నావు.

12. నీవు ఆత్మను దర్శించాలంటే నీవు కేవలం బాహ్య దృష్టితోనే చూడటం అలవాటు పడిపోయావు. అందుచేతనే నీవు ఆత్మను చూడలేక పోతున్నావు. అంతర్ముఖత్వం నీవు సాధించాలి. నీ తెలివి, నీవు కావు; నీ అజ్ఞానం నీది కావు; నీవు ఆత్మవు. అది ఒక్కటే సత్యం. భగవంతుని హృదయ పూర్వకంగా ప్రేమిస్తే ఈ భౌతిక దేహం ఆధ్యాత్మిక దేహంగా మారిపోతుంది. స్మరణలో సుఖం లభిస్తుంది. నీకు ఏదైనా మానసిక బాధ ఉన్నా దాన్ని సంతోషంగా అనుభవించు. లేదా మరణానంతరం వడ్డీతో సహా అనుభవించవలసి వస్తుంది. మనస్సుకు దుఃఖం అంటుకొంటుంది. ఆత్మకు దుఃఖం అంటుకోదు. నీవు ఇప్పుడే, ఇక్కడే గుణాతీతుడవు కావాలి. మీరు ఎవరికైనా సేవచేస్తూ ఉంటే నారాయణునికి సేవ చేస్తున్నాను అనే గౌరవం ఉండాలి. అప్పుడే మీకు భేదబుద్ధి పోతుంది. అభేద దృష్టి కలుగుతుంది. భయంలేని స్థితి పొందుతారు. భేదమున్నచోట భయం ఉంటుంది. అభేదం ఉంటే భయమే లేదు. తోటివారి మనస్సుకు శాంతి కలిగే పనులు చేస్తున్నారు అంటే అది నారాయణ సేవే, మన అందరికీ ఏ సద్ వస్తువు ఆధారంగా ఉందో అదే నారాయణుడు. ఇతరులకు నీవు ఏది మంచిదని చెబుతున్నావో అది నీవు ఆచరించి చెప్పాలి. పుస్తక పాండిత్యం, పుస్తకాలు చదివే వారినే గొప్పవారు అనకండి. ఆత్మ పదవి ఎవరైతే పొందుతారో వారికి వేదన లేదు. కన్నీళ్లతో పనిలేదు.

13. కీర్తికాంక్ష-ధనకాంక్ష-అధికారకాంక్ష మనస్సును పట్టుకొన్నందు వలననే ఆత్మలేదు అనుకొంటున్నాము. పై కాంక్షలు వదలిన తక్షణం మనస్సు ఆత్మ గూటిలో అతివేగంగా చేరిపోతుంది. "తెరతియ్యగరాదా ఓ రామా" అని త్యాగరాజు పాటలో నిగూఢఅర్థం ఆత్మదర్శనానికి మోహమనే తెర అడ్డంగా ఉంది దాన్ని తీసేయి రామా అని అర్థం. కాలం మనస్సులో ఉంది ఇష్టంలేని పని చేస్తూ ఉంటే కాలం భారంగా ఉంటుంది. ఈశ్వర సంకల్పానికి అనుకూలమైనవి మనం చేస్తే, ఈశ్వరుడు మనలో ఉంటాడు. గోడ కట్టటానికి పరంజా కావాలి. కట్టిన తరువాత పరంజా తీసేస్తారు. అలాగే మంచి గుణాలు ఉంటే ఆత్మ దర్శనమౌతుంది. మనకు తెలివితేటలు ఉన్నాయి కాని ఆత్మను తెలుసుకోలేకపోతే ప్రయోజనం ఏమిటి? "సూర్యుని కన్న, మేఘం గొప్పది" అనేది వాస్తవము ఏమీ కాదు కాని అడ్డంగా రావటం వలన మనకు సూర్యుడు కనబడుటలేదు. అలాగే అహంకారం అడ్డు రావటం వలన ఆత్మ మనకు అనుభవంలోనికి రావటం లేదు. వ్యక్తిత్వం

srinannagaru.com

నశించాలి, అది చాలా ముఖ్యం. కొండమీద పెట్టిన దీపం యొక్క వెలుతురు అంతటా ఎలా ప్రసరిస్తుందో అలాగే మీకు జ్ఞానం కలిగితే మీ ద్వారా సమాజానికి ఎంతో ఉపకారం జరుగుతుంది. ద్రవ్య సహాయం వంటి కర్మలు జ్ఞాన సముపార్జనలో సహకరిస్తాయి. మీకు జ్ఞానం కలిగిన తరువాత వాటితో పనిలేదు. అవి మిమ్ములను వదిలేస్తాయి. కర్మ మార్గం అవసరమే కాని అదే ప్రధానం కాదు. ఎలా అంటే సుఖంగా ఉండటానికి గృహం కావాలి. రెండు లక్షలతో ప్రారంభించారు. పునాది గట్టిగా ఉండాలని ఆ సొమ్ము అంతా పునాదిలోనే ఖర్చుపెడితే డాబా ఎలా అవుతుంది. ఎండ, వాన తప్పదు. మన పని ఎలా పూర్తి అవుతుంది. మనస్శుద్ధికి కర్మలు కొంత అవసరం అవుతుంది.

14. మనం లోపల ఖాళీగా, సుఖంగా ఉండాలి, బయట బాధ్యతగా ఉండాలి. నిర్లక్ష్యంగా ఉండకూడదు. కొంతమంది మాట్లాడుతూ ఉంటే శబ్దం తప్ప ఆ మాటకు ఒక అర్థం, పరమార్థం ఉండదు. అటువంటి వారి మాటలను చూచి భయపడకుండా ఉంటే, ఆ శబ్దం మనలను ఏమీ చెయ్యలేదు. మన వ్యక్తిగత అభిప్రాయాలు ఎదుటి వారి మీద రుద్దకూడదు. ఎదుటివారి గురించి మనం బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి, బాగా ఆలోచించి మాట్లాడాలి. మన ఇష్టం వచ్చినట్లు ఎదుటి వాళ్ళు ఉండాలి అని అనుకోకూడదు. నేను ఇలా ఉండాలి, అలా ఉండాలి అని అనుకోవటం వదులుకోవాలి. వ్యాసులవారు అష్టాదశ పురాణాలను వ్రాసినారు. పురాణాలలో ఒక్కొక్క దేవత మీద మనకుండే భక్తిని ప్రోత్సహించటం కోసం మన మనస్సును బ్రహ్మవైపు మరల్చటానికి ఆయా దేవతలను ఆయా పురాణాలలో ఎక్కువగా ఎంచి వ్రాసారు. నిజానికి అందరు దేవతలు ఆత్మలే. మన మనస్సులో ఆ దేవతలపై ఆసక్తిని పెంచటానికి మాత్రమే అలా వ్రాసారు. కాని దానిలో భిన్నత్వం ఏమీ ఎంచకూడదు. "గురువు మాట ఆప్త వాక్యం" అన్నారు. ఆధ్యాత్మిక జీవితంలో రీజన్ కన్న విశ్వాసం చాలా ముఖ్యం. మనకు ఏకాగ్రత, నిగ్రహం ఉండాలి. శివానంద అన్నారు "మాట్లాడేటప్పుడు రెండు సార్లు ఆలోచించి మాట్లాడాలి. పనిచేసేటప్పుడు మూడు సార్లు ఆలోచించి పని చెయ్యాలి." ప్రేమ జయించలేనిది ఈ సృష్టిలో ఏదీ లేదు. మీ వాసనలు పలచ బడటానికి ఈశ్వరుని మీద ప్రేమ పెంచుకొంటే అన్ని తలంపులూ రాలిపోతాయి. శరణాగతిలో ఆ "గతి" చాలాగొప్పది. దృశ్యం మీద మీకు ఎంత వ్యామోహం ఉందో అదే వ్యామోహం "ద్రష్ట" (ఆత్మ) మీద పెంచుకోండి. మీరు గమ్యాన్ని చేరిపోతారు.

15. మోక్షానికి అడ్డు వచ్చేది దేహాభిమానమే. గోపికలు శరీరదృష్టితోనే

srinannagaru.com

కృష్ణునితో ఇలా అన్నారు "మేము నగ్నంగా నీ ఎదుటకు ఎలా రాగలము" అనగా "దేహబుద్ధి నశిస్తేగాని ఆత్మ బుద్ధి కలుగదు. మనస్సు నగ్నమైతేగాని వస్తువు లభ్యమవ్వదు. దేహం కూడా వస్త్రమనే భావన ఉండాలి, అలాగే దేహానికన్న మనస్సుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి" అన్నారు. మనస్సు దుఃఖాన్ని కలుగ జేస్తుంది. కాబట్టి ఇవి అన్ని సామాన్యంగా తీసుకోవాలి. పొగిడినా సామాన్యంగా తీసుకోవాలి. అటువంటి సమయంలోనే మనస్సు అంతర్ముఖం అవుతుంది. ప్రతీ చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకోకండి. ఎవరైనా మాట్లాడుతూ ఉంటే వారి గుణం మాట్లాడుతున్నదని ఊరుకోండి. మీరు కంగారు పడకండి. కళ్ళకు కనబడే భక్తులను ప్రేమించలేనప్పుడు కనిపించని ఆ దేవుని ఎలా ప్రేమిస్తారు. మనం టి.వి. చుట్టూ ఎలా మూగుతున్నామంటే బెల్లం చుట్టూ ఈగలు మూగినట్లు. ఇది జ్ఞాన మార్గానికి వ్యతిరేకం. కేన్సర్ నీ శరీరాన్ని ఎలా కృంగదీస్తుందో అలాగే నీ అసూయ నీ మనస్సును తినేస్తుంది. పరమ నీచమైన జన్మకు దారితీసేలా చేస్తుంది. మాటలో ఆడంబరం ఉండకూడదు. అవసరం ఉన్నంత వరకూ మాట్లాడాలి. అవసరం లేకపోతే మాట్లాడటం మానివేయాలి. పని నుంచి తప్పించుకొంటే సోమరితనం వస్తుంది. జ్ఞానం రాదు. బలవంతంగా బాధ్యతల నుంచి తప్పించుకొంటే తిరిగి వదిలిన బాధ్యతలు తీర్చటం కోసం ఇంకో జన్మ ఎత్తాలి. పని మనలను వదలాలిగాని పనిని మనం వదలకూడదు. వైరాగ్యం కూడా మానసిక పరిధిలోనిదే. జ్ఞాన సముపార్జనకు అది సహకరిస్తుంది అంతే.

16. భగవంతుణ్ణి శ్రవణం చెయ్యటంవలన, మననం చెయ్యటం వలన ప్రపంచంలో జరిగే దుఃఖాలు అన్నీ మిమ్ములను ఏమీ చెయ్యలేవు. కేవలం యోగాభ్యాసం చేసినంత మాత్రాన చాలదు. దేవుని ప్రేమించినట్లయితే ఆయన మనకు వ్యక్తమౌతాడు. వర్షాకాలం వెళ్ళిపోతున్నది. సీతాకాలం వచ్చేస్తున్నది, మరలా వేసవి కాలం వస్తుంది అని అనుకోవటమే తప్ప మరణం మీద పడుతోంది, జ్ఞానం పొందాలి అని అనుకోవటం లేదు. కృత్రిమమైన ఆడంబరాలకు అలవాటు పడిపోయి, గౌరవాలకు అలవాటుపడిపోయి ఆజన్మకాజన్మకు తనకు తాను అన్యాయం చేసుకొంటున్నాడు మానవుడు. ప్రతీ దానికీ ఇప్పుడు రీజన్ అడుగు తున్నారు. మీలో కోరిక పెరిగే కొలది రీజన్ పెరుగుతుంది. రీజన్ వలన ఎంత వరకూ ఆత్మ తెలుస్తుంది. పరిశీలన వలన ఆత్మ తెలుస్తుంది. ఒక కృష్ణ భక్తుడు ఇలా అన్నాడు "నా కళ్ళ ఎదుట అనేక మంది చనిపోతున్నారు. ఎవ్వరూ వాళ్ళతో వెళ్ళటంలేదు. నేను పోయిన తరువాత నా కృష్ణుడు నాతో వస్తాడు. అందుచేతనే కృష్ణుని అంతగా ప్రేమిస్తున్నాను" అన్నారు. నిజంగా మరణానంతరం మన కూడా

srinannagaru.com

ఎవ్వరూ రారు, గురువు మాత్రమే వస్తాడు. నిర్మలమైన అంతఃకరణే నిజమైన తీర్థము. శంకరాచార్యులు విష్ణువును స్తోత్రం చేస్తూ నాలో ఉన్న అవినయం తొలగించు నాలో ఉన్న అమృత స్థితి నాకు అందుతుంది" అన్నారు. వినయాన్ని విడిచి పెట్టకూడదు. దేహప్రారబ్ధంలో ఎంత కాలం సుఖపడితే అదే సుఖాన్ని కావాలని ఒక వాసన ఏర్పడుతుంది. కోరికగా ఏర్పడుతుంది, తొందరగా మరణించాలని చాలాకాలం జీవించాలని కోరుకోకూడదు. దేహప్రారబ్ధంలో ఎలా జరగాలో అలా జరుగుతుంది. సాధారణంగా శిరస్సులో మనస్సు ఎంత సహజంగా ఉంటుందో అంత సహజంగా మనస్సు ఆత్మలో ఉంటే అది ఆత్మలో లీనమౌతుంది.

17. బాహ్యమైన సంపదలు ఎన్ని ఉన్నా దేహాభిమానం వల్లనే దుఃఖం వస్తుంది. మీ ఇంటిలో శుక్రవారం, మంగళవారం కడిగి శుభ్రం చేసుకొంటున్నారు. అలాగే మీ ఇంటిలోని వారి దుఃఖాన్ని ఆ రెండు రోజులలోను సత్సంఘం పెట్టుకొని కడిగి శుభ్రం చేసుకోండి. మీరు ఒక మహానగరానికి వెలుతూ ఉంటే బండి, కారు, రైలులో ప్రయాణం చేస్తూ మధ్య మధ్య ఇతరులతో మాట్లాడుతూ ఉంటారు. కాని మీ గమ్యమైన ఆ పట్టణాన్ని మర్చిపోరు. అలాగే మీరు ఏపని చేస్తున్నా ఆత్మను పొందాలనే గమ్యాన్ని మర్చిపోకండి. ఒక మనిషి దేహం అనుకొంటే పుట్టినట్లు మరణించినట్లు భావిస్తారు. కర్మ సముద్రంలోంచి బయట పడలేరు. కాని పుణ్యం చేసుకొన్నవారు యోగుల కుటుంబంలో పుట్టి అతిసహజంగా సిద్ధుడు అవుతాడు. మానవునకు ఆరోగ్యం ఎంత అవసరమో ఆనందం కూడా అంతే అవసరం. లోకవిషయాలైన, ఇంటికోసం, సంపదకోసం, భోగాలకోసం, పేరుకోసం ఎంత కష్టపడుతున్నారో అందులో సగం కష్టం ఆత్మను తెలుసుకోవటానికి ఖర్చు పెడితే ఆత్మ తెలుస్తుంది. నిజమైన ఆనందం ఆత్మలోనే ఉంది. పైలోక విషయాలు అనుభవించాక తెలుస్తుంది అందులో ఏమీ లేదని. మీరు భక్తి మార్గంలోగాని, యోగమార్గంలోగాని, కర్మమార్గంలోగాని ప్రయాణం చెయ్యండి. మీ గమ్యం జ్ఞానంలోకే, జ్ఞానంలోనే శాంతి, సుఖం ఉంది. భేదబుద్ధి ఉన్నంతకాలం మరణం వస్తుంది. జన్మ వస్తుంది. థర్మామీటరు ఉపయోగించి మీ జ్వరం ఎలా తెలుసు కొంటారో అలాగే మీ అహంకారం ఎంత వరకూ ఉందో మీరే తేల్చుకోండి. దేహాభిమానం పోవటానికి చేసే ప్రయత్నంలో నిజాయితీ ఉంటే మిమ్మల్ని ఆ అభిమానం నుంచి, ఈశ్వరుడు తీసివేస్తాడు.

18. జె.కె. గార్కి ఒక స్టేజీలో కొన్ని అద్భుతమైన శక్తులు వచ్చాయి. తెలుసున్నవారు పోవటం వలన ఆ శక్తితో ప్రాణం పోసారు. వాడు పది సంవత్సరాలు బ్రతికి పది మర్డర్లు చేసాడు. దాని వలన ఆయనకు పుణ్యం కన్న పాపమే

srinannagaru.com

వస్తున్నదని గ్రహించి వాటిని ఒదులుకొన్నారు. ఎవరో చచ్చిపోయారని బాధపడి, ఈ బాధపడే దేహగతమైన నేను చచ్చిపోతే ఏడిచేవాడు ఉండడు. మృత్యువు అంటే భయముండదు. మన దృష్టి శారీరకమైనప్పుడు మనం ప్రేమించినట్లు కనిపిస్తున్నా ప్రేమించినట్లు కాదు. మీ జీవితం పట్ల మీకు మమకారం పోయినా మీకు జ్ఞానం వచ్చేస్తుంది. పరమహంసగారు "సాధ్యం" గురించి చెబితే భగవాన్ "గమ్యం" గురించి చెప్పారు. మీకు అనుభవం చిక్కితే పుస్తకాలతోనూ, మాటలతోనూ సంబంధం లేదు. రైలు ఇంజనుకు తగిలించిన భోగీలు ప్రయత్నం లేకుండానే చేరవలసిన గమ్యానికి ఎలా చేరుతాయో, జ్ఞానితో మీకు అనుబంధం ఏర్పడితే మీరు గమ్యాన్ని చేరగలరు. జ్ఞానిపట్ల మీకు గౌరవం చాలదు. అనుబంధం కావాలి. మన ఇంటికి వచ్చిన బంధువులను మనం గౌరవిస్తాము. మర్యాదలు చాలా చేస్తాము. అదే సమయంలో మీ అమ్మాయి వస్తే దాన్ని మర్యాద చెయ్యము. కారణం మన అమ్మాయి మన హృదయంలో శాశ్వతంగా మమకారంతో కూడిన గౌరవభావం ఎల్లప్పుడూ ఉంటుంది. బాహ్యగౌరవం తక్కువ తరగతిది. అలాగే మన ఇష్టదైవంపైనా, జ్ఞానిపైన మీకు గౌరవభావం ఉంటూ అనుబంధం ఏర్పరుచుకోవాలి. అప్పడే గమ్యాన్ని చేరతారు. ధ్యానం కూడా కల్పితమే. కారణం ఒకటిగా ఉన్న నీవు మూడుగా మారావు. ధ్యానం చేసేపని చేయువాడు, చేయబడే వస్తువు.

19. ఒక భక్తుడు పండరీనాధునితో ఇలా అన్నాడు "నీ దగ్గర ఎన్ని కష్టాలు ఉంటే అన్ని పంపావు. కాని నేను ఏ వికారం పొందలేదు. దాని ప్రకారం నీవు ఓడిపోయావు" అన్నాడు. మనకు ఎవరి మీదనైనా అసూయ, ద్వేషం వచ్చింది అనుకోండి వాళ్ళ ఏమీ పాడవ్వరు మనమే పాడౌతాము. శరీరానికి, బట్టలకు మరక అయితే మనం కడిగి శుభ్రం చేసుకొంటున్నాము. కాని మనస్సులో కలిగే చెడు తలంపులను కడుగుకోలేకపోతున్నాము. ఆత్మను తెలుసుకోవాలంటే జీవితకాలం "సహనం" క్షమాశీలియై ఉండాలి. ఆత్మను శ్రవణం చెయ్యాలి, మననం చెయ్యాలి. అది పొందాలనే తపన కావాలి. విషయబుద్ధి, దేహబుద్ధి ఉన్నంత కాలం దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. భగవంతుని సంతోషం కోసం చిన్నపని చేసినా, మనస్సు దాని స్వభావాన్ని వదులుకొంటుంది. దీనికి తెలివి తేటలు ఒక్కటే చాలదు. ఈశ్వరానుగ్రహం కావాలి. మాట-చేత-తలంపు భగవంతుని గురించే ఉంటే మనస్సు దాని స్వభావాన్ని వదులుకొంటుంది. సత్‌పురుషులు ఎక్కడ ఉంటే అదే పుణ్యక్షేత్రము. మైత్రి, స్నేహభావంతో ప్రపంచం పట్ల మనం ఉంటే ఈశ్వరానుగ్రహం వస్తుంది. వాసన అంటే అలవాటు. ఈశ్వరానుగ్రహం ఉంటే వాసనలు పోతాయి. అలవాట్లు మనలను వదిలిపెడితే

srinannagaru.com

మోక్షం వైపు మనం ప్రయాణం చేస్తాము. మురుగునార్ అన్నారు "భగవాన్ కళ్లను చూచిన ఈ కళ్లకు ఈ సృష్టిలో ఏ సౌందర్యం కనిపించటంలేదు, చూడాలని అనిపించటంలేదు" అన్నారు. మనస్సులోని గొడవలు వదిలించు కోవటానికి ధ్యానం, పూజ, జపం చేస్తున్నాము.

20. శారీరకంగా ఇతరులకు ఉపకారం చెయ్యటమే "సేవ" అని అనుకోకండి. మీరు ప్రశాంతంగా ఉంటే అది కూడా సేవా మార్గమే. అహంకారా నికి, ఆత్మకు ఉన్న భేదం మీరు కొంచెం కొంచెం తెలుసుకొంటూ, కొంచెం విడగొట్టుకుంటే మీకు జ్ఞానం వచ్చేస్తుంది. మన ఆధ్యాత్మిక విషయాలలో అభివృద్ధికి మనమే కృషి చేసుకోవాలి. ఇతరులు ఎవ్వరూ సహకరించరు. ప్రహ్లాదుడు శ్రీహరితో ఇలా అంటాడు "నన్ను చిత్రహింసలకు గురిచేసి బాధించిన వారిలో కూడా నీవు ఉన్నావు. కనుక వాళ్లను కూడా నీవు సంస్కరించు" అంటాడు. పొట్ట, బట్ట, జుట్టు పట్ల మనకున్న శ్రద్ధ భగవంతుని మీద లేదు. ఈ జాగ్రదవస్థ, స్వప్నావస్థ మనస్సు యొక్క కల్పితం. వాసన లేకపోతే పై అవస్థలు ఏమీ లేవు. వాసనలేని వానికి ప్రపంచం తనకంటే వేరుగా కనిపించదు. మనం బట్టలు కొనుక్కొన్నప్పుడు ఏది ఎంతకాలం మన్నుతుంది అని ఆలోచిస్తాము. కాని మనకు ఏ తలంపులు వస్తున్నాయి, దాని వలన మనకు ఏమి కలిసి వస్తున్నాయి అని ఆలోచించేవారికి చైతన్యస్థాయి పెరుగుతుంది. ఆత్మకు లోకంతోగాని మాటలతో కాని పనిలేదు. మౌనం గొప్పది. ఎక్కువగా ఆలోచించేవాడు తక్కువగా మాట్లాడు తాడు. తక్కువగా ఆలోచించేవాడు ఎక్కువగా మాట్లాడుతాడు. అక్కరలేని విషయాలపైన, చిన్నవిషయాల పట్ల కంగారు పడితే ఎక్కువ నష్టపోతాము. కంగారు పడటం వలన జ్ఞానం పొందకుండా అది ఒక మానసిక ప్రవృత్తిని కల్పిస్తుంది. నీవుకాని దాన్ని నీవు అనుకొంటూ ఉంటే తలంపు పుడుతుంది. తలంపు వాసన పుట్టటానికి దారితీస్తుంది.

21. మనం ఒకరి ఇంటికి వెళ్లినాము అనుకోండి వారి ఇంట్లో జరిగిన పెళ్లికి వచ్చిన ధనవంతుల గురించి, వారికి ఉన్న సదుపాయాల గురించి మాట్లాడుకొంటారు. కాని వారికి పేద బంధువులు కూడా ఉన్నారు. వారి గురించి మాట్లాడుకోరు. దానిని చూచి మనం అసహ్యించుకోకూడదు. అది వారి వాసనగా మాత్రమే గుర్తించాలి. "ఆత్మ సాక్షాత్కారం పొందుతాను" అన్న వ్యక్తితో భగవాన్ అన్నారు. "సాక్షాత్కారం అంటే తెలుసుకొనే వస్తువు ఒకటి ఉండాలి. అది కాదు తానుగా ఉండు" అన్నారు. "తెలుసుకొన్నాను" అనే మాట మనో వ్యాపారం. ఆలోచన అమృతంతో సమానం. నిజం తెలుసుకొన్నాక దాన్ని

srinannagaru.com

సాక్షాత్కారం అంటున్నావు. నీవు తెలుసుకొనేటప్పుడు కూడా నిజం, నిజంగానే ఉంది. జాగ్రదవస్థ కంటే, స్వప్నావస్థ కంటే నిద్రావస్థలో మీరు స్వరూపానికి దగ్గరగా ఉన్నామని తెలుసుకొంటే మీ సాధన అభివృద్ధి చెందుతుంది. ఒకే ఆత్మ రెండు దేహాలలో ఉండటం వలన స్నేహం అంటారు. భక్తి, జ్ఞాన, కర్మ, యోగాలలో మీరు ఏ యోగంలో ఉండి ప్రయాణం చేస్తున్నా భగవాన్ మాటలు వినటం వలన మీ సాధన తేలిక అవుతుంది. ప్రహ్లాదునకు నరసింహస్వామి దర్శనమిచ్చి "ఏమి కావాలో కోరుకో" అంటే "నాకు ఏ కోరికా లేదు. కాని కోరుకోమంటున్నావు కాబట్టి కోరుకొంటున్నాను. ఏ కోరికా లేని స్థితి ఏర్పాటు చేయ"మని అనగా ఆయన అంటారు "దాని వలన నీకు ఏం ప్రయోజనం" అనగా "అప్పుడు నీవు నేను ఒకటి అవుతాము" అన్నాడు. భగవాన్‌కి అరుణాచలం విడిచిపెట్టి వెళ్ళాలి అనే కోరికే కలగలేదు. ఆ "భావనిష్ఠ" అటువంటిది.

22. దేహం ఎంతకాలం ఉంటుందో అంతకాలం లోకంతో సంబంధం తప్పదు, ఆహార వ్యవహారాలలోనూ, నిద్రలోనూ మితంగా ఉండాలి. జాగ్రదవస్థలో మనస్సు యొక్క చేష్టలు తెలుసుకోవచ్చు. నిద్రలో ఎలా ఉన్నామో తెలుసుకోవటం కుదరదు. అందుచేతనే నిద్ర మితంగా ఉండాలి. లోకంతో మన వ్యవహారం ఉద్రేకపూరితంగా ఉండకూడదు. ఆలోచనారహితంగా ఉండకూడదు. ఈ రకంగా ప్రవర్తించినట్లైతే మన మనస్సు అంతర్ముఖం వైపు వెళుతుంది. రామానుజులు, మధ్వాచార్యులు, శంకరులు సాధనలో ఒక రకంగానే చెప్పారు. కాని మనస్సు నశించిన తరువాత ఏ స్థితిని పొందుతాము అనే విషయంలోనే భేదం ఉంది. ఈ విషయంలో భగవాన్ అన్నారు "ముందు ఆ స్థితిని పొందు. జ్ఞాని ఏ స్థితిలో ఉన్నాడు అనే విషయం నీకు అనవసరం. నీవు ఆ స్థితిని పొంది తెలుసుకో వలసిందేగాని ఇప్పుడు నీకు చెప్పినా ప్రయోజనం లేదు" అన్నారు. వాసనాక్షయం అయితే గాని ఎవరికీ శాంతి లేదు. స్నేహం చెయ్యటం వలన మత్తు వస్తుంది. మీరు ఏపని చేసినా మత్తు వస్తుంది. దాని వలన వివేకం పల్చబడుతుంది. స్నేహం తగుమాత్రంగా ఉండాలి. లేకపోతే ముక్తికి అడ్డు వస్తుంది. వెయ్యి మందితో స్నేహం చెయ్యటం కన్న నలుగురు పండితులతో స్నేహం చెయ్యటం మంచిది. దాని కన్న ఒక భక్తునితో స్నేహం చెయ్యటం మంచిది. దైవానుగ్రహం లేకుండా ఈ కర్మ సముద్రం నుంచి బయట పడలేము. ఒక మహారాష్ట్ర భక్తునిపై ఒకరు ఉమ్మి వేసారు. తిరిగి మరలా స్నానం చెయ్యటం, ఇలా నూట ఎనిమిది సార్లు జరిగింది. మిమ్మల్ని హింసిస్తున్న వారిపై మీరు సహనం ప్రదర్శించాలి.

23. సాధారణంగా రైలు ప్రయాణం జరిగినప్పుడు రైలు కదిలే వరకూ

srinannagaru.com

ఆ మాట, ఈ మాట చెప్పి వాహనం కదిలే ముందు అతి ముఖ్యమైన మాటగా ఆ గొలుసు జాగ్రత్త, ఆ ధనం జాగ్రత్త అంటారు. అలాగే భగవాన్ చివరి మాటగా "నీవు మేల్కొని ఉండగానే నిద్ర స్థితిని పొందు" అనేవారు. మనం పొందవలసిన స్థితి అదే. సాధారణంగా ఎవరైనా భాగ్యవంతులు అయితే వారి పరిస్థితి చాలా బాగుంది అని మెచ్చుకొంటారు అలాగే ఎవరైనా కష్టాలపాలయ్యారు అనుకోండి హీనస్థితిలో ఉన్నారని బాధపడతారు. కాని ఈ రెండు పరిస్థితులు ఆత్మకు ఎటువంటి సంబంధం లేదు. నీవు మంగళప్రదమైన ఆత్మవు అనే విషయం మర్చిపోకూడదు. మీరు ఎవరుగా ఉన్నారో తెలుసుకోవాలి. ఏది మాట్లాడినా ఆలోచించి మాట్లాడాలి. జ్ఞాని వ్యక్తులు మాట్లాడే మాటల వలన గాని, పత్రికలలో చూస్తున్న విషయాలలో గాని ఉద్రేకపడడు, అలసట రాదు. సహజంగా ఆలోచిస్తాడు. ఓర్పును ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు నోటిలో కుంకుడికాయ రసం పోసుకొన్నట్లు ఉంటుంది. ఫలితం వచ్చినప్పుడు చెరుకు రసం తాగుతున్నట్లు అనిపిస్తుంది. ధ్యానం అంటే చావు. చావులు నీవు అలవాటు చేసుకొంటే పెద్దచావు ఒకటి వస్తుంది. అంటే అహంకారం చచ్చిపోవటమే చావు. అదే ముక్తి. ఎవరైతే సన్యాస జీవితం గడపాలని అనుకొంటున్నారో వారు రెండు వదులుకోవాలి. ఒకటి అధికారం, సంపద. గౌరవాలు, అగౌరవాల నుంచి విడుదల పొందకపోతే వారికి ఆత్మానుభవం కలుగదు. దేహాత్మ బుద్ధిలేని వానికి ధ్యానంతోకాని, పూజతోగాని పనిలేదు. దేహాత్మ బుద్ధికి మించిన పాపం మరి యొకటి లేదు.

24. మీకు కోరిక పుట్టింది అంటే అది మంచిది కానియ్యండి, చెడ్డది కానియ్యండి. అసలు కోరిక పొడుచుకొని వచ్చిందంటే పాపం ఉన్నట్లే లెక్క. శరీరం నేను అనే తలంపే మొదటి పాపం. ఏ వస్తువుగా నీవు ఉన్నావో, ఆ వస్తువును శ్రవణం చెయ్యి. మననం చెయ్యి, ధ్యానం చెయ్యి. ఒకరు మాట్లాడితే వారికన్న ఉపయోగం ఉండాలి, ఎదుటివారికన్న ఉపయోగం ఉండాలి. వ్యర్థమైన మాటలు ఎంత నిరుపయోగంగా, అసహ్యంగా ఉంటాయి అంటే చనిపోయిన మేక, గొర్రె పేగులు ఎలా నిరుపయోగంగా, నీచంగా బయటపడే పరిస్థితిలోనివిగా ఉంటాయో అలా ఉంటాయి. ఏది జరుగుతున్నా ఈశ్వర సంకల్పం వలన జరుగుతోంది, అని తెలుసుకోండి. ఆరాటం ఎక్కడ ఉంటుందో వేదన అక్కడ ఉంటుంది. సాధనలో సాఫల్యం పొందలేకపోతున్నామని సహజంగా, తరచుగా అనుకొంటూ ఉండటానికి కారణం, వైరాగ్యం లేకపోవటమే. దానికి పవిత్రత కూడా చాలా ముఖ్యం. ఆత్మయందే మనస్సును గురిపెట్టి ఉంచు దానినే

srinannagaru.com

ధ్యేయంగా పెట్టుకో. దేవుని అనుగ్రహం లేకపోతే సాధన చెయ్యలేరు. మీరు సాధన చేస్తూ ఉంటే అదే పక్వానికి వస్తుంది. సాధనలో కొంచెంకాలం ఉంటుంది. పక్వానికి వచ్చిన తరువాత సెకనులో మనస్సు ఆత్మాకారం చెందుతుంది. పని చేసే శక్తిని, ప్రేమించే శక్తిని సంపాదించుకోవాలి. నీ ప్రయత్నములో నిజాయితీ ఉంటే తప్పక సమకూరుతాయి. ఆత్మ విచారణ-జ్ఞాన మార్గం, ఆత్మ నివేదన, భక్తి మార్గము. నీవు ఒక ముఖ్య పట్నం వెళ్ళాలి. దానికోసం నీవు అనేక వాహనాలను అధిరోహించే ప్రయత్నంలో ఉండు. అంతేగాని ప్లాను దగ్గర పెట్టుకొని పథకాలతో కాలక్షేపం చేస్తే నీవు గమ్యాన్ని చేరలేవు. అలాగే నీవు ఆత్మను గురించి ఊహలు పెట్టుకోకు. బంధింపబడతావు. ఆత్మలో లయమవ్వటానికి ప్రయత్నించు.

25. జాగ్రదవస్థలో మన మనస్సును నిగ్రహించుకోవచ్చు. స్వప్నంలో మన మనస్సు కంట్రోల్ ఉండదు. అందుచేత స్వప్నావస్థలోనే మన వాసనలు బాగా తెలుస్తాయి. స్వప్నము కూడా గురువే. దాని వలన మన వాసనలు తొలగించుకోవటానికి అవకాశాలు ఉంటాయి. ఆత్మానుభవంతో కొంచెం ప్రయత్నం చెయ్యండి. మీరు ప్రయత్నం లేని స్థితికి వస్తారు. మహాత్మాగాంధీ చేతులతో పని చేస్తున్నప్పుడు, కంటితో చూస్తూ ఉన్నప్పుడు, నోటితో మాట్లాడేటప్పుడు చెవులతో వింటున్నప్పుడు ప్రేమతో ఉండబట్టే ఆయన మహాత్ముడైనారు. ఈ పనులతో మనస్సు ఆత్మాకారం చెందుతుంది. తుపాకులతోనూ, డబ్బుతోనూ ఈ సృష్టిని జయించలేము. ఒక్క ప్రేమ వలన మాత్రమే జయించగలం. మనో నిగ్రహం ఉంటే ఈ సృష్టి అంతా ఏకమైనా నీకు ఏ హాని జరగదు. మనో నిగ్రహం అనే ఆయుధం నీకు ఉంటే జ్ఞానం నీకు కలుగుతుంది. మనం సాధారణంగా బయట మాట్లాడే వ్యక్తులను మాత్రమే చూస్తాము. కాని అతనితో పనిచేయించే మనిషి ఒకడు ఉన్నాడు. ఆ మనిషిని చూడలేకపోతున్నాము. అందుచేతనే ప్రమాదంలో పడుతున్నాము. మనం ధ్యానం చెయ్యగా, చెయ్యగా మనస్సు ఒక అంతస్తును అందుకొంటుంది. అంటే బ్రహ్మాకారం చెందుతుంది. సారా తాగి చెడిపోయిన వారికంటే చెడు స్నేహాలు చేసిన వారు ఎక్కువగా చెడిపోతారు. మన తలకాయను చెడు స్నేహితులు నెమ్మది నెమ్మదిగా పాడుచేస్తారు. భీష్ముడు అంపశయ్యపై ఉన్నప్పుడు కర్ణుడు "నన్ను దీవించుము"నగా, దీవించక ఇలా అన్నారు "దుర్యోధనునితో స్నేహం చేసి పోగాలం నీకు దాపురించినపుడు నిన్ను ఎలా దీవించను" అన్నాడు.

26. వంతెన వద్ద ఉన్నవారు నీటిని చూస్తారు. అది వారి దగ్గరకు వస్తుంది, వెళ్ళిపోతుంది. అలాగే మీ కష్టాలు మీదగ్గరకు వస్తాయి, నిల్వ ఉండవు.

srinannagaru.com

పూజలు, జపాలు, పుణ్యాలు చేసి అందులో నిజం లేదని తెలుసుకొని మనస్సు ఆత్మ వైపుకు కదిలే వరకూ, మీరు పై విషయాలలో అలసిపోయేవరకూ మనస్సు అంతర్ముఖం అవ్వదు. సహజంగా కోరికను సంతృప్తి పరిచినప్పడు శాంతి లభిస్తుంది. ఉదాహరణకు మీరు జిన్ను తిన్నప్పడు మీకు శాంతి జిన్నులోంచి రావటం లేదు. మీ మనస్సు ఆ సమయంలో ఏకాగ్రత చెందటం వలన శాంతి వస్తుంది. దానికన్న కోరికను కంట్రోల్ చేసుకోవటం వలన ఎక్కువ శాంతి లభిస్తుంది. అంటే పోల్చి చూడటం వలన ఎవరి మీదనైనా ద్వేషం, అసూయ పెట్టుకోకూడదు. కారణం మనస్సు బహిర్ముఖమై పోతుంది. భగవాన్ పాపం గురించి చెప్పారు గాని పాపిని గురించి చెప్పలేదు. మైండ్‌ని పరిశీలిస్తూ ఉండండి. ఏరోజుకారోజు సుఖ-దుఃఖాలపై బేరీజు వేసుకోనియ్యాలి. ఏ దుఃఖం చూచి మీరు అడ్డుకొంటే అదే దుఃఖం మీకు వచ్చే జన్మలో సంప్రాప్తమౌతుంది. సాధనలో మీకు కలిగే తలంపులకు నిర్వికారంగా ఉండటం నేర్చుకోవాలి. జ్ఞానం మీరు పొందాలంటే ఆత్మ మీద సజీవ విశ్వాసం కావాలి. మనో నిగ్రహం గురించి, శాస్త్రాలలో ఉన్న దాన్ని బట్టీపడితే ప్రయోజనం లేదు. మనో నిగ్రహాన్ని పాటించటంలో నీ కాలాన్ని ఖర్చుపెట్టాలి. ఎవరైనా మిమ్ములను స్తుతించినా, సంతోష పడకండి. అలాగే ఎవరైనా విమర్శించినా దుఃఖించకండి. సుఖ దుఃఖాలు నిజం కావు. కాబట్టే అవి నిలువవు. నేను అనగానే మీకు దేహ స్ఫురణ ఎంత సహజంగా కలుగుతున్నదో అంత సహజంగా మీ వ్యవహారాలలో నేను "ఆత్మను" అనే స్ఫురణ వచ్చిన వారికి దుఃఖం నుంచి విడుదల పొందుతారు.

27. మిమ్ములను విమర్శించినవాడు నిజమా? వాడి మాటలు నిజం కావు. కాబట్టి వాని మాటలకు కంగారు పడకండి. దుర్బలంగా ఉన్న మనస్సు హృదయంలో నిలబడదు. మైండ్‌కు బలం పెరిగే కొలది అది హృదయంలో ఉండి పోతుంది. అట్టివారు ప్రకృతిలోని అందాలను గుర్తించగలరు. ఆత్మ సౌందర్యాన్ని గుర్తించగలరు. వాడు కొట్టాడు, వీడు తిట్టాడు అనుకొంటూ నీగత జీవితాన్ని తలచుకొంటూ ఉంటే నీ బుద్ధి నిన్ను సహస్రారంలో ఉంచి ఆడిస్తున్నాడు అనుకోండి. ఆత్మ ఒక్కటే సత్యం అనే నీ మనోనిబ్బరం మీద ఎవరైనా దెబ్బకొడుతూ ఉంటే నీ శక్తి కొలది దాన్ని వ్యతిరేకించు. నీ మనస్సుకు దెబ్బతగలకుండా కాపాడు కోవాలి. ప్రాపంచిక విషయాల మీద ఆధారపడే మనుషులమీద, ఆ పరిస్థితులలోకి మీరు జారిపోకండి. నీ దేహం మీద, మనస్సు మీద ఉన్న ఆసక్తి గౌరవం ఆత్మ మీద ఉంటే వెంటనే నీకు ఆత్మ వ్యక్తమౌతుంది. మీ మనస్సును పరిశీలించుకోండి. అజాగ్రత్తగా ఉంటే తలంపులు వస్తూ ఉంటాయి. తలంపు మీకు వచ్చినప్పడు

srinannagaru.com

ఆసక్తి ఎలా ఉంటుంది అంటే గాలివాన వచ్చినప్పుడు చెట్టును ఎలా ఊపి వదలి పెడుతుందో అలాగే తలంపు నుండి బయటపడ్డ బుద్ధికి తెలుస్తుంది ఆ విషయం తెలిస్తేగాని అది బయటికి పోదు. అది ఈశ్వర ప్రణాళికలో ఉంది అందుచేత దాన్ని గురించి కంగారు పడకండి. కొబ్బరికాయ చాలా సార్లు పగులగొట్టటానికి ప్రయత్నించినా చివరి దెబ్బకే పగిలినా, పై దెబ్బల ప్రభావం చివరిదానిపై ఉంది. అలాగే ఆధ్యాత్మిక జీవితంలో నీవు చేసే ప్రతీపనికీ ప్రయోజనం తప్పనిసరిగా ఉంటుంది. మీకు ఆత్మానుభవం ముందు చేసే ప్రయత్నమే నిజమని అనుకోకండి. ఏ ప్రయత్నం ఊరికే పోదు.

28. మనం నిత్యజీవితంలో ఎందుకు మాట్లాడుతున్నాము అని మీరు డైరీలో వ్రాసుకొని లెక్కలు చూచుకొంటూ ఉంటే మీకు తెలుస్తుంది. గొప్పల కోసం ఎన్ని మాట్లాడాము, సహజంగా ఎన్ని మాట్లాడాము చూచుకోండి. కాని ఈ పని సహజంగా ఎవ్వరూ చెయ్యలేకపోతున్నారు. దేవుని పటాలుకొని పూజ చెయ్యమంటే మీకు తేలికగా ఉంటుంది. అసలు మాట ఎందుకు వస్తుంది అంటే అహంకారం కోసం అనవసరంగా మాట్లాడుతున్నామని తెలుసుకొన్న వెంటనే బ్రేక్ వేసుకోవాలి. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో సాధకుడు మాటలలో అంత జాగ్రత్తగా ఉండాలి. సాధనాబలం ఎక్కువగా ఉంటే శరీరం నేను అనే మాటలు తెలుసుకొని బ్రేక్ చేసుకొంటాడు. అది లేనివాడు వాటిని ఆపుకోలేడు. వాళ్ళ ప్రేమను పొందుదాము. వీళ్ళ ప్రేమను పొందుదామనే గొడవలే కాని ఆత్మ ప్రేమ పొందుదామనే ఆలోచన రావటం లేదు. సంస్కారం ఉన్నవాడు సాధన చేస్తే అహంకారం నశిస్తుంది. సంస్కారం లేనివాడు సాధనలో అహంకారం పెరుగుతుంది. అబద్ధాలు చెప్పేవాడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి, ఎందుకంటే వాళ్ళు చెప్పే అబద్ధాలు జాగ్రత్తగా పోషించుకోవాలి. నిజం మాట్లాడే వాడు చాలా సింపుల్‌గా మాట్లాడుతాడు. మాటలు రావడానికి మూడేళ్ళు పట్టవచ్చు కాని నోరు ముయ్యటానికి ముప్పది ఏళ్ళు పడుతుంది. అంటే ఏది మాట్లాడాలి, ఏది మాట్లాడకూడదు, మాట్లాడవలసివస్తే ఎంతవరకూ మాట్లాడాలి అనే విచక్షణా జ్ఞానంతో మాట్లాడటం. మంచిగా ఉండాలి మంచిగా మాట్లాడాలి. మీకు డబ్బు ఉన్నా, బాగా చదువు ఉన్నా దానితో మీరు తాదాత్మ్యం పొందకుండా సహజంగా ఉండాలి. పైవి మర్చిపోతే మీకు జ్ఞానం వచ్చేస్తుంది.

29. సంతోషం ఉన్నచోట ఆరోగ్యం ఉంటుంది. వీటికి దగ్గర సంబంధం ఉంది. వైరాగ్యం వలన మనస్సు విజృంభించటం ఆగిపోతుంది. మీ సాధనలో మీరు లోతుగా వెళుతున్నారు అనుకోవటానికి నిదర్శనం, మీకు తలంపులు వస్తూ

srinannagaru.com

ఉంటాయి. కాని అవి మిమ్ములను బంధించవు. వస్తూ పోతూ ఉంటాయి. చీపురుతో మీ ఇల్లును ఎలా శుభ్రం చేసుకొంటున్నారో అలాగే మీరు ధ్యానం వలన విచారణ వలన మీ మనస్సును శుభ్రం చేసుకోండి. ఆడంబరం లేకుండా అహంకారంతో కూడిన మాటలు, మాట్లాడకుండా ఉండాలి. ఎన్నో జన్మల నుంచి ఇంద్రియాల ద్వారా బాహ్యసుఖాలను పొందటం అలవాటు చేసుకొన్నాము. అందుచేతనే మనకు, దేహం, ఇంద్రియాలు కనిపిస్తున్నాయి. ఆత్మ కనిపించటం లేదు అని అనుకొంటున్నాము. ఆత్మ అంటే నిజమైన అర్థం "నేను" అంటే అసలు "నేను". ఇంద్రియాల ద్వారా అనుభవించే సుఖాలనే కోరుకొంటారు గాని, భగవంతుని "నీ ప్రేమ నాకు కావాలి అని అడిగే వానికి లోపల ఉన్న ప్రేమ అందుతుంది. శరీరం, వాక్కు, మనస్సును నియమించుకొంటే అదే తపస్సు. త్యాగం కూడా తపస్సుతో సమానం. అహంకారం లేకుండా ఉండటమే నిజమైన ధ్యానం. కొందరు "ఈ భూమి మీదకు వచ్చిన పని పూర్తి అయినది, మనం జ్ఞానులమై పోయామని, ఈ ముక్కులో గాలి ఎప్పుడు పోతుందో" అని అనుకొంటారు. కాని ఇంకా మొట్టికాయలు ఉంటే అవి తగిలే వరకూ ఈ ముక్కులో గాలిపోదు. ఆత్మ విమర్శ వలన ఆత్మ వివేకం పెరుగుతుంది. ఇతరులను నీవు విమర్శిస్తూ ఉంటే నిన్ను నీవు విమర్శించుకొన్నట్లే. నీలో ఏ వస్తువు ఉందో విమర్శించే వారిలోనూ ఆ వస్తువే ఉంది. వారిలో కూడా ఆ నీవే ఉన్నావు.

30. ఒంట్లో ఉన్న జబ్బు బాగు చేసుకోవచ్చు, లేదా శ్మశానంలో కాలిపోతుంది. నీవు ఇతరులను ద్వేషించటం కూడా మానసికమైన జబ్బే. దాన్ని బాగు చేసుకోలేవు, అవి శ్మశానంలో కాలవు. నీకు ఆత్మానుభవం కలుగకుండా ఈ మానసిక జబ్బు అడ్డు వస్తుంది. మురుగునార్ అన్నారు "అమృతానుభవం పొందిన తరువాత నేను గుళ్ళవెంట, గోపురాల వెంట తిరగటం అంటే నా గురువైన రమణుని అగౌరవ పర్చినట్లే". ఆ మాటలు అమృత స్థితి పొందినవారు మాత్రమే అనగల అర్హత ఉంటుంది. నీ దేహమే నిజమైతే గాఢనిద్రలో రూపం ఎక్కడికి పోయింది? నీకే రూపం లేనప్పుడు దేవునికి రూపం ఎలా ఉంటుంది. నిజమైన స్నేహితుడు మన ఆనందాన్ని పంచుకోడు. దుఃఖాన్ని పంచుకొంటాడు. ఎన్ని తలంపులు కలుగుతున్నా ఇవి ఎవరికి కలుగుతున్నాయి? అని ప్రశ్నించుకొంటే "నాకు" అని సమాధానం వస్తుంది. ఆ నేను ఎవరు? అదే దేహగతమైన "నేను". ఆ నేనుకే అన్ని వికారాలు. ఇలా విచారించిన కొలది మనస్సు బలహీనమై పోతూ ఉంటుంది. అప్పుడు మనలో ఉన్న శాంతి మనకు తెలుస్తు ఉంటుంది. నిద్రలో ఉన్న శాంతి మనకు దూరం చేసేది ఈ దేహగతమైన నేనే. దానిని దూరం

srinannagaru.com

చేసుకొంటే శాంతి అనుభవానికి వస్తుంది. సాధకులు లౌకికులతో ఎక్కువ మసలకూడదు. మనస్సు ఎంతవరకూ పోగొట్టుకొన్నామో విచారిస్తే మనస్సు క్షయమౌతుంది. అప్పుడు యోగివి అవుతావు, జ్ఞానం వస్తుంది. ఒకరు మనలని గౌరవించాలి, ఒకరు మనలను అభిమానించాలి, అనే తలంపు ఉండకూడదు. మన మీద మనకు ఆత్మ విశ్వాసం ఉంటే ఒకరు మనలను గౌరవించటం లేదు అనే బాధ ఉండదు. ఆత్మ న్యూనతాభావం పోగొట్టుకోవాలి.

31. ధ్యాన సాధన యొక్క ప్రయోజనం నీ దేహాత్మ బుద్ధి నశించటానికే. అంతర్ముఖం, బహిర్ముఖం అనేవి నిజానికి ఉండవు. సాధన మొదలు పెట్టటానికి ఈ పదం వాడతారు. రొట్టె ముక్క తినటం మొదలుపెట్టాలి అంటే ఏదో ప్రక్క విరవాలి. ఇదీ అంతే, జరిగింది అంతా మీ బాగు కోసమే. జరగబోయేది కూడా మీ బాగుకోసమే అనుకోండి. మనస్సు అణిగిపోతుంది. భగవంతుడు కూడా పని చేస్తున్నాడు అనుకోండి. మీ అహంకారాన్ని మింగేస్తే, మీరు జ్ఞానులౌతారు. కర్తృత్వం నశించిన వెంటనే మనస్సు వేరుతో సహా కాలిపోతుంది. మధుర భావనలో ఉన్నవారు, త్యాగరాజు, మీరా, తులసీదాస్, శ్రీకృష్ణ చైతన్య. కృష్ణుడు అన్నారు "వర్తమానంలో ఉండండి. నీకు పని మీద అధికారం ఉంది. ఫలితం పట్ల అధికారం లేదు" అన్నారు. కాబట్టి పని దైవంగా భావించాలి. ఫలితం ఆశించకూడదు. "నేను" అనే భావన అసంపూర్ణము. ప్రయత్నం చేస్తున్నాము. అనుభవంలోకి రాలేకపోతున్నాము. మనస్సు నశిస్తే గాని అనుభవం రాదు. ఆత్మకు మరో పేరే "ప్రేమ". సాధారణ మానవుడు ప్రేమించినవాడిని ప్రేమిస్తాడు, ద్వేషించిన వాడిని ద్వేషిస్తాడు. అలాగే సాధకుడు ఉంటే అతని పురోభివృద్ధి ఏముంటుంది. తలపోటు వస్తే బిళ్ళ వేసుకొంటాము. పోతుంది. అలాగే అశాంతి అనేది కృత్రిమం. శాశ్వతం కాదు. అందుచేతనే దాన్ని పోగొట్టుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. యదార్థం ఏమిటి అంటే మాటకన్న మౌనమే ఎక్కువ సహాయకారిగా ఉంటుంది. "బోధ" అంటే జ్ఞానాన్ని ఇయ్యగలగటమే. అది మాటల కన్న మౌనం ద్వారానే ఎక్కువ సాధ్యవౌతుంది. మనస్సుకు మృదుత్వం రావటంతోనే వాటి వెనుక ఉన్న ఆత్మ శాంతి కలుగుతుంది.

32. దానం భగవంతుని ప్రీతికోసం చెయ్యాలి. పేరుకోసం చేస్తే ప్రయోజనం ఉండదు. లోకంలో మంచివాళ్ళు ఉంటారు, చెడ్డవాళ్ళు ఉంటారు. వాళ్ళను నీవు లెక్క చెయ్యకు. నీ మనస్సుకు సమత్వం నేర్పు. వాటిని దాటి వెళ్ళిపోండి. ఏదుర్మార్గులని గురించి నీవు చింతిస్తున్నావో అదే నీకు పట్టుకొంటుంది. మీకు ఎవ్వరి మీదనైనా ద్వేషం ఉంటే మీ మనస్సు అందులో కూరుకుపోతుంది.

srinannagaru.com

సత్యం ఎన్నటికీ మీకు అందదు. శ్రవణం అంటే మాటయొక్క అంతస్తు మీకు తెలుస్తూ ఉండాలి. అది శ్రవణం. పశువులకు బూరులు పెట్టినా, చిట్టుపెట్టినట్లు తినేస్తాయి. కాని ఎవరు వండారు, ఎంత రుచిగా వండారు అని ఎంజాయ్ చెయ్యమంటే చెయ్యలేవు. అలాగే శ్రవణం అంటే నీవు చెవులతో వినటం కాదు. దాని అర్థం మనస్సుకు హత్తుకోవాలి. ధ్యానం గురించి భగవాన్ ఇలా అన్నారు. "మీ మానసిక రోగం తగ్గుతున్నదా లేదా అని మీరు తెలుసుకొని ధ్యానం చెయ్యాలి. ధ్యానం చెయ్యవద్దు అనటం లేదు. రోగానికి మందు సరిగా పనిచేస్తున్నదా, లేదా అనేది మీరు గ్రహించాలి. అబద్ధమైన రోగం "శరీరం నేను అనే రోగం పెరగకూడదు, తగ్గాలి, తగ్గితే మంచిదే" అన్నారు. మీరు చేస్తున్న సాధన మీ గురువు చూస్తూనే ఉన్నాడు. పనిచేస్తున్నప్పుడు ఏ అంతస్తులో ఉన్నారు అనేది గురువు చూస్తూనే ఉంటాడు. గురువు అనుగ్రహం వల్లనే సాధన ఎక్కువగా ఫలిస్తుంది. సాధనలో లోతుకు వెళ్లేకొలది ఈశ్వరానుగ్రహం వస్తుంది. గురు అనుగ్రహం వలన అంతా ప్రశాంతంగా ఉంటుంది. మీ సాధనలో అంతా అశాంతే. మీరు ఎంత శాంతంగా ఉంటే అంత ఘనత ఈ లోకంలో వస్తుంది. పరలోకంలో మీరు సత్కరించబడతారు. మీరు ఎంత ప్రశాంతంగా ఉంటే అంతవరకూ మీ మానసిక స్థాయి పెరుగుతుంది.

33. "లోకానికి ఆధారమైన వస్తువు ఒకటి ఉంది" అనే స్ఫురణ రావాలంటే మన అహంభావన తగ్గితేనేగాని అది తెలియబడదు. "నేను"గా జీవించేవాడికి ఆత్మ తెలియబడదు. తానుగా జీవించేవాడికే ఆత్మ తెలియబడుతుంది. వాసనలు క్షయించటం కోసం "యోగం" అవసరం. సాధనలక్ష్యం ఆత్మజ్ఞానంలోనే ఉండాలి. వాసనా క్షయం ఎంతవరకూ తగ్గించుకొన్నాము అనే రెంటినీ సమానంగా చూచుకోవాలి. మనం ఒక మంచి మాట విన్నప్పుడు శరీరం పులకరించకపోతే మనలో అజ్ఞానం ఉన్నట్లే. అరణ్యవాసంలో సీత ఒక నిర్మల తటాకం చూచి ఆనందంతో రామునితో చెప్పగా రాముడు "అవును సత్‌పురుషుని హృదయంలా ఉంది" అన్నమాటను భగవాన్ సమక్షంలో చదవగా భగవాన్ శరీరం పులకరించింది. "ఈ లోకం లేదు, ఈ సృష్టి లేదు, భగవంతుడు లేడు" అన్న భగవాన్ కూడా ఈ మాటకు పులకరించారు. అంగుష్ఠ ప్రమాణంగల జ్యోతి స్వరూపాన్ని భ్రూమధ్యంలో వ్యక్తమయ్యే దానిపై దృష్టి నిలిపి ఉపాసన చెయ్యటం వలన ఏకాగ్రత కుదురుతుంది. తక్షణం వాసనలు క్షయమౌతాయి. అప్పుడు అమృతనాడి తెలియబడుతుంది. ధ్యానం కల్పితమైనా సాధకునకు అది ఉప యుక్తమే. ఎలా అంటే మీరు ఒకరితో మాట్లాడుతూ ఉంటే మిమ్ములను ఎవ్వరూ

srinannagaru.com

కలవలేరు. అదేపనిగా మీరు ఉంటే ఆవతలవాళ్ళు విసిగి వెళ్ళిపోతారు. అలాగే మీ ధ్యాన సాధనలో అరిషడ్వర్గాలు తొంగిచూచి మనం వెళ్ళినా ప్రయోజనం లేదని వెనుదిరిగి పోతాయి. నిజానికి వాటిని చింతించటం వలనే వాటికి ఆహారం ఇచ్చిన వారమౌతాము. అలా చెయ్యకపోతే బలహీనమై మరణిస్తాయి. అప్పుడు మనస్సు ఆత్మ గూటిలో పడిపోతుంది. కాబట్టి సాధన ముఖ్యమే. సాధన వలన మనస్సు బహిర్ముఖం కాదు.

34. జరిగిపోయిన జన్మల యొక్క తలంపులు, పనులు మనస్సులో ఉన్నాయి. ధ్యానం మనస్సు లోపలికి తోలుకొని వెళ్ళటానికి సహకరిస్తుంది. భగవాన్ అన్నారు "ఆకాశం అంత విశాలత్వం, సముద్రం అంత లోతుగల హృదయం గల వారు కావాలి" అని వ్యక్తి పరంగా జీవించటం కాకుండా, సంఘ పరంగా జీవించాలి. ద్వేష పరంగా జీవించినంతకాలం తలబద్దలు కొట్టుకున్నా జ్ఞానం రాదు. నీవు అఖండ దృష్టితో జీవించాలి. ఆత్మ అఖండంగా ఉంది కాబట్టి. ఇంగ్లీషు సామెత "నీవు ఈ ప్రపంచాన్ని ఇంతకన్న అందంగా చెయ్యాలని నీకు ఉంటే ముందునీవు వైరాగ్యం పొందితే అది సాధ్యమౌతుంది. నీవు స్వార్థంతో పనిచేస్తే ప్రపంచాన్ని అందంగా మార్చలేవు" అని ఉంది. వైరాగ్యం కూడా సంపదే. బుద్ధుడు, తన భార్యను, కుమారుని, రాజ్యాన్ని, సంపదను వదలి ఈ సృష్టిని ప్రేమించాడు; తన రాజ్యానికి తన వారసుని కూడా ఉండకుండా చేసాడు. అంటే ఆయనలోని అఖండ వైరాగ్యమే కారణం. నీవు ఆత్మవైతేనే నీకు ఆత్మ తెలియబడుతుంది. ఉప్పు నీటిని చూచి అందులో ఉప్పు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవాలంటే కంటితో చూస్తే చాలదు. రుచి చూడాలి. అలాగే నీవు బుద్ధిచేత, మనస్సు చేత ఆత్మను తెలుసుకోలేవు. ఆత్మ ఎంత స్వచ్ఛమో, నీ మనస్సు అంత స్వచ్ఛమైతే అప్పుడు అది నీ అనుభవానికి అందుతుంది. ప్రతీరోజూ ఉదయం, సాయంకాలం ధ్యానం చెయ్యటం వలన మనస్సుకు స్వచ్ఛత వస్తుంది. మీ శరీరానికి ఆరోగ్యం వస్తుంది. ధ్యానంలో ఉన్న సమయంలో ఉన్న శక్తి నిత్యజీవితంలో సరియైన నిర్ణయాలు తీసుకొనే శక్తిలో అది సహకరిస్తుంది. బలమైన మనస్సే సరియైన నిర్ణయాలు చేసుకోగలదు. ఆబలం ధ్యానం వలన కుదురుతుంది. చావు వచ్చేటప్పుడు భయం కలిగితే అతనికి స్వార్థం ఉన్నట్లే లెక్క. బంధించేది స్వార్థమే.

35. నిజమైన సన్యాసం, మిథ్యా "నేను"ను తొలగించుకోవటమే. అహంకారం యొక్క మూలాన్ని వదలకుండా ఉంటే ఆత్మజ్ఞానం కలుగుతుంది. దాని వలన అమరత్వం సిద్ధిస్తుంది. ఈ మాటను మంత్రంగా జపించండి. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని సుఖాలు వచ్చినా, ఎన్ని పొంగులు వచ్చినా, ఎన్ని కృంగులు

srinannagaru.com

వచ్చినా, ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా "తెరగా" ఉండు. అంటే అదిగాను ఉండవద్దు, ఇదిగానూ ఉండవద్దు. మీరు మీరుగా (ఆత్మగా) ఉండండి. సంకల్పంలో దోషం ఉంటే మీరు చేసే సాధన ప్రయోజనం ఉండదు. సాధన హృదయపూర్వకంగా చెయ్యాలి. సాధనలో ఈ "కాలం"లోనే మనం ఆత్మానుభవం పొందాలనే ఆతృతతో చెయ్యాలి. ఈపని చెయ్యాలి అనుకోకు, ఈ పని నుంచి తప్పుకోవాలి అని అనుకోకు, నీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అది జరుగుతుంది. "నేను చేస్తున్నాను" అనే భావనే నిన్ను కృంగదీస్తుంది. కృతజ్ఞత ఆశించటం వలన మనస్సుకు మాలిన్యం ఏర్పడుతుంది. సాధారణంగా కొంత మంది ఎదుటివారిని అవమాన పరచాలని, న్యూనత పరచాలని, సూటి పోటి మాటలతో బాధించాలి అనే స్వభావం గల మనుషులు హీనులు, అటువంటి వారు దగ్గర బంధువులైనా వాళ్ళకు దూరంగా ఉండాలి. లేకుంటే ఆ అనాగరిక మైన, అసభ్యమైన స్వభావం మనకూ అంటుకొంటుంది. మాటే మంచిని తీసుకొని వస్తుంది. మాటే ఉన్నత స్థితిని తీసుకొని వస్తుంది వాళ్ళతో మానసిక అనుబంధం తక్కువగా ఉండాలి. అహంకారం మూలం వదలకుండా పట్టుకొని ఉంటే మీ సాధనలో త్వరితగతిని సాఫల్యం అవుతుంది. విషయాలు-విషం కంటే ప్రమాదం.

36. మీకు కనిపించే స్నేహితులు, చెడ్డ పనిచేసినవారు ఎవరైనా ఉంటే వాళ్ళను చూడటానికి మీరు అయిష్టత కల్పించుకోకండి. చూచే స్థితి భగవంతుని ప్రణాళికలో ఉంటే అది నిర్మలంగా చూడగల్గితే మీ ప్రారబ్ధం ఖర్చు అవుతుంది. మైండ్ అనేది మేజిక్ బాక్సు. "నేను" అనేది అదే. అందులోనుంచి విడుదల పొందిన వారికి మాత్రమే శాంతి లభిస్తుంది. "నేను" లేకుండా ఏ యోగం లేదు. అంటే భక్తి యోగం. జ్ఞాన యోగం మొదలైనవి. ఆ నేను హృదయంలో సహజంగా కలపాలి. "నేను"ను హృదయంలో నిలపగల్గితే అది కరిగిపోతుంది. ఎప్పుడూ ఉండే వస్తువులోనే శాంతి ఉంది. సుఖం ఉంది. అణిగిన మనస్సుకు ఆత్మ తెలియబడుతుంది. వినయం గల వారికీ అది లభ్యమౌతుంది. అన్నం వడ్డించినప్పుడు ప్రధానంగా మధ్యలో అన్నం పెట్టి, చుట్టూ కూరలు, పచ్చళ్ళు పెట్టుకొంటారు. అన్నం తినటానికి అవి ఉపయోగపడతాయి. అలాకాకుండా పచ్చడి మధ్యలో పెట్టి అన్నం ప్రక్కన పెట్టుకొనేవాడు బలవంతుడు కాలేడు. అలాగే మీ జీవితంలో జీవనోపాధికి కావలసిన పనులు ప్రక్కకు పెట్టి ఆధ్యాత్మిక జీవితాన్ని మధ్యలో పెట్టుకొని జీవించాలి. లోపలి దృష్టి నేర్చుకోవాలి. అప్పుడే మనస్సు ఆత్మాకారం చెందుతుంది. రాగ-ద్వేషాలు మనస్సును బయటికి తోలుకొని పోతాయి. శక్తికంటే సహనం గొప్పది. శక్తితో జయించలేనిది సహనంతో జయించగలం. శరీరం ఆరోగ్యంగా

srinannagaru.com

ఉంటే నీవు ఎవరివో నీకు తెలుసుకోవటానికి సహకరిస్తుంది. ప్రేమలోనూ, శాంతిలోనూ, కాంతిలోనూ జీవించినవాడే ఆనందంగా జీవిస్తాడు. ఈ దేహం ఏపని చెయ్యాలో, ఏపని చెయ్యకూడదో ఆ పని చేసి చస్తుంది. దేహ ప్రారబ్ధంపై దృష్టి నిలపక నీ మనస్సును భగవంతునిపై నిలబెట్టాలి.

37. విషయ చింతన వదలితే మనస్సు హృదయం వైపుకు పరుగిడుతుంది. మన మనస్సు చిల్లర గొడవలతో చితికి పోతున్నది. ముముక్షత్వం తెలియటం లేదు. నిర్భయంగా ఉండండి, మీ భయమే మీ ఆనందానికి అడ్డు తగులుతున్నది. ఎదుటివారు నీ గురించి ఏమనుకొంటున్నారో అనే తలంపు వస్తున్నది అంటే భయం వలనే. భయం అనేది అతినీచమైనది. ఆధ్యాత్మిక జీవితంలో భయపడేవాడు ఎన్నడూ అభివృద్ధిలోకి రాలేడు. మంచి పని చెయ్యండి. ఫలితం ఆశించకండి. శరీరానికి శక్తి భోజనం చేస్తే వస్తుంది. మనస్సుకు శక్తి శాంతిలోంచి వస్తుంది. ఎల్లవేళలా పవిత్రమైన, నిర్మలమైన ఆలోచనలు వచ్చేటట్టు చేసుకొంటే మీ నాలుకను భగవంతుడు వాడుకొంటాడు. దేహప్రారబ్ధాన్ని బట్టి బంధువులు వచ్చారు. వారికి సేవ చెయ్యి. కాని బంధం పెట్టుకోకు. మమకారం పెట్టుకోకండి. మనం ఎదిగితేగాని వస్తువు లభ్యమవ్వదు. ఆత్మ తప్పించి ప్రతీదీ ప్రతిబింబమే. ఏ గొడవ వచ్చినా పట్టించుకోకండి. అన్నింటినీ గెంటివెయ్యండి. నీవు ఆత్మవు. నీ చేతిలో ఏ పని ఉందో దాన్ని నిదానంగా చేసుకో. ఇతరుల గొడవలు నీవు పట్టించుకోకు. మీరు దేవుడు లేడని చెప్పినా నాకు ఇష్టమే కాని మీ ఆత్మ విశ్వాసంపై విమర్శ పడకుండా జాగ్రత్త పడండి. మీరు ఏ పని చేసినా మనఃపూర్తిగా చెయ్యండి. పిరికితనంగా చెయ్యకండి. అహంకారం నమ్రత వలన నశిస్తుంది. గురువు యొక్క ప్రేమ స్పర్శ వలన మాత్రమే నశిస్తుంది. కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగాల వలన పూర్తిగా నశించదు. గురువు యొక్క దయ అనే స్పర్శలేకుండా అహంకారం కదలదు, మెదలదు, అలాగే ఉంటుంది. మీ సద్గురువును ప్రేమగా తలచుకొంటే చాలు. మీ సాధన జయప్రదమౌతుంది.

38. దేహం, మనస్సు నీవు కావు అనే అభిప్రాయం నిరంతరం కలిగే వరకూ జ్ఞానం కలుగదు. సహజంగా బాహ్య విషయాలపట్ల, విషయ వాసనల పట్ల మనస్సుకు విరక్తి కలిగితే గాని మనస్సు లోపలికి వెళ్లదు. మీరు అల్ప విషయాల నుండి స్వల్ప విషయాల నుండి మనస్సు మరల్చుకొన్నప్పుడే ఏకాగ్రత కుదురుతుంది. ఏ విషయాల పట్ల మనస్సు వడిగా పరిగెడుతుందో ఆ విషయాల పట్ల మనస్సు ఉపసంహరించే వరకూ ఏ దేవుడూ మీకు సహాయం చెయ్యలేడు. ప్రపంచం మనస్సులో ఉంది. ఇప్పుడు మనం ప్రపంచంలో ఉన్నాము. ఆత్మానుభవం కలిగిన

srinannagaru.com

తరువాత ప్రపంచం మనలోనే ఉంది అనిపిస్తుంది. దేహం, మనస్సు కలవటమే పుట్టుకలు. అవి రెండూ విడిపోవటమే మరణం. "ఇన్ని రూపాలుగా పుట్టిన వాడిని నేనే" అనే అభిప్రాయం దృఢంగా ఏర్పడితే ఎవరినీ ద్వేషించవలసిన పని లేదు. ఏ వికారం మనకు కలుగదు. మీకు మీ దేహంలో ప్రాణం ఉండాలి అని అనుకొంటున్నారు. ఇలా అనునిత్యం అనుకొంటూ ఉంటే మీకు జ్ఞానం ఎప్పుడు కలుగుతుంది? మీకు జ్ఞానం కలిగితే దేహభావనే ఉండదు. రాజసిక గుణం ఉన్నప్పుడు తక్కువ సేపు ధ్యానం చెయ్యండి. అంతేగాని మనస్సును ధ్యానం పేరుతో ఇబ్బంది పెట్టకండి. సత్త్వ గుణం ఉన్నప్పుడు ఎక్కువ సేపు ధ్యానం చేస్తే ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. మీకు దుఃఖం వచ్చినప్పుడు, కోరికలతో సతమతమౌతూ బాధపడుతున్నప్పుడు ధ్యానం సాగదు. దానికి బదులు ఈ బాధ ఎవరికి కలుగుతున్నది అని విచారణ మార్గంలో ఉంటే తొందరలో మీకు శాంతి కలుగుతుంది. కర్తలేని కర్మ ఒక్క జ్ఞానికి మాత్రమే సాధ్యమౌతుంది. అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకొని కర్మలు చెయ్యమని గీతలో ఎక్కడా చెప్పలేదు. ఇతరులు వంచన చేస్తూ ఉంటే మనం తప్పకోగలం కాని, మన మనస్సు చేసే వంచనల నుంచి మనం తప్పకోలేకపోతున్నాము.

39. అనుమానాలన్నీ అజ్ఞానం వల్లనే వస్తున్నాయి. ఒక అనుమానం తొలగితే ఇంకొక అనుమానం వస్తుంది. మూలమైన అజ్ఞానమనే వేరును తొలగిస్తే గాని అజ్ఞానం పోదు. మూలమైన తలంపు "నేను" అనేదే. ఏ వస్తువుకైతే తాను ఉన్నానని తెలియదో అది జడం. ఒక భవనాన్ని చూచి ఇది బాగోలేదని అంటే ఆ భవనం బాధపడదు, కారణం అది జడం. కాని ఆ భవనం కట్టించినవాడు బాధ పడతాడు. కారణం ఆ భవనం నేను కట్టించాను అనే బాధపడేవాడు ఒకడు ఉన్నాడు కాబట్టి. నేను ఒకరిని తిట్టాను అంటే మనస్సు ఉండాలి అది నోటిని మాత్రమే ఉపయోగించుకొంటుంది. నిద్రలో మనస్సు లేదు. అందుచేత, నోటికి పనిలేదు. అహంకార రూపంలో ఉన్న "అజ్ఞానం" మీ మనస్సును, మీ మాటను ఉపయోగించుకోకుండా ఉంటే అది అణగిపోతుంది. మరణిస్తుంది. అహంకారంతో మాట్లాడకండి, పని చెయ్యకండి, ఆలోచించకండి, ఇది చేస్తే అమృతమయమైన శాంతి మిమ్ములను ముంచేస్తుంది. ఆత్మచేతికి మీరు అందుబాటులో ఉండే వరకూ ప్రయత్నం చెయ్యండి. తరువాత ఆత్మ దాని అంతట అదే మిమ్ములను లాగేసుకొంటుంది. ఎల్లకాలం మీరు ప్రయత్నం చెయ్యనక్కర లేదు. ఆత్మ నిష్ఠ మీకు కలిగితే మనకు వచ్చే కష్టాలను ప్రశాంతంగా, నిర్మలంగా భరించగలము. మనిషికి మానసిక శుభ్రతతోపాటు, ఆత్మ సంపదను కూడా

srinannagaru.com

సమకూర్చుకోవాలి. ప్రతి చిన్న విషయానికీ కంగారు పడేవాడికి చైతన్యస్థాయి పెరగదు. భగవంతునిమీద భారం వేసే కొలది మీరు సుఖపడతారు. డాబు పెంచుకోకండి. అహంకారం పెంచుకొంటే తిరిగి భగవంతుడు కక్కిస్తాడు. మీకు అశాంతికి కారణం ఉన్నా శాంతంగా ఉంటే అతి వేగంగా ఈశ్వరానుగ్రహం వస్తుంది. త్యాగం లేనివానికి జ్ఞానం కలుగదు. ప్రతీ దానికి ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వచ్చేస్తుంది.

40. ఏ బాధ అయితే మనం పడుతున్నామో ఆబాధ భగవంతునికి తెలియదు అని అనుకొంటున్నాము. ఆయనకు తెలుసు అనే భావం తెలిసిన వాడే ధన్యుడు. కష్టాలతో తన వైపుకు తిప్పకోవటానికే భగవంతుడు కష్టాలను కల్పిస్తాడు. మన మనస్సు ఆత్మ వైపు తోలుకొని వెళ్ళడానికి ఆ రకంగా తయారు చేస్తాడు. మనలను అప్పడప్పడూ తలుపు సందులో పెట్టి నొక్కినట్లు ఇరుకులో పెడతాడు. కష్టాలతో మన మనస్సును పిండుతాడు. రజోగుణం ఉన్న వానితో స్నేహం చేస్తే మనస్సు పాడౌతుంది. అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలి. సహనం నేర్చుకోండి, ఆలోచించి మాట్లాడండి. లక్క పడితల వంటి గొడవలతో ఆముదం పుచ్చుకొన్న ముఖంలా ఉంటున్నారు. కష్టం వచ్చినా ప్రశాంతంగా ఉండండి. తలంపు వస్తే మేధావి భవిష్యత్ పరిణామాన్ని ఆలోచిస్తాడు. ప్రతీమాటకు, చేతకు, ఆలోచనకు ప్రతిస్పందన తప్పనిసరిగా ఉంది అనే విషయం మర్చిపోకండి. మీకు ఎవరి మీద మమకారం కలుగుతుందో దాని వలనే మీకు దుఃఖం కలుగుతుంది. మౌనంగా ఉండే వారికి ఆలోచనలు లోతుగా ఉంటాయి. వారు తక్కువ మాట్లాడి ఎక్కువ అర్థం వచ్చేటట్టు మాట్లాడుతారు. నీవు మంచిమాట, మంచి చేత, మంచి స్నేహం చెయ్యటం వలన ప్రకృతి నుండి బయట పడతావు. అప్పడు బ్రహ్మం వ్యక్తమౌతుంది. విచారణ వలన, ధ్యానం వలన మనస్సు బ్రహ్మను తెలుసు కొంటుంది. ఆరోగ్యం కోసం మందు వాడినట్లే ధ్యానం వలన, ఆత్మానుభవం కలుగుతుంది. గమ్యాన్ని చేరటానికి ధ్యానం ఉపయోగపడుతుంది. కాని అదే గమ్యం కాదు. ధ్యానం సహాయం చేస్తుంది. ఆసక్తి రహితుడు శోక రహితుడు అవుతాడు. ఆసక్తి వలన దుఃఖం వస్తుంది. ఉద్రేకపడితే జీవితంలో చాలా నష్టపోతాము. అశాంతికి గురి అవుతాము. అద్దం బాగా ఉంటే ప్రతిబింబం స్పష్టంగా కనబడుతుంది. అలాగే చిత్తశుద్ధి వలన నీ మనస్సు నిర్మలత్వం పొంది కృతార్థుడవు అవుతావు.

41. కాలమే ఒక మహా మాయ. సాధకుడు ఎప్పడూ గతాన్ని గురించి, భవిష్యత్తును గురించి ఆలోచిస్తాడు. తద్వారా వర్తమానాన్ని పాడుచేసుకొంటాడు.

srinannagaru.com

కాలం బుద్ధిలో ఉంది కామాన్ని-కాలాన్ని జయించిన వాడే ఆత్మానుభూతిని పొందుతాడు. గర్వం ఎక్కువగా ఉండే మనుషులతో స్నేహాలు వదలాలి. వదలక పోతే అది మనకు సంక్రమిస్తుంది. వినయం ఉన్నవానికి వివేకం వరిస్తుంది. వినయం లేనివానికి శాస్త్రం బోధించినా మనస్సుకి బోధపడదు. మొక్కకు నీరు పోస్తే ఎలా అభివృద్ధి చెందుతుందో అలాగే నీ మనస్సు సత్పురుషుల సహవాసం వలన నీవు ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించగలుగుతావు. నీ కళ్ళకు కాటుక లేదు అనుకో అది అద్దంలో చూచి ఆ అద్దంలో ప్రతిబింబానికి కాటుక పూస్తే ప్రయోజనం ఉండదు. అలాగే లోకం యొక్క ప్రయోజనం కొరకు చేసే పనులలో ప్రయోజనం ఉండదు. నీ చిత్త శుద్ధికోసం లోక కళ్యాణానికి నిస్వార్థంగా పనిచేసిన నాడు నీ మనస్సు నిర్మల మౌతుంది. పరమాత్మను వదలి ఎన్ని చేసినా ఒకటి లేని సున్నలతో సమానం. సత్పురుషుడు గొప్పకోసం ఏమీ చెయ్యడు. వాడు లోకానికి వచ్చే జాడే తెలియకుండా పనిచేసుకొని పోతాడు. అభిమానమనే స్పర్శ లేకుండా ఎవరైతే పనిచేస్తారో వారికి జ్ఞానం కలుగుతుంది. హృదయ దౌర్బల్యమనేది నీచాతినీచమైనది. భగవంతునిపై ఆధారపడి జీవించండి. మీ పిరికితనాన్ని విడిచిపెట్టండి. నీకు గుడిలోకి వెళ్ళినప్పుడు ఆలయ వాతావరణం ఎంత ప్రశాంతంగా ఉంటుందో నిజజీవితంలోకూడా అంత ప్రశాంతంగా ఉండు. సాధకునకు వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అనే భావం ఉండకూడదు. ఎడ్మినిస్ట్రేషన్ ఈశ్వరుడు చూచుకొంటాడు. బుడగలను చూడకండి. నీటిని చూడండి. అందరి కంటే నేను చిన్నవాడిని అని అనుకోండి. మీరు కృతార్థులు అయినట్లే కొంచెం తెలివి, కొంచెం వివేకం ప్రదర్శించండి అంతా ఆనంద సముద్రమే. అక్కడ నామ రూపాలు లేవు, అంతా ఆనందమే.

42. అజ్ఞానానికి విరోధులు ఎవరు? జ్ఞానం. దాన్ని పట్టుకోండి, జ్ఞానం మీకు వస్తుంది. లేనిది ఎలాగూ లేదు అందుకే మనం బ్రహ్మాన్ని గురించి విసుగు వచ్చే వరకూ శ్రవణం చెయ్యాలి. మననం చెయ్యాలి. అప్పుడే మీరు పురోభివృద్ధిలోకి వస్తారు. శరీరమే ఒక శిక్ష అని తెలుసుకోవటం లేదు. నీవు చెడ్డ పని చెయ్యనక్కర లేదు చెడ్డ ఆలోచన కూడా పాపమే. ఇప్పుడు లేని మంచితనం, ఇప్పుడే లేని దైవ చింతన నీ ప్రాణ ప్రయాణ సమయంలో ఎట్టి పరిస్థితిలోనూ రాదు. దాని కోసం ఇప్పటి నుంచి ప్రయత్నం చెయ్యి. మోక్షం మీద మీకు ఎంత ఇష్టం ఉందో మీ సాధన మీద కూడా అంత ఇష్టం ఉండాలి. దాన్ని హృదయపూర్వకంగా ఏకాగ్రతతో చేసిన వారు మాత్రమే గమ్యాన్ని చేరుతారు. గంటలు లెక్కపెట్టుకొంటూ కొలతలు వేసుకొంటూ కాకుండా సహజంగా జరగాలి. మీరు నిరంతరం ఆ “నేను”ను

srinannagaru.com

సందేహించాలి. అప్పడే గమ్యాన్ని చేరుతారు. మనలోని మంచిని కాకుండా చెడును చూచుకోవాలి. దాన్ని తొలగించుకోవాలి. అలాగే ఇతరులలోని చెడును కాకుండా మంచిని చూడాలి. దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. బుద్ధిలోని దోషాలు రాలిపోతే బ్రహ్మం నీకు వ్యక్తం అవుతుంది. "నిర్వాణం" అంటే ఆరిపోవటం. అంటే ఏ నేను అయితే నిజమని "నేను-నేను" అంటున్నావో ఆ నేను ఆరిపోవటం. అందరి ముఖాలలోను దేవుని చూడటానికి ప్రయత్నం చెయ్యండి. ఇతరుల గొడవలలో మీరు కలుగజేసుకోకండి. స్వంత బుద్ధిని ఎన్నడూ విడనాడకండి. ఇతరుల బుద్ధిని మీరు నమ్ముకోకండి. శరీరం, ఇంద్రియాలు మనస్సుకు అనుభవాన్ని ఇస్తున్నాయి. ఉదాహరణకు మీరు మిఠాయి తింటున్నారు అనుకోండి దాని రుచి నాలుక ద్వారా మనస్సుకు అందజేస్తుంది. శరీరం కాలిపోయినప్పడు మనస్సు కాలదు. అహంకారం ఎందుకు దుఃఖ పడుతుందో రహస్యాన్ని కనుగొనండి నాలుక కాలిపోతే నాలుక ద్వారా పొందే అనుభవం మనస్సుకు రాదు. వాటికి వాటికీ ఉన్న అవినాభావ సంబంధం అటువంటిది. అందుకే మరణ సమయంలో దుఃఖం వస్తుంది.

43. జ్ఞానిని ప్రశ్న అడిగినప్పడు శ్రద్ధగా అడగాలి. ప్రశ్నిందామని అడగ కూడదు. దేహ పరిమితమైన భ్రమను పోగొట్టుకోవటానికే బ్రహ్మ జ్ఞానం కావాలి. మన మనస్సు ఎక్కువ చలిస్తూ ఉంటే మనకు దేవుని మీద విశ్వాసం లేదని గ్రహించాలి. అహంకారం దూసుకొని వస్తూ ఉంటే ఆత్మజ్ఞానం వెనక్కు వెడుతూ ఉంటుంది. ఆత్మ జ్ఞానం ముందుకు వస్తూ ఉంటే అజ్ఞానం వెనక్కు వెడుతూ ఉంటుంది. ఆత్మజ్ఞానాన్ని మనం పోషించుకుంటూ ఉండాలి. అప్పడే ఆధ్యాత్మిక అభివృద్ధిలోకి వస్తాము. అజాగ్రత్తలో ఉన్నవాడు అజ్ఞానంలో కూరుకుపోతాడు. చీకటిలోకి వెళ్ళిపోతాడు. వర్తమానాన్ని కాపాడుకోండి. మనస్సును పాడు చేసుకోకండి. ఇది అంతా లీలగా చూడండి. తామరాకు మీద నీటి బొట్టు ఎప్పడు రాలిపోతుందో తెలియదు. అలాగే ఈ ప్రపంచంలో దేన్ని చూచి గర్వ పడకండి. వివేకంతో ఉండండి. నీవు చూచుకొని గర్వపడే వస్తువులు ఎప్పడో ఒకప్పడు రాలిపోక మానవు. అహంకారం అసత్యమని తెలిస్తే మన ప్రయత్నం సఫలమౌతుంది, ఆధ్యాత్మిక పురోభివృద్ధి జరుగుతుంది. పిల్లలు ఇసుకలో పిచ్చుక గూళ్ళు కడతారు. అలాగే పేక ముక్కలతో మేడ కడతారు. వాటిని ఎంతో తేలికగా పడగొట్టవచ్చు. అలాగే ఈ అహంకారం నిజం కాదని తెలిస్తే దాన్ని అంత తేలికగాను పడగొట్టవచ్చును. ఎదుటి మనిషిని దూషిస్తూ ఉంటే ఆధ్యాత్మిక అభివృద్ధి ఉండదు. ప్రేమమయమైన జీవితం వలన ఆధ్యాత్మిక అభివృద్ధి జరుగుతుంది.

srinannagaru.com

అవతార పురుషుని లేదా సద్గురువుని ప్రేమిస్తే జ్ఞానం కలుగుతుంది. తన పనులలో సఫలత చెందినప్పుడు ఆలోచన యొక్క లోతులు పెరుగుతాయి. అప్పుడు దానికి ఆధారం ఏదో ఉంటుంది అనే వివేకం కలుగుతుంది. గుండెకాయ లేకుండా శరీరం ఎలా నిలబడదో అలాగే మోక్షం సంపాదించాలి అంటే జ్ఞానం కావాలి. జ్ఞానం పొందకుండా ఏ పని చేసినా ఫలితాన్ని పొందలేడు. దాని ద్వారా జన్మ చక్రంలో తిరుగుతాడు.

44. లోక వ్యవహారాలు మొదట సూది బెజ్జం అంత ఉన్నా మరుసటి నాటికి ఏనుగు దూరే అంత రంధ్రమవుతుంది. శరీరానికి, మనస్సుకు సంబంధించిన సుఖాలనే మనం పుట్టినప్పటి నుంచి, శ్మశానానికి వెళ్ళే వరకూ కోరుకొంటున్నాము. దేహము-మనస్సు-ఇంద్రియాలకు సంబంధించిన ఈ సుఖాలను "భవ సుఖాలు" అంటారు. వీటికి తరుగుదల ఉంది. మనం ఆ భవ సుఖాన్ని అంటే తరగని ఆత్మ సుఖాన్ని మాత్రమే కోరుకోవాలి. ఎవరైనా మనలను విమర్శిస్తూ ఉంటే అశాంతి పొందకుండా ఉంటే క్రమశిక్షణలో ఉన్నామన్నమాట. పువ్వులు కొనటం తేలిక, గుణాలు అలవర్చుకోవటం కష్టం. దేవుని పటానికి ఒక దండ వేసి మన పని అయిపోయింది అనుకొంటాము. మైత్రీ భావం, సహన శీలంతో మనం జీవించాలి. అట్లైతే భగవంతుని మనం సన్మానించినట్లే. లోపల ఉన్న వస్తువుకు మనం దూరమయ్యామని ప్రకృతి గుణాల వలన అనుకొంటున్నావు. నిజానికి మనం దేవునికి దగ్గరగానే ఉన్నాము. నీవు దేవుడవు కానక్కరలేదు. నీకు దయ ఉంటే దేవతలు కూడా నీకు దణ్ణం పెడతారు. దయకే ఇంత శక్తి ఉంటే జ్ఞానికి ఇంకా ఎంత శక్తి ఉంటుందో మీరే తెలుసుకోండి. "నేను" అనగానే శరీరం గుర్తుకు వచ్చినట్లే, "నేను" అనగానే ఆత్మ గుర్తుకు వచ్చినట్లైతే ఈ సృష్టి అంతా ఆత్మలో లయమైపోతుంది. అనుగ్రహం ఇచ్చేది కాదు, అందుకొనేది. అనుగ్రహం ఎప్పుడూ ఉంది. మనం అందుకొనే స్థాయికి ఎదగాలి. సహనం ఎవరికైతే వస్తుందో వారికి శాంతి, సుఖం వస్తుంది. మీరు దేవాలయానికి వెళ్ళటం ఒక అలవాటుగా ఉంది అనుకోండి. అలాగే భగవంతుడు "కర్త" అనే విశ్వాసం ఉంటే మీ దుఃఖం ఆరిపోతుంది. మీరు కొన్ని క్షణాలైనా హృదయంలోకి వెళ్ళి రావాలి. దేవుడు కర్త అనుకొంటే దుఃఖం రాదు. నేను కర్త అనుకోవటం వలననే దుఃఖం వస్తుంది.

45. దేహ మరణానికి కారణాలు నాలుగు ఉన్నాయి. దుఃఖం, కోపం, కామం, భయం. పిరికివారు బలహీనులు, కోడిపిల్లలాంటి వారు రోజూ మరణిస్తూ ఉంటారు. నిజమైన ధైర్యశాలి ఒకరోజునే మరణిస్తాడు. తత్త్వం తెలుసుకొనే

srinannagaru.com

వరకూ కామ-క్రోధాలు లొక్కుపోతాయి. మానవుడిలో అవి అంకురిస్తే చాలు లొక్కుపోతాయి. కోరిక నెరవేరితే ఒక తంటా. నెరవేరకపోతే ఒక తంటా. నెరవేరితే నా వలన జరిగింది అనే పొగరుబోతు తనం వస్తుంది. నెరవేరకపోతే దుఃఖం వస్తుంది, కోపం వస్తుంది. ఈ నిజాలు మనకు అనుభవంలో లేక, అర్హత లేక, జ్ఞానం లేక గ్రహించలేకపోతున్నాము. ఈశ్వరుడు చెప్పినమాట అసత్యంగా కనిపిస్తుంది. ఈ మాటలను జ్ఞాని తన జీవితంలో ప్రతీ అణువునా అనుభవించి చెప్పిన మాటలు అవి. అందుచే కోరిక లేకుండా చేసుకో. పాపం వలన, మాయ వలన, మలం వలన, కోరిక ఉదయిస్తుంది. ఆ కోరిక మంచిది కావచ్చు, చెడ్డది కావచ్చు. ఏదైనా విసర్జించాలి. భోగ దృష్టి ఉన్నవారికి ఎన్నడూ జ్ఞానం కలుగదు. మనం సంపాదించేది మనమే తినాలి అనుకోవటం పాపం. జాగ్రదవస్థ కన్న స్వప్నావస్థ కన్న మనం సుషుప్తి అవస్థలోనే భగవంతునికి సన్నిహితంగా ఉన్నాము. మన శరీరం మరణించినా మనం గాఢ సుషుప్తిలో ఎక్కడ ఉంటామో అక్కడే ఉంటాము. చావు మనకు స్నేహితుడులాంటివాడు. పాత శరీరం తీసుకొని కొత్త శరీరం ఇస్తాడు. యజమాని పంట చేతికి వచ్చే వరకూ నిరీక్షించి కోస్తాడు. అలాగే దుర్మార్గుడి చేష్టలు ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు కాని వాళ్ళు అనుకొంటారు మన చేష్టలు బాగానే జరిగిపోతున్నాయి ఎదురులేదు అనుకొంటారు. కాలం కోసం ఆయన ఎదురుచూస్తూ ఉంటాడు, సమయం కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. దాన్నే మన పెద్దలు అంటారు "కుంచం నిండాలి" అని, అప్పడు మొదలు పెడతాడు కోత.

46. శ్రుతిమించకుండా ఏ విషయంలోనైనా చూచుకోవాలి. "అతి సర్వత్ర వర్జయేత్" అన్నారు. తెలివిగలవారు ఎక్కువ వింటారు. తక్కువ మాట్లాడతారు. వ్యక్తి భావన తగ్గించుకోవాలి. మీరు చేసే మంచి పని మీ హృదయంలో ఉన్న పరమాత్మ చూస్తూనే ఉన్నాడు. మోక్షాన్ని ఇచ్చేది ఆయనే. కాని మీరు ఏమనుకొంటున్నారు ఆ విషయం అందరికీ తెలియాలి అనుకోవటం వలన అజ్ఞానం పెరుగుతుంది. మన వీపు మనకు కనబడదు. అలాగే మన పొరపాట్లు మనకు కనబడవు. ఇతరులకు కనబడతాయి. జ్ఞాని మాత్రమే స్వతంత్రుడు. ఆత్మలో నుంచే అతడు అనంత సుఖాలను పొందుతాడు. బాహ్య కారణాల వలన వచ్చే సుఖాలను కోరుకోడు. విత్తనం భూమిలో మొలకెత్తుతుంది. అక్కడే పెరుగుతుంది. అక్కడే లయమౌతుంది. మనం ఆత్మలోనే క్రీడించాలి. మానవుని అన్ని అవస్థలకు ఆత్మే ఆధారం. కర్మేంద్రియాలతో పని చెయ్యండి. మీ హృదయంలో పరమాత్మను స్మరించండి. ఎక్కడ "కృషి" ఉంటుందో అక్కడ "కృప" ఉంటుంది.

srinannagaru.com

అక్కడ జయం ఉంటుంది. మనతో చూడబడేది అంతా నశించేదే, మన మనస్సు, శరీరం, ఈ దృశ్య ప్రపంచం అంతా నశించేదే. అద్దానికి ఎంత ప్రయోజనం ఉందో ఈ సృష్టికీ అంతే ప్రయోజనం ఉంది. అద్దం నీ ముఖంలో మసిని పోగొట్టదు. నీవే తొలగించుకోవాలి. ఈ సృష్టిలో ఎవరైనా ఏదైనా అంటే అది నీలో ఉన్న లోపంగా గ్రహించి నీవే తొలగించుకోవాలి. కుండలో ఉన్న అన్నం కుండలోనే ఉండాలి, అబ్బాయి దుడ్డుగా ఉండాలి అనుకొంటే ఎలా, మనం అహంకారాన్ని విడిచిపెట్టం, మోక్షం కావాలి అని కోరుకొంటాము. మనం శాంతిలోనే ఉన్నాము అది తెలియక అశాంతిలో ఉన్నాము అని భావిస్తున్నాము. భగవాన్ కళ్ళలోకి చూస్తే మనస్సు నికలడ చెందుతుంది. జయమే మనకు శత్రువు. దాని వలన పొంగు వస్తుంది.

47. మిమ్ములను విమర్శించిన వారే మీకు నిజమైన స్నేహితులు. స్వంత ఆలోచన అవసరం. ఎత్తు వారి బిడ్డలు కాకూడదు. ఆలోచన పెంచుకొంటూ వెళితే విచక్షణ పెరుగుతుంది. మానవునికి ఉన్న అవయవాలలో ఎక్కువ సోమరి తనం "బ్రెయిన్"కి ఉంది. అది గురువు చెప్పే మాటలను ఆలోచింపనియ్యదు. ఎదుటివారిని ప్రేమించటంలో ఉన్న తీపి తనాన్ని మీరు ఎప్పుడైనా చూచారా. ఆ తీపి చూస్తే మీకు భగవంతుని అనుగ్రహం ఉంటుంది. తెలిస్తే ప్రేమించకుండా ఎలా ఉండగలం. మీ మాటను, శక్తిని, ఉబ్బును ఇమిడ్చుకోవాలి. పైకి అతిసామాన్యంలా కనిపించాలి. పూర్వకాలం మట్టి రోడ్లు ఉండేవి. ఇప్పుడు కంకర, తారు, సిమెంటు రోడ్లు వచ్చాయి. పూర్వకాలం మహాత్ములు పూజ, జపం, ధ్యానం గురించి చెప్పేవారు. ఆధ్యాత్మిక మార్గంలో ఇప్పటి మహాత్ములు తేలిక మార్గాలను చూపుతున్నారు. సాధకుడు నిందను వదలాలి. ఇది బాగా గుర్తు ఉంచుకోండి. నిందించటం వలన ప్రకృతి మూలంతో కలిసిపోతాము. ప్రకృతి మీకు ఏమీ కలిసిరాదు. విమర్శనాదృష్టికి వెళితే దానికి అంతులేదు. సాధన చెయ్యలేక మనస్సు బాహ్యపరిస్థితులు ఆటంకంగా ఉన్నట్లు భ్రమపడతారు పోరాటం లేనిదే పదవిరాదు, సాధన చెయ్యనిదే సిద్ధి లభించదు. తెలిసిన గొడవలకే ఇంత కంగారు పడుతున్నారు. తెలియని గొడవలకు ఇంకా ఎంత కంగారు పడిపోతారో. తలంపుల వలనే మనలోని బలహీనతలు తెలుస్తాయి. ధ్యానం వలన మనలోని వాసనలు కదులుతాయి. కోటలో శత్రువు ఒకడు వచ్చినప్పడు వాడిచేతిలో చనిపోయామని అనుకోండి. కోట ఎలా స్వాధీనమౌతుంది. శత్రువులు అంతా మిగిలే ఉన్నారు. తలంపుల నుంచి పోరాడలేక నిస్సహాయతలో పడిపోయి సాధన ఆపుచేస్తే ప్రయోజనం కూడా అంతే. వేటగాడు బాణం పుచ్చుకొని లేడిని వెంటాడి

srinannagaru.com

ఎలా హతమారుస్తాడో అలాగే మీరు ఈ జన్మలోనైనా, మరుజన్మలోనైనా ఈ "నేను"ను వెంటాడి నాశనం చెయ్యాలి.

48. దేహాన్ని ప్రారబ్ధానికి వదలి మీరు వచ్చిన పని మీరు చూచుకోండి. "నీవు రాముణ్ణి భజించు, ఆయన ఎవరో తెలుసుకొని భజించు" అన్నారు త్యాగరాజు. మనం నేర్చుకొన్నది ఆచరించగలిగినది ఆచరించాలి. ఆచరించలేనిది ఆచరించటానికి ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నమే సాధన. సాధనతో అన్ని సాధ్యమౌతాయి. విసుగు పొందే చిత్తం గలవాడు దేనినీ సాధించలేడు. సమాధి స్థితిలో ఉన్నవానికి మాత్రమే తన హృదయంలో ఉన్న నిజం ఎరుకలోకి వస్తుంది. సహనంలేని వాడు సమాధి స్థితిని సాధించలేడు. మనస్సు హృదయంలో ఉంటే దానికి మేత సరఫరా తగ్గుతుంది. దుఃఖం వలన, భయం వలన మనిషి కృంగిపోతాడు. ధైర్యవంతుడు మాత్రమే మనస్సును అంతర్ముఖం చేసుకోగలడు. యోగం ఉన్నవానికి దుఃఖంతో సంబంధం తెగిపోతుంది. బుద్ధి యొక్క లోతులు తెలియని వానికి, అల్ప బుద్ధులకు ఏ యోగం అభ్యసించినా అభివృద్ధి చెందలేడు. మీరు నిండుగా జీవించాలి, లోతైన నది గంభీరంగా ప్రయాణం చేస్తుంది. మీ జీవితం గంభీరంగా సాగాలి. బాహ్య సంతోషాలు, వికారాలు నిజం కావు. అవి మనస్సు యొక్క వికారాలు. ఈ తాత్కాలిక వికారాలకు పరిమితమైతే శాశ్వత వస్తువుకు దూరమౌతావు. జ్ఞానికి బాహ్య పరిస్థితుల వలన దుఃఖం వచ్చినా ఆత్మలో మహా సముద్రంలో పడ్డ నదిలా, అగ్ని గోళంలో పడ్డ మిణుగురులులా లయమవుతుంది. "అపకారం చేస్తే క్షమించగల్గుతున్నాను, కాని ఆ క్లేశం మర్చిపోవటం సాధ్య కావటంలేదు" అన్నారు ఒక సాధకుడు. కాని మర్చిపోకపోతే మహాత్ములు కాలేరు. నిగ్రహం లేని వానికే ఆగ్రహం వస్తుంది. వాస్తవ పరిస్థితుల మీద ఆధారపడి విశ్వసించాలి. మూఢ విశ్వాసాలు, నమ్మకాలపై ఆధారం పెట్టుకోకూడదు. పూజ పనిని నేర్పుతుంది, క్రమ శిక్షణను కలుగ చేస్తుంది. ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం లేకుండా బ్రహ్మానుభవం కలుగదు. అజ్ఞాని ప్రపంచాన్ని చూస్తూ ఆనందించాలని భావిస్తూ బంధంలో చిక్కుకుంటాడు. ధైర్య లక్ష్మి, సహనం, ఓర్పు, విశ్వాసం ఇవి ఆత్మానుభవానికి సహకరిస్తాయి.

49. ప్రతీ విషయానికి కొందరు మనస్సును పుండు చేసుకొంటారు. వారు అభివృద్ధి చెందలేరు. మనస్సు వికారం చెందుతూ ఉంటుంది. అది మానదు. మనకు నిజమైన సారం ఆత్మే. దానికి హెచ్చు తగ్గులు లేవు. నీ ముఖం ఎంత శుభ్రంగా ఉన్న అద్దం కదులుతూ ఉంటే నీ ముఖం ఎలా కనబడదో అలాగే నీ అంతఃకరణం నిర్మలంగా లేకపోతే నీ స్వరూపం వ్యక్తం కాదు.

srinannagaru.com

లోకంతోనూ, దేహంతోనూ, అహంకారంతోనూ నిరంతరం నీవు ఉంటే జ్ఞానం రాదు. ఎప్పుడూ సుఖపడాలి అనుకొనే వాడికి ఏమీ రాదు, కష్టపడే వాడికే అన్నీ వస్తాయి. సాధనలో దేహగతమైన సుఖాలను, భోగాలను అన్నీ వదులుకోవాలి. యోగం వలన జ్ఞానం వస్తుంది. ఎవరైనా మిమ్ములను విమర్శిస్తూ ఉంటే మీరు దుఃఖపడుతూ ఉంటే వారికి సంతోషం కలిగించే వారమౌతాము. మరలా విమర్శించే అవకాశం మీరు కల్పించినవారు అవుతారు. అవతల వారికి మీరు ఆ అవకాశం ఎందుకు ఇయ్యాలి. ఏదైతే మీరు నిరంతరం ఆలోచిస్తూ ఉంటారో అదే మీరు అవుతారు. మన ఆలోచనలు ఎలా ఉన్నాయో మనం తెలుసుకోవాలి. అస్తమాను కష్టాల గురించి ఆలోచించకండి. జ్ఞానం పొందాలనే తపన నిరంతరం ఉండాలి. భగవంతుని మీద భారం వేసేకొలది భయం, కంగారు తగ్గిపోతుంది. ఆందోళన తగ్గిపోతుంది. దోషాలు రాలిపోతాయి. మనస్సుకు ఆధారమైన తలంపులు నశిస్తాయి. భయం వలన తొందరగా ముసలితనం వస్తుంది. భగవంతుని మననం చెయ్యటం కూడా మర్చిపోతాము. స్థిత ప్రజ్ఞుడు అంటే ప్రజ్ఞ స్థిరంగా ఉండటం, గీతలో 2వ అధ్యాయం పారాయణ చేయటం వలన ఆత్మానుభవానికి సహకరిస్తుంది. భగవాన్ అనేవారు "ఈ భౌతిక సంఘటనలకు, ఈ అబద్ధాలకు బెంగలు కూడా ఎందుకు" అనేవారు. నీ మనస్సు కుదురు పడితే గైడెన్సు నీ లోపల నుంచే వస్తుంది.

50. మాట్లాడటం కోసం మాట్లాడ కూడదు; అతిగా మాట్లాడకూడదు. అందరూ మాట్లాడుతున్నారని మనం మాట్లాడకూడదు. మనస్సు సోమరితనంగా ఉంటే సంక్షోభం తీసుకొని వస్తుంది. ఏదో ఒకటి వ్రాసుకో, పని చెయ్యి, అధ్యయనం చెయ్యి. కాలాన్ని దుర్వినియోగం చేస్తే భగవంతుని అవమానించినట్లే అని గుర్తుంచుకొంటే జాగ్రత్త వస్తుంది. కారణం లేకుండా కొందరు ఇతరులను ద్వేషిస్తూ ఉంటారు. అది ఒక బలహీనత, అది ఒక అలవాటు వాళ్ళకు. వాళ్ళు మన క్షేమాన్ని కోరుతున్నారు, వాళ్ళు ద్వేషిస్తున్నారు అనుకొంటే మన అజ్ఞానం పెరుగుతుంది. ప్రతీవాళ్ళు ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఇతరులను విమర్శిస్తాము. చీకటి లోకాలకు వెళ్ళిపోతాము. ఆత్మ విమర్శ వలన "సత్యం" అనుభవంలోనికి వస్తుంది. మాటలోని ఉన్న అందం, ప్రేమలోని ఉన్న అందం చూడలేని మనిషికి ఆనందం అందే అవకాశం లేదు. ఇతరులు నిన్ను విమర్శిస్తూ ఉంటే, అవమాన పరుస్తూ ఉంటే నీవు ఓర్పు వహిస్తే నిన్ను దేవతలు ఆశీర్వదిస్తారు. మహమ్మద్ ప్రవక్త అనుచరుడు "ఆలీ"ని విమర్శిస్తూ ఉంటే ఉండలేక తట్టుకోలేక తిరగబడ్డాడు. వెంటనే ఆయన్ని మహమద్ వదిలేసాడు. కారణం ఏమిటి అంటే మహమద్

srinannagaru.com

అన్నారు "నీవు తిరగబడ్డావు. వెంటనే నిన్ను దేవతలు వదిలేసారు; వారు వదిలిన తరువాత నిన్ను నేను వదిలాను" అన్నారు. పరిస్థితుల ప్రభావం వలననే స్నేహితులు, విరోధులు ఏర్పడతారు. అదీ నిజం కాదు, ఇదీ నిజం కాదు. చూచేవాడే నిజం కానప్పుడు చూడబడేది ఎలా నిజమౌతుంది? దేహగతమైన "నేను"కు భయంకాని, ఉపాధి రహితమైన "నేను"కు భయంలేదు. భయం ఉన్నవాడు ఎన్ని సాధనలు చేసినా రాణించడు. కొందరు వారి నీడను చూచి వారు భయపడతారు. మీకు జ్ఞానం కావాలంటే పాప-పుణ్యాలు రెంటికీ అతీతంగా ఉండాలి.

51. రూపాలు, పేర్లు, పనులు లేకపోతే వ్యవహారాలు నడవవు. కాని ఆపేరే నిజమనుకొంటాము. నలుపు, తెలుపు అనేది వదిలేయండి. మంచి పనులు, చెడ్డ పనులు వదిలేయండి. లేకపోతే ఆ పనులు జ్ఞాపకం ఉండి వాడు అటువంటి పనులు చేసాడు అనుకోవటం వలన, అజ్ఞానం పెరుగుతుంది. భేద బుద్ధి గలవాడు సుఖపడడు, దుఃఖిస్తూనే ఉంటాడు. చైతన్యంగానే చూడు. రామ నామం కన్న కృష్ణ నామం కన్న మీకు విలువైనది చెబుతున్నాను "మాట జారకండి" మాట మాట్లాడేటప్పుడు మూడు సార్లు ఆలోచించి, మాట్లాడండి. మాటే మంచి-చెడులను తీసుకొని వస్తుంది. భగవాన్ మాట మీకు అర్థంకావటం లేదు అంటే మీ వాసనలే ఆ మాటను నమ్మకుండా చేస్తున్నవి. అభ్యాసం లేకుండా వైరాగ్యం రాదు. సాధకుడు, మనస్సును, మాటను జారనియ్యకూడదు. లోకంలో ఉన్న దుమ్ము అంతా మనస్సులో పడకుండా ధ్యానం చెయ్యండి. విచారణ చెయ్యండి. మానవుడు ముందు ఊహించుకొంటూ ఉండటం వలననే భయానికి లోను అవుతాడు. సాధనకు శారీరక, మానసిక ఆరోగ్యాలు కూడా చాలా అవసరం. హృదయాన్ని కేంద్రంగా పెట్టుకొంటే ఈ లోకం అంతా దేవాలయంగా కనబడుతుంది. ఏకాంతవాసం-సహవాసం-గుహవాసం ప్రతీ వారికీ కావాలి. ఏకాంతంలోనే మన తలంపులు తెలుస్తాయి. మనకంటే చైతన్యస్థాయిలో పెరిగిన వారితో సహవాసం చెయ్యటం వలన ప్రయోజనం ఉంది. గుహవాసం (హృదయంతో) ఉండగల్గితే పై రెండూ చెయ్యవచ్చు, చెయ్యకపోవచ్చును. దేహ ప్రారబ్ధం ఖర్చు అయ్యేవరకూ ఈశ్వరుడు ఈ జీవుడుని బయటికి తియ్యడు. ఒక్కొక్కసారి ఏకాంతవాసంలో ఉంటాము. ఒక్కొక్కసారి పదిమందిలోనూ ఉంటాము. అప్పుడు కూడా సాధన విడిచిపెట్టకూడదు. అక్కడ అజాగ్రత్త పనికి రాదు. వాస్తవ దృష్టి ఉన్నవానికి ఏకాంతం ఉంటుంది. బాహ్య దృష్టి ఉన్నవానికి అంతా "సంతే".

srinannagaru.com

52. మన మనస్సులో వికారం వలననే గురువును ప్రేమించలేక పోవచ్చును. కాని గురువు ఆ సంగతి తెలుసుకొని, దయతో అతని వికారాన్ని గుర్తించి ప్రేమిస్తాడు. తెలియక చేస్తున్నాడు అనుకొంటాడు. ఒకడు భగవాన్ ఫొటోలోని ఆయన తలపై తన కాళ్లను పెట్టి ఫొటో తీసి ఆయనకే పంపాడు; ఆయనపై నిందా స్తుతులతో పుస్తకం వ్రాసిన వానిని కూడా భగవాన్ ప్రేమించారు. దేహబుద్ధిలేని జ్ఞానికి దేహంలేదు. మనస్సు లేదు. ప్రపంచం లేదు. అహంకారం దాటిన వానికి గౌరవం ఏమిటి? అగౌరవం ఏమిటి? గురువు కూడా దేహానికే పరిమితమై యున్నాడని భ్రమ పడతాము. ఆత్మ విశ్వాసం విడిచిపెడితే సాధన చెడిపోతుంది. పిరికితనం వచ్చేస్తుంది. వాడి మీద వాడికి విశ్వాసం లేనివాడు పనిని నిజాయితీగా చెయ్యలేడు. సాధన చేస్తేగాని సత్యం తెలియబడదు. భగవాన్ అనేవారు "మీరు సత్యం గురించి ఎవరికైనా చెప్పాలంటే తేలిక పదాలతో చెప్ప, అది దొరకనప్పడు, తప్పనిసరి అనుకొన్నప్పడు మాత్రమే పెద్దమాటలను ఉపయోగించు" అనేవారు. పెద్ద మాటలను చెప్పటం అలవాటు చేసుకొంటే అది లగ్జరీ అవుతుంది. నిర్మలమైన భక్తి, నిర్మల హృదయుడు మాత్రమే శరణాగతి పొందుతాడు. వాడు మాత్రమే శాంతంగా ఉండగలగుతాడు. ఫలితాన్ని ఆశించకుండా భగవంతుని ప్రేమించాలి. మనలో కొన్ని దోషాలు ఉంటాయి. మీరు ఎవరినైనా ద్వేషిస్తూ ఉంటే ఆత్మకు దూరమౌతారు. తిరిగి రావాలంటే అంతే నిగ్రహంతో వెనుకకు రావలసి వస్తుంది. స్పష్టత లేకపోతే, గందరగోళం వచ్చేస్తుంది. ప్రతీ విషయంలోనూ మనం స్పష్టతను దృష్టిలో ఉంచుకొని ఆలోచించాలి. మీ శత్రువుని కూడా ప్రేమించినప్పడు మీకు జ్ఞానం కలుగుతుంది.

53. ఉద్రేకంలోనూ, ఆందోళనలోనూ నిర్ణయాలు తీసుకొంటే, తప్ప నిర్ణయాలు అవుతాయి. కొంతకాలం చూచి స్థిమితమైన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. మీ మనస్సుకు "ఆహారం" అందచేయకండి. అంటే మిమ్ములను ఎవరైనా తిట్టినా, పొగిడినా, విమర్శించినా మీ మనస్సుకు ఆహారం అందుతుంది. అది లేకపోతే చిరిగిపోతుంది. మీరు మిమ్ములను తిట్టిన వారిని తిరిగి తిడితే దానికి విందు భోజనం పెట్టినట్లే. విష్ణు పురాణంలో ఇలా ఉంది "పని వద్ద అశ్రద్ధ ఉండి, చేయగల శక్తి ఉండి ఆ పని నుంచి తప్పించుకొని చూచేవాడు భక్తుడు కాడు. కేవలం యాంత్రికంగా 'కృష్ణా' అనుకొన్న వాడు భక్తుడు కాడు, శత్రువు; అంటే పని నుంచి తప్పించుకొనాలనే తలంపుతో పూజ చెయ్యటం భగవంతునికి అవమానం చేసినట్లే భావించాలి". శాస్త్రాన్ని శ్రవణం చేస్తూ ఉంటే ఆలోచననే కేంద్రంగా పెట్టుకొంటే గాని అహంకారం జాడ తెలుసుకోలేము. దీర్ఘ భ్రాంతి

srinannagaru.com

వలననే హృదయంలో ఉన్న దేవుని గుర్తించలేకపోతున్నాము. అది దీర్ఘ శరణాగతి వలననే ఆ భ్రాంతి పోగొట్టుకోగలము. మనవైపు నుంచి చింతన కావాలి. అవతల వైపు నుంచి అప్పుడు అనుగ్రహం వస్తుంది. ఎనర్జీ (ఆత్మ) ఒక పక్కన, మేటరు (ప్రకృతి) ఒక పక్కన ఉంది. మనిషి ఎన్ని జన్మలు ఎత్తినా ఒకటే చేస్తున్నాడు. చేయటం అనుభవించటం, రెండో పనిలేదు. విషయాన్ని తెలిసుకో లేకపోతే మంచికి మంచి, చెడుకు చెడు అనుభవించి తీరాలి. గాయత్రీ మంత్రం సారం "నా బుద్ధిని ఆత్మ వెలుగులో నింపు". "ఓం" అనేది చైతన్యం నుంచి వచ్చిన మొదటి శబ్దం. నిజమైన భక్తునికి "భగవంతుని సంకల్పమే నా సంకల్పం" అనుకొంటాడు. "నీ ఇచ్ఛయే నెరవేరుగాక" అని అనుకొంటాడు. నీవు ఎక్కడ ఉంచితే అక్కడే ఉంటాను అనుకొంటాడు.

54. మీ దుఃఖానికి, మీ అశాంతికి "మీ నేనే" అడ్డు వస్తున్నది, అనే విషయం మీకు తెలియటం లేదు. మీరు రంగుతోనూ, కులంతోనూ, చదువుతోనూ ఎలా తాదాత్మ్యం పొందుతున్నారో అలాగే ఆత్మతో తాదాత్మ్యం పొందితే జ్ఞానం వచ్చేస్తుంది. మానవుడు వ్యక్తి భావనలో నుంచి బయట పడే మాటలను, చేతలను చెయ్యాలి. మోహపడే ఈ "నేను" ఎవరని గ్రహించుకోండి; తలంపులు ఎక్కడ నుంచి వస్తున్నాయో ప్రశ్నించుకోండి. లేకపోతే తలంపులు పెరుగుతాయి. జ్ఞానానికి పునాది వైరాగ్యం; వైరాగ్యం లేనిదే జ్ఞానం రాదు. శ్రవణం చేసింది ఆపత్ కాలంలో గుర్తుకు వచ్చి, కాపాడుతుంది. కొందరికి భావ దారిద్ర్యం ఉంటుంది. వాడు జ్ఞానం పొందే అవకాశం ఉండదు. అది పనికిరాదు. ఎదుటి వారి క్షేమాన్ని కోరుకోవాలి. మీకు నచ్చిన వ్యక్తి గొప్ప వ్యక్తిగా తెలపటానికి మరొకరిని కించపరుస్తూ మాట్లాడ నక్కరలేదు. వృద్ధాప్యం బానిసత్వాన్ని తెచ్చిపెడుతుంది. కారణం వాళ్ళు ఏమీ చెయ్యలేరు అనే భావనలో రోజులు వెళ్ళబుచ్చుకోవాలని అనిపిస్తుంది. ఒంటరిగా ఉన్నప్పుడు గౌరవంగా మాట్లాడుతారు. నలుగురిలో ఉన్నప్పుడు అగౌరవంగా మాట్లాడుతారు. అటువంటి వారిని ఎప్పుడూ నమ్మవద్దు. మౌనంలో మాటకందని వస్తువు, లభ్యమౌతుంది. నిర్మలమైన చూపు, నిర్మలమైన మాట ఆ వ్యక్తి సాధనలోని పరిపక్వాన్ని సూచిస్తుంది. ఆలోచన, పని సవ్యంగా ఉంటే బుద్ధిలోని దోషాలు పోతాయి. మనం ప్రతీచిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకొంటే మనస్సు అణగదు; రజోగుణం పెరుగుతుంది. వికారం పొందే పరిస్థితులు ఎదురుగా ఉన్నా ఎవరి మనస్సు వికారం చెందదో వారిపైన ఈశ్వరానుగ్రహం వర్షిస్తుంది. జ్ఞాన వైభవాన్ని చూచి ఆనందించే శక్తి లేనప్పుడు మనం కుళ్ళిపోయిన వాళ్ళతో సమానం.

srinannagaru.com

55. ఏ కార్యానికైనా సత్వగుణం పునాదిగా లేనప్పడు మనం ప్రయత్నం చేసినా సఫలం కాలేము. తపస్సుకు "ఓర్పు" అవసరం. చదువుకు "శ్రద్ధ" అవసరం. ఎన్నికలలో సామ, దాన, భేద దండోపాయాలతో పోరాటం జరిపి నెగ్గుతారు. అలాగే మనస్సును జయించాలి. మనస్సు అణిగితే కాలం లేదు, నిద్రలో కాలం లేదు. అనుబంధం వల్లనే వ్యక్తిగతమైన "నేను" ఉంటుంది. లేకపోతే ఏమీ లేదు. ఉన్నది విశ్వగతమైన "నేను" ఒక్కటే. దేవుని సాన్నిధ్యం కోసం మన కాలాన్ని వినియోగిస్తే నీకు అనుగ్రహం వస్తుంది. ఒకడు ఇలా అన్నాడు "నేను కుందేటి కొమ్ముతో పులిని చంపేసాను". పులిని చంపటం మాటలు కాదు. పైగా కుందేటి కొమ్ముతో. అసలు కుందేలికి కొమ్ములు ఉండవు. అలాగే మన సాధనతో అహంకారాన్ని జయించటం లాంటిది. జప, ధ్యానాల వలన నీవు బ్రహ్మను పొందలేవు, అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి ఒక ప్రయత్నం మాత్రమే. అలాగని సాధన మానవద్దు. బయటికి అందరిలాగే సాధారణంగా ఉండాలి. శక్తి లోపల నుంచి వస్తూ ఉంటే ఇముడ్చుకోవాలి. మనం సామాన్య మానవునకు దూరం కాకూడదు. లోపల బలం పెంచుకోవాలి. అవసరాన్ని బట్టి పనిచెయ్యండి. అలవాట్లను బట్టి పనిచెయ్యకండి. నాకు ఒక ఉద్యోగం కావాలి అంటే ఒక డిగ్రీ కావాలి. అలాగే నీకు బ్రహ్మానుభవం కావాలంటే భగవంతుడు ఒకడు ఉన్నాడు "ఈ సృష్టికి కంట్రోలరు ఒకడు ఉన్నాడు" అనే విశ్వాసం నీకు ఉండటమే నీ అర్హత. ఏ విషయమైనా మనకు అర్థమైతే ఆచరిస్తాము. అర్థం కావటానికే ప్రవచనాలు. మన సంసార జీవనానికి ఉపయోగపడే పనే నిజమనుకొంటాము. "నేను"ను తొలగించుకొనే ఆధ్యాత్మిక జీవనం కూడా పనే. కాని అది పని అని అనుకోవటం లేదు. అదే నిజమైన పని.

56. భగవాన్‌ని ఒకరు ఇలా ప్రశ్నించారు "ప్రపంచానికి సేవ చెయ్యాలి అనుకొంటున్నాను; ఏమి చెయ్యమంటారు" అనగా ముందు "నేను"ను తొలగించుకో, ప్రపంచానికి సేవ చేసినట్లే. వేద పారాయణం వినటంలో దాని అర్థం తెలియకపోయినా, ఆ పవిత్ర స్వరం వినటం వలన మనో నిగ్రహానికి సహకరిస్తుంది. దాని ఫలితం తప్పకుండా ఉంటుంది. మనస్సులో ఉన్న దోషాల వలననే ఉన్న వస్తువు ఉన్నట్లు తెలుసుకోలేకపోతున్నాము. ఈ సృష్టి స్వప్నమైనప్పటికీ మనకు తెలియటం లేదు. వాస్తవంగా ఈ సృష్టి ఉన్నట్లు అనిపిస్తున్నది. సంకల్పం నశిస్తే మనస్సు నశిస్తుంది. మానవుడు సుఖపడాలంటే గతాన్ని మర్చిపోవాలి. కాని అహంకారం గతాన్ని మర్చిపోనివ్వదు. అహంకారం గుర్తిస్తేగాని అది నశించదు. మన దేహాన్ని ప్రారబ్ధమే పోషిస్తున్నది. నీవు ఏదైనా కోరుకొన్నా కోరుకోక

srinannagaru.com

పోయినా అది వచ్చి తీరుతుంది. మంచి ఆరోగ్యవంతమైన మనస్సు కోసం పనిచేస్తే జ్ఞానం వస్తుంది. ఆ సూచనలు ఉన్నాయి. తన కోర్కెను వ్యక్తం చేసుకోవటానికి ఇంద్రియాల ద్వారా నెరవేరుస్తాడు ఈశ్వరుడు. కోరిక మూలం గానే జన్మ వస్తుంది. మన దేహ బుద్ధి, కుల బుద్ధితో ఆలోచిస్తున్నది. జప ధ్యానాల ప్రయోజనం పై రెంటినుండి విడివడి చైతన్యంలో తాదాత్మ్యం చెందటానికే. ఆత్మ వస్తువు కోసం ఎదురు చూడకండి, మీ చేతిలోని పనిని మీరు నిజాయితీగా చెయ్యండి. నేను మనిషిని అనుకోవటం నిజస్థితి కాదు. "నేను ఉన్నాను అనుకోవటమే" సహజస్థితి. మనం ఏదిగా ఉన్నామో అది సాధనా బలం వలన మనకు అనుభవంలోనికి తీసుకొని వస్తుంది. అది కొత్తగా తెచ్చేది కాదు. మనుషులలో నూటికి 80 మంది పిచ్చివాళ్ళు ఉంటారు. ప్రతీ చిన్న విషయానికీ ఉద్రేకపడుతూ ఉంటారు. వాళ్ళను చూచి మనం కంగారుపడుతూ ఉంటే మనం అదే స్థితికి వచ్చినట్లే.

57. మిమ్ములను చూచి ఎవరైనా అసూయ పడుతూ ఉంటే మీరు దాన్ని గుర్తించకండి. వారి గూర్చి మనస్సు పాడుచేసుకోండి. కోటీశ్వరుని చూచి పేదవాడు అసూయ పడతాడు. కాని పేదవాడిని చూచి కోటీశ్వరుడు అసూయ పడడు. సందర్భం గాని మాటలు, వికారం గల మాటలు, అసహ్యం గల మాటలు మాట్లాడుతూ ఉంటే వారిని గురించి మీరు కంగారు పడకండి. వారు ప్రకృతి గుణాల వలన మాట్లాడుతున్నారు అని సరిపెట్టుకోండి. అవి గుణాల యొక్క చేష్టలు, ప్రకృతి గుణాలు దాటితే బ్రహ్మానుభవం పొందుతారు. మనకు భయం కలుగుతూ ఉంటే భగవంతుడి మీద భారం వేయటం లేదన్నమాట. మనం ఒక కారులో ఒక గ్రామానికి వెళ్ళాలి, అందుకే కారులో కూర్చుంటాము. అంతేగాని కారులో కూర్చోవాలని కూర్చోవటం లేదు. మీ దేహ ప్రారబ్ధంలో వచ్చే కష్ట-నష్టాలు వచ్చినప్పుడు ఆగిపోకుండా గమ్యానికి వెళ్ళాలి. కారులో మనం ప్రయాణం చేస్తూ ఉంటే లారీలు, కార్లు అనేక మంది వ్యక్తులు ఎదురు అవుతారు. వాళ్ళను తప్పించుకొని గమ్యాన్ని చేరాలి. సహృదయం ఉన్న వానికి సద్ వస్తువు లభ్యమౌతుంది. అదే పెద్ద ఆస్తి. మిమ్ములను ఎవరైనా ద్వేషిస్తూ ఉంటే మీకంటే తక్కువ స్థాయిలో ఉండబట్టే మిమ్ములను ద్వేషిస్తున్నారు. వాళ్ళను చూచి మీరూ ద్వేషిస్తూ ఉంటే మీరు బహిర్ముఖులు అవుతారు. వాళ్ళు పుట్టుకతోనే ఎదుటి వాళ్ళను ప్రేమించలేరు. వాళ్ళను చూచి మీరు కంగారు పడకండి. మేథమెటిక్స్ పంథాలో గంటలు లెక్క పెట్టుకొని సాధన చేసుకొన్న వారికి ఎన్ని జన్మలు ఎత్తినా వస్తువు లభ్యమవ్వదు. హృదయ పూర్వకంగా, ఇష్టంగా, దాన్ని పొందాలనే కాంక్షతో చెయ్యాలి.

srinannagaru.com

అంతేగాని ఉదయం, సాయంకాలం ఇన్ని గంటలు చేస్తున్నాము అంటే అది సాధన కాదు.

58. మీ సంసారంలో మీకు వచ్చే కష్టాలు, నష్టాలు, ఇబ్బందులకు మీరు అవకాశం ఇస్తే, స్థానం ఇస్తే మీకు క్షోభ తెచ్చి పెడతాయి. నేను ధనవంతునిగా, రూపవంతునిగా ఉన్నాను అనుకొని ఆలోచిస్తే నీవు పరిమితిని కొనితెచ్చు కొంటున్నట్లే. ప్రకృతి రీత్యా వచ్చే కష్టాల కంటే, కులంతోనూ, కుటుంబ ద్వేష భావాలతో, అసూయలతోను ఎక్కువ నష్టం వస్తుంది. మీరు ఇతరులను నాశనం చెయ్యాలి అని అనుకొంటే జ్ఞానం ఎలా వస్తుంది. మనస్సు ఉన్నంతకాలం సాధన చెయ్యకుండా ఉండలేము. మనస్సు అణగిన తరువాత పొందే ఆత్మానందం, దేనితోనూ పోల్చటానికి సాధ్యంకాదు. దైవానుగ్రహం లేకపోతే చిన్న అలవాటు నుంచి కూడా మనం బయట పడలేము. మీ ఆత్మ విశ్వాసం పోగొట్టుకోకండి. ఇతరులు మీ ఆత్మ విశ్వాసంపై దెబ్బ తీస్తూ ఉంటే దానికి అవకాశం ఇయ్యకండి. ప్రతీదీ క్షణికమని గుర్తు ఉంచుకోండి. మీ సంతోషం కూడా మీ సాధనలో సగం బలం తీసుకొని వస్తూ ఉంటుంది. దిగులుగా ఉండకండి. మీరు హృదయ పూర్వకంగా ఎంత వరకూ సాధన చేయగలిగితే అంత వరకూ చేయండి. తరువాత ఈశ్వరానుగ్రహం కెరటంలా వచ్చి మిమ్ములను కృతార్థులను చేస్తుంది. కొందరు భోజన ప్రియులు ఉంటారు. వాళ్ళలో కూడా భగవంతుని చూడాలి. దేవుని అనుగ్రహం లేకపోతే, వాడి మనస్సులో పుణ్య సంస్కారం లేకపోతే దేవునికి దణ్ణం పెట్టాలనే తలంపు రాదు. శాస్త్రం "నీవు అదే" అంటున్నది. మరి నీవు మనస్సుతోనూ, శరీరంతోనూ తాదాత్మ్యం ఎందుకు పొందుతున్నావు. నీకు ఉన్న విశ్వాసం నిజమైతే నీవు ఆత్మగానే ఉంటావు. కొందరికి ప్రతీ విషయం లోనూ, సందేహం వస్తుంది. వాళ్ళు ఈ లోకంలోనూ, పరలోకంలో కూడా సుఖపడరు.

59. ఒక కంటిలో "ప్రేమ" ఒక కంటిలో "కరుణ" అంటించుకో. జ్ఞానం రాక ఏమౌతుంది. మన ఇంటిలోని వారిని ప్రేమించటం కాదు. కనిపించే సృష్టిని ప్రేమించాలి. మనలను మనం గొప్ప చేసుకొంటే అహంకారం పెరుగు తుంది. చలం జన్మదినం విషయంలో వారిని అడుగగా "ఈ వెధవ ఎప్పడు పుడితే ఏమిటి?" అన్నారు. ఇది వారి నిరహంకారానికి గుర్తు. జీవితంలో ఏమి నేర్చుకొన్నారు అనగా "గతంలో నాకు అన్నీ తెలుసును అనుకొన్నాను. నాకు ఏమీ తెలియదని ఇప్పడు గ్రహించాను. ఇతరుల గురించి తెలుసుకోవటం కన్న నా గురించి నేను తెలుసుకోవటం వలన నేను బాగుపడతాను అని గ్రహించాను" అన్నారు. మౌనం ద్వారా జ్ఞానాన్ని పొందే వారిని "పండిన పండు" అంటారు.

srinannagaru.com

ఉన్నది బ్రహ్మమే. కాని మనకు తెలియటం లేదు. కాబట్టి ప్రపంచం మాత్రమే ఉంది అనుకొంటున్నాము. సహజంగా ద్వేషించే వారి వద్ద విశ్వాసం లేని వారి వద్ద ఈ మాటలు చెబితే పెడర్థాలు తీసుకొంటారు. "అదే నీవు అన్నప్పుడు అదే నీవని చెప్పటం దేనికి" అని శంకరాచార్యుల వారిని ఒకరు ప్రశ్నిస్తే "నీవు కాని దానిని నీవు అనుకొంటున్నావు. కాబట్టి అలా చెప్పవలసి వచ్చింది. లేకపోతే చెప్పవలసిన పనిలేదు" అన్నారు. మీరు బ్రహ్మాన్ని గురించి ఒక గంట చింతించి మిగిలిన కాలం అంతా డబ్బు, ప్రకృతి విషయాలలో చింతిస్తూ ఉంటారు అనుకోండి మొదటి కాలంలోనే మీరు బ్రతికినట్లు. రెండవ కాలంలో మీరు మరణించినట్లే. కాలానికి విలువ ఇయ్యండి. భగవంతున్ని ప్రేమించాలి, ప్రకృతి గొడవ నుంచి బయట పడే వానికి మాత్రమే బ్రహ్మానుభవం పొందుతాడు. సందేహం కలవాడు నశిస్తాడు. మీరు ఆత్మే. నా విధి ఇలా ఉంది అని ఏడుస్తూ కూర్చోకుండా సాధన చేస్తూ ఉండండి. జీవితమే క్షణికం, ఎన్ని భోగాలు అనుభవించినా క్షణికమే.

60. మనస్సు చల్లగా ఉంచుకోవాలి. మనస్సు వికాశం పొందాలి. శరీరం -మనస్సు-తెలివి (B-M-I) లోనే ఉన్నాయి, లోపాలు అన్నీ. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అని భావిస్తూ ఉంటే కాలం ఖర్చు అవుతూ ఉంటుంది. మన జీవిత కాలం అంతా ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే మరణం వచ్చి మీద పడుతుంది. నీ ప్రాణాన్ని ఎలా కాపడు కొంటావో అలాగే నీ మూర్ఖత్వం పోవటానికి సత్ పురుషుల సహవాసాన్ని అలా కాపాడుకోవాలి. మీరు ముందు బాగుపడాలంటే జరిగిపోయిన గొడవలు తల పెట్టుకోకూడదు, కాలం ఖర్చు అవుతుంది, మృత్యువుకు, చేరుతాము. బ్రతికి ఉండగానే బ్రహ్మాను భవం పొందాలి. ఇబ్బందులలో ఉన్న వారిని ఆదుకొంటే వారు మహాత్ములౌతారు. చెట్టు ఉంది దాని దగ్గరకు వెడితే నీడ ఇస్తుంది. చెట్టు తన నీడ దగ్గరకు రమ్మనమని చెప్పదు. వివేకం ఉన్నవాడు ఆ నీడ దగ్గరకు వెళ్ళి సుఖపడతాడు. అలాగే నీ మనస్సు శాంతించాలి. అంటే శాస్త్రం వద్దకు, సత్ పురుషుల వద్దకు వెళ్ళాలి. మీరు ఎవరితోనైనా నాలుగు మాటలతో చెప్పే విషయాన్ని పది మాటలతో చెబితే అహంకారం పెరుగుతుంది. మాటలు మితంగా ఉండాలి. "ద్వైతం" లేకుండా "అద్వైతం" రాదు. సుప్రీమ్ స్టేజ్ (ఆత్మ) నుంచి దిగజారితే అడివిలో పడిపోతాము. బ్రహ్మం తప్ప అంతా అడివే. జగత్తు-జీవుడు-దేవుడు అహంకారం యొక్క కల్పితం. సాధకుడికి అంతులేని ఓర్పు, అంతులేని శరణాగతి వలన బ్రహ్మానుభవం కలుగు తుంది. ఓర్పు, పట్టుదల, పవిత్రత ఈ మూడు ఉన్న వానిని బ్రహ్మం వరిస్తుంది. టీనేజ్‌లో వచ్చిన భక్తి నిజమైనది. ముసలివాళ్ళమైన తరువాత ఎవరూ

srinannagaru.com

పలకరించనప్పుడు కాలక్షేపం కోసం "రామ, కృష్ణా" అనుకొన్నా అది ఇప్పుడు కాకపోయినా తరువాత జన్మలోనైనా ఉపయోగపడుతుంది.

61. మన గొప్పలు మనమే తెల్పుకుంటాము. ఎదుటివాళ్ళ బలహీనతలు చెబుతాము. కాని వాళ్ళ గొప్పలు చెప్పము. ఇది మనలో ఉన్న బలహీనత. అనుబంధం కూడా దోషమే. ప్రతీజన్మలోను శరీరాన్ని అంటిపెట్టుకొన్న ప్రకృతి గుణాలను దులుపుకోవటమే సాధన. ఉండవలసినంత వైరాగ్యం మనకు లేకపోవటం వలననే సాధన చెయ్యలేకపోతున్నాము. అందరితోనూ ఇష్టంగా ఉండాలి అనుకోవటం పిచ్చి, ఈ బుద్ధి కుక్క తోక లాంటిది. వైరాగ్యం గలవాణ్ణి చూచి విలాస పురుషుడు మెచ్చుకోడు. శ్రీరాముడే కొందరికి మంచివాడు కాలేదు. గంట గటంకూ మారిపోయే మనస్సును, రోగాలతో సతమతమౌతున్న శరీరాన్ని నమ్మినట్లు భగవంతుని నమ్మలేము. మన గుణాలు మన మనస్సును కుదురుగా ఉండనివ్వదు. "నా పట్ల, నీ విశ్వాసం నిజమైతే నిన్ను ఉద్ధరించి తీరుతాను" అన్నారు భగవాన్. జ్ఞాని ఎక్కడ మెలకువగా ఉంటాడో అజ్ఞాని అక్కడ సుఖంగా నిద్రపోతాడు. మనం రాగ-ద్వేషాలలో మెలకువగా ఉంటాము. కాని జ్ఞాని బ్రహ్మంలో మెలకువగా ఉంటాడు. అంటే వారిద్దరూ ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువంలా ఉంటారు. జ్ఞానిని తెలుసుకోవటం కాదు జ్ఞాని అవ్వటానికి ప్రయత్నం చెయ్యాలి. జ్ఞానికి బంధువుగా ఉండటానికి ప్రయత్నం చెయ్యకు. జ్ఞాని కావటానికి ప్రయత్నం చెయ్యి. మనకు మాటిమాటికీ కోపం వస్తూ ఉంటే మనం శాప గ్రస్తులం. ఎవరో శపిస్తేగాని ఆ కోపకారణంలో పడిపోము. తలంపులను జాగ్రత్తగా చూచుకోండి. ఎవరి పట్ల అయినా అమర్యాదగా మాట్లాడితే వారు బాధపడవచ్చు. అంతేకాదు మీ అహంకారం పెరుగుతుంది. అవినయం పనికిరాదు. ఇది మీ శ్రేయస్సు గురించి చెబుతున్నాను.

62. భేదం ఎవరు గ్రహించరో, వాడికి "యోగం" భంగం అవ్వదు. సృష్టిలో భేదాన్ని గ్రహిస్తాము. అందుకే భంగపడతాము. వాళ్ళ హృదయంలో పరమేశ్వరుని చూడరు. మనస్సును చూస్తారు. ద్వేషిస్తారు. దాని వలన అవతల వాళ్ళకు ఏమీ నష్టం ఉండదు. మనమే నష్టపోతాము. సాధన దెబ్బతింటుంది, కుంటుపడుతుంది. నిద్రావస్థలోని "స్థితిని" జాగ్రదవస్థలో తెచ్చుకొంటే నీవు శివుడవు అవుతావు. కుళ్లిపోయిన మనుషులను చూడవలసి వస్తే నీవు ప్రశాంతంగా చూడు. ఎదుటి మనిషిని చూస్తూ ఉన్నప్పుడు చల్లగా చూడు. పెళ్ళి జరుగుతున్నప్పుడు తెరతీసినప్పుడు ఒక మంత్రం ఉంది. "నెమ్మదిగా చూడు, చల్లగా చూడు" అంటారు. మీకు ఒక తలంపు వస్తున్నది అనుకోండి అది ఎలా

srinannagaru.com

వస్తున్నది. మీరు కంటితో ఒక దృశ్యాన్ని చూడాలంటే సూర్యకాంతి వెలుగు లేదా కరెంటు వెలుగు పడితే గాని మీ కన్ను దానిని గ్రహించలేదు. కాని తలకాయలోకి వచ్చే తలంపుకు సూర్యుడి వెలుగు, కరెంటు వెలుగు ప్రవేశపెట్టటం కుదరదు. సాధ్యం కాదు. కానీ నీ తలలోకి ఆ తలంపును పంపే వెలుతురు ఒకటి ఉంది. అది ఆత్మ వెలుగు. అది స్వయం ప్రకాశం. దానికి ఏ సహాయం అక్కరలేదు.

పరమ హంసగారు బోధ స్వరూపులు. ఆయన ప్రవచనం జరుగుతుండగా ఒక సాధకుడు ప్రక్క వ్యక్తితో "టైము అయిపోయిందని లే" అని గిల్లుతున్నాడు. ప్రక్కవారు ఊరికే ఉన్నారు. పరమహంసగారు ఒకటే బోధ ఇక్కడ మనం గ్రహించవలసింది ఒకటి ఉంది. ఇప్పడు వారి బోధలు చదువుకోవచ్చు కాని ఆ ముఖ వైభవం మనం చూడగలమా? ఆ కంఠం మనం వినగలమా? మరలా ఆయన పుడతారా? తెలివిగల వాళ్ళకు, తెలివి తక్కువ వాళ్ళకూ భగవంతుడు సమాన అవకాశాలు ఇస్తాడు. కాని తెలివి తక్కువవాడు ఆ అవకాశాన్ని ఒదులుకొంటాడు. జ్ఞాన బోధను తెలివిగలవాడు ఉపయోగించుకొని బాగుపడతాడు.

63. ఈ దేహాన్ని ఉపయోగించుకొని నిజతత్వాన్ని తెలుసుకోవాలి. పెళ్ళి కూతురును వివాహ సమయంలో తెరచాటు నుంచి కొంచెం కొంచెం చూచినట్లే మనం మన తలంపుకూ, తలంపుకూ మధ్య ఆత్మను మీరు చూడగల్గితే, మీకు ఆత్మ వైభవం కొంచెం కొంచెం తెలుస్తుంది. మీరు మూడు గుణాలను అలవర్చుకోవాలి. సహనం, ప్రేమ, మర్యాద. ఇతరులను అమర్యాదగా చూస్తే అహంకారం పెరుగుతుంది. మర్యాదగా చూడటం వలన అహంకారం తగ్గుతుంది. మీరు ఈ మూడు అలవర్చుకొంటే బ్రహ్మానుభవం కలుగుతుంది. మనకు ఈ "నేను" మనస్సుగా వ్యక్తమౌతున్నది. కారణం అదే మనమనుకొంటున్నాము. అందుచేత దుఃఖం వస్తున్నది. ఈ మనస్సు ఏ దేహంతో ఉంటే అదే నిజమనుకొంటున్నది. పూర్వ జన్మలోని దేహాలు-పరిసరాలు అలవాట్లు మనకు తెలియవు, కాని మీ తలంపులు ఏవైతే మీకు తెలియబడుతున్నాయో దాని ప్రకారం మన ఆలోచనలు, అలవాట్లు ఆ జన్మలో అలా సంచరించామని గ్రహించాలి. మనం చేసే ప్రతీ పని భగవంతుడు చూస్తూ ఉన్నాడు, అని ఆలోచించి పని చెయ్యాలి. భగవంతుని మీద ఆధారపడి భారం వేసి జీవించటం నేర్చుకోవాలి. ముందు నిశ్చయ తాంబూలం లేకుండా పెళ్లి జరగదు. అలాగే నీకు పై నిశ్చయానికి వస్తే ఆత్మానుభవం కలుగుతుంది. నీవు హృదయ పూర్వకంగా నీ మనస్సును హృదయానికి ఇచ్చావా? భగవంతుని హృదయ పూర్వకంగా ప్రేమించండి. మీరు బాగా అర్థం

srinannagaru.com

చేసుకోండి. మీరు జ్ఞానం యొక్క అవతారమే. ఉన్నది ఉన్నట్లు తెలిసే వరకూ లేనిది ఉన్నట్లు కనిపిస్తుంది. కాని దాన్ని నిజం అనుకోవటం వలన ఇష్టం అయిష్టం కలుగుతోంది. కాకి రెట్ట మీద పడితే దాన్ని పరిశీలించి ఇంట్లో పెట్టుకోము. అవతల పారేస్తాము. అలాగే నీకు ఆత్మానుభవం కలగాలంటే నీ సంపద మీద, నీ భోగాల పైన నీకు ఉండే భోగ ప్రవృత్తిని కాకి, రెట్టలా విసర్జించాలి.

64. మానవుడు ఏ తప్పు చేసినా మమకారం వలననే చేస్తాడు. ధృతరాష్ట్రునికి విదురుడు ఎన్నో నీతులు చెప్పాడు. మమకారం వలననే ఎన్నో తప్పులు చేసాడు. నదిలో మొసలితో పెనుగులాడి బయట పడవచ్చుగాని మమకారమనే మొసలినుండి బయట పడలేము. అవతార పురుషుని లేదా సద్ గురువు అనుగ్రహం వలన బయటపడగలవు. మరో మార్గం లేదు. నీవు నదిని దాటాలంటే ఒక స్టీమరునో, పడవనో ఉపయోగించుకొని దాటాలి. అంతేగాని మొసలి వీపు మీద కూర్చుని నదిని దాటాలి అనుకోవటం మూర్ఖత్వం. అలాగే నీవు దేహ బుద్ధితో, ప్రతిఫలాపేక్షతో పూజ యజ్ఞము, నదులలో మునగటము ఇవి అన్నీ మొసలి వీపుపై కూర్చుని ప్రయాణం చెయ్యటం లాంటిది. కాబట్టి నీవు దేహ బుద్ధిని విడిచిపెట్టు. నీవు ఆత్మవు. గొడ్డుటావుకు పచ్చిగడ్డి, దానా వేసి ఎంత మేపినా ఒక్క పాలు చుక్కకూడా ఇవ్వదు. అలాగే మనకు ఆత్మానుభవము నకు సహకరించని స్నేహాలు, చుట్టాలు, గ్రంథాలు, గురువుల వలన నీకు ఏ సహాయం లభించదు. భగవాన్‌ని ఒకరు అన్నారు "మీకు మనస్సు ఉంది కదా, దాని వలననే మీరు మమ్ములను భోజనం చేసారా అంటున్నారు. మమ్ములను గుర్తు పడుతున్నారు. ఇవి అన్నీ మనస్సు వలననే కదా!" అనగా "జ్ఞాని అహంకారం సూర్యుని ముందు చంద్రునిలా వెలవెలపోతుంది. మనస్సును పట్టించుకోకండి. కిరసనాయిల్ అయిపోయిన తరువాత దీపం దాని అంతట అది ఆరిపోతుంది" అని అన్నారు. మనకు ఏ విషమ పరిస్థితి సంక్రమించినా దాన్ని పాడిగించుకో కూడదు. నిగ్రహంగా ఉంటే ఈశ్వరానుగ్రహం మనపై వర్షిస్తుంది. ఒకడు మనలను విమర్శిస్తూ ఉంటే మనం నిగ్రహంగా ఉంటే ఒక్క తిట్టుకూ నీవు కంగారు పడకుండా ఉంటే అనతికాలంలోనే వేయి మంది మనలను స్తుతించే రోజు వస్తుంది. అది ఈశ్వరుని నియమం.

65. రోజులు బాగా ఉంటే గర్వం వస్తుంది. బాగాలేకపోతే దీనత్వం వస్తుంది. ఎలాగైనా తంటాయే. అది అంతా మన ప్రారబ్ధాన్ని బట్టి ఈశ్వరుడు ఇచ్చాడు. అది అంతా స్వప్నము అనుకోవాలి. బ్రహ్మానుభవం నీకు కలిగినప్పుడు నీవు నిగ్రహించుకోవటం అనే ప్రశ్న లేదు. ఆరోగ్యం చేకూరితే మందులతో పని

srinannagaru.com

ఏమున్నది. నిరంతరం తనను తిడుతున్న వ్యక్తి గురించి ఒకరు ఇలా అన్నారు "ఆయన ఆసనం చేసే పని చేస్తున్నాడు. ఆసనం తిన్న ఆహారంలో పిప్పిని విసర్జించే పని చేస్తుంది. వాడు నా పాపాలను బయటికి గెంటుతున్నాడు" అన్నారు. అక్షరాలకు ఆధారం కాగితం. కాగితం లేకపోతే అక్షరాలు ఎక్కడ నిలబడతాయి. అలాగే మనకు ఆత్మ ఆధారం; శరీరమే నేను అనుకొంటున్నాము. ఆత్మ లేకపోతే శరీరం నిలబడదు. సారా తాగిన వ్యక్తి హద్దులు దాటి మాట్లాడుతాడు. తెలివిని, మనస్సును, దేహాన్ని ఆత్మానుభవానికి ఉపయోగించుకోవాలి. వాటిని దుబారాగా ఖర్చు చెయ్యకూడదు. వాటిని పాడుచేసుకో కూడదు. ఇతరుల అభివృద్ధిని చూచి మనం అసూయ పడకూడదు. వారి కష్టం వెనుక ఎంత శ్రమ ఉందో మనం బాగా గుర్తించాలి. పుట్టింటి నుండి అత్తవారి ఇంటికి వెళ్ళిన కొత్త పెళ్ళి కూతురు మంచి సంస్కారంతో, నాగరికతతో ఆ ఇంటి మర్యాదలను, కట్టుబాట్లను అనతికాలంలో ఎలా ఆకళింపు చేసుకొని వారిలో ఎలా కలిసిపోతుందో అలాగే నీ సాధనా బలం వలన గురువు పర్యవేక్షణలో నీవు పొందే శిక్షణవలన నీ మనస్సు ఆత్మ పరిసరాలలోనికి వెళ్ళినప్పుడు మనస్సు ఆత్మాకారం చెందుతుంది.

66. బుద్ధుని అనుభవం "సాధనలో అతి భోజనం, భోజనం లేకుండా ఉండటం మంచిది కాదు. మధ్యే మార్గంగా వ్యవహరించాలి. ఫిడేలు తీగలు టైటుగా ఉన్నా, లూజుగా ఉన్నా పలుకవు. అలాగే స్నేహితులు అతిగా ఉండకూడదు. అతి నిద్ర పనికిరాదు. సహజంగా ఎరుకతో ఉండండి" అన్నారు. మన శరీరం ఎంత నిజమో మన డబ్బు, చదువు అంతే నిజం. మనస్సును సాధ్యమైనంత వరకూ ఉపయోగించుకోకుండా ఉంటే చల్లగా ఉంటుంది. నీ మనస్సును హృదయంలో ఉంచగలిగితే రంగు బట్ట వెలిసిపోయినట్లు సంస్కారాలు రహిత మౌతాయి. శాంతిని పొందగలుగుతావు. "విభూతి" అంటే ఐశ్వర్యం. విభూతి యోగంలో గీతాచార్యుడు చెప్పినట్లు ఆయా ఉపాధుల ద్వారా వ్యక్తమైన కళ్యాణ గుణాలను ధ్యానించటం వలన మీరు ఆయా ఐశ్వర్యాలకు వారసులవుతారు. మీరు ఎవరిని చూచినా మనస్సుతో చూడకండి. హృదయంతో చూడండి. మనస్సుతో చూస్తూ ఉంటే వికారాలు వస్తూ ఉంటాయి. హృదయంతో చూడటం వలన ప్రకృతి నుంచి బయటపడతాము. చైతన్యాన్ని పొందాలంటే నశించిన మనస్సు ద్వారా పొందాలి. మీ మనస్సుకు నచ్చకపోయినా భగవంతుడు చెప్పినట్లు నడిస్తే మనస్సు దాని మూలంలోకి ప్రయాణం చేస్తుంది. అక్కడ దానికి ఆత్మ ప్రకాశం తెలుస్తుంది. మనస్సే నీవు అనుకొంటున్నావు కాబట్టి అది చెప్పినట్లు చేస్తున్నావు. తత్త్వం తర్కానికి అతీతమైనది. తర్కం వలన అహంకారం పెరుగు

srinannagaru.com

తుంది. సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. పరిశీలనా శక్తి పెరుగుతుంది. కొందరు గంటల తరబడి పూజా మందిరంలో దేవుని ప్రార్థిస్తూ బయట జీవులను బాధిస్తూ, హింసిస్తూ ఉంటారు. అలా వారు ఉన్నంత కాలం దేవుని అనుగ్రహం వారికి రాదు.

67. తల్లి కడుపులోంచి బయటికి వచ్చినది లగాయతు శ్మశానానికి వెళ్ళే వరకు ఏ గంటలో ఏ పని చెయ్యాలో ఆ పని చేసి శరీరం చస్తుంది. శరీరంతో నీవు తాదాత్మ్యం పొందకు. కొన్ని శరీరాలు సన్మానాలు చేయించుకొంటాయి. కొన్ని ఊరేగింపులు, కొన్ని పదవులతో భోగమయమైన జీవితాన్ని పొందుతాయి. కొన్ని శరీరాలు దరిద్రం, తిట్టించుకోవటాలు, అవమానాలు పొందుతాయి. ఇవి అన్నీ నీ ఇష్టాలతో సంబంధం లేకుండా జరిగిపోతాయి. బాధలు-కష్టాలు అనుభవించిన వారే భగవంతునికి దగ్గర అవుతారు. మనస్సు ఎక్కడైతే లేచిందో అక్కడే లయం చెయ్యాలి. దాన్ని హృదయంలో ఉంచటం వలననే నశిస్తుంది. మరి ఎక్కడ ఉంచినా మరలా విజృంభిస్తుంది. తెలివిగా, చాతుర్యంగా మాట్లాడటం వలన సత్యం తెలియదు. చిత్తశుద్ధి ద్వారానే అది తెలుస్తుంది. శాంతిగా జీవించిన వానికే సత్యం తెలుస్తుంది. ఒక మనిషిని చూస్తూ ఉంటే వాడు మనకు చేసిన అపకారం గుర్తుకు వస్తుంది. కాని మీరు అలా చూడకండి. ఆ పనికి ఫలితాన్ని ఇచ్చేవాడు ఈశ్వరుడు. ఒకడు ఉన్నాడు పరిపాలన ఆయన చూచుకొంటాడు. దాన్ని గురించి మీరు కంగారు పడకండి. శరీరం మరణించ గానే దేహగతమైన యాత్ర పూర్తి అవుతుంది. కాని జీవగతమైన యాత్ర పూర్తి కాదు. దేహ బుద్ధిలోని దోషాలు నీకు తెలియటం వలన దాన్ని తొలగించుకోవాలనే ప్రయత్నం చేస్తావు. నీ ఆ ప్రయత్నమే నిజ గమ్యాన్ని చేరుస్తుంది. అంతేగాని శాస్త్రం చెప్పినా నీవు ప్రయత్నం చెయ్యలేవు. అంటే ఎందరు చెప్పినా నీ బుద్ధితో నీవు ఆలోచించి "ఈ దోషాలు నాలో ఉన్నాయి, నేను ఇకనుంచి చెడు పనులు చెయ్యకూడదు" అనే బుద్ధి నీకు కలగాలి. అప్పుడు నీ ప్రయత్నం వలన పవిత్రుడివి అవుతావు.

68. మనం మాట్లాడే ప్రతీ మాట నిర్మలంగా ఉండాలి. పరుషంగా ఉండకూడదు. ఉద్రేకంగా ఉండే మాటలు ఎన్నో అనర్థాలను తీసుకొని వస్తాయి. ద్రౌపది మయ సభలో దుర్యోధనుని ఉద్దేశించి "గుడ్డివాడి కొడుకు గుడ్డి వాడితో సమానం" అని నవ్వినందుకు భారత యుద్ధం ప్రారంభమైనది. అలాగే బంగారు లేడి కోసం వెళ్లిన రాముని ఆర్తనాదం నిజం కాదన్న లక్ష్మణునితో సీత "రాముడు పోతే నేను నీకు వశమౌతాను అని నీ భావమా!" అన్న మాట వలన లక్ష్మణుని

srinannagaru.com

రక్షణ కవచం పోగొట్టుకొని లంకకు వెళ్ళి క్షోభ అనుభవించింది. మహా యుద్ధానికి దారితీసింది. మన మాట పదిలంగా ఉండాలి. దేహం లేకుండా మనస్సు ఉంటే దెయ్యం. దేహం ఉండి మనస్సు లేనివాడు దేవుడు. తలంపు బాగుంటే శరీరం బాగుంటుంది. మాట బాగానే ఉంటుంది. బుద్ధి పాడైతే అంతా పాడైనట్లే. నీ కోపాన్ని, నీ తాపాన్ని, నీ సంతోషాన్ని చూచేవాడు ఒకడు ఉన్నాడు. వాడిని (ఆత్మను) చూస్తే నీకు ఏ లోటూ లేదు, ఏ కోప తాపాలు రావు, ఒకటే ఆనందం. దానిని నీవు జాగ్రదవస్థలో తెచ్చుకోవాలి. నిన్ను నీవు కొలుచుకోకు. ఎదుటివాళ్ళను కొలవకు. ఇవి అన్నీ నీ మనస్సులో ఉన్నాయి. వాడు చదువుకొన్నవాడు, డబ్బు ఉన్నవాడు అనే కొలతలు మానేయాలి. దేనితోనూ తాదాత్మ్యం పొందకు. వెంటనే మనస్సు ఆత్మలో పడిపోతుంది. సముద్రానికి "పోటు" ఉన్నప్పుడు నదిలో నీటిని తొందరగా లాగదు. "ఆటు" ఉన్నప్పుడు వెంటనే సముద్రంలో కలిసిపోయి నామ రూపాలు కోల్పోతుంది. అలాగే మనో వికారం లేకపోతే వాడి మనస్సును వాడి హృదయం లాగేస్తుంది. మీరు నిర్మలంగా ఉండగల్గితే అంటే దుఃఖ కారణం ఉన్నప్పటికీ ఎవరికైతే దుఃఖం రాదో వాడికి ఆత్మ తెలియబడుతుంది.

69. ఏక వస్తువును చింతించటం వలన ఏకాగ్రత కలుగుతుంది. అప్పుడు కష్టం వచ్చినా, పీడన వచ్చినా మీకు ఏ దుఃఖం రాదు. ప్రహ్లాదునకు ఇతరులు ఎంత బాధించినా ఏకాగ్రత వలన ఆయనకు ఏ బాధా కలుగలేదు. మీరు కాని దానితో దేనితో తాదాత్మ్యం పొందినా, మరల దాని నుండి విడుదల పొందే వరకూ మీకు శాంతి లేదు. నీ మైండ్‌ని తటస్థంగా ఉంచు. స్వంత బుద్ధిని కాపాడుకోలేకపోతే మీరు జ్ఞానం పొందే అవకాశం లేదు. బుద్ధి సూక్ష్మమైతే గాని వస్తువును గ్రహించలేడు. చైతన్య ప్రవంతిలో ఐక్యమైన వానికి మరలా ఉపాధి రాదు. సూర్యోదయానికి ముందు అరుణోదయమైనట్లుగానే ఆత్మానుభవానికి ముందు బుద్ధి సూక్ష్మమౌతుంది. మనస్సు యొక్క చాలవ్యం తగ్గుతూ ఉంటుంది. అల్ప మనస్సు సత్యంలోకి వెళ్ళటానికి సాధ్యం కాదు. లోతుగా ధ్యానం చేసిన వారు, విచారణ చేసేవారు, బరువు గలవారు (అంటే శరీర బరువు కాదు) సత్యం పట్ల దృఢ మనస్కులు మాత్రమే సత్యంలోనికి వెళ్ళగలరు. భయపడేవారు ఆందోళన పడేవారు, తేలిక మనస్కులు ఏమీ సాధించలేరు. వేరు భావన నశించిన వారికి ఉపాధి రాదు. నిప్పు మీద చేయివేస్తే కాలుతుందని మీకు తెలుసు. దాన్ని గురించి ఎవరినీ అడగనక్కరలేదు. అలాగే దేహ విషయాలు, ఎంత సహజంగా తెలియబడుతున్నాయో, అంత సహజంగా మీ ఆత్మ మీకు తెలియబడినప్పుడు మీరు ఆత్మ అని అంత సహజంగా గుర్తిస్తారు. కాని వచ్చిన

srinannagaru.com

చిక్కు ఏమిటి అంటే మనస్సు అటు చూడటం లేదు. ఆత్మలో సుఖం ఉందని తెలియటం లేదు. బయట సుఖాలకోసం, ఇంద్రియ సుఖాలకోసం, విషయ సుఖాలకోసం మనస్సు అలవాటు పడిపోయింది.

70. కళ్ళు లేకపోతే వస్తువులను చూడలేము, కాళ్ళు లేకపోతే నడవలేము. చెవులలో ఉన్న సున్నిత వస్తువులు పాడైతే శబ్దాన్ని వినలేము. చేతులు లేకపోతే పని చేయలేము. అలాగే మనస్సు నశిస్తే ధ్యానం చెయ్యటం అనేది లేదు. మనస్సు ఉంది అనుకొంటే ధ్యానం చెయ్యండి. మనస్సు నేను కాను అనుకొంటే ధ్యానంతో పనిలేదు. ప్రయత్నం వేరు, అనుగ్రహం వేరు కాదు. ఈశ్వరానుగ్రహం లేకపోతే ఆత్మ సాధన ప్రయత్నమే చేయలేము. ఈశ్వరానుగ్రహం వలననే ఈశ్వరానుగ్రహం వస్తుంది. ఈ మధ్య ఒక అధికారికి వారి పాత స్నేహితుడు ఒకడు సన్మానం చేస్తానంటే ఆయన "నీ దగ్గర డబ్బు లేదు, మన స్నేహం అలాగే చూచుకుందాము, వద్దు" అన్నాడు. ఆ స్నేహితుడు "మీరు చెప్పింది నిజమే, కాని నాకు సన్మానం చేద్దామనే కోరిక చావటం లేదు, అందుచేత ఒక సూచన మీదగ్గర డబ్బు ఉంది. ఆ డబ్బుతోనే సన్మానం చేస్తాను" అని వారి డబ్బుతోనే అన్నీ జరిపించారు. అలాగే జ్ఞాని అనుగ్రహం కోసం, ఈశ్వరానుగ్రహం కోసం ప్రయత్నం చేయటంలో కూడా ఈశ్వరానుగ్రహం ఉంది. మన సాధన అయిష్టంగా చేస్తూ ఉంటే నోటిలో ఆముదం పోసుకొన్నట్లు ఉంటుంది. మీ సాధన ఇష్టంగా చేస్తే పాయసం నోటిలో పోసుకొన్నట్లు ఉంటుంది. నామం ఇష్టంగా చేస్తే, భగవంతుని మధురంగా స్మరించుట వలన మీ అహంకారం నశిస్తుంది. ఇది మూఢనమ్మకం కాదు. మీకు ఏ తలంపు వచ్చినా వెనక్కు తిరిగి చూచుకొంటే దేహాత్మ భావనే. ఆ బుద్ధి ఉన్నంతకాలం, దేహాల యొక్క ఆకర్షణ, ప్రకృతి యొక్క ఆకర్షణ తప్పకుండా ఉంటుంది. కొందరు మర్యాదను మూటగట్టుకోవటానికి హైరానా పడతారు. లాభం వచ్చే వారిని ఒక రకంగా, అంతగా లాభంలేని వారిని ఒక రకంగాను చూస్తారు. ఉల్లిపాయలు వగైరాలు తూచినట్లు ఉంటే మీకులోకవాసన ఉన్నట్లు గుర్తు. కాని ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు.

71. కొందరు పుస్తకాలు చదవాలని అనుకొంటారు కాని హృదయంలో ఎన్ని చెడుగుణాలు ఉన్నాయి అని తెలుసుకోవాలి. సాహిత్యాన్ని ఉపయోగించుకో, కాని అది గమ్యం కాదు. సాహిత్యం మనకు ఎంత వరకూ అవసరమో అంత వరకూ ఉపయోగించుకోవాలి. సిరి ఎటువంటిదో సాహిత్యం కూడా అటువంటిదే. మన గమ్యం ఆత్మ జ్ఞానం. ఆత్మ జ్ఞానం మాత్రమే సత్యమైన జ్ఞానం సత్య సాక్షాత్కారం పొందిన వారి ద్వారా శాంతి తరంగములు కాంతి తరంగములు ప్రవహించి

srinannagaru.com

లోకమునకు సహకరిస్తాయి. ఒకటి అధ్యయనము, రెండు భోదించటం. ఈ రెంటి ద్వారా మాత్రమే లోకమునకు సేవ అందించగలము. స్వార్థపరునకు ప్రపంచం గొడవలేదు. పరోపకారం వాడు చేయడు, వాడి పనిని ఎంతో శ్రద్ధగా చేసుకొంటాడు. అలాగే మనం అహంకారం తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తే మనం గమ్యాన్ని పొందుతాము. నీ సాధన సక్రమంగా చెయ్యి. ఈశ్వరుడు చేసేది ఈశ్వరుడు చేస్తాడు. మనం భగవంతునికి ఏదీ గుర్తు చేయనక్కరలేదు. నీవు ఆయనకు జ్ఞాపకం చెయ్యనక్కరలేదు. సాధన నిర్మలంగా ఆసక్తిగా చెయ్యాలి. పని చేసి, ఫలితం నీ మనస్సు మీద పడకుండా చేసుకొంటే మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. ఎవరినీ అనుకరించకూడదు. మన శక్తి కొలది, ఆడంబరం కోసం కాకుండా సాధన చేసుకోవాలి. జ్ఞాని పని చేస్తాడు. అల్లరిగా చెయ్యడు అని గుర్తుంచుకోండి. ప్రకృతి గుణాలతో కలసి ఉన్నంతకాలం జ్ఞానం కలుగదు. నేరేడు చెట్టు దగ్గర పడుకొన్న వ్యక్తి పొట్టపై పండు పడితే ప్రక్కనే సైకిల్ మీద వెళుతున్న వ్యక్తిని గట్టిగా అరచి, వచ్చిన తరువాత పొట్ట మీద పండును నోట్లో వెయ్యమన్నాడట. ఇది తమోగుణం గలవాని స్వభావం. వాడు ఇహానికీ, పరానికీ పనికిరాడు. సాధనలో సోమరితనం పనికిరాదు.

72. మన హృదయంలో "ఆశ" లేనప్పుడు ప్రధానమంత్రి అయితే ఏమి, సామాన్యమైన వ్యక్తి అయితే ఏమి, ఆశ ఉన్నప్పుడు ఎక్కువ తక్కువ అనిపిస్తుంది. మనకు నిజమైన "గతి" శరణాగతే. మోక్షం మీద ఎవరికైతే ప్రీతి కలుగుతుందో వారికి మోక్షం కలుగుతుంది. ఒకటి "దయ", రెండు "వివేకం". రెంటినీ అలవాటు చేసుకోవాలి. మనస్సు విజృంభణ ఆపుచేసుకొంటే వ్యక్తి విజృంభణ ఆగిపోయి మనస్సు ఆత్మాకారం చెందుతుంది. మనస్సు తన మూలాన్ని తెలుసుకోకపోతే ఏదో గొడవ కల్పిస్తుంది. అవి అన్నీ పిచ్చి పనులు మాత్రమే. వ్యక్తి విజృంభణ పనికిరాదు. ఆత్మ వస్తువు అణిగి ఉన్నవానికి అందుతుంది. మన కూడా సంసారం రాదు, సంస్కారాలు వస్తాయి. "ట్రెడిషనల్ పాలసీ" (సాంప్రదాయ విధానం) ఏమిటి అంటే ఎవరైతే అరుణాచలాన్ని స్మరిస్తారో వారికి ముక్తి కలుగుతుంది. నేను యొక్క విజృంభణ ఆగటమే, స్మరణ యొక్క ఉద్దేశ్యము. మన లోపాలే, పాపాలే మనకు చిక్కులను తీసుకొని వస్తున్నాయి. కాని మనం ఏమను కొంటాము అంటే అవి అన్నీ దేవుడు కల్పించాడు అనుకొంటాము. కాని ఆయన మనలను ముట్టుకోడు. ఊరికే చూస్తూ ఉంటాడు. కర్మఫలదాత ఈశ్వరుడు. ప్రారబ్ధమును అనుసరించి ఆడిస్తున్నాడు. ఇది నీవు తెలుసుకోవాలి. అదే జ్ఞానం. తెలుసుకోలేకపోవటమే దుఃఖం. జ్ఞాని సంకల్పం భగవంతుని సంకల్పం ఒక

srinannagaru.com

రకంగానే ఉంటాయి. ఎవరికైనా చావు అంటే భయమేస్తూ ఉంటుంది. చనిపోయేది ఎవరు? దేహం. మనస్సు ఎందుకు ఏడుస్తుంది. అది దేహం కాదు అది ఏమనుకొంటుందంటే "దేహం నేను" అనుకొంటుంది. కాబట్టి భయమేస్తూ ఉంటుంది. ద్వైతంచే భయం, అసూయ వస్తుంది. చూచేది, చూడబడేది నిజం కాదు.

73. "ఆత్మ ఎవరికీ తెలియబడదు. అది ఎవరినైతే ఎన్నుకొంటుందో వారికే తెలియబడుతుంది" అని ఒక ఉపనిషత్‌లో ఉంది. వైరాగ్యం వలననే మనస్సు హృదయం వైపునకు ప్రయాణం చేస్తుంది. తరువాత కరగటం ప్రారంభ మౌతుంది. బ్రహ్మాన్ని చింతించటం వలననే బ్రహ్మం లభ్యమౌతుంది. ప్రకృతిని గురించి ఆలోచిస్తూ ఉంటే ఆత్మ ఎప్పుడూ లభ్యం కాదు. "మీ చేతిలో పనిని మానేసి బెంగపెట్టుకోవటం ఏమిటి?" అన్నారు వాసుదేవస్వామి. గౌరవం నిజం కాదు. నిజంలా కనిపిస్తుంది. అప్రధానమైన సంసార పరిస్థితులపై తాదాత్మ్యం పొందకపోతే, కర్మ సముద్రం నుంచి బయట పడగలము. విమర్శించే వారు ఆ రోజుకారోజు పతనమౌతారు. వారి గురించి మీరు కంగారు పడకండి. చనిపోయిన తరువాత, డాక్టరుతోనూ, మందులతోనూ పనిలేదు. అలాగే శరీరం ఉండగా నే సాధన చేసుకోవాలి. శరీరం మరణించిన తరువాత సాధన కుదరదు. కొన్ని జన్మల సాధనా పుణ్యబలం వలన మాత్రమే ఆత్మ వస్తువు లభ్యమౌతుంది. దానికి అభ్యాసం, వైరాగ్యం కావాలి. ప్రపంచం వైపునకు మనస్సు దూసుకొని పోకుండా ఉండటానికే వైరాగ్యం ఉపయోగపడుతుంది. ఈశ్వరునిపై ప్రేమ తీవ్రంగా ఉంటే మీకు అనుగ్రహం వస్తుంది. భక్తి అంటే ప్రేమ. అందులో లోపం ఉండకూడదు. అగ్గిపుల్ల చిన్నదైనా దాని వలన గడ్డిమేటు కాలిపోతుంది. కడవంతటి గుమ్మడి కాయ కూడా కత్తిపీటకు లోకువ. మీ కర్మలు ఎన్ని ఉన్నా జ్ఞాని అనుగ్రహంతో నశించిపోయి జ్ఞానం కలుగుతుంది. "మాయ" చేసే పని ఏమిటి అంటే జరిగిపోయిన గొడవలు అన్నీ జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. మన అస్తిత్వాన్ని భంగపరుస్తుంది. అనుకరణ ఉన్నవానికి ఆత్మ విశ్వాసం పెరగదు. అక్కరలేని మాట ఎవరి వలననైనా పడవలసి వస్తే దాన్ని అంతటితో ఊసేయండి. ఊసిన ఉమ్ము గురించి మనం ఆలోచించము.

74. మురుగునార్‌కు అరుణగిరిపై విపరీతమైన "ప్రీతి" ఉండేది. నోరు వదలి ఆశ్చర్యంగా నలభై ఏళ్ళు చూచారు. ఏరోజుకు ఆరోజే అది కొత్తగా ఉండేది. వారి మనస్సు సహజంగా అరుణగిరిపై వాలిపోయింది. జ్ఞాని అయినారు. ఈశ్వరునిపై ప్రీతి ఎలా ఉంటుంది అంటే మనం ఎవరితోనైనా మాట్లాడుతూ

srinannagaru.com

ఉంటే ఆపని జరిగిన తరువాత వెంటనే ఈశ్వరుని ధ్యాస తనంతట తానుగా మరలిపోవాలి. అది ధ్యాస. అంటే ధ్యాస రాకుండా ధ్యానం రాదు. ఈశ్వరుని ప్రేమించలేకుండా ఉండలేని స్థితి రావాలి. ఆ ప్రేమ ప్రవాహంలో మనస్సు కరిగి, వస్తువు లభ్యమౌతుంది. మన తెలివిని సద్ వినియోగం చేసుకొంటే అనుగ్రహం వస్తుంది. అల్పుడికి జ్ఞానం కలుగదు. దృష్టి లోతుగా ఉండాలి. ధ్యానం మనస్సును లోపలికి తీసుకొని వెళుతుంది. మనో నిగ్రహం లేని వాడిని "అయుక్తుడు" అంటారు. మనో నిగ్రహం గలవాడిని "యుక్తుడు" అంటారు. కర్మను బట్టి బుద్ధి నడిపిస్తుంది. మీ నుదిటి గీత సరిగా ఉంటే గీత అర్థమౌతుంది. రాత సరిగా లేకపోతే గీతను ముట్టుకోమన్నా ముట్టుకోడు. దుఃఖం వచ్చినప్పుడు భయపడకు, ఆవేశపడకు, ఆయాసపడకు. సుఖం వచ్చినప్పుడు దాని స్పృహ లేకుండా ఉండు మీ పుణ్య పాపాల బుద్ధిని, ఈ శరీరంలో ఉండగానే, వదిలే బుద్ధిని సంపాదించు. అదే బ్రహ్మ నిర్వాణం. ఆ స్థితిని పొందితే సర్వకాల సర్వ అవస్థలలోనూ బ్రహ్మానందం లో ఉంటావు. శాంతచిత్తం, సాత్త్విక ప్రవృత్తి, సత్వగుణం, మూడూ కావాలి. మధుర స్వభావం గలవానికి జ్ఞానం వర్తిస్తుంది. పెళుసు స్వభావం ఉండకూడదు. శాంతి స్వభావం ఎదుటి వారిలో లేకపోయినా మనం దాన్ని వదలకూడదు. వండిన పాత్రను వెలుపలా, లోపలా తోముతాము. బాహ్యంగా నీవు శరీర స్నానాలతోనే సరిపెట్టక, ధ్యానం, విచారణ, జపం వలన మనస్సు శుద్ధి అవుతుంది.

75. మనలో ద్వేషబుద్ధి లేకపోతే ప్రపంచంలో ద్వేషం కనబడదు. నీవు దేహంగా భ్రమించటంతోనే సరిపెట్టుకోవటం లేదు, ఇతరులను కూడా దేహ మాత్రులే అని భ్రమిస్తున్నావు. ఆత్మబుద్ధి కలిగే వరకూ నీకు దేహబుద్ధి పోదు. బుద్ధి సూక్ష్మత, పరిపక్వత లేనప్పుడు వస్తు వైభవం తెలియదు. మన ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవటం కూడా తపస్సే. పరిగెత్తే గుఱ్ఱాన్ని కళ్ళెంతో లాగి ఆపినట్లు ప్రాణాయామంతో ఇంద్రియ నిగ్రహాన్ని సాధించవచ్చును. ఎదుటివాడు అసందర్భం గా మాట్లాడినా, మనం ఆలోచించి జాగ్రత్తగా మాట్లాడాలి. అవతలివాళ్ళు మాట్లాడారని మనం మాట్లాడకూడదు. పెద్ద వృక్షం యొక్క వేరు ఎంత లోతులో ఉంటుందో దాని చివర ఎంత లోతుగా ఉంటుందో అంత లోతులోకి మునిగి అహంకారం యొక్క మూలాన్ని వెదకాలి. అప్పడు గాని ఆత్మ తెలియబడదు. భగవంతుని మీద భారం వేసి నడిస్తే వాసనలు నశిస్తాయి. కొంతమంది "మా ప్రారబ్ధం ఇలా ఉంది, మా జీవితాలు ఇలా అయిపోయాయి. మామీద దేవుని దయ ఇలా ఉంది" అని వాపోతూ ఉంటారు. భగవాన్ వీటిపై ఇలా అన్నారు "అది అంతా ఎవరో చేసింది కాదు. నీ కామ, క్రోధాలే నిన్ను ఈ విధంగా చేసి

srinannagaru.com

నాయి" అన్నారు. మనం కామ-క్రోధాల వేగాన్ని తట్టుకొని ప్రశాంతంగా జీవిస్తే మనస్సు ఆత్మాకారం చెందుతుంది. ఒక ప్రక్క ఆత్మ, ఒక ప్రక్క విషయాలు ఉన్నాయి. నీ మనస్సు విషయాల వైపు పరుగిడుతూ ఉంటే అహంకారం పెరుగుతుంది. నీ మనస్సు ఆత్మవైపు వెళితే అహంకారం నశిస్తుంది.

76. ఈ శరీరాన్ని మరణానంతరం అగ్నికి ఆహుతి చేస్తారు. అజ్ఞాని జీవితం పొడుగునా కామ క్రోధాలనే అగ్నిలో కాలిపోతాడు. పాముకు పాలు పోసినా విషంగానే మారిపోతున్నది. అయోగ్యునికి శాస్త్రం చెప్పినా విషంగా మారిపోతుంది. ఒక దుష్టునికి మంచి మాట చెప్పండి, మంచి సలహా చెప్పండి, వాడు మీకు శత్రువు అయిపోతాడు. అనుభవాన్ని జీవితంలో శాస్త్రజ్ఞానం వలననే కాదు నిత్య జీవితంలో జరిగే సంఘటన వలన ఎంతో కొంత అనుభవాన్ని గ్రహించాలి. ఆ లోపాలను గుర్తించి తెలుసుకోవాలి. పాములోని కోరలు తీసి దాన్ని దగ్గర ఉంచుకొన్నా బాధించదు. అలాగే అహంకారం చెప్పినట్లు కాకుండగా దేవుడు చెప్పినట్లు నడుచుకొంటే చాలు. మన సాధన జయప్రదమైనట్లే. సంఘటనలు బట్టి, వ్యక్తుల భావాల బట్టి చెప్పేది సాపేక్షికం. అంతట "ఉన్న వస్తువును కృష్ణ పరమాత్మ నీ హృదయంలో ఉన్నానని ఎందుకు చెప్పాడు" అని భగవాన్‌ను ఒకరు ప్రశ్నింపగా "నీకు లోపల ఆత్మ ఉందని, అది బయట పడితే మరణిస్తాననే సాపేక్షిక జ్ఞానాన్ని బట్టి చెప్పారు" అన్నారు. మనం స్పష్టంగా ఉండాలి. ఎదుటివాడిలో స్పష్టత లేదు అనుకోండి మీరు మాత్రం, త్రికరణ శుద్ధిగా "అవును-కాదు" అని సూటిగా వ్యవహరించాలి. కపటం ఉండకూడదు. పరిపాలన ఈశ్వరుడు చూచుకొంటాడు. తెల్లవారుజామున ధ్యానం, విచారణ ఉత్తమం. కారణం రాత్రి మనస్సు హృదయంలో లయమౌతుంది. విశ్రాంతి పొంది ఉంటుంది. ఆ సమయంలో సాధన కొంచెం సేపు చేసినా ఎక్కువ ఫలితం వస్తుంది.

77. జీవితంలో ప్రతీ సంఘటనలోనూ పాఠాలు నేర్చుకొనేవాడు వివేకవంతుడు అవుతాడు. వివేకానికి సత్‌పురుషుల సహవాసం, సత్ గ్రంథ పఠనం, మహాత్ముల దర్శనం, సహాయకారులవుతాయి. అంతేకాదు ఎదుటివాడి అనుభవాన్ని స్వంతం చేసుకొన్నవాడికి కూడా వివేకం పెరుగుతుంది. మనస్సు బాహ్యముఖమయ్యే తలంపులు, వ్యక్తులతో కూడిక, పనికిరాదు. మన జీవిత కాలం స్వల్పం. మన ధ్యేయం మర్చిపోకూడదు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కృత్రిమ గౌరవాలకు నీ మనస్సు ఎంత దూరం వెళ్ళిందో అంతదూరం వెనుకకు రావాలి. అంతవరకూ నీ హృదయంలో నీవు ఉండలేవు. అనుగ్రహం

కావాలి అని మనం అనుకొంటే రాదు. మన కృషిని బట్టి, యోగ్యతను బట్టి వస్తుంది. శాస్త్రిగారు ప్రధానమంత్రిగా రష్యా వెళ్ళి గుండె నొప్పితో బాధపడుతూ ఉంటే డాక్టరు పోటు తీవ్రత వలన మరణిస్తాడని గ్రహించి వారితో ఇలా అంటారు "డాక్టరుగా మీకు ఏ సహాయం చెయ్యలేకపోతున్నాను" అన్న మాటలు వినిపించు కోకుండా వారు ఇలా అంటున్నారు "ఓ తండ్రి శ్రీరామా? ప్రభువా, శ్రీరామచంద్రా! నీ ఒడిలోకి నన్ను తీసుకో తండ్రి" అన్నారు. ఆయన నిజాయితీగల సేవ ఆయన అంతిమ సమయంలో ఆ స్మరణ తీసుకొని వచ్చింది. అధికారంలో ఉండి నిజాయితీగా జీవించటం గొప్ప విషయం. ఏమీ సంపాదించుకోలేదు.

"పశువులు ధ్యానం చెయ్యవు మనుషులే చేస్తారు. ధ్యానం చెయ్యని వాడు పశువు" అంటారు ధ్యానప్రియులు. ధ్యానం వలన ఏమి ప్రయోజనం అంటే? మిమ్మలను ఒక స్తంభానికి తాళ్ళతో గట్టిగా కడితే అసౌకర్యంగా ఉంటుంది. తాళ్ళు వదులైతే సౌకర్యంగా ఉంటాయి. అలాగే భగవంతుని నామంతో మీరు కట్టుబడి ఉంటే, లోక చింతన అనే బిగితాళ్ళు లూజ్ అవుతాయి. మీకు సుఖం ఎక్కువ అవుతుంది.

78. ఏనుగు తొండం బారుగా ఉంటుంది. కాని అది ఏదీ ఇతరులకు ఇయ్యదు. అన్ని ఇతరులనుంచే తీసుకొంటుంది. అలాగే ధనవంతులు ఇతరులకు ఏమీ ఇయ్యరు. దానం చెయ్యటం వలన మనస్సు పవిత్రమౌతుంది. ధ్యానం చెయ్యటానికి నీవు ఎవ్వరవు. నీ పుణ్య సంస్కారమే నీ చేత చేయిస్తుంది. ఒక వాసన మనకు ఉంది అనుకోండి. వచ్చే జన్మలో తొలగించుకొందామని నిర్లక్ష్యం చేసామనుకోండి అది రెట్టింపు పెరుగుతుంది. అప్పుడు ఆ సద్వస్తువును తెలుసు కోవాలనే బుద్ధినే కలుగచేయనియ్యదు. అసలు వాసనలు ఉన్నాయనే బుద్ధే కలుగదు. జ్ఞానం పొందటం కష్టమని నీ అజ్ఞానమే నీకు చెప్పేస్తుంది. దానితో మనం చల్లబడిపోతాము. ఇతరులు అందరూ మనలను గౌరవించాలనే కృత్రిమ గౌరవాలకోసం అలవాటు పడిపోయాము. మంటలలో పడ్డ కట్టె బూడిద అయినట్లు మన జీవితాలను నాశనం చేసుకొంటున్నాము. నిన్ను నీవు చూచుకొని లోకాన్ని చూడు లోకం బంధించదు. ప్రలోభ పెట్టదు. నేను అనేది ప్రత్యక్షం. అనుమానాన్ని పెట్టుకోవటానికి దేనికి? దేవుడు ఉన్నాడా లేడా అనేది నీకు ప్రత్యక్షం కాదు "నేను" తెలిస్తే దేవుడు కూడా తెలుస్తాడు. పారమార్థిక సత్యం కనిపించేది కాదు. మూడు కాలాలకు, మూడు అవస్థలకు సాక్షిగా ఉంటుంది. కనిపించేది మారుతుంది. మారేది నశిస్తుంది. చూడబడేది ఎంత నిజమో చూచేది అంతే నిజం. ఈ రెంటికీ అతీతమైనది సత్యం. జనన మరణములకు అతీతమైనది.

srinannagaru.com

శేషము లేకుండా ఎవరి మనస్సు పూర్తిగా నశించిందో వారికి మాత్రమే సత్యం అనుభవైక్య వేద్యమవౌతుంది. స్వేచ్ఛను పొందుతారు. నేను చాలా కష్టపడుతున్నాను అనేది కూడా మనస్సే, తప్పు ఆలోచన వలన ఆందోళనతో కూడిన బుద్ధి వలన నీకు సత్యం తెలియటం లేదు.

79. నీ తలంపులను నీవు గెంటివేయనక్కరలేదు. సత్యం వైపుకు నీవు వెళితే లేనివి బయటికి పోతాయి. నిప్పు దగ్గరకు వెళ్ళే కొలది వేడి తగులుతుంది. అలాగే నీ సత్యసాధనలో నీ ప్రయత్నం లేకుండానే తలంపులు పోతాయి. "ఎవడు శాంతచిత్తుడో వాడే సత్యాన్ని దర్శిస్తాడని" ఉపనిషత్తు అంటోంది. సత్యాన్ని పొందాలనే ప్రయత్నంలోనే అవి ఊడిపోతాయి. గమ్యానికి నీవు ప్రయాణమై నప్పటికి బయలుదేరిన స్థలం దూరమైపోతుంది. కష్టం, కష్టం అనేది, తలంపే; దాన్ని ఊడగొట్టేయి. బాగా తెలివి గలవాడికి అహంకారంతో కూడిన మాటలు వస్తూ ఉంటాయి. ఆ తెలివి కూడా శరణాగతి పొందటానికి అవకాశం ఇవ్వదు. లోపల ఆంతరంగిక జీవితం కావాలి. చాడీలు చెప్పే వారితో మీరు స్నేహం చెయ్యకండి. అక్కరలేని గొడవలు తెచ్చే వారితో స్నేహం చేస్తే మనం బాగుపడే అవకాశం లేదు. వాళ్ళు రోడ్డు మీద దుమ్ము తీసుకొని వస్తారు. విన్నప్పుడు ఆనందంగా ఉంటుంది. పరిణామంలో దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మీరు "నేను"ను మర్చిపోయినప్పుడే గొప్ప ఆలోచనలు, పనులు చెయ్యగలరు. నిద్రలోని స్థితిని జాగ్రదవస్థలోకి తెచ్చుకోవటానికి ధ్యానం ఉపయోగపడుతుంది. కొంతమంది అంటారు వాడితో వీడికి స్నేహం ఏమిటి? అనుకోవచ్చును. వాడి నీచ గుణాలు వీడిలో ఉన్నాయి. కాబట్టి వాడితో స్నేహం చేస్తాడు. సత్పురుషులను జాగ్రత్తగా చూచుకోండి. చెడు మాటలు చెప్పేవారు వారి వైబ్రేషన్సు మన మీద పనిచేస్తాయి. ఒకరు భగవాన్‌తో "నేను ఒక మహాత్ముడు అని చెప్పబడే వారి వద్దకు వెళితే ఆయన వారిని, వీరిని తిట్టేరు, అంటే భగవాన్ "అనటం ఆయన తప్పుకాదు, వెళ్ళటం నీ తప్పు" అన్నారు.

80. ఎప్పుడు, ఎక్కడ ఎలా మాట్లాడాలో తెలియటమే విజ్డమ్. ఎవరినీ ద్వేషించకు. అందరినీ ప్రేమిస్తే జ్ఞానం కలుగుతుంది. తలకాయ చల్లగా ఉండాలి. పొట్ట తేలికగా ఉండాలి. అప్పుడు ధ్యానం కుదురుతుంది. ఎదుటివారు ఏమనుకొంటారు అనేది అప్రధానమైనది. నీ గురించి నీవు ఏమనుకొంటావో అనేది ముఖ్యము. నీ నడవడిక ఉత్తమమైనదా, కాదా, అనేది నిర్ణయించుకో. అదే ముఖ్యం. రీజనుకు ఎంత బలముందో భావనా బలానికి (భగవంతుడు సత్యం అనే భావనకు కూడా) అంతే శక్తి ఉంది. తెలివిగలవారు రీజన్ సహాయంతో

srinannagaru.com

తొందరగా గమ్యాన్ని చేరుతారు. కొందరికి ఆ తెలివి లేకపోవచ్చును. "నేను ఆయన వాడినే" అనే (శరణాగతి) భావనలో ప్రయాణం చేస్తే కొంచెం ఆలస్యమైనా గమ్యాన్ని చేరుతావు. క్షమాగుణం గలవాడికి మాత్రమే ఇచ్చే స్వభావం ఉంటుంది. అపకారం చేసినా మర్చిపోగలడు. నీలో "ఎనర్జీ" (తూకం) లేకపోవుట వలననే నీవు క్షమించలేకపోతున్నావు. క్షమాగుణం లేకపోతే క్షమించలేరు. "శీలం" కరెక్టుగా లేకపోతే ఒక్కొక్క సమయంలో శాంతి వచ్చినా నిలబడదు. శాంతి లేకపోతే ఎన్ని జన్మలు గడిచినా సద్వస్తువు నీకు దొరకదు. ఎవరినైనా చూస్తూ ఉంటే అసూయ కలిగింది అంటే వెంటనే మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది. చైతన్యస్థాయి వెంటనే పడిపోతుంది. పెరుగుతున్న మొక్కను దూడలు తినినట్లు అసూయ చైతన్యస్థాయిని పెరగనియ్యకుండా చేస్తుంది. మన తలంపుల యొక్క, మాటల యొక్క, చేతల యొక్క ప్రభావం భవిష్యత్తులో ఉంటుంది. అదే ప్రారబ్ధంగా తయారౌతుంది. ఎవరి విధికి వారే కారకులు.

81. సద్వస్తువును హృదయంలో వెదికేవాడే బుద్ధిమంతుడు. శాంతిలో నుంచే శక్తి కలుగుతుంది. చిల్లర విషయాలతోనూ, అల్ప విషయాలతోనూ, అశాంతికి గురికాకూడదు. సమస్యలను పరిష్కరించుకోవాలి. శాంతిని పోగొట్టుకోకూడదు. "ప్రేమ జీవితం యొక్క కాలాన్ని" పెంచుకోవాలి. బజారులో షోకేస్‌లో సీతాఫలం ఆకారంలో ఉన్న వస్తువులను ఉంచుతారు. అవి నిజమైన సీతాఫలంలాగే కనిపిస్తాయి కాని తినటానికి పనికిరావు. నిజమైన సీతాఫలం కోసమే నీవు వెదకాలి. అలాగే పుస్తకాలలో వస్తువు లభించదు, హృదయంలో వెదకాలి. బయట మంటలో ఒక వస్తువును నీవు పడవేస్తే దాన్ని కాల్చి బూడిద చేసే పనిని నీవు చేయవు, ఆ మంటే చేస్తుంది. అలాగే నీ హృదయంలో నీ మనస్సును నిలపటమే నీ పని మనస్సు యొక్క కర్మ వాసనలు హృదయమే కాల్చి బూడిద చేస్తుంది. విచారణ చేస్తూ ఉంటే దేహబుద్ధి తగ్గుతూ ఉంటుంది. మానేస్తే దేహబుద్ధి పెరుగుతుంది. ఒక చెడ్డ వానికి ఒక మంచి మాట చెబితే వ్యతిరేక అర్థం చేసుకొంటాడు. ఎందుచేతనంటే అతనిస్థాయి అటువంటిది. గీతలోని ఉపదేశాలు నీవు గ్రహించాలంటే ఆ సద్వస్తువును పొందాలి. లేదా దాన్ని పూర్ణంగా గ్రహించలేవు. నీలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటే రోగం వచ్చినా కొద్ది కాలంలోనే ఆరోగం పోతుంది. అలాగే నీవు ధ్యానం చేస్తూ ఉంటే నీ సంస్కారాలు, తలంపుల రూపంలో వస్తూ ఉంటాయి. కాని నీవు విడువక సత్య వస్తువును ధ్యానం చెయ్యగా, చెయ్యగా వాసనలను నిరోధించే శక్తి నీకు కలుగుతుంది. నీ ధ్యానం నిరాటంకంగా సాగుతుంది.

srinannagaru.com

82. నీ తలంపులతో నీవు పోరాటం చెయ్యటంలో నీ సంస్కారాల చేతులలో నీవు ఓడిపోయినప్పటికీ తిరిగి లేవటానికి ప్రయత్నం చెయ్యి. పోరాటం లోనే నీ మనస్సుకు శక్తి వస్తుంది. పోరాట పటిమను నీవు వదలకు, చతికిల బడకు. చేతులు ఊపటమే నీ పని. తరువాత సద్గురువే చేస్తాడు ఆ పనిని. సమబుద్ధి పెరిగే కొలది, ద్వైత బుద్ధి తగ్గుతూ ఉంటుంది. ద్వైత బుద్ధి తగ్గేకొలది సమాన బుద్ధి పెరుగుతుంది. మీకు గాయం తగిలింది అనుకోండి "సెప్టిక్" అవ్వకుండా మందులు వాడతాము. దాని వలన చీము పట్టదు, గాయం మానుతుంది. అలాగే అరుణగిరిని మీరు చింతిస్తూ ఉంటే మీ మైండుకు చెడు ఆలోచనలు రాకుండా చేస్తూ ఉంటుంది. మిమ్ములను ఎవరైనా విమర్శిస్తూ ఉంటే మీకు తట్టుకొనే శక్తి ఉంటే సాధనా బలం ఉన్నట్లు లెక్క తట్టుకోలేక పోతే సాధనాబలం లేదని లెక్క ఇదే కొండ గుర్తు. నిర్మలమైన మనస్సులో ఆనందం ఉంది. ఆలోచించి మాట్లాడటం వలన జీవితం సరళంగాను, ప్రశాంతంగాను సాగుతుంది. స్త్రీకి భర్త ఎవరు అంటే శాంతి. పురుషుడికి భార్య ఎవరంటే శాంతే. మనస్సు బాహ్య విషయాలపై వెళుతూ ఉంటే మనోబలం తగ్గిపోతుంది. మనస్సుకు బలం పెరిగేకొలది ఒకే తలంపు పై నిలబడుతుంది. అప్పుడు ఆ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. రోగాలు పోయిన తరువాత అందరూ ఒకే రకంగా ఉంటారు. దేహాత్మ భావన పోతే అంతా ఆత్మగానే ఉంటారు. జరిగి పోయిన గొడవలు వదులుకొంటే బ్రతుకు బంగారమై పోతుంది. ఆ గొడవలతో ఉంటే మాయలో కూరుకుపోతాము.

83. మీకు ఏ రకమైన ఆందోళన, అశాంతి వస్తున్నా కారణం "రాగం". క్రోధము, రాగము, భయం అనే మూడింటినీ వదులు. నీకు శాంతి, శుభం కలుగుతాయి. మాయ ఈ మూడింటిలోనూ ఉంది. ప్రకృతి గుణాలు దాటితే ఆత్మ గూటిలో మనస్సు పడిపోతుంది. వినయంలేని తెలివి వాడిని బాగుచెయ్యదు సరికదా పాడుచేస్తుంది. అన్ని చెడ్డగుణాలలోకి రాజు క్రోధం. ఒక మొక్క వేసాము అనుకోండి కొంతకాలానికి కొమ్మలు, రెమ్మలతో ఒక వృక్షమౌతుంది. వాటితోనే మనం సంతోషించము. పండ్లు కోసం నిరీక్షిస్తాము. అలాగే మనం యజ్ఞాలు, యాగాలు లాంటివి చేస్తాము. అవి మనస్సును అణచటానికి సహాయం చేస్తాయి. కాని మన గమ్యమైన ఆత్మానుభవాన్ని ఇవ్వలేవు. మనతో మర్యాదగా మాట్లాడే వారి మీద సహజంగా మనస్సు వాలిపోతుంది, అలాగే మనకు వ్యతిరేకంగా, అమర్యాదగా మాట్లాడే వాళ్లను మనం మర్చిపోవాలి. ఈ రెంటికీ మనం దూరంగా ఉండాలి. ఇవి భగవంతుడి మీద దృష్టి కలగకుండా చేస్తాయి. ప్రీతి-అప్రీతి

srinannagaru.com

రెండూ నీ గమ్యానికి అడ్డం వస్తున్నాయి. అవి మనో రూపాలలో ఉన్నాయి. సాధన పేరుతో గదిలో కొంచెం సేపు ధ్యానం చేస్తే సరిపోదు. ప్రకృతి గుణాలను దాటిపోవాలి. భయం వలన గతంలోకి వెళ్ళిపోవటం వలన అశాంతి వస్తుంది. భయం మనస్సును పాడుచేస్తుంది. అనుకూల పరిస్థితులు, వ్యతిరేక పరిస్థితులు కలకాలం నిలబడవు. అసలు మన దేహమే కలకాలం నిలబడదు. మీ మనస్సును సమానం చేసుకోవాలి. వాసుదేవ స్వామి అన్నాడు "నీ ఇంట్లో ప్రీతికరమైన వాళ్ళు చనిపోయినా నీవు దుఃఖానికి గురికాకుండా ఉంటే నా అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు.

84. ఒక భక్తుడు భగవంతునితో ఇలా అంటాడు "నాకు కష్టాలే పంపిస్తున్నావు. ఎందుచేత నంటే నా ఖాతాలో ఉన్నదే పంపిస్తున్నావు. నీవు ఏమిచేస్తావు. కాని నా ప్రాణం పోయేటప్పుడు కూడా నీ మీద ప్రేమ పోకుండా చూడు, తండ్రీ నిన్ను ప్రేమిస్తూనే ప్రాణాలు పోయేలా చూడు. అంటూ నీ మీద ప్రేమ లేకుండా ప్రాణం వదలను" అన్నాడు. నీ ప్రారబ్ధంలో లేనిది నీవు కోరుకోవు. అది ఉంటే ఎలాగైనా వస్తుంది. నీవు సదా ఆ కోరికలలోనే ఉండకు; కోరికకు శక్తి లేదు. ఈశ్వరునికి శక్తి ఉంది. ప్రారబ్ధంలో లేనిది నీవు ఈశ్వరుని అడగనే అడగవు. కోరిక, అశాంతిని తీసుకొని వస్తుంది. గతాన్ని మర్చిపోవటం కూడా యోగమే. సమాజంలో ప్రేమ, ఆప్యాయతలు లేవు. కేవలం వస్తు సబంధం మీదనే ప్రేమలు. ఆధారపడి ఉన్నాయి. ఏ దేశం వెళ్ళినా ఇదే కనబడుతుంది. పిల్లలకు పరీక్షలు పెడుతూ ఉంటారు చదువు విషయంలో. మనకూ భగవంతుడు పరీక్షలు పెడుతూ ఉంటాడు. ఒకచోట మర్యాద, ఒకరి చేత తిట్టిస్తూ ఉంటాడు. రెండూ సమానంగా చూచుకోవాలి. అగ్ని హోత్రంలో నెయ్యితో కొబ్బరి చిప్పలు వేసినట్లే నీలో ఉన్న ఈర్ష్య, అసూయ, పగ, ప్రతీకారమనే దుర్గుణాలతో కూడిన బుద్ధిని మరల్చి పరమాత్మ రూపంపై నీవు చింతిస్తూ ఉంటే ఆ గుణాలు అన్నీ ఆ క్రియలో ఆహుతి అయిపోతాయి. మన అయిష్టాలను కూడా మర్చిపోతాము దానితో సరిపోదు, ప్రకృతి గుణాలతో కూడిన ఇష్టాలను కూడా నీవు తప్పించుకొని పోవాలి. నీ ప్రయాణం ఆగకుండా పరమాత్మ దగ్గరకు వెళ్ళాలి. "శ్రద్ధ" అనే రెండు అక్షరాలు మీరు జ్ఞాపకం చేసుకోండి. మీరు గమ్యాన్ని చేరిపోతారు.

85. హృదయం నుండి అహం వృత్తి వచ్చింది. అందుండి మనస్సు వచ్చింది. చేప నీటికి ఎదురీదుతుంది. అలాగే నీవు మనస్సు యొక్క వేగానికి వ్యతిరేకంగా అంటే మనస్సు చెప్పినట్లు వినకుండా వెళితే హృదయానికి వెళతావు మనోప్రవాహానికి వాలుగా వెళితే ప్రకృతిలో పడతావు. అనుకరణ పిలికి వాళ్ళ

srinannagaru.com

లక్షణం. దాని వలన ప్రమాదంలో పడతాము. సమగ్రంగా స్వతంత్రంగా ఆలోచించుకోవాలి. బుద్ధికి సోమరితనం పనికిరాదు. బుద్ధిని సంస్కరించుకొంటే సమయస్ఫూర్తి కలుగుతుంది. చైతన్యం అనేది ఒకటి ఉంది. దానిపై ఆధారపడే జీవుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. చైతన్యం యొక్క స్పృహ మనకు స్ఫురించటం లేదు. మనస్సు నిశ్చలమైతే మనస్సే ఆత్మాకారం చెందుతుంది. శవబుద్ధి ఉన్నంత కాలం తత్త్వం తెలియదు. గదిలో నాలుగు గోడల మధ్య ఉండి ధ్యానం చేస్తే సరిపోదు. నలుగురిలో ఉండి ఒక్కొక్కప్పుడు మొట్టికాయలు తగలటం వలన వివేకం పెరుగుతుంది. సూక్ష్మదృష్టి వలన నిజ గమ్యాన్ని చేరగలవు. మనం మనః పరిధినుండి దాటాలి. దృశ్యాన్ని వారిస్తే మనస్సు అంతర్ముఖం అవుతుంది. భగవాన్‌పై ఆపుకోవాలన్నా ఆపుకోలేని ప్రేమ కావాలి. అది ఉరకలు వేసుకొని రావాలి. ధ్యానం కుదిరితే ధ్యాస కుదురుతుంది. మనం చేసేది కృషి. ఆపై వచ్చేది కృప. చిన్న ప్రయత్నమే చెయ్యండి. అటునుండి అనుగ్రహం ప్రవాహంలా వస్తుంది. అది మెరక పల్లాలతో సంబంధం లేకుండా వరదలా వచ్చి మిమ్ములను ముంచేస్తుంది. గాలి వీస్తే ఆకులు ఎలా కదులుతాయో అలాగే మనకు ఇష్టం అయిష్టం వలన మనస్సు కదులుతుంది. ఏక వస్తువును చింతించటం వలన ఇతర తలంపులు కూడా వచ్చి దాడి చేస్తాయి. అప్పుడు పోరాటం జరుగుతుంది. వాటిని అణిచివేస్తే దాని వలన అవి క్షీణిస్తాయి. అంతేగాని తలంపును ఆచరణలో పెడితే అది మరింత బలపడుతుంది.

86. "నుయ్యి" తవ్వటానికి నీవు మట్టిని తొలగిస్తే నీరు దాని అంతట అదే వస్తుంది. నీరుని, నీవు కనిపెట్టనక్కరలేదు. అలాగే సద్వస్తువు నీలో ఉంది. దాన్ని నీవు కనిపెట్టనక్కరలేదు. అడ్డుగా ఉన్న మనస్సును తొలగించుకో. వస్తువు దాని అంతట అది తెలియబడుతుంది. పరీక్షలు వ్రాసే వానికి సమాధానాలు ఎలా వ్రాసామో, ఎంత న్యాయంగా ప్రతిపాదించామో వాడికి తెలియదు. దిద్దే వాడికి తెలుస్తుంది. అలాగే నీ ప్రయత్నం వలన సత్యం తెలియదు. ఈశ్వరునికి కలగాలి నీ ప్రవర్తన ఎంత నిజాయితీగా ఉందో. అప్పుడు నీ అర్హతను బట్టి వీడికి తెలియబడాలని అనుకొని తెలియబడతాడు. డాంబికమే కేంద్రంగా పెట్టుకొంటే నీకు ఏదీ లభ్యం కాదు. ఈశ్వరార్పితంగా పనిచేస్తే మనస్సు నశిస్తుంది. అసలు వస్తువు సరళంగా ఉంది. నీవు అలాగే సహజంగా జీవిస్తే నీకు వస్తువు లభ్యమౌతుంది. చెరువులో మునిగి వస్తువును తెచ్చుకొన్నట్లే ఆధ్యాత్మిక సంపదకు వైరాగ్యమనే బరువుతో హృదయంలో మునిగితే సత్య వస్తువు లభిస్తుంది. మనం మునుగుతున్నాము కాని వైరాగ్యమనే బరువులేక తేలిపోతున్నాము. ప్రసాదబుద్ధి

srinannagaru.com

వలన సత్యం తెలియబడుతుంది. పాడుబుద్ధి వలన తెలియబడదు. లోకం ఎంత కాలమని నిజమనుకొని ధ్యానం చేసినా, జపం చేసినా మనస్సు ఏదో వంకతో బయటికి వస్తుంది. లోపలికి వెళ్ళదు. ఏ జన్మకాజన్మ ఈ లోకం యదార్థమని తిప్పుతుంది. చివరకు ఏ సద్గురువో కలుగచేసుకొని సత్యాన్ని పట్టి ఇస్తాడు. అప్పటికిగాని సాధన పూర్తికాదు. అనుగ్రహం ఎప్పుడూ ఉంది. కాని అందుకొనే అర్హత మనకు లేదు. లోకాన్ని ఉద్ధరించాలని అనుకోకు. సాధనలో నీవు అభివృద్ధిలోనికి రావాలి. రోడ్డు మీద ముళ్ళు ఉన్నాయని వాటిని ఏరుతూ వెళ్ళకు. చెప్పలు వేసుకొని వెళ్ళు. వర్షం పడుతున్నదని ప్రయాణం ఆపకు. గొడుగు వేసుకొని వెళ్ళు.

87. లోపల హృదయం లోతుగా ఉంటే బాహ్యమైన గౌరవాలకు ఎవరూ పాకులాడరు. అహంకారం యొక్క కల్పితం వలననే ఎక్కువ, తక్కువ ఏర్పడుతాయి. నిజమైన గొప్పతనం మనకు ఉంటే "స్థిరం"గా ఉంటాము. నీతులు అన్నీ ఇతరులకు చెప్పటానికి ఉన్నాయి, గాని ఎవరి "నేను"కు వారు చెప్పకొంటే ఎంతో అభివృద్ధి జరుగుతుంది. కేన్సర్‌కన్న ఎక్కువ ప్రమాదమైనది కృత్రిమమైన "నేను". దానికి శరీరం కావాలి. అది ఏ జన్మకాజన్మ పెద్ద జబ్బుగా తయారు అవుతుంది. అజ్ఞానమనేది ఒక రోగం. అది నీలో ఉంది. అది ఎలా వ్యక్తమౌతున్నదో నీవే గ్రహించాలి. అజ్ఞానం బయటికి కనిపించదు. చేతిలో ఉన్న ముద్ద నోటిలో పెట్టుకోవటం ఎంత తేలికో, విచారణ మార్గంలో నీ మనస్సును పరిశీలనతో, జాగరూకతో ఉండి ఆచరిస్తే మీ మనస్సు ఆత్మ గూటిలో పడిపోతుంది. జప ధ్యానాలు పశువును బాదుకొంటూ కొట్టంలోకి తోలుకొని వెళ్ళటం లాంటిది. పచ్చగడ్డి చూపుతూ తేలికగా పశువును తోలుకొని వెళ్ళటం లాంటిది విచారణ. ఈ సృష్టి ఎప్పడు ప్రారంభమైనది అనే ప్రశ్న ఎలాంటిది అంటే పిల్లలు లేని వాని దగ్గరకు వెళ్ళి మీ అబ్బాయి వయస్సు ఎంత అనటం ఎంత తెలివి తక్కువదో ఇదీ అంతే ప్రశ్న. అసలు ఈ సృష్టే లేదు అనుకొనే వాడికి పుట్టటం ఏమిటి? ఇది పారమార్థిక సత్యం కాదు. వ్యవహారిక సత్యం. ఊరక ఉండటం నేర్చుకొంటే భగవంతుని సాయం లభిస్తుంది. ఆయనకు మనం అవకాశం కల్పించకుండా మనమే ఆయనను అడ్డుకొంటున్నాము. పుష్పాలను భగవంతుని పాదాల దగ్గర ఎలా పెడతామో అలాగే కర్మ ఫలితాన్ని కూడా పెట్టాలి. చదువు వలన, ధనం వలన, కీర్తి వలన, అధికారం వలన మోక్షం రాదు. అవి మెరుపులు. మనో నిగ్రహం వలననే అది సాధ్యము. చెడు స్నేహాలు నరక ద్వారాలు. మీరు అనవసరమైన విషయాలను మైండ్ చెయ్యవద్దు. చేస్తే క్షోభ లభిస్తుంది. వాటికి

srinannagaru.com

ప్రాణం పోసినట్లే.

88. కుటుంబ పరిస్థితులు, శరీర పరిస్థితులు అహంకారం యొక్క లక్షణం, మార్పు చెందుతూ ఉంటుంది. మార్పులేనిది ఆత్మ ఒక్కటి మాత్రమే. మార్పు చెందే వాటిని పట్టుకొని జీవితం పొడుగునా వెళ్ళిపోతున్నాము. మార్పు చెందే ఆ "నేను" పై నీ గురి పెట్టు. ఎందుచేతనంటే దాని ఉనికి తెలిస్తే సాధన తేలికైపోతుంది. అలా చెయ్యకపోతే ఫలితం ఉండదు. నీకు చెమటలు, ఆయాసం మిగులుతాయి. మనం పది కోరికలతో ఉంటామనుకోండి. ఈ జన్మలో అది సాధ్యం కాకపోతే మరో జన్మను ఈశ్వరుడు ఇస్తాడు. అప్పుడు మరలా నలభై కోరికలు ఉంటే మరలా జన్మ. ఇలా ఆ జన్మకాజన్మ వేలకొలది కోరికలతో వేలకొలది జన్మలు పడతాయి. ఇదే "మాయ". కామం అంటే రాగం. ఆత్మ స్తుతి-పరనింద అజ్ఞానం వల్ల ఈ కృత్రిమమైన "నేను"కు విచారణ అనే వాసన రుచి చూపిస్తే అది పారిపోతుంది. ఇది నిజమైన నేనులాగే తయారై దాని వేషాలు వేసుకోవటం వలన అది నిజమని నమ్ముతున్నాము. అజ్ఞానం వచ్చే టప్పటికి, రాగద్వేషాలు పొంగిపోతాయి. అజ్ఞానం లేదు, లేదని తెలుసుకోవటమే సాధన. మీ అబద్ధమైన "నేను"కు పొంగు వచ్చే మాటలు ఎవరైనా అంటే పొంగుతారు. వ్యతిరేకమైన మాటలు వస్తే కృంగుతారు. అది కొడుకైనా, ఎవరైనా అంతే. అంటే అక్కడ నీ దృష్టి అంతా అబద్ధమైన "నేను" మీద పెట్టాలి. అది తెలిస్తే మనస్సులో మౌనం కుదురుతుంది. నిప్పు మీద పెట్రోల్ పోస్తే మంట పెరుగుతుంది. కోరిక వలన శాంతి పొందుదాము అనుకోవటం అంతే. అది ఏ జన్మలోనో, ఏ సద్గురువో చెప్పే వరకూ ఈ జనన మరణ ప్రవాహంలో కొట్టుకు పోతావు. త్రిగుణాల కలయికే జీవుడు ఈ మాయ గుణాలు చెప్పినట్లు నడిస్తే నీవు బాగుపడవు. భగవంతుడు చెప్పినట్లు నడవండి.

89. మనకు సంకల్పం వచ్చిన తరువాత ఆలోచిస్తాము, పని చేస్తాము. మీరు అప్పుడు ఆ సంకల్పాన్ని పట్టుకొని ఇలా అనాలి "ఓ సంకల్పమా" నీ గురించే కదా ఆలోచింపచేస్తున్నావు, పనిచేయిస్తున్నావు. అనగా మనకు ఈ గ్రహింపు వస్తుంది. ఇది దేహగతమైన నేనులోంచే కదా అని. ఇదే విచారణ మార్గం. నిద్రలో నీవు లేవు. దేహగతమైన "నేను"కే కదా ఈ సంకల్పాలు. అనుకోగానే తలంపులు అణిగిపోతాయి. అబద్ధమైన "నేను" భోగ సామాగ్రిని సంపాదించమని చెబుతుంది. అందులో సుఖం ఉందని చెబుతుంది. ఆ విషయం నిజమైతే భగవాన్ చెప్పేవారు "ఆత్మలోనే సుఖం ఉంది. పై సుఖాలు పరిణామంలో దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. విషయాలు కనిపిస్తే ఆకర్షణ కలుగుతుంది. అద్దంలో

srinannagaru.com

కనిపించే ముఖం నిజం కాదు. నిజంలా కనిపిస్తుంది". జీవుడు కూడా, నిజంలాగే కనిపిస్తాడు అందువలన బయట పడలేకపోతున్నాము. జ్ఞానికి ప్రపంచం, తానుగా కనిపిస్తుంది. వారికి ఆకర్షణ ఏమిటి? లోక జ్ఞానం, శాస్త్ర జ్ఞానం అద్దంలో ప్రతిబింబం లాంటిది. అనుభవం నిజమైన జ్ఞానం. సత్ పదార్థాన్ని తెలుసు కోకుండా చెట్లవెంట, పుట్ల వెంట తిరుగుతున్నావు. నీ తలంపులే, నీ సంకల్పాలే, నీకు సంకెళ్ళు. వాటితో అంటిపెట్టుకోవటం బంధం, తెంచుకోవటం మోక్షం. ఆ సమర్థత నీలో ఉంది. ముల్లు అంత ప్రయత్నం చెయ్యి. జీవుడు తలంపులు లేకుండా ఉండలేడు. ఆత్మకు తలంపులు లేవు. నీవు ఆత్మవు. నీ మనస్సుకు ఎంత శక్తి ఉందో అంత శక్తినీ ఖర్చుచేసి బ్రహ్మానుభవాన్ని పొందు. ఆ ప్రయత్నంలో రూపాయికి రూపాయి ఖర్చుపెట్టు. ఐదు పైసలు, పది పైసలు ఖర్చు పెడితే దాని వలన ప్రయోజనం లేదు.

90. కాలము, ఓర్పు, శాంతి ఈ మూడు గొప్ప వైద్యులు. చావులోనూ, నిద్రలోనూ సాధన సాగదు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తలంపులను బట్టే వస్తువులతో సంబంధం ఏర్పడుతుంది. దేహం నేను అని చెప్పటం లేదు. అందుచేత దాన్ని వదలండి. మనస్సును హృదయంలో ఉంచటమే సుఖాసనం. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే బాధపడకండి. వారి పని పూర్తి అయినదని అనుకో. నీలో "చనిపోయాడే" అని బాధపడే "నేను" చనిపోతే ఆత్మానుభవం కలుగుతుంది. మిమ్ములను ద్వేషిస్తూ ఉంటే మీరు నిగ్రహించుకొంటే అనతి కాలంలోనే మిమ్ములను వందమంది ప్రేమించే వాళ్ళను ఈశ్వరుడు మీకు ఏర్పాటు చేస్తాడు. అది ఆతని నియమం. మనస్సు ఎంత వరకూ ప్యూరిఫై అయితే అంత వరకూ ఏకాగ్రత కుదురుతుంది. శుద్ధమైన బుద్ధి "లోచూపు" కలిగి ఉంటుంది. ఎన్నో మంచి గుణాలు ఉంటేగాని సహనం అలవడదు. అన్నంలో నెయ్యి కలుపు కొంటే ముద్ద సాఫీగా సాగుతుంది. అలాగే ధ్యానంలో ధ్యానమూర్తి పై ప్రీతిగా ఉంటే ధ్యానం సాఫీగా సాగుతుంది. మీరు అనుకొన్న "నేను" నిజమైతే టీచింగ్ అక్కరలేదు. సత్యాన్వేషణలో కృత్రిమమైన "నేను" బలహీనపడుతుంది. "తత్త్వం" అంటే యదార్థ సత్యం. నీకు తత్త్వం తెలుసా? అంటే యదార్థమైన నేను తెలుసా అని అర్థం. ప్రాణాయామం, సూక్ష్మ బుద్ధి ఉన్నవానికి అక్కరలేదు. చెడ్డ వాళ్ళకు "మీకు సత్‌పురుషుల సహవాసం మంచిదని అంటే" వారు విని వచ్చినా కొద్ది కాలంలోనే రెట్టింపు చెడ్డ పనులు చేస్తారు, గజస్నానంలా. అందరూ మనలా ఉండరు. ఆ భావన పనికిరాదు. రాజీ పడకపోతే జీవితం గడవదు. శాస్త్రం అంటే శాసించేది అని అర్థం. హృదయం యొక్క లోతులు పెరగటానికి సహనం

srinannagaru.com

ప్రాక్టీస్ చెయ్యాలి.

91. "నేను" అనే తలంపే ఆత్మానుభవానికి అడ్డుగా ఉందనేది ప్రాథమికంగా తెలియాలి. అంతేగాని సమాజం, కుటుంబ సభ్యులు అడ్డురావటం లేదు. మైండ్‌కు-మేటరు కావాలి. అందుకే దేహం వస్తుంది. కృత్రిమమైన నేను నశిస్తే ప్రకృతితో పనిలేదు. కర్మ మార్గంలో పయనించే వారికి ఫలితం ఎప్పుడో ఒక జన్మలో వస్తుంది. కాని జ్ఞాన మార్గంలో పయనించే వారికి ఈ శరీరం ఉండగానే ఇప్పుడే, ఇక్కడే ఆత్మానుభవం కలుగుతుంది. మీరు పూజ, జపం, ధ్యానం చేస్తున్నారు. ధ్యేయ వస్తువు "నేను" ఉంటేనే అవి చెయ్యగల్గుతారు. దాని వలన శాంతి తాత్కాలికంగా పొందగల్గుతారు. కాని "నేను" సమస్యను పరిష్కారం చేసుకొనే వరకూ ఎన్ని జన్మలు ఎత్తినా అమృతానుభవం కలుగనే కలుగదు. మన బుద్ధిని, ఇష్టాయిష్టాలపై కేంద్రీకరించి మన శక్తిని కోల్పోతున్నాము. అది ఎంత అపకారం చేస్తున్నదో మనకు తెలియటం లేదు. ప్రపంచంలో రాగ ద్వేషాలు తప్ప ఏమీ లేవు. కొందరు నిరంతరం ఇతరులను విమర్శిస్తూ ఉంటారు. అసూయ వలన వాటిని గురించి కంగారుపడితే అహంకారం పెరిగిపోతూ ఉంటుంది. పిరికితనం ఏమాత్రం లేకుండా, సూక్ష్మదృష్టి ఉన్నవానికి, పవిత్రుడికి బ్రహ్మానుభవం కలుగుతుంది. చాలామందికి పని ఏమీ లేదు. బాడీలో ప్రాణాన్ని ఎంతవరకూ పొడిగించుకుందామనే దానిమీదే ప్రయత్నం చేసేారు. అహంకారం తగ్గించుకొందామనే ప్రయత్నము చేయటం లేదు. చేస్తే ఈశ్వరానుగ్రహం వస్తుంది. కర్మకాండలో బ్రాహ్మణులు జంధ్యం మార్చుకోమని చెప్పటానికి ప్రాచీనా విధి సవ్యమ్ అంటారు. అలాగే మన నిత్య జీవితంలో స్మరణ, అపస్మరణలో ఉంటున్నాము. అపస్మరణ అంటే నీవు కాని దాన్ని నీవని స్మరించటంలో కాలాన్ని గడుపుతున్నాము. మన గమ్యం ఆత్మను దర్శించటమే.

92. లీజన్ ఎంత వరకూ వెడితే అంత వరకూ మనం దానిని ఉపయోగించుకోవాలి. గీతలో భగవానుడు "విషయాన్ని తెలుసుకోవటానికి నీవు నిజాయితీతో ప్రయత్నం చేస్తే అది నిజమైతే, అందులో దోషం లేకపోతే నీకు అర్థమయ్యే బుద్ధిని నేను ప్రసాదిస్తాను" అన్నాడు. సాధన అంటే ఆలోచన-పని, మాటలోనూ, పవిత్రత ఉండాలి. దాని వలననే మనస్సు నశిస్తుంది. ఎదుటివారిని కించపరచకుండా సద్బుద్ధితో మాట్లాడటం, చేతనైతే సహాయం చేసేవాడే ఎక్కువ ప్రయోజనం పొందుతాడు. అందరికీ డబ్బు ఉండదు. యజ్ఞయాగాదులు అందరూ చెయ్యలేరు. పై పనులు చేస్తే దేవతల అనుగ్రహం వస్తుంది. ఇంద్రియాల చాపల్యం తగ్గించటానికి అవతార పురుషుల రూపాన్ని ధ్యానం చెయ్యమన్నారు.

బ్రహ్మం తప్ప ఈ సృష్టిలో అంతా ఎండమావే. సిరికంటే శీలం గొప్పది. సిరికోసం శీలాన్ని పోగొట్టుకోకూడదు. సిరి శ్మశానం వరకే వస్తుంది. శీలం జన్మాంతరం వరకూ వస్తుంది. అందుకే దానికి అంత ప్రాముఖ్యం ఉంది. కొన్ని మంచి గుణాలను కాపాడుకోండి. బ్రహ్మానుభవానికి అవి సహకరిస్తాయి. స్నేహితులను, పుస్తకాలను ఎన్నుకోవటంలో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే మంచి కన్న చెడ్డే ఎక్కువ చేస్తుంది. విషయ చింతన పెరుగుతూ ఉంటే అజ్ఞానం పెరుగుతుంది. ఆత్మ చింతన పెరిగితే జ్ఞానం కలుగుతుంది. ఒక్క ఇంద్రియానికి లోబడితే చాలు మనిషి పతనమై పోతాడు. జ్ఞాపకం కూడా మనిషిని వెనక్కు తీసుకొని పోతుంది. ఇంద్రియాలలో ఉన్న సుఖాలు జ్ఞాపక రూపంలో ఉంటాయి. మీ వాసనలు ఏమిటో తెలుసుకొని నివారించుకోండి. అదే సాధన. దేహబుద్ధి ఉండటం వలననే ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకొంటాడు అది లేకపోతే ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనే తలంపే రాదు.

93. ప్రకృతి వైపు నీ మనస్సు ఎంత సహజంగా వెళుతుందో అలాగే సత్యం వైపుకూ నీ మనస్సు అంత సహజంగా, నీ ప్రయత్నం లేకుండా వెళితే నీకు మోక్షానుభవం ఈ శరీరంలో ఉండగానే కలుగుతుంది. దేవుని ప్రేమలో స్వార్థం లేదు. నాలికను కంట్రోల్ చేసుకొంటే నరక లోకానికి వెళ్ళవలసిన అవసరం లేదు. అది కంట్రోల్ చేసుకోకపోతే తినరాని తిండి తింటాము, అనరాని మాటలు అంటాము, నరకానికి పోతాము. మనిషి జన్మ ఎత్తి భగవదనుభవాన్ని పొందని వారిని గురించి జాలి పడాలి. అంతేగాని పశువులను చూచి జాలిపడటం కాదు. ఒకటవ తరగతి చదవని వాడు నాకు ఉద్యోగం రావటం లేదు అనుకోవటం ఎటువంటిదో, ఎంత తెలివి తక్కువో, అలాగే నీకు దయ, జాలి వంటి దైవీ సంపద నీవు సంపాదించుకోకుండా నాకు బ్రహ్మానుభవం కలగటం లేదు అనటం అలాంటిదే. అందం చర్మంలోనూ, ముఖంలోనూ లేదు. అంతర్ముఖమైనప్పడే తెలుస్తుంది. సినిమా తీసినప్పడు డైరెక్టరు నటుడిని ఎటు గంతు వేయమంటే అటు వేస్తాడు. ఎన్నిసార్లు చెయ్యమంటే దాన్ని అన్నిసార్లు చేస్తాడు. అలాగే రాగ, ద్వేషాలనే డైరెక్టర్లు ఏమి చెయ్యమంటే అలా గంతులు వేస్తూ ఉంటాడు జీవుడు. వాటి చేతిలో బందీగా ఉంటాడు. స్వతంత్రంగా ఉండడు. భగవంతుని మాట గురించి ఆలోచించరు. కారణం రాగ-ద్వేషాలనే జైలులో ఉన్నాడు. కాబట్టి, కొందరు బహు జన్మల కృషి ఫలితంగా, వివేకంతోనూ వైరాగ్యంతోనూ ఉంటారు. సాపేక్షిక ప్రపంచం ఉన్నంత వరకే సాపేక్షిక జ్ఞానం. బానిస బుద్ధి ఉన్నవాడు ఎక్కువగా భయపడతాడు. వాడికి అభివృద్ధికి అవకాశం ఉండదు. స్వతంత్రమైన

srinannagaru.com

ఆలోచన గలవాడు అర్హుడు అవుతాడు. విచక్షణా బుద్ధిలేకపోవటం వలననే గమ్యం తెలియటం లేదు. గుణం గమ్యం కాదు. భగవంతుని కళ్యాణ గుణాలను స్మరించటం వలన ఆత్మానుభవానికి సహకరిస్తుంది.

94. ఓర్పును అలవాటు చేసుకొంటే ఎన్నో మంచి గుణాలు వస్తాయి. వాసనను బట్టి మనిషి నడుస్తాడు. సత్త్వ గుణం వచ్చే ముందు ప్రకృతిపై ఆసక్తి తగ్గుతూ ఉంటుంది. వైరాగ్యం అలవడుతుంది. సూర్యోదయానికి ముందు అరుణోదయమైనట్లు వ్యభిచార భక్తి, చాపల్య భక్తి, అవ్యభిచార భక్తిగా ఉండాలి. నిరంతరం ఆత్మ యందే నిలకడ చెంది ఉండాలి. ఒక షిరిడీ సాయిబాబా భక్తురాలు ఆమె భర్త పోవటంతో బాబా ఫొటోలు అన్నీ తీసి పెంటలో పోసింది. అది వ్యభిచార భక్తి. మనస్సుతో తాదాత్మ్యం చెందటం వలననే జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటాము. అలవాటును సంతృప్తి పరిస్తే నీవు దాని పని పూర్తి చెయ్యలేవు. వాసనలోంచి కోరిక వస్తుంది. అవిచారణ బుద్ధి ఉన్నప్పుడే పొరపాటు మాటలు వస్తాయి. పొరపాటు పనులు చేస్తాము, విచారణా బుద్ధి ఉంటే చేయము. మనం బాగు పడాలనే బుద్ధి కలిగితే ఈశ్వరుని సహాయం అందుతుంది. చర్మ దృష్టి ఉన్నవానిలో ఆత్మ వస్తువును చూడలేరు. ప్రకృతి గుణాలు దాటిన వానికి పురుషోత్తముడు దొరుకుతాడు. చైతన్య బుద్ధి గ్రహింపుకు వస్తేగాని ఈ బుద్ధి ప్రకృతిలోంచి బయటికి రాదు. "ఈశ్వర సంకల్పమే నా సంకల్పం" అనుకొనే వారికి దుఃఖం నశిస్తుంది. గాయత్రీ మంత్రం అర్థం ఏమిటి అంటే బుద్ధి సూక్ష్మతను ఇమ్మని అడగటం శక్తిని ప్రార్థించటం. మనిషి అందంగా ఉండవచ్చు. నేను అందంగా ఉన్నానని ఎదుటివాడు అనుకోవాలి అనుకోవటం వలన దేహ వాసన పెరిగిపోతుంది. మీకున్న ప్రేమ ఈశ్వరునిపై విశ్వాసం వలన ఆయన గురురూపం ధరించి వచ్చాడు. యోగంలేని వారు కళ్ళు ఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు. నీ వేషం నీవు తీసి, ఆయన వేషం ఆయన తీస్తే ఉన్నది ఒకటే నిజం. నిజం ఒక్కటిగానే ఉంటుంది.

95. వ్యక్తిభావన ఉన్నంతకాలం దేవుని నమ్మవలెను. అహంకారానికి అండ ఉండాలి. మేడకట్టేటప్పుడు పరంజాలు, పనిచేసే వారి కోసం వేస్తారు. మేడ కట్టాక తీసి వేస్తారు. బ్రహ్మానుభవం కలిగే వరకూ ఏదో ఒక ఆసరా ఉండాలి. మొక్క చిన్నదిగా ఉన్నప్పుడే కంచె, ఎదిగాక అక్కరలేదు. నీవు స్వతంత్రుడవు కానంత కాలం ఎవరి మీదనో ఒకరి మీద ఆధారపడతావు. శ్రోత్రియ బ్రాహ్మణుడు అంటే, వేదార్థాన్ని సుస్పష్టంగా చెప్పే వారని అర్థం. వస్తువు మీకు అనుభవంలో లేకపోయినా, వస్తువును అనుభవం పొంది యున్న వారిని

srinannagaru.com

చూడటం వలన ఆ కళ్యాణ గుణాలకు మీరు వారసులు అవుతారు. బంగారానికి వాసన ఉండదు. ఆధ్యాత్మిక సంపదకు వాసన ఉంటుంది. సంపదకు తోడు ఆధ్యాత్మిక వాసన ఉంటే బంగారానికి సువాసన అబ్బినట్లు ఉంటుంది. ఆడంబరం ఆహంకారాన్ని పెంచుతుంది. నిరాడంబరం అహంకారాన్ని కృంగదీస్తుంది. అహంకారం పలచబడితే భగవంతుని తెలుసుకోగలుగుతాము. భౌతిక దేహంను సున్నిపిండితో శుభ్రం చేసుకొంటాము. అంతఃకరణ శుద్ధి భగవంతుని ప్రేమించటం ద్వారా శుభ్రమౌతుంది. మనస్సు కుదురుగా ఉంటే మనం ఏది సాధించాలన్నా సాధించగలం. మనస్సు సద్వస్తువును తెలుసుకొనే ప్రయత్నంలోనే అంటే ఆ ప్రయాణంలోనే సుఖం వస్తుంది. జీవితలక్ష్యంలో నీ బలహీనతలు ఏమి ఉన్నాయో దాన్ని తొలగించుకోవటమే. నీ సాధన లక్ష్యం అదే. మందు తినటం నీ లక్ష్యం కాదు, నీ ఆరోగ్యానికి, ముందు ఉన్న స్థితి రావటం కోసమే. కంచానికి మసి అంటుకొంటే ఎంత వరకూ తోమమంటే? మసిపోయే వరకూ తోమాలి. అలాగే నీకు వేరు భావన పోయే వరకూ సాధన చెయ్యి. సెక్స భావనతో తాదాత్మ్యం పోయే వరకూ శరీరం నిజమనుకోవటం మానవు. అదిపోయే వరకూ సాధన చెయ్యాలి.

96. నిధి ధ్యాస అంటే మీరు విన్న సద్వస్తువు యొక్క వైభవం నిధిగా మారుతుంది. భగవంతుడు చెప్పిన మాటలను వినటం, దాన్ని మననం చెయ్యటం వలన మనస్సు అంతర్ముఖి మవుతుంది. సద్గురువు చెప్పేది చెవులతో కాదు, మనస్సుతో వినాలి. అలా చేస్తే భౌతిక దేహం పోయినా ఆ చెవులు కాలిపోయినా, కొత్త దేహంతో, కొత్త చెవులతో వినటానికి ప్రయత్నిస్తావు. అంటే ప్రీతిగా, మనః పూర్తిగా శ్రవణం చెయ్యాలి. ఐన్‌స్టయిన్, తండ్రి సలహా వలన సబ్జక్టు ఫిజిక్సు తీసుకున్నా తనకు ప్రీతి పాత్రమైన మేథమెటిక్స్‌ను శ్రద్ధతో, ప్రీతిగా కృషిచేసి ఉన్నత స్థితికి వచ్చారు. ప్రీతి అంటే అలా ఉండాలి. మీలో మంచితనం ఎలా ఉండాలంటే, మీలో మంచితనం ఉందన్న విషయం కూడా మీకు తెలియకూడదు. అశాంతి శాశ్వతం కాదు. అది కల్పించబడింది. సత్యమైతే అది పోదు. ఆత్మ కాని దాని మీద నీ మనస్సు వాలకుండా చూచుకోవటమే వైరాగ్యం అంటారు. సందేహం ఉన్నంతకాలం సందేహాలు వస్తూ ఉంటాయి. నీరు పల్లం వైపుకు వెళుతుంది. దానికి ఎవరూ చెప్పనక్కరలేదు. అలాగే దేహం పుట్టిన తరువాత ప్రారబ్ధానికి అనువుగా నడుస్తుంది. పెళ్ళికి ముందు చాలా రోజులు బట్టలు, నగలు, శుభ లేఖలు పంపిణీ, భోజనాలు వగైరా పనులకు చాలా టైము కావాలి. కానీ పెళ్ళి ఒక గంటలో పూర్తి అవుతుంది. ఇల్లు కట్టేటప్పుడు వస్తు సామాగ్రి అమర్చటం చాలా

srinannagaru.com

శ్రమ, చాలా కాలం పడుతుంది. కాని గృహ ప్రవేశం కొద్ది నిమిషాలే. అలాగే బ్రహ్మానుభవానికి ముందు సాధకుడు గురువు తనచేత అనుభవింప చేసే కష్టాలు అనుభవింపచేసిన తరువాత అనుభవం కొన్ని సెకనులు మాత్రమే. గురువు చేసే పని ఏమిటి అంటే నీవు ధ్యానం పేరుతో ఎన్నో కష్టాలు పడకుండా ప్రీతితో వారిని స్మరించటం చేతనే శుభప్రదంగా, తేలికగా ఒడ్డున చేరుతావు. దీనిని నేను రిపీటెడ్‌గా చెబుతున్నాను గ్రహించండి.

97. కొందరు మనుషులు ఎక్కడికి తీసుకొని వెళ్ళినా తగువులు తీసుకొని వస్తారు. నీవు ఒక మాట మాట్లాడితే అది బ్రహ్మానుభవానికి సహకరించాలి. వారే బుద్ధిమంతులు. అది పరిశీలించుకో. ఆకారానికి పరిమిత మైన నీవు నిరాకారివైన నీ స్వరూపాన్ని తెలుసుకోవటం కష్టమౌతుంది. రూప నామం అనే భావన మనిషికి పట్టిన గజ్జిలాంటిది. ఆ దురదతోనే నీ చరిత్ర అంతా సరిపోతున్నది. ఈశ్వరునిపై నీవు అచంచలమైన విశ్వాసంతో సంపూర్ణ శరణాగతుడవు అయితే అదును చూచి పదును పెడతాడు నీ గురవు. అంటే ఉపదేశిస్తాడు. పూర్వ జన్మలో సాధన చేసి, వివేకంగా జీవించి ఉంటే ఈ జన్మలో సత్యాన్ని పొందాలనే కోరిక పుడుతుంది. భగవంతుడు మనకు ఇచ్చే అవకాశం ఎలా సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచించటం ప్రధానం. మాట్లాడకూడని విషయాలు మాట్లాడటం ఎంత పొరపాటో మాట్లాడే విషయాలు మాట్లాడక పోవటం కూడా అంతే పొరపాటు. అనగా అవగాహనా శక్తి తక్కువగా ఉంటే అనుమానాలు ఎక్కువ అవుతాయి. అది ఎక్కువ ఉంటే అనుమానాలు తగ్గుతాయి. ఎవరు ఏ ఉద్దేశ్యంతో మాట్లాడుతున్నారో తెలుసుకోవాలి. ప్రేమతో మాట్లాడుతున్నారా, మర్మం ఏమైనా ఉందా అని గ్రహించాలి. భోగ కాంక్ష నీకు ఉంటే నీవు ఎంత బుద్ధి సూక్ష్మమైన వాడివైనా ఈశ్వరుడు నిన్ను కర్మ చక్రంలో ఉంచుతాడు. ఇతరులు నిన్ను పొగడాలనే కాంక్ష ఉన్నా అది భోగకాంక్షే. పొగడ్త అహంకారానికి అలంకారం. దాని వలన కూడా నీవు పతనమౌతావు. భగవాన్ అన్నారు "నోరు మూసుకో. హృదయాన్ని తెరువు. నిరంతరం నీవు మోక్ష కాంక్షలోనే ఉండాలి. నీ లౌకిక కోరికలు, అవసరాలు నిన్ను బహిర్ముఖం చేస్తాయి. నీవు మోక్ష కాంక్ష వదులుకోకు".

98. శాంతి నీ ముఖానికి అలంకారం. జ్ఞానం లేనప్పుడు ఎన్ని అలంక రించుకొన్నా శవాన్ని అలంకరించినట్లుగానే ఉంటుంది. కృతజ్ఞత ప్రకృతి సంబంధమైనది కాదు. దైవీ సంబంధమైనది. ఏకాంత వాసానికి నీవు ఎంజాయ్ చెయ్యాలి. ప్రకృతి మనుషులతో ఎంత వరకూ ఉండాలో అంత వరకూ ఉండు

srinannagaru.com

అంతే. కర్మ ఫలత్యాగం నేర్చుకో. నీవు ఆత్మానుభవం పొందిన గురువును, మరియు ప్రేమ పూరితమైన వానిని ఆశ్రయించు. టీచరు ప్రబోధలో నీవు తాదాత్మ్యం పొందాలి. దీనిని నీ వైపు నుంచి ప్రోత్సాహాన్ని సమకూర్చుకోవాలి. ఆత్మ విశ్వాసం విషయంలో నీ మీద నీకు విశ్వాసం ఉండాలి. అసూయలోంచే ఎక్కువ వివర్శలు వస్తూ ఉంటాయి. వాటిని ఖాతరుచెయ్యకు. క్షమాగుణం నీకు బ్రహ్మానుభవానికి సహకరిస్తుంది. ప్రకృతిపట్ల ఆసక్తి వలననే అహంకారం పెరుగుతుంది. నీకు సాధనలో కొంతబాధ కలుగవచ్చు కాని కొంత కాలానికి అనంతమైన సుఖం నిన్ను వరిస్తుంది. మనం రాత్రి ఎంత కటిక చీకటిలో ఉన్నప్పటికీ కొన్ని గంటలు ఓర్చుకొంటే సూర్యోదయం కాగానే అనంతమైన వెలుగులో ఉంటాము. సీతామాత రెండు పొరపాట్లు చేసింది. గౌరవించవలసిన లక్ష్మణుని మాటలు అనరాని మాటలుగా భావించి అగౌరవం చేసింది. గౌరవించ కూడని రావణుని గౌరవించి ఫలితం అనుభవించింది. మనం గౌరవించవలసిన వారిని గౌరవించాలి. అయోగ్యులకు గౌరవం ఇస్తే కాల ప్రవాహంలో అపకారం చేసి తీరుతాడు. ప్రాణం-మనస్సు ఒక్క రకంగా కేంద్రీకరించి మంత్రం జపిస్తే ఆమంత్ర ఫలితం ఉంటుంది. చెడ్డ అలవాట్ల వలన మొదట దరిద్రం, తరువాత శరీర రోగం వస్తుంది. సహజంగా వచ్చే చెడ్డలు కాకుండా ఇవి తెచ్చిపెట్టుకొన్నవి.

99. ఆత్మజ్ఞానం అసత్యంలో నుంచి సత్యంలోకి తీసుకొని వెళుతుంది. లౌకికులతో స్నేహం చేస్తే మీ మనస్సు బలహీనమౌతుంది. నాలుకను స్వాధీనం చేసుకొన్న వాని మాట నిదానంగా ఉంటుంది. ఇతరులకు శాంతిని కలుగచేస్తాయి సద్గ్రంథ పఠనం చేయండి, జ్ఞాని సహవాసం వలన ఆయన సమక్షంలో కూర్చోవటం వలన మీ ప్రారబ్ధం మహా ప్రవాహంలో గడ్డి పరకలా కొట్టుకుపోయి మీరు శాంతిని పొందుతారు. బాహ్య గురువు మీకు ఇష్టమైన వాళ్ళతో తిట్టిస్తూ ఉంటాడు. మీరు జీవితం పొడుగునా ఎవరికోసం కృషి చేసారో వాళ్ళతో తిట్టిస్తూ ఉంటాడు. అది లేకపోతే పశ్చాత్తాపం రాదు. వారి మీద విముఖత రాదు. విచారణ మొదలు పెట్టలేము. తిండిలేని వానికి తిండి కలిగింది అనుకోండి వాడికి యం.ఎల్.ఎ. అవ్వాలని ఉంటుంది. తరువాత మంత్రి, ముఖ్యమంత్రి అవ్వాలని ఉంటుంది. కోరికను అదుపులో ఉంచితే ఫరవాలేదు, సఫలం చేసుకొంటే అజ్ఞానం పెరుగుతుంది. లక్ష్యం గలవాడు కాలు జారినా తీసుకొంటాడు. తాను ఆత్మను అనుకొంటాడు. ఆ లక్ష్యం లేనివాడు కూడ తీసుకోడు కదా, ఏకంగా జారిపోతాడు. ప్రతీమాటకూ రియాక్షన్ అయ్యే వానికి ఏమీ తెలియదు. మీ ఊహలతోనూ, సంకల్పాలతోనూ నిర్మించుకొన్న ఈ “నేను” అనే పేక ముక్కల కోటను కూల్చటానికి

srinannagaru.com

గెడ్డపారలతో పనిలేదు. కృత్రిమమైన ఈ నేను గాలితో ఊదినట్లు కొంచెం విచారణ చేస్తే కూలిపోతుంది. ఒకేసారి మీకు స్వేచ్ఛ రాకపోయినా మీ కాలాన్ని సద్వినియోగం చేసుకొంటే తదుపరి జన్మలలోనైనా మంచి ఆధ్యాత్మిక కుటుంబం లో ప్రవేశపెట్టి, నిన్ను ఉద్ధరిస్తాడు ఈశ్వరుడు. రజోగుణం గలవాడు వాడి బాధను లోకానికి అర్పిస్తాడు. సత్త్వగుణం ఉన్నవాడు లోక బాధను తన బాధగా భావిస్తాడు. ధ్యానం చెయ్యటానికి ప్రారంభంలో ప్రయత్నము అవసరం. కొంతకాలానికి అది సహజవౌతుంది. ధ్యానం సహజమైన తరువాత మాత్రమే సమాధి స్థితి కలుగుతుంది. ఏక వస్తువును నిరంతరం చింతించటం ధ్యానమంటారు. భగవదనుభవం పొందుటకు, అన్ని సాధనలలోను ధ్యాన సాధన ముఖ్యమైనది. యమ, నియమములు ధ్యాన సాధనకు పునాది రాళ్ళు, మనస్సుని క్రమములో పెట్టేది ధ్యానం. సత్కర్మ ప్రయోజనం కూడా అదే.

100. ప్రారబ్ధం అనుభవించేటప్పుడు మానవునికి, వివేకం కలుగుతుంది. మొట్టికాయలు తగలగా, తగలగా మనకు ఆత్మ గృహానికి వెళ్ళాలనే బుద్ధి కలుగుతుంది. అప్పుడు గురువు నీకు దారి చూపిస్తాడు. బుద్ధి కుంటిది. బుద్ధితో మాత్రమే నీవు దేవుని తెలుసుకోలేవు. కాని నీవు నిజాయితీతో ప్రయత్నం చేస్తే అనుగ్రహం వస్తుంది. మన సమీపంలో చెడ్డవాసన బలీయంగా వస్తూ ఉంటే అగరవత్తులు వెలిగించినా చెడు ఆగదు. అలాగే భగవాన్ ఎంతో ప్రీతిగా దగ్గర కూర్చోబెట్టుకొని తత్త్వం తెలిపినా అర్థం కావటం లేదంటే వాసన బలంగా ఉన్నట్లు లెక్క. ఈశ్వరుడు మౌన స్వరూపుడు. శరణాగతి పొందిన వానికి అణగిన మనస్సుకు మౌనం తెలుస్తుంది. మీకు ఒక చెడు తలంపు వచ్చింది అనుకోండి. మీరు మర్చిపోవచ్చు కాని మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు మీ తలంపును తీసుకొని ఏదో జన్మలో దాన్ని మీకు తెలియపరుస్తాడు. అది నీ హృదయంలో ఉన్నప్పుడు తెలియదు. దాన్ని నీవు అనుభవించే వరకూ తియ్యడు. అమృత నాడి అందరికీ ఓపెన్ అవ్వదు. పరమ పవిత్రుడికి, చల్లటి మనస్సు గలవానికి, సింపుల్‌గా ఉండి జీవించేవాడికి తెలియబడుతుంది. బుద్ధి సూక్ష్మత ఉన్న వాడు విషయం తొందరగా గ్రహిస్తాడు. అదిలేని వానికి రాళ్ళలో దేవుని చూచే బుద్ధి కలుగుతుంది. సూక్ష్మ బుద్ధి ఉన్నవాడు బుద్ధికి మూలమైన దాన్ని తెలుసుకొనటానికి ప్రయత్నం చేస్తాడు. అన్నీ తలంపులే. మీరు ఎవరితోనైనా ఆర్థికంగా పోల్చుకొంటే నిరాశ కలిగితే అది కూడా తలంపే. మీకు విషయం గుర్తుకు రావటం లేదు. విచారిస్తే తెలుస్తుంది అది తలంపే అని. చేసిన తప్పు చిన్నది. అది ఎంతో పెద్ద శిక్షను తీసుకొని వస్తుంది. మిమ్ములను మీరు హత్య చేసుకొంటున్నారు. "నేను" శరీర

srinannagaru.com

మాత్రుడననే తలంపే నిన్ను ఈ నీచస్థితికి తీసుకొని వచ్చింది. ఈ దుఃఖ కారణం నీకు తెలిస్తే దుఃఖం నశించిపోతుంది. గాఢ నిద్రలో ఆ తలంపు లేదు.

101. కలియుగంలో కలహ ప్రియులు ఎక్కువ. మంటలు అంటించటం తేలికే. ఆర్పటం కష్టం. కొందరు ఎప్పుడు, ఎక్కడ, ఏది మాట్లాడకూడదో అక్కడ అది మాట్లాడుతూ ఉంటారు. నిద్రపోయే వాడికి కల వస్తుంది. మెలకువలోని వానికి కలల ఆట సాగదు. కలలో అనేక రకాల అరిష్టాలతో ఉన్నవి వస్తాయి. మెలకువలో సాగవు. అలాగే అజ్ఞానం నుంచి బయట పడ్డ వానికి "మాయ" యొక్క ఆటలు సాగవు. మూకుడిపై ఉన్న మసి మన చేతలతో తోమితే పోతుంది. నీ మనస్సులో ఉన్న దోషాలు భగవంతుని నామంతో జపిస్తే పోతాయి. కుమ్మరి వాడు కుండను చేసేటప్పుడు అనేక వంకర్లను సరిచేసి, అవసరమైన ఆకారం రావటానికి ప్రయత్నం చేస్తాడు. అలాగే మనస్సులోని వంకర్లు సరిచేసుకొని, సత్యం వైపు దారి మళ్లించాలి అన్నారు బుద్ధుడు. శక్తి నీ సంకల్పంలో లేదు. ఈశ్వరునిలో ఉంది. నీకు సంబంధించిన పని ఏదో నీవు చేసుకో. ఫలితం ఆశించవద్దు. అంటే రాదని కాదు. నీ అర్హతకు తగ్గట్టుగా ఈశ్వరుడు ఇస్తాడు. ఆశిస్తే పునర్జన్మకు తిప్పేస్తుంది. ఆశించకపోతే సత్యం వైపుకు తీసుకొని వెళు తుంది. ఎదుటివాడికి సహాయం చేస్తే తిరిగి చెయ్యలేడు అనుకొనేటప్పుడు, చేసే సహాయానికి పుణ్య దానం అన్నారు. మనిషిలో మోహం ఉండటం వలననే మోహం యొక్క లోపంలో పడతాడు. నాకు బయట లోకం ఉన్నది అనుకొన్నంత కాలం దుఃఖం వస్తుంది. మీ దేహ ప్రారబ్ధంలో బాధపడే యోగం ఉంది అనుకోండి ఎవరితోనో ఒకరితో అది సంప్రాప్తమౌతుంది. కాని మీరు ఏమనుకొంటారు అంటే ఆ వ్యక్తి కారణం వలననే దుఃఖం వస్తున్నది. అనుకోవటం వలననే వారిపై మీకు పగ, ప్రతీకారం మొదలైనవి కలిగి తిరిగి బంధంలో చిక్కుకుంటారు. మనకు దూరదృష్టి, దీర్ఘదృష్టి కావాలి. మాయ ఎటు ఆడిస్తే అటు ఆడే వాడు సంసారి.

102. సత్యం గురించి అనుకొని చెప్పటం వేరు, ఊహించి చెప్పటం వేరు. సత్యమై చెప్పటమే నిజమైనది. నీ దేహాన్ని నీ ఎదురుగుండానే కాల్చి వేస్తున్నారు. మరి పుట్టింది ఎవరు? నీ గుణాల యొక్క సమూహమే పుడుతుంది. ఏదో దేహాన్ని ఆశ్రయించి, పుడుతుంది. అలవాట్లు యొక్క గుణాలే జీవుడు అని అంటారు. ఎవరికైతే మోక్ష కాంక్ష తీవ్రంగా ఉంటుందో వారికి తలంపులు, అలవాట్ల యొక్క గుంపు నశిస్తుంది. అక్కరలేని తలంపులన్ని మీరు కల్పించుకొంటున్నారు. వికారాలు పొందుతున్నారు మరలా దాని నుండి విడుదల పొందటానికి సాధన చేస్తున్నారు. "అహం స్ఫురణ" స్వతంత్రమైనది. "అహం వృత్తికి ఏదో ఒకటి

srinannagaru.com

సపోర్టు కావాలి. అంటే నేను ధనవంతుడను, అందగాడను అనేవి కావాలి. తెలివిగలవాడు ఎవరు అంటే అహంవృత్తిని తొక్కిపెట్టి అదుపు చేసుకొన్న వాడే బలవంతుడు. సౌఖ్యాలను పొందేవాడు కాడు, అదుపు చేసుకొన్న వాడు గొప్ప వాడు. సాధన చెయ్యని వానిని వదిలేయండి. చేసే వానిని కూడా అహంవృత్తి విజృంభిస్తుంది. కారణం అహంవృత్తి వయస్సు ఎక్కువ బలీయమైనది కావటం వలన. మీరు ఒక సినిమా వాల్‌పోస్టరు చూచారు అనుకోండి ఆ బొమ్మతో మాట్లాడాలి అని ఉండదు. కారణం అది బొమ్మ. అలాగే జ్ఞాని ఎవరిని చూచినా బొమ్మలాగే చూస్తాడు. మాట్లాడటానికి అక్కడ ఏమీ లేదు. మీకు ఈ సృష్టిలో ఏదైనా చూడటానికి ఉంటే బ్రహ్మానుభవం పొందలేనట్లే లెక్క. యాక్షన్ తలంపు; రియాక్షన్ తలంపు. ఏకాంత వాసం అంటే అర్థం వందమందిలో కూర్చున్నా నీవు నిర్మలంగా ఉంటే ఏకాంత వాసంలో ఉన్నట్లు లెక్క. అంతేగాని గదిలో ఒంటరిగా కూర్చున్నానని కాదు. మనస్సు కుదురుగా లేకపోతే ఏకాంతవాసం కాదు.

103. మనస్సు ఎక్కడ అణుగుతుందో అక్కడ నుండి, నదీ ప్రవాహంలా "సందేశం" వస్తుంది. దాన్ని అనర్హులు అందుకోలేరు. ఇరువది నాలుగు గంటలూ నాతో ఉండే దేహం నాది కానప్పుడు నాకు బయట ఉన్నది నాది ఎలా అవుతుంది. మార్కండేయునకు శివుడు ప్రత్యక్షమై ఏదో ఒకటి కోరుకో అంటే "నీ మీద నాకు ఎంత ప్రేమ ఉందో భక్తుల మీద కూడా అంతే ప్రేమ ఉండేటట్లు అనుగ్రహించు" అన్నారు. అపవిత్రతలు అన్నీ అహంకారాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి. అపవిత్రతకు ఆందోళన ఉంటుంది. పవిత్రతకు ఆందోళన ఉండదు. ధ్యానం మొదట కష్టంగా ఉంటుంది. అలవాటైతే నీ ప్రయత్నం అవసరం లేకుండానే ధ్యానంలోకి వెళ్ళ గలుగుతావు. తరువాత ధ్యానం విడిచిపెట్టాలని ఉండదు. అంత తేలికగా ఉంటుంది. సరాసరి ధ్యానం చెయ్యలేని వారు జపంలో ఉండటం మంచిది. జపం, ధ్యానం చెయ్యటానికి ప్రిపేర్ చేస్తుంది. మొదట కొంచెం సేపు జపం చేసి తరువాత ధ్యానం చెయ్యటం వలన ధ్యానం బాగా సాగుతుంది. ఇల్లు తుడిచిన తరువాత వచ్చే దుమ్మును వెంటనే పెంట మీద వేస్తాము. మనలో ఉన్న జీవ లక్షణాలను దుమ్ములా బయట వెయ్యలేకపోతున్నాము. చంటి పిల్లను జాగ్రత్తగా మంచం మీద పడుకోబెట్టి, జాగ్రత్త పెట్టినట్లుగా ఉంచుకొంటున్నాము. తక్కువ మాట్లాడు, ఎక్కువ విను, ఎక్కువ ఆలోచించు అంటోంది శాస్త్రం. రోగం వచ్చిన తరువాత చూచుకోవటం కాదు రోగం రాకుండా చూచుకోవాలి. అలాగే తలంపులు రాకుండా చూచుకోవాలి. వచ్చాక ఎంతో కొంత శ్రమ తప్పదు. "నాది" పోతే చిత్త శుద్ధి కలుగుతుంది. "నేను" పోతే జ్ఞానం కలుగుతుంది. ఆ రెండు

srinannagaru.com

తలంపులు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియటం లేదు. తెలిస్తే జ్ఞానం కలుగుతుంది.

104. తత్త్వం తెలిస్తేగాని గుణాలనుంచి బయట పడలేము. గుణాల నుండి బయటపడితేనే గాని తత్త్వం తెలియదు. పెళ్లి అయితేగాని పిచ్చి కుదరదు; పిచ్చి కుదిరితేగాని పెళ్లికానట్లుగా ఉంటుంది పై విషయం. ప్రేమ శాశ్వతంగా ఉంటుంది. గుణాలు శాశ్వతంగా ఉండవు. రూప, నామ, క్రియలను తీసివేస్తే ప్రపంచం లేదు. మంచి వచ్చినా, చెడు వచ్చినా దేవుని ప్రసాదమనుకోండి. మిధ్యా నేను సందేహిస్తే దాన్ని పరిశీలిద్దామనే బుద్ధి పుడుతుంది. సత్త్వ గుణం ఒక్కొక్కసారి సహజంగా వస్తుంది. వచ్చినప్పుడు దాన్ని పట్టుకొని వెళితే కొంత సేపు సాధన చేయగలం. దాన్ని బలవంతంగా తెచ్చుకోవాలంటే కుదరదు. రజోగుణం, తమోగుణాలు ఉన్నప్పుడు మనస్సు బయటికి విజృంభిస్తుంది. గాఢ నిద్రలోని స్థితిని జ్ఞాపకం చేసుకోగా, ఆస్థితిలో ఉండాలని అనిపిస్తుంది. నీకు వేరుగా ఉన్న దానిలోంచి విడిపోవటం తప్పదు. నీకు శివుడు, కృష్ణుడు బాహ్యంగా కనిపించవచ్చును. అది కూడా దృశ్యమే. ఎవరికి వారు పొగుడుకొనే వారికి, ఇతరులను నిందించే వారికి "పాపం" పిలవకుండానే వస్తుంది. వారి తలకు పాపం చుట్టుకొంటుంది. మీరు కాని డబ్బు వలన, మీకు చెందని గౌరవం వలన మీరు అనుకోవటం వలన అజ్ఞాన బీజాలు నాటుకొనిపోతాయి. ఎవరినీ దుర్మార్గులుగా అనుకోవద్దు. వాళ్ల చేతుల్లో పడకూడదు. కొందరు నిరంతరం తమ గురించి తామే చెప్పకుపోతూ ఉంటారు. వాళ్ల మాటలు వింటూ ఉంటే వారి ప్రభావం మన మీద పనిచేస్తాయి. మనం కూడా వాళ్లలాగే పిచ్చి వారమౌతాము. ధైర్యం లేకపోతే మోక్ష లక్ష్మి వరించదు. శరీరంలో మాంసం ఒక్కటే ఉంటే నిలబడదు. ఎముకలు కావాలి. అలాగే ఆధ్యాత్మిక మార్గంలో ధైర్యం తప్పనిసరిగా కావాలి.

105. భగవంతుని సంకల్పానికి తలవంచటం వలన శరీర గతమైన "నేను" నశిస్తుంది. శరీరమే ఒక రోగం. అది రోగమన్న విషయం మీకు తెలియక పోవటం వలన మీరు పునర్జన్మను కోరుకొంటున్నారు. "అడుసు తొక్కనేల కాలు కడగనేల" అంటారు. అలాగే నీకు ఉన్న ధనంతోనూ చదువుతోనూ, అధికారంతోనూ తాదాత్మ్యం పొంది అపవిత్రుడివి అవుతున్నావు. విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. ఎవరైనా తెలుసున్నవారు మాట్లాడకపోతే కంగారు పడకండి. సుఖంగా ఉండవచ్చు. టైము కలిసి వస్తుంది. పూర్వ జన్మలో వివేకంగా జీవిస్తే ఈ జన్మలో సత్యాన్ని పొందాలనే కోరిక పుడుతుంది. భగవంతుడు మనకు ఇచ్చిన

srinannagaru.com

సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి అని ఆలోచించటం ప్రధానం. ఇతరులు నిన్ను పొగడాలనే కాంక్ష నీకు ఉన్న అది భోగ కాంక్షే. పొగడ్త అహంకారానికి అలంకారాలు. దాని వలన నీవు కర్మ చక్రంలోనే ఉంటావు. నిరంతరం మోక్ష కాంక్షలో ఉండాలి. దాన్ని వదులుకోకూడదు. నీవు అవసరాలు తీరాలనే కాంక్షలో ఉండకూడదు. జ్ఞానం నీ ముఖానికి అలంకారం. మనిషి "మాయ"తో పోరాడాలంటే అతనికి శాంతి చిత్తం కావాలి. ధ్యానం చెయ్యకపోతే, విచారణ చెయ్యకపోతే రాగ-ద్వేషాల నుంచి బయట పడలేవు. నీ శరీరమే నీ కూడా రానప్పుడు నీ గొప్పలు ఎలా వస్తాయి. కోపతాపాలు వస్తూ ఉంటే పాపం వల్లనే అని గ్రహించండి; కోపం వస్తూ ఉంటే వాయిదా వేసుకొంటే ఆ కోపం యొక్క వేగం తగ్గుతుంది. ఎదుటివాడి ప్రవర్తనతో నీవు ఉద్రేకంలో పడకు. ఉద్రేకపడితే పునర్జన్మ హేతువులైన వాసనలు బలపడిపోతాయి. హృదయం దుమ్ముతో నిండిపోతుంది. పేషన్ (ఆడంబరం) "తగ్గాలంటే డిస్‌పేషన్ (వైరాగ్యం) అలవర్చుకోవాలి.

106. ఎదుటి మనిషిని చూచినప్పుడు అసహ్యించుకోకు. నీలో ఉన్న బ్రహ్మమే అతనిలో ఉందని గ్రహించు. మీచేత చూడబడేది ఏదీ మీరు కాదు. మీ మనస్సు బాగాలేదు అంటే అది మీచేత చూడబడుతున్నది. అది మీరు కాదు. ఆహారంలో శుద్ధి (అంటే ధర్మపరమైనది) ఉంటే బుద్ధి శుద్ధి అవుతుంది. అప్పుడు వస్తువు లభ్యమౌతుంది. మానవుడి ఆలోచన అహంవృత్తి మీద ఆధారపడి ఉంది. అహంవృత్తి నశిస్తేగాని ఆత్మానుభవం కలుగదు. భగవంతుని మాటలు మీకు అర్థమైతే సాధనలో 75% నెరవేరినట్లే. కాని గురు అనుగ్రహం లేకుండా భగవంతుని మాటలు అర్థం కావు. సుఖ, శాంతులు, భగవంతుని, గురువుని ఆరాధించటం వలన వస్తాయి. సమయస్ఫూర్తిని ఉపయోగించుకొని అహంకార భావనను తొలగించుకోవాలి. మానవులు పొట్ట, బట్ట, నీడలతో సరిపెట్టుకొంటారు. తనలో ఉన్న పరమాత్మను తెలుసుకోవాలనే ఆలోచన రావటంలేదు. ఆత్మ అనంత సుఖ స్వరూపం. తీగ వాడిపోతే పుష్పాలు ఎలా వాడిపోతాయో నీ అహంకారం వాడిపోతే, నీ రాగ-ద్వేషాలు అలా వాడిపోతాయి. విరోధిచేసే అపకారాలను సాధకుడు క్షమించగలడు, కాని కొందరు సాధకులు మర్చిపోలేరు కాని ఈశ్వరానుగ్రహం ఉంటేనే మర్చిపోగలరు. కాని ఏదో ఒక రోజున ఆ అనుగ్రహం మీకు కలుగుతుంది. మీరు తరిస్తారు. మీ సాధన ఎదురు చూచినట్లు ఉండకూడదు. సహజంగా జరగాలి. ఎవరి విశ్వాసము వారిని బాగుచేస్తుంది. నీ మనస్సుకు నీవే నీళ్ళు పోస్తున్నావు. దానితో తాదాత్మ్యం మానివేస్తే దానంతట అది

srinannagaru.com

రాలిపోతుంది. సద్గురువును నిరంతరం ధ్యానం చెయ్యటం వలన మనస్సు నశిస్తుంది. కొంతమంది మాటలు వింటూ ఉంటే ఆరు నెలల సాధన అడుగంటి పోతుంది. వాళ్ళ దగ్గర కూర్చుంటే తలపోటు మాత్ర దగ్గర పెట్టుకోవాలి.

107. జరిగిపోయిన గొడవలలో మీకు అపకారం చేసిన వానిని మర్చి పోవాలి. వారి రూపాలను తరచు చింతించటం వలన పతనమౌతాము. వారిని క్షమించి, మర్చిపోవటానికి ప్రయత్నం చెయ్యండి. కొందరి ముఖాలు చూస్తూ ఉంటే కారణం లేకుండానే అశాంతితో కాలిపోతూ ఉంటారు. శాంతి సహాయంతో నీ బలహీనతలనుండి బయట పడతావు. కొందరికి దేహ సంబంధమైన సుఖం తప్ప ఇంద్రియాలకు అతీతంగా ఒక సుఖం ఉందన్న సంగతి తెలియదు. వారు ఉత్తమ లోకాలకు వెళ్ళే అవకాశం కూడా ఉండదు. మొసలిని నమ్మి నదిని దాటాలని అనుకోవటం ఎటువంటిదో, దేహ సుఖాలను కోరుకొంటూ ఆధ్యాత్మిక చరమ స్థితికి వెళ్ళాలి అనుకోవటం అటువంటిదే. "నా కన్న దేవుడు వేరు" అన్న ద్వైత బుద్ధి వలన కూడా సత్యం తెలియబడదు. కొందరు ఇలా అంటూ ఉంటారు. కర్మలు ఇలా అనుభవిస్తున్నాము అంటారు. అసలు కర్మలు అనుభవించ టానికే దేహం ఇచ్చాడు. సినిమాలు చూడటానికి దేహం ఇయ్యలేదు. కర్మలు అనుభవిస్తే కర్మలు నశిస్తాయి. ఋణం తీరిపోతే మీరు సుఖపడతారు. "ఈ దేహం నేను" అనే బుద్ధి కలుగకపోతే కర్మానుభవం పొందలేరు. భగవంతుని మీద మీకు విశ్వాసం కలగకపోతే మీ బుద్ధిలో దోషాలు ఉన్నట్లే లెక్క. భగవంతుని నామంపై ప్రీతి కలగాలి. సంపాదించవలసినవి రెండు. ఒకటి ప్రేమ, రెండు ఏకాగ్రత. "నేను" అనే తలంపు వ్యక్తం కావాలంటే ప్రకృతి కావాలి. ఏ నేను అయితే సర్వ అరిష్టాలకు కారణమౌతున్నదో దాన్ని ఈశ్వరునికి సమర్పించటమే మన గతి. నేను అనే తలంపుకు ఒక ఆధారం ఉంటుంది. దాన్ని గుర్తించాలి. అది తెలిసే వరకూ దేవుడు కూడా తెలియబడడు.

108. ఇతరులలో మంచిని చూస్తే పవిత్రులు అవుతారు. చెడును చూస్తే అపవిత్రులు అవుతారు. భక్తులలో కొందరు "అంతా నీదే నాది ఏమీ లేదు" అంటారు. అంటే అసలు వాడికి ఏమీ లేదు. లేకపోయినా నాది, నీదే అనటం కేవలం అహంకారం చేసే పని మాత్రమే. భగవంతుడు చెప్పిన మాటలు నీకు అర్థం కాకుండా నీ వాసనలే నీకు అడ్డు వస్తున్నాయి. మీరు ఎంత చదివినా ఒక శాతం మాత్రమే అర్థమౌతుంది. పెళ్ళి సమయంలో పెళ్ళి కొడుకుకు కనబడకుండా తెర ఎలా ఉంటుందో అలాగే వాసనలు అడ్డు తెరగా ఉండి ఈశ్వరుని నిజతత్త్వాన్ని తెలియకుండా చేస్తుంది. మీరు అహంకారాన్ని లెక్క

srinannagaru.com

చెయ్యకపోతే వాడి అంతట వాడు చచ్చిపోతాడు. అలా రేపు చచ్చిపోయే వాడి మీద యుద్ధం ఏమిటి? అంటే సాధన ఏమిటి? మీ వ్యతిరేకి మిమ్మలను ఏదైనా అన్నారు అనుకోండి. మీరు వాడిని ఏమంటారు అంటే వాడి మాటలు లెక్క ఏమిటి? వాడు ఎంత? వాడి బ్రతుకు ఎంత? అని అంటారు. అలాగే మీ అహంకారం విషయంలో ఉంటే మీరు గమ్యాన్ని చేరుతారు. కాళ్ళతో నడుస్తాము. చేతులతో పనిచేస్తాము. ఈ రెండూ పనిచేస్తేనే ఏదైనా సాధించవచ్చును. అలాగే మీ సాధన ఒక్కటే చాలదు. దేవుని అనుగ్రహం ఉండాలి. ఏ బలహీనతలలోంచి నీవు బయట పడాలని అనుకొంటున్నావో వాటికై నీ దేహాన్ని ఇంద్రియాలను, బుద్ధిని పొందికగా సక్రమమైన పంథాలో వాడుకోవాలి, ఆ పైనే అదృష్టం. ఈ మూడు కలిస్తేనే నీ ప్రయత్నం సఫలమౌతుంది. రూప దృష్టి నామ దృష్టి లేకుండా ఈ సృష్టిమీద మీకు ప్రేమ కలిగితే మీరు విశ్వ వ్యాప్తమౌతారు. నీ ఆందోళనను బాధలను గుర్తు చేస్తున్న మనస్సు అంటే ఏమిటి? నాకు దీనికి సంబంధం ఏమిటి? నిద్రలో ఈ మనస్సు ఎక్కడికి వెళ్ళిపోతున్నది. దాన్ని విచారణ చేసుకోవాలి. నీ బాహ్య గురువు నీ మనస్సును పవిత్రం చేసి లోపల ఉన్న గురువుకు అందిస్తాడు.

109. తల్లిదండ్రులు దేహాన్ని మాత్రమే ఇస్తారు. పరమాత్మ ప్రాణం పోస్తాడు. ప్రాణం పోసినవాడే, ప్రాణం తీస్తాడు. దానికి ఆయుధాలు అక్కరలేదు. మీ ఆత్మ బలాన్ని పెంచుకోండి. మీ వివేకాన్ని పెంచుకోండి. మీ శక్తిని పెంచుకోండి. ఈశ్వరుని శరణు పొందండి. జీవితంలో ఏమీ సాధించని వ్యక్తికి ఏ గౌరవం ఉండదు. కృషి-కృప ఉంటే ఫలితం ఉంటుంది. చంటి పిల్లలకు "బూచోడు-బూచోడు అడుగో అంటే తల్లి దగ్గరకు గబగబా వచ్చి తల్లిలో కలిసిపోతారు. అలాగే పరమాత్మ తనవైపుకు తిప్పకోవటానికి మీకు అనేక క్లేశాలను, పరాభవాలను కల్పించి తనను స్మరించుకొనేలా చేస్తాడు. ఈ సంఘటన ఇలా జరిగింది ఏమిటి? అని మీరు భావించకండి. ఆ ఉద్దేశ్యం మీ బుద్ధికి అందదు. సాధనలు, పూజలు, జపాలు, సత్‌పురుషుల సహవాసం ఎందుకు చెయ్యాలి అంటే భగవాన్ అనేవారు "మనస్సు లేదని తెలియటానికే" అనే వారు. ఇది అద్భుతమైన సమాధానం. సాధన కాలంలో ఏకాంతవాసం అలవర్చుకో. ఆడంబరం గల వ్యక్తులతో సహవాసం చేస్తే "సత్యం" అందదు. థిరీటికల్ సైడ్‌లోనే ఉండకు, ప్రాక్టికల్ సైడ్‌లో ప్రాక్టీస్ చెయ్యాలి. స్వార్థ భావన, వ్యక్తి భావన నిన్ను అభివృద్ధి లోనికి రానియ్యవు. మీ బల్లి నేనుకు ఆహారం అందించకండి. దాని చమత్కారాలు గ్రహించండి. అంతకు మించి సత్యాన్ని దర్శించటానికి ఏమీ శ్రమపడవలసిన పనిలేదు.

110. గుడిలో "రాయి" దేవుడు అనుకొంటున్నారు. కారణం అది

దేనితోనూ తాదాత్మ్యం పొందటంలేదు. అలాగే మీరు కూడా పార్టీలతోనూ, కులాలతోనూ, స్నేహితులతోనూ తాదాత్మ్యం చెందకండి. మీరు దేవుడు అవుతారు. దేవుడి గుడిలోనికి వెళ్ళి మనందేవుని ధ్యానం చెయ్యటం లేదు. "మన పిచ్చి గొడవలే ధ్యానం చేస్తున్నాము. భక్తి పేరు చెప్పి సోమరితనంగా ఉండకండి. పని వలన, త్యాగం వలన కుటుంబము, సమాజం బాగుపడుతుంది. కృత్రిమమైన పనికి కృత్రిమమైన గౌరవాలే దక్కుతాయి. నేను, లోకము, దేవుడు ఒక ముద్దగా కనిపించినప్పుడు వాడికి ఆ, అభౌతికమైన సుఖం అనుభవానికి వస్తుంది. దృశ్యం నశించకుండా కోరిక నశించదు. కోరిక నశించిన తరువాత పునర్జన్మ లేని స్థితికి ఎదుగుతావు. నీ స్నేహితులు నీ గుణాలను చూస్తారు. మీరంటే ఇష్టంలేని వారు మీ లోపాలను చూస్తారు. తల్లి తన బిడ్డ ఎటువంటిదైనా మంచిగానే చూస్తుంది. మనం అభివృద్ధిలోకి రావాలనే భావనాబలం మన తల్లిదండ్రులకు ఉంటుంది. దానికి వారి పట్ల కృతజ్ఞత చూపితే మనం భౌతికంగా అభివృద్ధిలోకి వస్తాము. అహంకారం హద్దులను సూచిస్తుంది. ఆత్మజ్ఞానం హద్దులలోంచి, పరిమితులలోంచి విడుదల చేస్తుంది. బ్రహ్మంలో బహుళత్వం లేదు. జ్ఞాని అనేకత్వంలో ఏకత్వాన్ని చూస్తాడు. భిన్నత్వం చూస్తూ ఉంటే వాసన కలుగుతుంది. ఆ దృశ్యంతో మనం దానితో పరిగెత్తుకుంటూ పోతాము. మహాత్ముడు దురాత్ముడికి తెలియబడడు. కుతంత్రాలు, కుయుక్తులు పన్నుతూ ఉండేవాడికి ఆ ఫలితం తెలియదు. వాళ్ళ బంధంలో పడుతున్నారనే సంగతి తెలియదు. రక్తంలేని వానికి శరీరం నిలబడదు. అలాగే శ్రద్ధలేనివాడు ఆత్మ జ్ఞానం పొందలేడు. మీ అనుభవాలు అన్ని మనస్సుకు సంబంధించినవి. నిజమైన అనుభవం కలగటం ప్రధానం.

111. శవం నీటిలో మునగాలంటే రాయి కడితే మునుగుతుంది. లేకపోతే తేలిపోతుంది. గడ్డి పరక నీటిలో మునగదు, తేలిపోతుంది. "నేను"కు తూకం లేకపోతే ప్రపంచ విషయాలలోకి తేలి వెళ్ళి పోతుంది. హృదయంలో మునగాలంటే, సత్సాంగత్యం, సద్బుద్ధి, భక్తి, వైరాగ్యాలు అనే తూకం ఉంటేనే మీ "నేను" హృదయంలో మునుగుతుంది. ఆ తూకాన్ని పెంచుకోండి. చాలా విరోధాలకు బాహ్యమైన సంఘటనలు కారణం కాదు. అహంకారమే కారణమౌ తున్నది. కొందరు అకారణంగా కంగారు పడుతూ ఉంటారు. మీ బంగారాన్ని అవతల పడేయమంటే పడేయరు. అలాగే మీ అహంకారాన్ని అలాగే దాచు కొంటారు. వదిలేయ మంటే వదలటం లేదు. ఇది మాయ యొక్క ప్రభావం. "నేను ఎవడను?" అనే ప్రశ్న మనో నిగ్రహానికి ఉపయోగపడుతుంది. ఆనందం

srinannagaru.com

ఉన్న చోటికి తీసుకొని వెళుతుంది. నీ అజ్ఞానమనే అహంకార వృక్షాన్ని వేరుతో సహా నరకాలంటే "నేను ఎవడను? అనే గొడ్డలితో నరుకు" అన్నారు భగవాన్. కృతజ్ఞత వలన, శాంతి వలన, చైతన్య స్థాయి పెరుగుతుంది. మనస్సు బ్రహ్మాకారం చెందుతుంది. మనమెవరిమో మనకు తెలియకపోవటానికి కారణం అహంకార, మమకారాలే. ఈ మమకారాలలో కారం ఉంది. ఆత్మ జ్ఞానం వలన అహంకారం తగ్గుతుంది. త్యాగం వలన మమకారం తగ్గుతుంది. తలంపులను నియమించు కొంటే మంచి మాటలు వస్తాయి. మీ సాధనలో ఇరుగు పొరుగువారు సాత్వికులైతే సాధకులైతే మీ సాధన తేలిక అవుతుంది. ఎవరైనా మిమ్మలను తిడితే వాడు తిట్టాడు; వీడు తిట్టాడు అని మీరు మోసుకొనిపోతే దాని వలన మీకు కొన్ని వాసనలు ఏర్పడుతాయి. దాన్ని మీరు మర్చిపోవాలి. దానికి ప్రాణంపోసి బ్రతికించకండి.

112 భగవాన్ అనుగ్రహంలో పడ్డవారు పులినోట్లో పడ్డ మాంసం ముక్క లాంటివారు. వారు ఏదో సద్గురువుతోనైనా అనుబంధం ఏర్పడి అనుగ్రహంతో ఆత్మానుభవం కలిగించి తీరుతాడు. మీ గురువు మీ వాసనలు కెలుకుతూ ఉంటాడు. మీ సహస్రారానికి పంపిస్తాడు. హృదయం ఖాళీ అయితేగాని ఆత్మానుభవం కలగదు. శిరస్సులోకి తలంపులు కల్పించి నీవు పోరాడేలా చేస్తాడు మీ బాహ్య గురువు. మీ భోగ ప్రవృత్తిలోంచి మీ మనస్సును విడుదల చెయ్యగల్గితే ఇప్పడే, ఇక్కడే మీకు చైతన్య అనుభవం కలుగుతుంది. మీ ద్వారా ఈ సృష్టికి ఎంతో మేలు చేకూర్చగలుగుతారు. మనస్సు యొక్క విజృంభణ ఆపుచేసు కోవాలంటే మిమ్మలను పొగడినా, విమర్శించినా లోపలికి తీసుకోకండి; తీసుకొంటే మనస్సు కలుషితమౌతుంది. సాధన అరగంట, బయట పోగు చేసు కొన్న దుమ్ము పద్దెనిమిది గంటలు. అంటే గజ స్నానం లాంటిది. నీవు బుద్ధి పూర్వకంగా చేసే పనులు గోడకు బలంగా కొట్టిన మేకులా తియ్యాలంటే కష్టం. కాని నీకు తెలియకుండా చేసిన పొరపాట్లు వ్రేలుపెట్టి కెలికితే పోతుంది. మీ పుణ్యం పండు అవ్వలేదు అనుకోండి మీరు సాధన చేసినా ఆత్మానుభవం పొందలేరు. పండైతే చెట్టుకు ముగ్గిన పండులా మీ మనస్సు హృదయ గుహలో పడిపోతుంది. ఈ దేహం నేను కాను, నాది కాదు. రాబోయే జన్మలకు హేతువులు ఎన్ని ఉన్నాయో అన్ని నీ స్వప్నంలో తెలుస్తాయి. అజీర్తి వలన కూడా స్వప్నాలు వస్తాయి అలాకాదు. ఈశ్వరుడు ఈ అమ్మగార్కి మోక్షం ఇయ్యాలని అనుకొన్నా ఇయ్యలేడు. కుదరదు. ఆ జీవుడికి ఉండే వాసనలు ఆమె సహస్రారానికి తీసుకొని వచ్చి ఆమెకూ చూపించి వాటిని మండపెట్టికాని మోక్షం ఇయ్యలేడు.

srinannagaru.com

113. చర్మ సౌందర్యాన్ని బట్టి హృదయ సౌందర్యం ఉంటుందని చెప్పలేము. ఊరక ఉండు అంటే ఆత్మగా ఉండటమే. ఈశ్వరుడు నీ ఉపాధికి నిర్దేశించిన కర్మ మార్గాన్ని నీవు యోగంగా మార్చుకొని జీవించు. అంటే రాగ-ద్వేషాలు అంటుకోకుండా నిర్వర్తిస్తే నీ జీవితం సఫలమౌతుంది. డబ్బు, కామం, దర్పం గల కాంప్లెక్సు గుణాలు ఉన్న వ్యక్తులను పొగుచేసుకొని బోధించేవాడు ఏమీ సాధించలేడు. భగవాన్ వారి వంక చూచేవారు కారు. అవసరాన్ని బట్టి మాట్లాడేవారు. దేవుని గురించి మీకు ఏమీ తెలియకపోయినా, దేవుడు చెప్పినట్లు జీవిస్తూ ఉంటే మీరు దేవుడు అయిపోతారు. రైలు ఎక్కితే నీ గమ్యానికి ప్రయత్నం ఏమీ అక్కరలేదు. ఇష్టా-అయిష్టాలు కేవలం ఎమోషన్స్ అవి గొప్ప విషయాలు కావు. ఎవరైనా పోతే వారిపై ఉన్న అనురాగంతో తల్లడిల్లి పోతారు. ఎవరింటికైనా నీవు వెళ్ళినప్పుడు నిన్ను సరిగా ఆదరించకపోతే నీ మనస్సు కలత చెందితే, అది నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి దెబ్బ అని గ్రహించుకో. అందరిచేత నేను గౌరవించ బడాలనే తలంపు నీకు లేదు అనుకో అప్పుడు నీకు అశాంతి అనేది రానేరాదు. గుణాలు నిజంకావు. ఆత్మలో గుణాలు లేవు. మంచి గుణాలు మంచివే. వాటితోనే నీవు సంతృప్తి పడిపోకు. గుణాతీతుడవు కావాలి. అదే సద్గతి. శరణాగతీ మనగతి. హృదయమే మనకు గతి. ఘటాకాశమే మహా ఆకాశం అని ఆచార్యుల వారు చెప్పారంటే, కుండను బద్దలు కొడితే కుండాకాశమే. మహా ఆకాశంలో కలుస్తుంది అనికాదు. నీకు ఆత్మానుభవం కలిగినప్పుడు అన్నింటా నీవే ఉంటావు. మీ మనస్సు మీ అదుపులో ఉంటే సమాజం నిన్ను అశాంతికి గురిచెయ్యలేదు.

114. ఒక చేలో నీళ్ళు పెట్టాము అనుకోండి. గట్లకు పీత కన్నాలు ఉన్నాయి అనుకోండి. వేరే చేలోకి పోయి చేను ఖాళీ అవుతుంది. అలాగే నీకు పామరులతో సహవాసం వలన ఏమీ సాధించలేవు. విషయ సుఖాలతో అలమటించే వారితో సహవాసం ఎంతో కీడు చేస్తుంది. మీ మనస్సుతో మీరు తాదాత్మ్యం పొందకపోతే ఆత్మ గూటిలో పడిపోతారు. ఈ చిన్న పనికి మీరు ఎంతో లాభం పొందుతారు. అన్నం తిన్నప్పుడు ఎవరికి ఇష్టమైనది వారు తింటారు. బట్టల షాపులోకి వెళ్ళేటప్పుడు ఎదుటి వాళ్ళకు బాగా కనిపించాలని తన ఇష్టాయిష్టా లకు సంబంధం లేకుండా వారు మెచ్చినదే కొని బట్టలు వేసుకొంటారు. ఇది అంతా కృత్రిమ జీవితం. ఈ జీవితానికి నీవు దూరం కావాలి. నీ ఇంట్లో నీవు ఎంత నిర్మలంగా ఉంటావో, ఎంత సహజంగా ఉంటావో, చుట్టాలు ఇంటికి వెళ్ళినప్పుడు కూడా అలాగే ఉండు. నిరాడంబరంగా ఉండు. రూపదృష్టి, నామ దృష్టి గలవాడు చైతన్యస్థాయి పెంచుకొందామన్నా పెంచుకోలేడు. చాలా కష్టం.

srinannagaru.com

జ్ఞాని ప్రవచనం, వినగా వినగా మనస్సు గంతులు వేసుకొంటూ హృదయంలోకి పరుగిడుతుంది. వస్తువు యొక్క వైభవం తెలియకుండా వస్తువు కోసం ప్రయత్నం చెయ్యము. దూడను తల్లి దగ్గరకు వదిలాము అంటే అది ఊసురోమంటు వెళ్ళదు. ఉరకలు వేసుకొంటూ వెళుతుంది. దాన్ని బతిమాలనక్కరలేదు. అమ్మ దగ్గరకు వెళ్ళటానికి తాడు ముడి ఎప్పుడు వదులుతారా అని ఆరాటపడుతుంది. అలాగే గురు ప్రవచనంతో నీ హృదయం ఎంత నిర్మలంగా ఉంటుందో, నీ మనస్సు అంతర్ముఖమైతే నీ మనస్సు గంతులు వేసుకొంటూ హృదయంలో కలిసిపోతుంది. శాంతిని పొందుతుంది. నీవు దేనితోనూ తాదాత్మ్యం పొందకపోతే నీ మనస్సు సహజంగా హృదయ గుహలో పడిపోతుంది.

115. ఆత్మ సుఖం, ఆత్మ వైభవం అవతల పెట్టండి. గత జన్మలో ఎంతో కొంత పుణ్య సంస్కారం లేకపోతే ఇంద్రియాలలో ఉన్న బలహీనతలు, దోషాలు మీ బుద్ధికి తెలియవు. క్షవరం అయితేగాని వివరం రాదు అంటారు. స్నేహాలలో ఉన్న దోషాలు మీ బుద్ధి, కొద్దో గొప్పో గుర్తించినా అందులోంచి విడుదల పొందలేరు; గురు కృప నీ కళ్ళకు, బుద్ధికి, ఇంద్రియాలకు తెలియబడదు. కొందరు తమ పిల్లలకు ధనం మాత్రమే ఇస్తారు. ఆ సంపద రెండు తరాలే ఉండవచ్చును. కొందరు ధనంతోపాటు మంచి గుణాలను కూడా ఇస్తారు. వారు శాంతంగా జీవించగలుగుతారు. దేహబుద్ధి ఉన్నంతకాలం దుఃఖం వస్తుంది. ఈ జన్మలో ఈ దుఃఖం ఉంది అనుకోండి అదిపోతే బాగుండును అనుకొంటాము. మరు జన్మలో మరో దుఃఖం ఎదురౌతుంది. తలంపు, మాట, చేత, ఒకటిగా ఉన్న వారి మాట రామబాణంలా పనిచేస్తుంది, కొన్ని శక్తులు, సిద్ధులు వస్తాయి. సమాజానికి ఎంతో ఉపకారం జరుగుతుంది. "సాధారణ జీవితం, ఉన్నత ఆలోచన" అవసరం. రాత్రి తరువాత పగలు ఎలా వస్తుందో అలాగే దుఃఖం తరువాత సుఖం వస్తుంది. సూర్యోదయంతో కటిక చీకటి కూడా పోతుంది. దుఃఖాలు మనస్సు యొక్క కల్పితాలు. చావులేని వస్తువు మీకు కొన్ని క్షణాలు మీ జీవితంలో స్ఫురిస్తే ముందు మీలో ఉన్న భయం పోతుంది. మీ సంకల్పం మీ మనస్సులో ఎంత సహజంగా ఉందో, ఈశ్వర సంకల్పం మీ మనస్సులో అంత సహజంగా ఉంటే, మీరు జ్ఞానులే. నీ అహంకారంలో ఉన్న నీచత్వం, అల్పత్వం నీవు గుర్తించనంత కాలం నీకు ఈశ్వరునిపై విశ్వాసం కుదరదు. స్వరూపంలోని సుఖమే నీకు పరిణామంలో దుఃఖాన్ని తీసుకొని రానియ్యదు. మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం వలన యాభై శాతం ఈశ్వరుడవు అయిపోతావు.

116. మోక్ష స్థితిని పొందినవారి శరీరాన్ని సమాధిచేస్తే వారి శక్తి

srinannagaru.com

తరంగాలు సమాజానికి అందుతాయి. అవసరానికి మించిన ఆశలు అజ్ఞానాన్ని పెంచి పోషిస్తాయి. ఇప్పటి నీ వయస్సు 30 సంవత్సరాలే కావచ్చు. నీ వాసనల బలం వేలాది జన్మలనాటిది. ఈ వయస్సుతో కూడిన సాధనా బలంతో వాటిని తొలగించుకోలేవు. గురువు కృపతో నీ వాసనలు పలచబడతాయి. ఒక మనిషి బాగుపడాలంటే ఏకాగ్రత కావాలి. ఏదైనా చెడ్డపని జరిగితే అది తలచుకొని బాధపడకు. అది భగవంతుని సంకల్పం జరిగిన ఆ చెడ్డ ముందు ముందు మంచి చేస్తుంది. సాధన చెయ్యి, సాధన చెయ్యి కాని భగవంతుని అనుగ్రహంతో సాధన చెయ్యి అన్నారు ఒక జ్ఞాని. తలంపే బాహ్య వృత్తి. బాహ్య వృత్తి నశించిన వాడు ప్రపంచం ఉన్నా ప్రపంచంలేని స్థితికి వెళ్ళిపోతాడు. మనం ఎక్కడికి వెళ్ళినా రెండు గొడవలలో ఉండి పోతాము. మనస్సు గొడవ, దేహం గొడవ. ఇది మర్చిపోతే అది. అది మర్చిపోతే ఇది. తారసపడుతుంది. బ్రతికినంతకాలం ఇదే వరస. ఇల్లు శుభ్రం చేసుకోవాలనే తాపత్రయం మీకు ఎలా ఉంటుందో అంటే మీకు తగు శక్తి లేకపోయినా కూలీలను పెట్టి శుభ్రం చేసుకొంటాము, అలాగే మీ మనస్సును శుభ్రం చేసుకోవాలి అనే తాపత్రయం మీకు ఉంటే మీకు జ్ఞానం కలుగుతుంది. కన్ను ద్వారా మనస్సు చూస్తుంది. ప్రపంచంలోని వింతలు ఆకర్షణలు చూస్తూ ఉంటుంది. కాని తన్ను తాను చూచుకోలేదు. మనస్సుకు దాని మూలం దానికి తెలియటం లేదు. తెలిస్తే జ్ఞాని అవుతాడు. అడిగి పుచ్చుకొన్నది "వరం" అడగకుండా ఇచ్చేది అనుగ్రహం. వరం వలన చెడ్డ తీసుకొని వస్తుంది.

117. మనకు బాగా ఇష్టమైన వారు చాలా కాలానికి కనిపిస్తే వారి శరీరాన్ని ఎగాదిగా చూస్తాము. ఆశ్చర్యంగా అలాగే ప్రహ్లాదునికి విష్ణువు కనబడగానే ఏకాగ్రతతో, తన్మయత్వంతో చూస్తూ ఉంటే విష్ణువు ఇలా అంటాడు. "ప్రహ్లాదా! నా రూపాన్ని ఎంతో ఇష్టంగా చూస్తున్నావు. నీ కళ్ళకు నా రూపం అమృతంగా ఉంది. కాని నీవు బాహ్య విష్ణువుని చూస్తున్నావు. నీ లోపల ఉన్న విష్ణువును చూడగలిగితే నీవు పునర్జన్మలేని స్థితికి వెళ్ళిపోతావు" అన్నారు. "నీ స్వరూపాన్ని చూస్తే ప్రపంచం లేదు. నేను, నీవు అనేవి లేవు. నీ కళ్ళతో నా రూపాన్ని జుర్రుకుంటున్నావు, నీ హృదయంలో ఉన్న విష్ణువుని చూస్తే పరమస్థితికి వెళ్ళి పోతావు" అన్నారు విష్ణువు. భగవాన్ బోధ అంతా ఈ రెండు మాటలలోనే ఉంది మనోబలం ఉన్నవారు వారి నిదానంలో వారు ఉంటారు. అదిలేని వారు ప్రతీచిన్న విషయానికీ కంగారుపడతారు. వారు ఏది మంచిది, ఏది చెడ్డది, అనే విచక్షణా శక్తి ఉండక కంగారు పడతారు. మనోబలం ఉన్నవారు నిర్మలంగా ఉంటారు. శరీర సంబంధీకులను కుండ సంబంధీకులు అంటారు. శ్మశానంలో శవానికి ప్రదక్షిణ

srinannagaru.com

చేసి కుండ ఆవతల పారేసి కాష్టం వంక చూడవద్దు అంటారు. బయటికి వచ్చేస్తారు. ప్రధానమంత్రి చేసినా, తరువాత కాలంలో ఎవ్వరూ గుర్తించరు. మన శరీర పతనం తరువాత మన కూడా వచ్చేది గురువు ఒక్కడే. మన పిల్లలు ఎటువంటి స్నేహాలు చేస్తున్నారు అనే విషయంలో తల్లిదండ్రులు గమనించాలి లేదా పిల్లలు పతనమౌతారు. మన గోడకు మహాత్ముల ఫొటోలు ఎందుకు పెట్టుకొంటున్నాము అంటే మనం పరాగ్గా ఉన్నా ఎప్పుడైనా ఆ ఫొటోలు చూస్తే నీవు వారి అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు.

118. తక్కువడోసు మందుకు జ్వరం తగ్గకపోతే హెచ్చుడోసు మందు వేసుకొని జ్వరం తగ్గించుకొంటాము. అలాగే నీ సాధన వలన నీవు సఫలుడవు కాకపోతే మహాత్ముల అనుగ్రహం వలన సఫలుడవు అవుతావు. అప్పుడు నీ తెలివితేటల వలన సఫలుడనౌతున్నాను అనుకొంటే పతనమౌతావు. అది ఆయన ప్రసాదమనుకో. మనం ఆత్మ స్వరూపులమైనా మరణం వస్తున్నప్పుడు చచ్చిపోతున్నాను అనుకొంటావు. కొందరు కడుపు నొప్పి వచ్చినా అలాగు అనుకొంటారు. కొందరికి ఆకారాలు చూస్తే చాలు వికారాలు వచ్చేస్తాయి. కారణం దేహాభిమానం. మీకామానికి, మీ గౌరవాలకు, మీ అగౌరవాలకు దేహవాసనే కారణం. మాట్లాడితే పోట్లాటకు దిగేవారితో సహవాసం తగ్గించుకోవాలి. కారణం మనస్సు బహిర్ముఖం అయిపోతుంది. మనం వచ్చిన పని మర్చిపోకూడదు. కొందరు భోజనం అవ్వగానే ఊరిమీద పడిపోతారు. కొందరు మనలను అప్పుడు అలా తిట్టాడు, ఇప్పుడు ప్రతీకారం తీర్చుకొందాము అనే బుద్ధితో ఉంటారు. అది పనికిరాదు. కొందరు ఆస్తిని చూచి మాకు ఏమీ పరవాలేదు; అనుకొంటారు. ఆడంబర బుద్ధి వలననే నీ మనస్సు హృదయంలోనికి వెళ్ళదు. దేనితోనూ తాదాత్మ్య బుద్ధి పనికిరాదు. అనాలంబనం ప్రాక్టీస్ చెయ్యాలి. ఏ అవతార పురుషునితో ఏ గురువుతో మీకు అనుబంధం ఉంటుందో అక్కడ మీ మనస్సును నిలబెట్టండి. మీ మనస్సు ఆ రూపాన్ని చింతించటం వలన మీ మనస్సు నశిస్తుంది. బండ తనంగా సాధన చెయ్యకండి. విషయం, విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. మీ ధ్యానాలు, జపాలు, పారాయణాలు చెయ్యవద్దు అనటం లేదు. మనుషుల్లో స్వంత బుద్ధి ఉన్నవాడు తక్కువ; అదిలేని వాడు విచారణ చెయ్యలేడు.

119. రోజూ అవసరం ఉండి మాట్లాడేవి పది మాటలైతే; అవసరం లేకుండా అహంకారం కోసం మాట్లాడేవి తొంభై. భగవంతుని స్తోత్రం చేస్తాము. కాని ఆయన చెప్పిన మాటలను ఆచరించం. షేక్స్‌ఫియర్ ఈ అంశం మీదే భగవంతుని సందేశాన్ని ఇలా వ్యక్తం చేస్తారు "ఒక గొప్ప మనిషిని చూపించు,

srinannagaru.com

ఒక మంచి మనిషిని చూపించు, సాధనలో పరిపక్వమైన వ్యక్తిని చూపించు, లేదా ఒక పెద్ద మనిషిని చూపెట్టు; వారిని నా హృదయంలో ఉంచుకొంటాను" అని. లెక్క చెయ్యటం తెలిస్తే పది నిమిషాలలో చెయ్యగలం. చెయ్యటం తెలియక పోతే తలబద్దలు కొట్టుకొన్నా చెయ్యలేము. అలాగే జ్ఞాని సమక్షంలో నీవు పొంద వలసిన స్థితి ఏమిటో నీకు తెలుస్తుంది. అది నీ ప్రయోజకత్వంతో సంబంధం లేదు. ఇప్పడు మన బాగుకోసం ఎదురు చూచే చుట్టాల ప్రేమలు ఎలా ఉంటా యంటే మన చర్మం మందం అంత దళసరితో ఉంటుంది. కాని జ్ఞాని ప్రేమ శరీరం పడిపోయినా, మీరు ఏ కాలంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా అది మిమ్మలను తడుముకొంటూ వస్తుంది. అనామంగా, అరూపంగా, అక్షయంగా, అవ్యక్తంగా ఆత్మ ఉంది. అది నీ మనస్సుకు అందదు. నీ అనుభవానికి అందుతుంది. చైతన్యం పై ఇష్టాన్ని క్రియేట్ చేసుకోవటంలోనే ఉంది నీ తెలివి. ఉన్న ఆత్మ లేదనుకొన్నా పోదు; లేని అహంకారం ఎన్ని జన్మలు అనుకొన్నా లేనే లేదు. ఉన్న దానికోసం ప్రయత్నం చెయ్యి. ఆ ప్రయత్నంలో నీ దేహం మరణించినా నీ ఆధ్యాత్మిక పురోభివృద్ధి అభివృద్ధి అవుతుందేగాని తగ్గదు. పూజ, జపం చేసేవారు మేము సాధన బాగా చేసుకొంటున్నామనుకొని అహంకారం పెంచుకొంటారు. అహంకారాన్ని పూజ చేస్తారు. దాన్ని ముస్తాబు చేస్తే అది ఎక్కడికి పోతుంది. అది ఎలా అంటే కొందరు ప్రయాణమైనప్పుడు నిలువుటద్దంలో చూచుకొని ముస్తాబు అయినట్లు చేసుకొంటారు అహంకారాన్ని.

120. మంచి తనంతోపాటు జ్ఞానం కూడా కావాలి. మంచితనం ఒక్కటే సరిపోదు. విచారణ మార్గంలో ఇది కాదు ఇది కాదు అనే విషయం మీకు అవగాహన అయితే, ఇష్టంగా చేస్తే, తేలికగా సాధన చేస్తాము. కష్టంగా చేసేది ఎంత కాలం చేస్తాము. ఆత్మకావాలని చింతిస్తాము. కాని అనాత్మను చింతి స్తున్నాము. "ప్రపంచం" తాను ఉన్నానని తనకు తెలియదు. అది మనకు నేను ఉన్నానని చెప్పదు. కాని మన ఇష్టా-ఇష్టాలే దానిపై ఆవరించి మోహింప చేస్తున్నాయి. సత్త్వ గుణం సంపాదిస్తే సమదృష్టి కలుగుతుంది. అదే శాంతి. ఆ సత్త్వ గుణం భగవంతుడు ఉన్న చోటు చూపించి తప్పకొంటుంది. వాసనలు నశించినప్పడు దృశ్యాలు నశిస్తాయి. వస్తువు లభ్యం కానంత వరకూ మనకు లభించేది "దుమ్మే". దేహ ప్రారబ్ధంలో కష్టం వచ్చినా, సుఖం వచ్చినా సముద్రంలా గంభీరంగా ఉంటే జ్ఞానం వచ్చి నిన్ను వరిస్తుంది. నీ సాధనలో ప్రేమ, దయ లేకుండా కేవలం జపతపాలే ఉంటే అది మురుకు గుంటలో నీళ్ళలా ఉంటుంది. సద్గురువు అనుగ్రహం పెద్దలను సేవించటం వలన జ్ఞానం కలుగుతుంది. ఈ

srinannagaru.com

దేహం "నేను" అని ఏ నేనైతే చెబుతున్నదో ఆ నేనుకు గురువుతో మానసిక అనుబంధం పెట్టుకోవాలి. దాని వలన నీ మనస్సు నీ హృదయంలోకి నెట్టి వేయబడుతుంది. నీ మనస్సు నీ హృదయంలో కలిగి హృదయాకారం చెందు తుంది. అట్టి వానిని నిందా స్తుతులు తాకవు.

121. కష్ట సుఖాలు అన్నీ "నేను" మీదే ఆధారపడి ఉన్నాయి. అదృష్టం దురదృష్టం కర్మ ఫలాలు. తలంపులను విడిచిపెడితే మీరుఊహించని శాంతి వస్తుంది. ఇంట్లో బంగారం ఉంటే మోక్షం రాదు. మనస్సు బంగారం చేసుకొంటే వస్తుంది. ఏదైనా చెడ్డ జరిగితే అది తలచుకొని బాధపడకు. అది భగవంతుని సంకల్పము. జరిగిన ఆ చెడ్డ ముందు, ముందు మంచి చేస్తుంది అని నీవు నమ్మితే శాంతి లభిస్తుంది. అతిగా తినే వాడికి ప్రాణశక్తి ఎక్కువ ఖర్చు అవుతుంది. అతి నిద్ర వలన మెదడుకు రక్త వెళ్ళటం తగ్గుతుంది. నామం కన్న దైవరూపంపైన లేదా సద్గురువు రూపంపైన ధ్యానం చెయ్యటం వలన నీవు తొందరగా గమ్యాన్ని చేరిపోతావు. మనస్సుకు రూపం అంటే చాలా ఇష్టం కాబట్టి రూపధ్యానం శ్రేష్ఠం. తలంపులు ఎప్పుడు పోతాయని తల్లడిల్లడం కన్న రూప ధ్యానంపై దృష్టి నిలిపితే తలంపులు అన్నీ రాలిపోతాయి. మీరు కాని దాన్ని మీరు చింతించటం కన్న మీరు పొందవలసింది చింతించటం వలన ఫలితం ఉంటుంది. ఇదే రహస్యం. మీ ఉపాసనా బలం పెరిగే కొలది తలంపులు రాలిపోతాయి. వేరు భావన ఉన్నంతకాలం చెడు తలంపులు వస్తూనే ఉంటాయి. జ్ఞాని మిమ్మలను ప్రేమిస్తాడు కారణం మీరు కూడా ఆయనే కాబట్టి. మనకు అందరి మీద ప్రేమ కలిగితే చెడు తలంపులు రానే రావు. నిరంతరం మనం భగవంతుని ప్రేమిస్తే మన శరీరాన్ని మనం ఎంత ప్రేమిస్తున్నామో అంతకన్న ఎక్కువగా మనలను భగవంతుడు ప్రేమిస్తాడు. భగవంతుడు నావాడే అనుకోవాలి. పరమహంస గారితో ఒక సాధకుడు "సాధన ఎలా చెయ్యాలి" అంటే ఆయన ఇలా అన్నారు తన శరీరాన్ని చూపుతూ "ఈ శరీరాన్ని చూడు" అదే సాధన అన్నారు. యుగయుగాల నుంచి తెగిన గాయాలను మన అంతట మనం మాపుకోలేము. సత్యానికి సంబంధించిన అవగాహన కొంచెమైనా తెలియకపోతే దానిని పొందే సమస్యే లేదు.

122. ఎవరి మీదనైనా అభిమానం ఉంటే తప్పలేదు. ఆ అభిమానంలో మమకారం కలిస్తే దుఃఖం వచ్చేస్తుంది. భర్త సకాలానికి ఇంటికి రాకపోతే "ఆయన ఏ కారు క్రింద అయినా పడిపోయారా అని తలుస్తుంది. మమకారం అంటే అది. సత్యంపై సందేహం లేనివాడు సొమ్ము అవుతాడు. సందేహం ఉన్న వాడు దుమ్ము అవుతాడు. ఈశ్వర సంకల్పానికి మీరు "ఒరిగి" నడుచుకొంటే మీ

srinannagaru.com

అహంకారం రాలిపోతుంది. చిత్తశుద్ధిలోనూ, ఏకాగ్రతలోనూ మీరు జీవిస్తే తొందరగా మీరు తరిస్తారు. త్యాగం ఎలా ఉంటుందో తెలియనివాడు మోక్షాన్ని సాధించలేడు. నీటిలో ఉన్న సూర్యుడు నిజమనుకోవటం ఎటువంటిదో దేహానికి పరిమితమైన "నేను" నిజమనుకోవటం కూడా అటువంటిదే. మనం దేన్ని పొందాలో దానికి సంబంధించిన "స్పష్టత" మనకు ఉండాలి. అక్కడ కుంకుమ రాలింది, అంటే నీ గమ్యం నుంచి పక్కకు జారిపోతున్నావు. బుద్ధికి పరిమితులు వస్తే అది విశాలత్వం తగ్గిపోతుంది. గాంధీ "ఈ సృష్టి అంతా నాది" అనుకొని పనిచేసారు. నీకు నిజమైన భక్తి కలుగుతూ ఉంటే నీ బుద్ధి విశాలమౌతుంది. హృదయం లోతులలోకి వెళ్ళగలవు. పండిన కాయను చెట్టు నుంచి దూరం చేస్తే బాధపడదు, ఏడవదు. పచ్చికాయ కోస్తే బాధపడుతుంది. అలాగే నీవు అజ్ఞాన స్థితిలో ఇల్లు వదిలితే బాధే. జ్ఞానం పొంది వెళితే ఏ బాధా లేదు. అన్నీ ఉన్నవాడు అణగి, అణగి ఉంటాడు. ఏమీ సరుకు లేనివాడు డభ-డభలాడతాడు. పని చేసుకోవాలి. లోపల దేవునిపై విశ్వాసం పెంచుకోవాలి. మనం ప్రయాణంలో ఉన్నప్పుడు బట్టలపై దుమ్ము పడితే ప్రమాదం లేదు. కాని బట్టల మీద దుమ్ము పడాలని అనుకోము. అలాగే మనకు గౌరవం వస్తే రానియ్యండి అది బంధించదు. గౌరవం కావాలని భావిస్తే బంధం ఏర్పడుతుంది.

123. దేహానికి తగిలిన పుండును మందు రాసుకొని తొందరగా తగ్గించుకోవచ్చు, కాని మనం ఇతరులతో మాట్లాడుతూ ఉంటే వారి అహంకారానికి గాయం తగలకుండా మాట్లాడాలి. వారి అహంకారం గాయం తగిలితే తొందరగా మానదు. వాడు బలవంతుడైతే తిరిగి పగతీర్చుకొంటాడు. మనకు భగవంతుని తెలుసుకోవాలనే బుద్ధి కలగటం కూడా ఆయన అనుగ్రహమే. మనతో సాధన చేయించేది కూడా ఈశ్వరానుగ్రహమే. మనిషి ముడి సరుకు కాదు. మనిషిని పోలిన విగ్రహం చెయ్యవచ్చును. కాని మానవ, మానసం అంత తొందరగా పక్వానికి రాదు. భేదబుద్ధి మనం పెట్టుకొంటే మన నోట్లో దుమ్ము పడుతుంది. విగ్రహారాధన వలన నీకు ఇతర రూపాల మీద ఉన్న దృష్టి క్షీణించిపోతుంది. మీకు మంచి తలంపులు వస్తాయి. మనస్సు రాలిపోతుంది. సద్గురువు రూపం మీద, దృష్టి నిలిపితే నీకు మోక్షం కలుగుతుంది. బట్ట చిరిగిపోయినా, మురికిగా ఉన్నా కట్టుకోము; ఆహారం కలుషితమైనా తినం. కాని కూడా రాని శరీరానికి, కూడా రాని బట్టకు ఇచ్చే విలువను మనస్సుకు ఇయ్యలేకపోతున్నాము. ఇదే మాయ. నీకు అపకారం చేసిన వానిని మర్చిపోతే ఏమీ లేదు. మర్చిపోలేక పోతే వాడే మీకు తరచు జ్ఞాపకం వస్తాడు. అహంకారం

srinannagaru.com

పెంచుకొనేలా చేస్తాడు. మనం ఎక్కడికి వెళితే అక్కడకి మన నీడ వస్తుంది. కాని ఆ నీడ నీవు అని అనుకోవు. అలాగే మనం, శరీరం నేను అని అనుకొనే వరకూ నీకు అనుగ్రహం రాదు. శరణాగతి అంటే అద్వైతం. శరణాగతి వలన ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. ఈ సృష్టిని అంతా ప్రేమిస్తేగాని ధ్యానం కుదరదు. జీవితంలో సాధించా లనే కాంక్ష ఉండాలి. ఊసురోమంటూ ఉండకూడదు. మొదటి తలంపు లెక్కలు బాగా వేస్తుంది. ప్రతీ వ్యక్తిలోనూ వీడి వలన మనకు లాభం ఎంత? నష్టం ఎంత? ఇదే నీచ స్థితి.

124. అహంకారం యొక్క జోక్యాన్ని నీవు తగ్గిస్తూ ఉంటే తొందరగా నీవు పక్వానికి వస్తావు. నీ జప, ధ్యాన సాధనల కన్న ఇది ఎక్కువ ఉపకారి. దేవుడు ఉన్నాడో లేడో మనకు తెలియదు "నేను" అనే తలంపు ఉందనే సంగతి తెలుస్తున్నది. అది ఎక్కడ నుంచి వస్తున్నదో చూడు. అది ఒక మార్గము. నీ హృదయంలో ఏదో ఒకటి ఉంది. ఉన్నచోట నుంచే ఏదైనా వస్తుంది. లేనిచోట నుంచి ఏదీ రాదు. అది బాగా గుర్తుంచుకొని విచారణ మార్గంలో నడువుము. రెండవది భగవంతుడు ఒకడు ఉన్నాడన్న విశ్వాసం నీకు ఉంటే పరిపూర్ణంగా ఆయనను ప్రేమించు అప్పుడు ఆయన, నీ బలహీనతలను, పొరపాట్లను, దోషాలను ప్రక్కకు పెట్టి నిన్ను ఉద్ధరిస్తాడు. "విశ్వాసం ఉంటే కొండలను కూడా కదిలించ గలం" అన్నారు గాంధీజీ. పిల్లవాడు బాడి చేసుకొంటే తల్లి స్నానం చేయించి, కొత్త బట్టను తొడుగుతుంది. నిరంతరం ఈశ్వరుని ధ్యానం చెయ్యటం వలన నీ బలహీనతలలోంచి ఈశ్వరుడు నిన్ను ఉద్ధరించుతాడు. మేథమెటిక్స్ అంచులకు వెళ్ళినప్పుడు నీవు తత్త్వ వేత్తవు అవుతావు. తత్త్వం మైండ్‌కి కంట్రోల్ వస్తుంది. మీ ఉపాధి ద్వారా ఏదైనా జరిగితే విచక్షణను పెంచుకొంటూ (అహంకారానికి) దూరమైతే, మీరు ఊహించని అద్భుతాలు మీ ఉపాధి ద్వారా సమాజానికి అందుతాయి. నీకు దేహబుద్ధి ఉంది కాబట్టి నీ శరీరం ఎక్కడ ఉంటే ఆ స్థలంలోనే వున్నాను అనుకొంటావు. నీకు ఆత్మబుద్ధి అనుభవం కలిగితే అంతటా ఉన్నది నేనే అని నీకు కలుగుతుంది. జ్ఞానికి "నేను" అనే అనుభవం కలిగితే చైతన్యమే గుర్తుకు వస్తుంది. చెడ్డ అలవాట్లే కాదు దురాలోచన వలన కూడా పతన మౌతాము. నీవు ఎవరివో నీకు తెలియుటమే జ్ఞానం. పుస్తకజ్ఞానం జ్ఞానం కాదు.

125. ఏ పుస్తకం చదివినా వారి సందేశం ఏమిటో తెలుసుకోండి. లేదా ప్రక్కన పెట్టండి. యోగం యొక్క లక్ష్యం సంతోషం వచ్చినప్పుడు పొంగి పోకుండా, దుఃఖం వచ్చినప్పుడు క్రుంగిపోకుండా ఉండటమే. కేవలం పుస్తకాల పురుగులుగా కాలక్షేపం చెయ్యకుండా నిత్యజీవితంలో అనుభవాన్ని సంపాదించాలి.

srinannagaru.com

ప్రతీ వాళ్ళు నేను చచ్చిపోతున్నాను, చచ్చిపోతున్నాను అనే వారేగాని, రాత్రులు నిద్రలో చచ్చిపోయే ఉంటున్నాము కదా! నిద్రలోని స్థితిని నీవు ఎందుకు మననం చెయ్యవు? అసలు వస్తువు అదే. కాని నీ అహంకారం 'నీవు కాని దాన్ని నీవు అని నటిస్తుంది'. శాస్త్రాల గొడవ, దేవతల గొడవ, లోకాల గొడవ లేని, నీలో నీవు ఉన్నావు. దాన్ని నమ్మవేమిటి?

కల్లు త్రాగటం ఎటువంటిదో అతి స్నేహం కూడా అటువంటిదే? దాని వలన పాపం చెయ్యవలసి వస్తుంది. కారణం ఆ స్నేహం పాపం చెయ్యటానికి ప్రోత్సహిస్తుంది. మనస్సును విజృంభించకుండా ఉపసంహరించుకొనేలా చూచు కోవాలి. అహంకారం మూలం చూచేటప్పటికి దాని ఆటలు అన్నీ ఆగిపోతాయి. నీవు ఎవరివో నీకు తెలుస్తుంది. అంతవరకూ నీవు ఎవరివో నీకు తెలియదు. చదువు మీద శ్రద్ధ గలవాడు ఎన్ని క్లాసులు చదివినా శ్రమ ఉండదు. అలాగే దేహ భావన లోంచి తొలగిపోవాలనే సాధన మొదలుపెడితే మొదట ఇబ్బందిగా ఉన్నా శ్రద్ధ కలిగితే సాధన తేలికగా ఉంటుంది. స్వప్నాలు మన బలహీనతలు తెల్పటానికి ఈశ్వరుడు చేసే కల్పనలు. ఒక్కొక్కసారి విరోధులు స్వప్నంలోకి వస్తారు. అక్కడ నీ కంట్రోల్ ఉండదు. నీ బలహీనతల లోంచి బయట పడటానికి సాధన చెయ్యమని చేసిన ఏర్పాట్లు మాత్రమే. నీవు ఎవరివో నీకు తెలిసే వరకూ అహంభావన, అది తీసుకొని వచ్చే చిక్కులు, సంకటాలలోంచి బయట పడలేవు. ఏనుగు బలం, సింహం దగ్గర సాగదు. అలాగే అహంకారబలం ఆత్మదగ్గర సాగదు.

126. శరీరాన్ని కాల్చివేస్తే శరీరంలోని రోగాలు అన్నీ పోతాయి. అలాగే మనస్సులో గుణాలు కాల్చివేస్తే మనస్సు ఉండదు. ఈ సృష్టి కూడా మనస్సు యొక్క విలాసము. నీవు స్వరూప చింతన లోంచి జారిపోవటం వలననే నీకు మోహం కలుగుతుంది. మాయలో పడిపోతున్నావు. స్వరూప చింతన వదలక పోతే లోకచింతన నశిస్తుంది. దేహ ప్రారబ్ధ ప్రభావం మీమీద పడకుండా సరి చేసుకొంటే దేహ ప్రారబ్ధానికి అణుగుణంగా అది జరిగిపోతుంది. నీ ప్రయత్నం ఏదో నీవు చేసుకో. అలా జరిగిననాడు నీ మనస్సు చైతన్యం వైపు వెళుతుంది. బాహ్యముఖమైతే రోడ్డు మీద దుమ్ము అంతా నీ మీద పడుతుంది. ఈ సృష్టి అనే వ్యాపారం ఎప్పుడూ సాగుతూనే ఉంటుంది. ఇది ఒక ఆట స్థలం లాంటిది. ఈ సృష్టి భగవంతుని సొత్తు. మనం మధ్యలో వచ్చాము. మనం వెళ్ళిన తరువాత కూడా ఈ సృష్టి ఉంటుంది. చెరువుకు వెళ్ళినప్పుడు నీళ్ళు తెచ్చుకోవాలంటే ఏదో ఒక పాత్ర తీసుకొని వెళ్ళాలి. అలాగే అజ్ఞాన స్థితిలో ఉన్న సాధకుడు సత్య జ్ఞానాన్ని పొందటానికి అవతార పురుషునిగాని, గురువునిగాని ఉపాసిస్తూ ఉంటే గమ్యాన్ని

srinannagaru.com

చేరుతాడు. మనకు బయట జీవితం, లోపల జీవితం ఒకటిగా ఉండదు. ఉంటే తరించగలడు. వాంఛల యొక్క సమూహమే జీవితం. అవినయం రాకుండా చూచుకొంటే మనస్సు అణిగిపోతుంది. నీ మనస్సు ఎంత నిజమో, నీ వ్యక్తి భావన ఎంత నిజమో, సిద్ధులు కూడా అంతే నిజం. వాటిని కోరుకొంటే ప్రమాదం. కోరుకోకపోతే బంధించవు. ప్రస్తుత సమాజం సిద్ధులకు, మహిమలకు మాత్రమే భక్తి పరిమితమైనది. దేహబుద్ధి ఉన్నవాడు కామానికి, కాలానికి బద్ధుడౌతాడు. ఇతరుల బలహీనతలు చూడకండి. అలా చేస్తే భక్తి పెరుగుతుంది. భక్తి భగవంతుని దగ్గరకు తీసుకొని వెళుతుంది.

**127.** మనస్సు అణిగితే గంట నిమిషంలాగ గడిచిపోతుంది. దుఃఖ కారణం నుంచి నీవు తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటే దుఃఖం వాయిదా పడుతుంది. తీర్పు ఏదో రోజు తప్పదు. అది ఎప్పుడో ఒకప్పుడు బుసలు కొట్టి నిన్ను కాటేస్తుంది తప్పదు. ఏడిచే యోగం ఉంటే మరో జన్మ ఇచ్చి ఏడవమంటాడు ఈశ్వరుడు. భక్తులకే కష్టాలు ఎక్కువ ఉంటాయి. కారణం పవిత్రుణ్ణి చెయ్యటానికి. కొన్ని శవాలను చుట్టాలుగాను, కొన్ని శవాలను మిత్రులుగాను, కొన్ని శవాలను శత్రువులుగాను భగవంతుడు మనలను భూమి మీదకు పంపినప్పుడే నిర్ణయిం చాడు. నీ దేహ యాత్ర ఎప్పుడో ఎక్కడో నిర్ణయించి తల్లి గర్భంలో నీవు విడుదల కాకపూర్వమే నిర్ణయించాడు. నీ సంపదకు కారణం ఒకటి ఉంది. నీ అధికారానికి కారణం ఒకటి ఉంది. భగవత్ తత్త్వానికి కారణం లేదు. అది స్వతంత్రమైనది. శివ-కేశవుల మధ్య భేదం సృష్టించుకొన్న వారినోట్లో మట్టి పడుతుంది. నీవు యాత్రలకు వెళ్ళి జ్ఞానం పొందాలని ప్రయత్నం చేస్తావు. కాని అజ్ఞానం నీవు ఎక్కడికి వెళ్ళినా నీ కూడా వస్తుంది. "నిన్ను వదలనురా" అంటుంది. ఇదే పోరాటం, ఇదే ఘర్షణ, ఇదే సాధన. సాధన చెయ్యాలి. అందులో గురు అనుగ్రహం ఉంది. పని చెయ్యకూడదు గౌరవం రావాలి, భక్తిగా ఉండలేము కాని జ్ఞానం కావాలి. ఇది ఈనాటి వ్యవహారం. యవ్వనంలో విరక్తి ఉండదు, రక్తి ఉంటుంది. దేహం-ప్రాణం కలిసి ఉంటే బ్రతుకు అంటారు. దేహబుద్ధి అజ్ఞానం. ఆత్మబుద్ధి సుజ్ఞానం. శివబుద్ధి కలుగకుండా శవబుద్ధి ఎందుకు కలుగుతున్నది అంటే భగవాన్ అన్నారు "కర్మానుభవం కలగ టానికి దేహబుద్ధి కలిగింది, అదే మాయ ఆత్మ బుద్ధి కలగిన నాడు, విధి పరిధి నుండి విడుదల పొందుతాడు. అసత్య జ్ఞానం ఉన్నవానికి, అసత్య వస్తువులు తెలియబడతాయి".

**128.** రూపం లేని నామం-నామం లేని రూపం అంటే కొంతమంది భక్తులకు ఇష్టం ఉండదు. దేవుడు తనకంటే భిన్నంగా ఉన్నాడంటేనే జీవుడికి

srinannagaru.com

ఇష్టం. పెంట మీద కూర్చొని వాసన వస్తున్నది అనటం ఎటువంటిదో మనస్సు కుదురుగా లేదనటం కూడా అటువంటిదే. భగవాన్ అన్నారు "మనస్సు నీవు కాదు కదా!". ఆత్మలో సువాసనలు. మనస్సులో దుర్వాసనలు. జప-ధ్యాన-విచారణలతో కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నీ శరీరం నీది కానప్పుడు నీ శరీరం ద్వారా చూచే వస్తువులు నీకూడా ఎలా వస్తాయి. కాని నీ సాధన నీ కూడా వస్తుంది. మన బుద్ధిలోని దోషాలను పోగొట్టుకోవటమే సాధన. శివుడు అంటే సత్యం, విష్ణువు అంటే అందం, రెండూ మనలోనే ఉన్నాయి. నిజమైన అందం, నిజమైన సత్యం అదే. ఏ అందాన్ని చూచి, ఏ సత్యాన్ని చూచి దానికి మించింది ఏదీ లేదో ఆ పరమాత్మను దర్శించండి అన్నారు వాసుదేవ స్వామి. చావు అంటే భయం. లోకం అంటే భయం లేదు. దేహం చనిపోతే లోకం కనబడదని చావంటే భయం. భోగం అనుభవించటానికి లోకం ఉండాలి. దేహం ఉండాలి. ప్రపంచంలో చాలా భోగాలు ఉన్నాయి. మనకు భోగ దృష్టిపోయి, జ్ఞాన దృష్టి కలగాలి. విషయాన్ని మీరు తీవ్రంగా తీసుకోవటం లేదు. ఏమాట వలన మీకు జ్ఞానం కలుగుతుందో అదే మీకు ప్రమాణం. స్వచ్ఛంగా లేనివాడు స్వేచ్ఛగా ఉండలేడు. తలంపు, కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని వేరు చేస్తుంది. ఇంటిలో ఎవరి మీదనైనా ఇష్టం ఉంది అనుకోండి. అది ఎల్లకాలం ఉండదు. మనస్సు మార్చేస్తుంది. ఆ ప్రేమలు, మీ మనస్సు ఎంత నిజమో అదీ అంతే నిజం. అహంకారం, భార్యాభర్తలను వేరు చేస్తుంది. దీనికి కుటుంబాలు, జాతులు, దేశాలు, ప్రకృతి, ఈ దేహాలే కాదు దీని అందానికి దేవుడు ఒకడు కావాలి అంటుంది. ఒక ప్రక్క వాసనా క్షయం, మరొక ప్రక్క ఆత్మజ్ఞానం రెండూ చేసుకోవాలి.

129. పిల్లలకి కొంత ధనం ఇస్తే, వాడు పేకాటలో పాడుచేస్తే తరువాత వాడికి ఏమీ ఇయ్యము. అలాగే మీకు తెలివి, ధనం ఈశ్వరుడు ఇచ్చాడు అనుకోండి. దాన్ని పదిమందికీ పంచేలా కాకుండా ఒక్కడే వాడుకొంటే తరువాత నీచ జన్మలు ఇస్తాడు. ఈ శరీరం ఉండగానే ఏమీ చెయ్యలేరు అనుకోండి మరలా ఎన్ని వందల సంవత్సరాలకు ఇస్తాడో తెలియదు. భగవంతుని చేతులలో మనం కీలు బొమ్మలము. శివుని శిరస్సుపై గంగ ఉంటుంది. అది చల్లగా ఉంటుంది. అలాగే నీ ప్రారబ్ధ వశాత్తు దరిద్రం రావచ్చు; ఐశ్వర్యం రావచ్చు. నీవు గమ్యాన్ని చేరటానికి చల్లగా ఉండాలి. ఆత్మ విచారణ అంటే మీరు వ్యాపకాలలో ఉన్నా, నుంచున్నా, కూర్చున్నా, ఏ పని చేస్తున్నా చైతన్యం యొక్క ఎరుక కలిగి ఉండాలి. ప్రయత్నమే సాధన. మన ప్రవర్తన సాత్త్వికంగా ఉండాలి. సమాజ పరంగా కాని, కుటుంబ పరంగా కాని అహంకారం లేకుండా జీవిస్తే మనస్సు

srinannagaru.com

హృదయంలో రాలిపోతుంది. సాధనతో పాటు ఏ గంటకాగంట అహంకారం యొక్క తీరును సరిగా ఉండేటట్టు చూచుకోవాలి. సృష్టి రహస్యం, జీవిత రహస్యం అంతా దేహాత్మ భావనలోనే ఉంది. దానిని తొలగించుకోవటానికే నీ సర్వ ప్రయత్నాలు. చదువుతో పాటు ఆ చెప్పే వక్తకు, తపస్సు కూడా కావాలి. అది ఉంటే పంచదార కలిపిన పాలుతో సమానం. అటువంటి వారి మాటలు అహంకారమనే పొరలను చీల్చుకొంటూ ఆ వస్తువును చూపిస్తూ ఉంటుంది. తపస్సులో మనస్సును ఎండింప చెయ్యాలి. నీవు ఏ సబ్జక్టు మాట్లాడుతున్నా అహంకారంతో మాట్లాడుతున్నామా? అవసరం ఉండి మాట్లాడుతున్నామా? అని గ్రహింపు ఉండాలి. కొందరు ఊరికే మాట్లాడుతారు. వారిని చూచి మనం కంగారు పడకూడదు. నేను ఒక శబ్దాన్ని ఉచ్ఛరించినప్పుడు దానికి సంబంధించిన అనుభవం నాలో లేనప్పుడు నేను ఏమి మాట్లాడినా ప్రయోజనం లేదు. ఆత్మజ్ఞానం కలగకుండా ప్రేమ, శాంతి కలుగవు.

130. పందకోట్లు ఉన్నవాడు విషయ చింతనచేస్తూ ఉంటే "అశాంతి" వస్తూ ఉంటుంది. పైసాలేని పరమదరిద్రుడు ఆత్మ చింతన చేస్తూ ఉంటే శాంతి వస్తుంది. "శాంతములేక సౌఖ్యములేదు, యోగ్యులకైనా, భోగులకైనా" అన్నారు త్యాగరాజు. అనుగ్రహం విలువ తెలియకుండా దానికోసం ప్రయత్నముచెయ్యలేము. భగవంతుని అనుగ్రహం లేకుండా తరించలేము. చెట్టు మొదట్లో నీళ్ళుపోసి, ఎండిపో, ఎండిపో అంటే అది ఎండిపోదు. అహంకారం పెచుకొనే పనులు చేసి అహంకారం చావాలి అనుకోవటం వెఱ్ఱి. బుద్ధి కల్పించే విషయాలలో సాధకుడు పడిపోకుండా ఉండాలి. మనస్సు సేకరించే జ్ఞానాన్ని మిథ్యా జ్ఞానం అంటారు. మనస్సు నశించినచోట జ్ఞానం ఉదయిస్తుంది. మన మిథ్యా జ్ఞానాన్నే నిజమనుకొంటే ప్రమాదం. అదే విపరీత జ్ఞానం. ఇరువది నాలుగు గంటలు తన పొట్టకోసమే వేదన పడేవాడికి మనస్సు హృదయంలోకి ఎలా వెడుతుంది. దానికి వైరాగ్యమనే తూకం కావాలి. అంతర్యామిగా ఉన్న దేవుడిని తెలుసుకోవటం కష్టం. బాహ్యంగా ఉన్న దేవుని కళ్ళతో చూడటంతేలిక. పల్లానికి నీరు ప్రవహించటం తేలిక. మెరకకు నీటిని మళ్ళించటం కష్టం. అణిగిన మనస్సు అంతర్ముఖం అవుతుంది. బహిర్ముఖమైన మనస్సు అంతర్ముఖం కాదు. ఎవరైనా పచ్చగా ఉంటే మీకు అసూయ కలుగుతూ ఉంటే మీకు జ్ఞానం ఎలా కలుగుతుంది. మీకు అసూయ ఎందుకు కలుగుతూ ఉంటుందంటే వాడి భౌతిక సంపద నిజమనుకోవటం వలననే. ఈ ప్రపంచం మిథ్య అనుకోవటం వలన నీ మనస్సు లోపలికి వెళుతుంది. అది నిజమనుకొంటే నీవు ఎంత ప్రయత్నం చేసినా లోపలికి

srinannagaru.com

వెళ్ళలేవు. మనస్సుకు అంతర్ముఖ దృష్టి కలగటానికే అనుగ్రహం. కాని ప్రయత్నమే అనుగ్రహంగా మారుతుంది. ఆకారం లేనిది సమానంగా ఉంటుంది. ఎక్కువ తక్కువలు రూపదృష్టి గలవారికే.

131. గ్రామాలలో బోడి పెత్తందార్లు ఉంటారు. గ్రామంలో తగువులు వస్తే పిలవకుండానే చొరబడి తగువులను పెంచేస్తారు. అదేమిటయ్యా అంటే మా పొట్ట ఎలా సాగుతుంది అంటారు. మన అహంకారం మన దేహానికి సంబంధించినది కాదు. ఆత్మకు సంబంధించినది కాదు. ఇది బోడి పెత్తనాలు చేస్తుంది, గయ్యాళిది దాన్ని సాధన చేసి పోగొట్టుకోవాలి. న్యూనతాభావం ఉన్నంతకాలం యజమాన్య భావనను నీవు కోరుకొంటావు. ఒకాయన అన్నాడు "నా తండ్రి పోతే వంద ఎకరాలకు యజమానిని అవుతాను". కారణం యజమాన్య తత్వం మీద ఉన్న ఇష్టం. అదే అహంకార బుద్ధి. అది పరమానందం తాగినట్లు ఉంటుంది. ఆ వంద ఎకరాల పంటా ఒక పొట్టే తినేస్తుందా? కన్ను మూస్తే ఏమీ లేదు. దేవుడి సృష్టి నిన్ను బాధించదు. నీ మనస్సు కల్పించే దృష్టే నిన్ను బంధిస్తుంది. మనస్సు పరిమితులను కల్పిస్తుంది. తన ఉత్పత్తులను ప్రచారం చేసుకొనే కంపెనీ వాళ్ళు ఇలా అంటారు "అవి అన్నీ మర్చిపోండి. మా ఉత్పత్తులనే కొనండి. అదే కావాలి అనండి" అంటారు. అలాగే మనం "భగవాన్ నాకు ఏమీ అక్కరలేదు. నాకు ఆత్మ ఒక్కటే కావాలి" అని అడగండి. శుద్ధ మనస్సు శాంతి నిస్తుంది. అశుద్ధ మనస్సు కల్లోలాలను రేపుతుంది. మనస్సులోని మాలిన్యాలను తొలగించుకోవటానికే సాధన. సద్వస్తువును కనిపెట్టనక్కరలేదు. అది సిద్ధంగానే ఉంది. మనస్సు ఉన్నంతకాలం సంసారం మీద రుచి పోదు. ఒకవేళ శరీరం ఊడినా, కొత్త శరీరం వచ్చి మొగ్గ వేసి పువ్వులు పూసి, కాయలు కాస్తాయి. కారణం బీజాలు ఉండిపోవటం వలన. అశుద్ధ మనస్సు జన్మ మరణాలకు కారణ మౌతున్నది. నామాట మీరు జుర్రుకొన్నప్పుడు ఆనందం మీకు తెలుస్తుంది. నా మాటే మీకు తెలియనప్పుడు ఇతరులకు మీరు ఎలా చెప్పగలరు. భగవంతుని మీద శ్రద్ధ తగ్గుతూ ఉంటే ఆయన పట్ల విశ్వాసం తగ్గుతున్నదన్న మాట. ఆత్మ విశ్వాసం తగ్గకుండా చూచుకోవాలి. శ్రద్ధ కొండలను పిండి చేస్తుంది. అదే జ్ఞానాన్ని కలుగజేస్తుంది.

132. మనం విశ్వాన్ని పట్టుకొన్నాము, విష్ణువును వదిలేసాము. ఏమాట వినటం వలన నీకు ఆత్మనిష్ఠ చెడగొడుతున్నదో ఆ మాటను ఊసేయి. లోకం కుక్క తోక వంటిది. కుక్క తోక పట్టుకొంటే నిలబడుతుంది. వదిలేస్తే వంకర, వంకరే. జాగ్రత్త వల్ల నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనస్సుకు మసి అంటుకో

srinannagaru.com

కుండా చూచుకోండి. దానికి గురువు అనుగ్రహం కూడా కావాలి. తెర మారదు. సినిమాలు మారుతాయి. అలాగే జన్మలు మారుతాయి కాని ఆత్మ మారదు. శ్రీరామ తీర్థులవారిని ఒకరు ఇలా ప్రశ్నించారు "అంతా ఆత్మే అంటున్నారు మీరు కూర్చున్న డాబా మీద నుంచి దూకండి తెలుస్తుంది" అంటే "ఆత్మలేని చోటు చూపు అక్కడకు దూకుతాను" అన్నారు. అన్ని భగవత్ సంకల్పం వలననే జరుగు తాయి అని తెలుసుకొంటే నిప్పు మీద నీళ్ళు పోస్తే మంటలు వెంటనే ఆరిపోతాయి. అలాగే నీలో ఉన్న దుఃఖం ఆరిపోతుంది. భగవంతుడు ఏదైతే మంచిది అని చెబుతున్నాడో అది ఆచరిస్తే మీరు గమ్యాన్ని చేరుకొంటారు. ఆత్మను మీరు చింతిస్తూ ఉంటే సినిమా చూడాలనే తలంపు కూడా రాదు. కోరిక మనస్సులో ఉదయించకుండా నిరంతరం ఆత్మ స్ఫురణలో ఉండాలి. దేహం స్థూలం, ప్రపంచం స్థూలం, స్థూల దేహాలకు స్థూల రూపాలు కావాలి. స్థూల రూపం పోతే స్థూల ప్రపంచం కనబడదని భయపడుతుంది. అబద్ధమైన నేను, నీ హృదయంలో ఉన్న నిజమైన నేను మీ మనస్సు స్మరించాలి. పుట్టిన వాళ్ళు అంతా ఏదో మతంలోనో, కులంలోనో, దేశంలోనో పుడతారు. అనుభవాలు అయిన తరువాత ఈశ్వరుడు మన ప్రాణాలను తీసి వేస్తాడు. మనం చనిపోయేటప్పుడు పై భావాల తోనే ఉంటే వాడు మోక్షాన్ని పొందలేడు. వాడు బంధజీవే. ఆత్మ ఐశ్వర్యం వలననే మీకు జ్ఞానం కలుగుతుంది. మీకు ఏ కారణం వలన అయినా దుఃఖం వస్తూ ఉంటే దాన్ని తొలగించేవాడు రుద్రుడు.

133. కొందరు పేపరు చూడగానే సినిమాలు చూస్తారు. వ్యక్తి వస్తువు అయితే చేసేది ఏమీ లేదు. వ్యక్తి వ్యక్తిగా ఉంటే కొంతైనా అర్థమౌతుంది. మహాత్ముల దర్శనం వలన మనలోని బలహీనతలు తెలుస్తాయి. తొలగిపోతాయి. అధికార కాంక్ష ఒక్కటి ఉంటే వంద తప్పులు చేస్తాము. ఆ కోరిక నీ మనస్సులో దాగి ఉంటుంది. బంగారం బంగారం కొట్టులో దొరుకుతుంది. అలాగే మీకు శాంతి, సుఖం కావాలంటే దాని అనుభవం ఉన్న జ్ఞానులను దర్శించాలి తప్ప మరో గత్యంతరం లేదు. భగవాన్ దర్శనానికి వచ్చిన ఒక వ్యక్తికి ఈ భావం కలిగింది. "నాలో ఏదో మహత్తర శక్తి ఉందని తెలుస్తున్నది. కాని అది నాకు అనుభవంలో లేదు; అనే సంగతి కూడా నాకు తెలుస్తున్నది" అని అన్నాడు. జ్ఞాని దర్శనభాగ్యం అది. సాధనలో, లోక విషయాలు, విషయ వాసనలు నీ చెవుల్లో పడుతూ ఉంటే వెంటనే ఆపుచెయ్యి. లేకపోతే అభివృద్ధి ఆగిపోతుంది. వాటిని ప్రక్కన పెట్టు. లేకపోతే నీ అభివృద్ధి ఆగిపోతుంది. గమ్యాన్ని చేరలేవు. సాధన ప్రయోజనం ఏదైతే నేను-నేను అంటోందో దాన్ని నిర్మూలించటానికే అని

srinannagaru.com

గుర్తుంచుకోవాలి. ఇక్కడ కేవలం మనో విజృంభణ అరికట్టటానికే. సమాజంలో కొందరు అరువది సంవత్సరాల వయస్సు ఉన్నా పన్నెండు సంవత్సరాల వయస్సు గల వారి మాటలలా ఉంటాయి. మనం చనిపోయిన తరువాత మనస్సు ఉంటుంది. సూక్ష్మరూపంలో ఉంటుంది. దాన్ని జీవించి ఉండగానే అభ్యాస వైరాగ్యాల వలన ఇతరులతో మన ప్రవర్తన శాంతంగా ఉండి వ్యవహరించటం వల్ల అది నశిస్తుంది. మనస్సును పుట్టుక స్థానంలోకి పంపటమే అభ్యాసం. ఇతరుల తో గౌరవింపబడాలనే ఆలోచన సాధనకు ఆటంకం. ఎవరితో ఎంతవరకూ మాట్లాడాలి అనే ఆలోచన ఉండాలి. భక్తి ప్రాథమికంగా ఉండాలి. భక్తి ఉండి సాధన చేస్తే వాలు గాలిలో సైకిల్ తొక్కినట్లు ఉంటుంది. భక్తి వలన శక్తి వస్తుంది. మన హృదయంలో ఉన్న ఈశ్వరుని గుర్తించలేక పోవటానికి కారణం దేహబుద్ధి వలన బయట ఉన్న దేవుళ్ళ మీదకు పోనిస్తుంది. అది అంత బలంగా ఉంది. ఎన్ని ప్రవచనాలు విన్నా దాని శక్తి బలమైనది.

134. కర్త ఈశ్వరుడు అనే విశ్వాసంతో ఉండండి. మనస్సును నియమించుకొనే పని మీరు చేసుకోండి. నూటికి నూరుపాళ్ళు భగవంతుడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం కుదిరితే శరణాగతి పొందటానికి ప్రయత్నిస్తావు. అలా చెయ్యగా చెయ్యగా పూర్ణస్థితిని పొందుతావు. శరణాగతి పొందితే ఈశ్వరుడు ఏది ఇస్తే అది తిందాము అనుకొంటాము. భగవాన్ అరుణాచలం వచ్చిన మొదట్లో ఎవరో ఇచ్చిన మిఠాయి కూడా పారవేసారు. రేపటికి దాచుకుందాము అనే ఆలోచన రాలేదు. అది శరణాగతి అంటే. పది ఎకరాల చెరువులో నీరు కాళ్ళు కూడా తడవనట్లు ఉన్నాయి అనుకోండి చెరువు గంభీరమే. అలాగే కొందరు పటాటోపంగా మాట్లాడుతారు. హృదయంలోకి లోతుగా వెళ్ళలేరు. వారికి జ్ఞానం రాదు. మన ముఖం లోకంవైపు, వీపు దేవుని వైపు చూపెడతాము. జ్ఞాని ముఖం దేవునివైపు, వీపు లోకంవైపు చూపుతుంది. కొందరు పరోక్షంగా పొగుడుతారు. పొగుడుకొంటారు. వాళ్ళ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. ఏకాంతవాసం కూడా తపస్సుకు ఉపయోగపడుతుంది. దాని వలన మీ వాసనలు తెలుస్తాయి. వాటిని తొలగించుకోవచ్చును. కొందరు స్త్రీలు తన భర్తతో ఉన్న అనుబంధాన్ని తెలుపరు. లోకంలో విషయాల గురించి గంటల తరబడి చెబుతారు. అలాగే ఈశ్వరునికీ మీకూ ఉండే అనుబంధాన్ని, భక్తిని అంత రహస్యంగా దాచుకోవాలి. శరీరం రంగులు వేరు, గుణాలు వేరు. కాని రాత్రి హృదయంలో అందరం అక్కడికే వెళుతున్నాము. భౌతిక శాస్త్రం ఎక్కడ ముగుస్తుందో తత్త్వ శాస్త్రం అక్కడ అంకురిస్తుంది. జగత్తు-జీవుడు- ఈశ్వరుడు,

srinannagaru.com

ఈ మూడు వాటి వాటి స్వభావాలను తెలిపేదే తత్త్వ శాస్త్రం. దేహాభిమానం ఉన్నంత కాలం ఉపాసన చేస్తారు. నేతితో చేసిన లడ్డు నాలిక మీదకు వెళ్ళిందంటే "ఇదే స్వర్గం. ఇంతకన్న స్వర్గం ఎక్కడ ఉంది" అనిపిస్తుంది. నాలిక దాటిందంటే అదే నరకంగా మారుతుంది. విషయ వాంఛలు నెరవేరి నప్పుడు అలాగే ఉంటుంది. కాని తరువాత తెలుస్తుంది అది నరకమని. సాధన అంటే మనం చెయ్యగలిగినది చెయ్యటం, చెయ్యలేనిది ఎలాగూ చెయ్యలేము. కొందరు ఎర్ర చీమ కుడితే తట్టుకోలేరు. వారు సాధన ఏమి చేస్తారు.

135. కొందరిని చూస్తూ ఉంటే అసూయ కలుగుతుంది అనుకోండి. ఆ రూపంలో ఉన్నవాడు కూడా దేవుడే, అంటే దేవుణ్ణి కూడా ద్వేషిస్తున్నాడు అన్నమాట. చర్మానికి ఉండే అందం నాలుగు లంకణాలు కడితే పోతుంది. గుణాల అందం చాలాకాలం ఉంటుంది. రాముని కళ్యాణగుణాలు చాలాకాలం ఉంటాయి. ఈశ్వరునిపై విశ్వాసానికి చలనం ఉండకూడదు. మనస్సుకు చాపల్యం ఉండ కూడదు. కొన్ని కుటుంబాలలో సంభాషణలు అంతా ఆధ్యాత్మికమైనవే. నిన్ను ద్వేషించే వానిని కూడా నీవు ప్రేమించకపోతే నీవు భక్తుడివి ఎలా అవుతావు. సాధారణ మానవులు ద్వేషించే వానిని ద్వేషిస్తాడు. నీవు కూడా అలా ఉండ కూడదు. మన దగ్గర ఉండే డబ్బు మంచిదైతే మనకు సద్బుద్ధి కలుగచేస్తుంది. విషయాన్ని గ్రహించే బుద్ధి కావాలి. అహంకారం లేకుండా జీవించాలి. హృదయంలో ఎంతో కొంత దైవీ సంపద లేకపోతే ఎన్ని ప్రాణాయామాలు, ఎన్ని ధ్యానాలు, ఎన్ని జపాలు చేసినా ప్రయోజనం శూన్యం. ప్రతీదీ ఈశ్వర సంకల్పం వలననే జరుగుతున్నది. నీ విరోధులు కూడా ఈశ్వర సంకల్పం వలననే ఏర్పడు తున్నారు. ధర్మార్థకామాలు కాలానుగుణంగా వస్తాయి. పోతాయి. లోకం యొక్క వృత్తం అంతా దైవీ సంకల్పానుగుణంగా జరుగుతుంది. ప్రకృతి వస్తువుల పట్ల మోజు ఎందుకు వస్తున్నది అంటే అందులో ఉన్న విలువ తెలియక. అంటే అవి అశాశ్వతమైనవి అనే విషయం, వివేకం లేకపోవటం వలన మాత్రమే. మీ మనస్సు ఎల్లప్పుడూ ఎక్కడ తిరుగుతుందో అక్కడికీ ఏదో ఒక రోజున నీశరీరాన్ని మనస్సును అక్కడికీ తీసుకొని వెళ్ళి పడేస్తుంది. ఎవరో ఏదో అన్నారని ఆ రాత్రి అంతా నిద్ర పట్టనివాడు బలహీనమైన బుద్ధి అని లెక్క. మంచి గుణాలను శ్రమపడి సంపాదిం చుకొన్న వాడిని ప్రేమిస్తే వాడిలా కష్టపడనవసరం లేకుండా తేలికగా మంచి గుణాలు నీకు అబ్బుతాయి. మనకు అవినయం వస్తూ ఉంటే పతనమౌతున్నామని గుర్తు. మరణానంతర జీవితంలో కూడా అది క్షోభను తీసుకొని వస్తుంది.

136. జ్ఞానం ఉంటే, అభయస్థితి వస్తుంది. డబ్బు ఉంటే, ప్రభుత్వానికి,

srinannagaru.com

దొంగలకు, ఇంటిలోని వారికీ భయపడాలి. చావులేని వస్తువు దొరికే వరకూ భయం వెంటాడుతుంది. అహంకారం విజృంభించకుండా ఉంటే చాలు. సహనం వలన, అవమానాల వలన, పొంగిపోకుండా, కృంగిపోకుండా చూచుకోవాలి. ఇదే రహస్యం. మోక్షాన్ని మీరు కోరుకొంటే అందులో ఒక రహస్యం ఉంది. పని చెయ్యాలి, ప్రతీకారం చెయ్యకూడదు. చేస్తే చెడ్డ వస్తుంది. ఈశ్వరుని జ్ఞాపకం పెట్టుకొంటే ఉన్నతమైన ఆలోచనలు వస్తాయి. ఉదాహరణ ఎందుకంటే విషయం, బుద్ధికి అందుతుంది. సంస్కారాలను వేగించి కాల్చటానికి ఇంద్రియ నిగ్రహం సాధించాలి; మనో విజృంభణ ఆపాలి. ఆత్మే నేను అన్నది నిజమైనది. అది అనుభవంలో లేక అదిలేదు అనుకొంటున్నాము. బలం ఉన్నవాడు బలం లేని వానిని గౌరవించడు. సాధారణంగా ధనం ఉన్నవాడు, ధనం ఉన్నవాడినే గౌరవిస్తాడు. అలాగే చదువు ఉన్నవాడు చదువు ఉన్నవాడిని గౌరవిస్తాడు. ఇది లోకం యొక్క తీరు. ఈ విషయాలు మనకు వద్దు. భగవంతుడు ఎలా ఆదేశిస్తే అలా చేసుకొని పోతే మనకు ఆత్మానుభవం కలుగుతుంది. మనస్సులో పొరలు చాలా ఉన్నాయి. అవి మాయ పొరలు, మీరు అవసరం ఉన్నంత వరకూ, మాట్లాడుతూ, శాంతంగా ఉండటం వలన మౌనంగా ఉండటం వలన పెరు మాళ్ళ పాదాలను నమ్ముకోవటం వలన మాయపొరలు తొలగిపోతాయి. మీకు అంతర్ దృష్టి కలుగుతుంది. నీవు కాని దానినుంచి నీవు తాదాత్మ్యం వదులుకోవటమే సాధన; చేసేది ఏమీ లేదు. లోకం గురించి మీరు ఆసక్తిగా ఉంటూ ఉంటే లోక వాసన పెరిగి అంతర్ముఖం కాకుండా చేస్తుంది. ఈయాతనా శరీరం యొక్క వేదన నీకు తెలిస్తే నీకు దుఃఖం రాదు, మీ మనస్సు స్వాధీనంలో ఉంటుంది. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, లోకం అంతా శత్రువులైనా మీకు ఏ ఇబ్బందీ ఉండదు. మర్మం, మాయ అంతా మనస్సులోనే ఉంది. మనస్సు అణిగితే అన్నీ అణిగిపోతాయి.

137. మా తాతలు, మా ముత్తాతలు చేసే తప్పులు నేను చెయ్యను; నిర్వాణ సుఖం వారు పొందకుండా వారు వెళ్ళిపోయారు. దానిని నేను పొందుతాను అనే భావన రావాలి. అనుకరణ లాభం లేదు. సూక్ష్మదృష్టి అలవర్చుకోవాలి. అనుగ్రహానికి అసాధ్యమంటూ ఏదీ లేదు. అనుగ్రహం యొక్క ప్రవాహాన్ని నీవు గుర్తించాలి. అంటే తపస్సు విద్య కావాలి. తపస్సు అంటే మనస్సును, శరీరాన్ని శిక్షించటమే. మనం అవసరమైనప్పుడే మాట్లాడాలి. తెచ్చిపెట్టుకొని మాట్లాడ కూడదు. మన శరీరానికి రోగం వస్తే మందుకొని వేసుకొంటాము. బయట వ్యక్తి రోగంతో బాధపడుతూ ఉంటే డబ్బు సహాయం చేసి, దానం చేసాను

srinannagaru.com

అనుకొంటావు. ఇక్కడే "మాయ" అంతా. ఆ శరీరం కూడా మనదే అని అనుకోవటం లేదు. కారణం తరతరాల నుంచి నీ బుద్ధి దేహానికి పరిమితమై ఉండటం వలన నీ శరీరం కొత్తది రావచ్చు. నీ వాసనలు పాతవే, అంటే కొత్త సీసాలో పాత సారా. మనకు ఆత్మ తెలియబడితే ఆ శరీరం కూడా నాదే అనిపించి దానం అని అనుకోము. అహంకారం ఉన్న వానికి సిగ్గు ఉన్నవానికి ఆత్మ తెలియ బడదు. తెలుసుకోవాలనే కాంక్ష ఉన్నవానికే ఆత్మ తెలియబడుతుంది. పెద్దవాళ్ల మాటను ఓర్చుకోవటం కూడా సాధనే. అవి అన్ని స్వప్నాలు, ఆ దేవుడే ఆవిడతో గాని, ఆయనతోగాని అనిపింప చేస్తాడు. ఆ మాటలు మీరు తర్ఫీదు పొందటానికి ఉపకరిస్తాయి. మనం ఈ పాడు బుద్ధిలోంచి బయట పడటానికి వచ్చాము. తరగతిలో ఒక్క దెబ్బ తగలకుండా ప్యాసైన వాళ్ళు ఉంటారు. కొందరు దెబ్బలు తగలి, దెబ్బలు తగిలి, గోడ కుర్చీలు వేసి ప్యాసైన వాళ్ళు ఉంటారు. ఆ అమృతస్థితిని పొందాక ఈ పీడలు నిన్ను దరిచేరవు. లోకంలో ఉన్న భోగాలు అన్ని నీ ముందు పరచినా నీలో ఉన్న శాంతి ముందు అవి నిలబడవు. వంటకు ఉపయోగించే కూరగాయలు అన్నీ కొన్నా వండటం తెలియకపోతే అవి నిరుపయోగం. అలాగే శాస్త్రం ఎదురుగా ఉన్నా దాన్ని ఉపయోగించుకోకపోతే ప్రయోజనం లేదు.

138. మనం విన్న దాన్ని అనుభవంలోకి తెచ్చుకొనే ప్రయత్నమే సాధన. కాలం మీ మనస్సులో ఉంది. నా మనస్సులో కాలం లేదు. చనిపోవటం, పుట్టటం కాలంలో జరిగిపోతాయి. నీ సాధనలో నిండుతనం ఉండాలి. లాంఛనంగా ఉండకూడదు. ఏకాగ్రతతో చెయ్యాలి. వాసనలు తొలగించుకోవాలనే విశ్వాసంతో చెయ్యాలి. అనుగ్రహాన్ని తట్టుకొనే వ్యక్తికే సత్యం తెలియబడుతుంది. గుడ్డి బుద్ధికి తెలియబడదు. అకారణ భక్తి జ్ఞానానికి మార్గమౌతుంది. నిజమైన దాన్ని నమ్మటం వలననే ఆధ్యాత్మిక పునాది ఏర్పడుతుంది. ఆ నమ్మకమే సత్యం దగ్గరకు తీసుకొని వెళుతుంది. నిజం కాని దాన్ని నమ్మటం వదిలేయి. శ్రీ కృష్ణుడు నీ హృదయంలో ఉన్నాను అని చెప్పింది సాపేక్షిక సత్యం మాత్రమే. నీ ఉపాసనకు అనుకూలంగా ఉండటం కోసం అలా చెప్పారు. మిమ్ములను స్తోత్రం చేస్తే ఆ మాటలు నమ్మకండి. వినకండి, వింటే దేహ భావన వలన ఎన్ని పూజలు చేసినా ప్రయోజనం శూన్యం. కొందరు పంచదార పానకం తాగినట్లు ఆ మాటలు వింటారు. ఆచరించరు. కర్మఫలంతో తాదాత్మ్యం పొందకపోతే నీవు కర్తవు కావు అనే విషయం నీకు తెలుస్తుంది. కర్మఫలం నిన్ను ముట్టదు. అంతర్ దృష్టితో జీవించేవాడికి అణిగిన మనస్సు గలవానికి, వివేకం గల మనస్సు గలవానికీ సత్యం తెలుస్తుంది. ఈ మాటలు మాట్లాడితే మనకు గొప్ప వస్తుంది అనుకొంటే నీ అహంకారం

srinannagaru.com

పెరుగుతుంది. తలంపులే నిన్ను బంధిస్తాయి. అందుకనే భగవంతుని మంచి తలంపులు కలిగేలా చూడమని ప్రార్థించాలి. లోకానికి నీ ఉపాధి ద్వారా ఉపకారం జరగాలి. అదే కాలంలో నిరహంకారివి అయితే నీవు తరిస్తావు. ప్రతీ చిన్న విషయానికీ ఉద్రేకపడితే ఆలోచన తగ్గుతుంది. ధ్యానం అంటే ఏమీ లేదు. నదీ ప్రవాహానికి ఆనకట్ట కట్టి ఆ నీటిని చేలకు మరలిస్తే ధాన్యలక్ష్మి కలుగుతుంది. అలాగే నీ సాధనలో నీవు నిలబడితే ఇతర తలంపుల ప్రవాహం ఆగిపోయి మోక్షలక్ష్మికి అనుగుణంగా పరుగిడి దాన్ని పొందుతావు.

139. నీకు దుఃఖం వస్తే నష్టం ఏమిటి? నీ స్వరూపంలో దుఃఖం లేదు. కడుపులో అరగని వస్తువు ఉంటే దాన్ని బటయికి గెంటటానికి చూస్తుంది. నీ స్వరూపంలో సుఖం ఉంది. దుఃఖాన్ని గెంటివేయటానికి ప్రయత్నం చేస్తాము. సాహిత్యం కూడా మనకు సహాయం చేస్తుంది. భూమా విద్య (ఆత్మవిద్య) నేర్చుకొంటే అనవసరపు తలంపులు నిన్ను పీడించవు. భగవంతుని మీద భారం పెట్టినవానికి బాధలు తగ్గుతాయి. నేను పెద్ద వాడిని, నేను చిన్న వాడిని అనుకోవటంలోనే నీకాళ్ళకు సంకెళ్ళు పడతాయి. దాన్ని మర్చిపోవాలి. ఎదుటి వాడిలో మంచిని వెదకి వెదకి పట్టుకోవాలి. దాన్ని నీవు అలవర్చుకోవాలి. అలాగే నీలో చెడ్డను వెదకి పట్టుకొని తొలగించుకోవాలి. అది బాగుపడే వాడి లక్షణం. నీకు ఆరాలు తీసే అలవాటు ఉంది. ఆ రంధ్రాన్వేషణ ఉంది. కాని ఈ తలంపులు ఎక్కడ నుంచి వస్తున్నాయో ఆరా తీయండి. ఆ ప్రయత్నంలో నిజాయితీ ఉంటే నీ బలహీనతలు బ్రెయిన్‌కి తెలిపి, తిరిగి అది తొలగించుకొనే ప్రయత్నం చెయ్యటానికి ఆత్మ సహాయం చేస్తుంది. కొందరు మనుషులు ఉంటారు. మాట్లాడితే పోట్లాటకు దిగుతారు. మౌనంగా ఉంటే అది బలహీనతగా మరో పోట్లాటకు దిగుతారు. వారిని కూడా భరించాలి. అన్వేషణ, రూపాలు, దృశ్యాలపై కాదు. లోపల జరగాలి సత్యం కోసం. చిల్లర గొడవలతో మీ జీవితాన్ని పాడు చేసుకోకండి. మీ ఆరోగ్యం బాగా ఉన్నప్పుడు పై గొడవలతో కాలక్షేపం చెయ్యటం వలన ప్రయోజనం ఒకటి లేని సున్నలతో సమానం. మనకున్న రాగ-ద్వేషాలతో మనం ఉండిపోతే మన హృదయంలో మహాత్ముల స్మరణ ఎలా కలుగుతుంది. దృష్టి మార్చుకొంటే దృశ్యం మారిపోతుంది. మొక్కకు నీళ్ళ పోయుటం మానేస్తే నశిస్తుంది. అలాగే విషయచింతన మానేస్తే మనస్సు నశిస్తుంది. నీలోని ఆనందాన్ని అప్రయత్నంగా అనుభవించటమే సమాధి. దేవుడు వేరు; నేను వేరు; అని అనుకొనే వరకు స్వతంత్రమైన సుఖం రాదు.

140. దైవీ జీవితంలో వ్యాపారం ఉండదు. కోరిక ఉండదు. ప్రేమ

ఉంటుంది. వాంఛలు ఉండవు. ప్రకృతిలో ఊహించుకోవటం ఉంటుంది. వ్యాపారం ఉంటుంది. కోరికలు ఉంటాయి. కారణ ప్రేమ ఉంటుంది, వాంఛలు ఉంటాయి. మీకు తలంపు వచ్చింది అనుకోండి అది ఒక్కటే నిజమని అనిపిస్తుంది. ఒకరికి జూదం మీద, ఒకరికి విషయ సుఖాలపైనా ధ్యాస ఉంటుంది. దాన్ని ఎందుకు పోగొట్టుకోలేక పోతున్నాము? మీ మనస్సు "అదే నిజమని" అనుకొని నమ్ముతోంది. ఇదే మాయ. శరీరంలో అన్ని అవయవాలలోకి పాదం ముఖ్యం. మనలను మోసేది పాదం. అందుకే భగవంతుని పాదాలను శరణు వేడుతారు. వారికి మాయ దారి ఇస్తుంది. కొంతమంది మనుషులు ఏమి జరిగినా చలించరు. గంభీరంగా ఉంటారు. అంటే వారికి జ్ఞానం రావటానికి ప్రిపరేషన్ ఉంది; అని లెక్క. కారణం పోతే కార్యం పోతుంది. అంటే ఎవరైనా పోతే దుఃఖపడే నేను పోతే జన్మకు రావలసిన పనిలేదు. ఏడుపులు రావు. బంతి మెట్లమీద నుంచి క్రిందికి పడిపోతే ఎక్కడికి వెళుతుందో తెలియదు. అలాగే నీవు ఆత్మవు కాని దేహానికి పరిమితమైన బుద్ధిలో పడిపోతే ఎక్కడికి వెళతావో నీకే తెలియదు. "నేను సాధన చేస్తున్నాను; కాని ఫలితం కనబడుటలేదు" అనేది మనస్సే. నాకు తెలియటం లేదు అనే తలంపు ఎక్కడ నుంచి వస్తున్నదో తెలిస్తే అక్కడే నీవు (ఆత్మ) ఉన్నావు. నీ తలంపులు నీవు చూచే దృశ్యాలు, అనే మాటలు, నీ చేతల వలన, నీ చైతన్యస్థాయి పెరగాలి. మన స్థాయి పెరిగే జ్ఞాపకం ఉంచుకోవాలి. పాడుచేసే మాటలు మర్చిపోవాలి. అక్కరలేని విషయాలు జ్ఞాపకం పెట్టుకొంటే జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయాలు మర్చిపోతాము. భగవదనుభవం కలగవచ్చు, కలగకపోవచ్చు. భగవదనుభవం పొందాలనే కాంక్ష సాధారణంగా కలగనే కలగదు. నీకు ఎన్నో కళ్యాణ గుణాలు ఉంటేగాని నీకు ఆ బుద్ధి కలుగదు.

141. మనం సాదాగా, సహజంగా ఉండము. అందుకనే సత్యం మనకు తెలియబడటం లేదు. జ్ఞాన సముపార్జనకు నీ కళ్లను, చెవులను జాగ్రత్తగా ఉపయోగించుకో. మౌనం అంటే కళ్లతో చూచే దృశ్యాలు చెడ్డవైనప్పుడు కళ్ళు మౌనంగా ఉంచుకోవాలి. చెవులతో వినే మాటలు మనకు వ్యతిరేకమైనప్పుడు అలాగే నోటి ద్వారా వచ్చే మాటలు బ్రహ్మానుభవానికి సహకరించనప్పుడు వాక్కును, చెవిని మౌనంగా ఉంచుకోవాలి. దేహానికి, పరమాత్మకు సాధన అవసరం లేదు. జీవుడికే సాధన. లేనిది లేనట్లుగాను, ఉన్నది ఉన్నట్లుగాను మనస్సు గుర్తించటమే సాధన. సాధ్యమైనంత వరకూ చెడు తలంపులు రాకుండా చూచుకోవాలి. వస్తే అధోగతిపాలౌతాము. మీలో ఆ వాసనలు పోగొట్టుకోవాలంటే వివేకాన్ని, శాంతిని కాపాడుకోవాలి. ఆ వాసనలు గత జన్మలో భోగించినవే. దాన్ని ప్రయత్నంతో

srinannagaru.com

పోగొట్టుకోలేకపోతే శరణాగతి చెందాలి. కలియుగం, కలికాలం అని సాధనా సాధ్యం కాదనే ధోరణి పోవాలి. మనం రోడ్డు మీద ప్రయాణం చేస్తూ ఉంటే వ్యతిరేకులు, పశువులు అనేకమైనవి ఎదురు అవుతాయి. మనం ప్రయాణం ఆపుకోము. అలాగే అమావాస్య చీకటి అని అనిపిస్తే టార్చిలైట్ ఉంటే ఆ చీకటి ఏమీ చెయ్యదు. మిమ్ములను ఎవరైనా విమర్శిస్తే మీరు కంగారు పడకుండా ఉంటే ఆ విమర్శించేవాడి కన్నా తాను విజ్ఞుడనని గ్రహిస్తే మీకు కంగారు రాదు. లోకం ఉందని మీ మనస్సు చెబుతున్నది. స్నేహం మనస్సే, విరోధం మనస్సే. నీ సాధన నీవు సక్రమంగా చేసుకోకపోతే బలప్రయోగం ద్వారా భగవంతుడు నీకు కష్టాలు కల్పించి, శిక్షించి సాధన చేయిస్తాడు. భగవంతుడికి తెలుసు మిమ్ములను ఎలా సాధన చేయించాలనే విషయం. నిరాశ నీకు సుఖాన్ని ఇస్తుంది. భార్యకు మత్తు భర్త. భర్తకు మత్తు భార్య. సారా తాగటం వలన వచ్చే మత్తులాగే ఇవి కూడా మోక్షానికి అడ్డు వస్తాయని ఆచార్యులవారు చెప్పారు.

142. కామినీ కాంచనలు ఎక్కువగా మానవుని బంధిస్తాయి. ఆలోచించ కూడని విషయాలు నీవు ఆలోచించకు; తినరాని పదార్థాలను తినకూడదు. వాటికి హృదయంలో చోటు ఇయ్యబోకు. అలాగే చూడరాని విషయాలు చూడకు. పదిమంది బాగుపడాలనే మంచి తలంపు మీకు వస్తే మీ కీర్తి రాష్ట్రాలు, దేశాలు దాటి వెళుతుంది. అవమానాన్ని భరించటం కూడా సాధనతో సమానం. అది కూడా సాధనలో భాగమే. స్వార్థం ఉన్నవాడు పరమార్థాన్ని అందుకోలేడు. మానవునికి విషాదం కూడా టర్నింగ్ పాయింటే. ఆధ్యాత్మిక మార్గాన్ని ఎన్నుకొనేలా చేస్తుంది. సాధన చేసి, చేసి, కోపాన్ని శాంతిగా మార్చుకొన్నవాడికి సత్య సాక్షాత్కారమవుతుంది. మనస్సులో ఒక భాగమే అహంకారం. మనస్సును అవసరానికి వాడుకోవాలి. అలసినప్పుడు ఇంటికి వచ్చి కూర్చుంటాము. అలాగే మమకారం తగ్గించుకొనే కొలది మనస్సు విశ్రాంతి పొందుతుంది. మనస్సును విశాలం చెయ్యాలి. మంచి సంస్కారాలకు, విలువ గల విషయాలను నాణ్యతగల విషయాలను చింతించితే మనస్సు విశాల మౌతుంది. అప్పుడు చెడ్డ గుణాలపై మనం ప్రత్యక్షంగా యుద్ధం చెయ్యనక్కరలేదు. విచారణ మార్గంలో ప్రయాణం చేసేవాడికి వివేకం ముఖ్యం. నీకు భగవంతుడు ఇచ్చిన పనిని ప్రీతిగా చెయ్యి, మోస్తూ ఉన్నట్లు చెయ్యకు. ఇతరుల మీద నీకు అసూయ కలిగితే వారిలో ఉన్న మంచితనాలను కూడా నీవు గుర్తించలేవు. కోట్లు సంపాదించి పది అంతస్తుల భవనం నీవు కట్టవచ్చు కాని స్వభావం మార్చుకోవటం కష్టం. పని అలవాటు బాగా ఉన్నవాడు కట్టెలలో శరీరం కాలి

srinannagaru.com

బూడిద అయ్యే వరకూ పనిని మానడు. అలాగే సోమరి మట్టిలో కలిసే వరకూ పని చెయ్యలేడు. ధ్యానం వలన ఏకాగ్రత కుదురుతుంది.

143. మనస్సు అణగిన వాడికి వినయం వస్తుంది. అణగని వానికి అహంకారం విజృంభిస్తుంది. వినయం మనిషి యొక్క తూకాన్ని పెంచుతుంది. ఎవరైనా మిమ్ములను విమర్శిస్తూ ఉంటే వాడికీ, నాకూ సంబంధం ఏమిటి? అని ప్రశ్నించుకొంటే నిప్పుమీద నీళ్ళు పోస్తే మంటలు ఎలా చల్లబడతాయో అలాగే మీ దుఃఖం ఆరిపోతుంది. ఉపయోగంలేని తలంపులు, మాటలూ రానియ్యకూడదు. కొందరు ఏదైనా అంటే శ్మశానానికి వెళ్ళే వరకూ మోస్తూనే ఉంటారు. అదికూడా కర్మే. మిమ్ములను భగవంతుడు పాడై పొమ్మని చెప్పడు. మీకు పాడై పోయే యోగం ఉంటే గర్వాన్ని పంపిస్తాడు. ఉపవాసం వేరు, లంకణం వేరు. మన సాధన ఎలా ఉందంటే లంకణంలా ఉంది. రెండూ పొట్టను కాల్చటమే. గేదెకు తెలగపిండి, పచ్చగడ్డి చూపెడితే ఎలా వస్తుందో, అలాగే నీ సద్గురువు నీవు ఆత్మ సుఖాన్ని పొందటానికి నీకు ఏవో కొన్ని నిదర్శనాలు చూపి లాక్కుంటాడు. నీవు తరించాలంటే స్వయంకృషి, గురు అనుగ్రహం కూడా కావాలి. మనస్సుతో నీవు తంటాలు పడలేవు. దానికి ప్రాముఖ్యం ఇయ్యకు. ఆళ్వారులలో ఒకరు ప్రశాంత మనస్సు గలవారు ఉండేవారు. ఎవరైనా నీవే తప్పు చేసావు అంటే ఆయన తప్పు చేయకపోయినా "అలాగే" అనేవారు. కారణం ఆయన పెరుమాళ్ళతో తాదాత్మ్యం పొంది ఉన్నారు. మనం చిన్న మాట అంటే భరించలేము. ఏ శక్తి అయితే ఈ ఖగోళాన్ని నడుపుతున్నదో నీవు దానిని శరణాగతి పొందితే నీకే బాధ లేదు. భగవాన్ మనలాగే కనబడతారు. దేనికీ భయపడరు. కారణం శరణాగతి. శరణాగతి గురించి మాట్లాడటం వేరు, శరణాగతి పొందటం వేరు. మతి ఎక్కడ ఉంటే గతి అక్కడ ఉంటుంది. దుఃఖానికి ఆసక్తే కారణం. నిరంతరం మనస్సు ఇంద్రియాలను స్మరిస్తూ ఉంటే మనో నిగ్రహం సాధ్యం కాదు. ముముక్షువు విషయ చింతన తగ్గించుకోవాలి. ప్రారబ్ధాన్ని సహనంతో అనుభవించాలి.

144. చంటి పిల్లలు ఏదైనా అంటే ఏమీ అనుకోము. అలాగే కొందరు నిర్మలంగా ఉంటారు. వ్యక్తి భావన ఏమీ ఉండదు. ఎవరైనా "నీ వల్ల ఏమీ కాదు" అన్నా ఏమీ అనుకోరు. వాళ్ళకు మోక్షం వెదుక్కుంటూ వస్తుంది. మీరు పోగొట్టుకొనే వాసనలు దూరంగా పడేయండి. స్వార్థంలేని వానికి అశాంతి లేదు, ఆవేదన లేదు. కర్రకు, కర్ర, కత్తికి కత్తి, మాటకు మాట లోకులు చేసే పని. భక్తుడైన వాడు ఇలా ఉంటే నీకు జ్ఞానం ఏమిటి? మిమ్ములను కష్టపెట్టే వారి

srinannagaru.com

ముఖంలో కూడా మీ సద్గురువు చూడగలుగుతున్నావా? భక్తుడై ఉండి నీలోని కష్టాలను ఓర్చుకోకపోతే నీకు భక్తి ఎక్కడిది. నీ గురువును జ్ఞాపకం చేసుకోవటం కూడా సాధనే. తెలివిగా బ్రతకాలి, సూక్ష్మదృష్టితో బ్రతకాలి; అహంకార రహితంగా జీవించటం నేర్చుకోవాలి; ప్రేమగా మాట్లాడటం నేర్చుకోవాలి. నీకు అమృత స్థితి కలిగితే కాలంతో సంబంధం ఉండదు. నేను అప్పుడు పుట్టాను, నా వయస్సు ఇంత, అనే భావాలు పోతాయి. శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఈ దేహం నేను కాను; అని ఊరికే అనుకొంటావు కాని అనుభవం కలిగితే అనుకోవలసిన పనిలేదు. ఆత్మ సాక్షాత్కారం కలిగిన తరువాత నీవు గతంలో అనుభవించినవి అన్నీ రోతలా కనిపిస్తాయి. అంటే కళ్ళతో చూచినవి, చెవులతో విన్నవి అన్నీ రోతలా అనిపిస్తాయి. మోక్షమంటే పూర్తిగా విడుదల పొందటం. మోక్షానుభవం పొందటానికి అర్హత ఏమిటి? అంటే కర్మానుభవం ఈషన్ మాత్రం లేని వానికే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. కర్మానుభవం పూర్తి కాకుండా ఆత్మ సాక్షాత్కారం కలుగదు. నేను శరీరాన్ని; నా కన్న బయట లోకం ఉంది; ఎక్కడో దేవుడు న్నాడు; అనే మూడూ ముద్ద అవ్వాలి. అదే నిర్వాణం. నిజమైన జ్ఞానం పొందినప్పుడు చావుకు, బ్రతుకునకు తేడా తెలియదు. అప్పుడు ఆత్మ స్థితిలో ఉంటాము.

145. అహంభావన లేని స్థితి ప్రతిరోజూ నిద్రలో అనుభవిస్తూనే ఉన్నారు. కాని దాన్ని నమ్మటం లేదు. సహజమైనది, సరళమైనది చెబితే ఎవ్వరూ పట్టించుకోరు. మనస్సుకు కనిపించేవి అన్నీ నిజంలా కనిపిస్తాయి. ప్రకృతి పరంగా అనుభవించే సుఖాలు అన్నీ దుఃఖాలుగా పరిణమిస్తాయి. పరిణామంలో వడ్డీతో సహా ఆ దుఃఖాలు అన్నీ అనుభవించవలసిందే. కాల, చక్రంలోంచి బయట పడాలంటే కాలుతున్న ఇటికామ మీద నుంచి బయటికి రావటానికి ఎంత తపన పడతాడో, అజ్ఞానం నుంచి అలా బయటపడాలి. ఏపనిచేసినా మనం బాగు పడాలి. ఎక్కడ నుంచి వచ్చామో అక్కడికి వెళ్ళిపోవటమే జీవిత గమ్యం. ఆత్మ జ్ఞానం వలన వచ్చే సుఖమే సుఖం, శాంతియే శాంతి; అదే వైభవానికి వైభవం. వైరాగ్యం లేకుండా విచక్షణ లేకుండా, శాంతి చిత్తం లేకుండా మోక్షం రాదు. సహజ స్థితే సమాధి. జీవుడు అనేక వాసనలతో నిండి ఉంటాడు. వాసనా క్షయం అయితేనేగాని సత్యజ్ఞానంరాదు. జీవుడు దేహంతో వేరుపడినప్పుడు తన వాసనలకు అనుగుణంగానే పునర్జన్మ నిర్ణయించబడుతుంది. మిథ్యా ధ్యానం బంధిస్తుంది, సత్య జ్ఞానం స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. ఏ స్థానమును పొందిన తరువాత తిరిగి రావలసిన పని లేదో అదే సత్య జ్ఞానం.

146. ఏదైతే నీవు పొందాలని అనుకొంటున్నావో అక్కడే నీ శక్తిని గురి

srinannagaru.com

పెట్టు. ఏ లక్ష్యంవైపు నీ మనస్సు వెళుతున్నదో అక్కడే నీ మనస్సు కరిగిపోతుంది. విషయ చింతనకు లోనైతే ఆత్మ చింతనకు దూరమౌతావు. దేవుడు చేసే పని దేవుడు చేస్తాడు. ఆయన పనికి మీరు గుర్తుచెయ్యనక్కరలేదు. ఈ లోపులో మీరు చేసేపని మీరు చెయ్యండి. మీ మనస్సు నిలకడ కలిగినప్పుడు ఈశ్వరుని అనుగ్రహం నీకు అతివేగంగా వస్తుంది. ఎదుటివారు కష్టాలలో ఉన్నప్పుడు సహాయం చేసి మర్చిపొండి అంతేగాని వారు మనకు ఎప్పుడు తిరిగి సహాయం చేస్తారు అనుకోకూడదు. ఇందులో ఒక రహస్యం ఉంది ఆవతలవారి వలన నీవు ఏదో లాభం తిరిగిపొందాలి అని ఆశించటం అంటే తిరిగి వారి దరిద్రాన్ని నీవు కోరుకోవటమే. నీవు దరిద్రంలో ఉన్నప్పుడే ఇతరుల సహాయాన్ని అర్థిస్తావు. అంటే అటువంటి ఆలోచన వలన నీకు నీవే దరిద్రాన్ని కోరుకొంటున్నావు. నీ శరీరానికి ఉన్న సదుపాయాలు నీవు సద్వినియోగం చేసుకోకపోతే అవి నిప్పులో పెట్టిన కట్టెలు వంటివి. మనిషిలో అపవిత్రత శరీరాన్ని "నేను"గా వ్యక్తం చేయటం. అదే దేహాన్ని పాలిస్తూ ఉంటుంది. దేహగతమైన నేను ఎప్పటి వరకూ నశించదో అప్పటివరకూ దేహయాత్ర పొడిగిస్తూనే ఉంటుంది. దేని వెలుగులో ఈ సృష్టిని చూస్తున్నామో దానిని మర్చిపోయాము. వ్యామోహం నుంచి విడుదల పొందటమే పవిత్రత. నేను చెప్పినది నీకు ఇష్టం కాకపోవచ్చును. కాని నీ వాసనలకు అనుగుణంగా చెబితే నేను బాగుగా చెప్పాను అంటారు. నీ పాపపు బుద్ధి, నీ భేద బుద్ధి, నీ కుయుక్తి బుద్ధివలన నీలో ఉన్న సత్యాన్ని గుర్తించలేకుండా చేస్తున్నాయి.

147. మననం కంటే, శ్రవణం గొప్పది. మననం తక్కువదని కాదు, శ్రవణం వలన ముఖ్య విషయం బ్రెయిన్‌లో ఉంటుంది, బాగుపడతారు. మొక్క దశలో ఉన్న చెట్టును కంచె వెయ్యకపోతే మేకలు, గొఱ్ఱెలు చెట్టుకు చేడ్డను తీసుకువస్తాయి. అలాగే మీ సాధన దశలో మీరు చిన్న మొక్కలు వంటివారు, సాధనలో పొరపాటున చెడ్డ స్నేహితులు తారసపడితే మీరు మేకలు తిన్న మొక్కలు అవుతారు. మీరు పక్వానికి వస్తే ఎంత చెడ్డవారితో స్నేహం చేసినా మహావృక్షానికి ఏనుగును కట్టినా హాని కలగనట్లుగా ఉంటుంది మీ సాధన. ఉత్తమ చదువు వేరు, ఉత్తమ జీవనం వేరు. మన చదువు మన మనస్సును నిగ్రహించుకోవటానికి సహకరిస్తే, మనస్సు తన హృదయంలో లీలమౌతుంది. గుడిలో దేవుడు ఉపాసన కోసం పెట్టారు. నిజమైన దేవుడు నీలోనే ఉన్నాడు. విషయానందం తగ్గాలి అంటే తగ్గదు. ఆత్మానందం పెంచుకొంటే విషయానందం యొక్క ఆకర్షణకు దూరమౌతావు. సాధన అంటే మలిన వాసనలను జాగ్రత్తగా తగ్గించుకోవాలి.

srinannagaru.com

ఆపుంచి వాసనలు నీ గమ్యానికి దారి చూపిస్తాయి. మాటిమాటికీ ఇంద్రియాలను, మనస్సును ఉద్రేకానికి గురు చెయ్యకుండా ఉంటే వస్తువు తనంతట తానుగా వ్యక్తమౌతుంది. అది నీకు నిర్మలత్వం మీద రావాలి. అది కుదిరితే మాట, చేత, ఆలోచనా నిర్మలంగా ఉంటాయి. ఒక పనిచేస్తే అది సఫలమైతే అది నా వలనే జరిగిందనే భావన కలిగితే అజ్ఞానంలో పడతాము. అంతా ఈశ్వరుని అనుగ్రహం వలనే జరుగుతోంది అనుకోవాలి. సుఖం కలిగినా దుఃఖం కలిగినా అనుగ్రహమే ఎట్టి పరిస్థితిలోనూ గర్వం రాకుండా చూచుకోవాలి. గర్వం వచ్చేస్తున్నది అనుకోండి పాడైపోతున్నాము అని గుర్తుంచుకోవాలి.

148. మానవ స్వభావాన్ని మార్చుకోవటానికి ఎంతో సాధన కావాలి. స్వభావాన్ని బట్టి మానవ జీవితం నడుస్తుంది. సామాజిక స్పృహతో మాట్లాడితే చైతన్యస్థాయి పెరుగుతుంది. ప్రాణశక్తిని మీరు సద్వినియోగం చేసుకొంటే అది ఆధ్యాత్మిక శక్తిగా మారుతుంది. వంట చెరకుతో మనం పదార్థాలను వండాలను కొన్నప్పుడు అన్ని వేసి పాత్రపై మూత పెట్టకపోతే వంటచెరుకు ఎక్కువ నష్టమౌతుంది. పొగ మిగులుతుంది. అలాగే మీరు చేసే పనిలో కర్తృత్వం పెట్టుకొంటే ఫలితం సున్నా. సముద్రంలో ఎన్ని కెరటాలు లేచినా సముద్రము వలనే వస్తాయి. అలాగే ఆధ్యాత్మిక అభివృద్ధి మార్గంలో నీవు ప్రయత్నం చేసినప్పుడు ఎన్ని తలంపులు వస్తే ఏమిటి? వాటికి ఆధారంగా ఉన్నది నీవేకదా. దానిని సాధించు. ఆలోచించే భాగాన్ని మనస్సు అంటాము. విచక్షణతో నిర్ణయం తీసుకొనే భాగాన్ని బుద్ధి అంటాము. భగవంతుణ్ణి పొందాలనే ఆలోచించటమే కాదు దానిని పొందాలనే కృతనిశ్చయం కావాలి. బుద్ధితో కృతనిశ్చయం చేసుకోకపోతే దానిని పొందలేవు. మీ తెలివి తేటల వలన కూడా వైరాగ్యం వస్తుంది. కాదనటం లేదు కాని వారానికన్న ఎక్కువ నిలువదు. అలాగని విచక్షణాబుద్ధిని వదులుకోమని కాదు. కానీ దైవ కృప వస్తే ఆ వైరాగ్యం నిలబడుతుంది. మాట దేవుడై ఉన్నది అంటే ఆ మాటలో నీవు జీవించి ఉంటే సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. అందరికీ వైకుంఠానికి వెళ్ళాలి, కైలాసానికి వెళ్ళాలి అనే కోరికే గాని మనము ఎవరిమో మనము తెలుసుకోవాలనే కాంక్ష కలుగటం లేదు. ఇదే "మాయ" అన్నారు. సేవను డ్యూటీగా చెయ్యాలి. మనం ముఖం కడుగుకొంటు న్నాము అన్నం తింటున్నాము ఎవరికోసం? మన కోసమే. అలాగే సేవకూడా చిత్తశుద్ధితో చెయ్యాలి.

149. సారా తాగినవానికి ఎంతమత్తు వస్తుందో స్నేహాల వలన కూడా అంత మత్తు వస్తుంది. విద్యార్థి అతి స్నేహం వలన పాడవుతాడు. నీకు ఏ

srinannagaru.com

కారణం వలన అశాంతి వస్తూ ఉన్నా భగవంతుణ్ణి నీవు మర్చిపోయావని కొండ గుర్తు ఆయనను నీవు జ్ఞాపకం పెట్టుకోవటం అంటే శాంతిని అంటిపెట్టుకొని ఉన్నట్లే. మీకు ఎవరైనా మహిమలు చేసి విభూతులను సృష్టించి మీ చేతిలో వెయ్యవచ్చు, ఆ ఇచ్చేది దొంగనేనే. ఈ ఆకర్షణలకు లొంగిపోకండి. తెలివితోనూ, ధనంతోనూ, పరిసరలాతోనూ తాదాత్మ్యం పొందేది దొంగనేనే, దానితోనే నీవు ఉంటే ఎన్ని జన్మలు వచ్చినా తరించలేవు. ప్రతీ మనిషికీ ఒకే వాసన పెట్టడు. నీకు ఏ వాసన వలన నీ మనస్సు బాహ్య ముఖం అవుతున్నదో దానిని కాల్చి బూడిద చెయ్యాలి. అలా చేస్తూ అదే కాలంలో పరమేశ్వరుని స్మరించు, శరణాగతిపొందు అది సరియైన మార్గము. కుండలో పాయసం ఉంది కాని మూత పైన కప్పబడి ఉంది. మూత ఉండటం వలన పాయసం లేదు అనుకొంటున్నావు. ఆత్మే నీవై యుండగా, శరీరం నీవు అనుకొంటున్నావు దానికి అహంకారమనే మూతను తియ్యాలి, నీ ప్రయత్నానికి గురువు అనుగ్రహం కావాలి. మిమ్మల్ని ఎవరైనా తాడు బొంగరములేని వాడు అన్నాడు అనుకోండి మీకు కోపం వస్తుంది. అలా అంటే మీకు నష్టం ఏమిటి? కోపమే అజ్ఞానం. మీ సాధన ప్రయోజనాన్ని మీరు గుర్తించాలి. పేదరికం కూడా పాఠాలు నేర్పుతుంది. తలంపును యాక్షన్‌లో పెట్టకూడదు. అలాచేస్తే మిథ్యానేనుకు బలం చేకూర్చినట్లే. రైట్ తింకింగ్, రైట్ బిహేవియర్, రైట్ లివింగ్ ధర్మం అన్నారు పెద్దలు.

150. ఇంట్లో వారికి సేవచేసే ప్రారబ్దం ఉంది అనుకోండి లేచిన వెంటనే మనం ఒకటి అనుకోవాలి. మనం ఈ రోజు ఏమి చెయ్యాలి అని అనుకొని మీ ఇష్టా-అయిష్టాలను ప్రక్కకు పెట్టి సేవ చెయ్యాలి. అట్లా చెయ్యటం వలన దొంగ నేను పోగొట్టుకోవాలనే తలంపు పోతుంది. ఈ పని మంచిదని భగవంతుడు చెపితే దానిని ఈశ్వరుని ఆజ్ఞ అని ఆచరించినా దొంగ నేను పోతుంది. తల్లి కడుపులోంచి, స్మశానానికి వెళ్ళే వరకూ ఏ జీవితం ఒకే క్రమంగా ఉండదు. గీతలో కృష్ణుడు అన్నాడు నీకు లాభ నష్టాలలో లెక్క చెయ్యకండి. మిథ్యానేను పెరగదు దానితో కలసిపోయినా మిథ్యానేను పెరుగుతుంది. దొంగ నేను పోవటానికి వ్యక్తి భావన లేని స్వభావం కావాలి. గుర్తింపులు కోరుకోకపోతే దొంగనేను పోతుంది. ఈ రకంగా నీ బుద్ధిని సమానం చేసుకోవాలి. తీర్పులు చెప్పకు, తీర్పులకు ఈశ్వరుడు ఉన్నాడు. ఇతరులకు ఎంత మంచి జరిగితే అంతా మనం సంతోషిస్తే ఈశ్వరానుగ్రహానికి మనం పాత్రులమవుతాము. మన శరీరానికి నీడ కావాలంటే మనం ఒక ఇల్లు కట్టుకొంటే ఆ నీడలో మన శరీరం సుఖంగా ఉంటుంది. అలాగే జీవుడికి నీడ కావాలి అంటే మన హృదయంలోకి వెళ్ళిన

srinannagaru.com

వాడికే నీడలాంటి శాంతి, సుఖం కలుగుతుంది. మనస్సు బాహ్యముఖం అయితే, సున్నాలులాంటి నామ రూపాలు కనబడతాయి. పూజ గదిలో భగవంతుని నామ రూపాలతో కాలక్షేపంచేసి బయటకి వచ్చిన వెంటనే బాహ్యంగా కనిపించే దృశ్యాలు, లోకం బంగారంలా కనిపిస్తే అంతర్ దృష్టితో నీవు ఎలా ఉండగలవు. మహా నిశ్శబ్దంలోంచి "నేను" అనే తలంపు వస్తే ఆ మాటకే అంత శక్తి ఉంటే ఇక నిశ్శబ్దానికి ఎంత శక్తి ఉంటుందో గ్రహించండి. మౌనం అత్యుత్తమమైనది.

151. ఈశ్వరుడు మంచివారి మధ్య జీవితాన్ని కల్పించినది తరించటానికి వంద జన్మలు పడితే, దుర్మార్గుల కుటుంబ సభ్యులయందు జీవిత యాత్ర చేస్తే ఒక్క జన్మలోనే తరిస్తావు. ఖురాన్‌లో ఇలా ఉంది "నీవు పదిమందిలో నీవు ఒక అత్తం ఎవరికైనా ఇస్తే దాని ఫలితం ఒక పండు మాత్రమే దక్కుతుంది. ఎవరూ లేకుండా ఒక్క అరటిపండు ఎవరికైనా ఇస్తే డబ్బది అరటిపళ్ళు ఇచ్చే ఫలం ఆదాతకు కలుగుతుంది". అంటే గుప్తదాన వైభవమది. బజారు సాహిత్యం ఇంద్రియాలను ప్రకోపింపచేస్తుంది. ఏ సాహిత్యం వలన నీ మనస్సు శాంతి కలుగుతుందో మనస్సు అణుగుతుందో అదే నిజమైన సాహిత్యం. ఏ కోరికా లేని వాడికి ఈ సృష్టి గడ్డిపరకలా కనిపిస్తుంది. మీకు వంద కోరికలు ఉన్నాయనుకోండి అన్నీ ఒకేసారి నెరవేరితే ఎంత సంతోషం కలుగుతుందో ఏ కోరికా లేనివానికి అంత సంతోషం కలుగుతుంది. మనకు జ్ఞాన సముపార్జన చెయ్యాలనే బుద్ధి లేదు అనుకోండి ఒక పవిత్రుణ్ణి చూడటం వలన జ్ఞాన సముపార్జన చెయ్యాలనే బుద్ధి కలుగుతుంది. "చెడ్డవాడు ఏదైనా చెడ్డ చెబుతూ ఉంటే చెవిటివాడిలా ఉండు. చెడు మాట్లాడే సంభాషణ సంభవిస్తే మూగవాడిలా ఉండు. చెడు చూచే పరిస్థితి తారసపడితే గుడ్డివాడిగా ఉండు" అన్నారు పెద్దలు. తిండితిని జీవించటానికి మానవ జన్మే అక్కరలేదు. పశువులు కూడా చిట్టు, తెలగపిండి, జనుము తిని మనలాగే ఆనందిస్తాయి. కాని సాధన చేసుకోవటానికి మానవుడికే ఎక్కువ అవకాశం ఉంది. నిద్ర, తిండి, త్రాగటంలో పశువులకు మనుషులకు తేడాలేదు.

152. డాక్టరు దగ్గరకు వెళ్ళి "అన్నం ఎంతకాలం తినాలి?" అంటే ఆ మాటకు అర్థం ఉందా? బ్రతికి ఉన్నంతకాలం తినవలసిందే. నీ సాధన విషయం లోకి వస్తే సాధన ఎంతకాలం చెయ్యాలి అని అడుగుతారు. అహంకారం ఉన్నం తకాలం సాధన చెయ్యవలసిందే. "శోకాన్ని పోగొట్టేదే శ్లోకం" గాంధీజీకి చిక్కు సమస్యలు ఎదురైనప్పుడు గీతలో ఏదో ఒక్క శ్లోకం చదివితే చాలు సమాధాన పడేవారు నీమాట నీచేత అసహజంగా ఉంటే దానిమీద దుమ్ము చల్లు నీ

srinannagaru.com

హృదయంలోని ఆత్మ మీద నీవు దుమ్ము జల్లుతున్నావు. మీరు ఏదైనా పొరపాటు చేస్తే "శ్రీరామా శ్రీరామా" అని అనుకొన్నా ఆ దోషం పోతుంది కారణం రాముడు ధర్మస్వరూపుడు. "మతి ఎంతో గతి అంతే మంచికి మంచి, చెడుకు చెడు అనుభవించాలి. మనం ఎక్కడైనా ప్రసంగం వింటే అవసరం వచ్చే మాటలు తీసుకోవాలి, ఉపయోగం లేని మాటలు విడిచిపెట్టాలి. దానికి తర్కం అవసరం లేదు. జేబులో ఉన్న మందు బిళ్ళ నీకు ఆరోగ్యం ఇయ్యదు. నోటిలో పడ్డదే బాగు చేస్తుంది. నీవు మంచి విషయాలు రాసుకోవచ్చును. వాటిని నీవు మస్తకంలో పెట్టుకొని ఆచరిస్తే బాగుపడతావు. జీవితంలో ప్రతీ అనుభవం టీచింగ్ కోసం ఏర్పాటు చేయబడింది. వయస్సు నిండిపోతే, రూపం పోతుంది. అసూయత పెరిగిపోతే, ధర్మాన్ని ఆచరించలేము. వాసన బలంగా ఉంటే, సిగ్గుపోతుంది. గర్వం వస్తే, అన్ని రంగాలలోనూ పతనమౌతాము. కాబట్టి నీవు తరించటానికి "బుద్ధిని దీపంగా పెట్టుకొని జీవించు". దేహం నేను అనే దుంప ఉన్నతంకాలం వాంఛలు రావటం మానవు (అదే పాపపు దుంప) దేహం నేను అనే తలంపును శిలువ వెయ్యండి.

153. భాగవతంలో ఇలా ఉంది "గొఱ్ఱెను కసాయివాడు నరకటానికి ఎలా తోలుకొని వెడతాడో అలాగే మీకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకొంటున్నారు కానీ మృత్యువు దగ్గరకు గొఱ్ఱె పిల్లలా వెళుతున్నామని తెలుసు కోలేకపోతున్నాము. సాయంత్రం పడుకోబోయేడప్పుడు ప్రతీవాడు ఇలా ఆలోచించుకోవాలి. మనలో ఈ రోజు అహంభావన మాటలు ఎన్ని వచ్చాయి. చెడు తలంపులలోంచి ఎంత వరకూ బయట పడుతున్నాము. ఎంతవరకూ అభివృద్ధి పొందాము అని అనుకోవాలి. అనవసరంగా ఎన్ని సార్లు నోరుజారాము మనం ధర్మాన్ని ఆచరిస్తూ భగవంతుని పాదాలను ఆశ్రయిస్తూ వివేకంతో జీవిస్తేనే సత్యదర్శన మౌతుందని భావించాలి. ఆత్మ విశ్వాసం పెంచుకొంటే ఆత్మ లబ్ధ మౌతుంది. నిజమైన శత్రువు భయం. భయం వలనే మరుపు వస్తుంది. నిప్పు రవ్వ చిన్నదే కదా అని వదిలితే ప్రమాదం. అలాగే అప్పు తొంభై శాతం తీర్చామని అనుకొంటే మరలా మొదట తెచ్చినంత అవుతుంది. చిన్న వాసనే కదా అని వదిలేస్తే తిరిగి జన్మను తీసుకొని వస్తుంది. వ్యక్తి భావన నిశ్శేషంగా తగ్గాలి, అంత వరకూ నమ్మకూడదు. మనిషి సెక్స్ కాంక్ష, ధనకాంక్ష దాటవచ్చు కానీ కీర్తి కాంక్ష దాటటం కష్టమని షెల్లి అన్నారు. ఈ పనిచేస్తే ఎంత గౌరవం వస్తుందనే చేస్తారు ప్రతీవారు. మనం తెగిపోయిన గాలిపటాలులా లేము. మనం భగవంతుని అదుపులోనే ఉన్నాము. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడనే సజీవ విశ్వాసం భక్తునిలో

srinannagaru.com

ఉండాలి. భగవంతుని జీవితంలో ఈ శరీరయాత్ర ఒక్క క్షణం.

154. సహనాన్ని అలవాటు చేసుకోవాలి అదే గొప్ప సాధన. రాముడు, కృష్ణుడు, అల్లా, ఏసు సత్యానికి ప్రాతినిధ్యం వహించారు. మరి మతకలహాలు ఎందుకు వస్తున్నాయి? ఏసు రూపం నామం మాత్రమే సత్యమని భావించటం వలన కలహాలు వస్తున్నాయి. మత కలహాల ప్రవాహంలో నీవు కొట్టుకు పోకు. ఒక మహమ్మదీయుడు గాంధీగారితో "మీ అబ్బాయి మా మతంలోకి వచ్చాడు" అనగా ఆయన ఇలా అన్నారు "మా మతంలో విషయాలే వాడికి అర్థం కాలేదు. మీ మతంలో విషయాలు వాడికి ఏమి అర్థమౌతాయి. వాడు ఎందులోకి వెళ్ళినా సున్నాయే" అన్నారు. అందుకనే ఏసు ఆఖరి గడియలో ఇలా అన్నాడు "తండ్రి వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియటం లేదు. వారిని క్షమించు" అన్నారు. నీలో దాతృత్వం రావాలి. మీ ఇంటి ప్రక్కవారు ఆకలితో అలమటిస్తూ ఉంటే ఒక కుంచుడు బియ్యం ఇయ్యలేరు. మీకు సమాధి స్థితి రావాలి. దైవానుగ్రహం లేకపోతే భోగ వాంఛ పోదు. ప్రేరణ లేకుండా ఏ మాటా రాదు. "మనం చెడ్డ వారము. ఆత్మానుభవం మనకు కలుగుతుందా" అని అనుకోవటంలోనే పెద్ద ప్రమాదం ఉంది. భక్తి లేకపోతే బుద్ధి వికాశమే జరుగదు. దేహ బుద్ధిని సాధ్యమైనంత వరకూ తగ్గించుకోవటమే తపస్సు. సమాజం మనలోని బలహీనత లను తెలుపుతుంది. అది తొలగించదు. దానిని మనమే తొలగించుకోవటమే తపస్సు.

155. కృష్ణుడు రెండు సూత్రాలు చెప్పాడు "మనస్సుతో నన్ను స్మరించుకో చేతులతో పని చెయ్యి" విరోధిగా తయారయ్యాడు అనుకొంటే రాముడు గుర్తుకు రాడు, ఆ విరోదుడు గుర్తుకువస్తాడు. పిల్లల మీద ప్రేమ బయటకు కనిపించ నియ్యకండి, అలా చేస్తే వారు పాడైపోతారు. సంతోషం వస్తే అనుభవిస్తే భక్తి చెడిపోతుంది. అలాగే దుఃఖం వచ్చింది అనుకోండి దానిని తలచుకొంటే భక్తి చెడిపోతుంది. హృదయ గుహలోకి వెళ్ళటానికి, విష్ణువు, శివుడు, దేవి, ఆచార్యుడు, గురువు అనే ద్వారాల ద్వారా ఆ గృహంలోకి వెళ్ళవచ్చును. సరస్వతి అంటే జ్ఞాపక శక్తికి, తెలివికి, వివేకానికీ నిలయం తెలివితేటలు జ్ఞాపక శక్తిలో ఒక భాగం. క్రమ శిక్షణ, దృఢ సంకల్పం లేనిచోట లక్ష్మినిలవదు. దుర్గ అంటే కార్యరూపంలో ఉన్న శక్తి. దానిని మనం పెంచుకోవాలి. సముద్రంలో గాలి వానవస్తే నావ, ఓడ పరిస్థితి ఎలా ఉంటుందో విషయ సుఖాలను ధ్యానం చేసేవాడి పరిస్థితి అలాగే ఉంటుంది. పంజరంలో పక్షి రెక్కలు ఎంత గట్టిగా ఆడించి ఎగిరిపోదామన్నా పంజరం దాటలేదు. అలాగే మీ సాధనతో మీరు ఎంత ప్రయత్నించినా పక్షిలా

srinannagaru.com

ఫలవంతం కాదు. అది కల్పించుకొని చేసిన ప్రయత్నమే, కాని గురు అనుగ్రహం సహజమైనది, ఫలవంతమైనది మీ ప్రారబ్ధం ఎంత బలవంతమైనదైనా గురువు చెప్పే సబ్జెక్టు అర్థం చేసుకొంటే మీ ప్రారబ్ధం ఎంత జుగుప్సాకరంగా ఉన్నా బయట పడవచ్చును. విషయాన్ని మననం చెయ్యటం వలన మనస్సుకు వంట పడుతుంది. మనం లక్ష్యానికి చేరటానికి ఏ తలంపులు, ఏ వ్యక్తులు, ఏ సంఘటనలు అడ్డు తగులుతున్నాయో గ్రహించి వాటిని ప్రక్కకు పెట్టాలి. జ్ఞాపకశక్తి పెరగటానికి పనికి మాలిన తలంపులు కారణమని వాటిని ప్రక్కకు పెట్టాలి.

156. పూర్ణ శరణాగతి వలన దేహ భావన నశించి ఆత్మ భావన కలుగుతుంది. భాగవతంలో ఇలా ఉంది "దేహాన్ని కాల్చితే బూడిద అవుతుంది. కప్పెడితే మట్టి అవుతుంది, రోడ్డు ప్రక్కన పడేస్తే కుక్కలు, నక్కలు పురుగులు తినేస్తాయి. లేదా నదిలో పారవేస్తే చేపలు తింటాయి. ఆ శరీరమే నేను అని భావించి పతనమౌతున్నావు. నీకు ఇక జ్ఞానం ఏమిటి?" హృదయం ఖాళీ అవ్వకుండా జ్ఞానం కలుగనే కలుగదు. ఇది చివరి మాట, ముఖ్యమైన మాట వారు ఏమతస్థులైనా, ఏ ప్రాంతం వారైనా అది వర్తిస్తుంది. కర్తృత్వం లేని స్థితి ఒకటి ఉంది అని మనస్సుకు విశ్వాసం లేదు. ఇక ఏ ప్రయత్నం చేస్తాము. ఇంటికి చెద పురుగులు పడితే ఆ ఇల్లు గల్లంతే. నీ మనస్సుకు చెడు తలంపులు వస్తే నీ జీవితాన్ని నాశనం చేస్తాయి. సాపేక్షిక పరిజ్ఞానంలో వచ్చే మాటలు "నాకు తెలుసు, నాకు తెలియదు" అది నిజమైన జ్ఞానం కాదు. హృదయ గుహలోకి వెళ్ళాలి అంటే "మేము కోరికలనే గృహంలోనే ఉన్నాము. ముందు దానిలోంచి బయట పడనియ్యండి, తరువాత వాటి విషయం చూద్దాము" అంటారు. అంటే కోరికలు నిజ గృహంలోనికి వెళ్ళనియ్యవు. సోదరమహాశయులారా! సోదర, సోదరీమణు లారా ఒక్క విషయం బాగా ఆలోచించండి నా శరీరం ఉన్నా ఊడిపోయినా మూల తలంపు మూలంలోకి వెళ్ళేవరకూ, ఆ దుంప ఎండదు, పచ్చిగానే ఉంటుంది. దుఃఖం తరువాత దుఃఖం మిమ్ములను వెంటాడుతుంది. దాని మూలంలోకి వెళ్ళాలి అనే సంకల్పంలో మీలో ఎవరైనా ఉన్నారా! అందులోకి వెళితే నీవు ఎవరిగా ఉన్నావో అదే అవుతావు. జ్ఞానమే నీ స్వరూపమౌతావు. అప్పుడు ఎటుచూచినా శాంతే ఎటుచూచినా సుఖమే.

157. నా జీవిత అనుభవం ఒక్కటే సజ్జన సాంగత్యం మంచిది. "రొంప పట్టిన వారిని ఆసుపత్రికి రావద్దు" అంటారు. వస్తే ఆ రోగం, ఇతరులకు అంటు కొంటుంది అని. అలాగే చెడు సావాసాలు కూడా అంతే. సత్పురుషుడు కాని వాడికి అన్ని గొడవలు కావాలి. నీ మోహానికి మూల తలంపే కారణం. దానితో

srinannagaru.com

తాదాత్మ్యం పొందుతూ అజ్ఞానంలో మునిగిపోతున్నావు. మరణానికి మరణం తీసుకొని రావాలి. భయానికి అభయస్థితిని తీసుకొని రావాలి. అంతా నీవే అన్న సంగతి తెలిసిన వానికి భయం లేదు. చావు పుట్టుకలు లేవు. ఈ లోకంలో కృతజ్ఞత లేదు అనుకోకండి లోకం తీరు అంతే. పెంకితనం వేరు, పట్టుదల వేరు. పట్టుదల వలన ఆధ్యాత్మిక అభివృద్ధి వైపుకు వెళతావు. పెంకితనం పతనం వైపుకు ప్రయాణం చేయిస్తుంది. ఆనందం అఖండంగా ఉంది. లోచూపు ఉన్నవారికి ఆలోపల ఉన్న ఆనందం లభిస్తుంది. ఆనందంగా సాధన చేస్తే ఆనందం దొరుకుతుంది. తపస్సు వలన, సంస్కారం వలన క్రమశిక్షణ వలన సత్యం తెలియబడుతుంది. మనకు ధర్మానికి, అధర్మానికి పోరాటం వచ్చినప్పుడు మనం జ్ఞానాన్ని ధర్మాన్ని విడిచిపెట్టకూడదు. విభీషణుడు అలా చేసాడు. ఆయన రాముని శరణు పొంది రాజ్యం తెచ్చుకోలేదు. రాజ్యాధికారం వచ్చింది. ప్రకృతి మనుషుల దగ్గర కూర్చుంటే దుఃఖం అశాంతితో తిరిగివస్తాము. అంతేకాదు మనలో ఈశ్వరుని పట్ల విశ్వాసం మిణుకు మిణుకుమంటూ ఉన్నా ఆ దీపాన్ని ఆర్పేసి మిమ్ములను ఇంటికి పంపుతారు. సత్యంపై తపనే తపస్సు. ఐకమత్యం అంటే ఏక మతితో పనిచెయ్యటం. ప్రియం వలన కోరికలు కలుగుతాయి. అప్రియం వలన క్రోధం కలుగుతుంది. ఈ రెంటి వలన మనస్సు బాహ్యముఖమౌతుంది.

158.

| ఆత్మ స్థితి | జీవుని నైజం ఇలా ఉన్నాయి |
|---|---|
| నిశ్శబ్దం | అందరికి తెలిసిపోవాలనే ఆరాటం |
| శాంతంగా ఉంది | అశాంతితో ఉంది |
| ఒకటిగా సింపుల్‌గా ఉంది | మన బుర్ర సత్తరువుగా ఉంది |
| లోపల వస్తువు మర్యాదగా ఉంది | మనం అమర్యాదగా ఉన్నాము |

వారు మనకు ఎలా తెలియబడతారు. మనం నిర్మలంగా ఉండగలుగుతున్నామా? మన సాధన శాంతంగా చెయ్యాలి. వస్తువు ఏకంగా ఉంది. మోక్షం తప్పించి చిన్న వాసన మీకు కలిగిందంటే మీకు మోక్షం రాదు. నీ తలంపుల విషయంలో కూడా నీవు మర్యాదగా ఉండాలి. అమర్యాదకరమైన తలంపులు దరిచేరనియ్యకూడదు. అది ఎంత నిర్మలంగా ఉందో అంత ఏకాగ్రతతో మన సాధన జరగాలి. మనచేత అవమానం పొందినవారు స్వర్గానికి వెళతారు. మనం

srinannagaru.com

నరకానికి వెళతాము. వారు స్వర్గానికి వెళ్ళి మనలను చూచి నవ్వుకుంటారు. ఇది యదార్థం. మీరు అవమానం పొందినా బాధపడకండి. దేహం చనిపోయే టప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు. తప్పడు తాదాత్మ్యం మూలంగా అంటున్నావు. ఆ జాడ్యంలో నుంచి విడుదల పొందు నీవు ప్రకృతి గొడవలతో తాదాత్మ్యం పొందుతూ ఆ బుడబుక్కల మాటలతో కలిసిపోతున్నావు. నీవు ఏదో ఒక సమస్యను, నీవుకాని సమస్యను నీవు సృష్టించుకొని నీ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకొంటున్నావు. నీ మనస్సు ఎంత నిజమో వారి మనస్సు అంతే నిజం. చిన్న సమస్యలు వస్తే ఊగిపోతున్నావు నీవు ఆత్మవు అన్న సంగతి గ్రహించు. ఈ చిన్న విశ్లేషణ కూడా నీవు చేసుకోకపోతే నీవు ఏది సాధించినా ఒకటి లేని సున్నలే నేను అది సాధించాను అంటే అది సున్న. నీవు నాలుగు సున్నాలు సాధించినా, నలభై సున్నాలు సాధించినా ఎన్ని కూడినా సున్నాయే. ప్రకృతి మనుషులతో చిన్న చిన్న సమస్యలతో పోరాడి ఊగిపోతున్నావు చంద్రుడు నీటిలో కనిపిస్తాడు ఒక రాయి వేస్తే చంద్రుడు కదిలిపోతున్నాడు అనుకొంటున్నావు. నీవు ఆత్మవు నీవు కల్పించుకొన్నవి అన్నీ నీ నీడలే. నీవు చిన్న మాట పడలేవు. అవమానం భరించలేవు. నీలో ఆత్మ జ్ఞానం ఏది? వదిలించుకోవలసిన అహంకారాన్ని వదిలించుకొంటే నిజం తెలుస్తుంది.

159. మీ మనస్సు పెంచుకొనే పనులు చెయ్యకూడదు. పొగిడినా, తిట్టినా వాటికి మీరు బానిస అయితే మీరు సాధకులు కారు. ఎవరో వచ్చి మిమ్మల్ని ఉద్ధరిస్తారని అనుకొనేవాడు ఆత్మ విశ్వాసంలేనివాడని గుర్తు. మీ కృషి మీకు సహాయకారి. మీ కృషికి భగవంతుని కృప ఉంటుంది. సమాజం నుంచి మనం వివేకం నేర్చుకొన్నాము కాబట్టి సమాజ క్షేమం కూడా చూస్తే మన దృష్టి అంతర్ముఖంగా వెడుతుంది. మంచిగా మాట్లాడితేనే సరిపోదు, మంచిగా ఉండాలి. అలాగే మంచి రచన చేస్తే సరిపోదు మంచిగా ఉండాలి. ప్రతీవాడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు, కారణం చనిపోని వస్తువు ఒకటి ఉంది. అది అతని చేతికి అందక అలా అంటాడు. మీ ఇంటిలో ఉన్న బుజ్జిని పిలిచేటప్పడు "బుజ్జీ" అంటూ ఎంత ప్రేమతో అంటామో అంత ప్రేమ ఈశ్వరుని మీద లేదు. ప్రతీ మనిషికీ స్నేహితులు ఉంటారు. విరోధులు ఉంటారు. అవి తీసి ప్రక్కన పెట్టండి అందరి మీద సమాన దృష్టి కలిగి ఉండండి. తన్ను తాను విమర్శించుకొనేవాడు అంటే పరిశీలన చేసుకొనేవాడు పురోభివృద్ధి చెందుతాడు. ఇతరులను విమర్శించే వారు ఎలా ఉంటారు అంటే, ఊడుపులలో రైతులు, సంక్రాంతి సమయంలో బట్టల వర్తకులు ఎంత హడావిడిగా ఉంటారో ఇతరులను

srinannagaru.com

విమర్శించేవారు అంత హడావిడిగా ఉంటారు. వారు చీకటి లోకాలకు వెడతారు. వారి బుద్ధిలో కోమలత్వం ఉండదు. వారు అంతకంతకూ దిగజారిపోతారు. "కత్తెరకి రెండు అంచులకు పదును ఉంటుంది. దానితో బట్టలు కత్తిరించగలం. ఒక అంచుకే పదును ఉంటే కత్తిరించలేము. అలాగే కృషి-కృప కావాలి" అన్నారు పరమహంసగారు.

160. కొంతమందికి పనిపాట్లు ఉండవు. గతంలో జరిగినవి, ఎందుకూ పనికిరాని విషయాల గురించి తలచుకొని ఏడుస్తూ ఉంటారు. జపధ్యానాల గురించి ఆలోచించరు. గాలిలో మేడలు కట్టుకొంటారు. గురుస్మరణ వదిలేయటం వలనే గతం గుర్తుకు వస్తుంది. జామ మొక్క వేయటం ఎప్పుడు కాయ కాస్తుంది అనుకోవటం. దానికి నీరు ఎరువు వెయ్యాలి, కాలం రావాలి అనుకోవటం ఉండదు. అలాగే మన సాధనలు ఎలా ఉన్నాయి అంటే సాధన చెయ్యము. సిద్ధి వచ్చేయాలి. మనం కర్మలు చెయ్యటానికి మాత్రమే అధికారం ఉంది. ఫలితం మన చేతులలో లేదని గుర్తుంచుకోవాలి. నీవు సత్యాన్ని దర్శించాలంటే మానసిక అనారోగ్యాన్ని కల్పించుకోవద్దు. మీరే భయాన్ని కల్పించుకొంటున్నారు. నిజంగా మీరు భయపడే పరిస్థితి ఏదీ రాదు. ఒకామెకు పగలే నిద్రలో ఉండగా గుండెల మీద త్రాచుపాము ఉంది మెలకువ వచ్చి కంగారుపడి దులుపేసుకొంది. పాము వెళ్ళిపోయింది. ఈశ్వర ప్రణాళికలో ఆమె చనిపోయే పరిస్థితి ఉంటే కాటువేసిపోవాలి అలా జరగలేదు, అదే ఈశ్వర ప్రణాళిక. జ్ఞానానంద హిమాలయాలలో ఒక నదిలో నీరు త్రాగి బయటకు వస్తూ ఉండగా పులి అతి దగ్గరలో ఎదురైనది. ఆయన అనుకొన్నారు "ఈ దేహయాత్ర ఇంతటితో సమాప్తము" అనుకొన్నారు రెండు నిమిషాలు ఒకరిని ఒకరు చూచుకొన్నారు. పులి వెళ్ళిపోయింది. ఆయన పారిపోతే పులి చంపి ఉండేది. మన జీవితం ఎలా నడుపుకొంటే ఆత్మానుభవం కలుగు తుంది అనే దృష్టితో జీవించాలి. ఆత్మ స్తుతి పరనింద ఉన్నచోట అబద్ధం చెప్పి అయినా అక్కడ నుంచి వెళ్ళిపోవాలి. మనం ఆత్మానుభవం పొందటానికి అడ్డు వచ్చే విరోధులు ప్రతీ జన్మలోనూ ఉంటారు. ఓర్పుతో వారినుండి తొలగిముందుకు సాగాలి.

161. మీ ఇంటిలో మీ గది క్రింద మణుగుల కొలది బంగారం ఉంది అనుకోండి. మీరు మేము పేదవారమని ఏడవటం ఎలాంటిదో మీ హృదయంలో అంతులేని శాంతి, ఆనందం ఉంచుకొని మేము బాధలో ఉన్నాము అని రోజూ ఏడుస్తూ కూర్చుండటం కూడా అటువంటిదే, అదే అజ్ఞానం. నీ ఇబ్బందులు, నీ కష్టాలు అన్ని నీ మనస్సు కల్పితాలు. నీవుకాని దేహంతోనూ, పేరుతోనూ

తాదాత్మ్యము పొందినంత కాలం దుఃఖం పోదు. భాగ్యంతో, భోగాలను కొనుక్కో వచ్చు. ఆత్మానుభవం మీకు కలిగితే ఈ సృష్టిలో సంతోషాలు అన్ని మహాసముద్రం లో నీటి తుంపరలాంటిది సముద్రంలో ఎంతనీరు ఉందో నీ ఆత్మలో అంత సుఖం, శాంతి ఉంది. "మాయ" యొక్క కారణం ఈ శరీరం ఆత్మనుండి వెలువడిన తుంపరే మనస్సు. ఆ తుంపరని దాని స్థానంలోకి పంపటమే సాధన. మీ మనస్సుతో మీరు విరోధం పెట్టుకొంటే మీ జీవితంలో ఓడిపోయినట్లే. ఇష్టమైన భోజనాన్ని ఎంత ఇష్టంగా తింటావో అంత ఇష్టంగా, మీ జప, తపాలతో కూడిన సాధన జరగాలి. విష్ణు సహస్రనామాలలో "ఓం భోజ్యాయనమః" అంటే అదే. మీకు వెయ్యి కోట్లు డబ్బు ఉన్నా దుఃఖం వస్తూ ఉంటే మీ జీవితంలో ఓడిపోయారు. నీ జీవితం కృత్రిమంగా లేకుండా ఉంటే, కృత్రిమంగా లేని వస్తువు నీకు లభ్యమౌతుంది. మీ ఇంటిలో వారికి మంచి మార్గం గురించి చెప్పండి, అలా చెప్పకపోతే మీరు చచ్చిపోయిన వారితో సమానం. వారు విన్నా వినకపోయినా చెప్పటం మీ ధర్మం. ఎవరైనా మిమ్ములను విమర్శిస్తే వారు ఎటువంటి వారు అని గ్రహించండి దుఃఖం అక్కడికక్కడ ఆగిపోతుంది.

162. వినాయకునకు మూషికవాహనం ఏమిటి అని అనుకోవచ్చును. మనస్సును మూషికంతో పోల్చుతారు. ఎలుక రాత్రులు మసులుతుంది అంటే అజ్ఞానంలో ఉండటం. అది తిన్నంతతిని, మిగిలినది కన్నంలో పెట్టి దాచుకొం టుంది. మనిషి పది తరాలకు సరిపడా సంపాదించాలని అనుకొంటాడు. ఆ మనస్సును స్వాధీనం చేసుకొన్నాడు కాబట్టి భగవంతుడు అయినాడు దాని అంత రార్థం అది. గణపతి నోరు చిన్నది, చెవులు పెద్దవి. ఎక్కువగా వినటానికి చెవు లు పెద్దవి, తక్కువగా మాట్లాడటానికి చిన్న నోరు పెట్టాడు. చేతికి మలం అంటు కొంటే సబ్బుతోనూ, సున్నిపిండితోనూ అనేకసార్లు తోముకొంటున్నాము. అలాగే మనస్సులోని మలినాలను తొలగించుకోవటానికి ధ్యానం, జపం, పూజ సహకరి స్తాయి. శరీరాలు, ధనం, అధికారం బుడగలాంటివి. ఆ సంతోషాలతో ఆధారపడతా వా? బుడగ జీవితకాలం ఎంత? శాశ్వత ఆనందం ఆత్మలో ఉంది. ఊహించుకోక పోతే నీకు నిరుత్సాహమే లేదు. కుచేలునకు ఎంత దరిద్రం ఉన్నా కృష్ణుని తొలగిం చమని ప్రార్థించలేదు. భార్య వెళ్ళమన్నా డబ్బుకోసం వెళ్ళలేదు, దర్శనంకోసం వెళ్ళాడు. అది ఆయనలోని భక్తి యొక్క వైభవం. అటుకులు తిన్న స్వామి సర్వ ఐశ్వర్యాలను ఒకే సమయంలో కలగజేసాడు. సంపాదించవలసింది "విద్య", కాపాడుకోవలసింది ఆరోగ్యం. వాడు ఆలా అన్నాడు, వీడు ఇలా అన్నాడు అనే విషయాలు వదిలేయండి, వారిని మనలను నియమించేది ఈశ్వరుడే ఎందుకు

srinannagaru.com

ఈ గోల. ఎన్ని మంచి గుణాలు ఉన్నా లోభిత్వం ఉంటే రాణింపు ఉండదు. రోగాలు అన్నిటికీ పెద్దరోగం సంసారం. దానికి మందు సజ్జన సాంగత్యము.

# 12. గురు వైభవము

నీ కల్మషాలను తొలగించనివాడు గురువు కాదు. బరువు. జ్ఞాని మాత్రమే గురువు. మంత్రం చెప్పిన వాడు గురువు కాదు. మరణించిన తరువాత మీతో వచ్చేది గురువు మాత్రమే. లాఘవంగా ఉన్నంత కాలం గురువు అవసరమే లేకపోతే గురువుతో పనిలేదు. గురువు ఏమాట మాట్లాడినా అది మాట కాదు, అనుగ్రహం. మనలోని వాసనలు ఎలా పోతాయి అని మీరు అనుకోవచ్చు. సింహం ముందు మేక పోరాటం ఎటువంటిదో గురువు అనుగ్రహం ముందు మీ వాసనలు అటువంటివి. కళ్ళతో చూచి భక్తుని మాయని తనలోకి తీసుకొనేవాడే నిజమైన గురువు. గ్రహించే శక్తి ఉన్నవాడి కంటే, గ్రహించే శక్తి లేనివాడే తొందరగా ఆవేశ పడతాడు. చిన్న పిల్లలకు ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పి ఎలాగైతే అన్నం తినిపిస్తుందో తల్లి అదేవిధంగా మీకు ఆ కబుర్లు, ఈ కబుర్లు చెబుతూ మిమ్ములను ఆత్మ దగ్గరకు ఎవరైతే తీసుకొని వెళతారో వాడే నిజమైన గురువు. కొన్ని రోగాలు మందులతో నయమైపోతాయి, కొన్ని ఆపరేషన్ చేస్తేగాని తగ్గవు. అలాగే సాధకుడు కొన్ని వాసనలను సాధన చేసి తొలగించుకోవచ్చును. కొన్ని బలీయమైనవి హృదయంలో అణిగి ఉంటాయి. గురువు అనుగ్రహం లేకుండా, ఈశ్వరానుగ్రహం లేకుండా పోవు. మీ ప్రయత్నం వలన పోయినట్లుగా కనిపిస్తాయి. మనస్సు అణిగి ఉంటే జ్ఞానిలా అయిపోయామని చాలామంది అనుకొంటారు. అది చాలా ప్రమాదం. విషంతో సమానం. రమణా! అంటే గురువు రుణం తీర్చుకొన్నట్లు కాదు. దండవేస్తే రుణం తీర్చుకొన్నట్లు లెక్కకాదు. రమణుడు నా స్వరూపంగా ఉన్నాడు, నా స్వరూపాన్ని నేను తెలుసుకొంటే రుణం తీర్చుకొన్నట్లు. నన్ను నేను తెలుసుకొనే వరకూ గురువుకు రుణపడే ఉన్నాము మనం. నేను మాట్లాడేటప్పుడు నా మాట నా హృదయంలో ఉండి మాట్లాడితే ఆ మాట మీ మీద పనిచేస్తుంది. జ్ఞాని మాటలో జ్ఞానం ఒక్కటే ఉండదు. కరుణ, ప్రేమ, దయ ఉంటుంది. జ్ఞాని మౌనం గంభీరమైనది. అది భక్తుని శరీరగతమైన నేను నుండి ఆత్మగతమైన నేనుకు చేరుస్తుంది.

2. గురువు ఎప్పుడూ సజీవంగానే ఉంటాడు. అతనిదేహం వాడినా అనుగ్రహం వస్తూనే ఉంటుంది. మనది రూప దృష్టి గనుక గురువు లేడని బాధ పడతాము. శివుడు పులి చర్మం, గాంధీ తుండు గుడ్డ కట్టుకొన్నా, రమణ మహర్షి

srinannagaru.com

గోచీ పెట్టుకొన్నా వారిని సమాజం పూజిస్తూనే ఉంది. మనం ఎంత ఖరీదైన బట్టలు కట్టుకొన్నా శరీరాన్ని పరిమళాలతో అలంకరించుకొన్నా మనలను ఎవ్వరూ గౌరవించటం లేదు. ఎంత డబ్బు సంపాదించినా గౌరవించటం లేదు కారణం ఏమిటి? మన మనస్సులో పవిత్రత లేదు. పవిత్రమైతే సమాజం తప్పనిసరిగా గౌరవిస్తుంది. జ్ఞాని సన్నిధిలో మాటలు వ్రాయగలంగాని, ఆ శాంతిని చెప్పలేము. గురువు చెప్పే మాట అంతా అనుగ్రహమే. ఉపదేశం అంటే మనస్సును ఆత్మలో చేర్చటమే. గురువు చేసే పని అదే. దానినే నిజమైన ఉపదేశం అంటారు. "చీకటి నుంచి వెలుగులోకి వెళ్ళు" అని వేదం చెప్పటం అంటే అజ్ఞానం నుంచి జ్ఞానంలోకి వెళ్ళమని అర్థం. జ్ఞానిలో ప్రేమ, శాంతి ఉంటుంది. గురువు శిష్యునికి ఉపదేశించటం అంటే నీవు నీవుగా ఉండమని చెప్పటమే. జ్ఞానికి కర్తృత్వం లేక పోవటం వలన ఆత్మగా ఉంటాడు. అజ్ఞానికి కర్తృత్వం ఉంటుంది. కాబట్టి అశాంతిగా ఉంటాడు. అనేక దేవతల అనుగ్రహం అక్కరలేదు. ఒక్క దేవత అనుగ్రహం చాలు తరించటానికి. జ్ఞాని మన ఆధ్యాత్మిక ప్రగతిని గురించి మనకు చెప్పకపోయినా పరవాలేదు. వారు మన గురించి పడే వేదన, తపన ఎంత చెందుతారో లెక్కలేదు. వారు మన నుంచి ఏదీ ఆశించరు. వారు మన మనస్సును బ్రహ్మం యొక్క అంతస్తుకు ఎక్కించాలని తపన పడతారు. జ్ఞాని కృతజ్ఞత కూడా ఆశించరు. కారణం తనకన్న అన్యంగా చూడడు కాబట్టి. బుద్ధునితో ఒకరు ఇలా అన్నారు మిమ్ములను వాదనలో జయించటానికి వచ్చాను అనగా "నన్ను జయించటం వలన నీవు ఏ ప్రయోజనం పొందలేవు. ముందు నీ కోరికలను జయించు" అన్నారు.

3. సాధనలో గురు అనుగ్రహం ముఖ్యం. మీ తెలివి తేటలతో మీ ఊహలతో బంధం నుండి బయట పడలేరు. గురువు అనుగ్రహంతో అన్ని బంధాలు తెగిపోతాయి. బోదుల ద్వారా చేనుకు నీళ్ళు పెట్టినా మెరక పల్లాలు కనబడతాయి. అదే వరద వచ్చి ఏటుగట్టు గండి పడిందంటే నిమిషాలలో ఊరంతా మునిగి పోతుంది. సాధన అంతా గురువు అనుగ్రహంతోనే సాగుతుంది. కాని సాధకుడు అనుకొంటాడు "నా స్వయంకృషి వలననే ఇన్ని గంటలు ధ్యానం చేస్తున్నాను" అనుకొంటాడు. చేయించేది గురువే. ఆ సంగతి సాధకునికి తెలియదు. చాడ్‌విక్ గార్కి బ్రాంది తాగటం, మాంసం తినటం అలవాటు. భగవాన్ మానమని ఎప్పుడూ చెప్పలేదు. కాని ఎంతో కాలంగా అనుగ్రహం ద్వారా ఏఏ సమయంలో ఎంతెంత ఇయ్యాలో ఎంతెంత కృషి చేయాలో చేసి చివరికి పూర్తిగా తొలగించారు. అలాగే ప్రతీ గురువు నామ మాత్రంగా చూపించి అంతాతానే తొలగిస్తాడు. గురువు

srinannagaru.com

చేసే ఆధ్యాత్మిక అభివృద్ధి మీ బుద్ధికి అందదు. గాలి వాలుకు తెరచాప ఎత్తిన వాడు గమ్యానికి వేగంగా చేరగలడు. తెరచాప ఎత్తని వాడు, ప్రవాహ వేగాన్ని తెడ్ల ద్వారానే ప్రయత్నం చేసేవాడు గమ్యాన్ని త్వరగా చేరలేడు. అలాగే ఈశ్వర కృప అందరి మీద సమానంగానే ఉంది. అలాగే ఈశ్వర కృప, నీ ప్రయత్నంతో ముడిపడి ఉంది. నీ ప్రయత్నంలో సఫలమైతే నీ గమ్యాన్ని చేరగలవు. మంచితనం, విజ్ఞానం, వివేకం కూడా ఉంటే మీ అహంకారం నాశనం చెయ్యటానికి ఉపయోగ పడుతుంది. ఓట్లతో జయించినవాడు మహాత్ముడు కాడు. హృదయాలను జయించిన వాడు మహాత్ముడు. ఎవరైతే హృదయంలో ఉంటారో (సద్గురువు) వారి శరీరం వాడినా, వారు మనలో ఎప్పుడూ ఉంటారు.

4. శంకరాచార్యులవారు శివునితో ఇలా అన్నారు "విషం తాగిన వాడివి; పాములను మెడలో వేసుకొంటావు. ఏనుగు చర్మం కప్పుకొంటావు. ముసలి ఎద్దు మీద తిరిగే నీవు నాకు ఏమి ఇస్తావు; నీ పాదాల మీద భక్తిని ప్రసాదించు" అంటే బాహ్యంగా పై విషయం హేళన చేసినట్లే కాని అంతరార్థంలో అది పొగడ్త. అందుచేతనే సద్గురువుతో అనుబంధం పెంచుకోండి. షిర్డీ బాబా "నా హృదయంలో బరువైన రాళ్ళ బంధాలు నా ప్రయత్నం వలన పోలేదు. పన్నెండు సంవత్సరాలు నా గురువు మలమూత్రాలను ఎత్తిపోసాను, నాపని అంతా ఆయనే చేసి పెట్టారు. భౌతికమైన విషయాలు ఏమీ ఆయన వద్ద ఎన్నడూ చెప్పలేదు. అడగనూ లేదు" అన్నారు. అది గురు కృప. అది సాధకుని ప్రవర్తన. వివేకానందుని దూషిస్తూ చికాగో ప్రయాణానికి అంతరాయం కల్పించిన వారిని ఆయన మర్చిపోయాడు. అందుచేతనే ఆయన వివేకానందుడు అయ్యాడు. ఈ మాట సాధకునికి ఉపయోగపడతుంది. దేహబుద్ధి నీకు ఎప్పుడు అదృశ్యమౌతుందో అప్పుడు నీకు ఆత్మ లభ్యమౌతుంది. నీకు ఆత్మ తెలియటం లేదు, అది నీకు సద్గురువు చూపిస్తాడు. గురువు అనుగ్రహం వలన నీకు మాటలతో చెప్పలేనిది ఒక్క ఆయన కరుణ వలన నీవు ఆత్మానుభవం పొందుతావు. గురువు సహాయం లేకుండా ఏ విద్య తొందరగా అబ్బదు. ఆత్మ జ్ఞానం కలుగకపోతే ఆత్మానుభవం కలుగదు. ఆధ్యాత్మిక అభివృద్ధికి ఓర్పు చాలా అవసరం. ప్రిపరేషన్ కొంతకాలం పట్టవచ్చు, కాని పొందటానికి కొన్ని క్షణాలే చాలు. శిష్యుని ఆధ్యాత్మిక అభివృద్ధియే కాకుండా భౌతిక అభివృద్ధిని కూడా గురువు కోరుకోవాలి. నీకు గురువు సహాయం ఎప్పుడూ ఉంది. కాని అది అందుతూనే ఉంది, అనే అనుభవం నీకు ఉండాలి.

5. గురు సన్నిధిలో ఉండటం మంచిదా, దూరంగా ఉన్నా అనుగ్రహం

srinannagaru.com

వస్తుందా! అన్న దానికి భగవాన్ "అది ఆయన మనస్సు యొక్క స్థాయిని బట్టి ఉంటుంది. చిన్న పిల్లలు తల్లిని విడిచిపెట్టి ఉండలేరు, వారే పెద్దవారైతే తల్లి దగ్గర లేకపోయినా ప్రశాంతంగా ఉండగలరు" అన్నారు. బాహ్య వస్తుసముదాయం లో బంగారానికి ఎక్కువ విలువ ఉంది. అలాగే ఆధ్యాత్మిక అభివృద్ధికి గురువు అవసరం ఎంతో ఉంది. గురువు యొక్క ప్రేమ కలిగిందో మీ హృదయంలో ఎంత పెద్ద బండరాళ్లు అయినా ఆయన తొలగిస్తాడు. ఒక్కొక్క సమయంలో మివ్వుల్ని ఇరకాటంలో పెట్టటానికి, మీ వాసనలు బయటికి గెంటటానికి గురువు ఆగ్రహిస్తాడు. అది కూడా అనుగ్రహమే అని భావించాలి. తన్ను తాను బాగుచేసుకోవాలనే తపన ఉన్న వానికీ సద్గురువు సహాయం అందుతుంది. జీవ లక్షణాలు ఉన్నంతసేపు దుఃఖం తప్పదు. జ్ఞాని చేసేపని అహంకారం నుంచి తొలగించటమే. సుఖంతో (ఆత్మతో) సంబంధాన్ని కల్పించేవాడే గురువు. బాహ్యంగా నమస్కారాలకు భగవంతుడు మోసపోడు. నీ శరణాగతి ఎంత వరకూ ఉంది అనేది చూస్తాడు. ఈ సృష్టి బరువు నంతా మోస్తున్న భగవాన్ నీ బరువు మోయడా! నీ అహంకారం అడ్డు వచ్చి, శరణాగతికి సన్నద్ధం చేయకుండా ఆపు చేస్తున్నది. దేహ బుద్ధి వలన వచ్చే చీకటిని సద్గురువు తొలగిస్తాడు. గురువు దర్శనం, స్పర్శ కూడా అనుగ్రహమే. ఏ సద్గురువూ మీలో ఉన్న వాసనలను మీకు తెలియచేయకుండా గెంటటానికి వీల్లేదు. ఆ వాసనలకు కారణాలను మీరు గత జన్మలో కొన్ని పనులు చేసి ఉన్నారనే విషయం మీకు తెలియాలి. దానికి కొంత దుఃఖం తప్పదు. కాని దాన్ని గురువు యొక్క అనుగ్రహంతో తేలికగా తొలగించుకోవచ్చును. ఊరికే మీరు చేతులు ఊపటమే; ఉన్న పని గురువు చూచుకొంటాడు.

6. శంకరాచార్యులవారు అంతిమ సమయంలో శిష్యులతో ఇలా అన్నారు "నేను ఇరువది రెండు సంవత్సరాలు చేసిన బోధకు నా మీద మీకు భక్తి ఉంటే ఇతరులకు మీరు చెప్పండి. నాకు వ్యాస మహర్షి చెప్పిన పని పూర్తి అయినది. ఈ దేహంతో ఏపని జరగాలో ఆ పని జరిగింది. ఇక నాకు ఈ దేహంతో పనిలేదు. సూర్యాస్తమయం అయ్యే లోపులో ఈ దేహం ఉండదు" అనగా శిష్యులు "మీరు లేని లోకం, చూడవలసిన వస్తుంది అని అనుకోలేదు. దేవతలను కూడా ఈ భూమి మీదకు తెచ్చే శక్తి మీకు ఉంది. మీ శరీర, మరణాన్ని అపు చెయ్యండి" అని విలపించగా "మీరు అన్నది చోద్యంగా ఉంది. పంచభూతాలతో కూడిన ఈ శరీరాన్ని పొడిగించాలని ఏ జ్ఞాని తలంచడు. నా శరీర మరణానంతరం మీలో ఉంటాను. మీ వెనుక, మీ ముందు అంతటా ఉంటాను. ఇంకా సంశయాలు

srinannagaru.com

ఏమైనా ఉంటే అడగండి" అనగా "సామాన్య మానవులమైన మాకు మోక్షం వచ్చే మార్గం ఏదైనా ఉందా" అనగా "మనం భౌతిక పరిస్థితులను దాటుకుంటూ మోక్షాన్ని పొందాలి. ఈ శరీరమే నిజమని నమ్మకోకండి. దాన్ని సాధనకు ఉప యోగించుకోండి. సత్ సంఘంలో ఉండండి, గృహస్థ ఆశ్రమంలో ఉంటే తరించటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. మంచి పనులు చెయ్యండి. మీలో ఉన్న పశుత్వాన్ని తొలగించుకోండి. మరణం రాకముందే దాన్ని తొలగించుకోండి. అహంకారం లేని వానికే నిజతత్త్వం తెలుస్తుంది. మీరు బోధించినప్పుడు మీ అభిప్రాయాలను ఇతరులపై బలవంతంగా రుద్దకండి. ఎవరు ఏ మార్గంలో ప్రయాణం చెయ్యాలో అలా జరుగుతుంది అంటూ మీరు నాకు చేసిన సేవకు కృతజ్ఞతలు" అనగా శిష్యులు "మీరు మమ్ములను జ్ఞాన గంగలో తడిపారు. దుమ్ములో ఉన్న మమ్ములను బంగారం చేసారు" అనగా, ఆచార్యులవారు ఎవరి వంకా చూడకుండా సర్వేశ్వరునితో "నేను మూడు తప్పలు చేసాను. 1. నీవు అంతటా వ్యాపించి ఉన్నావని తెలిసి యాత్రలు చేసాను. 2. నీవు మనస్సుకు మాటకు అందని వాడవని తెలిసి మనస్సుతో ధ్యానం చేసాను. నీ మీద స్తోత్రాలు వ్రాసాను. ఇది కూడా తప్పే. 3. నీవు నేను ఒకటని తెలుసుండి ఈ పనులు అన్నీ చేసాను" అని అస్తమిస్తున్న సూర్యుని చూచి ఓంకారం చెయ్యమన్నారు. తరువాత ఇలా అన్నారు "అంతటా ఉన్నది నీలో ఉంది. నీలో ఉన్నదే అంతటా ఉంది. ఇది లేదు, అది లేదు అని ఏ పిల్లకాయలు చెప్పినా వినకండి. నీవే ఆ బ్రహ్మం అని తలచుకో" అనగానే వారి ముఖం కాంతివంతమైనది. దేవుడు వేరు, తాను వేరు అనే భావం రాలేదు. దీనినే భగవాన్ "నీవు నేను అనుగ నిత్య ఆనంద స్థితి కలిగించు" అన్నారు. దీని అర్థం నీ మీద మోహం పోవటానికి కూడా నీ అనుగ్రహం కావాలి. లోకం మీద మోహం పోవటానికి నీ మీద మోహం పెట్టావు" అన్నారు. ఆచార్యుల వారి ముఖంలో తేజస్సు మాత్రమే కనబడింది. తరువాత దేహం కూడా కనబడకుండా జ్యోతిలో కలిసిపోయింది. ప్రతీ గురువు ప్రేమ స్వరూపుడే, బోధ స్వరూపుడే.

7. చంటి పిల్లవాడు మనలను తన్నినా క్రింద పడేయము. అలాగే అవతార పురుషులను మనం తన్నినా, చిత్ర హింసలు చేసినా, చంపినా, తెలియక చేస్తున్నారు అనుకొంటారు. పరమహంసగారు అన్నారు "మన సాధన ద్వారా జరిగేది పంకా గాలి. సత్ పురుషుని సన్నిధి ద్వారా జరిగే సాధన మలయ మారుతం లాంటిది. మనస్సును బహిర్ముఖం చేసే గురువు రాక్షసుడు. అంతర్ముఖం చెయ్యాలి. బెల్లం విఘ్నేశ్వరుని చేసి నైవేద్యానికి ఆ విగ్రహంలోనిదే

srinannagaru.com

కొంత గల్లి పెట్టినట్లు సాధన చెయ్యటానికి మీరు ఎవరు? మీ దైవమే మీ చేత చేయిస్తుంది. తన్ను ప్రేమించటానికి కూడా తన సంకల్పం ఉండాలి. గురువు ఎక్కడ ఉన్నా పరవాలేదు. మానసిక అనుబంధం ముఖ్యం. మీ సద్గురువు మీకు అర్హత లేని ఆనందాన్ని మీకు ఇస్తే గుడిసెలో ఏనుగు దూరితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. నీ అర్హత ననుసరించే అనుగ్రహాన్ని ఇస్తారు. కుళాయిని మన అవసరానికి తిప్పకున్నట్లుగానే ఉంటుంది. మీకు ఉన్న వాసన తలంపులోనికి వస్తేగాని మీకు తెలియదు. కాని మీ సద్గురువుకు తెలుసు. దాన్ని బయటికి లాగితేనే గాని నిద్రపోడు. దాన్ని బయటికి తొలగిస్తున్నానని బయటికి తెలుపకుండా నిశ్శబ్ధంగా చేస్తాడు. మీ డబ్బు, గౌరవాలను ఆశించడు. పాపాజీ గారు (శ్రీరామ తీర్థుల వారి మేనల్లుడు) భగవాన్ దగ్గరకు వచ్చారు. విశేషమైన శాస్త్ర పాండిత్యం ఉంది. వారు భగవాన్‌ని సాధన విషయంలో కొన్ని సందేహాలను అడగగా "కుదురుగా ఉండు" అన్నారు. అంతే నిరంతరం ఆ మాట గుండెకు పట్టేసింది. కుదరుగా ఉండటం అలవాటు చేసుకొన్నారు. ఆయన కృష్ణ భక్తుడు. జ్ఞాని అయిన తరువాత "భగవాన్ కృప వలననే నేను జ్ఞానిని అయ్యాను" అని చెప్పేవారు. మహాత్ముల దర్శనం ప్రయోజనం సద్వస్తువును పొందాలనే కాంక్షను వారు పెంచుతారు. మంచి వాడు చెడ్డను చెయ్యడు. చెడ్డవారు మంచిని చెయ్యడు. పూర్ణుడు పూర్ణత్వాన్ని ఇస్తాడు. గురువు చేసే పని పూర్ణత్వాన్ని ఇస్తాడు.

8. మనం కారులో ప్రయాణం చేస్తు ఉంటే కారు పెద్ద గోతిలో పడితే ఎగిరి పడతాము. వెన్నుపూస కదిలిపోయిందని భయపడుతూ మరలా పడితే ప్రమాదం వస్తుందని ముందు ఉన్న రోడ్డును గట్టిగా పట్టుకొని ప్రయాణం పూర్తి అయ్యేవరకు దాన్ని వదలం. అలాగే ఈశ్వరుడు మిమ్ముల్ని తన వైపుకు తిప్పకోవటం కోసం, కష్టాలు, నష్టాలు, ఉపద్రావలను సృష్టించి తనవైపుకు తిప్పకొంటాడు. దానితో ఈశ్వరుణ్ణి సత్యదర్శనం అయ్యే వరకూ వదలం. పది సంవత్సరాలు మీరు మంచి పని చేసి పవిత్రులైనారు అనుకోండి; ఒక మహాత్ముని దర్శనం వలన అంతకన్న ఎక్కువ పవిత్రులు కావచ్చును. రోజర్ (ఇంగ్లాండు) అన్నారు "మీరు నాన్నగారిని ఎందుకు చూస్తున్నారు? అంటే దాని అర్థం సరిగా చెబుతున్నాను. మీ మనస్సుకు పుట్టిల్లు ఆత్మ. ఆత్మ స్వరూపులైన నాన్నగారిని చూడటం వలన మీ మనస్సు ఆత్మానందం కోసం చూస్తున్నది" అన్నాడు. మీ సాధన నిజమైతే సద్గురువు ఒక తోలు కప్పకొని మిమ్ముల్ని ఉద్ధరించటానికి వస్తాడు. మిమ్ముల్ని చైతన్య వంతులను చేసే వరకూ వదలడు. వివేకానందను అమెరికాలో ఒకరు ఇలా అన్నారు "మీరు చదువుకొన్నారు. మీ గురువు గారికి

srinannagaru.com

చదువు రాదు" అనగా "నన్ను ఇంతటి వానిని చేసిందే ఆయనే అంతేకాదు అనేక మంది వివేకానందులను ఆయన సంకల్పముతో చెయ్యగలరు" అన్నారు. రాబోయే జన్మలకు సంబంధించిన బీజాలు మనస్సులో ఉన్నాయి. కోరిక-మమకారం ఉన్నప్పుడు దుఃఖం వస్తుంది. కోరికలు వస్తాయి. తప్పవు. వాటిని సద్గురువు పూనుకొని ఆపుచెయ్యాలి. సద్గురువు కోపం స్వార్థంతో కూడినది కాదు; అది కూడా అనుగ్రహమే. పిచ్చివానికి, ఋషికి మనస్సు ఉండదు. కాని పిచ్చివాడు ఋషికాడు. గురువును పురోహితుడు అంటారు. పురోహితుడు అంటే హితవును కోరేవాడు. ఆధ్యాత్మిక, భౌతిక విషయాలలో అని అర్థం.

9. ఒకరు శ్రీ నాన్నగారితో "నేను అరుణాచలం వెళ్లిన తరువాత అహంకారం పెరిగింది ఏమిటి?" అంటే "దాని వలన అహంకారం పెరగలేదు. భవిష్యత్తులో నీవు అనుభవించే వాసనలు ఇన్ని ఉన్నాయని తెలియటానికే నీకు చూపిస్తాడు అరుణాచలేశ్వరుడు". గురువు కూడా మీ భవిష్యత్ జన్మలలో ముప్పది, నలుబది సంవత్సరాలు అనుభవించే కర్మలని రెండు-మూడు గంటల స్వప్నంలో అనుభవింపచేసి ముందుకు తీసుకొని పోతాడు. అట్టివాడు గురువు. కబీర్ అన్నారు "ఇల్లు అంతా మసి అనుకోండి ఎంత జాగ్రత్తగా ఉన్నా, మసి అంటుకోకుండా ఉండదు. అలాగే ఈ లోకంలో శరీరం వచ్చాక ఎంతో కొంత మసి అంటుకోకుండా ఉండదు. ఇది ఒక విష వృక్షం. రాగ-ద్వేషాలనే రెండు పండ్లు తిని చస్తాము. మనది యోని జన్మ నుంచి వచ్చిన జన్మ. యోని జన్మను, జ్ఞాన జన్మగా మార్చగల్గిన వాడే సద్గురువు. గురువుకు భూతకాలం-వర్తమాన కాలం అంటూ ఉండదు. తన అస్తిత్వం దేహానికి పరిమితమైన వాడు గురువు కాదు. దేహ భ్రాంతి కలవానికి దేహబుద్ధి కలిగి తీరుతుంది. వారికి ఆత్మ దృష్టి కలుగదు. భేదం ఉన్నచోట భయం ఉండి తీరుతుంది. మమకార రహితుడు గురువు కాగలడు. మన హృదయంలో ఉన్న వాసనలు మనకు తెలపకుండా ఏ గురువూ బయటికి గెంటడు.

10. పాముల దగ్గర ఎంత జాగ్రత్తగా ఉంటామో స్వాముల దగ్గర అంత జాగ్రత్తగా ఉండాలి. గుహ నమశ్శివాయ దగ్గర ఒక పిల్ల గొఱ్ఱె చనిపోగా ఒక కుర్రవాడు బ్రతికించమని ఏడుస్తూ కోరగా, దాన్ని బ్రతికించారు. అది విని కొందరు కొంటె వారు స్వామిని పరీక్షిద్దామని ఒక వ్యక్తిని చనిపోయినట్లు నటింపచేసి, స్వామి దగ్గరకు తీసుకొని వెళ్లి "స్వామీ, స్వామీ ఈయనను బ్రతికించండి" అని కోరారు. విషయం గ్రహించిన స్వామి ఇలా అన్నారు "చనిపోయాడని మీరే చెబుతున్నారు, చనిపోయిన వాడు చనిపోయినట్లే" అనగా, నిజంగానే చని

srinannagaru.com

పోయాడు. మహాత్ముల వద్ద హేళన, కపటం, అనుకరణ పనిచెయ్యదు. సద్గురువుకు సారం ఉంటుంది. కీర్తి ఉంటుంది. లక్ష్మి ఉంటుంది, ప్రేమ, దయ ఉంటాయి. అట్టి వాడే ఆచార్యుడు. ప్రకృతి బంధనాల నుండి విడిపించి ఆత్మ సింహాసనంపై కూర్చోబెట్టేవాడే ఆచార్యుడు. ఆత్మకే మనం దేవతా బుద్ధిని కల్పిస్తాము. అప్పుడు మనకు ఆ దేవత ఆత్మానుభవం కలిగే వరకూ విడిచిపెట్టదు. ఆత్మను సరాసరి ధ్యానం చెయ్యలేని వారు ఆ రకంగా సద్గురువును ఎన్నుకొని గమ్యాన్ని చేరుతారు. జీవునికి వాసనలు తెలియకుండా సద్గురువు బయటికి గెంటడు. అది ఈశ్వరుని రాజ్యాంగంలో ఉంది. ఈశ్వర రాజ్యాంగంలో నాలుగు జన్మలలో ఖర్చుపెట్టే వాసనలను జ్ఞాని కెలికి, బయటికి తీసి మంటబెట్టి, ఈ జన్మలోనే నిన్ను తరింప చేస్తాడు. ఇది ఖచ్చితంగా సైన్సు. ఇది అందరికీ జరగదు. ఒక్క సద్గురువు అనుగ్రహంలో ఉన్నవానికి మాత్రమే వర్తిస్తుంది. మినహాయింపులు లేని ప్రేమ ఎవరికి సద్గురువు మీద కలుగుతుందో వారిని ఉద్ధరించటానికి ఆయన పూను కొంటాడు. అది ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతుంది.

11. కొందరు తమ అంతస్థు కాని వారితో మాట్లాడనే మాట్లాడరు. భగవాన్ తనకన్న భిన్నంగా అరుణాచల శివుడు లేడని తెలిసికూడా భక్తి కొలది చివరిసారి అరుణాచల శివ నామం చేస్తూ ఉన్నప్పుడు కన్నీళ్ళు కార్చారు. కులం, మతం, దేశం అడిగేవారు కారు. అంతా బ్రహ్మమే. కన్ను తెరిస్తే చాలు, ఆ చూపుతో ఎంత వరకూ అభివృద్ధి చెయ్యాలో అంత వరకూ అనుగ్రహించేవారు. ఆచార్యుల వారి జాతక రీత్యా వారి శరీర జీవనం వయస్సు పదహారు సంవత్సరాలు మాత్రమే. కాని వ్యాసుల వారు రాసిన రచనలపై వివరణ ఇయ్యటానికి ఆ సమయం చాలదని మరో పదహారు సంవత్సరాలు జీవితాన్ని పొడిగించారు వ్యాసులు. ఆచార్యుల వారి తల్లితో "నా శాంతమే నా భార్య, నా శిష్యులే నా బిడ్డలు, నా ఏకాంతమే నాకు ఆనందం. నాకు చదువు చెప్పే వారే నాకు తండ్రి, నాకు ఎక్కడ అన్నం పెట్టే స్త్రీ ఉంటే ఆమె నాకు తల్లి. నాకు పదహారు సంవత్సరాల వయస్సు అని తెలిసి కూడా ఒక స్త్రీతో నాకు వివాహం చెయ్యాలని చూస్తున్నావు. దీని పరిణామం వలన ఆమె వితంతువు అయినా పరవాలేదు అనుకొంటున్నావు. ఇది అంతా నీ మోహం వలన జరుగుతున్నది" అని అన్నారు. అది జ్ఞాన జీవన విధాన వైభవం. తాబేలు పిల్లలను తన కళ్ళతో చూచి పెంచుతుంది, అంతేగాని ఆహారాన్ని పోగు చేసి బిడ్డలకు పెట్టదు. కేవలం కంటి చూపుతో మాత్రమే పెడుతుంది. అలాగే భగవాన్ వద్దకు వచ్చేవారిని ఆయన కళ్ళతో చూచి అనుగ్రహించేవారు. సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొని ఆచరించేవాడే ఆచార్యుడు. ఆచార్యులవారు అన్నారు

srinannagaru.com

"నీకు మానవ జన్మ వస్తేనే సరిపోయిందా; మహాత్ముల యొక్క సహవాసం ఆశ్రయం నీకు దొరికినప్పుడే నీ జన్మ ధన్యమౌతుంది".

12. "తల్లికి ఒక్కడే కొడుకు అయితే వాడిని ఎంత ఏకాగ్రతతో పెంచుతుందో వాడి అభివృద్ధిని ఎలా కాంక్షిస్తుందో అలాగే జ్ఞాని ఈ లోకాన్ని అంతగా ప్రేమిస్తాడు" అన్నారు బుద్ధుడు. భగవంతుడు ఉంటాడు. జ్ఞాని పని చెయ్యడు, జ్ఞాని ద్వారా పని జరుగుతుంది. మహాత్ముల దర్శనం వలన అందరూ బాగుపడరు కాని సత్‌పురుషులు, సజ్జనులు బాగుపడతారు, తనను తాను బాగు చేసుకోవాలనే బుద్ధి వారికి ఉంటుంది కాబట్టి, ఒక దీపం వెలిగితే దాని ద్వారా అనేక దీపాలు వెలుగుతాయి. ఒకరు జ్ఞాని అయితే వారి ద్వారా అనేకమంది జ్ఞానులు అవుతారు. సత్సంగం వలన జ్ఞానులతో అనుబంధం వలనకాని ప్రకృతి గుణాలలోంచి బయట పడలేము. పద్మపాదుల వారు తీర్థ యాత్రకు వెళుతూ ఉంటే ఆచార్యుల వారు ఇలా అన్నారు "యాత్రలో ఎవరైనా మహాత్ములను దర్శనం చేసుకోవటం చాలా మంచిది. వారి దర్శనం వలన సత్త్వగుణం వస్తుంది" అన్నారు. దాని వలన తలంపులు వేగం తగ్గుతుంది. రజోగుణం ఉన్నప్పుడు మాటలు పొందికగా ఉండవు" అన్నారు. ఎవరికైతే వాసనలు బలహీన పడ్డాయో వారు గురువు చెప్పే మాటలు వెంటనే అందుకొంటారు. అలాగని ప్రయత్నం మానకండి. సత్యాన్ని తెలుసుకోవటం అంటే అహంకారాన్ని విడిచిపెట్టటమే. సత్యాన్ని నీవు కనిపెట్టనక్కర లేదు. అడ్డుగా ఉన్న అహంకారాన్ని తొలగించుకోవటమే. గురువు ఎప్పుడు తన అనుభవాన్ని ఇచ్చేయాలనే చూస్తాడు. దుఃఖంలో ఉన్న సంబంధాన్ని తెంచి వేయటానికి ప్రయత్నం చేస్తాడు. తల్లిదండ్రులు ఆస్తినిస్తారు కాని దుఃఖాన్ని, అశాంతిని ఆర్పలేరు. దానికి ఒక్క గురువే అర్హుడు.

13. బుద్ధుడు అవసాన దశలో ఉండగా ఒక భక్తుడు విలపిస్తూ ఉంటే కారణం ఏమిటి అనగా "దీపం ఆరిపోతున్నది" అనగా "దీపం ఏమి చేస్తుంది" అనగా "అది అన్ని వైపులకు కాంతిని ప్రసరింపచేస్తుంది" అన్నాడు. "బుద్ధుడిలా జీవిస్తే ఆ దీపం నీవే అవుతావు" అన్నారు. సూరదాస్ ఒక అరణ్యం గుండా ఒక భక్తుని సహాయంతో ప్రయాణం సాగిస్తూ రాత్రి సమయం కాగా క్రూర మృగాల బారి నుండి రక్షణగా ఒక గుహలో ఉండి ద్వారాన్ని రాళ్ళతో మూయించుకొన్నాడు. తోడుగా ఉన్న భక్తుడు గృహం బయట వర్తులాకారంగా ఒక గీత గీసి శ్రీకృష్ణుని ఇలా ప్రార్థించాడు "ఈ రాత్రి ఏ క్రూరమృగం నన్ను చేరకుండా కాపాడు" అని నిశ్చింతగా పరున్నాడు. విషయం గ్రహించి సూరదాస్ ఉదయాన్నే అతనితో "ఎందుకయ్యా రాత్రి అంతా కృష్ణునికి శ్రమ కలిగించావు; మన రక్షణలో మనం

ఉంటే సరిపోయేది". అమృతమయమైన సూరదాస్ హృదయాన్ని గ్రహించి అంతకు మునుపు భయస్థుడు, విశ్వాసం లేనివాడని భ్రమించిన ఆ భక్తుడు సూరదాసుపై గౌరవం పెరిగి, వివేకవంతుడైనాడు. జ్ఞాని సాహచర్యం అటువంటిది. జ్ఞాని ఆత్మ శాంతికి సంబంధించిన కిరణాలు వారి కళ్ళ ద్వారా మనకు వస్తాయి. వాటి కిరణాలు మన నాడులను, ఎముకలను, మెదడును కూడా తాకుతాయి. భగవాన్ కళ్లలోకి, బుద్ధుని కళ్లలోకి చూస్తే ఈ విషయం తెలుస్తుంది. తల్లికి మూడు నెలల పిల్లపై ఎంత ప్రేమ ఉంటుందో, అంత ప్రేమ మీ మీద నాకు ఉంటే నేను చెప్పే మాటలు మీకు ఉపయోగపడతాయి. దేవుడు గురు రూపంలో నీ సాధనా ఫలితంగా వస్తాడు. ఆ గురువును నీవు ఈశ్వరునిగా ఆరాధిస్తే నీకు ఆత్మానుభవం కలుగుతుంది. "వాసనలకు ఏనుగుకి ఉన్నంత బలం ఉంది. దానిని చంపటానికి సింహంలాంటి సద్గురువు కావాలి" అన్నారు భగవాన్.

14. భగవాన్ ఆశ్రమవాసి "కోహెన్" చిన్న ఇల్లు కట్టుకొని, గృహ ప్రవేశానికి భగవాన్ రాగా వారితో "ఈ శరీరానికి ఎండ, వానల నుండి రక్షణగా ఒక గృహం కావాలి. అందుకని గృహ ప్రవేశం చేసాను. కాని ఈ జీవుడికి గృహ ప్రవేశం మీరు చేయించాలి" అనగా భగవాన్ "సందేహించకు, ఏ శక్తి అయితే నిన్ను ఇక్కడికి తీసుకొని వచ్చిందో ఆ శక్తే నిన్ను ఆ నిజ గృహంలోనికి పంపుతుంది. సదేహించకు" అన్నారు. మీకు కష్టాలు కూడా ఆ గృహప్రవేశానికి సహకరిస్తుంది. దుఃఖ వార్త విన్నా తట్టుకోలేరు. మీరు కలత చెందకపోతే వెంటనే మీకు అనుగ్రహం వస్తుంది. తెలివి గురించి భగవాన్ ఇలా అన్నారు "ఏది ఆలోచించి పనిచేస్తే పరిణామంలో దుఃఖం రాదో అటువంటి పని చెయ్యాలి. దేని వలన అంటే చేత-మాట-సంకల్పము ఈ మూడింటి ద్వారా జరిగే క్రియల వలన దుఃఖం రాదో, ఆ తెలివిని "తెలివి" అన్నారు. గురువు అనుగ్రహం అంటే "ధ్యానం చెయ్యమని చెప్పటం" కాదు. "వస్తువును నీకు ఇయ్యటమే" అట్టిది ఆ గురువు అనుగ్రహం. గురవు అనుగ్రహం వడ్డించిన విస్తరి లాంటిది. బియ్యం, పుల్లలు వంట వండటం వగైరాలు అక్కరలేదు. తినటమే-మింగటమే. జపం, దిగువ స్థాయిది. గురువుతో మానసిక అనుబంధం ఉన్నవారు ధన్యులు. మహాత్ములను ఎందుకు దర్శించాలి అంటే అలాగే మనం కూడా జ్ఞానులు కావాలనే బుద్ధి పుడుతుంది. భగవాన్ అనేవారు "ఇక్కడకు వచ్చిన వారు వట్టి చేతులతో వెళ్లరు. ఆ బ్రహ్మానందం నీకు అనుభవం పొందే వరకూ విడిచిపెట్టదు. నేను చూస్తున్నాను అంటే హృదయంతో చూడాలి; నేను నా చేతులతో మిమ్ములను తాకుతున్నాను అంటే నా హృదయంతో తాకాలి. అలాగే నేను మాట్లాడుతున్నాను అంటే హృదయంతో మాట్లాడాలి. అప్పడే మీకు

srinannagaru.com

ప్రయోజనం ఉంటుంది. సత్ఫలితాలు వర్షిస్తాయి.

15. భౌతిక విద్యలలో ఒక మొద్దు అబ్బాయిని కృతార్థుడిని చెయ్యాలి అంటే ఆ టీచరుకు అతని మీద ప్రేమ ఉండాలి; అతను బాగుపడాలనే తపనతో చెప్పాలి; అంతేకాదు అతని బుద్ధికి విషయం అందేడట్లు చెప్పాలి. ఆ ఎత్తుగడలు కూడా తెలిసి ఉండాలి. అప్పుడే సఫలురు అవుతారు. అలాగే ఆధ్యాత్మిక మార్గంలో సద్గురువు సాధకుని మీద ప్రేమ మొదలైన అన్ని గుణాలు కలిగినప్పుడే అతడు కృతార్థుడు అవుతాడు. మీకు సద్గురువుతో ఉన్న సంబంధం నిశ్శబ్దమైన అనుభవంతో ఉండాలి. హడావిడి, ఆర్భాటం ఉండకూడదు. మీ భర్తను మీరు ప్రేమించేటప్పడు మీ తల్లిని, మీ తండ్రిని ప్రేమించేటప్పడు ఏ ఆర్భాటం చెయ్యరు. మీ నుంచి ఏదీ ఆశించని వారు మీ నిజస్థితిని తెలిపేవారి పట్ల కూడా అలాగే ఆర్భాటం లేకుండా ప్రేమించాలి. గురువును ప్రేమించటం అంటే దైవాన్ని ప్రేమించినట్లే. జ్ఞాని శరీరం పడిపోయినా వారి అనుగ్రహ తరంగాలు మిమ్ములను తాకుతూనే ఉంటాయి. సముద్రంలోని కెరటాలు తీరాన్ని తాకుతున్నట్లే నిరంతరం సద్గురువు నుంచి అనుగ్రహం వస్తూనే ఉంటుంది. ప్రేమించేది ఈ శరీరం కాదు. ఆత్మే. ఈశ్వరుడు మన మీద అభిమానం పెట్టుకొని, లాగాలి గాని మన ప్రయత్నం వలన ఎంత ప్రయాణం చెయ్యగలుగుతాము. కొంతసేపటికి ఆయాసం వస్తుంది. అర్జునుడు అంతటి పరాక్రమశాలితో పరమాత్మ అన్నారు "చనిపోయిన వానిని చంపుము. ఊరికే చేతులు ఊపు" అన్నాడు. చిన్న పిల్లలు లక్క పిడతలతో ఆడుకొన్నట్లు సాధన పేరుతో మీ గదిలో ఆడుకోండి. కాసేపు ముక్కు మూసుకొని, కాసేపు రూపనామాలను చింతిస్తూ ఉండండి. ఎప్పడో ఒకప్పడు మీ సద్గురువు అనుగ్రహం కెరటంలా వచ్చి మిమ్ములను ఆయన ఆత్మ సింహాసనం మీద కూర్చోబెడతాడు.

16. నీ చాపల్యం వలన, నీ వేదనా పూరితమైన బుద్ధి వలన సద్వస్తువు ప్రత్యక్షంగా ఉన్నా అనుభవం కావటం లేదు. ఆ వస్తువు అనుభవంలోనికి రావటానికి నీ వాసనలను సద్గురువు ఆవు దూడపై ఉన్న "మాయిని" ఆవు నాకినట్లు నీ వాసనలను నాకి నిన్ను అనుగ్రహిస్తాడు. ప్రారంభదశలో నీవు స్థిర ఆసనం వేసుకొని ఎక్కువకాలం ఉండవు. తరువాత కాలంలో అంతగా చెయ్యలేక పోయినా సద్గురువు కృప మూలంగా నీవు ఏ స్థితిలో ఉన్నా సాధన సాగుతూనే ఉంటుంది. దేవుణ్ణి ఒక్కొక్కసారి ప్రేమ పూరితంగా స్మరించండి చాలు. పెద్దగా కష్టపడనవసరం లేదు. అది అత్యంత ప్రేమ పూరితంగా చేస్తే ఫలితం వెంటనే కలుగుతుంది. భగవంతుడు భావనా బలాన్ని చూస్తాడు. గురువుతో నీకు ఉన్న

srinannagaru.com

సంబంధం విడదీయరానిది. భౌతిక దేహాలతో ఉన్న బంధువులు, స్నేహితులు కాటి వరకూ వస్తారు. గురువుతో ఉన్న సంబంధం, సహాయం జన్మ జన్మలకు వచ్చి తీరుతుంది. అక్కడ వ్యాపారం లేదు. ప్రేమ ఉంది. గురువు ద్వారా వచ్చే సహాయం మీకు తెలియదు. తెలియ కుండానే నిశ్శబ్దంగా చేస్తాడు. నీవు మనస్సుగా ఉంటే లోపాలు కనిపిస్తాయి. ఆత్మగా ఉంటే కనిపించవు. భగవాన్‌తో ఒక నిరుపేద గిరి ప్రదక్షిణలో నడుస్తూ దారిద్రం వలన ఆకలితో అలసిపోతూ ఉండగా భగవాన్ వారి దారిద్ర్యాన్ని ఎత్తి చూపేలా "నీవు ఆశ్రమానికి రా భోజనం పెడతాము" అనకుండా ఇలా అన్నారు "నీతో భోజనం చెయ్యాలని ఉంది" అని వారిని ప్రక్కన కూర్చోబెట్టుకొని ఇది బాగుంది, అది బాగుందని మర్మంగా చెబుతూ కడుపునింపారు. అంతేగాని, నీవు ఆకలితో ఉన్నావు ఇంకా తినాలి అనలేదు. నిశ్శబ్దంగా ఉండే గురువు అనుగ్రహం అటువంటిది. ఆ ప్రేమ అటువంటిది. మనలను ఎవరైనా బంధిస్తే ఆ సంకెళ్ళను ఎలాగోలాగ తెంచుకోగలం. గురువుతో ఉన్న అనుబంధం తెంచుకుందామన్నా తెంచుకోలేము.

17. రైలు ఎక్కకపోతే స్టేషన్ వచ్చే ప్రసక్తే లేదు. రైలులో ప్రయాణం చేస్తూ ఉంటే స్టేషను రావటం ఖాయం. మీరు సద్గురువు అనుగ్రహంలో ఉంటే మీకు ఈ జన్మలోనో లేదా మరో జన్మలోనో మోక్షం రాకపోవటం అనేది లేదు. మీకు యోగ్యత లేకపోతే ఇక్కడికి వచ్చి శ్రవణం చెయ్యరు. గురు అనుగ్రహంలో పడ్డవారు గమ్యమైన మోక్షానికి ప్రత్యేక ప్రయత్నం అంటూ ఏదీ లేదు. రైలు ఇంజనుకు పెట్టి తగిలిస్తే పెట్టి ప్రయత్నం ఏమీ ఉండదు. రైలే గమ్యాన్ని చేర్చి వేస్తుంది. గురువు అనుబంధం కూడా అటువంటిదే. బుద్ధికి తెలివి, పరిమితులు ఉన్నాయి. ఆత్మకు పరిమితులు లేవు. నీ తెలివి వలన సత్యం తెలియబడదు. గురువు అనుగ్రహం కావాలి. మాటకన్న మౌనానికి శక్తి ఎక్కువ ఉంది. పదిసార్లు కాశీ-రామేశ్వరం, అరుణాచలం వెళ్ళి రండి. కాని బ్రహ్మానుభవం పొందిన వారి సన్నిధిలో ఐదు నిమిషాలు ఉంటే చాలు. ప్రైవాటి కంటే వందరెట్లు అధిక ఫలితాన్ని పొందవచ్చును. అదే జ్ఞాని వైభవం. ఒక్క జ్ఞాని కరుణ ఉంటే చాలు. లక్షలాది జన్మల వాసనలు క్షణకాలంలో బూడిద అవుతాయి. దేవుని దయ కలిగితే ఆయన అనుగ్రహం కూడా కలుగుతుంది. గురువు దేహానికి దగ్గరగా ఉండటం కాదు ఎక్కడ ఉన్నా మానసిక అనుబంధం ముఖ్యం. సత్‌సంగానికి రావటం అంటే, బ్యాటరీ ఛార్జి చేసుకోవ టానికి; గురువు దగ్గరకు ఆ రకంగా రావచ్చును; గురువు యొక్క కరుణాపూరిత మైన చూపు చాలు. కాశీ వెళ్ళటం కన్న ఎక్కువ ఫలితం ఉంటుంది. పుణ్య పురుషులతో సన్నిహితం వలన మనస్సు పవిత్రమౌతుంది. జ్ఞాని

srinannagaru.com

గదిలో తలుపులు వేసుకొన్నా వారి భావనా తరంగాలు మనపై పనిచేస్తాయి. భావనా బలానికి తలుపులు అడ్డు రావు.

18. ఒక ఆధ్యాత్మిక నాటకాన్ని శంకరాచార్యులవారి ఎదుట ప్రదర్శించగా కొంత కాలానికి దాని మూలప్రతి కాలిపోగా రచయిత వ్యధ చెందగా నాలుగు వందల పేజీలు గల ఆ గ్రంథాన్ని తిరిగి యథాతథంగా తెల్పినారు. వారు నర్మదా నది ఒడ్డున గురువైన గోవిందపాదుల వద్ద రెండు సంవత్సరాలు శిక్షణ పొందే కాలంలో నర్మదా నది విపరీత వరదలో ఉండగా దానిని తన కమండలంలో బంధించారు. పంచ భూతాలు జ్ఞాని కనుసన్నలలో ఉంటాయి. మనలో ఉన్న అజ్ఞాన మనే మంటలను మనమే ఆర్పుకోవాలి. బయట మంటలు ఆర్పటానికి ఇతరులు సాయం చేస్తారు. శంకరులు అన్నారు "మమకారాన్ని మీ నుంచి మీరు తీసి వేయండి; అప్పుడు దుఃఖం ఉంటే చెప్పండి" అన్నారు. నీకు సద్గురు పాదాలపై భక్తి లేకపోతే నీకు జ్ఞానానుభవం కలుగదు. బాహ్యా సుఖాలు పరిణామంలో దుఃఖం తీసుకొని వస్తాయి. కాని నీకు తెలుసున్న దాన్ని నీవు వదులుకోవు. బీరు త్రాగుట, మాంసం తినటం అనే చలం భగవాన్ సమక్షంలో మొదట వచ్చినప్పుడు ఇలా అనిపించింది "ఈయన దేవుడో కాడో గాని, నా మధుపాన మాంసాహారాలను చెడగొట్టేటట్లు ఉన్నాడు" అన్నారు. సముద్రంలో ఎంత నీరు ఉందో అంత నీరు తాగే శక్తి నీకు ఉన్నా గురుపాదాల మీద నీకు భక్తి లేకపోతే ఆ శక్తి వలన ప్రయోజనం ఏమిటి? స్వభావం యొక్క వేగం ఆపటం సాధారణ మానవులకు సాధ్యం కాదు. లక్నో భక్తుడు ఒకడు భగవాన్‌తో ఇలా అన్నారు "నాకు కృష్ణుడు పదినిమిషాలు కనిపించి వెళ్ళిపోతున్నాడు" అనగా "నిరంతరం కనిపించే దేవుడు కావాలా; ఆ దేవుడు కావాలా" అనగా ఆయనకు అప్పుడు ఆలోచన ప్రారంభమైంది. అంతకుముందు ఆ ఆలోచనే రాలేదు. గురువు అనుగ్రహం లేకపోతే విషయం బుద్ధికి అందనే అందదు. అప్పుడు ఆయన జ్ఞాని అయినారు.

19. ఒక మహారాజు మన నుంచి ఒట్టి గడ్డి ఎలా ఆశించడో అలాగే అవతార పురుషుడు, సద్గురువు మనల నుంచి ఏమీ ఆశించడు. పూజాఫలితం వలన దేవుడు గురు రూపంలో వచ్చి నీతో మాట్లాడుతాడు. వేరుగా ఉండి బోధిస్తాడు. గురుబోధతో వేరు భావన నశిస్తుంది. ఆత్మ వ్యక్తమౌతుంది. వేరు భావన పోయిన వాడికి, శోకమెక్కడ, మోహమెక్కడ. గురువు బోధ స్వరూపుడుగా ఉంటాడు. బాధా స్వరూపుడుగా ఉండడు. నీ స్వస్థానంలోనికి తీసుకొని వెడతాడు. ఆత్మ లేకుండా ఈశ్వరుడు, గురువు, సాధకుడును లేడు. హృదయం,

srinannagaru.com

హృదయంతో మాట్లాడితే మాటలతో పని ఏముంది. హృదయగతమైన అనుబంధం లేనప్పుడు మాటలు. దక్షిణామూర్తి యోగ్యత, అర్హత ఉన్నవారికే బోధించేవారు. ఆయన నూటికి తొంభై మార్కులు వచ్చే వారికే బోధించేవారు. భగవాన్ పది మార్కులు వచ్చే వారికి కూడా బోధిస్తారు. ఎవరికైనా కొన్ని చెడ్డ అలవాట్లు ఉన్నా జ్ఞానిపై సజీవ విశ్వాసం ఉంటే ఉద్ధరించబడతారు. శివ ప్రకాష్ పిళ్ళై భార్యపోగా "రెండవ పెళ్ళి చేసుకోమంటారా?" అని భగవాన్‌ని అడగగా నాలుగు రోజులు ఏమీ చెప్పకుండా ఊరుకొన్నారు. కారణం నోటి ద్వారా చెప్పట కుదరదు. మారు మనస్సు తీసుకొని రావాలి అని మౌనంగా ఉండగా నాలుగు రోజుల తరువాత ఆయన వివాహ ప్రయత్నం మానేసి వెళ్ళిపోయారు. జ్ఞాని మౌన వైభవం అది. మీ వల్ల మాకు ఈ బాధ తొలగింది అని జ్ఞానినుద్దేశించి అంటే అజ్ఞాని తల ఊపుతే ఆ జ్ఞాని ఔన్నత్యానికి భంగం. మనస్సుతో చేసుకొనే జపతపాల కన్న జన్మాంతరంలో ఉన్న వైదిక అనుభవం మిమ్ములను ఉన్నత స్థితికి తీసుకొని వెళుతుంది.

20. స్వ ప్రయత్నం వలన వాసనలు అనే పెద్ద పెద్ద రాళ్ళను తొలగించు కోలేము; నీ తెలివి శక్తిని నేర్పును లోపలికి మళ్ళించటమే. బయట సంకట పరిస్థితులు కల్పించి మీ మనస్సును బాహ్య ముఖం వైపుకు తిప్పతూ ఉంటాడు. మీలో ఉన్న కర్మ వాసనలు పూర్తిగా నిర్మూలించటానికి, గురువు చేసే ఈ పని మీరు కళ్ళు తెరచి ఉంటే మీకు తెలియబడుతూ ఉంటుంది. మీ గురువే ఎవరితోనో ఒకరితో కష్టమైన మాటలు అనిపిస్తాడు. మోహం తగ్గి హృదయం వైపుకు తిప్పించ టానికి. మానవ జన్మ రావటమే కష్టం; వచ్చిన మానవ జన్మలో పవిత్రత సంపాదించటం గొప్ప. గ్రంథాన్ని అర్థం చేసుకోవటం ఇంకా కష్టం; సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటం ఇంకా కష్టం. సత్యాన్ని తెలుసుకోవటం జ్ఞానం. దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటం విజ్ఞానం. ఈ రెంటి మధ్య కొంత ఖాళీ ఉంటుంది. తెలుసుకోవటం వేరు; అనుభవంలోకి తెచ్చుకోవటం వేరు. ఈ రెంటి మధ్య కొంత పోరాటం జరుగుతుంది. దానికి గురువు అనుగ్రహం అవసరం. సముద్రానికి ఉన్నంత ప్రేమ గల సద్గురువును ఆశ్రయించు. ఒక భక్తురాలు ఇట్లా అన్నారు "మనలను బాగుచేసేవారు మన దగ్గర ఉన్నప్పుడు మనకు భయపడే పని ఏమి ఉంది" అంటే సద్గురువు అనుగ్రహంలో ఉన్నామని అర్థము. గురువు ఎప్పుడూ సౌమ్యంగానే ఉంటాడు, స్వచ్ఛంగా, సాదాగాను ఉంటాడు. కృషి వలన కృప కలుగుతుంది. భగవంతుని కృప వలననే మనం సఫలమౌతాము. ఆ కృషి కూడా ఆయన కృప వలననే ఫలిస్తుంది. వాసనలోంచి తలంపు పుడుతుంది.

srinannagaru.com

తలపుంతో పని చేస్తాము; పనిచేస్తే ఫలితం వస్తుంది. ఫలితాన్ని అనుభవిస్తే వాసన పుడుతుంది. ఇది కర్మ చక్రం. ఇందులోంచి బయట పడటం అసంభవం కాని గురు అనుగ్రహం వలన బయట పడగలవు.

21. అలవాట్ల యొక్క వేగం నుంచి తప్పించే వాడే గురువు. శాంతి-శ్రద్ధ ఈ రెండూ గురువు వలన పొందుతాడు సాధకుడు. మనం ఒక వాసన నుండి బయట పడటంలో చేసే ప్రయత్నంలో నీవు సఫలీకృతుడవు అవుతూ ఉంటే ఈశ్వరానుగ్రహం నీ మీద పనిచేస్తున్నదని గ్రహించాలి. స్వయంకృషితో ఆరు మాసాలు తలబద్దలు కొట్టుకొని నేర్చుకొనేది ఒక సద్గురువు నీకు లభ్యమైతే రెండు గంటలలో విషయాన్ని నీవు తెలుసుకోగలవు. గురువుకు నిర్వచనం చెప్పాలంటే ఎవరి సన్నిధిలో నీకు గౌరవం, ఆకర్షణ, శాంతి కలుగుతుందో వారిని జ్ఞానిగా గుర్తుంచుకోవచ్చు అన్నారు భగవాన్. గురువు నీ వాసనలను నెమ్మదిగా ఎప్పుడు బయటికి తోయాలో అప్పుడు బయటికి తోస్తాడు. నీ మైండ్‌ను నెమ్మదిగా పవిత్రం చేస్తాడు. మీ కంటికి రెప్ప ఎలా సహాయకారిగా ఉంటుందో, రక్షణగా ఉంటుందో అలాగే మీ సద్గురువు మిమ్ములను నిరంతరం కాపాడుతాడు. గురువు ఉపదేశం చెప్పి వెళ్ళిపోడు. ఆ "సత్యం" అనుభవంలోకి వచ్చేవరకూ ఏ బలహీనతలు అయితే ఉన్నాయో వాటిని తొలగిస్తూ నిజ గమ్యం చేరుస్తాడు. గురువు అనుగ్రహం కనబడని సంకెళ్ళు. ఈ ప్రపంచం అసత్యం అని ఎందుకు చెబుతారు అంటే "సత్యం" అంటే అంతర్ముఖం కాదు. అందుకనే ఆచార్యులవారు అలా అన్నారు. మీరు ఎప్పుడైనా ప్రశాంతంగా, స్థిరంగా ఉన్నారంటే గురు అనుగ్రహమే కాని మీ తెలివి కాదు. గురువు నీలో కలిగే "ఆత్మ కాంక్ష" ఏమాత్రం మిణుకు మిణుకు మంటున్నా దాన్ని కాపుకాసి కృతార్థుని చేస్తారు. శిష్యునికి ఉన్న ప్రకృతి మోహం మీద వాత పెడతాడు. మోక్ష కాంక్ష నీలో ఉంటే ఉన్న పని అంతా గురువే చేస్తాడు. దేహ బుద్ధిని విసర్జించే బుద్ధిని కూడా నీకు పంపిస్తారు.

22. ట్యూబులైట్ ముందు, కోడి గుడ్డు లైటు పెడితే వెలుతురు ఎలా ఉంటుందో గురు ప్రేమ ముందు, తల్లి ప్రేమ అటువంటిది. జ్ఞాని శరీరాన్ని చూస్తున్నప్పుడు కూడా అపరిమితమైన ఆనందం వస్తుంది. జ్ఞాని శరీరాన్ని చూస్తే మనం జ్ఞానం పొందాలనే కాంక్ష ఉదయిస్తుంది. తల్లి కడుపులో బిడ్డకు ఆహారం తల్లి నుండి ఎలా అందుతుందో అలాగే మీ సాధనలో మీ కృషిలో దేవుని సహకారం తప్పని సరిగా ఉంటుంది. గురువు మీద అకారణమైన భక్తి కావాలి. జన్మాంతర బంధం ఉంది కాబట్టే మీరు నాన్నగారి దగ్గరకు వచ్చారు. దేశంలో కోట్లాది మంది ఉన్నారు. అందరూ నాన్నగారి వద్దకు రారు. జ్ఞానం పొందాలనే కాంక్ష

srinannagaru.com

తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రమే గురువు లభిస్తాడు. తెలివిగల వారు ఆ అవకాశాన్ని పట్టుకొంటారు. నిద్రపోయే విద్యార్థిని లేపటానికి మొదట నోటితో చెబుతాడు. తరువాత చేతులతో తడుముతాడు. ఇంకా లేవకపోతే కొట్టి లేపుతాడు. అలాగే సద్గురువు తన శిష్యులను, అజ్ఞానమనే నిద్రలో నుండి మేలుకొలపటానికి, మాటలతో చెబుతాడు; చేతులతో ఆశీర్వదిస్తాడు; చూపులతో మేలుకొల్పుతాడు. చివరగా కర్మలను వెలికి తీసి, సంకటాలను కల్పిస్తాడు. లేదా కోపంతో నటిస్తాడు. తెలివిగలవాళ్ళు దెబ్బలు తగులకుండానే సత్యాన్ని గ్రహిస్తారు. మీ వాసనలోంచి బయటపడలేమని ఈ దుఃఖంలోంచి బయట పడలేమని భయపడకండి. మీరు ప్రయత్నం చెయ్యండి. గురువు అనుగ్రహం మిమ్ములను వెంటాడుతుంది. మీరు స్వస్థత పొందుతారు. ఈ దుఃఖాలు, ఈ సుఖాలు నిజం కావు. శాశ్వతం కావు. గురువు దుఃఖానికి మూల కారణాన్ని వేళ్ళతో పెకలించటానికి ప్రయత్నిస్తాడు.

23. గురువును స్మరించుకొంటే మీలో ఉన్న అనుమానాలు అన్నీ పోతాయి. మీకు శక్తి కలుగుతుంది. జ్ఞాని చెప్పే ఈ మాట ఎంత సుఖాన్ని ఇస్తున్నది అని సాధకుడు గ్రహించాలి. ప్రవక్త ఎంత మంచి మాట చెప్పినా దానిలోని విలువను, బరువును మీరు గ్రహించటం ముఖ్యం. జ్ఞాని మాట కూడా అనుగ్రహమే అని తెలుసుకొన్నవాడు ధన్యుడు. మహాత్ముల యొక్క చూపు ప్రయోజనం కొందరికి వెంటనే కనిపిస్తుంది. కొందరికి పది సంవత్సరాలు పట్టవచ్చు; మరికొంత మందికి బహుకాలం పట్టవచ్చును. వారి అనుగ్రహంలో తేడా లేదు. పచ్చి కట్టెలు అగ్నికి తొందరగా అంటుకోవు. తుపాకీ మందు వెంటనే అందుకొంటుంది. అనుగ్రహంతో పాటు నీవు కొంత అభ్యాసం చేస్తే కృతార్థుడవు అవుతావు. గురువు యొక్క బోధ కూడా అనుగ్రహమే అనే విషయాన్ని పుణ్య సంస్కారం లేకుండా గుర్తించలేరు. జ్ఞాని ఏదో సాధిద్దామని పని చెయ్యడు. అహంకారికి ఏదో సాధిద్దామని వాడి కోపం, వాడి ఇష్టం, వాడి కోరిక ఆయా పనులు చేయిస్తుంది. లోపల ఉన్న చైతన్యాన్ని నీవు సరాసరి పట్టుకోలేనప్పుడు బయట గురువుతో సాంగత్యాన్ని నీవు విడిచిపెట్టకుండా ఉంటే నీ అజ్ఞానాన్ని కాల్చి బూడిద చేస్తాడు. నీవు తరించగలవా? లేవా అనే సందేహం పెట్టుకోనక్కరలేదు. మంచి తలంపు, చెడ్డ తలంపు గురు అనుగ్రహం ముందు నిలవవు. గురువును విడిచిపెట్టకు. గురువు అంటే అంతర్యామి. జ్ఞాని సమక్షంలో నీవు ఏమీ ప్రత్యక్షంగా అడగనక్కరలేదు. నీ ప్రారబ్ధంతో సంబంధం లేకుండా వారి అనుగ్రహం ప్రవహిస్తూ ఉంటుంది. అక్కడ ఉన్నది అనుగ్రహమే.

24. తరతరాలుగా, యుగయుగాలుగా ఉన్న వాసనలు బలవంతంగా

srinannagaru.com

మనస్సును బహిర్ముఖం చేస్తుంది. గురువు అనుగ్రహం లేకుండా చిన్న వాసన లోంచి కూడా నీవు బయటికి రాలేవు. వాసన చేతిలో నీవు ఓడిపోక తప్పదు. ఎవరైతే మీ క్షేమాన్ని, భవిష్యత్తును కోరుకొంటారో వారే మీకు గురువు. మీ హృదయంలో ఉన్న శాంతి మీకు అనుభవంలోనికి రానప్పుడు మీకు శాంతి లేదు. శాంతికి అడ్డువచ్చే అహంకారాన్ని గురువు వేరుతో సహా తొలగించి శాంతిని మీకు అందచేస్తాడు. మీకు జ్ఞానం ఉంటే, మీకు శాంతి కలుగుతుంది. ఇతరుల జ్ఞానం వలన మీకు శాంతి కలుగదు. కాని జ్ఞానిని ప్రేమిస్తే వారి వైబ్రేషన్స్ మీకు శ్రేయస్సును కలుగచేస్తుంది. ఏ గురువూ తన శిష్యుని బలహీనతలను టామ్ టామ్ చెయ్యడు. వాడి వాసనలు వాడికి తెలియకుండా వెదికి తీసి మంట పెడతాడు గురువు. ఆ వాసన మీకు తెలియనంత లోతుగా ఉంటుంది. ఆత్మ కదలదు. కాని మనకోసం దేహం తొడుగుకొని కదులుతూ ఉంటుంది, గురువు రూపంలో. మీరు మరణించిన తరువాత మీకు తెలియని లోకాలకు వెళ్ళినా మీ కోసం అక్కడకు వచ్చి మిమ్మలను ఉద్ధరిస్తాడు. మానవునికి సహజమైన ఆకర్షణ ఉన్నప్పుడు. ఆత్మ స్వరూపులైన గురువుకు ఇంకా ఎంత ఆకర్షణ ఉంటుందో మీ బుద్ధికి అందదు. ఏ షాపులో పంచదార కొన్నా తీపే; అలాగే మీరు ఏ గురువును ఆశ్రయించినా వారి అనుగ్రహం అంతా ఒక రకంగానే ఉంటుంది. నీ హృదయమనే ఇనప పెట్టిలో ఉన్న రత్నాల పెట్టె "కీ" నీ గురువు, నీకు ఎప్పుడు ఇస్తాడు అంటే నీకు వాంఛలు లేనప్పుడు ఇస్తాడు. అప్పుడు తాళంతో పెట్టి తెరుచుకొంటే అంతా శాంతే. అంతా ఆనందమే.

25. మీ అహంకారాన్ని మీరు వదులుకోలేరు. మీ గురువును ధ్యానం చెయ్యటం వలన ఆయన మీ అహంకారాన్ని పాతాళ లోకానికి తొక్కేస్తాడు. మిమ్ములను అమృత స్థితికి తీసుకొని వెళతాడు. మనం చేసే సాధన స్వల్పము. గురువు చేసే కృషి ఎక్కువ. మనం పిల్లలుగా ఉన్నప్పుడు నడక నడుస్తూ ఉంటే మన పెద్దలు అనుకొంటారు. బాగా నడుస్తున్నాడు, బాగా నడుస్తున్నాడు అని మురిసిపోతారు. కాని మన పెద్దల ప్రేమ వలన మన మీద విశ్వాసంతో మనకు అవసరాలు కల్పించి మన నడకను వృద్ధి చేస్తారు. అలాగే మీ గురువు మీ సాధనలో మీకు చేసే సహాయం మీ బుద్ధికి అందదు. మనం ఎవరింటికైనా వెళ్ళినా అక్కడ కుక్కను దారి ఇయ్యమని యజమాని చెపితేనే కుక్క దారి ఇస్తుంది. లేకపోతే కుక్క మనలను పట్టుకొంటుంది. అలాగే "మాయ" ఈశ్వరుని చేతులలో ఉంది. ఈశ్వరుడు మాయను తప్పుకోమంటేనే తప్పుకొంటుంది. గాని మన ప్రయత్నం వలన తప్పుకోదు. చైతన్యంతో తాదాత్మ్యం చెందినవాడే గురువు. శబ్దానికి

srinannagaru.com

అర్హుడు అవుతాడు. జ్ఞాని సమక్షంలో నీకు తెలియకుండానే నీలో ఉన్న దౌర్భాగ్యపు ఆలోచనలనుంచి నీవు మళ్ళించబడతావు. అది వారి వైభవం. గురువుతో మీరు భౌతిక దర్శనం నీకు సాధ్యం కాకపోతే మానసిక అనుబంధం పెట్టుకోండి. నీ మనస్సులో నిర్మలత్వం కలిగినప్పుడు, జ్ఞాని చూపు ఒక్కటి చాలు. మీరు శాంతి శిఖరాలకు చేరిపోతారు. ఈ సుద్దులకు, ముద్దులకు గురువు మీద ప్రేమ కలుగుతుందా; ఆ గురువే తన మీద ప్రేమ కలిగేలా చూచుకొంటాడు. ఆయనలో ఐక్యమయ్యే సహాయం కూడా ఆయనే చేస్తాడు.

26. నీవు ఒక్కొక్కప్పుడు పిల్లి మొగ్గలు వేసినా నీ గురువు సరిచేస్తాడు. భగవాన్ బాలదేవుడుగా ఉన్నప్పుడు అరుణాచల ప్రయాణంలో దిండి వనంలో దిగవచ్చు అనుకొన్నారు కాని ఒక మౌల్వీ వేషంలో అరుణాచల శివుడు వచ్చి విల్లుపురంలో దిగి వెళ్ళమని చెప్పాడు. గురువు విమర్శించడు, అనుగ్రహిస్తాడు. సాధకునిలో బంధాలను తెంచుతాడు. మీరు నిర్మల స్థితిలో ఉంటే నీ గురువే నీకు సందేశం ఇస్తాడు. ఆ బోధ సక్రమంగా ఉంటుంది. సుస్పష్టంగా ఉంటుంది. మీ బంగారాన్ని బ్యాంకు లాకరులో ఎవరికీ తెలియకుండా దాచుకొంటారు. కాని ఒక వ్యక్తి జ్ఞాన శిఖరాన్ని చేరితే వారి ముఖం నుంచి ఆపుకోవాలన్నా ఆపుకోలేని శాంతి తరంగాలు వెలికి వస్తాయి. బుద్ధుని ముఖ కాంతి, శాంతి ఎలా ఆపగలం. ఆయనకు ఆనందం బయట, క్రింద, ఆ ప్రక్క, ఈ ప్రక్క, అంతటా ఆనందమే. గాంధీజీ బహిరంగ సభలో గలాటా జరిగితే చేయి ఊపితే నిర్మలమై పోయేది సభ. విషయం ఎంత బాగా తెలిస్తే అంత తొందరగా సఫలురౌతారు. జ్ఞాని యొక్క మౌనం ఆడంబరం లేకుండా, నీ ప్రక్కవానికి తెలియకుండా నీలో ప్రవేశిస్తుంది. ఎంత పెద్ద కార్యమైనా నీకు తెలియాలని జ్ఞాని అనుకోడు. జ్ఞానికి ఇతరులు లేరు. ఇతరులకు తెలియాలి అని అనుకోవటం తలంపే. జ్ఞానికి తలంపులు లేవు. ఏమని అనుకొంటాడు. జ్ఞాని మౌనం ముందు, మీ ప్రయత్నాలతోనూ, రాతలతోనూ, గీతలతోనూ, మాటలతోనూ పనిలేదు. గురువుకు అనుగ్రహించటమే పని; నీకు మార్గదర్శకత్వం కూడా వహిస్తూ ఉంటుంది. దేన్ని విడిచిపెట్టాలో, దేన్ని పట్టుకోవాలో, అనే విచక్షణ నీకు కలుగజేస్తుంది. స్పర్శ, చూపు అక్కరలేదు. జ్ఞాని వైభవం అది.

27. దైవీ సహాయం లేకుండా నీవు చిన్న వాసనలోంచి కూడా బయట పడలేవు. నీ సాధన ఫలితం ఏమిటంటే రూపంలేని పరమాత్మ రూపం కల్పించుకొని నీ దగ్గరకు వచ్చి, నీకు బోధ చేసి ఆ వస్తువు ఎక్కడ ఉందో అక్కడకు నీ దృష్టి మరలించి నీకు స్వస్వరూప సుఖాన్ని చూపెడతాడు. మెరక మీద ఉన్న నీరు

srinannagaru.com

పల్లానికి వెళ్లినట్లుగా నీ మనస్సు హృదయంలోకి వెళుతుంది. కొందరు భక్తులు అంటారు గురువుతో "మిమ్మలను చూడటానికి మేము రావటం లేదు. మిమ్మలను చూడకుండా ఉండలేకపోతున్నాము, కాబట్టి మిమ్ములను దర్శిస్తున్నాము" గురువు మీ గ్రహపాట్ల నుంచి, పొరపాట్ల నుంచి తప్పించి తనంత వానినిగా చేస్తాడు. అప్పుడు ఎటుచూచినా ప్రేమే. మీరు స్థిరంగా కూర్చుంటే మీ మనస్సును సమతూకం చేసుకొంటే అది హృదయం వైపుకు వెళుతుంది అదే గురువు వైభవం. మన బాగు మన క్షేమం మనకంటే బాగుగా ఈశ్వరునికి తెలుస్తుంది. అటువంటప్పుడు ఈశ్వరుని చేతిలో పనిముట్టుగా ఉంటే ఆయన ఒడిలో క్షేమంగా ఉండవచ్చు. అటువంటి ఈశ్వరునికి శరణాగతి చెందటానికి నీకు అభ్యంతరం ఎందుకు? మినహాయింపులు ఎందుకు? ఆత్మానుభవం ఎవరికి కలుగుతుంది అంటే ఎవరైతే "సద్గురువు కరుణ" అనే ఊయలలో ఊగుతారో అంటే వారి చూపు ద్వారా, స్పర్శ ద్వారా, సంకల్పం ద్వారా కరుణ పొందుతారో వారు ధన్యులు; వారు కృతార్థులౌతారు. వేలాది సంవత్సరాల వాసనల వలన లేని వస్తువు ఉన్నట్లుగాను, ఉన్న వస్తువు లేనట్లుగాను కనిపిస్తుంది. సంస్కారాలు గురువు యొక్క ప్రేమ వలన క్షయమౌతాయి. ఒక సంప్రదాయాన్ని గౌరవించటం కోసమే, రాముడు-కృష్ణుడు, శకంరులు శరీర ధారణ చేయటం జరిగింది.

28. వేటగాడు అడవిలో జంతువు కోసం ఎలా వేటాడుతాడో అలాగే శిష్యుని శరీర పతనం తరువాత కూడా ఆ జీవుడు ఎక్కడ వున్నా వేటాడి తరింప చేస్తాడు గురువు. గురువు నీ తలంపులను చూస్తూ అంతర్ముఖం అవ్వటానికి కృషి చేస్తాడు. చంటి పిల్లల తల్లులు బిడ్డల ఆరోగ్యం గురించి పత్యాలు చేస్తారు. అలాగే గురువు నీతో సాధన చేసినట్లు నటిస్తూ తానే అన్నీ చేస్తూ మీకు సత్య దర్శనం చేయిస్తాడు. ఏ బలహీనతలు అయితే నీకు ఉన్నాయో, మీ మెదడులోనికి చూపించి, మీచేత ఆ వాసనల నుండి విముఖత కలగుజేసి, మిమ్ములను అంతర్ముఖి పరుస్తాడు. గురువు అంటే నడుస్తున్న దైవం. ఏతలంపులైతే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయో, ఆ విషయాల నుండి బయట పడిన తరువాత గాని సుఖం రాదు. అప్పుడు కదా ఇది సత్యం, ఇది అసత్యం అని నీకు తెలిసేది ఏ వాసనలు అయితే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయో దాని, నివారణకు నీ సద్గురువును చూస్తూ ఉండు. సమయం చూచి నిన్ను ఒక కుదుపుకుదుపి వేరుతో సహా ఆ వాసనలను తీసి వేస్తాడు. మనస్సు బయటికి వెళ్లి బాడి చేసుకొంటోంది అనుకోండి అది ఒక గంట సమయం చాలు, కడుగుకోవటానికి రెండు గంటలు

srinannagaru.com

పడుతుంది. గురువు అనుగ్రహం లేకుండా ఒక్క వాసనలోంచి కూడా బయటికి రాలేవు. ప్రతీ జన్మలోను, తల్లి, తండ్రి, స్నేహితులు, విరోధులు ఉంటారు కాని ప్రతీ జన్మలోనూ గురువు లభించడు. నీ హితవు కోరేవాడే గురువు. ఆయనే పెద్ద చుట్టం. గురువు మనలను ఎన్నుకొంటే బాధలేదు కాని మనం గురువును ఎన్నుకొంటే పొరపాట్లు జరుగుతాయి. మనకున్న కోపతాపాల వలననే గురువుకు దూరమౌతాము. రామకృష్ణుడు అనేవారు "నన్ను బాగా పరీక్షించి గురువుగా ఎన్నుకోండి" అని. గురవు మీద ఇష్టం వలననే మనం చైతన్య స్వరూపులం కాగలం.

29. బాహ్యమైన లోక ఆకర్షణాల సముదాయం నుండి బయట పడటం చాలా కష్టం. ఇది గురు అనుగ్రహం వలననే సాధ్యం. జ్ఞాని చూపు వెఱ్ఱి చూపు కాదు. అది కేవలం మాంసపు నేత్రాలతో చూచేవి కావు. జ్ఞాన నేత్రాలు కరుణతో నిన్ను పరిశుద్ధుణ్ణి చేస్తాయి. జ్ఞాని నేత్రాలు చూడటానికి మనకు అర్హత ఉండదు. వారి పాదాలను చూడటానికీ అర్హత ఉంటుంది. గురువును ధ్యానం చెయ్యటం వలన మనస్సు యొక్క చాపల్యం ఆగుతుంది. గురువు అనుగ్రహం మనలను వెంటాడుతుంది. దాన్ని మనం తెలుసుకోలేము. అది నీ బుద్ధికి అందదు. నీ నిద్రలోనే నిన్ను చూస్తున్న దేవుడు నీ జాగ్రదవస్థలో నీవు చేసే పనులు అన్నీ చూడడా? నీవు ప్రార్థన చేస్తేనే అనుగ్రహిస్తాడని అనుకోనక్కర లేదు. నీవు నిష్కామంగా, కపటం లేకుండా పనిచెయ్యి చాలు. జ్ఞానికి దేహంతో పనిలేదు. ఇతరులకు ఉపకారం చెయ్యటానికే లేకపోతే ఆయన దేహాన్ని ఏమి చేసు కొంటాడు. మనలా సినిమాలు చూడడు ఈశ్వరుడు, నీ కూడా రాడు, వారి దయ అనుగ్రహ రూపంగా ఒక శరీరాన్ని ధరించి వస్తుంది. గురువు శిష్యుని వాసనలను చూస్తాడు; దాన్ని తొలగించుకోవటం కోసం శిష్యుని సహస్రారంలోకి ఆ వాసనలు పెద్దవి చేసి చూపించి, దాన్ని తొలగించుటలో శక్తిని కూడా శిష్యునికి ప్రసాదించి క్రమంగా ఆ వాసనలు నశిపంచేస్తాడు. పుట్టలో చెదలు ఉంటాయి. అందులోనే నశించిపోతాయి. అలాగే గురువు అనుగ్రహం లేని జన్మ కూడా నశించి పోతుంది. మన మనస్సు రకరకాలుగా ఉండటం వలన ఒక రకంగా ఉన్న వస్తువును తెలుసుకో లేకపోతున్నది. ఆ ఒక రకంగా ఉండే వాడే గురువు. భగవాన్ అనేవారు "ఈ గేటులోకి వచ్చి శరణాగతి పొంది, మరలా అవిశ్వాసంతో ఎవరిని ఆశ్రయించినా, తిరిగి తిరిగి ఈ గేటులోకి రావలసిందే".

30. నీ సద్గురువు నీ కూడా వస్తాడు. నీవు నడిచి వెళ్ళినా, కారులో వెళ్ళినా, విమానంలో వెళ్ళినా, నీ కూడా వస్తాడు. కారణం నీ అజ్ఞానం అనే బండరాళ్ళ

srinannagaru.com

లోంచి నిన్ను విడుదల చెయ్యటం కోసం. అది వాగ్దానం. నీ ఇష్టం గురువుకు కష్టమైనా, నీ సినిమాలు వగైరా చూచే ప్రవర్తన కష్టమైనా నీ ఇష్టాని తన ఇష్టంగా చేసుకొని నీ మార్గంలో పయనించి నిన్ను ఉద్ధరిస్తాడు. నీ మార్గం ఇష్టం కాదు, నిన్ను తరించటం ముఖ్యం. గురువు మీ దేహాన్ని చూడడు, మీ మనస్సులోని వాసనలు చూస్తాడు. అది మీరు అనుకోడు మీ హృదయాన్ని చూస్తాడు, అది మీరు అనుకొంటాడు. చైతన్య అనుభవం మీకు కలుగచేయటానికి నీకు అడ్డ వచ్చే వాసనలను వేరుతో సహా నశింపచేస్తాడు. శంకరాచార్యులవారి శిష్యులలో తోటకాచారి స్వామి బట్టలు పిండుతూ తరగతికి రాకపోతే పొరపాటున తెలివి తక్కువగా పద్మపాదులు ఇలా అన్నారు "వాడు వచ్చినా అర్థం చేసుకోలేడు. వాడి కోసం మన కాలాన్ని వృధా చేసుకోవటం దేనికి" అనగా శంకరులకు తోటకాచారి మీద ఆపుకోలేని ప్రేమ కలిగింది. మొద్దు అబ్బాయిగా ఉన్న తోటకాచారి అద్భుతమైన కవిత్వంతో శ్లోకాలు వల్లిస్తూ రావడంతో మిగిలినవారు నివ్వెర పోయారు. అది గురువు యొక్క వైభవం. నీ గురువు నీ వాసనలను కెలికి ఎదుటివారితో తిట్టించి ఆ వాసనలను బూడిద చేస్తాడు. గురువు చెప్పే మాట నీవు శ్రద్ధగా వింటూ ఉంటే ఆ క్షణంలో నీకు ఆత్మానుభవం కలుగుతుంది. జటాయువుతో రాముడిలా అంటారు. ఇది రాముని మాట "మోక్షానికి వెళ్ళు". చీకటిలో నీకు టార్చిలైటు సాయం ఉంటే ప్రయాణం ఎంతో తేలిక. ఆధ్యాత్మిక మార్గంలో నీకు వెలుగు నిచ్చేవారు నీ గురువే.

31. మోహ బుద్ధి ఉన్నవానికి ఆత్మ తత్త్వాన్ని ఎన్నిసార్లు తట్టి తట్టి చెప్పినా అర్థం కాదు; కాని సద్గురువు వాడి బుద్ధికి అర్థమయ్యే రీతిగా తీసుకొని వచ్చి తదనుగుణంగా నడిచే శక్తిని, యోగ్యతను వాడికి కలుగచేసి ఆత్మానుభవం కలిగే వరకూ వాడిని వెంటాడుతాడు. షిర్డి సాయిబాబా అనేవారు "నా కోసం నేను ఏమీ చెయ్యటం లేదు; ఎవరైతే సహృదయులో ఎవరైతే నిర్మల హృదయులో, వారికి చాకరీ చెయ్యటమే నా పని" అనేవారు. సహనం లేని వానికి అంతర్ దృష్టి కలుగదు. గురువు నిన్ను చూచి సంతోషించేది నీలోని వికారాలను అణగ దొక్కి తొలగించుకొన్నప్పుడు, నీ బలహీనతలలోంచి విడుదల పొందుము. తరువాత నీవు ఏమౌతావో అది అవుతావు. చంద్రుని వలన చల్లదనం వస్తుంది. సత్పురుషుని వలన కూడా చల్లదనం వస్తుంది. సత్పురుషుడు నదిలో స్నానం చేస్తే ఆ నదిలో ఉన్న దోషాలు అన్నీ పోతాయి. నది పావనమౌతుంది. ఆవేశం కన్న ఆలోచన మంచిది; ఆలోచనే మీ గమ్యం కాదు; మీ గాఢనిద్రలో ఆలోచనలు లేవు. నీకు నిజం తెలిస్తే శ్రుతి మీద ఆధారపడవలసిన పనిలేదు. అప్పుడు నీవు

srinannagaru.com

ఏది చెబితే అది వేదం అవుతుంది. జ్ఞాని అన్ని కోరికలు నెరవేరిన వాడు. మీకు చెరుకు రసం, మామిడి పండు తిన్నప్పుడే ఆనందంగా ఉంటుంది. కాని జ్ఞానికి వాటితో పనిలేదు. ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. తనకన్న వేరుగా ఉన్న వస్తువును ప్రేమించటం తేలికే. కాని జ్ఞాని తనకన్న ఈశ్వరుడు భిన్నం కాదని తెలిసి కూడా ప్రేమిస్తాడు. అది చాలా కష్టం. గురువు యొక్క వాక్యాన్ని మననం చెయ్యగా, చెయ్యగా ఆచరించాలనే బుద్ధి పుడుతుంది. తరువాత ఆయనే మనలను ఆత్మ జ్ఞానంలో మునిగేటట్లు చేస్తాడు.

32. జ్ఞాని ప్రబోధమును విని ఆనందించలేని వారి కళ్ళు అసూయను చూపెడతాయి. గురువు ప్రవచనం విని పరవశించే వారి కళ్ళు కృతజ్ఞత కలిగి ఉంటాయి. వెయ్యి పుస్తకాలు బోధించలేనిది దైవానుగ్రహం నీకు కలిగితే ఒక సెకనులో నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. సామాన్యమైన భక్తుడు మోక్ష స్థితిని కోరుకోడు. కారణం ఆ వైభవం అతనికి తెలియదు. ఈశ్వరుడు ఈ రకమైన భక్తులకు తన కోరికలను నెరవేరుస్తూ ఉంటాడు. అది సహజ స్థితి కాదని తెలుసు. కాని "నాకు ఏదీ వద్దు. నీ స్థితి నాకు కల్పించు" అనగా గురువు సన్నిధికి చేరుస్తాడు. చెవిలో చెప్పేవాడు గురువు కాదు. దాని నిజస్థితిని తెలిపే వాడే నిజమైన గురువు. "ఆటోమేటిక్ డివైన్ ఎ యాక్షన్" అంటే నీ సంకల్పంతో గాని, నీ ప్రయత్నంతోగాని నీ మాటతోగాని, సంబంధం లేకుండా జరిగిపోతుంది. ఇది జ్ఞానికి మాత్రమే అన్వయ మౌతుంది. సత్యం గురించి అనుకోవటం అంటే మనస్సుతో తాదాత్మ్యం చెందటమే. సత్యం గురించి అనుకోవటం కాదు "సత్యంగా ఉండటమే". వాసనలు బయటికి పోయేటప్పుడు కొంత బాధ కలుగుతుంది. దాన్ని తట్టుకొంటే నీవు జయిస్తావు. లేనప్పుడు దానితో ఓడిపోతావు. అప్పుడే గురువు అనుగ్రహం కావాలి. అప్పుడే నీవు కృతార్థుడవు అవుతావు. మనస్సు దాని మూలాన్ని అది తెలిసికొనే వరకూ దాన్ని ఇటు తోలితే అటు, అటు తోలితే ఇటూ పోతుంది. ఒక గుమ్మం నుంచి బయటికి కొడితే వేరే గుమ్మంలోంచి సిద్ధమౌతుంది. చివరి దశలో గురువు అనుగ్రహం కావాలి. నీ తెలివి తేటలు ఒక్కటే చాలవు. వాసనలను మీ గురువు కెలుకుతూ ఉంటాడు. అప్పుడు నీకు తెలుస్తూ ఉంటుంది. ఆ వాసన నీకు ఉందని. అప్పుడు నీవు కొంత ప్రయత్నం చెయ్యి, సరిపోతుంది. లేదా కొంత నటించు అంటే నీవు చేతులు ఆడించు. ఉన్నది గురువే చేసుకొంటాడు.

33. గురువు అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది, నీ అవగాహనా లోపం మాత్రమే. ఆంతరంగిక జీవనం ఉన్న కుటుంబ సభ్యులకు ఏమీ చెప్పనక్కర

srinannagaru.com

లేదు. ఆ జీవనం లేని వారికే ఏదైనా చెప్పాలి. కొందరు మంచి వారిని చెడ్డ వారు అనుకొంటారు. చెడ్డ వారిని మంచి వారు అనుకొంటారు, అటువంటి వారికి శరీరానికీ-ఆత్మకు ఉన్న సంబంధాలు ఎలా అర్థమౌతాయి? ఆత్మతో తాదాత్మ్యం రానప్పుడు శరీరంతో తాదాత్మ్యం ఉందనే అర్థం. అంటే ఆత్మ బుద్ధి కలిగే వరకూ శవబుద్ధి మానదు. మీ గురించి భగవంతునికి ఏమీ తెలియదు అనుకొంటారు. కాని జ్ఞాని అనుకొంటాడు "నీ కూతురు పెళ్ళి కాలేదనే విషయం నాకు తెలియదా! అంతే కాదు నీ గురించి నీకు తెలియని విషయాలు నాకు తెలియవా; నీకు ఏ తలంపులు వస్తాయో నీకంటే నాకు బాగా తెలుసు కదా! ఎందుకు పూజలో అన్నీ ఏకరు పెడతావు" అంటాడు. సత్పురుషుడు విమర్శించడు. సరి దిద్దటానికి ప్రయత్నం చేస్తాడు. మారు మనస్సు పొందటానికి ప్రయత్నిస్తాడు. జీవుడి ప్రేమకు అంతం ఉంది. గురువు యొక్క ప్రేమకు అంతం లేదు. గురువుపై మీకు ఇష్టం లేకపోయినా అనుగ్రహం వస్తూనే ఉంటుంది. మహా ప్రవాహంలో దుంగలు ఎలా కొట్టుకుపోతాయో, అలాగే నీ హృదయంలో ఉన్న బలమైన వాసనలు, కొట్టుకుపోతాయి. తడి గుడ్డను పిండితే నీళ్ళు ఎలా వస్తాయో అలాగే నీ వాసనలను నీ గురువు పిండుతాడు. కొంతమంది మాట్లాడరు, ఉంటారు. అంటే వారు మనస్సుగా ఉండరు. ఆత్మగానే ఉంటారు. అలా ఉండటం నీకు అనంతమైన జ్ఞానం కలుగుతుంది. వారు ప్రసంగాలు చెయ్యరు, రచనలతో పని లేదు. జ్ఞాని మాట్లాడుతూ ఉంటే ఎవరికో బోధిస్తున్నాడని అనుకోరు. తనకు తానే చెప్పకుంటున్నాడు అని అనుకొంటాడు.

34. నీ గురువు నిన్ను చూడకుండా ఒక్కొక్కసారి ముఖం ప్రక్కకు పెట్టు కొంటాడు. నీలో మూల తలంపు తొలగించటానికి అలా చేస్తూ ఉంటాడు. మాట్లాడడు, చూడడు. గురువు చూడలేదని, మాట్లాడ లేదని, కోపం తెచ్చుకొనే వారు ధన్యులు కారు. అది కూడా అనుగ్రహమే అనుకొన్న వారు ధన్యులు. నీకు ఒక రోగం ఉంది అనుకోండి. డాక్టరు పరీక్ష చేసి, మందుల వలన తగ్గుతుందా, ఆపరేషన్ వలన తగ్గుతుందా అని నిర్ధారణకు వచ్చి తదనుగుణంగా ప్రవర్తిస్తే ఆ రోగం నయమౌతుంది. అలాగే నీ గురువు నీ అహంకారం పోవటానికి ఎలా ప్రవర్తిస్తే తొలగుతుందో అలా ప్రవర్తిస్తాడు. కాని మాట్లాడకపోయినా, అనుగ్రహం వస్తూనే ఉంటుంది. చాకలి బట్టలను రాతి మీద ఎన్నిసార్లు కొడితే మురికి పోతుందో తెలుసుకొని ప్రవర్తిస్తాడు. అలాగే శిష్యుని మనస్సులో మాలిన్యాలను ఎన్ని దెబ్బలు కొట్టి శుద్ధి చెయ్యాలో తెలుసుకొని, తదనుగుణంగా బోధిస్తాడు. వినకపోతే నీలో కర్మలను తీసి, అనుభవింపచేసి సత్ప్రవర్తనలోనికి తెస్తాడు.

srinannagaru.com

గురువు అనుగ్రహం ఎలా పనిచేస్తుందో నీ బుద్ధి గ్రహించకపోవచ్చును. అది నీ పొరపాటు మాత్రమే. నీకు ఆత్మ దర్శనమైతే ఈ సృష్టిలో ఉన్నది అంతా నీవే అన్న అనుభవం నీకు కలుగుతుంది. ఆత్మానుభవం పొందిన వారి వలన ప్రయోజనం ఏమిటి అంటే నడి సముద్రంలో దిక్కుతోచక అల్లాడే వారికి లైట్ హౌస్ చూడగానే "ఓహో ఇదిరా ఒడ్డు" అని అనిపించి, తీరానికి చేరగలడు. అలాగే మానవాకారంలో ఉన్న మహాత్ముల జీవన విధానం చూచి "ఈ రకంగా జీవిస్తే తరించవచ్చును" అని అనిపించి, సత్యాన్ని చేరుకుంటాడు. బ్రహ్మమై ఉన్న వాడే బ్రహ్మాన్ని చూడగలడు. జ్ఞానికి ఆకర్షణ, వికారాలు లేవు. జ్ఞాని కూడా ఒక్కొక్కసారి కఠినంగా మాట్లాడవచ్చును. ఆకారణం నీవు గ్రహించలేవు.

35. ఏ జ్ఞానికీ చావు జ్ఞాపకం రాదు. అజ్ఞానికే చావు గుర్తుకు వస్తుంది. శరీరంతో తాదాత్మ్యం పొందుతూ "చనిపోతున్నాను" అనుకొంటాడు. మనం అశాంతికి దాసులం. ప్రతీ జ్ఞాని శాంతికి చక్రవర్తే. హృదయంలో ఉన్న ఆకాశం చూచినప్పడు బయట ఉన్న ఆకాశం అందులో ఎన్నో వంతు అని అనిపిస్తుంది. "మాయ" అతి దుష్ట శక్తి. ఈశ్వరుని పాదాలు ఆశ్రయించిన వారికి మాయ దారి ఇస్తుంది. కలలో ఏనుగుకు సింహం కనిపించినా వెంటనే మెలకువ వచ్చేస్తుంది. ఆ స్వప్న సింహమే ఆ ఏనుగును మేల్కొలిపింది. ఒక్క గురువు అనుగ్రహంతో ఈ ప్రకృతిలో నుంచి బయట పడి సత్యానుభవం మానవునికి కలుగుతుంది. గురువు మీకు ఆత్మగా దర్శనము ఇయ్యనప్పడు, "బయట గురువును కలిసి చాలా కాలమైనది. చాలా దూరమైపోయారు" అనిపిస్తుంది. ఏమైపోయారు? ఎక్కడ ఉన్నారు? అనిపిస్తుంది. ఆత్మగా మీకు దర్శనమియ్యగా మీ వేదన, రోదన, అన్నీ పోతాయి. అద్వైతంలో కూడా భక్తి ఉంది. ఆనందమే రూపంగా గురువు కనబడతారు. ఇంటిలో దరిద్రం ఉన్నా పరవాలేదు. భావంలో దరిద్రం ఉండకూడదు. గీతలో కృష్ణుడు "నన్ను స్మరించుకోవటమే సంపద-నన్ను మర్చిపోవుటయే ఆపద" అన్నారు. ఎవరికి దుఃఖం వచ్చినా మనకు వచ్చినట్లు, ఎవరికి సంతోషం వచ్చినా మనకు వచ్చినట్లు భావించాలి. వికారాలలోంచి విడుదల పొందకపోతే వివేకం కలుగదు. ట్రాఫిక్ జాం అయితే ఒక గంట లేటు చేస్తే, పోలీసులు వచ్చి బ్లాక్‌ని తొలగిస్తారు. మనస్సులోని లోపాల వలన మన ఆధ్యాత్మిక ప్రగతి ఆగిపోతే, గురు ప్రార్థన వలన అది తొలగిపోతుంది.

36. చావు ఒక మహాజ్ఞానికి జోక్ అనిపిస్తుంది. గురుపూర్ణిమ రోజున మీరు చేసే పూజ మీ జీవితానికి బంగారు బాట అవుతుంది. గురువు మీ ఆత్మకు ఆత్మ. నీలోని బలహీనతలను తొలగించుకొని సద్ వాసనలు కలుగచేస్తాడు.

srinannagaru.com

దయ లేకుండా ప్రేమ కలుగదు. "నా దేహం నేను కాను, నేను ఆత్మను" అని నాకు స్పష్టంగా తెలిస్తే "మీ దేహం కూడా మీరు కాదు" అని నాకు తెలుస్తుంది. అప్పుడు మాత్రమే నిజమైన ప్రేమ మీ మీద నాకు కలుగుతుంది. ఆ దయ మీ మీద పనిచేస్తుంది. నాకు ఒక దేహం ఉంది. దానికి రోగం వచ్చింది. దానికి మందులు వాడి, నయం చేసుకొన్నాను. దానితో రోగం తిరిగి రాకుండా పోదు. మరలా ఆరు మాసాలకో, సంవత్సరానికో మరో రోగం వస్తుంది. ఎందుచేత? శరీరం ఉన్నంతకాలం అది తప్పదు. అలాగే మనస్సు ఉన్నంత కాలం ఏదో తలంపు నిన్ను బంధిస్తుంది. ట్రాఫిక్ బంద్ అయినట్లు బంధించబడతావు. అప్పుడు నిన్ను బైపాస్ రోడ్డు ద్వారా నీ గురువు గమ్యానికి చేరుస్తాడు. వాడే గురువు. ప్రయాణమైనప్పుడు అనేక ఆకర్షణలు ఎదురౌతాయి. అక్కడే ఆగిపోకూడదు. గమ్యాన్ని మర్చిపోకూడదు. అనేక మంది ఎదురౌతారు. అలాగే జంక్షనులు ఎదురౌతాయి. అక్కడ ఆగిపోకూడదు. "ఎటువైపు వెళ్ళాలి" అని అడిగి తెలుసుకొని వెళ్ళాలి. లేదా రాంగ్ డైరెక్షన్‌లో వెళ్ళిపోతే తిరిగి రావటానికి చాలాకాలం పడుతుంది. అలాగే నీ ఆధ్యాత్మిక ప్రయాణంలో చాలామంది ఎదురౌతారు. నీ గమ్యాన్ని మార్చే సంఘటనలు ఎన్నో ఎదురౌతాయి. దానికి నీ గురువును అడిగి, తెలుసుకొని ప్రయాణం సాగించాలి. లేదా గమ్యాన్ని చేరలేవు. జ్ఞానికి తెలుసు ఈ సన్మానాలు, అవమానాలు లేవని; వారికి పొంగు, కృంగు ఉండదు. అజ్ఞానికే అవి అన్నీ. శరణాగతి పొందని నేనుకు ఉన్న వస్తువులేనట్లుగాను, లేని లోకం ఉన్నట్లుగాను కనిపిస్తుంది. ఈ అడవిలోంచి బయటికి తీసుకొని వచ్చేవాడే గురువు. నీ మనస్సు, మాటా ఎక్కడ అణగుతుందో అదే నారాయణుడు.

37. చైతన్యం నుంచి వచ్చిన మాట, రచన కలకాలం నిలబడతాయి. మనం ఇష్టా-అయిష్టాలతో మాటాడే మాటలు నిలబడవు. గుణవంతుడు, బుద్ధిమంతుడు, బలవంతుడు అయిన ఆంజనేయస్వామికి నమస్కారం చేసినా, పూజ చేసినా రాముడే, మనుకుంటాడు. అంటే నాకే చేస్తున్నాడు అనుకొంటాడు. రాముని అనుగ్రహం, ఆంజనేయ స్వామి ఎలా పొందాడో అలాగే మనం కూడా అటువంటి దయను ఈశ్వరుని నుండి సంపాదించాలి. దేహం ప్రారబ్ధం అనుభవిస్తుంది. దేహంతో తాదాత్మ్యం లేనప్పుడు ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకొనేవాడు ఉండడు, శరీర బాధలు, వృద్ధాప్యం బాధలు ఎక్కడ ఉంటాయి? కర్మ సిద్ధాంతం స్థిత ప్రజ్ఞుని ఏమీ చెయ్యలేదు. ఎవరి నోట నుంచి అయినా మంచి మాట వస్తే, దాని వలన మీ జీవితంలో మార్పు వస్తే ఆయన విషయంలో మీరు కృతజ్ఞత కలిగి ఉండాలి. మీరు ఆయన పట్ల కృతజ్ఞత లేకపోతే వాళ్ళకు నష్టం

srinannagaru.com

లేదు. కాని మన అభివృద్ధి కుంటుపడుతుంది. తలంపుల వేగం వలననే "గురువు మనలను వదిలాడు" అనుకొంటాము. మీరు గురువును వదిలినా; మిమ్ములను గురువు వదలడు. గురువు అనుగ్రహం ఉంటే అన్నీ సాధ్యమే. జ్ఞానం అందరిలోనూ సమానం. కాని శక్తి అందరిలోనూ సమానంగా ఉండదు. కృష్ణుని ఉపాధిలో శక్తి ఎక్కువ. పిడుగులు వచ్చి మీద పడుతున్నా శాంతంగా ఉండటం నేర్చుకోండి. గురువు నీ వెంటే ఉన్నాడు. మీరు ఆత్మ విశ్వాసం పెంచుకొంటే భౌతికంగానూ, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోకి వస్తారు. బంధువులు, స్నేహితులు ఉద్ధరిస్తారని భావించకండి. మీ ఆత్మ విశ్వాసమే మిమ్ములను ఉద్ధరిస్తుంది. ప్రపంచం మిమ్ములను ఉద్ధరిస్తుందని అనుకోకండి. ఈశ్వరుడే ఉద్ధరిస్తాడు.

38. ఎక్కడ ఆనందం ఉందో, అక్కడికి నీ మనస్సును నిజ గురువు తిప్పుతాడు. గురువు అంటే ఆనందమే. దేహంతో సంబంధం లేకుండా ఉన్నాడు. మన పిల్లలు మనలను చూస్తారని ప్రేమిస్తాము. చూడరు అంటే మనం ప్రేమించము. గురువు అలా ఉండడు. నీ మనస్సులో సూక్ష్మరూపంలో ఉన్న వాసనలను పెద్దవి చేసి వారితోనూ, వీరితోనూ ఏదో అనిపించి, తరువాత నీ జీవితాన్ని ఎలా మరల్చాలో అలా మలుస్తాడు. జన్మాంతరంలో ఉన్న వాసనలను నీ బ్రెయిన్‌లోకి నీ గురువు తీసుకొని వస్తేగాని అవి ఉన్నాయని నీకు తెలియవు. ఆ చెడులోంచి బయట పడాలనే ఆలోచన నీకు రాదు. కాని నీ సంస్కారాలు ఎన్ని ఉన్నాయో ఈశ్వరునికి తెలుసు. చిత్త శుద్ధి చాలా ముఖ్యం. దేహాన్ని ఇది నేను కాదు. ఇది నేను కాదు అంటూ సాధకుడు అనేక జన్మలు సాధన చేస్తూనే ఉంటాడు. కాని అది నిజం కాదని అనుభవపూర్వకంగా గ్రహించిన తక్షణం విచారణ ఆగిపోతుంది. దానికి గురువు అనుగ్రహం చాలా అవసరం. ఆత్మ విశ్వాసం ఉంటే అసాధ్యమంటూ ఏదీ ఉండదు. మీ కుటుంబ సభ్యులు మిమ్ముల ను వదిలినా, భగవంతునిపై విశ్వాసం నిజమైతే ఆయన మిమ్ములను వదలడు. భగవంతుడు నీ కూడా ఉంటే బయపడవలసిన పనిలేదు. గురువు దయ వలన మనలో వివేకం పెరుగుతుంది. దాని వలన మన జీవితం అభివృద్ధి వైపుకు మరలుతుంది. వివేకాన్ని కూడా గురువే ఇస్తాడు. ఎవరి సమక్షంలో నీవు శాంతి తరంగాలలో కాంతి తరంగాలలో ఊగిసలాడతావో వారే నీకు గురువు. మీకు ఏదైనా కష్టం వస్తే కంగారు పడకండి. వేగిర పడకండి. మీ గురువు మిమ్ములను కాపాడుతాడు. గురువు చూపు, ఆత్మ చూపు నీ హృదయంలో ఉన్న చైతన్యం వద్దకు తీసుకొని వెళ్ళటానికే శివుడు చేసే పని, విష్ణువు చేసే పని నీ గురువే చేస్తాడు.

srinannagaru.com

39. మీరు భగవంతునికి పత్రము, పుష్పము, ఫలం ఇయ్యనక్కర లేదు. ఆయన మాటలను ఎంజాయ్ చెయ్యండి చాలు. ప్రహ్లాదుని రక్షించినట్లు మిమ్ములను రక్షిస్తాడు. నీవు పక్వానికి వస్తే నీవే ఆయనకు లోకం. ఆయన నీ ఒక్కరి కోసమే వస్తాడు. నీ హృదయాన్ని కెలుకుతూ ఉంటాడు. నీ హృదయం ఖాళీ అవ్వటానికి కంగారుపడకండి. అది అంతా మీరు భయ రహిత స్థితి కలగటానికే అని విశ్వసించాలి. సమాజపరంగా, కుటుంబ పరంగా నీకు కష్టాలు వస్తాయి అనుకో అప్పుడు నీ గురువు వాటిని ఎదుర్కొనే పోరాట పటిమను కలిగిస్తాడు, బుద్ధికి అవగాహన కలగటానికి. అంతేగాని నీకు కష్టం కలగాలని కాదు. తల్లి బిడ్డను దగ్గరకు తీసుకోవటానికై "అదిగో బూచోడు, దగ్గరకు వచ్చేస్తున్నాడు. వచ్చేస్తున్నాడు అంటే బిడ్డ తల్లిని కౌగలించుకోవటానికి వస్తాడు. అది తల్లి ప్రేమతోనే అంటుంది. అలాగే నీకు కష్టాలు కల్పించినది, ఆయనలో ఐక్యం అవ్వటానికే. గురువు నీకు అప్పుడు వివేకం ఇచ్చి అందులోంచి బయటికి తీసుకొని వస్తాడు. గురువు ఏమి చేస్తాడు? అని మీరు అనుకొన్నా మిమ్ములను విడువడు. మీ మీద మీకు విశ్వాసం కలగాలి. మీ దేహ ప్రారబ్ధంలో ఏమి ఉన్నా అది నీవు కోరకపోయినా వస్తుంది. లేనిది కోరుకొన్నా రాదు. దేహం ఏ పనిమీద వచ్చిందో, ఆ పని చేసుకొనిపోతుంది గురు అనుగ్రహం మీ మీద ప్రసరించినప్పుడు మీకు ఊపిరి ఆడదు. అమృతానుభవం కలిగిన తరువాత తెలుస్తుంది. మనం చేసింది తక్కువ, గురు అనుగ్రహం ఎక్కువ అని. చావుకు, బ్రతుక్కు తేడా లేదని పుస్తకాలు చదివితే రాదు. ఒక్క జ్ఞానికి మాత్రమే తెలుస్తుంది. వంద సంవత్సరాలు సాధన చేసిన ఫలం కంటే ఒక్క జ్ఞాని దయ కొన్ని నిమిషాలలో చూచినది ఎన్నో రెట్లు ఎక్కువ.

40. శరీరం ఎవరికి గుర్తు రావటం లేదో వారే ఆరోగ్యవంతులు. గోదావరికి వరద వస్తే చనిపోయిన ఏనుగులే కాదు బ్రతికి ఉన్న ఏనుగులు కూడా ప్రవాహ వేగానికి ఎంత తప్పించుకుందామని కాళ్ళు ఎన్ని సార్లు ఆడించినా ప్రయోజనం లేక కొట్టుకుపోతాయి. అలాగే ఈశ్వరానుగ్రహం వచ్చినప్పుడు మన అహంకారం పోకుండా ఉండటానికి ఏనుగు కాళ్ళు ఆడించినట్లు ఎంత ప్రయత్నించినా సాగదు. పత్తా లేకుండా పోతాయి. మీ సాధన వలన మీ అహంకారమనే ఏనుగు కదలదు. మనం మహాత్ముల దగ్గరకు ఏమి పట్టుకొని వెళ్ళకపోయినా దర్శనం చాలు ఎంతో అభివృద్ధి కలుగుతుంది. గురువుకు ఎప్పుడైనా కోపం వచ్చినా శివుడే అనుకోండి. కారణం లేని ప్రేమ గురువుది. కారణం ఉంటే అది వ్యాపారమౌతుంది. పద్మపాదులు, శంకరులు ఒకరి ముఖాలు ఒకరు చూచు

srinannagaru.com

కొన్నారు. జీవితాంతం స్నేహంగా ఉండిపోయారు. పరామర్శలు లేకపోయినా పరవాలేదు. విమర్శలు లేకుండా ఉండాలి. గురువుతో అనుబంధం తెగింది అంటే గత జన్మలో అనుబంధం తక్కువ అని అర్థం. ప్రవక్త మాటలు ఆయన జీవించి ఉండగా అందరూ అర్థం చేసుకోలేకపోయినా తరువాత కాలంలోనైనా మానవులు అర్థం చేసుకొంటారు. అంటే తదుపరి కాలంలోనైనా అవి అర్థమౌతాయి. గురువు అనుగ్రహం లేకపోతే చింతాకంత లేదా ముల్లు అంత తలంపు పోవాలంటే కొన్ని జన్మలు పట్టవచ్చును. శరీరంతో చేసే చెడ్డ పని పూజ వలన మాటలతో చేసే పొరపాట్లు జపం వలన మనస్సుతో చేసే పొరపాట్లు ధ్యానం వలన పోతాయి. ఈ పొరపాట్లు అన్నీ జ్ఞాని సన్నిధిలో కూర్చోవటం ఫలితంగా పోతాయి. దేవతల మీద భేదబుద్ధి పెట్టుకొంటే తిరోగతే గాని పురోగతి లేదు. గురువు పట్ల నీకు ఉన్న విశ్వాసం అచంచలంగా ఉండాలి. కారణం మనం చేసే సాధన పది శాతం, గురువు వలన తొంభై శాతం లాభం జరుగుతుంది.

41. మనమంతా ఒక చిన్న గ్రామంలో ఉన్నాము అనుకోండి. నా వాటరు ట్యాపుకు ఏ ట్యాంకు నుంచి నీరు వస్తున్నదో మీ ట్యాపుకు కూడా అదే ట్యాంకు నుంచి నీరు వస్తుంది. అందరికీ వచ్చేది ఆ మూల ట్యాంకు ఒక్కదాని నుండే. అలాగే మీరు ఏ గురువును ఆరాధించినా ఈశ్వరుని దయ నుంచీ వస్తున్నదే అని మీరుగ్రహించాలి. ఇందులో భేదం ఏమీ లేదు. భగవాన్‌ని ఒక విషయం గురించి మీ అభిప్రాయం ఏమిటి? అంటే "నాకు అభిప్రాయాలు లేవు; ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది" అన్నారు. కోటి పుస్తకాలు చదవటం కన్న గురువు యొక్క అనుగ్రహం వలన పై దానికంటే కోటి రెట్లు అధికమైన ఫలితం వస్తుంది. దాహం వేసినప్పుడు నీరు తాగితే ఎలా ఉంటుందో, ఆకలివేసినప్పుడు అన్నము తింటే ఎలా ఉంటుందో అలాగే తరించాలనే తపన కలిగినప్పుడు గురువు, దైవ సహాయం అలాగే అందుతుంది. గురువు లేకుండా గురి కుదరదు. ఏర్పేడు ఆశ్రమం పెట్టినప్పుడు మళయాళ స్వామిని కొందరు విమర్శించారు ఇలా "తిరుపతిలో ఉండగా మౌనంగా ఉండేవారు. ఇక్కడికి వచ్చి ఆశ్రమం స్థాపించి అందరితోనూ మాట్లాడుతున్నారు" అని యాభై మంది భక్తులు ఆయన్ని వదిలేసారు. వెంటనే వందమంది క్రొత్త భక్తులు కలిసారు. ఆయన ఇలా అన్నారు "పోతే నష్టం లేదు. వస్తే లాభం లేదు. నేను ఎప్పుడూ ఆనందంగానే ఉన్నాను" అన్నారు. గురువు తలంచుకొంటేనే గురు స్మరణ చేయ గలుగుతాము. "క్రోధానికి కోత, అనుగ్రహానికి దాత, గురు స్వరూపం". పాపం చేసిన వెంటనే ఫలితంలోకి రాదు. పండిన తరువాత ఫలితంలోకి వస్తుంది. అది ఎప్పుడు, ఎక్కడ ఇయ్యాలో అప్పుడు,

srinannagaru.com

అక్కడ ఇస్తాడు ఈశ్వరుడు. "ప్రపంచంలో కనిపించే ఏ భోగమైనా భోగం కాదు, అది ఒక దౌర్భాగ్యం" అన్నారు. అవసరాలు తప్పవు. ఈ భోగం చూచి మరో పిచ్చివాడు దాని కోసం ప్రయత్నం చేస్తాడు. భోగం రోగంగా పరిణామంలో వ్యక్తమౌతుంది.

42. మనం అభివృద్ధి అవ్వాలన్నా బాహ్య శత్రువులు అవ్వనివ్వరు. అంతే కాదు మన అంతరంగంలో ఎన్నో బలహీనతలు, దోష బుద్ధులు ఉంటాయి. అవి మనలను అభివృద్ధిలోకి రానివ్వవు. జ్ఞాని వలన మాత్రమే ఆటంకాలను తొలగించి అభివృద్ధికి కారణమయ్యేలా చూస్తాడు. భక్తుల జీవితాలు చూస్తూ ఉంటే కష్టాలు, నష్టాలు కనిపిస్తాయి. కారణం ఎన్నో జన్మల సంస్కారాలు కొంచెం కొంచెం చూపించి జన్మ రాహిత్యానికి గురువు కృషి చేస్తాడు. మజ్జిగ అన్నంలో పచ్చడి నంచుకొని తిన్నట్లుగా కష్టాలను కొన్ని కొన్ని చూపిస్తూ గమ్యానికి చేరుస్తాడు. ఒకడు ఎన్నో మంచి పనులు చేసి చివరికి నరకానికి వెళ్ళాడు. దాన్ని జీర్ణించు కోలేక తన గత వైభవాన్ని ఏకరు పెట్టాడు అక్కడి వారికి. వారు అన్నారు "నీవు చేసిన మంచి పనులు అన్నీ గుర్తింపులు కోసం చేసావు. పద్మ భూషణ్, పద్మశ్రీలు, తప్పట్లు కొట్టించుకోవటంతో ఖర్చు అయిపోయింది. నీవు గత జన్మలలో చేసిన పాప కర్మల నిమిత్తం ఇక్కడికి సిద్ధమయ్యావు" అన్నారు. మీరు ఎన్ని సత్‌కర్మలు చేసినా ఎంత పాండిత్యం ఉన్నా, ఎన్ని ఉపన్యాసాలు విన్నా, జ్ఞాని సమక్షంలో సత్యానుభవం పొందాలనే కాంక్ష కలుగుతుంది కాని మరో మార్గం, మరో ప్రసక్తి లేదు. సత్ కర్మ ఆచరించటం వలన విచారణ చెయ్యటం వలన వచ్చే ఫలితం ఆత్మ జ్ఞాని సమక్షంలో పొందుతాము. పునర్జన్మ హేతువులైన వాసనలు నశించు టకు జ్ఞాని సన్నిధానం సహకరిస్తుంది. ఆపరేషన్ చేసే డాక్టరు రోగి రక్తం ఎక్కువ పోకుండా, బాధ సాధ్యమైనంత తగ్గేలా ఆమాటలు, ఈమాటలు చెబుతూ రోగ కారణమైన పదార్థాన్ని బయటికి తీసేస్తాడు. అలాగే గురువు బాధ లేకుండా, సాధన పేరుతో శ్రమ కలగకుండా, సత్యానుభవాన్ని కలుగచేస్తాడు. సర్వాంతర్యామి అయిన గురువు అన్నిపనులూ చేస్తాడు. బ్రహ్మ-విష్ణు-మహేశ్వరుడు ఈ మూడు ముఖాలలోంచి వచ్చింది ఆయనే. దేవునికి ఒకవేళ కోపం వస్తే గురువు దానికి సాయం ఇస్తాడు. అంటే ప్రారబ్ధం నుంచి వచ్చే బాధలను తగ్గిస్తాడు.

43. నీ హృదయంలో ఉన్న వాసనలు నీకు తెలియవు. ఆ వాసనలు నీకు తెలియకుండానే, కొన్ని నీ సహస్రారానికి రాకుండానే వాటిని తన అనుగ్రహంతో తొలగిస్తాడు. గురువుకు విశ్రాంతి అక్కరలేదు. నీ పురోభివృద్ధికి, నీ చైతన్య స్థాయి పెరగటానికి విశ్రాంతి అక్కరలేదు. గురువు నీ అజ్ఞాన నిద్ర

srinannagaru.com

నుండి మేల్కొల్పటానికి ఎన్ని ప్రక్రియలు చెయ్యాలి, ఎక్కడ చెయ్యాలి అని విశ్రాంతి లేకుండా చేసుకొని పోతాడు. వారి ప్రవాహమే వారిది. ఎంతమంది శిష్యులను మేల్కొలిపినా శ్రమ ఉండదు. ఆయన గురించి ఇంకా ఏమి చెప్పను. నీలో ఎన్ని వాసనలు ఉన్నాయో, అయ్యో ఎన్ని వాసనలు ఉన్నాయో అని చూడడు. గురువు ప్రయత్నంలో ఏమీ ఆగవు. ఎంత గడ్డిమేటు అయినా చిన్న అగ్గి పుల్లకు బూడిద అవుతుంది. ఎంత పండితుడైనా, ధనమున్నా గురువు అనుగ్రహం లేకుండా నీవు సత్యానుభవం పొందలేవు. చంటి పిల్లవానికి ఇష్టం లేకపోతే బిస్కెట్ కూడా తీసుకోలేము. గట్టిగా లాగితే సగం వాడి చేతిలో ముక్కలై పోతుంది. వాసనలు ఎలా తొలగించుకోగలవు. సుఖం ఎక్కడ ఉందో తెలియదు. అంతా జడంపైనే దృష్టి. "మేము ఈ మధ్య సుఖంగా లేము" అని అనుకొంటారు కొందరు. ఇటువంటి పిచ్చిపిచ్చి ఆలోచనల నుంచి మీ దృష్టిని మరల్చు వాడు గురువు. గురువు శరీరంలో కూడా ఆనందంతో తాండవం చేస్తాడు. శిష్యుని తరింపచెయ్యటానికి ఆనందమే ఒక శరీరం ధరించి వస్తుంది. అందుచేతనే ఆ శరీరం ఆనందంలోనే శాంతితోనే ఉంటుంది. గురువు శిష్యుని ఇలా ప్రశ్న వేస్తాడు "నేను చెప్పింది నీకు అర్థమైనదా?" అంటాడు. ఊరికే అంటాడు. తనలో కలిపేసు కొంటాడు. నీవు ఎవరివో నీకు తెలిసే వరకూ గురువు యొక్క వైభవం నీవు గుర్తించలేవు. అసలు గుర్తించటానికి నీవు సరిపోవు. అన్ని జీవరాశులలోనూ గురువు కనిపించేటట్లు అనుగ్రహిస్తాడు. ఎవరిని చూస్తూ ఉంటే నీలో ఆనందం పొంగుతూ ఉంటుందో వాడే నీ గురువు.

44. అడగకుండానే ఇచ్చే స్వభావం గలవాడు అరుణాచలేశ్వరుడు. అడిగించుకొని ఇస్తే నీకే నష్టం అన్నారు భగవాన్. గురువును అనుగ్రహించమని వేడుకోవలసిన పనిలేదు. గురువు వేరు, నేను వేరు, అనే భేద బుద్ధిని గురువు చూస్తూనే ఉంటాడు. అందుండి నిన్ను విడదీసి, అభేద దృష్టిని కల్పించి అనుగ్రహిస్తాడు. వాడు గురువు. అగ్ని వేడిలేకుండా ఉండదు. గురువు దయ లేకుండా ఉండడు. అది గ్రహించే బుద్ధి నీకు కావాలి. అది గురువు మీద భక్తి వలన కలుగుతుంది. గురువు నీ విషయంలో ఆ జిమ్మిక్కులు, ఈ జిమ్మిక్కులు చేస్తూ ఉంటాడు. ఏమిటి గురువు మనలను వదిలాడు అని దిగాలుపడేటట్లు చేస్తాడు. ఎందుకు మరింత ఎక్కువగా కౌగలించుకోవటానికి. చివరికి అది జరుగుతుంది. గురువుకు నీవు సేవ చేస్తూ ఉంటే నీకు ఈ ఆలోచనలు వస్తాయి. ఏ కారణం వలన నాకు ఈ జన్మ వచ్చింది? ఏ కారణం వలన నాకు ఈ దుఃఖం వచ్చింది? అని తలంపు వస్తుంది. ఆ కారణంతో సంబంధం లేకుండా గురువు

దాన్ని కత్తిరిస్తాడు. సంవత్సరాల తరబడి అనుభవించే బాధలను గురువు కొన్ని గంటలలోనే అనుభవింపచేస్తాడు. అది గురువు వైభవం. చంటి పిల్లలకు ఆట వస్తువులపై విసుగు వచ్చినప్పడు "అమ్మా అమ్మా" అన్నప్పడు అమ్మ వస్తుంది. మీరు విషయ చింతన రాగాలు వదలి దైవం వైపు మళ్ళి ఏడ్చినప్పడే గురువు రూపం ధరించి మిమ్ములను ఉద్ధరిస్తాడు. మనం ఎందుకు వచ్చామో ఎప్పడో మర్చిపోయాము. లేనిపోని గొడవలు నెత్తినేసుకొని తిరుగుతున్నాము. కాని నీ గురువు నీ గమ్యాన్ని చేరే పని మర్చిపోడు. తలంపులను బట్టి సమస్యలు వస్తాయి. మన తలంపులు అన్నీ నకిలీ సత్యాలు, జయాపజయాలు, సుఖ దుఃఖాలు అన్నీ నకిలీ సత్యాలే.

**45.** చంటిబిడ్డ బురద చేసుకొని ఇంటికి వస్తే, నీవు బాడి చేసుకొని వచ్చావని బాధించదు. ముందు స్నానం చేయించి మురికిని తొలగించి మంచి బట్టలు కట్టి, పౌడరు పూసి, ముద్దు పెట్టుకొంటుంది. అలాగే నీవు ఎటువంటి తలంపులతో ఉన్నా నీ గురువు అవహేళన చెయ్యక వాటిని శుభ్రం చేసి తొలగించి తన స్వరూపాన్ని ఇస్తాడు. ఇంటిలో వాళ్ళకు ఇల్లు కట్టిస్తే వాటిని గురించి ఎవరికీ చెప్పము. ఎవరికో పరాయి వారికి ఇల్లు కట్టిస్తే టామ్-టామ్ చేస్తాము. బయట వాళ్ళు కూడా ఇంట్లో వాళ్ళే అనే బుద్ధి నీకు రావటం లేదు. నీ భేదబుద్ధిని భగవంతుడు చూస్తూ ఉంటాడు. ఈ ఖగోళం అంతా నడిపే వాడికి మీ తెలివి తేటల కన్న ఎక్కువే ఉంటాయి. మీకే కళ్ళు, ముక్కు, చెవులు ఉన్నాయి. ఆయనకు లేదు అనుకోకండి. గురువు లేకపోతే గైడెన్సు లేదు. ఆత్మానందం పొందిన వానికి ఎటు చూచినా ఆనందమే. శరీరం పోతున్నా, పోగొట్టుకొంటున్నాము అనుకొనే వాడు పోయాడు. మనకు ఎటు చూచినా దుఃఖమే. అన్నీ చేప ముళ్ళే ఎదురౌతాయి. "నేను గురువును" అని చెప్పేవాడు పూర్ణంగా అహంకారంతో చెబుతున్నదే. రామకృష్ణ పరమహంసగారు ఇలా అనేవారు "ఎత్తులో ఉన్న దీపం క్రింద అడుగున కొంత నీడ ఉంటుంది". అలాగే మహాజ్ఞాని దగ్గరకు కొందరు భక్తులు చేరి దీపం క్రింద నీడ ఏమిటి? అని అనుకొంటారు అలాగే "వీడు పేద బ్రాహ్మణుడు, పూజారి, వీడి దగ్గర ఏమి జ్ఞానం ఉంటుంది? అనుకొంటారు. కాని దీపం కాంతి చాలా దూరం కనబడుతుంది. చాలా దూరం నుంచి వచ్చి ఆ వెలుగును చూచి, ఆ సందేశాన్ని పూర్తిగా స్వీకరించి తరిస్తారు. దీపం క్రింద నీడ ఏమిటి? అనుకొనేవారు అలాగే ఉండిపోతారు. వీరినే బద్ధ జీవులు అంటారు. వల నుంచి తప్పించుకొని పారిపోయేవి కొన్ని, వలలో పడ్డా చీల్చుకొని బయటపడ్డ చేపలు కొన్ని ప్రయత్నం లేక వలలో ఉండిపోయేవి బద్ధజీవులు అంటారు. అవతార

srinannagaru.com

పురుషులు వచ్చినప్పుడు అందరూ బాగు పడలేరు. అనుసరించిన వారు మాత్రమే తరిస్తారు.

46. గురువు శరీరం మరణిస్తే చచ్చిపోయారు అని అనుకోకూడదు. ఇనుప గొలుసులు, ఉక్కు గొలుసులు తెంచుకోవచ్చును. గురువుతో అనుబంధం గురువు లేకపోయినా కొనసాగుతుంది. గురువు శరీరం మరణిస్తే ఆయన పోయాడు అంటే జ్ఞానానికి అవమానం. నీ బుద్ధిలో దోషాలే ఈ భావాలతో ఉంచుతాయి. చచ్చిపోయిన గురువు అంటూ ఎవరూ ఉండరు. గురువు శరీరం కాదు, ఆత్మ. చనిపోయిన గురువు అంటే ఆయన గురువు ఎలా అవుతాడు. చచ్చేవాడు మెంటల్ గురువు. నిజగురువు అమరుడు. గురువు అంటే ఆత్మ గురువు మరణించడు, మరణించేవాడు గురువు కాదు. గురువు ఏస్థితిలో ఉన్నాడో ఆ స్థితికి మించి ఏ వ్యక్తినీ ముందుకు తీసుకు వెళ్ళలేడు. గురువు మీద మీకు ప్రేమ కలిగింది అనుకోండి. అంతులేని ప్రేమలో మీకు ఊపిరి సలపదు. ఆక్సిజన్ పెట్టుకోవాలి. గురువు శరీరంతో కాదు, గురువుతో మానసిక అనుబంధం ముఖ్యము. మహర్షి అంటే మనస్సు యొక్క మూలాన్ని తెలుసుకొన్న వాడు. గురువు ప్రేమ ప్రకృతి ప్రేమ కాదు. గురువు శరీరం మరణించినా, అనుగ్రహ ప్రవాహం జరుగుతూనే ఉంటుంది. దాన్ని మాటలతో చెప్పలేము. బుద్ధికి అందదు. గురువు ప్రేమలో ఊగిసలాడే వాడికి, అహంకార మమకారాలు వాటి అంతట అవే రాలిపోతాయి. సింహం సంవత్సర కాలం అజ్ఞాతంలో ఉంది వేటకై బయటికి వస్తే జంతువును ఎలా వెంటాడుతుందో, ఫల్గుణుడు ఎలా యుద్ధ రంగంలోకి వచ్చాడో, అలాగే గురు అనుగ్రహం మిమ్మలను వెంటాడుతుంది. దానికే భగవాన్ "పులి నోట్లో పడ్డ మాంసం ముక్కలు" అన్నారు. ఇష్టం, అయిష్టం, రాగ ద్వేషాలు అన్నీ గురు ప్రేమ మీద గురిపడితే అవి కరిగిపోతాయి. లక్ష్మీదేవి-దుర్గ-సరస్వతి అన్నీ గురువులోనే ఉన్నాయి. అవి అన్నీ కలిగి ఉన్న జ్ఞాని సహాయం కన్న మించిన సంపద ఈ లోకంలో ఎక్కడ ఉంది.

47. నీవు పనికిరావు అని చెప్పే వాడు గురువు కాదు. నిన్ను ఆధ్యాత్మికంగా పనికి వచ్చేడట్లు చేసేవాడే గురువు. పూతన అనే రాక్షసి దగ్గరకు రాగా శ్రీకృష్ణుడు కళ్ళు మూసుకొంటాడు. కారణం ఆమెను చూస్తే ఆమెను అనుగ్రహించాలని అనిపిస్తుందని అలా చేసారు. గురువు చూపు అంత దయా పూరితంగా ఉంటుంది. కలి కల్మషంతో ఉంటుంది. అది కలి ధర్మం. జ్ఞాని మాటలు నీవు వింటే నీ మానసిక రోగాలు తగ్గుతాయి. వేద కాలంలో సనత్ కుమారుడు పురాణకాలంలో సుబ్రమణ్యుడు, కలి కాలంలో రమణ మహర్షి జ్ఞాన మార్గాన్ని

srinannagaru.com

బోధించారు. రమణ భక్తుడు ఒకడు నాతో ఇలా అన్నాడు "భగవాన్ స్వప్నంలో నాతో ఇలా అన్నారు 'నీ క్షేమం నాకు కావాలి, నీ సుఖం నాకు కావాలి. నీకు భజనల మీద, సిద్ధుల మీద మోజు పోవాలంటే షిర్డీ వెళ్ళి బాబా సమాధి దగ్గర కొంతకాలం ఉండు, నీ సంస్కారాలు అప్పుడు నీకు తెలుస్తుంది. ఇక్కడ కూర్చుని ఏడుస్తూ ఉండటం ఎందుకు' అనగా 'నా దగ్గర డబ్బు లేదు, భాష తెలియదు' అనగా భగవాన్ 'డబ్బు ఇచ్చేవాడు వస్తాడు, భాషా సమస్య లేకుండా అన్నీ సమకూరుతాయి' అన్నారు. అంతేగాని నా దగ్గర ఉండు అని అనలేదు. గురువు యొక్క అనుగ్రహానికి ఇది సంకేతం. అభిషేకాలు, తీర్థయాత్రలు, నామ స్మరణలు గురువు యొక్క కరుణాపూరితమైన చూపు ముందు సరితూగవు అవి ఎల్.కె.జి., లాంటివి. ఒక్కొక్క భక్తుడు వాడి సంస్కారాలను బట్టి గురువును వదులుతున్నాడు. కాని వెళ్ళేటప్పుడు గురువు మంచి వాడు కాదని వెళ్ళిపోతున్నాడు. తిరిగి ఏనాటికైనా ఆ గురువు గేటులోకి వచ్చి తరించాలి. అది గురు వైభవం. "నేను బాగా చెబుతున్నాను. నన్ను అంతా బాగా చెబుతున్నారు" అనే మీ మాటలు అజ్ఞానం. వస్తువు అనుభవంలోకి వచ్చిన తరువాత ఇది అంతా గురువు "దయ" అని తెలుస్తుంది. ఆయన దయ తప్ప మనది ఏదీ లేదు. మనకు ఏమీ తెలియదు. మీ కోసం గురువు పడ్డ శ్రమ మీకు తెలియదు.

48. చిటకాల వలన అజ్ఞానం పోదు. గురువుగారు విభూతి ఇచ్చారు అంటే పోదు. మీ సాధనలో నిజాయితీ ఉంటే తెలుస్తాడు ఈశ్వరుడు. సద్గురువును సముద్రానికి ఉన్నంత ప్రేమ ఉన్న వారిని ఆశ్రయించు. జ్ఞానిని బ్రహ్మమే ప్రచారం చేస్తుంది. ఇతరుల ద్వారా కాదు సత్యం యొక్క వైభవమది. జ్ఞానికి శక్తి ఉంటుంది. అహంకారానికి శక్తి లేదు. కొండమీద దీపం పెట్టి దాని వెలుతురును అపుదామన్నా ఎవ్వరూ ఆపలేరు. జ్ఞాని వైభవాన్ని ఎవ్వరూ ఆపలేరు. దుష్టుని పట్ల జ్ఞాని ఉదాసీనంగా క్షమాగుణంతో ఉంటాడు. కాశీలో ఒక "బాబా"గారు ఉండేవారు. మహిమలు ఎక్కువ చేసేవారు. రామకృష్ణ, పరమ హంసగారు మరణించిన తరువాత ఆ "బాబా"ని వివేకానంద కలిసి ఆకర్షితులై వారికి శిష్యరికం పొందుదామనే సంకల్పం కలిగింది. ఆ రాత్రి రామకృష్ణ పరమహంస స్వప్నంలో వివేకానందుల వారికి దర్శనమిచ్చి ఇలా అన్నారు. "నన్ను మర్చిపోయావా! ఇంత కాలం నీకు చేసిన బోధను నీవు ఇలా మాయ సిద్ధులకు వశమయ్యే స్థితికి వచ్చావా! నా బోధలను ఈ విధంగా గ్రహించావా! నేను చచ్చిపోయానని అనుకొంటున్నావా!" అని పెడ మార్గంలో వెళుతున్న ఆ బుద్ధిని మార్చి ఆ రాత్రే వారికి జ్ఞానాన్ని ప్రసాదించాడు. జ్ఞాని చావు లేకుండా ఎలా ఉంటాడో చెప్పటానికి,

srinannagaru.com

గురువు శరీరం వాడినా శిష్యుని పెడ మార్గంలో వెళుతూ ఉంటే ఎలా కాపాడుతాడో తెలుసుకోవటానికి ఈ ఉదాహరణ చాలు. భక్తుడు భగవంతుణ్ణి ఎంతగా ప్రేమిస్తాడో అంతకన్న ఎక్కువగా భగవంతుడు తన భక్తుడిని ప్రేమిస్తాడు. అది సాధనకు గుర్తింపు రావటం లేదు.

49. అరుణాచల స్మరణ ఎలా కలుగుతుంది అంటే గత జన్మల సంబంధమే. అది సూక్ష్మదృష్టి ఉన్న వాడు లోచూపు ఉన్నవాడు గ్రహిస్తాడు. శరీరం కాలినా ఈశ్వరునితోనూ, గురువుతోనూ ఉన్న సంబంధం నిన్ను వదలదు. అద్వైత స్థితిలో ఉన్నవాడు ఇతరులకు భోదించేటప్పుడు తనకు తానే చెప్పకుంటున్నాను అనుకొంటాడు. అది అనుభవంలో ఉన్నవానికే తెలుస్తుంది. శరీరానికి రోగాలు వచ్చాయని భయపడకు. దానికి సంబంధించిన మందులు నీ జేబులో ఉన్నప్పుడు భయం దేనికి. అలాగే నీ మనస్సులో ఎన్ని దోషాలు ఉన్నా నీవు కంగారు పడకు. భగవంతునితోగాని, నీ సద్గురువుతోగాని నీకు ఉన్న మానసిక అనుబంధాన్ని విడిచిపెట్టకుండా ఉంటే చాలు, నీకు ఏ హానీ జరుగదు. నీ బాధ్యతలు అన్నీ నీ గురువు బాధ్యతలు, నీ మోక్షానికి వారి అనుబంధమే మందు. అది స్మశానానికి వెళ్ళే వరకూ ఆ విశ్వాసాన్ని కాపాడుకో చాలు. నీ మనస్సును శుద్ధి చేసి, పవిత్రుణ్ణి చేసే బాధ్యత వారిదే. "భోగి" ఈ లోకానికి అశాంతి పంచిపెడతాడు, "యోగి" ఈ లోకానికి శాంతిని పంచిపెడతాడు. ఆచార్యుని ప్రేమ అపారం వారి శిష్యుని మీద ఎంత ప్రేమ ఉంటుందో ఉపనిషత్తు ఇలా అంది ఒక ఆచార్యుని వద్ద ఐదు సంవత్సరాలు బోధించుకొని శిష్యులు ఇంటికి వెళుతూ ఉండే సందర్భంలో ఆచార్యుడు ఇలా అంటాడు "నా బోధను గ్రహించారు. నా ప్రవర్తనలో ఏదైనా దోషం ఉంటే మర్చిపోండి" అన్న ఈ మాట వారిపై ఆయనకున్న అపార ప్రేమకు నిదర్శనము. గురువు శిష్యుని కోసం ఏడుస్తాడు. భారత దేశం కోసం కబీర్ ఏడ్చిన రోజులు ఉన్నాయి. అందుకనే వారు యోగులైనారు. మనస్సు ఉంటే మార్గం ఉంటుంది.

50. అద్వైతం బోధించేది కాదు. అది అనుభవానికి సంబంధించినది గురువు బోధించినది ఆచరించటం వలన బుద్ధుడి అంతటివారు కాగలరు. పంచదారలో తీపి ఉంది. మరి ఏమీ ఉండదు అలాగే గురువు అంటే అనుగ్రహం. సృష్టిలేని వానికి లాభ నష్టాలు ఏమిటి? పరమ పవిత్రమైన మహాజ్ఞాని సమక్షంలో నయాగరా జలపాతం నుంచి పొంగిపొరలే నీరులా ఆయన సమక్షంలో అనుగ్రహం సాధకునిలో ప్రవేశిస్తుంది. శరీరక రోగానికి ఇస్తున్న ప్రాముఖ్యత మానసిక ఆరోగ్యానికి ఇయ్యటం లేదు. జీవుణ్ణి కప్పి పుచ్చటానికి శరీరాన్ని ఒక

srinannagaru.com

తొడుగుగా ఈశ్వరుడు ఇచ్చాడు. చావు నూటికి నూరుపాళ్ళు అబద్ధము. నాన్నగారు శరీరం పడిపోయినా నాన్నగారు ఉంటారు. చావు అనేది లేనే లేదు. నిజమైన నాన్నగారు బయట లేరు" లోపలే ఉన్నారు. మీరు నా మాటలు మాత్రమే వింటున్నారు. ఏ ప్రేరణతో ఈ మాటలు వస్తున్నాయో మీకు తెలియదు. రాస లీల ద్వారా కోరికలకు అతీతంగా చెయ్యటం కోసం చేసింది. మన్మద లీలలు సాగకుండా అది జరిగింది. అది కృష్ణ పరమాత్ముని లీల. భగవంతుని అనుగ్రహం లేకుండా నీవు చిన్న వాసన నుంచి కూడా బయట పడలేవు. కటిక చీకటిలో గుమ్మం ఎటు ఉందో తెలియదు. చిన్న లైటు వెలిగిస్తే అమ్మయ్య బ్రతికాము అని అనుకొంటాము అలాగే నీ సంకట స్థితిలో నుంచి, అజ్ఞానంలోనుంచి బయట పడాలంటే భగవంతుని అనుగ్రహం అనే చిన్న లైటు దొరికితే నీకు దారి కనిపిస్తుంది. గురువు జబ్బును చూడడు, జబ్బుకు కారణమైన దాని మీద ఒక మొట్టికాయ మొడతాడు. అంటే మూలతలంపుపైన. అది గురువు యొక్క వైభవం.

51. నేను ఇంటి దగ్గర కూర్చుని వారు బాగు పడాలనే తలంపు వస్తే ఈ దేహం మరణించినా ఆ భావనా తరంగాలు పని చేస్తాయి. శరీరానికి శక్తి లేదు. రామకృష్ణ పరమహంసగారు మరణించిన తరువాతే వారి ప్రభావం ప్రపంచము మీద పనిచేసింది. మీకు శాంతిని నేను ఇయ్యలేకపోతే ఈ కుర్చీ మీద కూర్చోవ టానికి కూడా సరిపోను. చివరి శ్వాస వరకు అహంకార మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలి. మహ్మద్ ప్రవక్త అంతిమ కాలం సమీపించినప్పుడు "అల్లా" ఇలా అంటాడు. "నీవు జయించావు" అంటే మహ్మద్ అంటాడు "నా జీవిత కాలం ఇంకా ఐదు నిమిషాలు కొనసాగుతుంది. ఈ లోపులో నేను మాయలో పడకుండా ఉండాలి అంతే కాని ఇప్పడే కాదు" అంటే మాయ ప్రభావం ఎంత బలమైనదో అర్థం చేసుకొని జీవించాలి. ఆయనే అంటారు నా అనుయాయులలో పేదవారు ఉన్నారు, ధనవంతులు ఉన్నారు. నేను పేదవారి గురించి కాకుండా ధనవంతుల గురించే ఎక్కువ ఆలోచిస్తాను. కారణం పేద వారు రోగం వస్తే ధనం లేక రోగాన్ని బాగు చేసుకోలేరు. భగవంతుని మీద ఆధారపడతారు. ధనవంతులు ధనంతో రోగాలను నయం చేసుకొంటారు. దేవుని స్మరణ రాదు. అందుకోసమే వారి గురించి ఆలోచిస్తాను" అన్నారు. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. కాలాతీత స్థితి అని ఒకటి ఉంది ఆ స్టేట్‌ని పొందాలి.

52. భక్తుని మీద ఈగ వాలనియ్యడు గురువు. వివేకానంద ట్రెయిన్‌లో

srinannagaru.com

ప్రయాణం కోసం స్టేషన్‌లో ఉన్నాడు. ఒక కోటీశ్వరుడు నాలుగు కూరలతో చపాతీ తింటూ, స్వామీజీ దీన అవస్థ చూచి హేళనగా భావించాడు. వెంటనే గురువుకు బాధ కలిగింది. వెంటనే ఒక ధనవంతునకు నిద్రలో ఉండగా స్టేషన్‌లో ఒక స్వామి ఉన్నాడు. ఈ రూపంలో ఉంటాడు. అన్ని తినుబండారాలను పట్టుకొని వెళ్ళు అనగా నలుబది రకాల కూరలతో ఆయనకు అర్పించటంతో హేళన చేసిన వ్యక్తి నివ్వెరపోయాడు. అది ఈశ్వరుని (గురువు) దయ. ఎంత అనామకంగా మరణిస్తే అంత మంచిది. అంతగా ఈశ్వరుని దయకు పాత్రులు అవుతారు. స్మశానానికి వెయ్యి మంది రావాలి. అందరూ నా గురించి ఏడవాలి అనేది సరియైనది కాదు. నేను అనామకంగా మరణించాలనే ఉంది. ఈ తుక్కులాంటి శరీరాన్ని ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట వదిలించుకోవాలి కదా! గురువును మీ అనుగ్రహం కావాలని అడగటం, గురువుకు బరువు అడగటం అవసరం లేదు. అది మీకు ఎలా తెలుస్తుంది అని అడిగితే మీ శరణాగతికి అది తెలుస్తుంది. మీ ఆలోచనా విధానంలో మలుపు తిప్పేవాడే గురువు నీలో చీకట్లను పోగొట్టుతాడు. కబీర్ అన్నాడు "నీటిలో ఉన్న చేపకు దాహం తెలియదు. బ్రహ్మ నిర్వాణ సుఖం పొందిన వానికి తన స్వరూపమే సుఖం. బాహ్యంగా ఏ సుఖం మీద ఆధారపడడు. నీటిలో చేపకు ఎటు చూచినా నీరే, దాహం ఎక్కడ? నీ స్నేహం గురువుకు అక్కర లేదు. ఆయన స్నేహం నీకు కావాలి. జీవ లక్షణాలు పోతేగాని జీవుడు మరణించడు. గురువు ఆ లక్షణాలు పోగొట్టే వరకూ ప్రతీ జన్మలోనూ నీ కూడా వస్తాడు.

53. నీ బుద్ధిలో వంకర్లు ఉన్నా గురువు నీలో అవి ఉన్నాయని నీతో చెప్పడు. చెప్పకుండా తీసి వేస్తాడు గురువు. అది గురువు వైభవం. నీకు భయంగా ఉంటే ప్రపంచం అంతా నీకు వ్యతిరేకంగా ఉన్నా నీ కాళ్ళ మీద నిన్ను నిలబడేటట్లు చేస్తాడు. అంతకు ముందు పిల్లిని చూచి పారిపోయే వాడవు గురు అనుగ్రహంతో పులితో పోరాడేలా చేస్తాడు. గురువును నీవు పూజించక పోయినా నిన్ను తరించేవరకూ విడిచిపెట్టడు. బోయవాడు లేడిని తరుముకొని వెళుతూ ఉంటే అది గుహలో దాక్కున్నా వదలడు. గురువు నీ హృదయంలోకి చెయ్యి పట్టుకొని లాక్కొనిపోతాడు. అడ్డ రోడ్డులో వెళ్ళు అనడు. అందులోకి లాక్కొనిపోతాడు. ఉద్యోగం ఇచ్చిన వాడికి ఎంతో కృతజ్ఞత చూపిస్తావు. గురువు జన్మ పరంపరల దాటిస్తే వాడికి కృతజ్ఞత చెప్పకపోతే ఎవరికి చెబుతావు. ఆ అవకాశం మీకే ఇస్తున్నాను మీరే నిర్ణయించుకోండి. గురువు నీకు ఆందోళన, వ్యాపకాలను పెంచడు అందుండి విడుదల చేస్తాడు. ఒక్కొక్కసారి మనం ఆనంద

srinannagaru.com

సాగరంలో ఈదులాడుతూ ఉంటే అది నీకు తెలియదు. ఆయన కరుణ అని గ్రహించిన వాడు ధన్యులు. గురువు మీద నీవు కోపం తెచ్చుకొంటే నీ మీద ఆయన కోపం తెచ్చుకోడు. తెచ్చుకొంటే గురుస్థానాన్ని అధిరోహించటానికి సరిపోడు. నీవు నీ గమ్యాన్ని చేరే వరకూ నీ ప్రతీ శ్వాసనూ గమనిస్తూ ఉంటాడు. ఏ జ్ఞాని సమాజాన్ని ప్రేమించాలని అని ప్రేమించడు. ఉండలేక సమాజాన్ని ప్రేమిస్తాడు. నీ స్వార్థం కోసం నీవు ఎంత కష్టపడి కృషి చేస్తావో అంతకన్న ఎన్నో రెట్లు నీ బాగుకోసం నీ గురువు కృషి చేస్తాడు. వాడు గురువు.

**54.** మహాజ్ఞాని దృష్టిలో ఈ సృష్టి అంతా బ్రహ్మంగానే కనిపిస్తుంది. విశ్వాస పాత్రుడికి భగవంతుడు ఎన్ని కళ్యాణ గుణాలు ఇయ్యాలో అన్నీ ఇస్తాడు. శాస్త్రంపట్ల గౌరవం, విశ్వాసం ఉండాలి. దానిని ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి బ్రహ్మానుభవంలోని సుఖం నోటితో చెప్పలేము. కలంతో వ్రాయలేము. కలాన్ని క్రింద పడవేయవలసిందే. చెరుకు గడను పిప్పి చేస్తున్నా రసాన్ని ఇస్తుంది అలాగే జ్ఞానిని హింసించినా ప్రేమను కురిపిస్తాడు. గురువుకు నమస్కారం చేసేటప్పుడు కపటం లేకుండా చెయ్యాలి, గురు హృదయంలో జ్ఞానం ఉంది. అది ఎప్పుడూ పొంగదు. తగిన సాధకుడు వచ్చినప్పుడు ఆ జ్ఞాన సముద్రం పొంగుతుంది. అది పొంగకపోతే దానిని అందుకోలేడు. పరి ప్రశ్న అంటే గౌరవంగా అడగాలి. గురువుకు శిష్యుని మీద అపరిమితమైన ప్రేమ ఉండాలి అలాగే శిష్యునికి గురువు మీద భక్తి ఉండాలి. గురువు శిష్యుని తన అంతవానిగా చేయటానికే బోధ. గురువు మిమ్ములను మెలకువగా ఉండేటట్లు చేస్తాడు. గురువు బోధిస్తున్నాడని భావించకు. ఏదైతే అయి ఉన్నాడో అది అయి చెప్పాలి. వాడు గురువు. మనస్సు సపోర్టులతో జీవిస్తుంది, మీ గురువు మీకు కావలసిన వారితో తిట్టిస్తాడు. అది కూడా మీరు భరించే బాధలనే కల్పిస్తాడు. గురు కరుణ మీ హృదయానికి తాకుతూ ఉంటుంది. అప్పుడు నీకు ఊపిరి ఆడదు. బుడగను దాని శక్తికి మించి గాలి ఊదితే పేలిపోతుంది. అలాగే గురువు నీకు అనుగ్రహం ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు. నీ మైండ్ పేలిపోతుందని ఊరుకొంటున్నాడు.

**55.** నీ మాట నీ సంకల్పము ఒకటిగా లేదు అనుకో. గురువు దానిని ఒకటిగా చేస్తాడు. అది గురువు అనుగ్రహం. రాగ ద్వేషాలు లేని వెలుగు ఎవరి నుండి పొందుతున్నావో, నీకు సమబుద్ధి శాంతి ఎవరి సమక్షంలో కలుగుతున్నదో ఎవరి సమక్షంలో అందరిలోనూ గురువును చూడగలుగుతున్నావో వాడే గురువు. అంతేకాదు ఎవరి సమక్షంలో తనను తాను నమస్కరించుకోవాలనే బుద్ధి కలుగుతుందో వాడే నీ గురువు. గురువు మనలను ఎందుకు ఇంతగా ప్రేమిస్తు

srinannagaru.com

స్వాడు అనే అన్వేషణ చేస్తే అది మీ బుద్ధికి అందదు. గురువును ఒక్కసారి ప్రేమ పూరితంగా స్మరించుకొంటే చాలు. ప్రాణాయామాలు ఎందుకు? గురు అనుగ్రహం మనకు వస్తూ ఉంటే కుంభకం అదే వస్తూ ఉంటుంది. ఆ అనుగ్రహంలో ఊపిరి ఆడదు. మనస్సుతో సాధన చేసి బయటపడటం దొమ్మర విద్యలు. నేను ఆత్మ జ్ఞానం పొందటానికి ఎంత కష్టపడ్డానో అంత కష్టంతో మీరు ప్రయత్నం చెయ్యండి అని నేను అనకూడదు. వీలైనంత తక్కువ శ్రమతో మీరు జ్ఞానం పొందేలా ప్రయత్నం చెయ్యాలి. ఎవరైనా అలా చెయ్యాలి. గురువు అంటే కనిపించే దైవం.

# 13. మోక్షము

మోక్షము అంటే విడుదల. అజ్ఞానం నుంచి అవిద్య నుంచి విడివడితే ఉన్నది మోక్షమే. స్వతంత్రుడు కాని వాడు మోక్షమును పొందలేడు. తత్త్వాన్ని తెలుసుకొంటే అక్కడే మోక్షం ఉంది. ఆత్మ దర్శనం కలిగితే మోక్షం అనే తలంపే రాదు. మోక్షం కూడా తలంపే. నేను పుట్టినప్పుడు పుట్టినావు; అంటే నిజమైన నేను తెలుసుకొన్నప్పుడు పునర్జన్మ లేదు. నాకు మోక్షం కావాలి, మోక్షం కావాలి అనుకొనే వాడికి మోక్షం ఇయ్యడు ఈశ్వరుడు. మీరు ఈశ్వరుని ప్రేమించటం, స్మరించటం లేదు. ఆయన మిమ్మలను ప్రేమిస్తున్నాడా అనేది ముఖ్యం. భగవంతుని మీరు ఒక్కసారి స్మరిస్తే మిమ్మలను ఆత్మ సింహాసనం మీద కూర్చోబెడతాడు. మీ ప్రవర్తన ఆయనకు నచ్చితే ఆయన ఇచ్చే బహుమతి మోక్షం. తెలివి అనవరమే; కాని మనం తెలివి కాదు. కత్తిపీట పదునుగా ఉంటే తొందరగా తెగుతుంది. లేకపోతే ఆలస్యంగా తెగుతుంది. తెలివి ఎక్కువగా ఉన్నవాళ్ళు విషయాన్ని తొందరగా గ్రహిస్తారు. తక్కువగా ఉన్నవాళ్ళు ఆలస్యంగా గ్రహిస్తారు. ఒకరిని ఒకరు మోసం చెయ్యవచ్చు కాని ఈ ప్రపంచాన్ని ఎవ్వరూ మోసం చెయ్యలేరు. ఎందుచేత మన అందరికీ ఉన్న తెలివితేటల కన్న మోక్షానికి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఎవరి హృదయంలో స్వార్థం ఉంటుందో, కుటిలత్వం ఉంటుందో మోక్షానికి తెలుసు; అట్టి వారికి మోక్షం రాదు. ఎక్కడ దయ, సమత్వం నిర్మలత్వం ఉంటాయో వారినే మోక్షం వరిస్తుంది.

2. మనలో ఉన్న దౌర్భాగ్యపు గుణాలు విడిచిపెట్టకుండా మోక్షం ఎలా వచ్చేస్తుంది. ఎలా సాధ్యమౌతుంది? ఈశ్వరుని మనం అడగనక్కరలేదు. మనకు ఎంత వరకూ యోగ్యత ఉందో అంత వరకూ అనుగ్రహం వచ్చేస్తుంది. మనం చెరువులోకి బిందె పట్టుకెళ్ళినా, చెంబు పట్టుకెళ్ళినా, గుండిగ పట్టుకెళ్ళినా ఆ

srinannagaru.com

పాత్రలకు సరిపడా నీరు మాత్రమే వస్తుంది. మన హృదయం ఎంత విశాలమైనదో, ఎంత పక్కానికి వచ్చిందో అంత వరకూ అనుగ్రహం ముంచి వేస్తుంది. అడగనక్కరలేదు. అడగటం అజ్ఞానం. భక్తి ఉంది కాని అడిగేవానిని ఎక్కడో దాచుకొంటున్నాడు. అడిగే వానిని విడిచిపెట్ట లేకపోతున్నాడు. అందుచే శరణాగతి లేదు. మీకు ఏది కావాలో, ఎప్పుడు ఎక్కడ ఇయ్యాలో, ఎలా ఇయ్యాలో ఈశ్వరుని కంటే మీకు తెలుసా? మనం ఈ చీకటి జన్మలలో చేసిన పనులు ఏదో ఒక జన్మలో మనలను వెలుతురులోకి తీసుకొని వచ్చి కాని మనకు మోక్షము ఇవ్వడు ఈశ్వరుడు. రామానుజాచార్యులవారు శరీరం విడిచిపెట్టటానికి సిద్ధంగా ఉంటే వారి శిష్యులు అందరూ చేరి చివరి మాట ఏదైనా చెప్పండి; అంటే వారు ఇలా అన్నారు "నేను శరీరం విడిచిపెట్టిన తరువాత శరణాగతి ద్వారా తప్పించి ఇతర మార్గముల ద్వారా కూడా మోక్షం వస్తుంది అని ఎవరైనా చెబితే మీరు వారి మాటలను నమ్మవద్దు" అన్నారు. అంటే భక్తి మార్గంలో ముక్తి పొందాలంటే శరణాగతే మనకు నిజమైన గతి అని అర్థం. కర్మ ఫలితం విడిచిన వానికి కర్మ వాసనలు నశిస్తాయి. వారికి ధ్యానం బాగా కుదురుతుంది. కర్మ ఫలితాన్ని ఆలోచించకుండా ఉంటే వాసనలు బలపడవు. ముక్తికి అది కూడా ఒక మార్గము.

3. అందరికీ తాను ఎవరో తాను తెలుసుకోవాలనే బుద్ధి కలుగదు, ఎవరికి కలుగుతుంది అంటే సూక్ష్మదృష్టి, పూర్వ జన్మ పుణ్యం ఉన్న వానికి, జ్ఞానిని ఆరాధించిన వానికి మాత్రమే కలుగుతుంది. నాకు అనుభవం కలిగినప్పుడు నమ్మకాలతోనూ, విశ్వాసాలతోనూ పనిలేదు. అనుభవం లేనప్పుడు నమ్మకం, విశ్వాసం కావాలి. నాలో ఒక నిజం ఉంది దానిని ఎందుకు తెలుసుకోవాలి అంటే? దానిలో శాంతి ఉంది, సుఖం ఉంది అదే మన జీవిత గమ్యము. సూర్యుని ముందు లైట్ పెడితే ఎలా ఉంటుందో అలాగే నీ ప్రారబ్ధం, సుఖ దుఃఖాలు ఆత్మానుభవం ముందు ఎందుకూ కొరగాకుండా పోతాయి. వస్తువు తెలిసాక గుడగుడ శబ్దాలు ఉండవు. అన్నం నోట్లోకి వెళ్ళిన తరువాత నోరు మూత పడుతుంది. వస్తువు తెలిసాక మనస్సు అణుగుతుంది. రాజకీయ నాయకులను కౌగిలించుకొంటే ఒక్క నిమిషమే కాని నీ మనస్సు ఆత్మను కౌగిలించు కొంటే వదలదు. మోక్షం అంటే నిత్య సుఖ స్వరూపంలో ఉండటమే. అందులో సుఖం, శాంతి, ఆనందం ఉంది. మరణమనే ధ్యాసే దానిలో ఉండదు. చిరాకు పరాకు నీకు నేనుగా వ్యక్తమౌతున్నది కాని ఆత్మ మీకు వ్యక్తమైతే అది పరమస్థితి. మన జ్ఞానం మనకు సుఖ పెట్టినట్లుగా ప్రపంచంలో ఏదీ సుఖపెట్టదు మీరు ఆత్మాను భవం పొందితే ఆ ఆనంద ప్రవాహాన్ని ఎవ్వరూ ఆపలేరు. "నాకు ఎన్ని రోజులలో

srinannagaru.com

మోక్షం వస్తుంది" అని ఒకరు పరమహంస గారిని అడిగితే "నీవు శవాన్ని చూచావు కదా దానికి రాగద్వేషాలు అంటూ ఏమీ లేవు అలాగే నీవు నిజ జీవితంలో ఉంటే ఈ నిమిషంలో జ్ఞానం వస్తుంది" అన్నారు. ఇంటిలో బంగారం ఉంటే భోగం. మనస్సు బంగారమైతే మోక్షం. మీకు మోక్షం కావాలంటే ఒక్కటే ఉపాయం మిమ్ములను ఎంతగా ప్రేమించుకొంటున్నారో అంతగా లోకాన్ని కూడా ప్రేమించండి చాలు. కారణం ఈశ్వరుడు అంతటా ఉన్నాడు.

ఓం తత్‌సత్



SRI SARADAMBA




సద్గురు శ్రీ నాన్నగారు